ప్రజా మార్గదర్శిని
శ్రీ మద్భగవద్గీత
(తాత్త్విక విజ్ఞాన సర్వస్వం)

వ్యాఖ్యాత

పాతూరి వేంకటేశ్వరరావు

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2018

PRAJA MARGADARSHINI
SRIMADBHAGAVADGEETHA

by
PATHURI VENKATESWARA RAO

T.T.D. Religious Publications Series No. 1302
© All Rights Reserved

First Print : 2018

Copies : 500

Published by
Sri ANIL KUMAR SINGHAL, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

భగవద్గీతా కించి దధీతా – గంగాజలలవకణికాపీతా ।
సకృదపి యేన మురారి సమర్చా – క్రియతే తస్య యమేన న చర్చా॥

'భగవంతుడైన శ్రీకృష్ణుని ముఖతః గానం చేయబడిన 'గీత'లో ఏకొంచెమైనా అధ్యయనం చేసినవానిని, పవిత్రమైన గంగానదీజల ప్రవాహంలో ఒక్క నీటిబొట్టునైనా పానం చేసినవానిని, అనంత కల్యాణ గుణగణాలుగల శ్రీకృష్ణపరమాత్మను గూర్చి ఒక్కక్షణకాలమైనా చిత్తశుద్ధితో స్మరించినవానిని, యముడు కూడ ఎటువంటి భేషజాలు పల్కడు. తర్జనభర్జనలు చేయడు. అంటే అటువంటి వ్యక్తుల జోలికి వెళ్లడని అర్థం. "ఇది శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు **"భజగోవిందమ్"**లో మనకందరికీ చేసిన వాగ్దానం. చూపిన అభయహస్తం!!

భారతీయ వేదాంత ప్రస్థానంలో మూడు మహాగ్రంథాలు ఆవిర్భవించాయి. 1) ఉపనిషత్తులు 2) బ్రహ్మసూత్రములు 3) భగవద్గీత. వీటికే **'ప్రస్థానత్రయ'**మని పేరు. 'ప్రస్థాన'మంటే మానవుడు జన్మతః ఏ సంస్కారంతో పుట్టినా, వాని నడవడిక, మనుగడను ఒక సక్రమమైన మార్గంలో పయనింపజేసి, పురుషార్థాలను సాధింపజేసి తురీయ పురుషార్థమైన జీవితగమ్యస్థానమైన **'మోక్షాని'**కి చేర్చేదని అర్థం!

అంతేకాదు, భగవద్గీత ప్రతి అధ్యాయంచివర చూడండి. ఆ గ్రంథం ఒక **'ఉపనిషత్తు'.** 108 ఉపనిషత్తుల్లో చెప్పబడిన 32 **"బ్రహ్మవిద్యల"** సారాంశమనీ, అంటే 'బ్రహ్మతత్త్వాన్ని ఆవిష్కరించే విద్య' 'బ్రహ్మవిద్య' అని, ఆ బ్రహ్మవిద్యను సాధించడానికి అనుష్ఠింపవలసిన **'యోగశాస్త్ర'**మనీ, ఆ యోగము పతంజలి మహర్షి చెప్పిన **'కుండలినీ యోగము'**ని, జీవునిలోని దుఃఖాన్ని తొలగించి, వానిని సంస్కరించి వివేక సోపానపరంపర నెక్కించి మోక్షానికి చేరుస్తుందని తెలియజేస్తున్నది.

కొందరు అనుకొనేటట్లు **'భగవద్గీత'** మత గ్రంథంకాదు. ఇందులో, ధార్మికవిలువలు, నైతికవిలువలు, తాత్త్విక విలువలు సమృద్ధిగా సమన్వయింపబడి ఉన్నాయి. ఈనాడు భగవద్గీతను డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలకు Professional Ethics and Morals తెలియ జేసేదిగాను, School of Business Management విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉంది. ముఖ్యంగా stressను తొలగించేదిగా ప్రసిద్ధి పొందింది.

ప్రస్తుత గ్రంథ కర్త శ్రీ పాతూరి వేంకటేశ్వరరావుగారు ఇదే మార్గంలో పయనిస్తూ, భగవద్గీత Physics, Chemistry, Botony, Zoology, Astro-Physics, మొదలైన శాస్త్రాల మూలసూత్రాలను స్ఫురింపజేసేదిగా ఉందని, విశేషించి నైతిక, ధార్మిక, మానవీయ విలువల్ని ప్రకాశింపజేశారు. చక్కగా ఆయా విషయాలను సమన్వయించారు. భౌతిక విద్యకు, ఆధ్యాత్మిక విద్యకుగల అవినాభావ సన్నిహిత సంబంధాన్ని ప్రస్తుత గ్రంథకర్త సరళమైన తేట తెలుగుభాషలో చెప్పడం ఆనందింపదగింది.

పాఠకులు ఈ ఉత్తమగ్రంథాన్ని క్షుణంగా చదివి జ్ఞానలబ్ధి పొందుతారని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.



సరళీకృత సందేశామృతం!

(ఆంధ్రప్రభ ఎడిటర్ వారి ముందుమాట)

'భగవద్గీత అంటే కేవలం భగవాన్ గీసిన గీత కాదు, భగవద్గీత మానవాళికి అపూర్వ మార్గదర్శిని, అక్షర దిక్సూచి! రచయిత అన్నట్టు గీత నేటి సమాజానికి నిత్య ప్రార్థనా గీతం. భారత సమాజంలో భగవద్గీతకు పరమపవిత్రత ఉంది. గొప్ప ఆధ్యాత్మిక సౌరభం ఉంది. అందుకే ఇది సర్వ మానవామోదంతో వర్ధిల్లుతున్నది. గీత క్రమంగా సామాన్యుడికి కూడా చేరువైతే నిత్య జీవన దర్శినిగా సుస్థిరమౌతుంది. ఈ విశిష్టతను గమనించే రచయిత పాతూరి వేంకటేశ్వరరావు గారు భగవద్గీతను సరళీకృతం చేయాలని నిర్ణయించారు. ఈ ఆలోచనలోనే ఒక విశిష్టత ఉంది. భగవద్గీతను పఠించడం ఒక ఎత్తు. పఠించి ఆస్వాదించడం ఒక ఎత్తు. ఆస్వాదించడమే కాకుండా నిత్య జీవన శైలిలో పాటించడం ఒక పరీక్ష. పాటించడం కేవలం అభిరుచిగా కాకుండ ఒక మార్గంగా ఎంచుకోవడం నిస్సందేహంగా ఉత్కృష్ట గుణం. పాతూరి వెంకటేశ్వరరావు గారు ఈ దశలన్నీ దాటి భగవద్గీతను జీవన సారంగా మలుచుకుని నడుచుకుంటున్నారు. కాబట్టే, దీనిమీద మనస్సు పెట్టి మరొక కోణంలో సరళీకృతం చేయగలిగారు. ఈ బృహత్ యజ్ఞంలో రచయిత భారతావని సమగ్ర స్వరూపాన్ని అభివర్ణించి భగవద్గీత ఎందుకు ఆచరణీయమో వివరించారు. నాటి భారతానికి, నేటి భారతానికీ మధ్య ఇది వారధి ఎలా అయిందో విశ్లేషించారు. భగవద్గీత బహుముఖీయం. దాన్ని విపులీక రించడంలో ఎంత చేసినా మరింత నిధి, గీతా అగాధంలో నిక్షిప్తమై ఉంటుందన్న నిజం ప్రజామార్గదర్శిని శ్రీ మద్భగవద్గీత అను వ్యాఖ్యాన గ్రంథం చదివితే తెలుస్తుంది. ఈ వాస్తవాన్ని పసిగట్టే పాతూరి వెంకటేశ్వరరావు గారు మరోసారి సరళీకరణకు, గీతా విపులీకరణకు, సాహసించారనిపిస్తుంది. ఇందులో కేవలం సరళీకరణ మాత్రమే కాకుండా ఆయన మరొక ప్రయోగం కూడా చేశారు. సందర్భోచితంగా ప్రథమ

పురుషలో వర్ణిస్తూ, ఒకానొకసారి సరళ సంభాషణల రూపంలో భగవద్గీతా సారాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో ఆయన కొత్త ఒరవడిని సృష్టించారు. విజయం సాధించారు. అందుకే ఆయన కొండంత ధైర్యంతో విజ్ఞులు, మేధావులకు తానే స్వయంగా ఒక విన్నపం చేశారు. దీన్ని అందరూ విధిగా చదవాలని ఆయన అభిలషించారు. భగవద్గీతా గ్రంథం శతాబ్దాల తరబడి కాలానికి ఎదురు నిలిచి దేదీప్యమానంగా వెలుగొందుతుండటం లోని ఔన్నత్యాన్ని, ఔచిత్యాన్ని ఆయన మనసా వాచా కర్మణా విశ్వసించారు. అందుకే ఆయనలా విన్నవించగలిగారు. అంతేకాదు, నాస్తిక హేతువాద దృక్పథాలతో కమ్యూనిస్టు సాహిత్యాన్ని తప్ప ఆధ్యాత్మిక గ్రంథాలను చదవని తాను, సర్వమత ఆధ్యాత్మిక గ్రంథాలను ఎలా పఠించిందీ వివరించారు. ఆ రూపాంతర ప్రక్రియలో భగవద్గీత తనకు దారి చూపిన దీపమెలా అయిందో చెప్పారు.

భగవద్గీతకు సరళీకృత గ్రంథమంటే కేవలం ఏ శ్లోకానికా శ్లోకాన్ని అనువదించి సరళీకరించి టీకా తాత్పర్యాలు చెప్పడంగా భావించకుండా రచయిత ఆధునిక దృక్కోణంలో నేటి తరాల తటపటాయింపులను ఆకళింపు చేసుకుని ఆ సమస్యలనూ స్పృశించారు. వాటిల్లోని సంక్లిష్టతలను ప్రస్తావించారు. భగవద్గీతలో వాటికి చూపిన పరిష్కారాలను విశదీకరించారు. భగవద్గీత పట్ల **'నేటి కంప్యూటర్ యుగం వారి సందేహాలను'** అధ్యాయం అలాంటిదే. ఈ అంశాన్ని కేవలం వ్యాస రూపంలో కాకుండా సందేహాలు–సమాధానాల రూపంలో రాయడం ద్వారా రచయిత సమయస్ఫూర్తిని చాటుకున్నారు. భగవద్గీతను శ్లోక రూపంలో చదివితే ఉత్తేజం కలుగుతుంది. ఈ సరళీకృత గ్రంథం చదివితే ఉల్లాసం పురివిప్పుతుంది. ఎందుకంటే భగవద్గీత ఒక నియమం, ఒక నిష్ఠ, ఒక నీతి, అంటున్న ఈ గ్రంథం గీతా ఉత్తేజానికి, ఉత్ప్రేరకంగా ఉంది. ఈ నిగూఢత్వాన్ని ఆకళింపు చేసుకున్నారు గనకే రచయిత దీనికొక విస్తృత పరమార్థాన్ని జోడించి... భగవద్గీత విస్తృతిని

ఇందులో వివరించే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే భగవద్గీత జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసిన తీరు గురించి... భగవద్గీత ప్రపంచ స్థాయిలో విస్తృతం చేసుకున్న ఉనికి గురించి సంభాషణల రూపంలో వివరించారు. ఇందులో అతి సరళీకరణకు అంటే? క్లిష్టమైన ఆధ్యాత్మికాంశాలను సామాన్యుల అనుభవ పరిధిలోని ఉదాహరణలద్వారా సరళీకరించి, వివరించటానికి ప్రాధాన్యతనిచ్చారు. అందుకు సంకేతంగానే... ఒక మనవడు తన తాతయ్యను అడుగుతుంటే తాతయ్య సమాధానాలిస్తున్నట్టు అల్లడం ద్వారా అతి సామాన్యుడికీ ఇది అందుబాటులో ఉండాలన్న తపన కనిపిస్తుంది. అలాగే ఇందులో అనేక చర్చనీయాంశాలను చర్చకు పెట్టారు. భగవద్గీత నిర్దేశిస్తున్నది ప్రవృత్తి మార్గాన్నా? నివృత్తి మార్గాన్నా? అంటూ ప్రశ్నలు సంధించి సమాధానాలు వెదికే ప్రయత్నం చేశారు. కేవలం ప్రయత్నమే కాదు. పరిశోధనా చేశారు. దాని ఫలితమే... **'అర్ధవంతంగా ఆచరిస్తే నివృత్తిమార్గం కూడా ప్రవృత్తి మార్గమే'**నని సూత్రీకరించారు.

ఈ గ్రంథంలో మరొక విశిష్టత కూడా నిక్షిప్తమై ఉంది. మానవాళి మానసిక ఆలోచనా ధోరణులను విస్తృత పరిచే ప్రక్రియలో రచయిత భగవద్గీతను ఒక ఆయుధంగా మలుచుకుని తన మానసిక పరిపక్వతను చాటుకున్నారు. భగవద్గీతలోని సారాన్ని అంశాలవారీగా వివరిస్తూ... సోదాహరణంగా చర్చిస్తూ భగవద్గీతకు సరికొత్త ప్రామాణికతను సాధించే ప్రయత్నం చేశారు. **ఆధునిక శాస్త్రానికీ, ఆధ్యాత్మికతకు 'వైరుధ్యం లేదు'... అనే అధ్యాయం చాలా లోతైన పరిశోధనగా వెలుగొందుతుందని నేను విశ్వసిస్తున్నాను.** భగవద్గీతను ఆధునిక సమాజానికి అన్వయిస్తూ తరతరాల సమస్యలకు సమాధానంగా చూపడంలో రచయిత విజయం సాధించారు. సమస్యలకు శాశ్వత పరిష్కారాల అన్వేషణ కూడా సృష్టి ప్రణాళికా నియమమేనని చెప్పడం... దాన్ని సోదాహరణంగా వివరించడం నేటి సమాజానికి నిత్యావసరంగా కనిపిస్తున్నది.

ఒత్తిళ్ళతో... ఉద్రిక్తలతో... మానసికోద్వేగాలతో ప్రతి చిన్న సమస్యకూ మరణమే మార్గంగా ఎంచుకుంటున్న నేటి తరానికి ఈ సూత్రం ఒక పరమౌషధం. అందుకే ఈ గ్రంథం సర్వజనులకూ నిత్య దైనందిన వెలుగు కిరణం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్థూలంగా "ప్రజామార్గదర్శిని శ్రీమత్ భగవద్గీత" పరమోద్దేశం సరళ వ్యాఖ్యానం చేయడమే అయినా... రచయిత అంతటితో ఆగకుండా **భగవద్గీతా సారాన్ని జీవన యోగంగా మలిచే ప్రయత్నం చేయడం ఒక అద్భుతం!** అటు భగవద్గీత మీద... మరోవైపు జీవితం మీద ఆయనకున్న అవగాహన ఈ గ్రంథం ద్వారా తేటతెల్లమవుతున్నది. సర్వజనులకూ జీవనగీతికగా ఉండాలన్న భావనతో ఆయన రాసిన ఈ సద్గ్రంథం ఆయన అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తుందని మనసారా అభిలషిస్తూ... రచయిత అభిరుచికి, కృషికి అభివందనం చేస్తున్నా!!

వై.యస్.ఆర్. శర్మ
ఎడిటర్, ఆంధ్రప్రభ

హైదరాబాద్
తేది : 20 జనవరి 2016

ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన ప్రజాగ్రంథమిది!

గీతారహస్యాన్ని, సందేశాన్ని సరళీకరించి 'ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత' (తాత్త్విక విజ్ఞాన సర్వస్వం) ద్వారా సమాజాని కందించారు పాతూరి వేంకటేశ్వరరావు. మనిషి తన మార్గాన్ని నిర్ధిష్టంగా, ప్రగతిదాయకంగా, సంతోష భూయిష్టంగా మలచుకోటానికి, జాగృతుడు కావటానికి దోహదపడే భగవద్గీత లిందు, సరళంగా, సోదాహరణంగా, తేట తెల్లంగా చెప్పబడినాయి.

గీతా సందర్భం ఎప్పటిదో ఐనప్పటికీ, నాటికి, నేటికి, ఎప్పటికీ వెలుగు బాటను చూపిస్తూనే ఉంటుంది శ్రీమద్భగవద్గీత! అన్న సత్యాన్ని ఆవిష్కరించిందీ ఈ గ్రంథం. ఆస్తిక, నాస్తిక, హేతువాదులెవరైనా సరే అంతిమంగా దేవాంశను, విశ్వసింపక తప్పదని, అది ఊహకాదు, సహేతుక భావనేనని శాస్త్రజ్ఞులే తేల్చి చెప్పారు. **నిర్జీవ పదార్థం నుండి జీవ పదావిర్భావం యాదృచ్ఛికం కాదు. అందుకు మూలం దైవాంశయేనన్న సత్యాన్ని సైన్సుగూడ కాదనలేదు. అట్టి సృష్టి తత్త్వజ్ఞాన సర్వస్వమే భగవద్గీతయని ససాక్షికంగా వివరించారు రచయిత!**

మానవులు తమ జ్ఞాన, విజ్ఞాన సంపదను విస్తృత పరచుకునే క్రమంలో గీతాప్రాముఖ్యాన్నీ, ఆవశ్యకతను ఈ గ్రంథమంతటా పరచి చూపారు పాతూరివారు. గ్రంథ అభివ్యక్తీకరణలో రచయిత ప్రదర్శించిన 1 సరళత 2 స్పష్టత 3 ఆధ్యాత్మికత, శాస్త్రీయతల అనుసంధానత, మిక్కిలి అభినందనీయాలు వీటి ద్వారానే పండితుల వద్ద నుండి పామరుల చెంతకు, ఆస్తికుల వద్దనుండి ఆధునిక కంప్యూటర్ యుగం వారి చెంతకు భగవద్గీతను చేర్చగలిగారాయన. నిజంగా ఇదొక బృహత్ప్రయత్నమే! గీతయందలి ఆధ్యాత్మికతను, సామాజిక ప్రగతికి సాధనంగా, సామాజిక రుగ్మతలకు దివ్యౌషధంగా ఎలా ఉపయోగించుకోవచ్చో తెలియజేసే మార్గాన సాగిందాయన కలం.

విశ్వశాంతి, ప్రగతి సాధనలో భగవద్గీతా ప్రబోధమెంతటి ప్రయోజనకారియో గుర్తించి, గీతా ప్రబోధ ద్వారా మానవాళిని జాగృతం చేస్తూ సమాజాన్ని ప్రగతిపథాన పయనింపచేయవలసిందిగా అన్నిరంగాల మేధావులకూ విన్నవించుకుంటున్నారు రచయిత! అంతేగాదు, మతగ్రంథంగా భ్రమించి, ప్రజాగ్రంథమైన భగవద్గీతను అధ్యయనం చేయకున్నట్లైతే విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులకేగాదు, ఆ మేరకు సమాజానికీ నష్టమే సుమా! ఉదాహరణకు హేగెల్ వంటి హేమాహేమీల తాత్విక గ్రంథాలను అధ్యయనం చేయకున్నట్లయితే, కారల్‌మార్క్స్ మానవాళికి సామ్యవాదాన్ని పరిచయం చేయగల్గి యుండేవాడు కాదు గదా? కావున విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, నాస్తిక, హేతువాద, భౌతిక, వామపక్ష మేధావులారా! మీరంతా ప్రజామార్గదర్శినియైన భగవద్గీతను అధ్యయనం చేయకుంటే అది మీకేగాదు, ఆ మేరకు సమాజానికీ నష్టమేనంటూ సహేతుకంగా, సవినయంగా వివరించి, విధిగా గీతాధ్యయనం చేయమంటూ పిలుపునిచ్చారు పాతూరి వేంకటేశ్వరరావు.

ఎనభైకి పైగా అన్యభాషల్లో అనువదింపబడి విశ్వవిఖ్యాతిగాంచిన తాత్విక విజ్ఞాన సర్వస్యమైనట్టి అత్యుత్తమ భారతీయగ్రంథం శ్రీమద్భగవద్గీత. అట్టి భగవద్గీత ఎక్కడ వినిపిస్తూ (అధ్యయనం చేయబడుతూ) కనిపిస్తూ (ఆచరింపబడుతూ) ఉంటుందో అక్కడల్లా (ఆ సమాజమంతటా) ధర్మం, దైవ సహాయం, సిరిసంపదలు ప్రవర్థిల్లు తుంటాయనీ, కావున, గీతాధ్యయన, ఆచరణలద్వారా సామాజిక ప్రగతిని, శాంతిని పెంపొందించుకోవలసిందిగా ఎలుగెత్తి చాటుతున్నాడు వేంకటేశ్వరరావు.

విద్యార్థి లోకంలో గీతా సందేశాన్ని విస్తరింపచేసేందుకు ఒక ప్రత్యేక సంభాషణా శైలిని సాధనంగా మలుచుకున్నాడు రచయిత. భగవద్గీతా సంప్రదాయక ప్రగతి, అభ్యుదయాలను తాతామనుమల సంభాషణలద్వారా వెదజల్లి చూపించారు రచయిత.

భగవద్గీతా అష్టాదశాధ్యాయాలను క్రమబద్ధంగా వ్యాఖ్యానించి గీతా సారాంశాన్నంతటినీ సుస్పష్టంగా విశదీకరించారాయన. ఈ గ్రంధాన్నింత సరళ సుందరంగా, సహేతుకంగా, సోదాహరణంగా వివరించగల్గిన వేంకటేశ్వరరావు మిక్కిలి అభినందనీయుడు!

ప్రతి ఒక్కరూ విధిగా అధ్యయనం చేయాల్సిన గ్రంథం "ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత" (తాత్విక విజ్ఞాన సర్వస్వము) ఈ గ్రంథాన్నిలా ప్రజాగ్రంథంగా ప్రత్యక్ష పరచటంలో పాతూరి వారి కృషి చాలా గొప్పది, మిక్కిలి ప్రశంసనీయమైనది.

శుభాభినందనలతో

బి. హనుమరెడ్డి
ప్రకాశం జిల్లా రచయితల సంఘం
ఒంగోలు.

ప్రజలకు జాగృతి కల్గించే అక్షరయజ్ఞం!

'ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత' (తాత్త్విక విజ్ఞాన సర్వస్వం) నిచ్చి, పరిశీలించి తగు సూచన లిమ్మని కోరారు మా చిరకాల మిత్రులు పాతూరి వేంకటేశ్వరరావు నా మీది గౌరవంతో నాపై ఈ భారం మోపారాయన. ఎందుకంటే? గీతాధ్యయన మంటే ఆషామాషీ వ్యవహారం కాదుగదా? ఐనా సరే సామాజిక స్పృహతో సదా మంచిని ప్రోత్సహించే పాతూరివారు, ఆదిశంకరాచార్యులవంటి మహర్షులచే వ్యాఖ్యానింపబడిన గీతా వివరణకు పూనుకున్నారంటే? తప్పక ఇందేదో విశిష్టత వుండి ఉంటుందన్న విశ్వాసంతో ఈ గ్రంథాధ్యయనానికి పూనుకున్నారు.

ముందుగా, ''ప్రజామార్గదర్శిని 'శ్రీమద్భగవద్గీత' (తాత్త్విక విజ్ఞానసర్వస్వం)" అన్న శీర్షిక నన్నాకట్టుకుంది. ఎందుకంటే, 'ప్రజ'అన్నది సామాన్యులకు పర్యాయ పదంగానే కాక, అదొక సామాజికతను, ఒక సామూహికతను గూడ ప్రతిబింబింపచేస్తున్నది. అంతేగాదు, ఇది కేవలం పండితులకో, వేదాంతులకో గాక ప్రజలందరికీ అన్న ప్రజాస్వామ్యాన్నిగూడ ప్రదర్శిస్తున్నదీ శీర్షిక!

ఈ గ్రంథాధ్యయన అనంతరం నిజంగా భగవద్గీత ప్రజలకు మార్గదర్శియే, – తాత్త్విక విజ్ఞాన సర్వస్వమేనన్న భావన నా హృదయంలో ముద్రింపబడటమే గాక ఇట్టి అత్యుత్తమ గ్రంథాన్ని మనమొక మత గ్రంథంగా భ్రమించటం నిజంగా సమాజానికే దురదృష్టకరం అన్నబాధ గూడ కలిగింది. అట్టి భ్రమనుండి ప్రజల్ని విముక్తుల్ని చేసేందుకు విజ్ఞులు పరిశ్రమిస్తున్నారు. అదిగో అట్టి విజ్ఞుల బాటన నడుస్తున్న పాతూరివారు గూడ బహుధా ప్రశంసనీయులు!

మతగ్రంథం కాదు మానవ (ప్రజా) గ్రంథమైన శ్రీమద్భగవద్గీత కేవలం భారతీయుల సొత్తేగాదు, విశ్వమానవుల నిధిగూడ. సూర్యుడు, చంద్రుడు,

భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశంలా మానవులందరిదీ భగవద్గీత! అన్న సత్యాన్ని ప్రతి పుటలోనూ ప్రతిబింబింప చేస్తున్నదీ గ్రంథం!

తమలో పరుగులుతీసే తమో, రజోగుణాల పగ్గాలను లాగిపట్టి, సాత్త్వికత, నైతికతలను ఉద్దేశపూర్వకంగా పెంపొందించుకుంటూ పశుత్వం నుండి మానవతకు – మానవత్వం నుండి దైవత్వానికి, తమను తాము ఎక్కదీసుకునే, సంస్కరించుకునే స్వయం సముద్ధరణా మార్గాన్ని ప్రజలందరికీ చూపుతున్నది భగవద్గీత. అట్టి సమున్నత లక్ష్యసాధనాలైన భగవద్గీతలను సహేతుకంగా, సరళసుందరంగా, వివరించుట ద్వారా ఆధునిక కంప్యూటర్ యుగం వారికి సైతం గీతపట్ల ఆసక్తిని, అవగాహనను, విశ్వసనీయతను కలిగించుటలో విజయులయ్యారు వేంకటేశ్వరరావు.

గీత 13-29 "సమంపశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్" (ఈశ్వరుడు సర్వత్రా సమంగా నిల్చియున్నాడు) అన్న గీతా మర్మాన్ని ప్రకృతి. పర్యావరణల సమతూకంగా విశదీకరించాడు. గీత 3-11 **"పరస్పరం భావయన్తః, శ్రేయః పరమవాప్స్యథ..."** సృష్టిలోని భాగస్వాములందరూ ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ, పరస్పరం ప్రీతిని కల్గించుకుంటూ పరమశ్రేయస్సును పొందెదరుగాక. అన్నగీతా భావనను సోదాహరణంగా సహేతుకంగా వివరించారు. అలాగే **"చాతుర్వర్ణ్యం మయా సృష్టం"** అను గీతయొక్క ఆంతర్యాన్ని పరిశోధనాత్మకంగా వివరించి విమర్శలకు తావులేకుండా చేశారు.

ఇంకా ఈ రచయిత మనముందుంచిన పలుఆలోచనాత్మక ప్రతిపాదనలు ఆయన మేధోన్నతిని చాటుతున్నాయి. ఉదాహరణకు ప్రకృతిలో, పదార్థాలలో ప్రాణుల్లో నిర్దిష్టశక్తినీ, జ్ఞానాన్నీ నిక్షిప్తం చేసియుంచాడు పరమాత్మ. అందువల్లనే భూమ్యాది గ్రహాలు, సూర్యాదినక్షత్రాలు, పాలపుంత వంటి నక్షత్ర కుటుంబాలూ, నిరంతరం

క్రమశిక్షణతో నిర్దిష్టకక్ష్యలలో, నిర్దిష్టవేగాలతో స్వచ్ఛందంగానే తమ విధిని నిర్వహిస్తూ సృష్టి గమనానికి తోడ్పడుతున్నాయి. అలాగే గుండె, కాలేయం, జీర్ణాశయం, శ్వాసకోశాలు, మూత్రపిండాలు, జీవకణాలూ క్రమశిక్షణతో తమ విధిని తాము నిర్వహిస్తూ ప్రాణుల మనుగడకు తోడ్పడుతున్నాయి. అలాగే విశ్వదేహానికి జీవకణజాలం వంటి మానవులంతా తమతమ వ్యక్తిగత, సామూహిక(సామాజిక) కర్తవ్య నిర్వహణల ద్వారా ప్రపంచ ప్రగతికి, విశ్వశాంతికీ తోడ్పడుతూ జీవిస్తుండాలన్న గీతా ప్రబోధాన్ని సామాన్యులకు సైతం అవగాహన కలిగించగలిగారు. తన పెరుగుదల కాటంకంగా పరిణమించినప్పుడు, తన చర్మాన్ని తనే చింపేసుకుంటూ నెలనెలా నూతన చర్మాన్ని ధరించే సర్పంలా, **తమ ప్రగతి కాటంకంగా పరిణమించిన ప్రస్తుత వ్యవస్థను తామే విచ్ఛిన్నం చేసుకుంటూ మరో నూతన వ్యవస్థను ప్రజలు నిర్మించుకుంటూ ఉండటం గూడ భగవంతుని సృష్టిప్రణాళికలో భాగమేనంటున్న గీతా సత్యాన్నికూడ స్పష్టంగా ఆవిష్కరించిందీ గ్రంథం.**

అంతేగాదు, ఆచరణద్వారా శ్రీరాముడు, ప్రబోధం ద్వారా శ్రీకృష్ణుడు ధర్మపరిరక్షణకు పూనుకున్న అవతార పురుషులు – పతన మార్గం పట్టిన సమాజాన్ని విలువల ఇంధనంతో నింపి తిరిగి ప్రగతిపథాన పయనింపజేసేందుకే అవతరిస్తుంటారు అవతారపురుషులు. సదా మారుతూ ఉండే సమాజంలో ఆయాకాలాలలో తలెత్తే సమస్యలకు పరిష్కారాలు బోధిస్తూ దిశానిర్దేశం చేయగలవాడే జగద్గురువు. ఆసేతుహిమాచల పర్యంతం నివసిస్తున్న భిన్నజాతుల వారి, విభిన్న సంస్కృతులన్నింటినీ సమన్వయ పరచి ప్రజలందరి గ్రంథంగా మహాభారతాన్ని రూపొందించాడు వ్యాసమహర్షి వంటి వాక్యాలు ఈ గ్రంథమంతటా జాలువారుతున్న ఆలోచనామృత ధారలు.

సైన్సు, ఆధ్యాత్మికతను అనుసంధానం చేయటం ద్వారా, ఆధునిక కంప్యూటర్ యుగం వారికి సైతం భగవద్గీత పట్ల ఆసక్తిని, విశ్వసనీయతను

కలిగించుటలోనూ విజేతలయ్యారు వేంకటేశ్వరరావు. మూడున్నర దశాబ్దాలకు పైగా అధ్యాపకునిగా వ్యవహరించిన అనుభవంతో కాబోలు, భౌతిక, ఆధ్యాత్మిక విద్యల స్వరూపస్వభావాలను, సమాజానికవి చేకూర్చే ప్రయోజనాలను ఒక పట్టిక రూపాన చూపిస్తూ, మేథో వికాసానికి భౌతికవిద్య, హృదయనిర్మలత్వానికి ఆధ్యాత్మికత ఆవశ్యమన్న సత్యాన్ని మనకంద చేయగలిగారు!

అంతిమంగా నేటి సామాజిక, ఆర్థిక, సంక్షోభాలకు, మితిమీరిన అవినీతి, అక్రమాలకూ ప్రజల నైతిక పతనమే కారణమనీ అంటే మానవులు 'పరమాత్మ నిర్దేశించిన ధర్మ–అర్థ–కామ–మోక్ష పథాన్ని వీడి ఏం చేసైనా డబ్బు సంపాదించడానికి, ఎలాగైనా సరే. కామం తీర్చుకోవటానికి తెగించడమే కారణమనీ, దీనికి పరిష్కారం. గీతా నిర్దేశిత స్వయం సంస్కరణ లేక స్వయం సముద్ధరణ మార్గమే ఆవశ్యమనీ అందుకు గీతాధ్యయన ఆచరణలే శరణ్యమన్న సత్యాన్ని ప్రజలందరిచేతా దర్శింపజేయాలన్న పాతూరి వారి సంకల్పం ఈ గ్రంథం ద్వారా నెరవేరినట్లే, ఆయన తపస్సు ఫలించింది. ఆ ఫలాన్ని అందుకోటానికి ప్రజలంతా సంసిద్ధులు కావాలి.

'ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత (తాత్త్విక విజ్ఞాన సర్వస్వము)' అను ఈ గ్రంథం సార్థకనామధేయి. మానవాళిని జాగృతపరచేందుకు పాతూరివారు నిర్వహించిన అద్భుతమైన ఈ అక్షరయజ్ఞం సర్వదా అభినందనీయం! మానవాళికే మార్గదర్శినియైన ఈ గ్రంథం బహుభాషల్లో ప్రభవిస్తూ ఆసేతు హిమాచల పర్యంతం మరియు ఈ విశ్వమంతటా విరాజిల్లుగాక! తథాస్తు!

సదా మీ అక్షర ప్రగతిని ఆకాంక్షించే

అక్షర మిత్రులు

డా॥ యు. దేవపాలన

రిటైర్డ్ ప్రిన్సిపాల్, అద్దంకి

గీతామాత నిర్దేశిస్తున్న నిత్య ప్రార్థనా గీతం

సర్వమానవ సమానత, సర్వమత సామరస్యతను ప్రబోధిస్తూ మానవాళికి గీతామాత నిర్దేశిస్తున్న నిత్య ప్రార్థనా గీతమిది. దేశ, జాతి, కుల, మతాతీతంగా స్వయం సంస్కరణ, స్వయం సముద్ధరణార్థం ప్రజలు నిత్యం ఆలాపించవలసిన "నిత్య ప్రార్థనా గీతం"

హే సర్వేశ్వరా!

సర్వదా నా మనసు నీయందే లగ్నమై నీ పట్ల

నిశ్చలభక్తి విశ్వాసాలతో నిండియుండేలా నన్నునుగ్రహించు తండ్రీ!

హే విశ్వ చైతన్యమూర్తీ!

నాలో ఎన్నడూ దురాలోచనలు, దుర్గుణాలు, దుష్టసంకల్పాలు, చొరబడకుండా నీ గీతా, ప్రత్యగాత్మల నిర్దేశానుసారం – సదా ధర్మార్థ, కామ, మోక్ష మార్గాన పయనించేలా నన్నాశీర్వదించు దయామయా!

హే పరమాత్మా!

పదార్థాలన్నింటా శక్తిగా, ప్రాణులన్నింటా ప్రత్యగాత్మగా

నివసిస్తున్నది నీవే అన్న సత్యాన్ని నాలో ప్రతిష్ఠించి,

నా మనోవాక్కర్మల వలన ఎవరికీ చెడు జరక్కుండా సదా లోకానికి మేలు జరిగేలా!

ఫలాపేక్షరహితంగా పదిమందికోసం పాటుపడేలా,

సమత, సాత్వికగుణాన్ని నాలో ప్రవర్ధిల్లజేయవయ్యా! ప్రభో!

హే సచ్చిదానందమూర్తీ!

అసత్యం నుండి సత్యానికి, అజ్ఞానపు చీకటినుండి

ఆత్మజ్ఞాన జ్యోతిలోనికి, మృత్యువు నుండి అమృతత్వానికీ నన్నెక్కదీసి

నీచేతికందొచ్చిన బిడ్డగా, నీ చేతి పరికరంగా నన్నుపయోగించుకో తండ్రీ!

హే అభయ స్వరూపా!

త్వమేవ శరణం మమ! పాహిమాం, పాహిమాం, పాహీ!

నమస్తే, నమస్తే నిఖిలేశ్వరా! నమో న్నమః!

ఓం కృష్ణం వందే జగద్గురుమ్

అర్జునుడనే దూడకు ఉపనిషద్ధేనువు యొక్క పొదుగు నందించి గీతామృతక్షీరం పిదికి మానవాళి కందించిన దేవకీ వసుదేవ నందనా! శ్రీకృష్ణావతార పురుషోత్తమా!

శిష్టరక్షకా, దుష్ట శిక్షకా, ధర్మ పరిరక్షకా, శ్రీకృష్ణపరమాత్మా, నీకు ప్రణామాలు!

లోక కళ్యాణానికో పరికరంగా, నీ చేతికందొచ్చిన బిడ్డగా దయచేసి

నన్నుపయోగించుకో తండ్రీ! ఓం కృష్ణమ్ వందే జగద్గురుమ్!

ఓం వ్యాసం వందే జగద్గురుమ్

వేదోపనిషత్, బ్రహ్మసూత్ర, మహాభారత, పురాణాల తైలంతో జ్ఞానజ్యోతిని వెలిగించి

పరమగమ్యానికి దారిచూపిన మానవ మహోపకారీ! ఆచంద్రతారార్కం అమరుడవయ్యా!

సత్యావతీ పరాశరుల ప్రియసుతుడా! విష్ణువైన నీవే వ్యాసుని రూపొందావు! ప్రియతమ వ్యాసపితామహా! నీకు కృతజ్ఞతాభివందనాలు!

నీవు వెలిగించిన జ్ఞానదీపంలో కాస్తంత చమురు పోసేందు కనుమతించి, నన్నాశీర్వదించవా,

విశ్వ గురుదేవా! ఓం వ్యాసం వందే జగద్గురుమ్!

ముగ్గురమ్మలారా! ప్రణామాలు!

శ్రీలక్ష్మీ! సరస్వతీ! పార్వతీ! ముగురమ్మల్లారా! మీకు సాష్టాంగ ప్రణామాలు!

అందరికీ శ్రీ మద్భగవద్గీతా సందేశామృత మందేలాగా కరుణించండి తల్లులారా!

మాన్యులకే గాదు, గీతపట్ల సామాన్యులకూ ఆసక్తీ, అవగాహన కలిగించేలా

సరళ, సలలిత సహేతుక వ్యాఖ్యాన రచనకు నన్నాశీర్వదించండి! అమ్మలారా!

నాగుండె గుడిలో కొలువుండి పోవమ్మ గీతామాతా!

మార్గశిర శుద్ధ ఏకాదశిన శ్రీ కృష్ణావతార పురుషుని ముఖారవిందం నుండి జాలువారి, శ్రీమాన్ వ్యాస మహర్షిచే మహాభారతాన ప్రతిష్ఠింపబడిన శ్రీమద్భగవద్గీతా మాతా! నా గుండె గుడిలో కొలువుండి, దయచేసి నా యీ జ్ఞాన యజ్ఞాన్ని ఫలింపజేయుము తల్లీ! ఓం నమో గీతామాతా నమో న్నమః!

కృతజ్ఞతాభివందనాలు

ఐదేళ్ళ ప్రాయంలో అమ్మ నన్ను ఏడుకొండలపైకి నడిపించి, నా చేత నమస్కరింపచేసిన 'అలమేలుమంగా వేంకటేశ్వరులకు' పంచభూతాలకు, సూర్యచంద్రులకు, అమ్మ అన్నపూర్ణమ్మ నాన్న వేంకటసుబ్బయ్య, అమ్మమ్మ హనుమాయమ్మలకు, గురుదేవులకు, భరతమాతకు, భారత స్వాతంత్ర్య సమరవీరులకు, మానవ మహోపకారులకు, కర్షకులు, కార్మికులకు, సమాజానికీ ప్రణామాలు!

ఓం కృష్ణం వందే జగద్గురుం

ఓం నమోగీతామాతా

భగవద్గీతా మార్గాన పయనిద్దాం !
పరమ గమ్యాన్ని చేరుకుందాం !

"ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత" పాఠకులారా శుభోదయం! నాటి మన భారతాన్నీ – నేటి మన భారతాన్నీ మనమొకసారి మననం చేసుకుందామా? రండి మరి–

నాటి భారతం : వేల సంవత్సరాల పూర్వంనుండే వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, రామాయణ మహాభారత ఇతిహాసాలు, భాగవతాది పురాణాలు, అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథం శ్రీమద్భగవద్గీతాది ధార్మిక గ్రంథాల సహకారంతో ప్రజలను 'ధర్మ–అర్థ–కామ–మోక్ష మార్గాన' పయనింపజేస్తూ, వారికి స్వయం సముద్ధరణ (స్వయం సంస్కరణ) నలవరిచారు. 'అందరిలోనూ అంతరాత్మగ వసిస్తున్నది పరమాత్మయే'నన్న ఆత్మజ్ఞానపు వెలుగులో భరతఖండాన భిన్నత్వం లోని ఏకత్వాన్ని విలసిల్ల జేశారు మన మహర్షులు!

'యథారాజా తథా ప్రజా' అనే రాజ ధర్మానికి శ్రీకారం చుట్టిన శ్రీరాముడు! 'నిష్కామ కర్మమార్గాన్ని' నిర్దేశించిన శ్రీకృష్ణుడు! 'అహింసాధర్మా'న్ని ప్రబోధించిన గౌతమ బుద్ధుడు మొ॥ అవతార పురుషులకు జన్మనిచ్చిన పుణ్యభూమి మన భారతదేశం. పాశ్చాత్య ప్రపంచం అనాగరిక 'బానిస వ్యవస్థ'లో పయనిస్తున్న రోజులలోనే, పని విభజన పద్ధతిద్వారా 'గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ'ను రూపొందించుకుని ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది మనభారతదేశం. అదీ నాటి మన భారతం!

నేటి భారతం : నేడు కష్టించి పనిచేసే అత్యధిక శాతం యువతను కలిగియున్న దేశంగా, ప్రపంచంలోనే అగ్రస్థానాన ఐటిరంగం, ఉపగ్రహ ప్రయోగాలలో

అగ్రదేశాల సరసన నిలిచింది భారతదేశం. ఇక ఉద్యోగ, వ్యాపార పరంగా దాదాపు ప్రపంచమంతటా విస్తరించారు భారతీయులు. అంతేకాదు ప్రపంచ దిగ్గజాల వంటి బహుళజాతి సంస్థల సి.ఇ.ఓ.లుగా అమెరికా, కెనడా, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల చట్టసభల ప్రతినిధులుగా, గవర్నర్లుగ, అత్యున్నత న్యాయమూర్తులుగా ఎదిగారు పలువురు ప్రవాస భారతీయులు. నేటి మన భారతానికి ఇదిఒక పార్శ్వం!

మరోవైపు తమ ఉనికిని కాపాడుకునేందుకు సదా కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతూ భారత జాతీయ సమైక్యతకు తూట్లు పొడుస్తున్నారు. రాజకీయ నిరుద్యోగులు, అధికార దాహార్తులు కొందరు! – డబ్బుతో అధికారం, అధికారంతో డబ్బంటూ రాజకీయాన్ని గూడ వ్యాపారంగా మలుచుకున్నారు పాలకవర్గాలవారు. ఉన్నది అమ్ముకో, లేనిది కొనుక్కోమంటున్న నేటి వ్యాపార వ్యవస్థ శీలాన్ని, రక్తాన్నీ, అవయవాలను సైతం అమ్ముకేంటేనే గాని బ్రతకలేని దుస్థితికి నెట్టేసింది నిరుపేదల్ని. – ప్రపంచ కుబేరులున్న 5వ దేశంగా, పేదరిక రహిత దేశాలలో 85వదిగా గుర్తింపు పొందింది భారత్. నానాటి కిలా పెరిగిపోతున్న, ఆర్థిక సామాజిక అసమానతల కారణంగా నిరక్షరాస్యత, నిరుద్యోగం, అవినీతి, ఆసేతు హిమాచల పర్యంతం వీరవిహారం చేస్తున్నాయి. తత్కారణంగా 'విశ్వశాంతి సూచీ 2015' పేరిట జరిగిన సర్వే ప్రకారం 'ప్రపంచ ప్రశాంత దేశాల'లో భారత్‌కు 143వ స్థానం దక్కింది. కానీ, ఇంత పెద్ద ప్రమాదాన్ని గూర్చి ఆలోచించడానిక్కూడా తీరిక లేకుండా పోయింది మనకు. ఎందుకంటే? కొండ శిఖరంమీద కుమ్మరించిన నీళ్లలాగా సదా డబ్బుకోసమే మనం ఉరుకులు పరుగులు పెడుతున్నాం గనుక!

"ఇంకా, యింకా ఎదగాలి, మరిన్ని విజయాలు సాధించాలన్న తపన, నిరంతర శ్రమలే మానవ ప్రగతికి ఇంధనాల"న్నది వాస్తవమే. కానీ "ధర్మ మార్గాన సాధించిన ప్రగతే ప్రగతి, విలువలతో కూడిన విజయమే విజయం,

వాటివల్ల కలిగే ఆనందమే ఆనందం! అన్నదీ అంతే వాస్తవం! నిజానికి మనిషి అంతరంగం వాంఛించేది అశాంతికి తావు లేని అట్టి నిర్మలమైన ఆనందాన్నే సుమా! కానీ, అంత సుదీర్ఘ సమయం కష్టించేందుకిష్టపడక, రాత్రికి రాత్రే ఎదగాలన్న అత్యాశతో అడ్డదారులు తొక్కుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు అత్యధికులు. అందుకే నేడిన్ని రుగ్మతలతో సతమతమౌతున్నది మన భారతదేశం. ఈ దుస్థితి నుండి గట్టెక్కడానికి మనమంతా ఆత్మజ్ఞానపు వెలుగులో నిష్కామ కర్మమార్గాన పయనిస్తూ, విధి నిర్వహణ ద్వారా ఈశ్వరుని పూజిస్తూ, మనల్ని మనం ఉద్ధరించుకోవట (సంస్కరించుకోవట) మొక్కటే పరిష్కార మార్గమనీ, అందుకు భౌతిక విజ్ఞానంతో పాటు, ఆధ్యాతికతనూ ఆవశ్యంగా ఆశ్రయించమంటున్నది భగవద్గీత!

ప్రతిమనిషీ "తనలో అంతరాత్మగ వసిస్తున్న పరమాత్మకు అధీనుడై ఆయన ఆదేశానుసారం సదా ధర్మ–అర్థ–కామ–మోక్ష మార్గాన పయనించడమే ఆధ్యాతికత" – కానీ, నేడు ఆధ్యాత్మికతపేరిట, పుణ్యక్షేత్ర దర్శనాలు, ఆలయ ప్రదక్షిణలు, అభిషేకాలు, నోములు, వ్రతాలు, ప్రసాదాలకే పరిమితమౌతున్నా అత్యధికులు, ప్రదర్శనాభావంతో గాక, చిత్తశుద్ధితో నిర్వహిస్తే కొంత మేర కవి మనోనిర్మలత్వానికి తోడ్పడగలవే గాని, అవే ఆధ్యాత్మికం కాబోవు. **విశ్వాధినేతయైన (అంతర) ఆత్మాదేశానుసారం జీవిస్తూ ధర్మాచరణకు మన ఇంటి వాతావరణాన్ని – నిర్మల ప్రశాంత జీవనానికి మన ఒంటి వాతావరణాన్నీ నిలయాలుగా రూపొందించుకోవటమే అసలైన ఆధ్యాత్మికత.** అట్టి ఆధ్యాత్మికత మాత్రమే సచ్చిదానందాన్ని (సత్య, జ్ఞాన, ఆనందాలను) ప్రసాదించి మానవాళిని పరమ గమ్యానికి చేర్చగల్గుతుందని ప్రబోధిస్తున్నది శ్రీమద్భగవద్గీత! మరియు మనుషులతో సహా ప్రాణులు పదార్థాలన్నింటా నిండియున్నది పరమాత్మయే కాబట్టి, 'మానవ ప్రాణి, ప్రకృతి, పర్యావరణ సేవయంతా పరమాత్మ సేవయే'నని, పరమాత్మ ప్రీతికోసం, ప్రపంచ

కళ్యాణార్థం, ఫలాపేక్ష రహితంగా పరిశ్రమించే వారికి పాప పుణ్యాలంటవనీ 'విధి నిర్వహణకు మించిన ఈశ్వర పూజలేదనీ' మనకు దిశానిర్దేశం చేస్తున్నది భగవద్గీత!

అట్టి అపూర్వమైన, అద్భుతమైన భగవద్గీతను 1.స్వాతంత్ర్యోద్యమాన్ని సమరశీలవంతం చేసేందుకు లోకమాన్యబాలగంగాధరతిలక్ 2. అహింసా ఉద్యమ బలోపేతానికి, అస్పృశ్యతానిర్మూలనకు ప్రపంచ శాంతి దూత మహాత్మాగాంధీ విజయవంతంగా వినియోగించుకోగలిగారన్నది జగమెరిగిన సత్యం. మరియు "భారత స్వాతంత్ర్యోదమానికే గాక నిత్య జీవితంలోనూ ప్రతి యొక్కరికీ స్ఫూర్తినిచ్చే గీతోపదేశాన్ని 'భారతీయ ధర్మంగా', భగవద్గీతను 'భారతీయ ధర్మశాస్త్రం'గా గుర్తించుట భారత ప్రభుత్వ బాధ్యత. భారతరాజ్యాంగంలోని '51–ఎ' ఆర్టికల్ ప్రకారం కుల, మత, వర్గాల కతీతంగా భగవద్గీతా ధర్మాన్ని పాటించుట భారతీయుల విధి' యని ఇటీవలి కాలంలో జస్టిస్ ఎస్.ఎన్. శ్రీవాత్సవ నాయకత్వాన అలహాబాద్ హైకోర్టు సంచలనాత్మక తీర్పు యిచ్చిన సంగతీ సర్వ విదితమే!

ఈ వాస్తవాలను మననం చేసుకుంటున్న నాలో, లోకమాన్య బాలగంగాధరతిలక్, మన జాతి పిత మహాత్మా గాంధీల వలెనే మనం సైతం వర్తమాన దుస్థితి నుండి భరత మాతను గట్టెక్కించుకోటానికి భగవద్గీత నెందుకు వినియోగించుకోగూడదన్న ఆలోచన మొలకెత్తింది. సకల భూతహితాన్ని–సర్వమానవ, సమస్త ప్రాణుల ఏకత్వా(ఆత్మైకత్వా)న్ని ప్రబోధిస్తున్న భగవద్గీతను భారతీయుల్లోకి విస్తారంగా తీసుకెళ్ళాల్సిన సామాజిక కర్తవ్యం స్ఫురించింది నాలో. ఐతే ఆది శంకరాచార్య, రామానుజాచార్య, మధ్వాచార్యుల వంటి మహర్షులతో ప్రారంభమై, నేడు విశ్వవ్యాప్తంగా విలసిల్లుతున్న వేలాది గీతాభాష్యగ్రంథాలన్నీ గ్రాంథిక, ఆధ్యాత్మిక, పారిభాషిక పదజాల యుతాలై యున్నందున విద్యాధికులకేగాని సాధారణ విద్యావంతుల అవగాహనకు అవి

కష్టసాధ్యంగా ఉన్నాయి. అందువలన మాన్యులనేగాక, సామాన్యులనూ మరియు ఆధ్యాత్మికత అంటే బొత్తిగా తెలియని నేటి కంప్యూటర్ యుగం వారిని సైతం గీతామాతకు చేరువ చేయాలంటే అందుకు జనసామాన్యపు భాషలో సశాస్త్రీయ, సహేతుక, వివరణతో, సరళ, సలలిత గీతావ్యాఖ్యాన గ్రంథం అవశ్యమన్న వాస్తవాన్ని గుర్తించాను. నాటినుండి పలు ప్రాచీన, ఆధునిక ఆధ్యాత్మిక, శాస్త్రీయ గ్రంథాధ్యయనం ద్వారా గత 3సంవత్సరాల, 6 నెలలుగా నేను నిర్వహించిన జ్ఞానయజ్ఞఫలమే "ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత"!

సరళ, సలలిత పదాలు, సామాన్యుల పరిధిలోని ఉదాహరణలు, భౌతిక, ఆధ్యాత్మిక పరిశోధకుల విశ్లేషణలతో సహేతుకంగా వర్తమానాని కన్వయిస్తూ రూపొందింపబడిన యీ సరికొత్త గీతా వ్యాఖ్యాన గ్రంథాన్ని శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా ఆవిష్కరింపచేసి తెలుగు ప్రజలకు క్రమంగా భారతీయులందరికీ అందజేయాలన్న సత్సంకల్పాన్ని నాలో పుష్పింపజేసిన తల్లి అలిమేలుమంగ, తండ్రి వేంకటేశ్వరుల రూపంలోని పరమాత్మకు సర్వదా కృతజ్ఞుడను. ఇట్టి లక్ష్యంతో రూపొందించిన గ్రంథం గనుకనే యిందు వ్యావహారిక పద ప్రయోగం జరిగింది. దయచేసి ఇందు కన్యధా భావించవలదని పండితులకు నా మనవి.

ఆధ్యాత్మిక, ఆధునిక శాస్త్ర జ్ఞాన, విజ్ఞానాలు రెండూ 'మానవ ప్రగతి రైలు' కు రెండు పట్టాల వంటివి, మానవ జీవితపు నాణేనికి బొమ్మా–బొరుసుల వంటివి. కాబట్టి ఈ రెండింటికీ వైరుధ్యమే లేదంటూ, ఆధ్యాత్మిక వేత్తలేగాదు, సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు సైతం చేసిన విశ్లేషణల నిందు పొందుపరిచాను. కంప్యూటర్‌యుగం వారి అవగాహనార్థం క్లిష్టమైన ఆధ్యాత్మికాంశాలను శాస్త్రీయ ఉదాహరణలతో వివరించాను. సృష్టి నిర్మాణానికి శాస్త్రజ్ఞులు చెబుతున్న **'బిగ్‌బ్యాంగ్'** సిద్ధాంతాన్ని మహర్షులు చెబుతున్న **'విశ్వచైతన్యశక్తి'**నీ

విశదీకరించి, పోల్చి చూపుతూ వాస్తవాన్ని ఆవిష్కరింపచేశాను. విశ్వాత్మ(దేవుని) ఉనికిని విశ్వసించేందుకు శాస్త్రవేత్త లుటంకించిన సప్తకారణాల నిందు పొందుపరిచాను. మరియు సామాన్యుల ఆసక్తి, అవగాహనలను పొందడానికై ఉపనిషత్తులను ఆదర్శంగా స్వీకరించాను. అందువల్లనే 'శిరీష-శ్వేతయను' ఉత్తమోపాధ్యాయినుల పర్యవేక్షణలో, జ్ఞానార్జనా తపన గల్గిన, యువన్‌తేజల్ 2. హర్షవర్ధన్, 3. రిత్విక్, 4. ఆదిత్య, 5. అగస్త్య, 6. విద్యాధర్, 7. తరణ్, 8. వశిష్ఠ, 9. జయరామ్, 10. హిమాంశ్, 11. ఆరాధ్య, 12. కావ్య, 13. శ్రేష్ఠ, 14. సాయికృత్తిక, 15. ఊహాశ్రీ, 16. హర్ష, 17. దేవాంశ్, 18. విరాజ్ ఉజ్వల్ రత్నాల వంటి ఈ విద్యార్థినీ విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు నేనిచ్చిన జవాబుల రూపంలో అంటే **'తాతా, మనుమల సంవాద' రూపంలో కొనసాగుతుందీ గ్రంథం.** మరియు గీతపట్ల జాతీయ, అంతర్జాతీయ గీతాభాష్యకారులు, గీతా పరిశోధకులు, చరిత్రకారులందరి అభిప్రాయాలను క్లుప్తీకరించి, సరళీకరించి జనరంజకంగా, ప్రజా గ్రంథంగా రూపొందించి గీతామాతను ప్రజలందరికీ చేరువ చేసేందుకు పరమాత్మ నాకు ప్రసాదించిన శక్తి మేరకు పరిశ్రమించాను.

ఇక మేధావులకు నాదొక విజ్ఞప్తి!

మేధావులారా! దయచేసి మీరంతా విధిగా గీతాధ్యయనం చేయండి. ఎందుకంటే? గీతాజ్ఞాన సంపద! అవధులు, ఎల్లలంటూ లేని వసుధైక, విశ్వైక గ్రంథం భగవద్గీత! సార్వజనీన, సార్వకాలిక, నిత్యసత్యజ్యోతి శ్రీమద్భగవద్గీత! అందుకే 'కృష్ణం వందే జగద్గురుమ్' అంటూ గీతాచార్యుడు 'వ్యాసం వందే జగద్గురుమ్' అంటూ గీతా గ్రంథరూపశిల్పి సర్వత్రా కీర్తించబడుతున్నారు. గీతలో ఉన్నది ఇంకెక్కడైనా కనిపించవచ్చు. కానీ, గీతలో లేనిది ప్రపంచంలో మరెక్కడా అగుపించదు అని గీతా మాతతో మమేకమైన మహాత్మాగాంధీ సహేతుకంగా విశ్లేషించారు. విజ్ఞులు చెబుతున్నట్లు జాతి, కుల, మత,

దేశాతీతంగా ప్రజలందరికీ మార్గదర్శిని, మానవ కర్తవ్య ప్రబోధిని శ్రీమద్భగవద్గీత!

ఇది నా అనుభవం. 1970 నుండి 1995 వరకు నేను, అభ్యుదయ, నాస్తిక హేతువాద, కమ్యూనిస్టు, సాహిత్యానికే పరిమితమయ్యాను తప్ప, ఆధ్యాత్మిక గ్రంథాల జోలికెళ్ళలేదు. ఎందుకంటే? బౌద్ధికంగా ఎదగనివారే ఆధ్యాత్మిక గ్రంథాల నాశ్రయిస్తారన్న భ్రమలో ఉండిపోయాను గనుక. అనంతరమొక ప్రమాదానికిలోనై బెడ్‌రెస్ట్‌లో ఉన్న మూడు మాసాలపాటు వివిధ ఆధ్యాత్మిక గ్రంథాధ్యయనం చేశాను. అప్పుడు బోధపడింది నాకు, పక్షి ఎగరటానికి రెండు రెక్కలు, మనిషి నడవటానికి రెండు కాళ్ళూ అవశ్యమైనట్లే మానవ పరిపూర్ణ ప్రగతికి ఆధ్యాత్మికత-భౌతికత, జ్ఞాన-విజ్ఞానాలు రెండూ ఆవశ్యమన్న సత్యం! అంతేగాదు "వినదగు నెవ్వరు జెప్పిన, వినినంతనె వేగపడక వివరింపదగున్" అని సుమతీ శతకకర్త", **'మాన్యులు చెప్పారని మన్నించకు, సామాన్యులు చెప్పారని తిరస్కరించకు ఎవ్వరేం చెప్పినా దాన్ని నీ సొంతబుద్ధితో విశ్లేషించుకో, వాస్తవమని అనుభూతి చెందిన దాన్ని స్వీకరించు, తదితరాన్ని త్యజించు'** మని బుద్ధుడు చెప్పినవి నిత్యసత్యాలు. మరి అధ్యయనం చేస్తేనేగదా, అది మంచో, చెడో, మనకనుభవమయ్యేది? అందుకే విధిగా గీతాధ్యయనం చేయండి. అదీగాక అన్ని గ్రంథాల్లా చదివి అర్థం చేసుకుని వదిలేసే సాధారణ గ్రంథంకాదు గీత. గీతాధర్మాచరణ ద్వారా మనల్ని మనమే కాదు, మనదేశాన్ని ప్రపంచాన్నే సముద్ధరించుకోవటానికి, సంస్కరించుకోవటానికి తోడ్పడగల్గిన, అపూర్వము, అద్భుతం, అద్వితీయమైన ఆధ్యాత్మిక గ్రంథం శ్రీమద్భగవద్గీత!

అందుకే సహోదరీ సహోదర 'భారతీయులారా లెండి! మేధావులారా, ఉపాధ్యాయ, విద్యార్థులారా కదలిరండి! ధర్మం కోసం పోరాడే అర్జునుని వంటి సమరశీల యోధుల్నీ సరైన దిశానిర్దేశం చేయగల్గిన శ్రీకృష్ణుని వంటి

జ్ఞానుల్నీ రూపొందించుకోవటానికీ, రుగ్మతల సుడిగుండం నుండి మన భరతమాతను గట్టెక్కించుకోవటానికీ, భగవద్గీతను మరింత సమర్ధవంతంగా వినియోగించుకుందాం గాక! మనకోసం, మనదేశం, మన ప్రపంచం, మన భూమాత, మన విశ్వంకోసం, విశ్వసృష్టికర్త, విశ్వాధినేత, మన తండ్రి పరమాత్మ ప్రీత్యర్ధం! మనమంతా భగవద్గీతను సార్ధకంగా అధ్యయనం చేద్దాం, ఆచరిద్దాం. గీతామాత నిర్దేశానుసారం సదా ధర్మ-అర్ధ-కామ-మోక్ష మార్గాన పయనిద్దాం. విశ్వకళ్యాణానికి తోడ్పడుతూ, పరమగమ్యం దిశగా పయనిస్తూ తండ్రి పరమాత్మ ఆశయాన్ని నెరవేర్చుదాం గాక! తథాస్తు!

వ్యాఖ్యాత

పాతూరి వేంకటేశ్వరరావు

విశ్రాంత ప్రాధానోపాధ్యాయులు

జాతీయ పర్వదినంగా 'గీతాజయంతి'

"మాసానాం మార్గశీర్షోఽహం...॥ అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుకున్న అత్యుత్తమ మార్గశిరమాసాన, శుద్ధ ఏకాదశినాడు – కురుక్షేత్ర యుద్ధప్రారంభ దినాన దుఃఖ విమోహితుడై అస్త్ర సన్యాసం చేసిన అర్జునుని, ధర్మ పరిరక్షణార్ధం పునరుత్తేజితుని చేయుటకు శ్రీకృష్ణుని ముఖారవిందం నుండి గీత(పాట)గా, జాలువారిన ఉపదేశామృతమే భగవద్గీత!

సనాతనం(సార్వకాలికం), సార్వజనీన, మైనట్టి భగవద్గీత అవతరించిన పుణ్యదినం 'మార్గశిరశుద్ధ ఏకాదశి'. సదరు పవిత్ర దినాన్ని 'గీతాజయంతి'గ మనదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా పలువురు జరుపుకుంటున్నారు. ఇట్టి సదవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకొందామిలా.

నాడు రాజాస్థానాలకే పరిమితమై యున్న 'వినాయక చవితి' ని జాతీయ సార్వజనీన పర్వదినంగా రూపొందించి, గణేశ నవరాత్రులలో అవతారపురుషులు, మరియు ఇతిహాస, పురాణ, చారిత్రక వీరుల కథలు, గాథలను హరికథలు, బుర్రకథలద్వారా వినిపింపజేసి భారతీయులలో దేశభక్తిని రగిలించి, వారిని స్వాతంత్రోద్యమం దిశగా నడిపించగలిగారు బాలగంగాధర్‌తిలక్. అలాగే నేడు పండితులు, జ్ఞానులకు మాత్రమే పరిమితమై యున్నట్టి గీతాజయంతిని భారతజాతీయ పర్వదినంగా రూపొందించుకుని, నాటినుండి కురుక్షేత్ర యుద్ధం జరిగిన 18 రోజులను అష్టాదశ గీతాజయంత్యుత్సవాలుగ ఆసేతు హిమాచల పర్యంతం జరుపుకుందాం. ఆబాల గోపాలాన్ని అందులో భాగస్వాములను చేద్దాం. గీతాధ్యయనం-అధ్యాపనం-ఆచరణలద్వారా సమాజంలోని ధర్మాన్నీ, ధర్మాత్ములను కాపాడుకోవాలన్నస్ఫూర్తిని ప్రజల్లో రగిలించుకుందాం. ప్రణాళికా బద్ధంగా తదనుగుణమైన వీధి నాటికలను, సంక్షిప్త చలన చిత్రాలను ప్రదర్శిస్తూ, జ్ఞానులచే గీతా బోధనలను చేయిస్తూ,

తిరిగి'ధర్మార్థకామ మోక్ష మార్గాన' పయనించేలా భారతీయులను ప్రభావితం చేసుకుందాం!

అలా గీతాజయంతిని సద్వినియోగం చేసుకుంటూ గీతామార్గ నిర్దేశకత్వంలో పయనిస్తూ ప్రపంచానికాదర్శంగా పరమగమ్యం దిశగా పయనిద్దాం. సదా సుఖశాంతులతో వర్ధిల్లుదాం! తథాస్తు! భరతమాతకు శుభమస్తు!

గీతా పఠనం, బోధనం, శ్రవణం, ఆచరణ పరమపదానికి సోపానాలు!

"యః శృణోతిచ గీతార్ధం, కీర్తయత్యేవ యః పరమ్
శ్రావయేశ్చ పదార్ధం వై సప్రయాతి పరం పదమ్"

భగవద్గీతా పఠనం, శ్రవణం, బోధనం, ఆచరణలు మానవాళిని పరమపదానికి చేర్చు సోపానాలు!

భగవద్గీత ఎక్కడో భగవంతుడక్కడే!

"గీతా మే హృదయం పార్థ!
గీతా మే సారముత్తమమ్
గీతా మే జ్ఞాన మత్యుగ్రం
గీతా మే జ్ఞానమవ్యయమ్"

"గీతా శ్రయోహం తిష్టామి
గీతా మేచోత్తమమ్‌గృహమ్
గీతాజ్ఞాన ముపాశ్రిత్య
త్రైలోక్యపాలయామ్యహమ్"

భావం : అర్జునా! గీతయే నా హృదయం, నా పరమతత్త్వం, నా తేజోమయ నాశరహిత జ్ఞానం గీతయే నా కుత్తమ గృహం. నేనందే నివసిస్తున్నాను. గీతాజ్ఞానంతోనే ముల్లోకాలనూ పాలిస్తున్నాను అని

శ్రీకృష్ణభగవానుడు స్వయంగా చెప్పుకున్నాడు. అందుకే **"భగవద్గీత ఎక్కడో భగవంతుడక్కడే"** అన్న నానుడి భారతదేశమంతటా వినిపిస్తుంటుంది.

అంటే భగవద్గీత ఎక్కడ వినిపిస్తూ (చదవబడుతూ) కనిపిస్తూ (ఆచరింప బడుతూ) వుంటుందో భగవంతుడుడక్కడే ఉండి వారికి సహకరిస్తూ, అండగా నిలిచి వుంటాడని భావం. నాడు కురుక్షేత్రంలో భగవద్గీతాదేశాన్ని పాటించి లక్ష్యసాధనలో విజయుడయ్యాడర్జునుడు. అలాగే నేటి జీవిత కురుక్షేత్రంలో భగవద్గీతాదేశాన్ని పాటించిన వారంతా లక్ష్యసాధకులు కాగలరన్న సంకేతాన్ని మానవాళికందిస్తున్నవి శ్రీకృష్ణభగవానుని మాటలు!

శ్రీకృష్ణభగవానుడు తిష్ఠవేసిన గీతాగృహం మూడంతస్తుల మేడ ఒక్కో అంతస్తు, ఆరుగదుల (అధ్యాయాల) విస్తీర్ణం కల్గి ఉంది. మొదటి అంతస్తులోని ఆరుగదులూ కర్మయోగ నిలయాలు, అందుకే వీటిని 'కర్మషట్కమ'ని అంటున్నాం. ఇక రెండవ అంతస్తులోని ఆరుగదులూ భక్తియోగానికి నిలయాలు కావున వీటిని 'భక్తిషట్కమ'ని అంటున్నాం. మూడవ అంతస్తులోని ఆరుగదులూ జ్ఞానయోగానికి నిలయాలు కాబట్టి వీటిని 'జ్ఞానషట్కమ'ని పిల్చుకుంటున్నాం. ఈ మూడంతస్థులలోని 18 గదుల నిండా నెలకొని యున్న జ్ఞాన భాండాగారంతోనే తాను ముల్లోకాలనూ పాలించగల్గుతున్నానన్న శ్రీకృష్ణ పరమాత్మ మాటలు ఈశ్వరుని సృష్టి ప్రణాళిక (సృష్టికి, ప్రగతికి, ప్రణాళిక) అంతా భగవద్గీతలోనే ఇమిడి ఉందని అంతర్లీనంగా తెలియజేస్తున్నాయి.

భగవద్గీతకు నామాంతరాలు

"ఇది భగవద్గీతలలో, ఉపనిషత్తులలో యోగశాస్త్రంలో, బ్రహ్మవిద్యలో, శ్రీకృష్ణార్జున సంవాదంలో అర్జున విషాద యోగ మనెడి ప్రథమాధ్యాయము" అంటూ ప్రతి అధ్యాయం చివరా చేయబడిన ప్రకటనలోని పేర్లన్నీ భగవద్గీతకు నామాంతరాలే. వాటి అంతరార్థాన్నిలా విశ్లేషించారు విజ్ఞులు.

1. భగవద్గీత : మనిషిని పశుత్వం నుండి మానవత్వానికీ, మానవత్వం నుండి దైవత్వానికీ ఎక్కదీసే ఆత్మజ్ఞానాన్నీ, ఆ దిశగా ఎదిగేందుకు నిర్వహించాల్సిన మానవ కర్తవ్యాన్నీ ప్రబోధిస్తున్న భగవంతుని గీత(పాట)! (భగవతాగీతా = భగవంతునిచే పాడబడినది) కావున 'భగవద్గీత'ని విజ్ఞుల విశ్లేషణ.

భగవతీగీతా = 'పూజనీయమైన పాట' గనుక యిది 'భగవద్గీత' ని కొందరు మిక్కిలి పూజ్యనీయమైన భగవంతునిపాట గనుక శ్రీమద్భగవద్గీతని మరికొందరు విశ్లేషించారు.

ధర్మా ధర్మాలకు – మానవ కర్తవ్యా కర్తవ్యాలకు – భోజ్యాభోజ్యాలకు సైతం హద్దుపెడుతూ భగవంతుడు గీచిన గీత (హద్దు) గనుక యిది భగవద్గీతని యింకొందరి యభిమతం.

2. ఉపనిషత్ : (ఉప+ని+సత్=ఉపనిషత్) ఉప=దగ్గర, ని=నిష్ఠతో, సత్=కూర్చుని యని అర్థం. 'తన చెంత శ్రద్ధాభక్తులతో కూర్చున్న శిష్యునకు ఏకాంతముగ గురువు చేయు ధర్మబోధ' యని భావం. గీత 2-7 "శ్రీ కృష్ణా! నాకేది శ్రేయస్కరమో నిశ్చయించుకోలేకున్నాను. నీ శిష్యునిగా శరణువేడుతున్నాను. దయచేసి నాకు బోధింపు "మంటూ చేతులు మోడ్చి సవినయంగా తనముందు కూర్చున్న అర్జునునకు శ్రీకృష్ణుడేకాంతముగ చేసిన ధర్మబోధ గనుక, భగవద్గీతకూడా 'ఉపనిషత్తే' నని విజ్ఞుల భావన.

3. బ్రహ్మవిద్య : బ్రహ్మ అంటే ఏమిటి? బ్రహ్మను చేరటమేలా? అని బ్రహ్మను గూర్చి తెలియజేస్తున్నది కాబట్టి, గీతకు 'బ్రహ్మవిద్య' అన్నది నామాంతరమే.

4. యోగశాస్త్రం : 'యుజ్' ధాతువు నుండి యేర్పడిన శబ్దం యోగం లేని దానిని పొందటాన్నే యోగం అని వాడుకలోని భావం. ఉదా॥ ఆహా వాడికి 'రాజయోగం', లక్ష్మీయోగం పట్టా యనటాన్ని వింటుంటాం కదా! ఐతే, యోగ = సంయోగం, ఉపాయం, విధానం మార్గం అంటూ యోగశబ్దానికి నానార్థాలున్నాయి. అందువలన 'యోగ' శబ్దాన్ని సందర్భానుగుణంగా అన్వయించుకుంటుండాలి. భగవద్గీత – మనిషి పరమాత్మతో సంయోగం (విలీనం) కావటాన్ని బోధించేశాస్త్రం. మనిషి పరమాత్మను చేరుకునే ఉపాయాన్ని తెలియజేస్తున్న శాస్త్రం కావున గీతను యోగశాస్త్రమనీయంటున్నారు.

5. శ్రీకృష్ణార్జున సంవాదం : ఉపనిషత్తులన్నీ శిష్య-గురు ప్రశ్నోత్తరాలతో కొనసాగిన సంవాదాలే అలాగే శిష్యుడైన అర్జునుని ప్రశ్న, గురువైన శ్రీకృష్ణుని జవాబులతో కొనసాగిన సంవాదం గనుక భగవద్గీతకు శ్రీకృష్ణార్జున సంవాదంఅను నామాంతర మేర్పడింది.

6. జ్ఞానేశ్వరి : జ్ఞానాలలోకెల్లా అత్యుత్తమమైన 'ఆత్మజ్ఞానాన్ని' ప్రబోధిస్తున్నది గనుక జ్ఞానేశ్వరి యని సంబోధించారు సంత్ శిరోమణి జ్ఞానేశ్వర్ !

7. గీతామాత : పలుసంక్షోభ సమయాలలో తనను తల్లిలా సేదతీర్చి ప్రోత్సహించిన భగవద్గీతను'గీతామాత' యని సంబోధించారు భారతజాతి పిత గాంధీ!

భగవద్గీతకు అష్టాదశ నామాంతరాలు

"గీతా గంగా చ గాయత్రీ సీతా సత్యా సరస్వతీ ।
బ్రహ్మవిద్యా బ్రహ్మ వల్లీ, త్రిసంధ్యా, ముక్తి గేహినీ ॥"

"అర్ధమాత్రా, చిదానందా భవఘ్నీ భ్రాంతినాశినీ
వేదత్రయీ పరానంతా తత్త్వార్ధ జ్ఞాన మంజరీ"

"ఇత్యేతాని జపేన్నిత్యం నరోనిశ్చల మానసః
జ్ఞానసిద్ధిం లభేత్‌శీఘ్రం తథాంతే పరమపదమ్"

1. గీత 2. గంగ 3. గాయత్రి 4. సీత 5. సత్య 6. సరస్వతి 7. బ్రహ్మవిద్య 8. బ్రహ్మవల్లి 9. త్రిసంధ్య 10. ముక్తిగేహిని 11. అర్ధమాత్ర 12. చిదానంద 13. భవఘ్ని 14. భ్రాంతినాశిని 15. వేదత్రయీ 16. పర 17. అనంత 18. తత్వార్ధ జ్ఞాన మంజరి అను యీ పద్దెనిమిది నామాలను ప్రతిరోజూ నిశ్చలబుద్ధితో జపించువారికి తక్షణం 'జ్ఞానసిద్ధి', అంతిమంగా పరమ పద ప్రాప్తి కల్గుతాయని భావం. (పద్దెనిమిది విశిష్టతలు కలిగిన భగవద్గీతను నిశ్చల బుద్ధితో అధ్యయనం చేసేవారికి జ్ఞానసిద్ధి, పరమపద ప్రాప్తి కల్గుతాయని అంతరార్ధం).

కావున 'ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీతా పాఠకులారా! ప్రతిరోజూ ఇందుకు కొంత సమయాన్ని కేటాయించి, ఈ అష్టాదశ నామాల భగవద్గీతను పఠిస్తూ మీరు ఫలసిద్ధిని పొందెదరు గాక! తథాస్తు!

ఉత్తమ గురువులు - ఉత్తమ విద్యార్థులు

సెలవుదినాన, భగవద్గీతా ప్రియులైన శిరీష, శ్వేత యను ఇద్దరు ఉత్తమోపాధ్యాయినులు జ్ఞాన తృష్ణగల కొందరు విద్యార్థులను తీసుకొని ఒక శుభోదయాన నా చెంతకొచ్చారు.

శిరీష : శుభోదయం గురువుగారూ! శ్రద్ధాసక్తులు గల కొందరు విద్యార్థినీ విద్యార్థులను తమ చెంతకు తీసుకొచ్చాము. దయచేసి వీరడిగే ప్రశ్నలకు జవాబులిస్తూ వీరి జ్ఞాన దాహాన్ని తీర్చవలసిందిగాను, భగవద్గీత పట్ల మా విద్యార్థులకు, మాకూ పూర్తి అవగాహనను కల్పించవలసిందిగా తమను అభ్యర్థిస్తున్నాం.

వ్యాఖ్యాత : మీకూ, మీ శిష్యులందరికీ శుభోదయం. తప్పకుండా, పరమాత్మ నాకు ప్రసాదించిన శక్తి మేరకు మీ అందరికీ భగవద్గీత పట్ల పూర్ణావగాహన కలిగించేందుకు ప్రయత్నిస్తాను. పాఠ్యగ్రంథాల ద్వారానేకాక, సెలవురోజుల్లో ఇలా ఆధ్యాత్మికంగానూ మీ విద్యార్థుల్ని తీర్చిదిద్దాలన్న మీ సంకల్పాన్ని స్వాగతిస్తున్నాను. ఇందుకు మిమ్మల్ని మరీ మరీ అభినందిస్తున్నాను. మీ అందరికీ పరమాత్మ కృప సర్వదా ప్రాప్తించుగాక!

శ్వేత : ప్రియమైన విద్యార్థినీ, విద్యార్థులారా! మీరంతా చక్కని క్రమ శిక్షణతో మసలుకోవాలి. మీలో ఎవ్వరడిగే ప్రశ్ననైనా, దానికి గురువు గారిచ్చే జవాబుతో సహా మీ అందరూ శ్రద్ధగా వినాలి. అలా అందరి ప్రశ్నలనూ వాటన్నింటి జవాబులనూ శ్రద్ధగా విని గీత పట్ల సుస్పష్టమైన అవగాహనను పెంచుకుంటారనీ, తద్వారా గీతా మార్గదర్శకత్వంలో మీరంతా పరమ గమ్యం దిశగా పయనిస్తూ, సమాజాన్నీ ప్రభావితం చేస్తారనీ, అలా పరమాత్మ ఆశయాన్ని నెరవేర్చి, ఆయనకు ప్రీతి కలిగిస్తారని ఆశిస్తున్నాం!

పిల్లలు : అలాగే టీచర్, మీ ఆశనూ, పరమాత్మ ఆశయాన్ని తప్పక నెరవేర్చుతాం! మాకీ సదవకాశాన్ని కల్పించినందుకు, మీకూ పెద్ద గురువు గారికీ కృతజ్ఞతాభివందనాలు!

శ్వేత : గురువుగారు మా శిష్యులను మీకు వరుసగా పరిచయం చేస్తున్నాను. 1. యువన్‌తేజల్ 2. హర్షవర్ధన్ 3. రిత్విక్ 4. ఆదిత్య 5. అగస్త్య 6. విద్యాధర్ 7. తరుణ్ 8. వశిష్ఠ 9. జయరాం 10.హిమాంశ్ 11. ఆరాధ్య 12. కావ్య 13. శ్రేష్ఠ 14. సాయికృత్తిక 15. ఊహాశ్రీ 16. హర్ష 17. దేవాంశ్ 18. విరాజ్‌ఉజ్వల్

శిరీష : మీరు పెద్ద గురువుగారిని తాతయ్యా, తాతగారు అంటూ సంబోధించవచ్చు. అందరూ ఒక్కసారి తాతగారికి నమస్కరించి ఆయన కెదురుగా కూర్చోండి.

విద్యార్థులు : మీకు మా నమస్సుమాంజలులు తాతగారూ!

వ్యాఖ్యాత : మీకూ, మీ గురువులైన శ్వేతా శిరీషలకూ శుభాశీస్సులు చిరంజీవులారా! కూర్చోండి. మీకు గీతాధ్యాపన చేస్తూ, నేనూ గీతాధ్యయనం చేస్తుంటాను. ముందుగా అవతార పురుషులు, వారి లక్ష్యం గూర్చి చెబుతాను శ్రద్ధగా వినండి.

అవతార పురుషులు! వారి లక్ష్యం!

అత్యుత్తమ అవతార పురుషుడు శ్రీకృష్ణుడు : "పనిచేసేందుకే పని" బాధ్యతా నిర్వహణ కొరకే బాధ్యత-ఫలాపేక్ష రహితంగా పరులను ప్రేమించుటే ప్రేమ - విధి నిర్వహణయే ఈశ్వరపూజ (వర్క్ ఈజ్ వర్షిప్) అన్న ఆదర్శం తొలిసారిగ భరతభూమిలోనే అత్యుత్తమ అవతార పురుషుడైన శ్రీకృష్ణుని నోటినుండి జాలువారినది అదే శ్రీమద్భగవద్గీత. గీతాసందేశం మొత్తాన్ని ప్రతిబింబింప జేస్తున్న (గీత2-7, 18-46) యీ రెండు శ్లోకాలను చదివిన చాలు భగవద్గీతను పూర్తిగా చదివిన ఫలం లభించినట్లే నన్నారు స్వామీ వివేకానంద.

గీత 2-7 : అర్జునా! భయపడకు, నీకీ పిరికితనం తగదు. హృదయ దౌర్బల్యాని వీడిలే, లేచి కర్తవ్యానికి పూనుకో! గీత18-46 విధి నిర్వహణ ద్వారా ఈశ్వరుని పూజించువాడే పరమగమ్యాన్ని చేరగలడంటూ అర్జునుని మిషతో శ్రీకృష్ణుడు మానవాళి కందించిన గీతా సందేశామృతమిదేనని విశ్లేషించారు స్వామి వివేకానంద.

యువన్ తేజల్ : అవతార పురుషుడంటే ఎవరు తాతగారూ?

వ్యాఖ్యాత : అవతారం / అవతరణం అంటే క్రిందికి (భూమ్మీదికి) దిగట మని యర్థం. అంటే విశుద్ధ బ్రహ్మ చైతన్యం (విశ్వ చైతన్యం) నుండి కొంత భూమ్మీదికి దిగి యేదో ఒక రూపంలో జన్మించిన వారిని అవతార పురుషుడు, అవతార స్త్రీమూర్తి యంటారని విజ్ఞుల విశ్లేషణ. ఇదే అంశాన్ని మహాత్మాగాంధీ యిలా వివరించారు. లోకంలో ప్రతి ప్రాణీ, ప్రతి మనిషీ, భగవదంశతో జన్మించిన వారే. ఐతే ప్రతియుగంలోనూ సర్వశ్రేష్ఠం. లోకోత్తరమూ ఐనట్టి ధార్మిక జాగృతి గల్గిన విశిష్ట వ్యక్తి జన్మిస్తుంటాడు. అట్టి వ్యక్తినే అవతార పురుషునిగ ఆరాధిస్తుంటుంది భావిసమాజం. ఈ సాంప్రదాయం ప్రకారం శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, గౌతమ బుద్ధుడు మొదలగు వారు అవతార పురుషులే నన్నారు గాంధీ.

హర్షవర్ధన్ : అవతార పురుషుల లక్ష్యమేంటి తాతయ్యా?

వ్యాఖ్యాత : మానవ సమాజాన్ని ఆ యా కాలాలకు, అవసరాల కనుగుణంగా మార్చేందుకు, పతన మార్గం పట్టిన సమాజాన్ని, విలువల ఇంధనంతో నింపి తిరిగి ప్రగతిపథాన పయనింపజేసేందుకై అవతరిస్తుంటారవతార పురుషులు" అని అన్నారు గాంధీ!

రిత్విక్ : మరి ఈ విధంగా చూసినప్పుడు శాంతి, అహింస, నిరాడంబరత, సర్వ మానవ సమానత, మత సామరస్యత, అస్పృశ్యతా నిర్మూలనాది విశిష్ట విలువల్ని సంతరించుకుని అహింసా మార్గాన భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి–భారత జాతి పితగ, ప్రపంచ శాంతిదూతగ, ఆరాధింపబడుతున్న మహాత్మాగాంధీని గూడ అవతార పురుషునిగ భావించవచ్చా తాతగారూ?

వ్యాఖ్యాత : నీ అవగాహనా శక్తికి అభినందనలు రిత్విక్! నిజమే ఆ దిశగా చూస్తే గాంధీలాంటి వారిని గూడ స్థాయీ భేదంతోనైనా అవతార పురుషునిగ, కారణ జన్మునిగ భావించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా పలు రంగాలలో ఆయా సంక్షోభాల నుండి మానవాళి నాదుకున్న, లేక సరైన దిశానిర్దేశం చేసిన చారిత్రక పురుషులను గూడ కారణ జన్ములుగ భావించవచ్చంటున్నారు విశ్లేషకులు.

శ్రీరామావతారము

ఆదిత్య : ముందుగా మాకు శ్రీరామావతార పురుషుని విశిష్టతను వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : త్రేతాయుగపు రాజైన శ్రీరాముడు "యథారాజా, తథాప్రజా" అనే రాజధర్మానికి శ్రీకారం చుట్టాడు. సామాన్య మానవునిలా ఎన్నో కష్టాల నెదుర్కొంటూనే సదా తాను ధర్మమార్గాన పయనిస్తూ, తన ప్రజలనూ తన వెంట నడిపించి ధర్మరాజ్యాన్ని నెలకొల్పిన ఆదర్శప్రభువు శ్రీరామచంద్రుడు. అట్టి లోకోత్తర ధార్మికుడైనందు వల్లనే, ఆయన బాణందెబ్బకు సాగరాన పడిపోయిన మారీచుడు సైతం "రామోవిగ్రహవాన్ ధర్మః సాధు సత్య పరాక్రమః" అంటూ శ్రీరాముని ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. అంతేకాదు, ఒక కుమారునిగ – సోదరునిగ – శిష్యునిగ – భర్తగ – మిత్రునిగ – తండ్రిగ – యజమానిగ – తనప్రవర్తన ద్వారా ఆదర్శవంతమైన కుటుంబ, వ్యక్తిగత, సంబంధ బాంధవ్యాలకు పునాది కూడా వేశాడు శ్రీరాముడు. అందుకే కౌసల్యా దశరథమహారాజుల ముద్దుబిడ్డ శ్రీరామునిచే నెలకొల్పబడిన ధర్మరాజ్యాన్ని ఆయన పేరిటే తమది శ్రీరామరాజ్యమంటూ సగర్వంగా చెప్పుకునేవారు నాటి ప్రజలు. యుగాలు మారినా, నేటికీ ప్రజలట్టి రామరాజ్యాన్నే కోరుకుంటున్నారంటే శ్రీరామావతారం, శ్రీరామరాజ్యాల విశిష్టత కింతకన్నా నిదర్శన మేం కావాలి?

మనసు+మాట+చేత= ఒక్కటి అయినట్టి ఆదర్శ ప్రభువుశ్రీరాముని మరొక విశిష్ఠత ఏకపత్నీవ్రతం – బహుభార్యత్వ మున్న నాటి రాచరిక వ్యవస్థలో, ముగ్గురు భార్యలున్న దశరథమహారాజు తనయుడై యుండి కూడ, ఏకపత్నీవ్రతాన్ని పాటిస్తూ తన ప్రజల కాదర్శంగా నిలిచి, మానవ సమాజ భద్రతకు బలమైన పునాది వేసిన పురుషోత్తముడు శ్రీరాముడు! అలాగే అపూర్వమైన ఏకసతీపత్నీవ్రతానికి పాటించి మహిళాలోకానికే

శిరోమణిగా నిలిచింది సీతమ్మ తల్లి! అలా ఏకసతీ పతీవ్రతానికి నిత్య ప్రతీకలుగా నిలిచారు సీతాశ్రీరామ చంద్రులు!

వీరి ఆదర్శ దాంపత్యాన్నింత విశిష్టంగ ఎందుకు ప్రసావించవలసి వచ్చిందంటే, ఆదిమ మానవులు గుంపులు గుంపులుగా జీవిస్తూ, ఒక స్త్రీ తన గుంపు పురుషులందరితోనూ – ఒక పురుషుడు తన గుంపు స్త్రీ లందరితోనూ పశుగణాల్లా విశృంఖల శృంగారంలో పాల్గొంటుండేవారు. తత్ఫలితంగా ప్రబలిన లైంగిక సుఖరోగాలు ప్రజలను సామూహికంగా బలిగొనటం ప్రారంభించినాయి. ప్రపంచవ్యాప్తంగా సదరు భయంకర సమస్యకు పరిష్కార మార్గాన్వేషణ ప్రారంభమైంది. కాలక్రమంలో పెన్సిలిన్ వంటి ఔషధాలను, నిరోధ్‌లను పరిష్కారాలుగ కనుగొన్నది పాశ్చాత్య ప్రపంచం! కానీ ఏకసతీ, పతీవ్రతమే సుఖ రోగాల నిరోధానికి తిరుగులేని ఆయుధమనీ అదే మానవాళి సుదీర్ఘ, సుక్షేమ, మనుగడకు రాచమార్గమన్న సత్యాన్ని ఆవిష్కరించారు భారతీయ మహర్షులు! అంతేగాదు, ఒక పురుషుడు, ఒక స్త్రీ జీవితాంతం కలిసి జీవించే వివాహ వ్యవస్థకు రూపకల్పన గూడ చేశారు!

అప్పటిదాకా ధర్మ మార్గంలోనే ధనం సంపాదించుకునే నియమానికి ధర్మ మార్గంలోనే కామం(భార్య భర్తతో – భర్త భార్యతో మాత్రమే) తీర్చుకునే నియమాన్ని జోడించారు మహర్షులు. మానవులు తమ పరమ గమ్యమైన మోక్షాన్ని పొందటానికి పై రెండు నియమాలను విధిగా పాటించాలని దిశానిర్దేశం చేశారు మన పెద్దలు. 'ధర్మ–అర్ధ–కామ–మోక్ష' మార్గమంటే అదే. సదరు ధర్మమార్గాన్ని జీవితాంతం పాటించిన ఆదర్శ దంపతులు సీతా శ్రీరామచంద్రులు... నాడు తన రామరాజ్యంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన ఈ విశిష్ట సంప్రదాయం నాడు–నేడు–రేపు సర్వదా, సర్వత్రా సమస్త మానవాళికీ శిరోధార్యం. మన మహర్షులచే ఆవిష్కరింపబడి, సీతా శ్రీరామచంద్రులాచరించి చూపిన యీ ధర్మార్థ కామ మోక్షమార్గమే

మానవాళి సుదీర్ఘ మనుగడ, ప్రశాంత సామాజిక జీవనాలకు శ్రీరామ రక్ష అన్నది నిత్య సత్యం !

అందుకే శ్రీరాముడు చూపిన ధర్మమార్గాన జీవిస్తే తమకు, తమ దేశానికి ఆపదలు దూరం కాగలవన్న విశ్వాసాన్ని కల్గియున్నది ప్రజానీకం. అంతేగాదు, ధర్మమార్గాన ఎవ్వరేపని జేసినా వారికి శ్రీరాముని అండదండ లుంటాయని నమ్ముతూ **"ఆపదా మపహర్తారం, దాతారం సర్వసంపదామ్, లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్" అంటూ శ్రీరాముని ఆరాధిస్తున్నారు ప్రజలు. మరియు "శ్రీరామ–రామ–రామేతి రమే, రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం శ్రీ రామనామ వరాననే"** అంటే సుమనోహరమైన 'శ్రీరామ, రామ, రామ' యను పదత్రయమే 'విష్ణు సహస్రనామ స్తోత్రంతో' సమాన పుణ్య ఫలదాయక మన్న భావనతో నేటికీ రామనామ జపం చేస్తూ శ్రీరాముని ధర్మమార్గాన్ననుసరించేందుకు తాము యత్నిస్తూ తమ బిడ్డల నాదిశగా ప్రోత్సహిస్తున్నది భారతీయ సమాజం.

సీతాశ్రీరామచంద్రుల ఆశీస్సులతో భారతీయులంతా సదా వారి ధర్మమార్గాన పయనిస్తూ పరమగమ్యానికి చేరెదరు గాక! తథాస్తు!! భరతమాతకు సమస్త మానవాళికీ, ప్రాణి కోటికీ శుభమస్తు!

శ్రీకృష్ణావతారం

అగస్త్య : తానాచరిస్తూ ప్రజల నాచరింపజేసిన శ్రీరామావతార పురుషునిపట్ల మాకు మరింత పూజ్యభావం పెరిగింది తాతగారూ! మరి విశ్వగురువుగా విరాజిల్లుతున్న శ్రీ కృష్ణావతార పురుషుడూ అలాగే చేశాడా?

వ్యాఖ్యాత : లేదగస్త్యా! శ్రీకృష్ణభగవానుడలా చేయలేదు. శ్రీరాముని త్రేతాయుగం గడిచి, శ్రీకృష్ణుని ద్వాపర యుగమొచ్చేసరికి మానవసంఖ్య వారినివాస ప్రాంతాలు గూడ బాగావిస్తరించినాయి. ఆయాప్రాంతాల భౌగోళిక శీతోష్ణాది పరిస్థితుల కనుగుణంగా భారత ఉపఖండంలో భిన్న జాతులు, జీవన విధానాలు, భిన్న భాషలు, సంప్రదాయాలు వెలిసినాయి. అలాంటి స్థితిలో ఏదో ఒక ప్రాంత సంప్రదాయానుగుణంగా ఆదర్శంగా జీవిస్తూ విభిన్న ప్రాంతాల, సంప్రదాయాల ప్రజలందర్నీ ప్రభావితం చేసి ధర్మమార్గాన నడిపించుట అసాధ్యం. అదీగాక సంపద, తెలివితేటలు పెరిగేకొద్దీ మానవులు నైతికంగా దిగజారుతూ పతన మార్గం పడుతున్నారు. 'ధర్మ–అర్థ–కామ–మోక్ష' కర్తవ్యాల నుండి ధర్మాన్నీ, మోక్షాన్నీ గాలికొదిలేసి, కేవలం 'అర్థ' (ధనా)న్నీ 'కామాన్నే' స్వాగతిస్తున్నారు. ఫలితంగా ధర్మంగా డబ్బు సంపాదించటానికి, ధర్మంగా కామం తీర్చుకోటానికి బదులుగా ఏం చేసైనా డబ్బు సంపాదించటానికీ, ఎలాగైనా కామం తీర్చుకోటానికీ తెగపడుతున్నా రత్యధికులు! అందుకే సమాజంలో అవినీతి, అక్రమాలు, అత్యాచారాలు, హత్యలు చెలరేగినాయి. ఉదా।। దాయాదుల రాజ్యాపహరణార్థం కౌరవులాడిన మాయాజూదం, ద్రౌపదీ వస్త్రాపహరణ యత్నం వంటి ఆకృత్యాలు, పాండవులకు విషాహారమివ్వటం, వారు నిద్రిస్తున్న లక్క్యింటికి నిప్పుపెట్టడం వంటి కౌరవుల హత్యాప్రయత్నాలు అందుకు కొన్ని నిదర్శనాలు!

అలా పతన మార్గం పట్టిన సమాజాన్నుద్ధరించటానికై తను కేవలం శ్రీరాముని‌లా ఆదర్శవంతంగా జీవిస్తే చాలదనీ, సమాజ పతనానికి మూల కారణాలను తెలియజేసి తమలోపాలను గ్రహించి తమను తామే సంస్కరించుకుంటూ సముద్ధరించుకునేలా 'ఆత్మ జ్ఞానబోధ' ద్వారా ప్రజల్ని చైతన్యవంతం చేయ సంకల్పించాడు శ్రీకృష్ణావతార పురుషుడు. అందుకే అట్టి జ్ఞానబీజాన్ని నాటేందుకు సారవంతమైన క్షేత్రం, మరియు సరైన అదునుకోసం వేచి చూస్తున్న శ్రీకృష్ణునకు, మార్గశిర శుద్ధ ఏకాదశినాడు ధర్మాధర్మ విచక్షణను కోల్పోయి కురుక్షేత్ర రణరంగాన దుఃఖంలో కూరుకుపోయిన అర్జునుడు కనిపించాడు. సూక్ష్మ గ్రాహి, ఏకసంథాగ్రహి, సామాజిక బాధ్యత నెరిగినవాడు, విధినిర్వహణా సమర్థుడు, సున్నిత హృదయుడైనట్టి అర్జునుని సారవంతమైన క్షేత్రం గాను అప్పటి సమయ సందర్భాలనే సరైన అదును, పదునుగా, పసిగట్టాడు శ్రీకృష్ణుడు. అట్టి విశిష్ట లక్షణాలున్న వ్యక్తికి బోధిస్తే తద్వారా అతను లక్ష్య సాధకుడు కావటమే గాక, తను పొందిన జ్ఞానాన్ని భావితరాలవారి కందించే సామాజిక కర్తవ్యాన్ని సైతం నెరవేర్చగలడు. అంతేగాక, విషాద(దుఃఖ) సంక్షోభంలో కూరుకుపోయిన వ్యక్తి పాదరసం లాంటివాడు. అతనిలో చిన్న ఆలోచనను రేకెత్తించినా చాలు, కాస్త వేడి తగలగానే చటుక్కున ఎగబాకే పాదరసంలా అల్లుకుపోతాడు. అసామాన్య సాహసంతో లక్ష్యాన్ని సాధిస్తాడు! అంతేగాక **దుఃఖ ప్రయోజనాలేమంటే? 1. దుఃఖం గురువై బోధిస్తుంది. 2. దుఃఖిత హృదయం మృదువై, పరుల కష్టాల పట్ల సానుభూతి చూపుతుంది. 3. తన సరైన కర్తవ్యాన్ని స్ఫురింపజేస్తుంది. 4. దుఃఖావేశం వివేకాన్ని కల్గించి లోకస్థితి గతుల పట్ల అవగాహన కలిగిస్తుంది. 5. జ్ఞానార్జనాసక్తిని కలిగిస్తుంది.** ఉదాహరణకు శ్రీరాముని, సిద్ధార్థుని వంటి వారిని లోక కళ్యాణార్థం ప్రేరేపించింది వారి దుఃఖావేశమే గదా! అందుకే దుఃఖ వర్షంతో తడిసి పదునైన అర్జునుని హృదయక్షేత్రంలో 'ఆత్మజ్ఞాన' బీజాన్ని విత్తాడు

శ్రీకృష్ణభగవానుడు. అది చక్కగా మొలిచి మొక్కై, మానై, మహావటవృక్షంలా దశదిశలా విస్తరించింది. నేడు 18 అధ్యాయాలు 700 గీతలుగా విరాజిల్లుతున్న శ్రీమద్భగవద్గీత అదే! గీతా రూపంలో విశ్వగురువుగా విరాజిల్లుతున్నాడు శ్రీకృష్ణావతార పురుషుడు!

దేవాంశ్ : శ్రీకృష్ణుడు బోధించిన దొక్క అర్జునునకే గదా! మరి ఆయన విశ్వగురువెలా అయ్యాడు?

తరణ్ : తన పట్ల పూర్తి భక్తి, విశ్వాసాలు గల అర్జునుని గద్దించో, గాండ్రించో, కర్తవ్యోన్ముఖుని చేయగలడు గదా శ్రీకృష్ణుడు, మరి ఆ మాత్రం దానికింత పెద్ద గీతోపదేశం అవసరమా తాతగారూ?

వ్యాఖ్యాత : చిరంజీవులారా! ప్రశ్నించింది మీ ఇద్దరే గానీ, వాస్తవానికి ప్రజానీకపు సందేహాలివి. తరణ్, నీవన్నట్లు శ్రీకృష్ణుడర్జునుని ఆజ్ఞాపించో లేక ఏమయ్యా అర్జునా మీకు విషాహారమిచ్చి, మీరు పడుకున్న యింటికి నిప్పంటించి, నిండు సభలో నీ భార్య బట్టలూడదీయించ పూనుకున్న వారిని, ఈ ఘోరాలన్నింటినీ చూస్తూ గూడ మౌనం వహించిన వారినీ, నీ బంధువులనీ, గురువులనీ చెప్పుకోటానికి నీకు సిగ్గనిపించటం లేదా? అని, రాజ్యం వీరభోజ్యం మీకు దమ్ముంటే, మమ్ముగెల్చి రాజ్యాన్ని తీసుకోమంటూ కౌరవులు విసిరిన సవాలును స్వీకరించి రణభూమికొచ్చి, తీరా యుద్ధ ప్రారంభ సమయానికి విల్లమ్ములు పారేసి యేడుస్తూ కూర్చున్న నీవసలు వీరుడివేనా? అని రెచ్చగొట్టో, అతన్ని కర్తవ్యోన్ముఖుని చేసియుండే వాడేనా? శ్రీకృష్ణుడు. ఇందులో సందేహానికి తావేలేదు. సామాన్యులు చేసేపని అదే! ఐతే అలా చేయదల్చుకోలేదు శ్రీకృష్ణావతార పురుషుడు. ఎందుకంటే? అజ్ఞాపించడం లేక రెచ్చగొట్టడం ద్వారా ఒక వ్యక్తిలో గలిగే స్పందన తాత్కాలికం. సానుకూల ఫలితం వస్తే అది నిల్చి ఉంటుంది. వ్యతిరేక ఫలితం వస్తే మాత్రం సదరు వ్యక్తి జావగారి పోవటమే గాక దీనికంతటికీ

కారణం తనను ప్రేరేపించిన వ్యక్తేనంటూ అతన్ని తూలనాడే ప్రమాదం లేక పోలేదు. అలా కాకుండా తను యుద్ధం చేయకుంటే తనకే గాదు అది లోకానికే ఎంత నష్టదాయకమో, సహేతుక జ్ఞానబోధ ద్వారా ప్రోత్సహించబడిన వ్యక్తి మాత్రం స్వచ్ఛందంగానే కర్తవ్యోన్ముఖుడై, లాభనష్టాలు, జయాపజయాల కతీతంగా కడదాకా లక్ష్యసాధనకోసం పోరాడతాడన్నది వాస్తవం!

అంతేగాదు "మనిషిలో నిద్రాణమై యున్న శక్తియుక్తుల్ని వెలికితెచ్చి ఆచరణలో పెట్టించగలిగేది సుస్పష్టమైన జ్ఞానం మాత్రమే". అట్టి నిర్మల జ్ఞానాన్నందించ గల్గేదే విద్య! అట్టి విద్యను బోధించగల్గిన వాడే అసలైన గురువు! అన్నారు పెద్దలు. అందుకే విద్యను ఆంగ్లంలో **'ఎడ్యుకేషన్'** అన్నారు. **ఎడి =** అణగారియున్న **శక్తుల్ని కో =** పట్టి లాగునది అనే రెండు ధాతువుల నుండి రూపొందినదే ఎడ్యుకేషన్ అను పదం. తన కర్తవ్యాన్ని నిర్ద్వంద్వంగా తెల్సుకోగల్గిన జ్ఞానికి కర్తవ్య నిర్వహణలో అతని శక్తి, యుక్తులు రెట్టింపు ఔతాయి. అందుకే గీత 4-38 లోకంలో జ్ఞానం కన్నా పవిత్రమైంది మరొకటి లేదని, ప్రబోధిస్తున్నది. 'విద్యను మించిన గొప్ప బహుమతి మరొకటి లేదన్నారు మహాత్మాగాంధీ అందుకనే, అట్టి పవిత్రజ్ఞాన బోధ ద్వారా తనను తాను సంస్కరించుకునేలా, స్వచ్ఛందంగానే కర్తవ్యోన్ముఖుడయ్యేలా అర్జునుని చైతన్యపరచాలని నిశ్చయించుకున్నాడు శ్రీకృష్ణుడు. అంతే, ఆయన ముఖారవిందంనుండి జాలువారిన గీతలు చైతన్య వర్షంతో అభిషేకించినాయి అర్జునుని! అంతేగాదు –

'ధర్మోరక్షతి రక్షితః! అన్న సత్యాన్ని తొలుత అర్జునునకు, అతని ద్వారా భావితరాల వారికందజేస్తే తద్వారా ప్రతి వ్యక్తీ తనను తాను సంస్కరించుకుంటూ, ధర్మాన్ని కాపాడటం కోసం పోరాటానికైనా, సంసిద్ధుడౌతాడనీ, అప్పుడు సమాజం సుఖశాంతులతో వర్ధిల్లగలదన్న

లక్ష్యంతో ఆనాడర్జునునకు గీతోపదేశం చేశాడు శ్రీకృష్ణుడు. సదరు ఉపదేశానంతరం గీత-18-8లో "మిక్కిలి గోప్యంగా ఉండిపోయిన ఈ అపూర్వ (ఆత్మ) జ్ఞానాన్ని నా భక్తుల కందించిన వాడు తప్పక పరమ గమ్యాన్ని చేరగలడర్జునా" అంటూ తన ఈ గీతాజ్ఞానాన్ని భావితరాల కందించవలసిందిగా అర్జునుని అన్యాపదేశంగా ఆదేశించాడు శ్రీకృష్ణుడు. -సదరు గీతాజ్ఞానం ద్వారా కర్తవ్యోన్ముఖుడైన అర్జునుడు ధర్మపోరాటంలో విజయు డయ్యాడు. కురుక్షేత్ర యుద్ధానంతరం వ్యాసాది కృష్ణభక్తులందరికీ, శ్రీకృష్ణుడు తనకు బోధించిన గీతాజ్ఞానాన్ని అందించి తన సామాజిక కర్తవ్యాన్ని శ్రీకృష్ణుని ఆశయాన్ని నెరవేర్చాడర్జునుడు.

ఆనాడు అర్జునుడందించిన పరిమిత గీతల భావాన్ని సప్తశతి శ్లోకాలుగ విస్తరింపచేశాడు వ్యాసుడు. అదే నేడు ప్రపంచ వ్యాప్తంగా విరాజిల్లుతున్న శ్రీమద్భగవద్గీత ! ఆనాడర్జునున కొక్కనికే బోధించినా, నేడు విశ్వవ్యాప్తమైన గీతా రూపంలో విశ్వగురువై విరాజిల్లుతున్నాడు. శ్రీకృష్ణుడు! - అంతేగాదు జగత్ (ప్రపంచం) (గచ్ఛతీతిజగత్) అంటే సదా మారుతుండే స్వభావం కలది జగత్తని భావం. నిరంతరం పరిణామం చెందే ప్రపంచ స్వభావాన్ని ఎప్పటి కప్పుడు అవగాహన చేసుకుంటూ తదనుగుణంగా దిశానిర్దేశం చేయగల్గినవాడే జగద్గురువు! అంటే మారుతున్న ప్రపంచంలో మనిషియొక్క సామాజిక బాధ్యతను, దాన్ని నెరవేర్చటానికతని కర్తవ్యాన్నీ ప్రబోధించగలిగిన వాడే జగద్గురువన్నది విజ్ఞుల విశ్లేషణ. అట్టి అర్హత వల్లనే గీతాచార్యునిగ శ్రీకృష్ణుడు - గీతా గ్రంథరూపశిల్పిగా వ్యాసుడూ విష్ణ్వంశ సంభూతులైన వారిరువురూ 'జగద్గురువులు'గా ప్రవర్ధిల్లుతున్నారు. 'తన ధర్మాచరణ ద్వారా ప్రజల్ని ధర్మ మార్గాన నడిపించాడు శ్రీరామావతార పురుషుడు!' 'ధర్మాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకతను తెలియజేసి, ప్రజలు తమకు తామే ధర్మాన్ని కాపాడుకునేలా, తమను తామే ఉద్ధరించుకునేలా ప్రబోధించాడు

శ్రీకృష్ణావతార పురుషుడు'. ఆయన బోధనే 'భగవద్గీత'! కావున చిరంజీవులారా **'గీతానిర్దేశిత మార్గమంటే, భగవన్నిర్దేశిత మార్గమే' సుమా!**

'భగవద్గీతా మార్గదర్శకత్వంలో పయనించటమంటే, భగవంతుని మార్గదర్శకత్వంలో పయనించటమేసుమా' అందుకే 'ప్రజామార్గదర్శిని శ్రీమద్భగవద్గీత' అని అన్నారు విజ్ఞులు. కాబట్టి, సహోదర భారతీయులారా! ప్రియమైన భావిభారత పౌరులారా! నేనూ, మీరూ మానవులందరం సదా భగవద్గీతా నిర్దేశిత మార్గాన పయనించెదము గాక. భరత మాతతో సహా యావత్ ప్రపంచాన్నీ సచ్చిదానంద నిలయంగా రూపొందించుకొందము గాక!

తథాస్తు చిరంజీవులారా! విజయోఽస్తు!

పతన కారణం - పరిష్కార మార్గం

హిమాంశ్ : సమాజ పతనానికి కారణమేంటి ? అందుకు పరిష్కారమేంటి తాతగారూ?

వ్యాఖ్యాత : ప్రమాద రహిత ప్రయాణార్థం మనం కొన్ని ప్రయాణ నిబంధనలను రూపొందించుకున్నట్లే తన సృష్టి గూడ ప్రమాద రహితంగా సాగిపోయేందుకు సృష్టిలోని జీవ, నిర్జీవ పదార్థాలన్నింటా 'సృష్టి నియమ నిబంధనలను' నిక్షిప్తం చేశాడు పరమాత్మ. ఉదాహరణకు పరమాణువులోని ఎలక్ట్రాన్లకు-సూర్య కుటుంబంలోని గ్రహాలకు-పాలపుంతలోని నక్షత్రాలకు - అంతరిక్షంలోని గెలాక్సీలకు నిర్ధిష్ట దిశ, కక్ష్య, వేగాలను - అలాగే ప్రాణుల్లోని వివిధ అవయవాలకూ, కొన్ని నియమాలను నిక్షిప్తంజేశాడు పరమాత్మ! అత్యున్నత ప్రాణులమైన మన మానవులకు సైతం 'ధర్మ-అర్థ-కామ-మోక్ష మార్గాన్ని' నిర్దేశించాడు పరమాత్మ. మరి తదనుగుణంగా పరిభ్రమిస్తున్నందు వల్లనే, పరమాణువునుండి పాలపుంతలదాకా, యుగయుగాలుగా విశ్వగమనం సజావుగా సాగుతున్నది! ప్రాణులలోని ప్రతి జీవకణం, ప్రతి అవయవమూ సృష్టి నియమానుగుణంగా నడుస్తున్నందు వల్లనే ప్రాణులన్నీ మనగల్గుతున్నయ్! కానీ, మానవులు మాత్రం సృష్టికర్త నిర్దేశించిన ధర్మమార్గాన్ని వీడి, విశృంఖలంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే పలు సంక్షోభాలకు గురై పతన మార్గం పట్టింది మానవ సమాజం. **కాబట్టి, పోరాడి అయినా ధర్మాన్ని కాపాడుకోమంటూ అర్జునుని మిషతో మానవాళిని నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత. 'ధర్మపరిరక్షణమే, పతన మార్గం నుండి, సమాజాన్ని ప్రగతి పథానికి మళ్ళించేందుకు ఏకైక పరిష్కారమని నిర్దేశిస్తున్నాడు పరమాత్మ!**

తరణ్ : సమాజ భద్రతకు ధర్మపరిరక్షణమే ఏకైక పరిష్కారమార్గమని ఎలా చెప్పగలరు తాతగారూ?

వ్యాఖ్యాత :

"యత్స్యాద్ధారణ సంయుక్తా సధర్మ ఇతి నిశ్చయః
ధారణాద్ధర్మ ఇత్యాహుః, ధర్మోధారయతే ప్రజాః ॥" - మనుస్మృతి - అంటే మానవులు సామూహికంగా ఆచరించేదే ధర్మం. ఉదాహరణకు అవయవాలు సంయుక్తంగా చర్మాన్ని ధరించినట్లన్నమాట. చర్మం గనక శిథిలమైతే అవయవాలన్నీ ఒకే దేహంలా కలిసి యుండలేక వేటికవే విర్లబడి నశిస్తాయి. అలాగే మానవులచే సంయుక్తంగా ధరించబడే ధర్మం గూడ శిథిలమైతే మనుషుల్ని కలిపివుంచే సంబంధాలు, కట్టుబాట్లు సడలిపోయి చర్మంలేని అవయవాల్లా, మానవులు గూడ నశిస్తారని ధర్మశాస్త్రం హెచ్చరిస్తున్నది. అందువలన అవయవ సంరక్షణకు వాటిచే సంయుక్తంగా ధరించబడే 'చర్మ పరిరక్షణ' అవశ్యమైనట్లే, మానవ సమాజ భద్రతకు మానవాళిచే సామూహికంగా ధరించబడే ధర్మాన్ని కాపాడుకోవటమూ అవశ్యమేననీ - అవయవాల భద్రతకు 'చర్మం' లా - సమాజ భద్రతకూ ధర్మమే 'ఏకైక రక్షణ కవచ' మనీ స్పష్టమౌతున్నది గదా!

"ధర్మో రక్షతి రక్షితః

శ్రేష్ఠ : ధర్మాన్ని మనం కాపాడుకుంటే, ధర్మం మనల్నెలా కాపాడుతుందో దయచేసి వివరిస్తారా? తాతగారూ?

వ్యాఖ్యాత : ధర్మాన్నీ, సజ్జనులనూ–పండ్ల చెట్లు, పైరులతోను, అధర్మాన్నీ, దుర్జనులను – ముళ్ళచెట్లు, కలుపు మొక్కలోనూ పోల్చవచ్చు.

పళ్ళచెట్లను, పైరులను ఎక్కిరాకుండా తొక్కేసే ముళ్ళచెట్లను, కలుపుమొక్కల్ని నిర్మూలించుకుంటేనే అవి బాగా ఫలించి మనల్ని పోషిస్తాయి. అలాగే అధర్మాన్నీ, దుష్టుల్ని అడ్డు తొలగించి, ధర్మాన్నీ, సజ్జనుల్నీ, కాపాడుకోగల్గితేనే వారు సమాజానికి సుఖశాంతుల నందిస్తారు.

'దుష్టశిక్షణ, శిష్టరక్షణ' అంటూ శ్రీకృష్ణ భగవానుడు తన గీతోపదేశం ద్వారా మానవాళికందిస్తున్న సందేశమదే! "అధర్మాన్నీ, దుష్టుల్నీ శిక్షించి, ధర్మాన్నీ, సజ్జనుల్నీ కాపాడుకోండి. అవి మిమ్ము కాపాడుతాయి" అని నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత!

కావ్య : ధర్మరక్షణార్థం యుద్ధానికైనా వెనకాడ వద్దంటున్నాడు శ్రీకృష్ణభగవానుడు, ఇదెంత వరకు సమంజసం తాతగారూ?

వ్యాఖ్యాత : ఎందుకంటే? **ధర్మంకోసం పోరాడి తన ప్రాణాన్ని పణంగా పెట్టి అయినా సరే ధర్మాన్ని కాపాడుకోగల్గితే, అప్పుడాధర్మం అతను లేనప్పటికీ అతని కుటుంబ సభ్యులతో సహా ప్రజలందర్నీ కాపాడ గల్గుతుంది. అదే ప్రాణభయంతో ధర్మ రక్షణార్థం పోరాడక నాకెందుకు లెమ్మని చూస్తుండిపోతే అప్పుడు, నశించిన ధర్మంతో పాటు అతనూ, అతని కుటుంబ సభ్యులతో సహా ప్రజలంతా నశిస్తారు!** అందువల్ల ప్రాణభయంతో ధర్మాన్ని కాపాడుకోవడానికి వెనకాడితే, ధర్మం నశించి, నశించిన ధర్మంతో పాటు అతను, అతని కుటుంబ సభ్యులతో సహా ప్రజలందరి నాశనానికి

కారకుడౌతాడు. అలా సర్వ వినాశకుడు కావటం కంటే తను మరణించినా సరే పోరాడి ధర్మాన్ని కాపాడగల్గితే, ఆధర్మంతో పాటు తన వాళ్ళను, ప్రజానీకాన్ని కాపాడగల్గిన త్యాగశీలుడౌతాడు. అది కీర్తిదాయకం, లోకకళ్యాణ దాయకం కదా! అందుకే ధర్మరక్షణార్థం యుద్ధానికైన వెనకాడ వద్దని అర్జునుని మిషతో మానవాళిని నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత!

ఉదా॥ "సారపుధర్మమున్... దైవముండెడిన్" అంటూ తిక్కన భారతపద్యమిలా నిర్దేశిస్తున్నది. అసత్య, అధర్మాల చేత అపవిత్రమౌతూ, సత్యం, ధర్మం, శక్తిని పుంజుకోలేక సమాజం చెడిపోతున్నప్పటికీ (భీష్మ, ద్రోణ, కర్ణాది) సమర్థులు సత్య, ధర్మరక్షణకు పూనుకోక చూస్తూ మిన్నకుండిపోయినా, అందరితోపాటు వారూ నశించిపోతారే గాని (వారూహించినట్లు) సత్య, ధర్మాలు నశించవు గాక! ఎందుకంటే సత్య, ధర్మ శుభదాయకుడైన దేవుడున్నాడు గదా వాటిని కాపాడటానికి!"

అదీగాక! "మానవ మేధస్సును అధర్మమార్గాన, అపరాధపు బాటన నడిపించేది అధికార దాహమే నన్నాడు చాణుక్యుడు. పాండవ రాజ్యాపహరణార్థం కురుక్షేత్ర యుద్ధాన్ని సృష్టించిన దుర్యోధనుడే అందుకు నిలువెత్తు నిదర్శనం. నాడే కాదు, నేడూ అధికార దాహార్తిని చూస్తూనే యున్నాం. నాడు కౌరవులూ – నేడు అపర కౌరవులూ అధికార ధన దాహార్తితో యుద్ధాలను, విధ్వంసాలను సృష్టిస్తూనే యున్నారు. నాడు దుర్జన కౌరవులపై యుద్ధం చేసైనా ధర్మాన్ని కాపాడుకోమంటూ పాండవులను, అర్జునునీ ప్రేరేపించినట్లే – నేడూ అధికార దాహార్తితో ధర్మాన్ని పాతిపెట్టేందుకు విజృంభిస్తున్న అపర కౌరవులపై గూడ తిరగబడి, పోరాడి, విప్లవించైనా సరే, ధర్మాన్ని కాపాడుకోమంటూ నేటికీ, మానవాళినీ తన గీతోపదేశం ద్వారా చైతన్యపరుస్తూనే యున్నాడు శ్రీకృష్ణావతార పురుషోత్తముడు!

సాయికృత్తిక : కానీ, నేడు 99%గా వున్న అధర్మపరులపై 1%గా వున్న ధర్మాత్ములెలా పోరాడగలరు తాతయ్యా?

వ్యాఖ్యాత : నేడే గాదు, ఆనాడు గూడ ధర్మం కోసం పోరాడిన పాండవులల్ప సంఖ్యాకులే గదా, వారిలోనూఅర్జునుని వంటి వీరులు, శ్రీకృష్ణుని వంటి జ్ఞానులూ అత్యల్ప సంఖ్యాకులే గదా! ఉదాహరణకు తమ పంటచేనిలోని కోట్లాది కలుపు మొక్కల్ని కేవలం ఒక్కరైతు కుటుంబం పదే పదే పీకీ పీకీ, దున్నీ దున్నీ, నిర్మూలించుకో గల్గుతుంది గదా? అలా **సమాజమనే పంట పొలంలో గూడ మళ్ళీ మళ్ళీ పుట్టుకొచ్చే కలుపు మొక్కల్లాంటి దుష్టుల్ని గూడ ధార్మికులనెడు రైతులు ఎలాగోలా నిర్మూలించుకోక తప్పదు మరి!**

మానవ సమాజంలో నిరంతరం జరుగుతుండే యీ ధర్మ పోరాటంలో పాల్గొనువారికి స్ఫూర్తినీ, ఆత్మ విశ్వాసాన్నీ కలిగించేదే, నాటి పాండవ విజయం! 'అధర్మం ఎంతగా విర్రవీగినా, అత్యధిక సంఖ్యాకులమని అధర్మాత్ములెంతగా విజృంభించినా, వారికి అర్ధాయుష్షేసుమా' 'అల్ప సంఖ్యాకులైనా సరే, ధర్మాత్ములు ధర్మాన్ని కాపాడుకోగల్గుతారు. అన్న సంకేతాన్ని మానవాళికందించేందుకే – తన గీతోపదేశం ద్వారా అర్జునుని చైతన్యవంతుని చేసి అత్యధికులైన దుష్టకౌరవులను శిక్షింపజేసి అల్పసంఖ్యాకులైనసజ్జన పాండవులకు విజయాన్ని చేకూర్చాడు శ్రీకృష్ణావతార పురుషుడు! అంతేగాదు, ధర్మాత్ములకు, ధర్మంకోసం పోరాడే వారికి సదా పరమాత్మ అండదండలుంటాయని చెప్పకనే చెబుతున్నాడు పాండవ పక్షం నిలిచిన శ్రీకృష్ణుడు!

ఊహాశ్రీ : అధర్మాత్ములైన కౌరవులవైపు ఎక్కువ (11 అక్షౌహిణీల) మంది – ధర్మాత్ములైన పాండవులవైపు తక్కువ (7 అక్షౌహిణీల) మంది దన్నుగా నిలిచారెందుకనీ? నాడేకాదు నేడుకూడ అధర్మం వైపే అత్యధికులాకర్షింప బడుతున్నారెందుకు తాతగారూ?

వ్యాఖ్యాత : అధర్మమన్నది–1 తక్షణ ప్రయోజనాలను, కిర్రెక్కించే సుఖాలను అల్పశ్రమకు అధిక లాభాలనిస్తుంటుంది. 2. మానవ బలహీనతల నాధారం

చేసుకుని ప్రలోభపెట్టో భయపెట్టో, అత్యధికుల్ని తనవైపు సమీకరించుకోవటం అధర్మానికి సహజ గుణం.అందుకే అత్యధికులు అధర్మంవైపు ఆకర్షింపబడుతున్నారు. కానీ ధర్మం దీర్ఘకాలిక క్షేమాన్ని, సుఖశాంతులను ప్రసాదిస్తుంది. – సుదీర్ఘ కాలం శ్రమిస్తే గాని ఫలితాన్ని ప్రసాదించదు. ఎవర్నీ తనవైపు సమీకరించుకునేందుకు యత్నించదు. కానీ, స్వచ్ఛందంగా తన పక్షం వహించిన వారికి గొప్ప నైతిక బలాన్ని సమకూర్చుకొనటం ధర్మం యొక్క నైజం! అందుకే, అత్యధికులు అధర్మం పక్షాన – స్వల్ప సంఖ్యాకులు ధర్మం పక్షానా నిలుస్తున్నారు.

ఆరాధ్య : మరి ధర్మం గూడ అభ్యర్థించో, ప్రలోభపెట్టో ఎక్కువ మందిని ఆకర్షింపవచ్చు గదా తాతయ్యా?

వ్యాఖ్యాత : ప్రలోభపెడితే అది ధర్మమెలా ఔతుంది? అప్పుడు ధర్మానికీ అధర్మానికీ తేడా ఏంటి?

అదీగాక, తనను కాపాడుకోమని ఫలవృక్షంగానీ – తనను పోషించుకోమని పాడి పశువు గానీ ఎవర్నీ దేబిరించవు. ప్రలోభపెట్టవు. కానీ, వాటి సుగుణాలను ప్రయోజనాలను గ్రహించిన వారు స్వచ్ఛందంగానే వాటిని కాపాడుకుంటూ, పోషించుకుంటుంటారు!

అంతేగాక, పునరుత్పత్తి కార్య క్రమార్ధం స్త్రీ, పురుషుల్లో లైంగికాకర్షణ శక్తిని నిక్షిప్తం చేసినట్లే, అందరిలో సాధారణంగానూ కొందరిలో మాత్రం లోకకళ్యాణార్ధం పాటుపడాలన్న, ధర్మాన్ని కాపాడుకోవాలన్న కాంక్షను శక్తిమంతంగానూ నిక్షిప్తం చేశాడు పరమాత్మ!

ఈ కారణాలవల్లనే సదా స్వల్ప సంఖ్యాకులే నిస్వార్థంగా ధర్మరక్షణకు, పరోపకారానికి పాటుపడుతుంటారు. అదిగో! అట్టి ధర్మాత్ములు, పుణ్యాత్ములకు పరమాత్మ ప్రసాదించే బహుమతే 'అమరత్వం'.

అంటే అట్టి ధర్మాత్ములు మరణానంతరంగూడ, మానవచరిత్రలోను భావితరాల హృదయాలలోను నిలిచే ఉంటారు. ఇది సృష్టి ప్రణాళికలో పొందుపరచబడిన ఒక అంశం!

వశిష్ఠ : నాడు ధర్మాధర్మ – పాండవ, కౌరవపక్షాన ఎవరెవరి నాయకత్వాన సేనలు మోహరించాయో తెలుసుకోవాలనుంది తాతగారూ?

వ్యాఖ్యాత : ధర్మం కోసం తూర్పు అభిముఖంగా పాండవులూ – అధర్మం కోసం పశ్చిమాభిముఖంగా కౌరవులూ మోహరించారు. 1. ద్రుపదుడు 2. విరాటుడు 3.సాత్యకి 4. సహదేవుడు 5. చేకితానుడు 6. దృష్టకేతు 7. శిఖండి నాయకత్వాన ఏడు అక్షౌహిణుల పాండవ సైన్యం 1. ద్రోణుడు 2. కర్ణుడు 3. అశ్వత్థామ 4. బాహ్లికుడు 5. శల్యుడు 6. కృపుడు 7. శకుని 8. కృతవర్మ 9. భూరిశ్రవుడు 10.కాంభోజుడు 11. సైంధవుడు వీరి నాయకత్వాన పదకొండు అక్షౌహిణీల కౌరవసైన్యం మోహరించినాయి. ధృష్టద్యుమ్నుడు పాండవ సైన్యానికీ – భీష్ముడు కౌరవసైన్యానికీ సర్వ సైన్యాధ్యక్షులుగా నిలిచారు.

విద్యాధర : ఒక అక్షౌహిణి అంటే ఎంతమంది సైనికులు తాతయ్యా?

వ్యాఖ్యాత : 1. అక్షౌహిణి అంటే 65,610 అశ్వాలు + 21,870 ఏనుగులు+ 21,870 రథాలు + 1,09,350 మంది కాల్బలాలు.

ఆదిత్య : మహా భారతంలో 18 సంఖ్యను ఎక్కువగా వాడారు గదా, దానికేమైనా విశిష్టత ఉందా తాతగారూ?

వ్యాఖ్యాత : విజయ సూచకము, శుభసూచక మన్న భావనతో 18 సంఖ్యకు మహాభారతంలో విశేష ప్రాధాన్యాన్ని ఇచ్చారు. ఉదాహరణకు :

మహాభారతంలోని పర్వాల సంఖ్య = 18

మహాభారత యుద్ధం జరిగిన రోజులు 18

కురుక్షేత్రంలో పాల్గొన్న బలగాల అక్షౌహిణీలు 18

భగవద్గీతలోని అధ్యాయాలు 18

అశ్వాల సంఖ్య 65,610 (6+5+6+1+0)= 18

ఏనుగుల సంఖ్య 21,870 (2+1+8+7+0)= 18

రథాల సంఖ్య 21,870 (2+1+8+7+0) = 18

కాల్బలాలు 1,09,350 (1+0+9+3+5+0) 18

మరియు సర్వశక్తి స్వరూపిణి, సర్వ శత్రు సంహారిణియైన దుర్గామాత భుజాలు 18 ఇంకా మోక్ష సోపానాలు 18 మన భారతీయ పురాణాలు 18, కావటం గూడ 18 సంఖ్య యొక్క ప్రాధాన్యాన్ని చాటి చెబుతున్నాయి.

ఇక 18 సంఖ్యలోని అంకెల్ని కూడితే వచ్చే అంకె 9 (నవ)గ్రహాలు 9, (నవ) రత్నాలు 9 – (నవ)ధాన్యాలు 9ద్వారా, 9 ప్రాధాన్యం తెలిసిందే.

అంతేకాదు, తనతో కలిసిన ఏ అంకెనైనా సజీవంగా అంటే రూపాంతరం చెందకుండా నశింపకుండా యధాతథంగా ఉంచుతుంది ఈ '9' అంకె.

ఉదా॥ 9+6=15 ఈ సంఖ్యలోని రెండంకెల్నీ కూడితే 1+5=6 యధాతథంగా ఉన్నది.

9+8 = 17 ఈ సంఖ్యలోని రెండంకెల్ని కూడితే 1+7= 8 యధాతథంగా ఉన్నది.

ఇలా తనతో కలిసిన ఏ అంకెకైనా యథాతథంగా ఉంచగల్గుతుంది '9'. అందుకే తొమ్మిది '9' ని అమృతపు అంకెగా భావిస్తున్నాము.

విరాజ్ : యుద్ధభూమిలోనే అర్జునునకు గీతోపదేశం చేయడంలో శ్రీకృష్ణభగవానుని ఆంతర్యమేంటి తాతయ్యా?

వ్యాఖ్యాత : హే శ్రీకృష్ణా! భిక్షమెత్తుకునైనా జీవిస్తాను గాని, రాజ్యం కోసం ఐనవాళ్ళందర్నీ చంపుకోలేను గాకంటూ, గాండీవాన్ని జారవిడిచి దుఃఖిస్తూ రథంలో కూలబడిపోయా డర్జునుడు. ఉభయసేనలలో కెల్లా అజేయుడైన అర్జునుడలా కూలబడగానే, ధర్మపరిరక్షణమిక ప్రశ్నార్థక మైందన్న వాస్తవాన్ని గుర్తించాడు శ్రీకృష్ణుడు. తక్షణం అతనిలో చైతన్యాన్ని రగిల్చి అర్జునుని కర్తవ్యోన్ముఖుని చేయకుంటే ధర్మాన్ని కాపాడడం అసాధ్యమన్న నిర్ణయానికొచ్చాడు శ్రీకృష్ణుడు అవతార పురుషుడు శ్రీకృష్ణుడు. అదీగాక **దుఃఖిత హృదయం తనలో నాటబడిన జ్ఞానబీజాలను నూరుశాతం మొలకెత్తించగల శక్తిమంతంగా ఉంటుంది గూడ. అందుకే యుద్ధభూమిలోనే అర్జునునికి పరమ కర్తవ్యాన్ని గీతారూపంలో, ప్రణాళికాబద్ధంగా ప్రబోధించాడు శ్రీకృష్ణపరమాత్మ. రణభూమిలోనే గీతోపదేశం చేయుటలోని పరమార్థమిదే విరాజ్.**

భగవద్గీత పట్ల నేటి కంప్యూటర్ యుగం వారి సందేహాలు

యువన్ తేజల్ : ఉద్విగ్న భరితమైయున్న యద్ధరంగంలో గీతాజ్ఞాన బోధ సమంజసమా తాతగారూ?

వ్యాఖ్యాత : అంతటి ఉద్విగ్న సమయంలో అర్జునునకు శ్రీకృష్ణుని తత్వబోధ అసమంజసం కాదా? యని **"టాల్‌బోయ్స్ వీలర్' 'కె.టి.తెలంగ్'** వంటి ప్రముఖ చరిత్రకారులు గూడ నీలాగే సందేహాన్ని వెలిబుచ్చారు యువన్! ఐతే మీలాంటి వారల సందేహాలకు విజ్ఞులిలా జవాబిచ్చారు.

"యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాల వంటి సంక్షోభ సమయాలలో, పారమార్థిక విలువలు, తక్షణ అవశ్యకర్తవ్యాలకు చెందిన భావాలు, మనసున్న మంచి మనుషులకు, సున్నిత హృదయులకూ ఉత్ప్రేరకాలుగా పనిజేసి వారిని తక్షణం కర్తవ్యోన్ముఖుల్ని చేయగలవని మనస్తత్వ శాస్త్రాలు చెబుతున్నాయి. అందువలన నాడర్జునుని కర్తవోన్ముఖుని చేయుటకై యుద్ధరంగంలోనే శ్రీకృష్ణుడు చేసిన 'పరమార్థకర్తవ్యానికి' చెందిన గీతాజ్ఞాన బోధ అసమంజసం కాకపోగా, సరైన సమయంలో శ్రీకృష్ణావతారపురుషుడు తీసుకున్న సరైన నిర్ణయమని అన్నారు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి విజ్ఞులు.

హర్షవర్ధన్ : అంతటి ఉద్విగ్న సమయంలో శ్రీకృష్ణుడర్జునునకు వాగ్రూపంలో కాక గీతారూపంలో ఎలా బోధించగలిగాడు? అప్పటికప్పుడాయన నోటినుండి అంతటి సుందర, సుమధుర గీతాలు జాలువారుట విశ్వసనీయమా తాతగారూ?

వ్యాఖ్యాత : బాబూ! మీలాంటి కంప్యూటర్ యుగం వారి సందేహాలకు గీతాశోధకులిలా జవాబులిచ్చారు.

ఆపదలు, దుఃఖం, సంక్షోభాలలో చిక్కుకున్న వారిని వాగ్రూప బోధకన్నా గేయ, పద్య, శ్లోకరూప బోధయే శక్తిమంతంగా ప్రభావితం చేస్తుంది.

ఉదాహరణకు మనదేశ స్వాతంత్ర్యోద్యమ సమయంలో పెద్దల సుదీర్ఘోపన్యాసాల కన్నా, **'వందేమాతరం'** అను ఒక చిరుగేయం భారతీయుల నెంత మహత్తరంగా ప్రభావితం చేసిందో, జగద్విదితమే. చివరకు వందేమాతరం అన్నదొక నినాదంగా రూపొందింది. అది బ్రిటిష్‌వారి నెంతగా భయపెట్టిందంటే, వందేమాతరమని నినదించిన ప్రతి యొక్కర్నీ అరెస్టు చేయవలసిందిగా ఆదేశించింది నాటి బ్రిటీష్ ప్రభుత్వం. ఐనా సదరు గీతాలాపనను, నినాదాన్ని అడ్డుకోలేక పోయింది! అలాగే ఆయా సందర్భాలకనుగుణమైన **"తెలుగువీర లేవరా, దీక్షపూనిసాగరా" "జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ములేదురా"** వంటి సినీ గీతాలు నేటికీ శ్రోతల కెంతటి ఉత్తేజాన్నీ, స్ఫూర్తినీ కలిగిస్తున్నాయో గుర్తు చేసుకుంటే అట్టి సందేహాలకు తావుండదు. మరియు ప్రాచీన కాలంలో సహృదయుల హృదయాలనుండి, ఆవేశ, దుఃఖోద్విగ్న, భక్తిపూరిత భావాలు అప్రయత్నంగానే గేయ, పద్య, శ్లోకరూపాలను సంతరించుకునేవన్నది వాస్తవం.

ఉదా॥ క్రౌంచ పక్షుల జంటలో ఒక మగ పక్షి వేటగాని బాణహతికి గురై మరణిస్తున్న దృశ్యాన్ని చూస్తుండగానే దుఃఖోద్విగ్నుడైన వాల్మీకి నోటినుండి వెలువడి **"మా... నిషాద..." వంటి వాక్కులే శ్లోకంగా రూపొందిన సంఘటన - అలాగే త్యాగయ్య - అన్నమయ్య- క్షేత్రయ్యల నోటినుండి వెలువడిన భక్తి పూరిత వాక్కులు, గేయాలుగా రూపొంది వారికి వాగ్గేయకారులన్న ఖ్యాతి లభించిన సంఘటన-** తిరుపతి వేంకట కవుల వంటి వారి నోటినుండి అశువుగా జాలువారిన పద్యపరంపర మొ॥ సంఘటనలే మీయుగం వారి సందేహాలకు తిరుగులేని జవాబులు హర్షా!

రిత్విక్ : రెండు సేనల మధ్య అర్జునుడు ధనుర్బాణాలను వదిలేసి దుఃఖిస్తూ కూర్చుంటే, అతనికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేస్తుంటే, అంతసేపూ శత్రుసేనలు చేతులు ముడుచుకుని చోద్యం చూస్తుంటాయా తాతయ్యా?

వ్యాఖ్యాత : నీవే కాదు, నీలాగే ఆనాటి, యుద్ధ నియమాలను, మరియు యుద్ధ సాంప్రదాయాలను గూర్చి తెలియని వారంతా గీతోపదేశ సన్నివేశాన్ని గూర్చి యిలాంటి విమర్శలు చేస్తున్నారు. అందువలన మీలాంటి వారంతా ఆనాటి యుద్ధ నియమాలను గూర్చి తప్పక తెలుసుకోవాలి.

ఆనాటి కొన్ని యుద్ధ నియమాలు

1. సూర్యోదయమయ్యాకే ఉభయులూ యుద్ధానికి తలపడాలి. సూర్యాస్తమయం కాగానే యుద్ధాన్ని విరమించాలి. 2. స్త్రీ-బాల-వృద్ధులను-నిద్రిస్తున్న వారినీ వధించరాదు. 3. నిరాయుధులు, దుఃఖితులు, వాహన శూన్యులు, పారిపోతున్న వారు - అలాంటి వారిపై యుద్ధానికి తలపడరాదు. 4. ఒక వీరునిపై ఒకేసారి పలువురు చుట్టుముట్టి యుద్ధం చేయరాదు. 5. ఒక వీరుడు మరో వీరుని ఎదురెదురుగా ఢీకొనవచ్చు కానీ వెనుకపాటుగాను, చాటుమాటుగాను దొంగ దెబ్బతీయరాదు. 6. యుద్ధ ప్రారంభానికి ముందుగా మనసు మార్చుకున్న వీరులు ఒక్క పక్షంనుండి తరలివెళ్ళి మరోపక్షం వారివైపు వెళ్ళే స్వేచ్ఛయున్నది.

ఉదా॥ కురుక్షేత్ర యుద్ధ ప్రారంభానికి ముందుగా కౌరవపక్షాన యుద్ధసన్నద్ధుడై నిలిచిన యుయుత్సుడను వీరుడు తన సైనికులతో సహా పాండవ పక్షానికి వెళ్ళాడు. 7. యుద్ధ ప్రారంభానికి ముందుగా శంఖారావాలు, కొమ్ము బూరలు వగైరా ధ్వని సంకేతాల ద్వారా ఉభయసేనలూ యుద్ధ సంసిద్ధతను తెలుపుకుంటారు. 8. యుద్ధభేరీలు మ్రోగగానే ఉభయసేనలూ యుద్ధానికి తలపడతాయి. 9. శత్రుపక్షాన ఉన్నప్పటికీ గురువులకు, పెద్దలకు చెంతకెళ్ళి నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకోవటం, యుద్ధం ప్రారంభమయ్యాక ముందుగా వారికి నమస్కార బాణం వదిలి అనంతరం వారిపై యుద్ధానికి తలపడటం నాటి యుద్ధ సంప్రదాయం. ఇలాంటివే మరికొన్ని నియమాలు, యుద్ధ సంప్రదాయాలూ

ఉన్నవి. ఉభయ సేనలూ విధిగా నాటి యుద్ధనియమాలు, సంప్రదాయాలకు కట్టుబడే యుద్ధం చేసే వారన్న వాస్తవాన్ని గ్రహించిన వారిట్టి విమర్శలకు పూనుకోలేరు!

ఆదిత్య : నిమిషానికి 2 శ్లోకాల చొప్పున, 700 శ్లోకాల (గీతాల)ను బోధించటానికి దాదాపు 6 గంటల సమయం పడుతుంది గదా, ఉభయసేనలూ శంఖాలు పూరించి యుద్ధ సంసిద్ధతను తెలియజేసుకున్నాక, ఇక అట్టి ఉద్విగ్న పరిస్థితిలో అంత సుదీర్ఘ సమయం, శ్రీకృష్ణుడర్జునకు గీతోపదేశం చేయటం సాధ్యమా? అది విశ్వసనీయమా? తాతగారూ?

అగస్త్య : అంతేగాదు, కథాపరంగా చూసినా యుద్ధ ప్రారంభ సమయంలో, అంత సుదీర్ఘ హితబోధ రచనాశిల్పానికి సైతం భంగకరం కదా తాతగారూ?

వ్యాఖ్యాత : మీరేగాదు, హేతువాదులు, పలువురు సాహిత్యకారులు గూడ నాటి గీతోపదేశాన్ని గూర్చి విమర్శించారు. ఇంకా విమర్శిస్తూనే ఉన్నారు. వారితోపాటు మీరుగూడ శ్రీకృష్ణార్జునులు సామాన్యులు గాదు విశిష్ట వ్యక్తులన్న అంశాన్ని, మరియు గతజన్మలో నర-నారాయణులను ఋషులే నేటి కృష్ణార్జునులన్న వాస్తవాన్ని సదా గుర్తుంచుకోవాలి. ఇకవారిరువురి విశిష్ట లక్షణాలను తెల్సుకుందాం.

'నరు' (అర్జును)ని విశిష్టతలు : 1. తన దృష్టినంతా లక్ష్యం మీదనే కేంద్రీకరించ గల్గిన 'ఏకాగ్రత' 2 కట్టె+కొట్టె+తెచ్చె నన్న పదాలతోనే రామాయణ సారాంశాన్ని గ్రహించగల్గినంతటి 'సూక్ష్మగ్రాహ్యత' 3. విన్నదానిని విన్నట్లే మెదడులో పదిలపరచుకోగల్గిన 'ఏకసంథాగ్రాహ్యత' 4. నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేదాక నిద్రబోని 'కార్యదీక్ష' మొదలగునవి అర్జునుని విశిష్టతలలో కొన్ని...

నారాయణు (శ్రీకృష్ణు)ని విశిష్టతలు : 1. నారాయణుడంటే 'జ్ఞానశయనుడనీ భావం. 2. కొండంత భావాన్ని గుమ్మడిపండంత పదజాలంతో చెప్పగల

'ప్రజ్ఞాశాలి' 3. ఎవరికి ఎప్పుడు ఎక్కడ, ఎంత చెప్పాలో అంతే చెప్పి ప్రభావితం చేయగల ప్రతిభాశాలి 4. సమయానుకూల నిర్ణయాలు, సందర్భోచిత సంభాషణలు చేయగల్గిన చతురత, సమయస్ఫూర్తి, శ్రీకృష్ణుని విశిష్టతలలో కొన్ని - ఇక అసలు విషయానికొద్దాం -

ధర్మసంకట మనెడి మండు టెండలో జ్ఞాన దాహార్తితో అటమటిస్తున్న అర్జునునకు తక్షణం కావలసింది దోసెడు జ్ఞానజలమేకాని, పెద్ద కడివెడు కాదన్న ఇంగితజ్ఞానం కలవాడే గదా శ్రీకృష్ణుడు! అందువలన నాడు పరిమిత పదజాలంతోనే శ్రీకృష్ణుడర్జునుని ప్రభావితం చేశాడని గీతాపరిశోధకులు వక్కాణిస్తున్నారు. చెప్పటమే కాదు, సదరు పరిమిత గీతాలివేనంటూ వాటిని మనముందుంచారు గూడ.

"సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః
పార్థోసుధీర్భోక్తా దుగ్ధం గీతామృతంమహత్"

"ఉపనిషత్తు అనే గోవు పొదుగును, అర్జునుడను వత్సానికి కుడిపి, గీతామృత క్షీరాన్నిపిదికి, బుద్ధిమంతుల కందజేశాడు శ్రీకృష్ణుడు" అని భావం. ఆవుదూడకు పరిమితంగా పాలుగుడిపి మిగిలిన పాలన్నింటినీ పిండి కుటుంబ సభ్యులంతా త్రాగుతారు గదా, అలాగే శ్రీకృష్ణుడర్జునునకు క్లుప్తంగా గీతాసారాన్నందించి చైతన్యవంతం చేశాడన్న అంశాన్ని నర్మగర్భంగా తెలియజేస్తున్నదీ శ్లోకం. అందువలన గీతా పరిశోధకులు మనముందుంచిన శ్లోకాల (గీతల) భావాన్ని పరిశీలిస్తే గీతోపదేశలక్ష్యం నెరవేరిందో లేదో మనకు తెలుస్తుంది సదరు శ్లోకాలవీ.

శ్రీకృష్ణభగవానుని నోట జాలువారిన గీతాలు

1. **అర్జునుడు :** గీత1-45 **"అహోబత ... స్వజన ముద్యతాః"** – రాజ్యసుఖ లోభంతో బుద్ధిహీనులమై, అయిన వాళ్ళనే చంపుకొనే ఘోరపాపాని కొడిగడుతున్నాం. అయ్యో! ఇదెంత దారుణం శ్రీకృష్ణా!!

2. 1-47 **"ఏ వ ముక్త్వార్జునః ... సంవిగ్నమానసః"** అంటూ శోకవికల మనస్కుడై ధనుర్బాణాలను వదిలేసి రథం వెనుక కూలబడి పోయాడర్జునుడు.

3. శ్రీకృష్ణుడు 2-3 **"క్లైబ్యమాస్మగమః ... ఉత్తిష్ఠ పరంతప"** – 'అర్జునా! నీ కిట్టి పిరికితనం తగదు, నీచమైన హృదయ దౌర్బల్యాన్ని వదిలేసిలే, లేచి కర్తవ్యానికి పూనుకో'

4. అర్జు 2-7 **"కార్పణ్యదోషో...త్వాప్రపన్నమ్"**– కృష్ణా! పాపభీతికి, దుఃఖోద్వేగానికి గురై ధర్మాధర్మ నిశ్చయ జ్ఞాన శూన్యుడనయ్యాను. అందుకే నాకేది శ్రేయస్కరమో నీవే నిశ్చయించి చెప్పు. నీశిష్యుడనై శరణువేడుతున్నాను.

5. శ్రీకృ2-11 **"అశోచ్యా ... నానుశోచన్తి పండితాః"** – 'ఏమాత్రం శోకింపదగని (అధర్మ పరులైన) వారికోసం శోకిస్తున్నావు, మళ్ళీ జ్ఞానిలా మాట్లాడుతున్నావు. కానీ, జ్ఞానులు తమ విద్యుక్తధర్మాల గురించే తప్ప, మరణించిన వారికోసంగానీ, జీవిస్తున్న వారికోసం గానీ ఆలోచించరు, ఎందుకంటే?

6. 2-27 **"జాతస్యహి... శోచితు మర్హసి"** – పుట్టిన వారికి మరణం, మరణించిన వారికి జననం, తప్పనిసరి! ఇట్టి అనివార్య పరిస్థితికోసం నీవిలా దుఃఖింపదగదర్జునా!

7. 2-23 **"అథ చేత్వమిమం... పాపమవాప్యసి"** ధర్మాన్ని కాపాడటం కోసం అవసరమైన ఈ యుద్ధాన్ని వదిలేస్తే నీ కర్తవ్యాన్ని నిర్వహించనందుకు పాపాన్ని మూటగట్టుకుంటావు, కీర్తినీ కోల్పోతావు'!

8. 6-5 **"ఉద్ధరే దాత్మ, నాత్మానం... రిపురాత్మనః"** (ఇట్టి ధర్మ సంకట స్థితిలో) మనిషి ఆత్మ సహకారంతో తనను తానుద్ధరించుకోవాలే గాని ఆత్మను బలహీన పరచుకోరాదు. ఎందుకంటే స్థైర్యంగా ఉన్న మనిషికి, ఆత్మబంధువౌతుంది! క్రుంగిపోయిన వారికి, ఆత్మ శత్రువు ఔతుంది!

9. **''అనంయతాత్మనా... ముపాయతః''** మనను నదుపులో పెట్టుకోలేనివాడు సిద్ధిని పొందలేడు. (మనసు నదుపులో పెట్టుకోవటం కష్టమే గాని) కొన్ని ప్రయత్నాల ద్వారా మనసును స్వాధీనం చేసుకోవచ్చు కావున (బంధుప్రీతి దిశగా కొట్టుకుపోతున్న) నీ మనసును, యత్నించి నీ విద్యుక్త ధర్మం (ధర్మరక్షణ) దిశగా మళ్ళించుకో.

10. 16-24: **''తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం... కర్తుమిహార్హసి''** – 'కర్తవ్యాకర్తవ్యాల నిర్ణయానికి శాస్త్రమే ప్రమాణం కాబట్టి శాస్త్రోక్తకర్మలనే ఆచరించు– అంటే నీ మనసు చెబుతున్నట్లు బంధుజన రక్షణ కోసం యుద్ధాన్ని విరమించటం కాదు – శాస్త్రం చెబుతున్నట్లు ధర్మరక్షణకోసం యుద్ధ నిర్వహణయే నీ కర్తవ్య మర్జునా! అని భావం.

11. **"యః శాస్త్రవిధి ... పరాంగతిమ్"** శాస్త్రం చెబుతున్న విధిని విడనాడి, విశృంఖలంగా (మనసుకు నచ్చిన విధంగా) ప్రవర్తించువాడు లక్ష్యసిద్ధిని, సుఖాన్నీ పొందలేడు.

12. 18-9 **"కార్యమిత్యేవ... సాత్వికోమతః"** – కావున అర్జునా! శాస్త్రోక్త కర్మలనే కర్తవ్యాలుగ భావించి, వాటి ఫలితాల పట్ల ఆసక్తి రహితుడవై నీ విధిని నిర్వహించు. సాత్విక త్యాగమంటే అదే!

13. 2-38 **"సుఖదుఃఖే...పాపమవాప్యసి"** – సుఖ దుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు గూర్చి పట్టించుకోక స్థిరబుద్ధితో (ధర్మ పరిరక్షణే ధ్యేయంగా) యుద్ధం చేయి. నీకు పాపమంటదు.

14. 3-1 **"యద్యదాచరతిశ్రేష్ఠః... లోకస్తదనువర్తతే"**–'శ్రేష్ఠుడు చేసిన పనులనే చేస్తూ, వారి ప్రమాణాలనే పాటిస్తుంటారు లోకులు. అంటే (సర్వశ్రేష్ఠుడవైన నీవే బంధుప్రీతితో ధర్మరక్షణా కర్తవ్యాన్ని విడనాడావంటే, నిన్ననుసరించే లోకులు, సామాన్యులంతా అదే పని చేస్తారని భావం).

15. 10-1 **"భూయయేవ... హితకామ్యయా"** – 'ప్రీతితో నా మాటలు వింటున్న అర్జునా! నీహితం గోరి నీకు నా పరమతత్త్వం గూర్చి గూడ చెబుతావిను.

16. 10-8 **"అహంసర్వస్య...భావసమన్వితాః"** – నేనే ఉత్పత్తి స్థానాన్ని, నానుండే అన్నీ పుడుతున్నాయి దీన్ని తలచుకుంటూ జ్ఞానులు ప్రేమతో నన్నే భజియిస్తుంటారు.

17. 4-7 **"యదా యదాహి...సృజామ్యహం"**–ధర్మానికి హాని జరిగి, అధర్మం విజృంభించినప్పుడు, నాకు నేనే ఒక రూపాన్ని ధరించి అవతరిస్తుంటాను.

18. 4-8 **"పరిత్రాణాయ... యుగే యుగే"** – దుర్జనులను శిక్షించి, సజ్జనులను రక్షించి ధర్మాన్ని సుస్థిరం చేసేందుకు యుగయుగాన నేనవతరిస్తుంటాను (దుష్ట కౌరవులను శిక్షించి, శిష్టపాండవులను కాపాడి ధర్మాన్ని సుస్థిరం చేసేందుకు అవతరించిన శ్రీకృష్ణావతార పురుషుడను నేనని భావం).

19. 9-3 **"అశ్రద్ధదానాః... సంసారవర్త్మని"** – 'ధర్మమార్గంలో విశ్వాసం లేనివారు పరమాత్మను చేరలేక జనన మరణచక్రంలో పడి తిరుగుతుంటారు (పుట్టిగిట్టే వ్యర్థ జీవులని భావం)

20. 13-13 **"సర్వతః ... సర్వమావృత్స తిష్ఠతి"** – 'అంతటా పరబ్రహ్మ యొక్క కాళ్ళు, చేతులు, కళ్ళూ, చెవులూ, తలలతో పరబ్రహ్మ వ్యాపించి యున్నాడు. (అందువలన లోకంలో ఎక్కడ, ఏం జరిగినా పరమాత్మ కనగలడు, వినగలడని భావం).

21. 14-21 **"బ్రహ్మణోహి... కాంతికస్యచ"** – 'సనాతన ధర్మం, అఖండసుఖం, అక్షయం, నిర్వికారమైన బ్రహ్మకు నిలయుడను నేనే.

22. అర్జు 11-38 **"ఏ మమే... పురుషోత్తమ"** – 'పరమేశ్వరా! నీవెంతటి వాడివని చెప్పావో అంతటి వాడివే, సందేహమే లేదు, కానీ, ఒక్కసారి నీ విశ్వేశ్వరరూపాన్ని దర్శించేందుకుత్సాహపడుతున్నాను!

23. శ్రీకృ 11-8 **"నతుమాం... యోగమైశ్వరమ్"** (అలాగే) ఐతే నీ సామాన్య నేత్రాలతో విశ్వరూపాన్ని చూడలేవు. నీకు దివ్య నేత్రాలను ప్రసాదిస్తున్నాను. వాటితో నాయోగ విభూతిని చూడు అర్జునా!

24. **"ద్యావో... మహాత్మన్"** ఓ మహాత్మా! దివినుండి భువిదాకా అంతరిక్ష మంతటా వ్యాపించియున్న నీ ఉగ్రరూపాన్ని జూచి నేనేగాదు, ముల్లోకాలూ కంపిస్తున్నయ్.

25. **"అదృష్ట పూర్వం... జగన్నివాస"** – మున్నెన్నడూ చూడని నీ యద్భుత రూపాన్ని జూచి మిక్కిలి యానందించాను. కానీ, అంతలోనే భయంతో కలవరపడ్డాను. దయచేసి తిరిగి నీ పూర్వ రూపాన్ని ధరించవా'.

26. 15-51 **"దృష్ట్వేదం ... ప్రకృతిం గతః"**– జనార్దనా! సామాన్యమైన నీ మానవాకృతిని జూశాక ఇప్పుడు నామనసు కుదుట పడింది.

27. 3-8 **"నియతంకురు... దకర్మణః"** అర్జునా! విధిగా నీ విధ్యుక్త కర్మలు నిర్వహించు. సోమరితనం కన్నా, శ్రమయే శ్రేయస్కరం. ఎందుకంటే సోమరులకు దేహపోషణాకష్టమే.

28. 3-35 **"శ్రేయాన్ స్వధర్మో... భయావహః"** – ఇతరుల కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించుటకంటే, లోపభూయిష్ఠంగా చేసినా స్వీయ కర్తవ్య నిర్వహణమే శ్రేయస్కరం.

29. 3-9 **"యజ్ఞార్థాత్ ... సమాచరేః"** – ఈశ్వర ప్రీత్యర్థం, లోక కళ్యాణం కోసం చేసే కర్మల వలన పాపపుణ్యాలంటావు.

30. 18-66 **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య... మాశుచః"** – అర్జునా! నీ మనసు కోరుకునే కర్మలన్నింటినీ విడనాడి(ఆత్మరూపంలో నీలో ఉన్న) నన్నాశ్రయించి, నేను నిర్దేశించినట్లు నడుచుకో! పాపాలంటకుండా నీకు విముక్తి కలిగిస్తాను.

31. 18-45 **"స్వే స్వే కర్మణ్యభిరతః... తచ్ఛృణు"** తన విధిని శ్రద్ధతో నిర్వహించు ప్రతి వ్యక్తీ సిద్ధిని పొందుతాడు (లక్ష్యాన్ని సాధిస్తాడు)

32. 18-46 (తనతో సహా) ప్రాణులన్నింటికీ ఉత్పత్తికారకుడు, అంతటా వ్యాపించియున్నట్టి పరమాత్మను, తన విధినిర్వహణ ద్వారా పూజిస్తుంటాడు. కాబట్టి, అతను పరమాత్మకు ప్రియుడై సిద్ధిని పొందగల్గుతాడు.

33. 18-68 **"యః ఇదం పరమం... వైష్యత్య సంశయం"**– పరమ గోప్యంగా ఉండిపోయినట్టి ఈ (ఆత్మజ్ఞాన) గీతోపదేశాన్ని నా భక్తుల కందించువాడు నాకు పరమభక్తుడై నన్ను చేరుకుంటాడర్జునా!

34. 18-73 **"నష్టోమోహః ... కరిష్యేవచనం తవ"** – నీ కృపవలన నా అజ్ఞానమోహం పూర్తిగా తొలగింది. (నీ గీతాబోధవలన) విశుద్ధ జ్ఞానం కలిగి నా సందేహం పటాపంచలైంది. నేనిక నీయాజ్ఞను శిరసావహిస్తాను శ్రీకృష్ణా!

ఈ 34 గీతల బోధనతోనే అర్జునుని అజ్ఞానం తొలగి అతన్ని కర్తవ్యోన్ముఖుని చేయాలన్న శ్రీకృష్ణుని లక్ష్యం నెరవేరినట్లుపై గీతలు

సృష్టీకరిస్తున్నాయి. వీటి బోధనా సమయం ఇరవై నిమిషాలకు మించదని పరిశోధకులు భావిస్తున్నారు. అదేరోజు గీతోపదేశంతోపాటు జరిగిన మరికొన్ని సంఘటనలు గూడ యిది వాస్తవమని ధృవీకరిస్తున్నాయి.

హర్షవర్ధన్ : గీతోపదేశంతో పాటు జరిగిన సంఘటనలేంటో, వాటిని గూర్చిక్లుప్తంగా వివరించగలరా తాతగారూ?

యుద్ధప్రారంభదినాన జరిగిన సంఘటనలు

యుద్ధప్రారంభదినాన కురుపాండవసేనలు ఉదయాన్నే కురుక్షేత్రానికి తరలి వచ్చినాయి. కౌరవ సర్వసేనాపతి 'భీష్ముడు తమసైన్యాలను **'మానుషవ్యూహం'**లో నిలిపాడు. పాండవ సర్వసేనాపతి 'ధృష్టద్యుమ్నుడు' తమ సైన్యాన్ని **'అచల (వజ్ర) వ్యూహం'**లో నిలిపాడు.

తాను యుద్ధం చేయగల్గినంత కాలం కర్ణుడు, తత్సంబంధీకు లెవ్వరూ యుద్ధంలో పాల్గొన రాదని భీష్ముడు పెట్టిన ఆంక్ష కారణంగా, కర్ణుడు, అతని బంధుమిత్రులు తప్ప తక్కిన వీరులంతా యుద్ధంలో పాల్గొన్నారు. అప్పుడు జరిగిన వరుససంఘటనలివీ.

సంఘటన-1 : కురుక్షేత్రంలో నాడు జరిగిన తొలి సంఘటన – శత్రుపక్షంలోని బంధువులందర్నీ చంపుకోవలసి వచ్చిన దుఃస్థితికి దుఃఖోద్విగ్నుడై అస్త్ర సన్యాసం చేసిన అర్జునుని 'పరమార్థ కర్తవ్య మరియు ఆత్మజ్ఞాన గీతోపదేశం ద్వారా చైతన్యవంతం చేశాడు శ్రీకృష్ణుడు. కర్తవ్యోన్ముఖుడై అర్జునుడు గాండీవం ధరించగానే, ఆనందోత్సాహ సింహనాదాలతో కురుక్షేత్రాన్ని హోరెత్తించింది. పాండవ సైన్యం.

సంఘటన – 2 : అనంతరం ధర్మజుడు తన కవచాన్ని విప్పి, ఆయుధాలతో సహా రథంపై యుంచి తన సోదరులు, శ్రీకృష్ణుడు వెంటరాగా ముకుళిత హస్తాలతో, కురుసేనాభిముఖంగా నడిచి వెళ్ళాడు. వరుసగా భీష్మ-ద్రోణ-కృప-శల్యుల చెంతకేగి వినమ్రంగా నమస్కరించి వారి ఆశీస్సులు పొంది వెనుదిరిగి తనరథం చెంతకొచ్చాడు.

సంఘటన – 3 : ధర్మజునితో పాటు తిరిగొస్తున్న శ్రీకృష్ణుడు మధ్యలో ఆగాడు. భీష్ముని కారణంగా యుద్ధానికి దూరమైన కర్ణుడు అల్లంత దూరాన నిలబడి ఇరుసైన్యాల వ్యూహాలను తేరిపార జూస్తున్నాడు. దాన్ని గమనించిన శ్రీకృష్ణుడు కర్ణుని చెంత కెళ్ళాడు. కర్ణా, భీష్ముల వారు కూలిపోయేంతవరకైనా పాండవ పక్షాన చేరి భీష్మునకు నీప్రతాపాన్ని చూపవచ్చుననీ, అంతేగాక పాండవ పక్షానికి వచ్చినట్లైతే అతనికి ఒనగూడే అదనపు లాభాలను గూడ వివరించి పాండవ పక్షానికి రమ్మని కర్ణునిస్వాగతిస్తాడు. కానీ, భీష్మునిమీదనో, మరెవరి మీదనో ఆగ్రహంతోగాని, మరేదో ఆశించి గానీ దుర్యోధనునకు హాని కలిగించే పనిని, కర్ణుడు చేయుట అసంభవమంటాడు! అతనిని మందహాసంతో తేరిపార జూస్తూ తిరిగి వచ్చేశాడు శ్రీకృష్ణుడు.

సంఘటన – 4 : చటుక్కున ఏదో ఆలోచన తళుక్కు మనగా తన రథం చెంతనుండి, రెండు సేనల మధ్యకొచ్చి'కౌరవపక్షాన నిలిచిన వారెవరైనా సరే మనసు మార్చుకుని ధర్మం కోసం పోరాడుతున్న మా పక్షాని కొచ్చినట్లైతే వారిని సోదరసమానులుగా సమాదరిస్తానంటూ బిగ్గరగా ప్రకటించాడు ధర్మారాజు – అందుకు స్పందించిన యుయుత్సుడు, (గాంధారి గర్భవతిగా యున్నప్పుడు 'ధృతరాష్టుడు సంబంధం పెట్టుకున్న వైశ్యస్త్రీకి జన్మించిన బిడ్డ) తన సైన్యంతో సహా పాండవుల వైపు తరలివచ్చాడు. ధర్మరాజుని నాయకత్వాన పాండవులతనికి ఘనస్వాగతం పలికారు.

ఆనందంతో పాండవులు మరోసారి శంఖాలు పూరించారు. కానీ ముందుగా యుద్ధానికి తలపడలేదు. తమ రాజ్యాన్నపహరించిన కౌరవులపై బాధితులైన పాండవులే ముందుగా యుద్ధానికి తలపడుట నాటి సంప్రదాయం. కానీ, తొలుతకయ్యానికి కాలుదువ్వింది పాండవులే నన్ను. అపప్రథ వస్తుందని వెరచి సంయమనాన్ని పాటించారు పాండవులు. కానీ ఇంకా, యుద్ధాన్ని ప్రారంభించకుంటే, యుయుత్సునిలా మరికొందరు జారుకుంటారనిగానీ–యుయుత్సుడలా వెళ్ళిపోయినందుకుగానీ బాగా

అసహనానికి గురైన దుర్యోధనుడు తక్షణం యుద్ధాన్ని ప్రారంభించమని తన సైన్యాన్నాదేశించాడు. వెంటనే రణభేరీలు మ్రోగినయ్. భీష్ముడు తొలి బాణాన్ని వదలటంతో ఉభయసేనలూ తలపడినాయి.

అవన్నీ యుద్ధ నియమానుసారం జరిగిన సంఘటనలే అన్నది వాస్తవం: ఈ వాస్తవం తెల్సినవారు శ్రీకృష్ణుని గీతోపదేశాన్ని అసహజమనీ, అసమంజసమనీ విమర్శించలేరు. పై జరిగిన సంఘటనలన్నీ గంటకు పైగాను, రెండుగంటలోపు సమయంలో జరిగినట్లు పరిశీలకులు నిర్ధారించారు. దీన్నిబట్టి చూసినా అతిస్వల్ప సమయంలోనే పరిమిత గీతాలతోనే శ్రీకృష్ణుడర్జునుని కర్తవ్యోన్ముఖుడయ్యేలా ప్రభావితం చేసినట్లు మనకు స్పష్టమౌతున్నది.

శ్రీమద్భగవద్గీతా వ్యాప్తి గూర్చిన సందేహాలు

విద్యాధర్ : నాడు యుద్ధరంగంలో శ్రీకృష్ణుడర్జునునకు ఏకాంతంగా బోధించిన 'గీత' లెలా వెల్లడయ్యాయి? గ్రంథరూపం దాల్చి భారతదేశమంతటా ఎలా విస్తరించినాయి తాతయ్యా?

వ్యాఖ్యాత : ప్రాచీనకాలంలో మహర్షులు విజ్ఞులు ఏక సంథాగ్రాహులు విధిగా పాటించే సంప్రదాయ మొకటున్నది. అదేమిటంటే? – తాము కనుగొన్న, విన్న లోకకళ్యాణదాయకజ్ఞానాన్నీ, జ్ఞానాంశాలను, తమ మెదడులో భద్రపరచి, మననం ద్వారా వాటిని కంఠస్థం చేస్తూ, బోధన ద్వారా వాటిని భావితరాల వారికందిస్తూ, తమసామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చుతుండేవారు! క్రీస్తుపూర్వం వేల సంవత్సరాల నుండి కంఠస్థరూపంలో కొనసాగుతూ క్రీస్తుశకంలో ముద్రణ పొందిన వేదోపనిషత్తులే అందుకు నిలువెత్తు నిదర్శనాలు!

ఈ సంప్రదాయానుగుణంగానే ఏకసంథాగ్రాహియైన అర్జునుడు తననెంతగానో ప్రభావితం చేసిన శ్రీకృష్ణగీతోపదేశాన్ని తన మెదడులో

పదిలపరచుకొని కంఠస్థం చేసియుంటాడనటంలో సందేహం లేదు. అంతేకాదు గీత 18-68 నాయీ గీతోపదేశాన్ని నా భక్తుల కందించవలసిందిగా శ్రీకృష్ణుడన్యాపదేశంగా తనకు చేసిన సూచనను మరచిపోలేదు అర్జునుడు. "గుణాధికై గ్రహీతః అనుష్ఠీయ మానశ్చధర్మః ప్రచయం గమిష్యతీతి" అని పెద్దలన్నట్లు గుణాధికుడైన అర్జునుడు వెంటనే ఆచరణకు పూనుకున్నాడు. తన గురువు శ్రీకృష్ణభగవానుని ఆదేశానుసారం, లోక కళ్యాణదాయకమైన గీతోపదేశాన్ని భావితరాలవారి కందించి తన సామాజిక బాధ్యతను నెరవేర్చుకోవాలనీ నిశ్చయించాడర్జునుడు. అందుకే యుద్ధానంతరమెుక శుభోదయాన వ్యానమహర్షి, తదితర శ్రీకృష్ణభక్తులందరికీ తాను విన్న గీతోపదేశాన్ని యథాతథంగా అందజేశాడర్జునుడు.

తరణ్ : మరి ఆ గీతలు, గ్రంథరూపాన్నెలా సంతరించుకున్నాయి తాతయ్యా?

వ్యాఖ్యాత : అర్జునుని ద్వారా శ్రీకృష్ణ గీతోపదేశాన్ని శ్రద్ధగా విన్నాడు వ్యాసమహర్షి. ఆసంక్షిప్త గీతోపదేశం ఎన్నో వెలుగుల్ని నిక్షిప్తం చేసుకుని యున్న చిచ్చుబుడ్డిలా దర్శనమిచ్చింది వ్యాసమహర్షికి. దాన్ని వెలిగించి, సదరు వెలుగుల ద్వారా సమస్త మానవాళికీ పరమగమ్యాన్ని చూపించదలచాడాయన. తత్ఫలితమే శ్రీమద్భగవద్గీతా గ్రంథావతరణం!

నాడు శ్రీకృష్ణుని ముఖారవిందం నుండి అర్జునుని కందిన 34 (3+4=7) గీతలే, వ్యాస మహర్షి ఘంటం ద్వారా 700 (7+0+0+=7) గీతలు (శ్లోకాలు)గ వెలుగులు విరజిమ్మినాయి. ఈ సప్తశతి (700) శ్లోకాల్లో ఏవో కొన్ని తప్ప, వ్యానవిరచిత శ్లోకాలన్నీ, కురుక్షేత్రంలో శ్రీకృష్ణముఖారవిందం నుండి జాలువారిన శ్లోకాల వలనే అందమైన అనుష్టుప్పు ఛందో సౌందర్యంతోను, అట్టి సురుచిర సుందర పదజాలంతోనే అలరారుతున్నాయి. ఆకారణంగానే అష్టాదశ (18) అధ్యాయాల, సప్తశతి

(700) గీతాల భగవద్గీతా గ్రంథాన్ని శ్రీకృష్ణభగవద్గీతలు గనే ఆరాధిస్తూ అధ్యయనం చేస్తున్నారు భారతీయులు.

వశిష్ఠ : శ్రీకృష్ణుడు - వ్యాసుడు వీరిరువురినుండి జాలువారిన గీతలు ఒకేరకమైన ఛందస్సులోను, అదే అందాల పదజాలంతో రూపొందటమెలా సాధ్యం? ఎలా విశ్వసనీయం తాతగారూ?

వ్యాఖ్యాత : చూడు బాబూ "నేను శ్రీమద్భగవద్గీతను కేవలం గ్రంథస్థం చేశా"నని స్వయంగా వ్రాసుకోవటం ద్వారా గీతాగ్రంథస్థ జ్ఞానమంతా శ్రీకృష్ణభగవానునిదేనని స్పష్టీకరించారు శ్రీమాన్‌వ్యాస మహర్షి!

మరియు **'వ్యాసరూపాయ విష్ణవే' - 'శ్రీకృష్ణావతారపురుషాయ విష్ణవే'** అన్నారు గదా అంటే వ్యారూపంలోను, శ్రీకృష్ణుని అవతారంలోనూ ఉన్నది శ్రీమహావిష్ణువేనని భావం. అందువల్లనే శ్రీకృష్ణుని ముఖారవిందం నుండీ, వ్యాసుని ఘంటం నుండీ జాలువారిన గీతలన్నీ అద్వైతాలుగా అలరారుతూ, శ్రీమద్భగవద్గీతగ విరాజిల్లుతున్నాయి! అట్టి శ్రీమద్భగవద్గీతా ఛందోసౌందర్యాలకు ముగ్ధుడై ఒక రచయిత వ్రాసిన కవిత యిదిగో.

కమనీయ సుమధుర కవితాత్మకం శ్రీమద్భగవద్గీత. భగవద్గీతా శైలి యెంతటి సరళం, సలలితమో, అంతటి కమనీయ సుమధుర కవితాత్మకం! భగవద్గీతా ఛందం, అందాల అనుష్టుప్పు ఛందం! ఎంతటి సంక్లిష్టపు ఆధ్యాత్మిక భావాలనైనా బల్లమీద గుద్దినట్లు, కుండ పగల కొట్టినట్లు స్పష్టంగా, వింటి నుండి వెడలిన బాణంలా సూటిగా, పాఠక, శ్రోతల హృదయాలను తట్టి మరీ లేపుతుంది! అర్థవంతంగా చదివిన వారిని అద్భుతంగా ప్రభావితం చేస్తుంది! సురుచిర సుందరం, అపూర్వ కళాత్మకం, శ్రీమద్భగవద్గీతా శైలి! అంతగొప్ప తాత్విక భావాలను ఇంతటి కమనీయ కవితాశైలిలో క్రీ॥పూ॥ ఐదువందల సంవత్సరాల క్రితమే మానవాళి కందించిన మన ప్రియతమ వ్యాసతాతయ్యకు, ఆ విశ్వగురువుకు సదా కృతజ్ఞతాభివందనాలు తప్ప,

యేమిచ్చిరుణం తీర్చుకోగలం? నిత్యగీతాధ్యయన ఆచరణల ద్వారా జగద్గురువు నారాధిద్దాం. వ్యాసమహర్షి జన్మించిన ఆషాఢ పూర్ణిమను వ్యాసపూర్ణిమగ ఆయన జయంతి వేడుకలను జాతీయోత్సవంగా జరుపుకుందాం!

హిమాంశ్ : అట్టి సుందర సుమధుర భగవద్గీతా రూపశిల్పి ప్రియతమ వ్యాసతాతయ్యకు సర్వదా శుభాభినందనలు, అభివందనాలు. కానీ, అది విశ్వవ్యాపితమెలా అయ్యింది తాతగారూ?

వ్యాఖ్యాత : గౌతమబుద్ధుడు తానుకనుగొన్న సత్యాన్ని మొదట ఐదుగురికి బోధించాడు. వారి ద్వారా ఆసియా ఖండ మంతటా విస్తరించింది బౌద్ధం. అలాగే శ్రీకృష్ణుడర్జునునకు అర్జునుడు! వ్యాసాదులకు ప్రబోధించగా ఆది శంకరాచార్యుల ద్వారా వ్యాసుని గ్రంథం భారతదేశ వ్యాపితం కాగా పలువురు అనువాదకులద్వారా నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రవర్ధిల్లుచున్నది శ్రీమద్భగవద్గీత!

జయరాం : భగవద్గీత వేరొకరి గ్రంథమైతే, మహాభారతకర్త దానిని తన గ్రంథంలో చొప్పించుకున్నారని కొందరంటున్నారు వాస్తవమా తాతగారూ?

వ్యాఖ్యాత : లేదు జయరాం, కె.టి. తెలంగ్ వంటి కొందరు చరిత్రకారులు అలా అపోహపడ్డారంతే. కానీ, భగవద్గీత మహాభారతాంతర్భాగమేననీ, వాటి రచయిత ఒక్కడేననీ, పలు ఆధారాలు సృష్టీకరిస్తున్నాయి. అవి 1. మహాభారత, భగవద్గీతల శైలీ, సామ్యాలు ఒక్కటే. 2. ఇతరదర్శనాలను గూర్చి భారతం, భగవద్గీతల అభిప్రాయాలు ఒక్కటిగనే ఉన్నాయి. 3. భారతంలోను, భగవద్గీతలోను ఆయా సందర్భానుగుణంగా ధర్మసూత్రాలు విపులంగా వివరించబడినాయి. 4. ఒక్క భీష్మపర్వంలోనే గాక, మహాభారతంలోని ఇతర పర్వాలలో గూడ భగవద్గీతను గూర్చిన ప్రస్తావనలున్నాయి ఇలాంటివే మరికొన్ని ఆధారాలు గూడ భారత, భగవద్గీతల రచయిత వ్యాసమహర్షేనని ధృవీకరిస్తున్నాయి.

ఆరాధ్య : చాతుర్వర్ణ్యంమయా సృష్టమ్.. అంటూ భగవద్గీత కులవ్యవస్థను సుస్థిర పరుస్తున్నదని విమర్శిస్తున్నవారికి మీ జవాబేంటి తాతగారూ?

వ్యాఖ్యాత : గుణకర్మల విభజన ద్వారా మానవాళిని నాలుగు వర్ణాలు (కులాలు)గ విభజించాను వాటికి కర్తనునేనే. "అను యీ గీత నాదారం జేసుకొని కులాలను దేవుడే సృష్టించాడవని చెప్పటం ద్వారా కులవ్యవస్థను సుస్థిరం చేసేందుకు తోడ్పడుతోంది. గీత అంటూనే నేటికీ కొందరు పెద్దయెత్తున విమర్శలకు పూనుకుంటున్నమాట వాస్తవం.

ఐతే ఈ విషయంలో కమ్యూనిస్టులు, హేతువాదులూ, అన్యమతాల వారేగాక హిందువులలోను చాలామంది తెలుసుకోవలసిన వాస్తవమొకటున్నది. భగవద్గీతను అర్ధవంతంగా, పూర్తిగ అధ్యయనంచేస్తే గాని బోధపడని వాస్తవమది. **"చాతుర్వర్ణ్యం"** అను గీత నాధారం జేసుకుని గీతా బోధనయొక్క అంతర్యాన్ని వివరిస్తున్నాను. శ్రద్ధగా వినండి.

ఈ గీతద్వారా శ్రీకృష్ణపరమాత్మ మనకు తెలియజేస్తున్న వాస్తవమేమంటే? ఈ అనంత విశ్వగమనం స్వచ్ఛందంగా సాగిపోయేందుకై పరాప్రకృతి (జడపదార్థాల), అపరా ప్రకృతి (ప్రాణుల) లోని ప్రతి పదార్థానికీ ప్రతి ప్రాణికీ, అణువులోని ప్రతి అణుభాగానికీ, ప్రాణిలోని ప్రతి అవయవానికీ ఒక్కో రకమైన స్వభావాన్ని అంటే గుణాన్ని నిక్షిప్తం చేశాను. ఉ॥ మర్రి విత్తనంలో మహావృక్షాన్ని అణువులో బాంబంత శక్తినీ నిక్షిప్తం చేసినట్లన్నమాట. అలా వాటిలో వేర్వేరు స్వభావాలను నిక్షిప్తం చేసినందువల్లనే, నా ప్రమేయమేమీ లేకుండానే, నా అంశమైన ఈ పరాపర ప్రకృతియంతా తమ తమ స్వభావానుగుణంగా వేటిపని అవిచేసుకుంటూ అనంత విశ్వగమనానికి తోడ్పడుతున్నాయి. ఉదా॥ మనిషి ప్రమేయమేమీ లేకుండానే అతని గుండె, మెదడు, శ్వాసకోశాలు, మూత్రపిండాలు వగైరాలన్నీ స్వచ్ఛందంగా వాటిపనినవి చేసుకుంటూ మనిషి జీవన యాత్రకు తోడ్పడుతున్నట్లన్న మాట.

అలాగే మానవులలో గూడ భిన్నస్వభావ శ్రద్ధాసక్తులను నిక్షిప్తం చేశాను. ఈ కారణంగానే మానవులంతా వారి స్వభావానుగుణంగా ఒక్కొక్కరొక్కొక్క పనిపై శ్రద్ధాసక్తులతో పనులు నిర్వహిస్తూ సమాజ గమనానికి తోడ్పడుతున్నారు. కేవలం గుర్తింపుకోసం వారుచేసే పనులను బట్టి వారి నాయాబృందాలుగ విభజించాను. ఉదా॥ కాచే పండ్లనుబట్టి నిమ్మ, దానిమ్మ, మామిడి, జామ, యాపిల్ వగైరా చెట్లుగాను, పండే ధాన్యాలను బట్టి వరి, గోధుమ, జొన్న, సజ్జ, రాగి మొ॥ పైరులుగా విభజించినట్లే, చేసే పనులనుబట్టి, మనుషులను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు (బృందాలు)గ విభజించాను. అన్నదే చాతుర్వర్ణ్యం మయా... అను గీత యొక్క ఆంతర్యం!

ముఖ్యంగా మీ విద్యార్థులకు మరింతగా అవగాహన కల్గించుటకై ఇదే అంశాన్ని మరోవిధంగా ఉదహరిస్తున్నాను వినండి. "గుణకర్మలనుబట్టి మానవులను నాల్గుకులాలుగా విభజించానంటున్నాడు శ్రీకృష్ణుడు. ఇక్కడ గుణం= స్వభావం, స్వధర్మం కర్మలు = పనులు – వర్ణం= వర్గం, బృందం, కులం, గుంపు అని భావం. ఉదాహరణకు – విద్యాభ్యాసార్థం తొలుత ఒకే తరగతిలో చేరిన విద్యార్థులు క్రమంగా పై తరగతుల కెళ్ళేకొద్దీ, వారి వారి స్వభావానుగుణంగా కొందరు కొందరు, కొన్ని కొన్ని పాఠ్యాంశాలపట్ల శ్రద్ధాసక్తులను కనబరుస్తూ తదనుగుణంగా ఉన్నత విద్యనభసిస్తూ ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, పోలీసులు, ఆఫీసర్లు వగైరాలుగ రూపొందుతారు. అప్పుడా విద్యార్థులంతా ఉపాధ్యాయ బృందం (కులం)గా, అలాగే డాక్టర్ల–ఇంజనీర్ల–శాస్త్రవేత్తల–పోలీసుల–ఆఫీసర్ల బృందాలు (కులాలుగ) విడిపోయి ఎవరి విధులను వారు (ఎవరి స్వధర్మాలను వారు) నిర్వహిస్తూ నేటి మన సమాజ గమనానికి తోడ్పడుతున్నారు.

అలాగే ప్రాచీన వ్యవసాయాధారిత సమాజంలో, ప్రజలానాడు చేస్తున్న పనులనుబట్టి 1. బ్రహ్మజ్ఞానంతో సహా వివిధ జ్ఞానార్జన, జ్ఞానబోధనలద్వారా

సమాజానికి తోడ్పడుతున్న వారిని బ్రాహ్మణ బృందం(కులం)గ 2. యుద్ధం చేసి శత్రువుల బారినుండి ప్రజలను కాపాడుతున్న వారిని క్షత్రియబృందం (కులం) గ 3. వ్యవసాయం, పశుపాలన ద్వారా సమాజానికి తోడ్పడుతున్న వారిని వైశ్యబృందం (కులం)గ 4. వివిధ వస్తూత్పత్తి కార్యక్రమాల ద్వారా సమాజానికి తోడ్పడుతున్న వారందరినీ కలిపి ఒకే శూద్రబృందం(కులం)గ పిల్చుకునేవారు. చాతుర్వర్ణ్యం అను గీతాబోధనాంతర్యమిదే. భగవద్గీతను పైపైన చదివిన మిడిమిడి జ్ఞానులు, కువిమర్శకోసం చదివినవారే గాని, గీతామాతను అర్థవంతంగా చదివి, వాస్తవాలను గ్రహించగల్గిన వారెవరూ అట్టి విమర్శలకు పూనుకోలేరు.

కావ్య : "శ్రేయాన్ స్వధర్మో..." అంటూ ఏ కులం వారావృత్తిచేయుటే శ్రేయస్కరం, వేరొక కులవృత్తిని చేపట్టుట భయావహమంటూ కులవృత్తుల శాశ్వతత్వాన్ని ప్రోత్సహిస్తున్నది భగవద్గీత అంటున్న వారికి మీరేం చెబుతారు తాతగారూ?

వ్యాఖ్యాత : 3–35 **"శ్రేయాన్ స్వధర్మో..."** ఇక్కడ స్వధర్మం అంటే తన స్వభావానికి తగిన, తనకు ఆసక్తి దాయకమైన కర్తవ్యమని భావం. పరధర్మో భయావహః అంటే తన స్వభావ సిద్ధమైన విధినిర్వహణకు బదులు, వేరొకరి విధిని నిర్వహించబూనుట భయావహమని భావం. ఉదా॥ డాక్టరు కర్తవ్యాన్ని ఇంజనీరు, ఇంజనీరు కర్తవ్యాన్ని డాక్టరు చేయబూనటం ప్రమాదకరమే గదా, మరి? ఇదే సదరు 3–35 గీత యొక్క ఆంతర్యం తదితర మంతా ఉద్దేశపూర్వకంగా చేసే వ్యర్థ విమర్శ మాత్రమే సుమా!

శ్రేష్ఠ : హింసను ప్రోత్సహిస్తున్నదని ఆరోపిస్తూ భగవద్గీతను రష్యాలో నిషేధించాలంటూ రష్యన్లు కోర్టు కెక్కారు గదా, దీనికి మీరేమంటారు తాతగారూ?

వ్యాఖ్యాత : గీత 8–47 **నియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషం..."** నీ విధినిర్వహణలో భాగమైనపుడు (బంధుమిత్రులతో సహా) ఎవరిని చంపినా

నీకు పాపమంటదర్జునా" యని శ్రీకృష్ణుడు బోధించిన మాట నిజమే. ఇదే అంశాన్ని ఇప్పటి పరిస్థితుల కన్వయించి చెప్పుకుందాం. ఉదా॥ మన దేశ రక్షణా కర్తవ్య నిర్వహణలో భాగంగా, ఎందరు శత్రు సైనికులను చంపినా సరే, అదే సమయంలో శత్రు దేశానికి సహకరిస్తున్న మన దేశ సైనికులను చంపినాసరే అట్టి మన భారతీయ సైన్యానికి పాపాన్నంట గట్టగలమా మరి?

సాయికృత్తిక : లేదు తాతయ్యా గీతాబోధ ఎంతో అర్థవంతంగా ఉంది. ధర్మరక్షణార్థం తన కర్తవ్యమైన యుద్ధ నిర్వహణయా? బంధు హత్యాపాపదాయకం కావున, యుద్ధ విరమణా? తేల్చుకోలేక సతమతమౌతున్న అర్జునునకు నీ విధి ఐనట్టి ఈ యుద్ధంలో (బంధుమిత్రులతో సహా) ఎవరిని చంపినా నీకు పాపమంటదన్న గీతాబోధన హింసను కాదు, విధినిర్వహణను ప్రోత్సహిస్తున్నదని మాకు సృష్టీకరించినందుకు మీకు చాలా ధన్యవాదాలు తాతయ్యగారూ!

వ్యాఖ్యాత : ఈ విషయమై భగవద్గీతతోబాటు, కులవివక్షతను నిరసించే బౌద్ధమత గ్రంథం **ధమ్మపదం** గూడ **"అత్తదత్థం పరత్థేన బహునాపినహాపయే – అత్త దత్త మభిజ్ఞాయ సదత్త పసుతోసియా"** "పరధర్మాలెంత మంచివైనా వాటిని పట్టుకు ప్రాకులాడకు, నీ స్వధర్మాన్ని వీడకు, స్వధర్మ నిర్వహణయే నీకు శ్రేయోదాయకం" అని వక్కాణించింది.

ఈ పద్ధతి కేవలం మానవులకే ఉద్దేశించినది కాదు, ప్రకృతిలో, ప్రాణులలో, ప్రాణులలోని అవయవాలలో గూడ, వేటి కర్తవ్యాన్నవి నిర్వహిస్తున్నందు వల్లనే సృష్టిగమనం ప్రాణుల జీవనం సజావుగా సాగిపోతున్నది. మొదటిది ప్రకృతినే చూద్దాం. ఉదా॥ సూర్యుడు ప్రజ్వలిస్తూ ప్రాణికోటికి వెలుగునూ, వేడిమినీ యిస్తున్నాడు. భూమి తనచుట్టూ, సూర్యుని చుట్టూను తిరుగుతూ రాత్రింబవళ్ళను ఋతువులను సృష్టించి జీవరాసుల్ని కాపాడుతున్నది. సముద్రం జల జీవరాసులకు నిలయంగా వుంటూనే

మేఘాలకు నీరందిస్తూ నదుల మిగుల నీటిని భరిస్తూ భూమ్మీది ప్రాణులకు తోడ్పడుతున్నది. మేఘాలు వర్షిస్తూ – నదులు ప్రవహిస్తూ, జలాశయాలు నీటిని నిలువచేస్తూ ప్రాణులకు నీటి నందిస్తున్నాయి. అడవులు వన్యప్రాణులకు నిలయంగా ఉంటూనే ప్రాణవాయువు నందించుట ద్వారా వాతావరణాన్ని చల్లబరచి మేఘాలు వర్షించేందుకు తోడ్పడుతున్నాయి. అలాగే పైరులు, ఫలవృక్షాలు, కలపచెట్లు ఇంకా సూర్యకుటుంబం, పాలపుంత, తదితర గెలాక్సీలు ఇలా ప్రకృతిలోని ప్రతి ఒక్కటీ స్వయం చైతన్యంతో తమ ధర్మాన్ని నిర్వహిస్తున్నందువల్లనే సృష్టికొనసాగుతున్నది. ప్రాణులు మనగల్గుతున్నాయి.

ఉదా. 2 : మన శరీరంలోని కాళ్ళు, చేతుల వంటి కర్మేంద్రియాలు – కళ్ళూ, చెవుల వంటి జ్ఞానేంద్రియాలు ఇంకా గుండె, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణాశయం, శ్వాసకోశాలు మొ॥ అవయవాలన్నీ వేటి ధర్మాన్నవి నిర్వహిస్తున్నందు వల్లనే. మనతో సహా ప్రాణులన్నీ జీవించగల్గుతున్నాయి. ఉదా. 3. మన సమాజంలో కర్షకులు, కార్మికులు, డాక్టర్లు, నర్సులు, ఇంజనీర్లు, సైంటిస్టులు, ఉపాధ్యాయులు, సైనికులు, పోలీసులు, గుమాస్తాలు, ఆఫీసర్లు, క్లీనర్లు, డ్రైవర్లు, శాసనసభ్యులు, మంత్రులు, ముఖ్య, ప్రధాన మంత్రులు, సెక్యూరిటీ గార్డులు వగైరా బృందాలన్నీ ఎవరిధర్మాన్ని వారు నిర్వహిస్తున్నందువల్లనే, అందరికీ భుక్తీ, సమాజగమన, పురోగమనాలూ సాధ్యమౌతున్నవి. **"శ్రేయాన్ స్వధర్మో..."** అను గీత యొక్క అంతర్యమిదేమరి. ఈ వాస్తవాన్ని గ్రహించిన వారెవరూ భగవద్గీత కట్టి సంకుచితత్వాన్ని ఆపాదించలేరు.

ఊహాశ్రీ : బ్రహ్మయొక్క ముఖం నుండి బ్రాహ్మణులు– భుజం నుండి క్షత్రియులు– తొడల నుండి వైశ్యులు–పాదాలనుండి శూద్రులు జన్మించారని చెప్పటం ద్వారా కులాలకు తరతమ బేధాల నాపాదించారంటున్న విమర్శకులకు మీరేం చెబుతారు తాతగారూ?

వ్యాఖ్యాత : "బ్రాహ్మణోఽస్యముఖ... పద్భ్యాం శూద్రో అజాయతే (10-90-12) ఋగ్వేదం పురుషసూక్తం లోని ఈ ఉపమానం ద్వారా మనం గ్రహించాల్సిన వాస్తవ మేమంటే? మనిషి మనుగడకు ఆయా అవయవాలెంత కీలకమైనవో, సమాజ మనుగడకు ఆయా కులాలు (బృందాలు) అంత కీలకమైన వని భావించాలే తప్ప, ఫలానా అవయవంతో పోల్చిన కులం ఉన్నతమని, ఇంకో అవయవంతో పోల్చిన కులం తక్కువనీ, భావించరాదు. ఎందుకంటే? ఏ మనిషికైనా ముఖమెంత ముఖ్యమో, భుజాలు, తొడలు, పాదాలు గూడ అంతే ముఖ్యం. భోజనం చేసే కుడిచేతిని గానీ, మలవిసర్జనానంతరం శుభ్రం చేసుకునే ఎడమచేతినిగానీ ఎక్కువనో, తక్కువనో మనిషి భావించుకోడు. అలాగే ఆనాడు జ్ఞానబోధ చేసే బ్రాహ్మణులు, శత్రువుల బారినుండి ప్రజల్ని కాపాడే క్షత్రియులు, వ్యవసాయం చేసే వైశ్యులు, వస్తూత్పత్తి చేసే శూద్రబృందాలలో ఎవరూ ఎవర్నీ ఉన్నతంగానో, నిమ్నంగానో భావించలేదు. నాడన్ని తరాల వారూ వరసలు పెట్టి పిల్చుకుంటూ గ్రామస్తులంతా కుటుంబ సభ్యుల్లా జీవించుటే అందుకు చక్కని నిదర్శనం. గ్రామస్తులంతా దేహావయవాల్లా, ఎవరి పనులువాళ్ళు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించారు. అలా గ్రామ గ్రామాన పని విభజన ద్వారా గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థను నిర్మించుకుని ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది మన భారతదేశం తత్ఫలితంగానే ఆధ్యాత్మిక, భౌతిక జ్ఞానాన్వేషణకు చక్కని అవకాశం లభించింది. నాడు భారతావనిలో వికసించిన సాంఖ్య, వేద, ఉపనిషత్, బౌద్ధ జైన ధార్మిక గ్రంథాలు రామాయణ, మహాభారతాది ఇతిహాసాలు, భాగవతాది అష్టాదశ పురాణాలు ఇంకా పలు ఖగోళ, భూగోళ, గణిత, ఆయుర్వేద శాస్త్రాలే అందుకు నిదర్శనాలు ఇదీ మన ప్రాచీన భారతం. ఐతే అదే సమయంలో పాశ్చాత్య దేశాలలో బానిస విధానం కొనసాగింది. అంటే ఒక జాతి ప్రజలను, మరోజాతి ప్రజలు బంధించి, వారిచే పశువుల్లా పనిచేయించుకునే

విధానమన్నమాట. అందువల్లనే ప్రపంచ చరిత్రపుటద్దంలో స్పష్టంగా అగుపించిన దృశ్యాలు రెండే రెండు. 1. భారతీయుల పని విభజనా విధానం 2. పాశ్చాత్యుల బానిస విధానం.

కాలక్రమంలో మరుగున పడిపోయిన మరో వాస్తవం గూడ ఉంది. అదేమిటంటే? ముఖం, భుజాలు, తొడలతో సహా దేహంలోని అవయవాలన్నింటినీ అంటే దేహభారాన్నంతటినీ మోస్తూ, దాన్ని నడిపిస్తున్నవి పాదాలే, దేహావయవాల న్నింటి కన్నా మిక్కిలి గౌరవనీయాలు, పూజనీయాలూ పాదాలే! ఈ వాస్తవాన్ని తొలుత గుర్తించింది మన భారతీయులే!

సహజంగా మనం ఎవరికైనా నిలబడే నమస్కరిస్తుంటాం. ఐతే దేవునికి, తల్లిదండ్రులు, గురువులు, గౌరవనీయులకు మాత్రం వినమ్రంగా వంగి వారి పాదాలకు నమస్కరిస్తుంటాం - పాదాలతో పోల్చుట ద్వారా, శ్రామికులు లేనిదే సామాజిక దేహం నడవదన్న సంకేతాన్ని అందజేస్తున్నది సదరు ఋగ్వేదసూక్తం! పాదాలను, శ్రామికులను మిక్కిలి గౌరవనీయులుగా, మిక్కిలి ప్రాధాన్యం కలవారిగా భారతీయులు భావించారనటానికింతకన్నా నిదర్శనమింకేం కావాలి?

ఐతే నేటి కంప్యూటర్ యుగంవారు నమస్కారానికి బదులు హాయ్ చెప్పుకుంటున్నారు. అలాంటి వారికింకా పాదాభివందన ప్రాధాన్యమేం తెలుస్తుంది? వారికేకాదు, నేటికీ వంగి పాదాభివందనం చేస్తున్న వారుగూడా దాన్నొక సంప్రదాయంగా భావిస్తున్నారే తప్ప పాదాభివందన ప్రాముఖ్యం వారికీ తెలియనంతగా మరుగున పడింది.

హర్ష : మరి కులాలకు తరతమ బేధాల నాపాదించిందెవరు తాతయ్యా?

వ్యాఖ్యాత : పని విభజన ద్వారా ఏర్పడిన కులాలను జన్మతః కులాలుగ స్థిరపరచింది మాత్రం 1. తమ విధ్యుక్త, సామాజిక కర్తవ్యాలను మరచి,

పరాన్న భుక్కులుగా మారిన సోమరులు, స్వార్థపరులు 2. తమవిధి నిర్వహణద్వారా తమ జ్ఞాన ఔన్నత్యం ద్వారా సమాజ ప్రగతికి తోడ్పడుతూ, స్వచ్ఛందంగా గౌరవార్జన చేయుటకు బద్ధకస్తులై, కేవలం జన్మవల్లనే గౌరవాన్ని లాగేసుకోవాలనుకున్న, సంకుచిత, కపట స్వభావులూ. ఇలాంటి వారు కులాలకు వంశపారంపర్యతను, తరతమ బేధాల నాపాదించినట్లు గత చరిత్ర చెబుతుంటే నేటికీ కులవివక్షతను, కుల సమస్యలను పెంచి పోషిస్తున్నది మాత్రం కొన్ని స్వార్థపూరిత పాలక వర్గాల వారేనని వర్తమాన చరిత్ర సృష్టీకరిస్తున్నది హర్షా!

దేవాంశ్ : సర్వమత, సర్వమానవ సమానతా ప్రభోధాత్మకం శ్రీమద్భగవద్గీత అంటున్నారు అదెలా? అందుకు కొన్ని నిదర్శనాలను తెలియజేస్తారా తాతయ్యా?

వ్యాఖ్యాత : తప్పక తెలియజేస్తాను దేవాంశ్! అందరూ శ్రద్ధగా వినండి.

సర్వమత, సర్వమానవ సమానతా ప్రబోధాత్మకం శ్రీమద్భగవద్గీత

గీత 4-11 "ఎవరేమార్గంలో నన్నుపాసిస్తే, వారికామార్గంలోనే అభీష్టసిద్ధిని కలిగిస్తాను. అన్నివైపులనుండి పయనిస్తున్న మానవులంతా అంతిమంగా వస్తున్నది నామార్గానికే"

గీత 7-21 "ఏ దేవతామూర్తి నారాధింపగోరు భక్తునికి, ఆ దేవత పట్ల శ్రద్ధను కలిగిస్తాను. అతడామూర్తినే భజించి అభీష్టసిద్ధినందుతాడు వాస్తవానికా ఫలాన్నిస్తున్నది నేనే.

గీత 9-23 "ఒకే సూర్యుడు లోకమంతటినీ ప్రకాశింపజేస్తున్నట్లే ఒకే ఆత్మ ప్రాణులన్నింటినీ చైతన్యవంతం చేస్తున్నది. ఆత్మ రూపంలో అందరిలో నివసిస్తున్నది సర్వేశ్వరుడే! ఈ వాస్తవాన్ని గ్రహించిన వారు, ఎవర్ని ద్వేషించినా, హింసించినా వారిలోని సర్వేశ్వరుని ద్వేషించి నట్లేనని గ్రహించి,

ఎవర్నీ ద్వేషించి, హింసించటానికి పూనుకోరు. ఇలా సర్వమత సామరస్యాన్ని భిన్నత్వంలో ఏకత్వాన్ని, సర్వమానవ సమానత్వాన్ని సహేతుకంగా చాటి చెబుతున్నది శ్రీమద్భగవద్గీత.

గీత 13-4 **"ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్..."** అంటే ఒకే సత్యాన్ని ఋషులు బహువిధంగా కీర్తించారని భావం. దీన్నే ఋగ్వేద మిలా పేర్కొన్నది. **"ఏకం సత్ విప్రాబహుధావదన్తి"** నేటి కాలానుగుణంగా, ఈ ఋక్కును, గీతను ఇలా అన్వయించుకోవచ్చు.

"ఉన్నదొకటేసత్యం! దీన్నే వివిధంగావ్యవహరిస్తున్నారు పండితులు

'విష్ణు' వని వైష్ణవులు - **'శివు'**డని శైవులు - **'బుద్ధు'**డని బౌద్ధులు - **'అర్హన్'** అని జైనులు

వ్యాఖ్యాత : అంతేగాదు లోకకళ్యాణార్థం శుభకామనా ప్రార్థనలు గూడ చేసేవారునాడు.

ఉదా॥ **"భద్రం కర్ణేభిః శ్రుణయామ దేవాః - భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః**
స్థిరైరంగై స్తుష్టువాగ్ం సస్తమాభిః - పశ్యేమ దేవహితం యదాయుః"

"ఓ దేవతలారా మేము జీవించి యున్నంత దాక మాచెవులతో శుభాలనే వినగోరుచున్నాం మాకన్నులతోశుభాలనే కనగోరుచున్నాము" అని భావం (దీన్నే ఇంకా యిలా అన్వయించుకోవచ్చు) మా నోటితో శుభాలను, సత్యాలనే పల్కగోరుచున్నాము! మా మనసుతో శుభాలనే సంకల్పించ గోరుచున్నాం. మా చేతులతో శుభ కార్యాలనే చేసెదము గాక! మా పాదాలతో శుభ ప్రాంతాలకే చేరెదము గాక! పటిష్టావయవాలు గల మా దేహంతో ప్రపంచ కళ్యాణంకోసం పాటుపడుతూ మీరు మాకుప్రసాదించిన ఆయుష్కాలమంతా పూర్తిగా జీవించ గోరుచున్నాము.

సర్వసమానతను, సమిష్టి భాగ స్వామ్యాన్ని ఆకాంక్షిస్తున్న ఋగ్వేద సూక్తాలు

వ్యాఖ్యాత : బాలబాలికలారా! సర్వసమానతను, సమిష్టిభాగస్వామ్యాన్ని ఆకాంక్షిస్తున్నట్టి ఋగ్వేద సూక్తాలివిగో! వీటిని గూడ గమనించండి, పరిశీలించండి.

10-191-2 **"సంఘచ్ఛధ్వం సంవదధ్వం - సంవో మనాంసి జానతాం దేవాభాగం యధాపూర్వే - సంజానానా ఉపాసతే"**

ఓ మానవులారా, మీరంతా -

"ఒకే బాటగ, ఒకే మాటగ, కలిసి నడవండి! కలిసి పలకండి!

మీ మనసులన్నీ కలబోసి ఒక్కటిగ ఆలోచించండి!"

"మన దేవతలు సమైక్యంగా మనహవిస్సులను స్వీకరించినట్లే

మీరు గూడ విభేదాలు లేకుండా సమైక్యంగా మన గ్రామ ధనాన్ని పంచుకోండి!"

10-191-3 **"సమానో మంత్రఃసమితిః సమానీ - సమానం మనః సహచిత్తమేషాం**

సమానం మంత్ర మభిమంత్ర మేవః - సమానేనవోహవిషా జుహోమి"

ఈ సమావేశం మనందరిదీ

ఇక్కడ సమావేశమైన మనందరి ప్రార్థన ఒక్కటై యుండాలి

మనందరి కోర్కెలు, లాభం, లక్ష్యం సమానమై ఉండాలి

అంతా, అన్నీ అందరికీ సమానంగా అందాలి.

మనందరి సమిష్టిహవిస్సు(సంపద)తో

ఈ యజ్ఞాన్ని (సమిష్టి కార్యాన్ని) నిర్వహించెదము గాక!

10-191-4 **"సమానీ వ ఆకూతిః సమానా హృదయానివః**

సమానమస్తువో మనో - యధావః సుసహాసతి"

ఓ యజ్ఞ (సమిష్టి కార్య) భాగస్వాములారా!

మన అంతఃకరణం, హృదయాలు, సంకల్పాలు ఒక్కటై ఉండాలి.

మనందరి సమైక్యతాభావనకు ఎవరినుండీ అంతరాయం కలగకుండు గాక!

ప్రాచీనకాలంలో పనివిభజన ద్వారా రూపొందిన ఆయాబృందాలవారు తాము ఉత్పత్తి చేసిన సంపదనంతా తెచ్చి గ్రామంలోని రచ్చబండ దగ్గర ఉంచేవారు. అందరూ చేసిన ఉత్పత్తులైన ధాన్యం, పప్పులు, కూరగాయలు - కుండలు, చెప్పులు - వస్త్రాలు మొదలగు వాటన్నింటినీ తెచ్చి రచ్చబండ వద్ద రాశులుగా ఉంచేవారు.

గ్రామపెద్దలు రచ్చబండ దగ్గరపై తెల్పిన విధంగా ప్రార్థనా సూక్తాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశాక గ్రామ ప్రజలంతా తమ తమ అవసరాల మేరకు ఆయా ఉత్పత్తులను తమ తమ గృహాలకు పట్టుకెళ్తుండేవారు. అందరూ పంచుకోగా, మిగిలిన సమిష్టి సంపదతో గ్రామస్థులంతా నమైక్యంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుండేవారు.

విరాజ్ ఉజ్వల్ : భగవద్గీతలో పలు వైరుధ్యాలున్నవంటున్నారు కొందరు. ఒకే కవి వ్యాస మహర్షిరూపొందించిన శ్రీమద్భగవద్గీతలో వైరుధ్యాల కవకాశమెలాఏర్పడింది తాతగారూ?

వ్యాఖ్యాత : భగవద్గీతలో వైరుధ్యాలున్నవని, వేర్వేరుకాలాలలో భిన్న రచయితలు తమ తమ భావాలను భగవద్గీతలో ప్రక్షిప్తం చేశారు. అందువల్లనే

గీతాగ్రంథంలో వైరుధ్యాలు నెలకొన్నాయని **'ఖేర్'** వంటి చరిత్రకారులు అపోహపడ్డారు. ఆ భ్రమనుండి బయటపడి అట్టి విమర్శకులంతా గ్రహించాల్సిన వాస్తవాలు కొన్ని ఉన్నాయి అవి –

వాస్తవం 1 : మహాభారత భీష్మ పర్వంలోని అంతర్భాగమే భగవద్గీత. అందువలన మహాభారత గ్రంథ లక్షణాలన్నీ భగవద్గీతకూ వర్తిస్తాయి ఇదొక వాస్తవం.

వాస్తవం 2 : మహాభారత రచనా కాలం నాటికే భారతదేశం ఏకైక రాజ్యవ్యవస్థగా రూపొందింది. కానీ, దేశవ్యాప్తంగా భిన్న తెగల, జాతుల ప్రజలు నివసిస్తున్నందున, భారతదేశంలో భిన్న సంస్కృతీ సంప్రదాయాలు నెలకొన్నయ్.

వాస్తవం3 : కేంద్రీకృత రాజ్యవ్యవస్థలో ప్రజలందరికీ ఒకే ధర్మాన్ని, విధివిధానాలను అమలు చేసుకోవలసి ఉన్నందున, ఆ దిశగా ప్రజలందర్నీ చైతన్య పరచుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఐతే నాడు వైదిక మతం విధించిన నిషేధం కారణంగా స్త్రీలు, శూద్రులు వేద పఠనానికి దూరమయ్యారని పలు గ్రంథాలు తెల్పుతున్నాయి. అందువలన ప్రజలందరికీ వేదోక్త ధర్మాలను, నైతిక విధివిధానాలను బోధించటానికై వేద సమానమైన మరో గ్రంథాన్ని విధిగా రూపొందించుకోవాల్సి వచ్చింది.

వాస్తవం 4 : నాడు ప్రజలందరికీ నైతిక, ధార్మిక బోధనాలక్ష్యంతో రూపొందించుకోవలసిన గ్రంథం తప్పనిసరిగా రెండు లక్షణాలను కలిగియుండాలి. 1. ఆ గ్రంథం మిక్కిలి జనరంజకమై ఉండాలి. 2. అది తమ గ్రంథమన్న భావన, అన్ని తెగల, జాతుల ప్రజలందరికీ కలగాలి.

వాస్తవం 5 : అట్టి ప్రజాగ్రంథ రచయిత గూడ విధిగా కొన్ని విశిష్ట లక్షణాలను కలిగియుండాలి. 1. అట్టి రచయిత దేశవ్యాప్తంగా గల అన్ని తెగల, జాతుల, పండిత, పామర ప్రజలందరి ఆచారవ్యవహారాలు, సంప్రదాయాల పట్ల

సానుభూతిని, సానుకూలదృక్పథాన్ని కల్గియుండాలి. 2. ఆయన ఏదో ఒక దానికి కట్టుబడి పక్షపాత బుద్ధితో వ్యవహరించకుండా, అన్నింటినీ, అందర్నీ సమభావనతో చూడగల్గిన విశాలహృదయుడై ఉండాలి. మరి అట్టి సమున్నత భావాలను సమృద్ధిగా కల్గియున్నందువల్లనే శ్రీమాన్ వ్యాస మహర్షి 'జయము' పేరిట మహాభారతమను ప్రజాగ్రంథాన్ని రూపొందించ గలిగారు.

మహాభారతం ప్రజాగ్రంథంగా రూపొందిన విధం : నాడు ఆసేతు హిమాచల పర్యంతం నివసిస్తున్న భిన్న తెగల, జాతుల ప్రజలందరి ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలు అందరి విశ్వాసాలు, నైతిక, ధార్మిక, తాత్విక భావాలు, వారి వారి ప్రాచీన చరిత్రలు, కథలు, గాథలు, పాటలు, గేయాలు మొదలగు వాటిన్నిటినీ సేకరించి, నాడు ప్రధాన స్రవంతిగా ఉన్నట్టి ఆర్య సంస్కృతిలో వాటిని సమన్వయ పరచి మహాభారత గ్రంథాన్ని రూపొందించారు వ్యాసమహర్షి! అలా దేశంలోని వివిధ తెగల, జాతుల ప్రజలందరి మౌలిక ఐక్యతను, అంటే భిన్నత్వంలో గల ఏకత్వం ప్రజలందరి హృదయాలలో నాటుకొనేలా, ఆబాల గోపాలమూ ఆ గ్రంథంతో మమేకమయ్యేలా వ్యాసమహర్షి చేసిన మహత్తర కృషిఫలితమే మహాభారత గ్రంథావతరణమని డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ విశ్లేషించారు.

పంచమవేదం మహాభారతం : స్త్రీ, శూద్ర జనులకు వేద పఠనం నిషేధింపబడిన కారణంగా, ప్రత్యామ్నాయ మార్గంగానైనా వారికి సైతం వేదోక్త, నైతిక, ధార్మిక బోధ చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ లక్ష్యంతో రూపొందింపబడినందునే మహాభారతానికి పంచమవేద ఖ్యాతి లభించినదని కృష్ణయజుర్వేద భాష్యకారుడైన సాయనుడు వ్యాఖ్యానించారు.

మహాభారతం గూర్చి సోదరి నివేదిత : పాఠకుల, శ్రోతల హృదయాలకు హత్తుకునేలా భారతం ప్రకటిస్తున్న వాస్తవాలు రెండు. 1. భారతదేశంలో నాడు భిన్నత్వంలో ఏకత్వం విరాజిల్లుతున్నది. 2. నాడు కేంద్రీకృత భారతదేశమున్నది, దానికొక వీర సాంప్రదాయ మున్నది. అదే

భారతీయులందరి ఐక్యతకు ప్రేరణగా ఉంటున్నది. మరి ఆసేతు హిమాచల పర్యంతం అన్ని రాష్ట్రాల, భాషల ప్రజలందరికీ నేటికీ మహాభారతం పరమ ప్రామాణిక గ్రంథంగా వర్ధిల్లుతున్నదంటే, సోదరి నివేదిత విశ్లేషణ వాస్తవ మనటానికి, ఎంతో ముందుచూపుతో వ్యాసమహర్షి భారతాన్ని రూపొందించారనటాని కింతకన్నా నిదర్శన మేం కావాలి?

భగవద్గీతా లక్ష్యం : మహాభారత లక్ష్యమే, భగవద్గీతా లక్ష్యమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే గీతారచనాకాలం నాటికే భారతావనిలో భిన్న జాతుల ప్రజలు సహజీవనం చేస్తున్నట్లే, భారతీయ సమాజంలో భిన్న తాత్విక దృక్పథాలు గూడ పరస్పరం విభేదించుకుంటూ బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఉదా॥ 1. ఆత్మ ఆధారంగా కొనసాగుతున్న ఉపనిషత్సంప్రదాయం 2. ప్రకృతి సంపర్కాన్ని వదిలించుకొనుట ద్వారా ముక్తిని పొందవచ్చున్నట్లున్న సాంఖ్య సిద్ధాంతం 3. స్వధర్మ నిర్వహణ ద్వారా పరిపూర్ణతను సాధించవచ్చును అంటున్న కర్మమీమాంస 4. హృదయౌన్నత్య, నిర్మలత్వాల ద్వారా మోక్షాన్ని పొందవచ్చునంటున్న భక్తిమార్గం 5. జిగేలు మంటున్న బాహ్య ప్రపంచాన్ని మరచి ఆత్మను ప్రశాంత స్థితిలో ఉంచుకుంటే, మోక్షం సిద్ధిస్తుందంటున్న యోగ సిద్ధాతం 6. వేదాల బహుదేవతావాదం 7. భాగవతుల ఏకేశ్వరవాదం ఇంకా 8. చార్వాకాది పలు తాత్విక దృక్పథాలు పరస్పరం విద్వేషించుకుంటూ భారతదేశ మంతటా ప్రచలితమై ఉన్నాయి. అట్టి భిన్న తాత్విక భావాలన్నింటినీ తనలో యిముడ్చుకుని, సమన్వయపరచి మానవాళికి బోధించుట ద్వారా భిన్నత్వంలోని ఏకత్వాన్ని విలసిల్లజేయు లక్ష్యంతో మహాభారతంలాగే, అందలి అంతర్భాగమైన శ్రీమద్భగవద్గీతనూ రూపొందించారు శ్రీమాన్ వ్యాసమహర్షి. గీతా విమర్శకులారా! మరియు ప్రియమైన బాలబాలికలారా! శ్రీమద్భగవద్గీతను గూర్చిజాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల విశ్లేషణలను చూసైనా భగవద్గీతా ఔన్నత్యాన్ని, మహోన్నత లక్ష్యాన్ని గ్రహించెదరు గాక. ఇవే సదరు విశ్లేషణలు :

మోనియర్ విలియమ్స్ : సాంఖ్య, యోగ, ఉపనిషదర్థాలతో సహా నాటి ప్రముఖ తాత్విక భావాలన్నింటినీ కలగలిపి భిన్నత్వంలోని ఏకత్వాన్ని వెలుగులోకి తెచ్చేందుకు గీతా రచయిత చేసిన ప్రతిభావంతము, ప్రశంసనీయమైన కృషి ఫలమే భగవద్గీత!

ఆర్.లాన్నయ్ : నాటి పలు తాత్విక సాంప్రదాయాలను కలగలిపి, వాటి సంగమాన్ని సార్వత్రిక మానవభాషలో వ్యక్తీకరించేందుకు చేసిన సాహసమే భగవద్గీత.

ఆల్డస్ హక్స్‌లీ : అంతటా వెదజల్లబడుతున్న నిరంతర తాత్వికతను అత్యంత క్రమ పద్ధతిలో బోధించిన, తాత్విక శాసన ప్రకటనయే భగవద్గీత.

జువాన్ మాస్కరో : ప్రపంచ రంగస్థలమనెడి సువిశాల దేవాలయంపై అలరారుతున్న సుందరగోపురం భగవద్గీత.

గార్బే : భగవద్గీతగా రచయితలో ఒక మహర్షి యున్నాడు. ఆయన తన సంపూర్ణ జ్ఞానానుభూతుల్ని ఆనందంగా వెదజల్లాడే గాని ఒక మత తత్వవేత్తగా తన మత సిద్ధాంతాని కనుగుణంగా తన భావాలను ఎంత మాత్రం సర్దుబాటు చేసుకోలేదాయన!

వారన్ హేస్టింగ్స్ : ఉన్నత శిఖరాల నధిరోహించ దలచిన వారికి అద్వితీయ సాధనం గీతోపదేశం!

ఎడ్విన్ ఆర్నాల్డ్ : భారతీయుల ప్రియతమ భగవద్గీతకు అనువాద గ్రంథమే లేకుంటే, ఆంగ్ల సాహిత్యం అసంపూర్ణంగానే ఉండిపోయేది, ఇది నిజం!

విలియం వాన్ హంబోల్డ్ : తాత్వికంగానే గాదు, సాహిత్య పరంగానూ లోకోత్తర సౌందర్యంతో విరాజిల్లుతున్నది శ్రీమద్భగవద్గీత. సంస్కృత సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందిన అందమైన ధార్మిక కవిత భగవద్గీత! ప్రపంచ భాషలలోకెల్లా నైతిక, ధార్మిక, తత్వజ్ఞానంతో

అలరారుతున్న 'ప్రపంచైక తాత్విక గీతం భగవద్గీత!' అని విశ్లేషించిన వీరు జర్మన్ భాషలో గీతానువాదకర్త!

బంకించంద్ : భగవద్గీతలో దర్శించగలిగినట్టి ధర్మ సమన్వయాన్ని ప్రపంచంలో మరెక్కడా చూడలేం.

ఆచార్య వినోభాభావే : నా దేహాభివృద్ధికి నా తల్లి పాలెంతగా తోడ్పడ్డాయో నా మానసిక వికాసానికి అంతకన్నా మిన్నగా తోడ్పడింది శ్రీమద్భగవద్గీత!

ఎ.ఎల్.భాషం : ప్రాచీన భారతీయ సుప్రసిద్ధ ధార్మిక ప్రబోధ గ్రంథం శ్రీమద్భగవద్గీత!

ఎస్.దాస్. గుప్తా : కోర్కెల నుండి భయటపడి స్వలాభాపేక్ష రహితంగా తన విధ్యుక్త కర్మలను నిర్వహించు నిస్వార్థ కార్యసాధకుడు, ఆ కార్యాల పాప పుణ్యాలకు బాధ్యుడు కాడు. వాటికి భగవంతుడే బాధ్యతవహిస్తాడని చెబుతున్నది భగవద్గీత.

స్వామీ వివేకానంద : గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునకు చెప్పినవి మాటలు కావు, జ్ఞాన గుళికలు. మానవ జీవితాదర్శాన్నంతటినీ ఆ కొద్ది సమయంలోనే తెలియజేసింది భగవద్గీత. గీత యందలి ప్రతిపుటలలోనూ దేదీప్యమానంగా భాసిస్తున్న సందేశం చురుగ్గా శ్రమించటం, ఆ చురుకుదనంలోనే అంతులేని ప్రశాంతత. ఇదే శ్రమ రహస్యం తత్సాధనయే గీతా లక్ష్యం!

లోకమాన్య బాలగంగాధర తిలక్ : సంక్షోభానికి గురైన మనిషికి గొప్ప శక్తిని సమకూర్చి తిరిగి అతన్ని సరైన కార్యాచరణకు ఉత్తేజ పరుస్తున్నది శ్రీమద్భగవద్గీత.

పండిత నెహ్రూ : క్రీస్తుపూర్వం 500 సం॥క్రితమే రూపొందిన భగవద్గీత నేటికీ మన జీవిత సమస్యలకు పరిష్కారాలను చూపగల్గుతుందంటే ఎంతటి

నిత్యసత్యమైనదీ భగవద్గీత? సార్వజనీన, సార్వకాలికమైనట్టి గీతా గ్రంథకర్త మిక్కిలి అభినందనీయుడు.

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ : ఇరవై ఐదు శతాబ్దాల క్రితమే మానవ జీవిత సమస్యలకు ఉపనిషత్తులు, జ్ఞానమార్గంలో పరిష్కారాన్ని చూపుతుంటే– మానసిక, అంతరంగిక, సంక్షోభాల సంకట పరిస్థితులను అధిగమించేందుకు మానవాళికి తగిన సందేశ మిస్తున్నది భగవద్గీత! **"మానవ జీవిత సమస్యల్ని పరిష్కరించటం, సవ్యమైన ప్రవర్తనకు మనిషిని ప్రేరేపించటం"** ఇదే గీతా లక్ష్యం!

మహాత్మాగాంధీ : ప్రపంచ తాత్విక వాఙ్మయంలో భగవద్గీతను పోలిన విశిష్ట గ్రంథం మరొకటి లేదు. ఎందుకంటే? అన్ని మతాల పవిత్ర గ్రంథాలు ఆత్మను దర్శించాలనే చెబుతున్నాయి. కానీ, ఆత్మను దర్శించాలనుకునేవారికి, ఆత్మదర్శనా మార్గాలనుగూడ తెలియజేస్తున్నది భగవద్గీత! అంతేకాదు. ఏ దేశం, ఏ మతం, ఏ వయసువారైనా సగౌరవంగా చదువుకోగల్గిన దివ్యగ్రంథం గీత. ఎందుకంటే? వారు తమ తమ మత సిద్ధాంతాలను గీతలో దర్శించగలరు. భగవద్గీతలో వాడిన గంభీర పదాలకు కాలానుగుణంగా అర్థాలు మారుతుండ వచ్చును గాని, గీతామూలమంత్రం తత్సందేశమెన్నటికీ మారవు. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న నాకు తల్లిలా చేరువైంది గీతామాత! సమస్యలతో సతమతమౌతున్నప్పుడు గీతామాతను ముందుంచుకొని చదువుతుంటాను. అప్పుడు నాకొక సరైన పరిష్కారమార్గం అగుపిస్తుంది. ఇక నిశ్చింతంగా ఆమె చూపిన మార్గాన ముందుకి వెళ్తుండేవాడిని. నాకే గాదు ఆమెను చదివే వారందరికీ సర్వసమస్యా పరిష్కారిణి గీతామాత! అని అద్భుతంగా విశ్లేషించారు ప్రపంచ శాంతి దూత గాంధీ!

పుచ్చలపల్లి సుందరయ్య : తొలి దశలో సామాజిక కర్తవ్య నిర్వహణకు పూనుకోటానికి నన్ను ప్రేరేపించింది భగవద్గీతయే!

నండూరి రామ్మోహనరావు : 2500 సం॥క్రితం అవతరించినప్పటికీ సార్వజనీనం, సార్వకాలికమైనందున, చిన్న చిన్న మినహాయింపులతో నేటికీ గీతాబోధనలు ఆమోద యోగ్యాలు ఆచరణీయాలే! మరియు భారతీయ తాత్విక వాఙ్మయానికి ప్రథమ ప్రస్థానం ఉపనిషత్తులు– ద్వితీయ ప్రస్థానం బ్రహ్మ సూత్రాలు కాగా తృతీయ ప్రస్థానంగా భగవద్గీతను ఎంపిక చేశారు. అలా భారతీయ తాత్విక వాఙ్మయంలో శిఖరాగ్రస్థానాన్ని అలంకరించినది భగవద్గీత!

సొదుం రామ్మోహన్ : ప్రతి మనిషీ ప్రయత్నపూర్వకంగా ఇంద్రియాల, నదుపులోపెట్టుకోవటం ద్వారా ఉత్తమునిగ ఎదగటం సాధ్యమే. ఇంద్రియాల అదుపుద్వారా తనలోని రజోతమోగుణాలను అధిగమించి, సాత్విక గుణాన్ని ప్రథమ స్థానంలో నిలుపుకోవచ్చు. ప్రయత్న పూర్వకంగా అలా ప్రతి ఒక్కరూ సాత్వికునిగా ఎదగాలని నిర్దేశిస్తున్నది భగవద్గీత!

ఉషశ్రీ : మతగ్రంథం కాదు, మానవతా ప్రబోధ గ్రంథం గీత. మానవ జీవితానికి పరమార్థాన్ని తెలిపి, మనిషి కర్తవ్యాన్ని నిర్దేశిస్తున్న కర్తవ్య ప్రబోధ గ్రంథం భగవద్గీత! అందుకే తప్పక మీరు భగవద్గీతను అధ్యయనం చేయండి. ఇకమీరే అర్జునుడు! మీ చేతిలోని గీతయే శ్రీకృష్ణభగవానుడు!

శిష్ట్లా సుబ్బారావు : వ్యక్త ప్రపంచమంతా అవ్యక్తంగా ఉన్న పరమాత్మ అంశయే. అందువలన మానవ సేవేకాదు, చరాచర ప్రకృతిసేవయంతా పరమాత్మ సేవేనని ప్రబోధిస్తున్నది భగవద్గీత!

ఇండోరు మహారాణి అహల్యాబాయి: అర్జునుని వలెనే సూక్ష్మగ్రాహి, గొప్పభక్తురాలైన ఇండోరు మహారాణి అహల్యాబాయి హోల్కారు గీతా పఠనం శ్రవణం, మోక్షదాయకమని విని యున్నందున, ఒకరోజు అస్థాన పండితుని, తనకు భగవద్గీతను చదివి వినిపించుమని కోరింది. ఆయన భగవద్గీతను తెరిచి–ప్రథమాధ్యాయంలోని ప్రథమ శ్లోకాన్ని ప్రారంభించాడు **"ధర్మక్షేత్రే**

కురుక్షేత్రే... అని అర్ధవాక్యం చదవగానే – ఆచార్యా ఇక చాలు ఆపండన్నారామె. సభికులు ఆశ్చర్యపడి చూస్తుండగా, పండితుడు చదివిన పదాలనే అటునిటుమార్చి వాటికి '0' ను చేర్చి **"క్షేత్రే, క్షేత్రే ధర్మంకురు"** అని చదివారు రాణి. (క్షేత్రం = చోటు, ప్రదేశం, శరీరము, దేహం) అనంతరం దాని భావాన్నిగూడ ఆమె వివరించారిలా– నీవుండే ప్రతిచోటా ధర్మంచేయి. 'నీవు ఏ దేహాన్ని ధరించినా ధర్మంగా ప్రవర్తించు'. అలా ధర్మంగా ప్రవర్తించినవారికి తప్పక మోక్షం లభిస్తుంది. అనే గదా ఆచార్యా భగవద్గీత మనకందిస్తున్న సందేశం! అని రాణి అనగానే, ఆమె సూక్ష్మ గ్రాహ్యతకు ఆశ్చర్యపడి, సభ్యులంతా కరతాళ ధ్వనులతో ఆమెనభినందించారట!

వి.యం. మోహనరాజ్ : ఇరవై ఐదు శతాబ్దాలుగా భగవద్గీత ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకోవటంలోని రహస్యమేమంటే? ఎలాంటి మతపరమైన మొగ్గులేకుండా గీత, కేవలం తత్వ(సృష్టి) రహస్యాలను మానవుల కందజేస్తుండటమే. కావున వ్యాఖ్యాతలు గూడ, గీతయొక్క ఈ మౌలిక లక్ష్యాన్ని గుర్తుంచుకుని ప్రజలను తదనుగుణంగా ప్రభావితం చేసేందుకే, ప్రపంచ కళ్యాణం కోసమే భగవద్గీతను వినియోగించుకోవాలి. ఉదా॥ స్వాతంత్ర్య సమరంలో ఉద్యమాన్ని మరింత సమరశీలంగా నడిపేందుకు గీతను ఉపయోగించుకున్నారు. లోకమాన్య బాలగంగాధర తిలక్! – అంటరానితన నిర్మూలనకు, మత సహనాన్ని, మతసామరస్యాన్ని చాటి చెప్పేందుకు భగవద్గీత నుపయోగించు కున్నారు మహాత్మాగాంధీ! కానీ, గీతమౌలిక లక్ష్యానికి విరుద్ధంగా తీవ్రహిందూ జాతీయ వాదాన్ని ప్రోత్సహించేందుకు నాడూ నేడూ కూడా ప్రయత్నిస్తున్నారు కొందరు! ఇక **నాస్తికులు, హేతువాదులు, భౌతికవాదులు, కమ్యూనిస్టులు, భగవద్గీతను మత గ్రంథంగా భ్రమించి పట్టించుకోవడం లేదు.** వీళ్ళంతా గుర్తించలేకపోయిన వాస్తవమేమంటే? కారల్‌మార్క్స్ గూడ హేగెల్ వంటి

హేమాహేమీల తత్వశాస్త్రాలను ఏళ్ళ తరబడి అధ్యయనం చేయబట్టే, ప్రపంచానికి సామ్యవాదాన్ని పరిచయం చేయగలిగాడన్నదే సదరు వాస్తవం!

ఐతే హిందూ ధర్మానికిగల ఈ విశాల తత్వాన్ని, సర్వమానవ, సర్వమత సమానతా స్ఫూర్తినీ, విశిష్టతనూ విస్మరిస్తున్న వారి సంఖ్య నానాటికీ విస్తరిస్తున్నది. ఇలా పెరిగిపోతున్న ఈ సంకుచిత దృక్పథాన్ని అడ్డుకుని నిజమైన హైందవ స్ఫూర్తితో, విశాలదృక్పథంతో ప్రజలందరినీ ప్రగతి పథాన పయనింపజేసేందుకు, భారతజాతి సమైక్యతను, భిన్నత్వంలోని ఏకత్వాన్ని దేదీప్యమానంగా భాసింపజేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అందుకు ప్రజలందరికీ గీతాస్ఫూర్తిని కలిగించాలి. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, రాజకీయనాయకులు, క్రమంగా ప్రజలందరి చేతా భగవద్గీతను అధ్యయనం చేయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని విజ్ఞులు వక్కాణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భగవద్గీతను పాఠ్య గ్రంథంగా ఉంచాలని, భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలన్న వాదనలు ముందుకొస్తున్నాయి. ఐతే ఈ కార్యక్రమాన్ని భగవద్గీతా సామరస్య స్ఫూర్తిని సహేతుకంగా ప్రజలందరికీ వివరించడం ద్వారా విజయవంతం చేసేందుకు ప్రయత్నించాలి. తప్ప తద్విరుద్ధంగా మెజారిటీ మతవాదంతో ముందుకు తీసుకెళ్ళే యత్నం వ్యతిరేక పరిణామాలకు పునాది వేస్తుంది తస్మాత్ జాగ్రత్త!

యువన్‌తేజన్ : ఇంతకూ భగవద్గీతలో విమర్శకులెత్తిచూపుతున్న వైరుధ్యాలేంటి తాతయ్యా?

వ్యాఖ్యాత : శ్రీమద్భగవద్గీతలో తొలి ఆరు అధ్యాయాలను కర్మషట్కమనీ రెండవ ఆరు అధ్యాయాలనూ భక్తి షట్కమనీ – చివరి ఆరు అధ్యాయాలను జ్ఞానషట్కమనీ, కర్మ–భక్తి–జ్ఞాన మార్గాలను చూపారు. ఈ మూడింటిలో ఎవరేమార్గంలో పయనించినా వారందరూ చేరుకునే గమ్యం పరమాత్మయేననీ, మార్గాలు వేరైనా గమ్యమొక్కటేనని ప్రబోధిస్తున్నది

శ్రీమద్భగవద్గీత. ఐతే జ్ఞాన మార్గమే శ్రేష్ఠమని జ్ఞానషట్కంలోను – భక్తి మార్గమే శ్రేష్ఠమనిభక్తి షట్కంలోను – కర్మమార్గమే శ్రేష్ఠమని కర్మషట్కంలోనూ చెప్పబడిన కారణంగా ఈ మూడు షట్కాలనూ ముగ్గురు కవులు వేర్వేరు కాలాలలో రాసి భగవద్గీతలో ప్రక్షిప్తం చేసియుండవచ్చని ఖేర్‌వంటి చరిత్రకారులు అపోహపడ్డారు.

హర్షవర్ధన్ : మరి ఒకే రచయితైన వ్యాస తాతయ్య ఏదో ఒక మార్గం గొప్పదని చెప్పాలి గాని దేనికదే గొప్పదని ఎందుకు చెప్పినట్లు తాతగారూ?

వ్యాఖ్యాత : బాబూ అవి వైరుధ్యాలు కానేకావు. దేనికదే గొప్పదని, చెప్పటం వెనక ఒక ప్రణాళిక ఉన్నది. అదేమిటంటే ? ఉదాహరణకు వేయి కిలోమీటర్ల గమ్యం చేరటానికి 1. మోటారు సైకిలు యాత్ర 2. సైకిలు యాత్ర 3.పాదయాత్ర లున్నవనుకుందాం. మోటారు సైకిలు యాత్రికులకు సదరు యాత్రావిధానాన్ని, దాని విశిష్టతనూ, దానిని కొనలేని సైకిలు యాత్రికులకు దాని వివరాలనూ, విశిష్టతనూ, సైకిలు గూడా కొనలేని, నడపలేని పాదయాత్రికులకు దాని విధాన విశిష్టతలను తెలియజేయాలి. ఇలా దేనికదే విశిష్టమైనదని బోధించుట ద్వారా ఒనగూడే లాభమేమంటే? ఎవరి స్థాయికి తగిన మార్గంలో వారికి ప్రీతిని, గౌరవాన్ని కల్గిస్తుంది, సదరు విధానం అంతేగాదు మోటారు సైకిలు, సైకిలు, పాదయాత్రలలో దేనిపట్లా ఎవరికీ ఆధిక్యతా, న్యూనతా భావాలను కలిగించకుండా కాపాడుతుంది సదరు బోధనావిధానం!

అలాగే జ్ఞాన–భక్తి–కర్మ షట్కాలలో దేనికదే విశిష్ట మార్గమని చెప్పటం వెనక గల ఆంతర్యం, లక్ష్యం యిదే సుమా. వారి వారి మానసిక, శారీరక శక్తిసామర్థ్యాల కనుగుణంగా, ఎవరేమార్గాన పయనించినా, వేర్వేరు మార్గాలలో పయనించి వచ్చి ప్రయాగలో కలిసిన గంగ, యమున, సరస్వతీ నదుల్లా పరమాత్మ వద్ద కలుసుకుంటారు జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలు మూడూ పరమాత్మ వద్ద త్రివేణీ సంగమంలా కలిసిపోతాయి! ఆ మూడింటినీ దేనికదే

విశిష్టమార్గంగా విశ్లేషించడంలో జగద్గురువు యొక్క ఆంతర్యంయిదే హర్షవర్ధన్.

రిత్విక్ : భగవద్గీతకు ఎన్నో భాష్యగ్రంథాలున్నాయి గదా, వాటిలో అత్యుత్తమమైన భాష్య గ్రంథమేదో తెలియజేస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : 'భాష్యాలు వేరైనా భగవద్గీత ఒక్కటే' నన్న సత్యాన్ని సదా గుర్తుంచుకోండి గీతకువేల సంఖ్యలో పరిశోధకులు, విమర్శకులున్నట్లే – వందల సంఖ్యలో భాష్యకారులూవున్నారు. ప్రాచీన భాష్యకారులలో ఆది శంకరాచార్యులు – రామానుజాచార్యులు, ఆధునికుల్లో జ్ఞానేశ్వర్, బాలగంగాధరతిలక్‌లు – ఇక భగవద్గీతకు భౌతికపరంగా భాష్యం చెప్పిన వారిలో **వి.యం. మోహనరాజ్** మొ॥ వారు సుప్రసిద్ధులు. ఇంద్రధనుస్సులో రంగులు వేరైనా వాటన్నింటికీ మూలమైన కాంతి కిరణమొక్కటే. అలాగే జ్ఞాన–భక్తి–కర్మ మార్గాలలో ఎవరికేమార్గం ప్రీతి పాత్రమైనా–ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాలలో ఎవరికే దర్శనమిష్టమైనా వాటన్నింటికీ మూలమైన శ్రీమద్భగవద్గీత యొక్కటే! అంటే భిన్నమార్గాలు, భిన్న దర్శనాలన్నీ అనుసంధానింపబడిన కేంద్ర బిందువే శ్రీమద్భగవద్గీత!

ఆదిత్య : తాత్విక విజ్ఞాన సర్వస్వం శ్రీమద్భగవద్గీత అంటున్నారు, ఇది వాస్తవమా తాతగారూ?

వ్యాఖ్యాత : ఔను ఆదిత్యా ఎందుకంటే? మహాభారతంలో అంతర్భాగమైనప్పటికీ, తన స్వతంత్ర ప్రతిపత్తికేమాత్రం లోటు లేని పరిపూర్ణ గ్రంథ రాజం శ్రీమద్భగవద్గీత. ఇది వేద–ఉపనిషత్–బ్రహ్మసూత్ర–బౌద్ధ–భాగవత–సాంఖ్య–యోగ శాస్త్రాలన్నింటి సారంతో భాసిస్తున్న రూపొందించిన సర్వ సమగ్ర గ్రంథరాజమిది. అందుకే యిందులో ఉన్నది ఇతరత్రా కనిపించవచ్చుగాని, ఇందులో లేనిది యింకెక్కడా కనిపించదు అన్న మహాభారతఖ్యాతి భగవద్గీతకూ దక్కింది. 'భగవంతుని జ్ఞానమే

భగవద్గీత'యని విశ్వసింపబడుతున్నందున అంతేగాదు 2500 సం॥క్రితం భగవద్గీత చెప్పిన సత్యాలు నేటికీ ఆచరణీయాలుగ అలరారుతూ ఉంది. 1."తాత్విక విజ్ఞాన సర్వస్వం" గాను 2. సార్వకాలిక, సార్వజనీన నైతిక ధార్మిక గ్రంథంగాను 3.నిత్య సత్య జ్యోతి గాను ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంటున్నది శ్రీమద్భగవద్గీత!

అగస్త్య : మనిషిలోని అంతరాత్మయే పరమాత్మ అంటున్నది భగవద్గీత! ఇది వాస్తవమేననటానికి నిదర్శనాలేమైనా ఉన్నవా తాతయ్యా?

వ్యాఖ్యాత : పరమాత్మ, మనిషిలోని అంతరాత్మ ఒక్కటేనని చాటుతున్నది భగవద్గీత! అదెలాగో చూద్దాం!! మనిషికి సదా మంచి, చెడులను, కర్తవ్య, అకర్తవ్యాలను, ధర్మ, అధర్మాలను సూచిస్తూ, సదా ధర్మమార్గాన పయనిస్తూ సత్కర్మలనే ఆచరించుమనీ ఫలాపేక్ష రహితంగా ప్రపంచ కళ్యాణం కోసం పాటు పడమనీ ప్రబోధిస్తుంటుంది మనిషిలోని అంతరాత్మ! ఐతే, ఆ మనిషి తను సూచించిన విధంగా నడిచినా, నడవకున్నా సాక్షీ భూతంగా చూస్తూ (చెప్పటమే నాధర్మం, వినకపోతే నీ ఖర్మం అనుకుంటూ) ఉంటుంది అంతరాత్మ!

ఇక శ్రీకృష్ణావతార మెత్తిన పరమాత్మగూడ అర్జునునకు ధర్మాధర్మాలను, కర్తవ్య అకర్తవ్యాలను తెలియజేసి అర్జునా! రాగ, ద్వేష, ఫలాపేక్ష రహితంగా నీ కర్తవ్యాన్ని నీవు నిర్వహించు. అప్పుడు నీవు పాపపుణ్యాల కతీతుడవౌతావని భరోసాయిచ్చి అంతిమంగా యిలా చెప్పాడు. గీత 18–63 అర్జునా నీకు పరమజ్ఞానాన్ని బోధించాను. ఇకనీవు బాగా ఆలోచించుకొని నీకు తోచినట్లు చేయి. అంటే ధర్మ రక్షణార్థం యుద్ధ నిర్వహణయో, బంధురక్షణార్థం యుద్ధవిరమణయో నీవే నిశ్చయించుకోమని బోధించాడు. కానీ శాసించలేదు. ఈ పోలికలు స్వభావాల ద్వారా పరమాత్మ మనిషిలోని అంతరాత్మ ఒక్కటేనని మనకు రుజువౌతున్నది!

తరణ్ : భారతజాతీయ సమైక్యతా సాధనకు అద్వితీయ సాధనం శ్రీమద్భగవద్గీత అని ఎలా చెప్పగలరు తాతయ్యా?

వ్యాఖ్యాత : 1. కనిపించని పరమాత్మ కనిపిస్తున్న ప్రపంచం, రెండు కావు, ఒక్కటేనని చాటి చెబుతున్నది భగవద్గీత. 2. అందువలన ప్రపంచ కళ్యాణం కోసం చేసేసేవంతా పరమాత్మ సేవయేనంటూ ప్రాణి, ప్రకృతి, పర్యావరణ, మానవ సేవను సహేతుకంగా ప్రబోధిస్తున్నది భగవద్గీత. 3. ప్రాణులన్నింటా చైతన్యరూపంలో ఉన్నది పరమాత్మయే. కావున ఏ ప్రాణిని, ఏ మనిషిని హింసించినా వారిలోని పరమాత్మను హింసించినట్లే కాగలదు. అందువలన ఏ ప్రాణినీ, ఏ మనిషిని ద్వేషించకండి, హింసించకండి అంటూ అర్ధవంతంగా హింసను ఖండిస్తూ అహింసను ప్రబోధిస్తున్నది భగవద్గీత. 4. ఎవ్వరే మతమార్గంలో పయనించినా, అంతిమంగా వారందరూ చేరుకొంటున్నది పరమాత్మ చెంతకే నన్న సత్య ప్రకటన ద్వారా సర్వమత సమానతను చాటుచున్నది భగవద్గీత.

ఈ కారణంగా భిన్నజాతులు, మతాలు, కులాల కాలవాలమైన మన భారత ఉపఖండంలో నెలకొనియున్న భిన్నత్వంలోని ఏకత్వసాధనకు – భారతజాతీయ సమైక్యతా సాధనకు శ్రీమద్భగవద్గీతా ప్రబోధమే అద్వితీయ సాధనమని స్పష్టమౌతున్నద గదా!

వశిష్ఠ : భగవద్గీత ద్వారా ప్రభావితులైన కొందరు ప్రముఖులను తెలియజేస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : సాపేక్ష సిద్ధాంతకర్త ఐన్‌స్టీన్–శ్వేత జాత్యహంకారాన్ని నిరసిస్తూ వీరోచితంగా పోరాడిన మార్టిన్ లూథర్‌కింగ్ – డా॥ అల్బర్ట్ స్విట్జర్ – రాల్ఫ్‌వాల్డో ఎమర్సన్ – హెర్మన్ హైసే – అల్డస్ హక్స్‌లీ– అణుబాంబు రూపకర్త రాబర్ట్ ఓపెన్ హైమర్ – రుడాల్ఫ్ స్టైనర్ – నికోలా టెల్సా క్రిస్టఫర్ ఇషర్‌వుడ్ – మాక్స్ ముల్లర్ – వారన్ హేస్టింగ్స్ – స్వామీ

వివేకానంద – విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ – ప్రపంచ శాంతి దూత మహాత్మాగాంధీ – పండితనెహ్రూ – లోకమాన్య బాలగంగాధరతిలక్ – ఖుదీరాంబోస్ మొదలగు ప్రముఖులంతా భగవద్గీతను అర్ధవంతంగా చదివి, తద్వారా ప్రభావితులైనవారే. **అలా అని వారే స్వయంగా వ్రాసుకున్నారు, చెప్పారు. అంతేకాకుండా, వారు–తమ చర్యలకు, భగవద్గీతా సందేశానికీ సారూప్యత ఉందనిగూడ ప్రకటించారు.**

జయరామ్ : భగవద్గీత విదేశీభాషల్లో వికసించటం ఎప్పటినుండి ప్రారంభమైంది తాతయ్యా?

వ్యాఖ్యాత : భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేసిన బ్రిటీష్ గవర్నర్ జనరల్ వారన్‌హేస్టింగ్స్‌కు భారతీయులచే విశేషంగా ఆదరింపబడుచున్న భగవద్గీతా గ్రంథ విశిష్టతను తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. వెంటనే తన మిత్రుడు ప్రొ॥ సర్‌చార్లెస్ విల్‌కిన్స్ ద్వారా 1785లో భగవద్గీతకు ఆంగ్లానువాదం చేయించి, **చదివి గీతా విశిష్టత కబ్బురపడి పోయాడట. అంతేగాదు, సదరు ఆంగ్లానువాద గీతాగ్రంథానికి ముందుమాట వ్రాస్తూ బ్రిటిష్ సామ్రాజ్యం నానాటికీ సంకోచిస్తూ ఉంటే – భారతీయ (అధ్యాత్మిక) సామ్రాజ్యం నానాటికీ విస్తరిస్తూ ఉంది అని వ్రాశాడు వారెన్‌హేస్టింగ్స్!** – ఆయన వాక్కు ఫలించిందా అన్నట్లు ఆయన చేయించిన ఆంగ్లానువాదంతో ప్రారంభమైన భగవద్గీత క్రమంగా 59 ప్రపంచభాషల్లో వికసించింది. ఉదా॥ 1785లో చార్లెస్ విల్‌కిన్స్ ద్వారా ఆంగ్లంలో – 1826లో విలియం ఓన్ హంబోల్డ్ ద్వారా జర్మన్ భాషలో, 1846లో లాసెన్ ద్వారా ఫ్రెంచి భాషలో – 1848 గ్యాలామోస్ ద్వారా గ్రీసు భాషలో –1962 లో జువాన్ మాస్కర్ ద్వారా మరోసారి ఆంగ్లంలో 19వ శతాబ్దంలోనే **ఒక ముస్లిం రాకుమారుని ఆసక్తి మేరకు ఉర్దూభాషలో...** ఇలా... దాదాపు ప్రపంచ ప్రముఖ భాషలన్నింటా వికసించి విరాజిల్లుతున్నది శ్రీమద్భగవద్గీత – ఒక్క ఉర్దూ భాషలోనే భగవద్గీతకు 20 ఉర్దూ అనువాద

గ్రంథాలుండటం ఒక విశేషమైతే, 36 ప్రపంచ భాషలలో పలుసార్లు పునర్ముద్రణ పొందటం ఇంకో విశేషం. నేటి కంప్యూటర్ యుగంలో కూడ శ్రీమద్భగవద్గీతా ప్రాధాన్యం చెక్కుచెదరలేదనటానికివి చక్కని నిదర్శనాలు జయరామ్!

హిమాంశ్ : తాతగారూ భగవద్గీతలో ప్రభావితులైన వారిని, గీతను అనువదించిన ప్రముఖులను తెలియజేసినట్లే శ్రీమద్భగవద్గీతను పరిశోధించిన కొందరు ప్రముఖులను గూడ తెలియజేస్తారా తాతయ్యా?

వ్యాఖ్యాత : గీతానువాదకులు దాదాపుగా వందమంది ఉంటే గీతా పరిశోధకులు వేలసంఖ్యలో ఉన్నారు. వీరిలో కొందరిపేర్లు మీకు తెలియజేస్తాను. ఉదా।। **వారన్‌హేస్టింగ్స్, విన్‌స్టన్ చర్చిల్ – ఒక మొగలాయి రాకుమారుడు – మెగస్తనీస్ – సోలినెస్ – హేప్‌కిన్స్‌గార్బే – కిత్ – హోల్డ్‌మెన్ – బార్నెట్ – డ్యూసెన్ – కె.టి.తెలంగ – ఆర్‌లాన్నయ్ – ఆల్డస్‌హక్సలీ – ఫ్రెడరిక్ మాక్స్‌ముల్లర్ – డొనాల్డ్ మెకంజీ – జి.హెచ్.ధావే – ఆర్.ఇ. ఫర్గిటర్ – ఎస్.పిగ్గాట్ – ఎ.ఎ. మాగ్డొనెల్ – డి. రాథ్మండ్ – ఆంటనోవా – కె.జునేడల్సన్ – ఆల్ఫ్రెడ్‌రస్సెల్‌వాలెస్ – మోనియర్‌విలియమ్స్ – జునోవ్ మాస్కరో – జి.ఎ. స్మాల్ – ఆర్.డబ్ల్యు ఫ్రేజర్ – వి. బోర్డోల్ – క్రిస్టఫర్ ఇషర్‌వుడ్ – ఆర్.టి. హెచ్ గ్రాఫిత్ – డగ్లస్ పి.హిత్ – ఆర్.సి.మంజుదార్ – ఎ.డి. పుసాల్కర్ – ఎస్.దాస్ గుప్తా – హెచ్. హిరియణ్ణ – కృష్ణస్వామి అయ్యర్ – ఆర్యన్ ష్లినీ – ఎస్.జి.సర్దేశాయ్ – రొమిల్లా ధాపర్ – సోదరి నివేదిత – స్వామీ వివేకానంద – మహాత్మాగాంధీ – డా।। ఎస్ రాధాకృష్ణన్ – పండిత నెహ్రూ – బాలగంగాధరతిలక్ – నండూరి రామమోహనరావు – సొదుం రామ్మోహన్ – వి.ఎం. మోహనరాజ్ – ఎస్.ఎ. డాంగే – ఎ.ఎల్. భాషం** ఇలా చెప్పుకుంటూ పోతే వీళ్ళ పేర్లతోనే పెద్ద గ్రంథం తయారౌతుంది.

బాబూ హిమాంశ్! ప్రపంచవ్యాప్తంగా గల గీతా పరిశోధకులలో కనీసం కొందరి పేర్లైనా సేకరించి మీకందించటంలో నా ఉద్దేశమేమంటే? కేవలం భారతీయులనే గాక ఇందరు ప్రపంచ ప్రముఖుల నాకట్టుకుని, వారందరిచే ప్రశంసింపబడుతున్న శ్రీమద్భగవద్గీత యొక్క విశిష్టతను స్వయంగా అధ్యయనం చేసి తెల్సుకోవాలన్న ఆసక్తిని ముఖ్యంగా మీ విద్యార్థినీ, విద్యార్థులలో రగిలించాలన్నదే నా ఆకాంక్ష. భారతీయులందరి చేతా గీతాధ్యయనం చేయించాలన్న సత్సంకల్పం భారత ప్రభుత్వానికి కలిగినట్లైతే – అప్పుడు మన భారతమాత. ఈ అవినీతి, అసమానతలు, నల్లధనం నిల్వలు, డబ్బుతో అధికారం – అధికారంతో డబ్బు మొదలగు రుగ్మతల సుడిగుండం నుండి తప్పక బయట పడగలదని **గీతాధ్యయనం చేసిన పలువురు మేధావులు, గాంధీ, నెహ్రూ, బాలగంగాధరతిలక్, రాధాకృష్ణన్ వంటి పలువురు విజ్ఞులూ వక్కాణిస్తున్నారు.**

ఆరాధ్య : గీతను తనమాతగా భావించిన మన జాతిపిత చిన్నప్పటినుండే గీతాధ్యయనం చేశారా తాతయ్యా?

వ్యాఖ్యాత : లేదు ఆరాధ్యా, గాంధీ పై చదువుల కోసం లండన్ వెళ్ళారు. అక్కడ కొందరు ఆంగ్లమిత్రుల నోట భగవద్గీతను గూర్చి ప్రశంసలు విన్నతర్వాత గాని గాంధీ గీతాధ్యయనానికి పూనుకోలేదు. ఎందుకంటే? ఎవరైనా వివరించి చెబితే గాని తన బలాన్ని తాను తెలుసుకోలేని ఆంజనేయస్వామిలా మనదేశాన్ని, నాయకుణ్ణీ, కవినీ, కళాకారుణ్ణీ, గ్రంథాన్నీ దేన్నైనా, ఎవరినైనా సరే విదేశీయులు ఆకాశానికెత్తితే గాని చూడలేకపోవటం మన భారతీయుల బలహీనత! మరిగాంధీ గూడ భారతీయుడే గదా!

గాంధీగారు లండన్లో చదువుకుంటున్నప్పుడు ఒకరోజు ఇద్దరాంగ్ల మిత్రులు ఆంగ్ల భగవద్గీతను గాంధీగారికి చూపుతూ – మీ భారతీయులు మానవాళికెంత గొప్ప గ్రంథాన్నందించారూ హేట్సాఫ్ అని ప్రశంసించి దయచేసి ఇందలి ముఖ్యాంశాలను మాకు బాగా విపులీకరిస్తారా? అంటూ

గాంధీని అభ్యర్థించారు. అందుకు గాంధీ మనసులోనే సిగ్గుపడ్డారట, ఎందుకంటే నాటిదనుక భగవద్గీత పేరును వినియుండటమేగాని కనీసం గీతను చూసైనా ఎరుగడట, ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వ్రాసుకున్నారు. అప్పటికి వారినుండి ఆ గ్రంథాన్నందుకుని తొలిసారిగ అధ్యయనం చేసి అందలి కీలకాంశాలను ఆంగ్ల మిత్రులకు వివరించి చెప్పటమేగాక, తనెంతగానో ఆశ్చర్యపడి, అంతటి అత్యుత్తమ గ్రంథాన్ని అప్పటిదాకా చదవాలన్న స్పృహ, స్వయంగా కలగనందుకు మరోసారి సిగ్గుపడి, గీతాధ్యయనానికి అవకాశాన్ని కల్పించిన తన ఆంగ్ల మిత్రులకు మనసులోనే ధన్యవాదాలు చెప్పుకున్నారట గాంధీ!

కావ్య : భగవద్గీతతోపాటు చిరస్మరణీయులుగాఎవర్ని చెప్పుకోవచ్చు తాతగారూ?

వ్యాఖ్యాత : భగవద్గీత పేరు వినగానే అనివార్యంగా స్మృతికొచ్చే మహనీయులు నల్గురు. 1.భగవద్గీతా గ్రంథకర్త జగద్గురువు వ్యాసమహర్షి 2. తన భాష్యం ద్వారా భగవద్గీతకు ఆసేతు హిమాచల పర్యంతం ప్రాచుర్యం కల్పించిన ఆదిశంకరాచార్యులు 3. గీతను తన మాతగ భావించి ఆమెతో మమేకమై, తనను తాను దేశానికర్పించుకున్న మనజాతి పిత గాంధీ 4. గీతారహస్యం పేరిట భగవద్గీతకు భాష్యం వ్రాసి తద్వారా భారత స్వాతంత్రోద్యమాన్ని ఉద్యమ వీరులను, మహత్తరంగా ప్రభావితం చేసిన లోకమాన్య బాలగంగాధరతిలక్.

శ్రేష్ఠ : గీతా రహస్యమను గ్రంథాన్ని ఎవరు వ్రాశారు? దాని విశిష్టత ఏమిటి తాతగారూ ?

వ్యాఖ్యాత : భగవద్గీతను అధ్యయనం చేశాక ఎంతగానో ప్రభావితుడయ్యాడు లోకమాన్య బాలగంగాధరతిలక్. అప్పుడాయనలో నన్ను ప్రభావితం చేసినట్లే భగవద్గీత భారత స్వాతంత్ర్య సమరవీరులను సైతం ప్రభావితం చేయగల్గితే?

ఓహ్ ఇక జాతీయోద్యమమెంత మహత్తరమైనదిగా, అజేయమైనదిగా రూపొందుతుందో గదా అని తిలక్‌లో తళుక్కుమన్న సదాలోచన ఫలితమే గీతారహస్యం! లేక కర్మయోగ శాస్త్రం! అనే భాష్య గ్రంథావతరణం! ఇరవయ్యో శతాబ్ద ప్రారంభంలోనే మరాఠీ భాషలో అవతరించిదీ గ్రంథం.

భగవద్గీత జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసినతీరు

సాయికృత్తిక : తాతగారూ! భగవద్గీత భారత స్వాతంత్రోద్యమాన్ని మహత్తరంగా ప్రభావితం చేసిందంటున్నారు. అదెలాగో వివరిస్తారా?

వ్యాఖ్యాత : ఇది ప్రతియొక్కరూ తెల్సుకోవలసిన చాలా ముఖ్యాంశం కృత్తికా. భగవద్గీత భారత స్వాతంత్రోద్యమాన్ని ఎంత మహత్తరంగా ప్రభావితం చేసిందో చూడండి. గీతాభాష్యం గ్రంథంలో 1. కర్మయోగం 2. స్థిత ప్రజ్ఞత ఈ రెండంశాలను ప్రధానంగా చేసుకుని గీతాభాష్యం వ్రాశారు తిలక్. ఈ రెండంశాలను సమన్వయపరిస్తే 'సుఖదుఃఖాలు, లాభనష్టాలు, రాగద్వేషాల కతీతంగా తమ బాధ్యతగ భావించి తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలన్న భావం' రూపొందుతుంది. ఇదిగో ఈ భావనయే స్వాతంత్రోద్యమ వీరులను జాతీయోద్యమంతో మమేక మయ్యేలా చేసింది.

భగవద్గీతను తమ ఉద్యమాని కిలా అన్వయించుకున్నారు. ఉదా॥ భగవద్గీత బోధిస్తున్న స్వధర్మాన్ని భారతీయ స్వయం పరిపాలనగాను – పర ధర్మాన్ని పరాయి ఆంగ్లేయ పాలన గాను – పరధర్మం కన్నా స్వధర్మమే మేలన్న దానిని పరాయి ఆంగ్లేయ పాలనకన్నా భారతీయుల స్వయం పాలనయే మేలనియు – స్వధర్మాచరణలో ప్రాణం పోయినామేలే నన్న గీతా భావాన్ని స్వయం పరిపాలనా (స్వాతంత్ర్య) సాధనలో ప్రాణాలను పోగొట్టుకున్నా పుణ్యమేనని భావించుకున్నారు! అంతేగాదు –

నా తల్లి భరతమాత దాస్యశృంఖాలలను దించేందుకు పోరాడటం ఆమెబిడ్డగా నా బాధ్యత. నా మాతృదేశ విముక్తి – భావితరాలవారి బంగారు

భవితవ్యమే నా ఉద్యమ లక్ష్యం. ఈ ఉద్యమం వల్ల నాకు సుఖమా? దుఃఖమా? – లాభమా? నష్టమా? – నశించేది నావాళ్ళా? పరాయి వాళ్ళా? అన్న ప్రశ్నలతో నాకు పనిలేదు. అవన్నీ సర్వేశ్వరుడే చూచుకుంటాడు. నా లక్ష్యం నెరవేరుదాకా, నా ప్రాణాలున్నంత దాక ధర్మం (స్వాతంత్ర్యం) కోసం ఉద్యమించుటయే భారతీయునిగ నా కర్తవ్యం అంటూ స్వాతంత్రోద్యమ వీరులందరూ భగవద్గీత నిలా అన్వయించుకునేలా ప్రేరేపించింది. ఉత్తేజపరిచింది. అదీ గీతారహస్యం! ఆయనా లోకమాన్య బాలగంగాధర తిలక్! అంతేకాదు, **ఆత్మకు చావులేదు దాన్ని ఏ శక్తి నశింపచేయలేదను గీతాబోధ ఉద్యమ వీరులను ఇంకా ఉత్తేజ పరిచింది. వారిలో ఆత్మస్థైర్యాన్ని సుస్థిరం చేసింది. భగవద్గీతను తన హృదయానికి హత్తి పట్టుకుని ఖుదీరాంబోస్ ఉరికంబ మెక్కిన వార్త ఆసేతు హిమాచల పర్యంతం సంచలనం రేపింది.** ఉద్యమ కారులను ఉవ్వెత్తున త్యాగాలకు ప్రేరేపించింది. అదీ శ్రీమద్భగవద్గీత! ఒక తాత్విక గ్రంథం రాజకీయ రంగాన్నింతగా ప్రభావితం చేయటం చాలా చాలా అరుదు. ప్రపంచవ్యాప్తంగా చూసినా రాజకీయరంగాన్ని ప్రభావితం చేసిన గ్రంథాలు 1.ప్లేటో 2. అరిస్టాటిల్ వ్రాసిన కేవలం రెండు తాత్విక గ్రంథాలు మాత్రమే, మూడవ తాత్విక గ్రంథం శ్రీమద్భగవద్గీత – భగవద్గీతా విశిష్టతకు, మహౌన్నత్యానికీ మరో నిదర్శనమిది!

భగవద్గీత నిర్దేశిస్తున్నది ప్రవృత్తి మార్గమా? నివృత్తి మార్గమా?

ఊహాశ్రీ : ప్రవృత్తి నివృత్తి మార్గాలను గూర్చి వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : నివృత్తి యంటే కర్మ సన్యాస మని భావం. ఒక వ్యక్తి బ్రహ్మజ్ఞానాన్ని పొందిన తర్వాత అన్ని కర్మలనూ త్యజించి, బ్రహ్మజ్ఞాన చింతన చేస్తూ ఆమరణాంతం భిక్షాటన ద్వారా జీవించే విధానమే నివృత్తిమార్గం. ప్రవృత్తి యంటే నిష్కామ కర్మ మని భావం. బ్రహ్మజ్ఞానాన్ని పొందిన తర్వాత గూడ

ప్రజలకు ఆదర్శం కోసం లోకకళ్యాణార్థం, ధర్మసంరక్షణార్థం, ఫలాపేక్ష రహితంగా కర్మలాచరిస్తూ జీవించటమే ప్రవృత్తిమార్గం.

హర్ష : మరి యీ రెండింటిలో భగవద్గీత నిర్దేశిస్తున్నది ప్రవృత్తిమార్గాన్నా? నివృత్తి మార్గాన్నా?

వ్యాఖ్యాత : ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి తల్లీ! ఉదా॥ **అద్వైతపరంగా ఆదిశంకరాచార్యులు – విశిష్టాద్వైత పరంగా రామానుజాచార్యులూ, శుద్ధా ద్వైత పరంగా వల్లభాచార్యులు, ద్వైత పరంగా మధ్వాచారులూ– 'ద్వైతాద్వైత' పరంగా నింబార్కాచార్యులు. పాతంజలి యోగ పరంగా జ్ఞానేశ్వరుడు మొదలగు వారంతా జ్ఞాన, భక్తి, యోగాల ద్వారా భగవద్గీత నిర్దేశిస్తున్నది నివృత్తి మార్గమేనని చెప్పారు! లోకమాన్య బాలగంగాధరతిలక్ మాత్రం భగవద్గీత కర్మయోగం ద్వారా** మానవాళికి నిర్దేశిస్తున్నది ప్రవృత్తి (నిష్కామకర్మ) మార్గమేనని తన గీతా రహస్యం ద్వారా ఎలుగెత్తి చాటాడు. చాటడమే గాక, నిష్కామ కర్మమార్గంలో గీతను స్వాతంత్రోద్యమాని కన్వయించి చూపారాయన!

దేవాంశ్ : మరి అట్టి హేమాహేమీలంతా విభిన్న మార్గాలను సూచిస్తున్నప్పుడు వారిలో మనమెవరి మార్గాన్ని విశ్వసించాలి తాతగారూ?

వ్యాఖ్యాత : ఇలాంటప్పుడు గుడ్డిగా మనమేదో ఒకరి మార్గాన్ననుసరించుటకంటే, గీత నిర్దేశించిన సిసలైన మార్గమేదో నిర్ధారించుకోవటానికి మనకు కొలబద్ధ వంటి ప్రాచీనశ్లోక మొకటుంది.

"ఉపక్ర మోపసంహా, రావభ్యాసోఽపూర్వతా ఫలమ్
అర్థవాదోపపత్తీచ లింగం తాత్పర్య నిర్ణయే"

1. ఉపక్రమం = ప్రారంభం 2. ఉప సంహారం = ముగింపు 3. అభ్యాసం = పదే పదే చెప్పిన అంశం. 4. అపూర్వతా = వినూతనత్వం 5. ఫలమ్ =

గ్రంథకర్త ఆశించిన ప్రయోజనం 6. ఉపపత్తి = పై అంశాలన్నింటి సమన్వయం 7.అర్థవాదం = (మీమాంసక పారిభాషిక పదం) యీ ప్రమాణాలతో గ్రంథ సారాంశాన్ని విశ్లేషించుకుంటే భగవద్గీతా నిర్దేశిత లక్ష్యమేంటో స్పష్టమౌతుంది. మొదట గ్రంథాన్ని సరళరేఖా మార్గంలో పరిశీలించాలి. అదెలాగంటే – గ్రంథ ప్రారంభమొక బిందువు. ముగింపు మరో బిందువు. ఈ రెండు బిందువుల్ని నేరుగా కలిపే రేఖయే సరళరేఖ. ఈ రెండింటి (ప్రారంభ–ముగింపుల) మధ్య సూటిగా యిమిడియున్న అంశమే గ్రంథ సారాంశం లేక గ్రంథ లక్ష్యం.

1. గీతా ప్రారంభం : కౌరవ సేనను తేరిపార జూచిన అర్జునుడు, పెంచిన తాత, గురు, బంధు, మిత్రులులందరినీ చంపుకోవలసి వచ్చిన దుస్థితి కల్గినందుకు, పెల్లుబికిన దుఃఖంతో చలించి అప్రయత్నంగానే అస్త్రసన్యాసం చేసి రథంలోనే కూలబడిపోయాడు. శ్రీకృష్ణా! యుద్ధమా? యుద్ధ విరమణా? నాకేది కర్తవ్యం, ఏది శ్రేయస్కరమో నీవే తేల్చి చెప్పు, నేను నీ శిష్యుడనై నీ శరణువేడుతున్నానంటూ శ్రీకృష్ణునకు చేతులు మోడ్చి కూర్చుండి పోయాడర్జునుడు! ఇదీ గ్రంథారంభం.

గీతోపసంహారం : శ్రీకృష్ణా! నీ దయవలన, నీ బోధవలన నా అజ్ఞానమనే మోహం తొలగింది. నేనిక నీ ఆజ్ఞ శిరసావహిస్తానంటూ, తిరిగి గాండీవం ధరించి యుద్ధ కర్తవ్యోన్ముఖుడయ్యాడర్జునుడు. ఇదీ గీతాగ్రంథం ముగింపు.

గ్రంథప్రారంభోపసంహారాలు మనకు తెలియజేసిన అంశమిది – దుఃఖంతో యుద్ధ విరక్తుడైయున్న అర్జునుని తన గీతోపదేశం ద్వారా తిరిగి యుద్ధ కర్తవ్యోన్ముఖుని చేశాడు శ్రీకృష్ణుడు!

ఫలమ్ : యుద్ధ విరాగియైన అర్జునుని, శ్రీకృష్ణభగవానునిచే గీతోపదేశం చేయించడం ద్వారా తిరిగి కర్తవ్యోన్ముఖుని చేయించుటే గ్రంథకర్త సాధించదలచిన లక్ష్యమని స్పష్టమౌతున్నది.

అభ్యాసమ్ : (పదే పదే చెప్పిన అంశం) గీత 2–3 అర్జునా! నీ హృదయ దౌర్బల్యాన్ని వీడిలేచి కర్తవ్యానికి పూనుకో 2–37 అర్జునా! యుద్ధానికి కృతనిశ్చయుడవు కమ్ము 2–38 స్థిత ప్రజ్ఞుడివై యుద్ధం చెయ్ నీకు పాపమంటదు. 3–8 శాస్త్రోక్త కర్మయే నీకు శ్రేయస్కరం 3–9 నిస్సంగుడవై లోకకళ్యాణార్థం యుద్ధం చెయ్ 3–35 లోపభూయిష్టమైనా నీ స్వీయ కర్తవ్య నిర్వహణయే శ్రేయస్కరం. 4–23లోక కళ్యాణార్థం కర్మలు చేసినవాడు పాపపుణ్యాల కతీతుడు 5–2 కర్మ సన్యాసంకన్నా కర్మాచరణయే శ్రేయస్కరం 18–7 నియత కర్తవ్య కర్మలను సన్యసించుట యుక్తంకాదు 18–17 అహంభావ రహితుడవై లోకకళ్యాణం (ధర్మరక్షణం) కొరకు అధర్మాత్ములన్ని చంపినా పాపమంటదు. 18–23 స్వార్థరహిత కర్మం సాత్వికమే కాని పాపంకాదు. 18–57 నీ కర్మలన్నింటినీ ఈశ్వరున కర్పించి చేయి నీకు పాపమంటదు అర్జునుని పాపభీతిని తొలగించి, అతన్ని కర్తవ్యోన్ముఖుని చేసేందుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇదే అంశాన్ని దాదాపు 60సార్లు ప్రస్తావించాడు శ్రీకృష్ణుడు.

అపూర్వతా(నూతనత్వం) : దోమలున్న ప్రాంతంలో పడుకుంటున్నా అవికుట్టకుండా తప్పించుకునే ఉపాయం దోమతెరలు కట్టుకోవటమే – అలాగే కర్మలు చేస్తున్నా పాపమంటకుండా తప్పించుకునే ఉపాయాన్ని చెప్పింది శ్రీమద్భగవద్గీత. ఈ గ్రంథమందలి వినూత్నాంశం ఇదే ! ఉదాహరణకు గీత 3–9, 4–22, 23 గీత 18–17,23–57 ఈ శ్లోకాల ద్వారా సదరు వినూత్నాంశాన్ని వివరిస్తున్నది భగవద్గీత. వీటి సారాంశమిదీ – అర్జునా! ఫలాపేక్ష రహితంగా నీ కర్మలన్నింటినీ పరమేశ్వరున కర్పించి చెయ్యి – ఈశ్వర ప్రీత్యర్థం లోకకళ్యాణం కోసం, ధర్మరక్షణ కోసం సత్కార్యాలు చెయ్యి – రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, జయాపజయాల కతీతంగా నీ విధిగా భావించి, ఫలాపేక్షరహితంగా చెయ్యి – నీ వెంతటి ఘనకార్యాన్ని చేసినా, కర్తృత్వ, అహంభావాలకు లోనుగాక, ఈశ్వరుడందుకు

నిన్నుపయోగించుకుంటున్నాడన్న వినమ్రభావంతో చెయ్. నీవీ విధంగా నీ కర్తవ్యాన్ని నిర్వహించినట్లైతే నీవు చేసే పనుల వలన కలిగే పాప పుణ్యాలకు నేను బాధ్యత వహిస్తాను. కాబట్టి, అర్జునా! నీకు పాపమంటదు అంటూ పాప పుణ్యాలంటకుండా కర్మలు చేసే ఉపాయాన్ని అర్జునునకు తెలియజేశాడు శ్రీకృష్ణపరమాత్మ. అర్జునునకే గాదు, నిష్కామంగాకర్మల నాచరిస్తే ఎవరికీ పాపమంటదు. ఈ ఉపాయాన్నే నిష్కామ కర్మం లేక కర్మయోగమని యంటారు.

ఈ అపూర్వత (వినూత్నాంశం) గూడ గీత నిర్దేశిస్తున్నది ప్రవృత్తి (కర్మ) మార్గమే నని సృష్టీకరిస్తున్నది.

ఉపపత్తి : (పై అంశాలన్నింటి సమన్వయం) : గ్రంథ ప్రారంభం – ముగింపు – ఫలమ్ అభ్యాసం – అపూర్వత – మొదలగు అంశాలన్నీ నిష్కామ కర్మ మార్గాన్నే సూచిస్తున్నాయి. అలా వీటన్నింటికీ సమన్వయం చక్కగా కుదిరింది గనుక ఇక శ్రీమద్భగవద్గీత అర్జునునికి తద్వారా మానవాళికి నిర్దేశిస్తున్నది ప్రవృత్తి (నిష్కామకర్మ) మార్గమే మన్నది నిశ్చయం!

విరాజ్ ఉజ్వల్ : మరి ఆదిశంకరాచార్యుల వంటి మహాజ్ఞానులు నిర్దేశించిన నివృత్తి (కర్మ సన్యాస) మార్గం నిరుపయోగమేనా తాతగారూ?

వ్యాఖ్యాత : జ్ఞానులేం చెప్పినా, చేసినా అది ప్రపంచ కళ్యాణం కోసమే సుమా! ఐతే వారు చెప్పిన దానిని చక్కగా అవగాహన చేసుకుని మరీ ఆచరించాలి. ఆదిశంకరుడు చూపిన నివృత్తి మార్గాన్ని సార్థకంగా గ్రహించగల్గితే అది లోక కళ్యాణానికెంతగా తోడ్పడుతుందో స్పష్టమౌతుంది. ఈ విషయమై గౌతమ బుద్ధుడేమన్నాడో చూడండి!

గౌతమబుద్ధుడు సూచించిన నివృత్తి మార్గం : బుద్ధుడు తరచుగా తన శిష్యులకిలా బోధిస్తుండేవాడు. మీరు నిరంతర జ్ఞాన చింతన చేస్తూ మిమ్మల్ని మీరు పరిపూర్ణులుగా రూపొందించుకోండి. ఏప్రాంత ప్రజల

కెలాబోధించాలో చర్చించుకుని బోధనా ప్రణాళికలను సిద్ధం చేసుకోండి. బృందాలుగా విడిపోయి, ఆయా ప్రాంతాలలో సంచరిస్తూ సదా ధర్మబోధ ద్వారా ప్రజలను దుఃఖ విముక్తుల్ని చేసేందుకు, వారిని ధర్మమార్గాన నడిపించేందుకు తోడ్పడండి. ప్రతిఫలంగా వారినుండి మీ అవసరం మేరకు అన్నవస్త్రాలను భిక్షగా స్వీకరించండి. విశ్వసనీయంగా జీవిస్తూ మీ జన్మను సార్థకం చేసుకోండి అన్నదే బుద్ధుని బోధ! బహుశా ఆది శంకరుని నివృత్తి మార్గం యొక్క ఆంతర్యమూ ఇదే అయి ఉంటుంది. బ్రహ్మజ్ఞానులైన మీరు ప్రతిరోజూ ప్రజలకు పరమాత్మ పరమార్థ జ్ఞాన బోధ చేస్తూ వారిని ధర్మ–అర్థ–కామ–మోక్ష మార్గాన సదా నడిపించేందుకు యత్నించండి. వేళకు వారినుండి భిక్షను స్వీకరించండి. అలా అర్థవంతంగా జీవించండి. ప్రజలను విముక్తుల్ని చేస్తూ మీరూ విముక్తులు కండి! అన్నదే ఆదిశంకరుల వారి నివృత్తి మార్గమని ఆధ్యాత్మిక వేత్తలు పలువురు విశ్లేషించారు. అంతేగాని, ఎక్కడో జనావాసాలకు దూరంగా ఆశ్రమాలలో కూర్చుని బ్రహ్మజ్ఞాన చింతనచేస్తూ, ఆకలికాగానే, భిక్షాటన చేస్తూ జీవించట మన్నది గీతాబోధనకు పూర్తి విరుద్ధం. ఉదా॥ గీత 3–8 ఏ పనీ చేయని సోమరులకు దేహ పోషణా కష్టమేనంటూ హెచ్చరిస్తున్నది భగవద్గీత. గీతతో మమేకమైన మహాత్మాగాంధీగూడ **'ఏ పనీ చేయకుండా భోజనం చేసేవాడు ఆ కుటుంబానికే గాదు, సమాజానికే దొంగ'** అన్నాడు. కావున కర్తవ్య నిర్వహణకే గాని, భగవద్గీతలో కర్మసన్యాసానికి తావే లేదన్నది సుస్పష్టం.

అర్థవంతంగా ఆచరిస్తే నివృత్తి మార్గంగూడ ప్రవృత్తి మార్గమే

యువన్‌తేజల్ : నివృత్తి మార్గాన్ననుసరించిన కొందర్ని, ప్రవృత్తి మార్గాన్నను సరించిన కొందర్ని ఉదహరిస్తే మేమావిషయాన్ని బాగా అవగాహన చేసుకోగలం తాతగారూ?

వ్యాఖ్యాత : బ్రహ్మజ్ఞానియైన తర్వాత స్వార్థ కర్తృత్వాభిమాన రహితుడై, ఈశ్వరార్పితంగా లోక కళ్యాణార్థం తనవిధిగా భావించి కర్మలు చేస్తుంటాడు

కర్మయోగి. అదే సమయంలో తన దేహ పోషణార్థమూ కొన్ని కర్మలు చేస్తుంటాడు. దీన్నే ప్రవృత్తి మార్గమంటారు. ఉదా॥ శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, మహాత్మాగాంధీ, బాలగంగాధరతిలక్, టంగుటూరి ప్రకాశంపంతులు మొ॥ ఇక బ్రహ్మజ్ఞాని అయ్యాక లోక కళ్యాణార్థం, ఈశ్వరార్పణగ మానవాళి కొరకు జ్ఞానబోధ, ధార్మిక గ్రంథ రచనల ద్వారా ప్రజలను ధర్మమార్గాన నడుపుతూ తనతోపాటు వారినీ పరమగమ్యానికీ చేర్పించేందుకు తోడ్పడుతుంటాడు కర్మసన్యాసి – ఇతను తన దేహపోషణార్థపు కర్మలను గూడ వదిలేసి భిక్షద్వారా జీవిస్తూ తనపూర్తి సమయాన్ని ధర్మబోధకే వినియోగిస్తుంటాడు. ఇట్టి జ్ఞాన యజ్ఞ నిర్వహణ ద్వారా నివృత్తి మార్గమూ, ప్రవృత్తి మార్గమౌతుంది. ఈ మార్గంలో జీవించినవారు ఉదా॥ గౌతమబుద్ధుడు, ఆదిశంకరాచార్యులు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రమణమహర్షి, శారదామాత, ఆధునికులలో చినజీయర్ స్వామి మొ॥వారు.

హర్షవర్ధన్ : నివృత్తి మార్గాన్ని అర్థవంతగా ఆచరించిన వారిలో ఒక ప్రముఖుని జీవన విధానాన్ని గూర్చి వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : గౌతమబుద్ధని జీవన విధానాన్ని పరిశీలిస్తే నివృత్తి మార్గాన్ని గూర్చి మీకు స్పష్టమైన అవగాహన కల్గుతుంది, వినండి– ప్రజలకు జ్ఞానబోధ చేస్తూ వారినుండి భిక్ష స్వీకరిస్తూ దేశం నలుమూలలా బృందాలుగా సంచరిస్తుండేవారు బుద్ధుడు, ఆయన శిష్యులు. బుద్ధుడు గూడ ఒకరోజు కొందరు శిష్యులతో ఒక గ్రామానికి వస్తున్నాడు. గ్రామ పొలిమేరలో వ్యవసాయం చేస్తున్న రైతు బుద్ధుని చెంతకువెళ్ళి నమస్కరించి మరీ ఎగతాళిగా ప్రశ్నాడించాడిలా – అయ్యా! వ్యవసాయం చేస్తూ నాక్కావలసిన భోజనాన్ని నేనే పండించుకుంటున్నాను. అలాగే మీరూ వ్యవసాయం చేసి మీ భోజనాన్ని మీరే పండించుకోవచ్చు గదా, యిలా భిక్షాటన చేయట మెందుకు? అంటాడు అతని వైపు చిరునవ్వుతో చూస్తూ బుద్ధుడిలా అన్నాడు. చూడు కర్షకా! నేను నారెండు కాళ్ళనే ఎడ్లను నడిపిస్తూ, నా బుద్ధి అనే

నాగలితో, సమాజమనే పొలాన్ని దున్ని, జ్ఞాన బీజాలను చల్లి, సుఖశాంతులనే పంటను పండిస్తున్నాను! నా భోజనం కోసం నేనిలా వ్యవసాయం చేస్తూనే ఉన్నాను గదా? అన్నాడు. బుద్ధుని మాటలతో జ్ఞానోదయ మైన రైతు బుద్ధుని వ్యవసాయపు ఘనతను గ్రహించి వారిని తన యింటికి సాదరంగా స్వాగతించి బుద్ధునకు బంగారు పళ్ళెరంలోను ఆయన శిష్యులకూ మేలైన పాత్రలలోను షడ్రసోపేత భోజనం పెట్టాడు. భోజనానంతరం వారిని సగౌరవంగా రచ్చబండవద్దకు తోడ్కొని వెళ్ళి, గ్రామస్తులతో పాటు రైతూ, ఆయన కుటుంబ సభ్యులంతా బుద్ధుని బోధనలను భక్తి శ్రద్ధలతో విన్నారు.

బుద్ధునిలా నివృత్తి మార్గాన్ని అర్థవంతంగా ఆచరిస్తే గొప్ప జ్ఞానయజ్ఞం చేసినట్లే. అందువలన నివృత్తి మార్గమూ ప్రవృత్తిమార్గంతో సమానమే. గౌతమబుద్ధుడు, ఆదిశంకరాచార్యులు ప్రబోధించిన నివృత్తి మార్గ వైశిష్ట్యమిదేనని స్పష్టమౌతున్నది.

మొదట జ్ఞానమార్గమా? కర్మమార్గమా?

రిత్విక్ : జ్ఞానమార్గం, కర్మమార్గం రెండూ గొప్పవే నన్నాడు శ్రీకృష్ణ భగవానుడు ఐతే ఈ రెంటిలో ముందుగా ఏ మార్గాన్నవలంబించాలి తాతగారూ ?

వ్యాఖ్యాత : మంచి ప్రశ్నే అడిగావు రిత్విక్, ముందిది తెల్సుకో జ్ఞానయోగం, కర్మయోగం రెండూ పరస్పరాధారితాలు. అందుకు నిదర్శనం శ్రీకృష్ణార్జునులే! శ్రీకృష్ణుని జ్ఞానయోగం ద్వారా, అర్జునుని కర్మయోగం (ధర్మపోరాటం) ఫలించింది. అలాగే అర్జునుని కర్మయోగం ద్వారా, శ్రీకృష్ణుని జ్ఞానయోగం (దుష్టశిక్షణ శిష్టరక్షణా ఆశయం) ఫలించింది! ఇంకో ఉదాహరణ – జ్ఞానాన్ని నీటితోను కర్మను ఈతతోను పోల్చుకోవచ్చు. నీటిలో దిగందే ఈతరాదు, ఈతరాకుండా నీటిలో దిగాలంటే భయం ఔనా? మరి దీనికి మార్గమేంటి?

ఆదిత్య : ముందు తక్కువ లోతు నీటిలో దిగి, ఈత నేర్చుకుని తర్వాత లోతు నీటిలో కెళ్ళాలి తాతయ్యా!

వ్యాఖ్యాత : చక్కగా చెప్పావు ఆదిత్యా, ముందు మనకున్న పరిమిత జ్ఞానంతోనే, (ఈతలో మెళుకువలను గ్రహించినట్లుగ), పాపపుణ్యాలంటకుండా కర్మలు చేయగలిగే మెళుకువలను, అంటే జ్ఞానాన్ని గ్రహించాలి. ఈతలో మెళుకువలను నేర్చుకున్నవాడు చెరువు, సరస్సు, నది, సముద్రం ఏ నీటిలోనైనా మునక్కుండా ఎలా ఈదగలడో – కర్మలలో మెళుకువను (జ్ఞానాన్ని) గ్రహించిన వాడు ఏ కర్మానినైనా పాపపుణ్య లంటకుండా చేసుకు పోగలడు. ఔనా పిల్లలూ?

పిల్లలు : ఔను తాతయ్యా!

వ్యాఖ్యాత : దీన్నిబట్టి మీరేంగ్రహించారు?

అగస్త్య : తక్కువలోతు నీటిలో దిగి ఈత నేర్చుకున్నాక లోతునీటిలో కెళ్ళాలి. అలాగే కర్మలు చేస్తూ జ్ఞానాన్ని పొందాలి. జ్ఞానం పొందాక ఏకర్మలనైనా నిర్భయంగా చేయవచ్చు. అంటే చేస్తూ తెల్సుకోవాలి. తెల్సుకుని చేయాలి.

విద్యాధర : పూర్తిగా తెల్సుకున్నాక చేద్దామనకోవటం, బాగా ఈత వచ్చాక నీళ్ళలో దిగుదా మనుకోవటం లాంటిదే!

వ్యాఖ్యాత : ఇంత చక్కగా గ్రహించగల్గినందుకు మీకు శుభాభినందనలు పిల్లలూ! తరణ్, ఇంకా ఏదో ఆలోచిస్తున్నట్లున్నావ్, దేన్ని గురించి?

తరణ్ : మీరు చెప్పిన దాన్నిబట్టి జ్ఞానార్జనకు రెండుమార్గాలున్నాయని గ్రహించాను. భౌతిక, ఆధ్యాత్మిక, ఈ రెండు మార్గాలలో ముందుగా దేన్ని అనుసరించాలి తాతగారూ?

వ్యాఖ్యాత : చూడు తరణ్ ఆధ్యాత్మిక భౌతిక జ్ఞానాలు చపాతి, పప్పు అన్నం, కూర వంటివి, పప్పు చపాతీ – అన్నం కూర ఒకేసారి తింటాం ఔనా? అలాగే పాఠ్యగ్రంథాల ద్వారా భౌతికజ్ఞానాన్నీ, భగవద్గీతాది అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా ఆధ్మాత్మిక జ్ఞానాన్ని అధ్యయనం చేయటం

నిత్యకృత్యం కావాలి. అందుకు భగవద్గీత వంటి అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథాలను పాఠగ్రంథాలుగాను, అలహాబాదు హైకోర్టు న్యాయమూర్తి సూచించినట్లు భగవద్గీతను జాతీయ గ్రంథంగాను, రూపొందించుకోవాలి కూడ, అందుకు ప్రజలు, మేధావులూ ప్రభుత్వం కూడ భారత జాతీయతకు, మత సామరస్యానికి ఏ మాత్రం భంగం కలగకుండా ప్రజామోదాన్ని పొందేందుకు విశేష కృషి చేయవలసి ఉంది.

ఎందుకంటే? చపాతీయో, పప్పో– అన్నమో, కూరో, ఏదో ఒక దానినే తిన్నవానికంటే, రెండూ కలిపి తిన్న వ్యక్తి ఎలా పుష్టిగా ఉంటాడో, కేవలం భౌతిక గ్రంథాలనో కేవలం ఆధ్యాత్మిక గ్రంథాలనో అధ్యయనం చేసిన వారికంటే, రెండిటినీ అధ్యయనం చేసిన వారు పరిపూర్ణ జ్ఞానులౌతారు. ఇది నిత్య సత్యం! ఔనా పిల్లలూ?

వశిష్ఠ : ఔను తాతయ్యా మీరన్నది ముమ్మాటికీ నిజం. మీరు శాస్త్రీయ జ్ఞానాన్ని, ఆధ్మాత్మిక జ్ఞానంతో పోల్చి చెప్పినందువల్లనే ఆధ్యాత్మిక జ్ఞానంపట్ల భగవద్గీతపట్ల మాకు స్పష్టమైన అవగాహన, విశ్వసనీయత పెంపొందాయి.

పిల్లలు : అందుకే మేం మా పాఠ్య గ్రంథాలతో పాటు, ఆధ్యాత్మిక గ్రంథాలను సైతం అధ్యయనం చేస్తుంటామని మీకు మాటయిస్తున్నాం తాతగారూ!

వ్యాఖ్యాత : తథాస్తు పూర్ణ జ్ఞానార్థులారా! సర్వదా మీకు, మీ ద్వారా మానవాళికీ, ప్రాణులన్నింటికీ శుభమస్తు!

మానవాళికి సంజయుడు చూపిన ప్రగతి మార్గం

జయరామ్ : మానవాళికి భగవద్గీత అందిస్తున్న సందేశాన్ని మాకు క్లుప్తంగా చెప్పండి తాతగారూ?

వ్యాఖ్యాత : నీ ప్రశ్నకు సంజయుడిలా జవాబిచ్చాడు జయరామ్. అర్జునునికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసిన అనంతరం ఇది నాయభిప్రాయ మంటూ

సూచించాడిలా... గీత 18-78 **యత్ర యోగేశ్వరః ... నీతిర్మతిర్మమ** యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడు ఎక్కడుంటే అక్కడ సిరి, విజయం, అభ్యుదయం, సుస్థిర నీతి నెలకొంటాయి. ఇది నా యభిప్రాయం అంటూ మానవాళికి చక్కని ప్రగతి మార్గాన్ని చూపటమేగాక! మానవాళి కర్తవ్యాన్ని సైతం నిర్దేశించాడిలా –

తన బాధ్యతగ భావించి ధర్మంకోసం పోరాడే నరోత్తమునకు ప్రతీక అర్జునుడు! అర్జునుని వంటి ధర్మవీరులు సంక్షోభానికి గురైనపుడు సిసలైన జ్ఞానాన్ని, కర్తవ్యాన్నీ నిర్దేశిస్తూ విజయపథాన నడిపించే దైవానికి ప్రతీక శ్రీకృష్ణుడు! అట్టి శ్రీకృష్ణార్జునులను ప్రతీకలుగా చూపుతూ సంజయుడు మానవాళి కందించిన సందేశాన్ని మనమిలా అన్వయించుకోవచ్చు.

1. ఎక్కడైతే కర్తవ్య భావనతో లోక కళ్యాణార్థం ధర్మంకోసం పోరాడే అర్జునులుం టారో, అట్టి ధర్మవీరులకు సరైన దిశానిర్దేశం చేయగల్గిన జ్ఞానరూపంలో తోడ్పడుతూ విజయసిద్ధిని కలిగిస్తుంటాడు సర్వేశ్వరుడు. అట్టి ఆత్మవిశ్వాసంతో నిస్వార్థంగా ధర్మంకోసం పోరాడే ప్రజలున్నదేశం, సమాజం సిరిసందపలు, విజయాభ్యుదయాలు, సుస్థిర నీతి, ధర్మాలతో వర్ధిల్లుతుంటయ్.

2. ఎక్కడైతే ఫలాపేక్ష రహితంగా, ధర్మంకోసం పోరాడే అర్జునుని వంటి వీరులూ – వారికి సరైన దిశానిర్దేశం చేయగల్గిన శ్రీకృష్ణుని వంటి మేధావులూ ఉంటారో ఆయా సమాజాలు సిరిసంపదలూ, విజయాభ్యుదయాలు, నీతి ధర్మాలతో విలసిల్లుతుంటాయి.

3. ఏ వ్యక్తిలో, ధర్మంకోసం అర్జునునిలా పోరాడే స్వభావం, సరైన మార్గాన్నెంచుకో గల్గిన శ్రీకృష్ణుని వంటి జ్ఞానజ్యోతి విలసిల్లుతుంటాయో, అట్టి వ్యక్తి సిరినీ, విజయాన్నీ, ధర్మాన్నీ సాధించగలడు, పరిరక్షించగలడు!

4. మీరు సిరిసంపదలు, విజయాభ్యుదయాలు, నీతి ధర్మాలతో ప్రవర్ధిల్లాలంటే మీ దేశ ప్రజలను, ముఖ్యంగా యువతీ యువకుల్ని విద్యార్థి దశనుండే శ్రీకృష్ణార్జునుల్లా తీర్చిదిద్దుకోండి. ఇవి సంజయుని ద్వారా శ్రీమద్భగవద్గీత మానవాళి కందజేస్తున్న సందేశాలు.

ప్రస్తుతం అనేక రుగ్మతలతో కొట్టు మిట్టాడుతున్న **మన భారతదేశాన్ని స్వచ్ఛభారత్‌గ** రూపొందించుకోవాలంటే, మన విద్యార్థులను, యువతీ యువకులను శ్రీకృష్ణార్జునులగ రూపొందించుకోవాలి. అలాగే ప్రతి ఒక్కరూ తనలో శ్రీకృష్ణార్జునుల స్వభావాలను పెంపొందించుకునేందుకు పరిశ్రమించాలి. అందుకు శ్రీమద్భగవద్గీతను జాతీయ గ్రంథంగా, పాఠ్యగ్రంథంగా రూపొందించు కుని, భారత దేశవ్యాప్తంగా గీతాధ్యయనాన్ని, ఆచరణను ప్రారంభించాలి. అందుకు ప్రజలు ప్రభుత్వం దీక్షగ కృషిచేయాలి. తథాస్తు! భరతమాతకు శుభమస్తు!

భగవద్గీతను భారతీయ ధర్మశాస్త్రంగా – గీతోపదేశాన్ని జాతీయ ధర్మంగా గుర్తించాలి.

సుధీర్ : భారతీయులందరి చేతా భగవద్గీతను విధిగా చదివించాలంటే ఏం చెయ్యాలి తాతగారూ?

వ్యాఖ్యాత : భారతీయులు భగవద్గీతాధ్యయన ఆచరణను తమ నిత్యజీవితంలో భాగం చేసుకుని వుంటే, మన దేశ పరిస్థితి ఇంతకన్నా ఎన్నో రెట్లు అన్ని రంగాలలోనూ మెరుగ్గా ఉండియుండేదని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. **అందుకే ఇక నుంచైనా ఏటా మార్గశిర శుద్ధ ఏకాదశినాడు గీతా జయంతిని ఆషాఢ పూర్ణిమ నాడు వ్యాస జయంతిని జరుపుకుంటూ గీతాధ్యయనా చరణలకు పూనుకుంటే భావిభారత జీవితం అనూహ్యంగా మెరుగుపడటం తథ్యం అంటూ తన దృఢ విశ్వాసాన్ని ప్రకటించాడు భారత జాతిపిత గాంధీ!**

జాతిపిత విశ్వాసాన్ని ధృవీకరిస్తున్నట్లుగ ఆ మధ్య అలహాబాదు హైకోర్టు అద్భుతమైన తీర్పుచెప్పింది. వారణాసికి చెందిన గోపాల్ ఠాకూర్ మందిర్ తరపున

ఎస్.ఆర్ ముఖర్జీ దాఖలు చేసిన పిటీషన్‌పైతీర్పు చెబుతూ జస్టిస్ ఎస్.ఎన్. శ్రీవాత్సవ రూలింగ్ యిచ్చారు. **భగవద్గీతను భారతీయ ధర్మ శాస్త్రంగాను గీతోపదేశాన్ని 'జాతీయ ధర్మం'గాను గుర్తించుట భారత ప్రభుత్వ బాధ్యత.**

జాతీయ జెండా – జాతీయ పక్షి – జాతీయ పుష్పాన్ని గుర్తించినట్లే భగవద్గీతను జాతీయ ధర్మశాస్త్రంగ, గీతోపదేశాన్ని జాతీయ ధర్మంగానూ గుర్తించాలి. భారతస్వాతంత్ర్య పోరాటానికే గాక నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే భగవద్గీతా ధర్మాన్ని కులమత వర్గాలకతీతంగా అనుసరించుట భారత రాజ్యాంగంలోని 51–ఎ ఆర్టికల్ ప్రకారం భారతీయుల విధియని రూలింగిస్తూ జస్టిస్ ఎస్.ఎన్ శ్రీవాత్సవ నాయకత్వాన అలహాబాదు హైకోర్టు సంచలనాత్మక తీర్పు నిచ్చింది!

ఈ తీర్పుకు వివరణలా వుంది గాంధీగారి మరో విశ్లేషణ, అన్నిమతాల వారూ నిరభ్యంతరంగానూ, ఆత్మీయంగానూ అధ్యయనం చేయదగిన అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథం శ్రీమద్భగవద్గీత ఎందుకంటే? ఏ మతం వారైనా తమ పవిత్ర గ్రంథాలలోని ఆధ్యాత్మికాంశాలను భగవద్గీతలో చదువుకొని ఆనందించగలరంటూ వక్కాణించారు గాంధీ!

భగవద్గీత – నిత్య సత్యాలు

ఆరాధ్య : భగవద్గీత నిత్య సత్యాలంటున్నారు గదా, వాటిలో ముఖ్యమైన కొన్నింటిని సూచిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఇవిగో నిత్యసత్యాలలో కొన్ని వీటిని శ్రద్ధగా వినండి.

గీత –2–3 "క్షుద్రమైన హృదయ దౌర్భల్యాన్ని వదిలి కర్తవ్య నిర్వహణకు పూనుకో! 2–14 వచ్చిపోయేరుతువుల్లా, సుఖదుఃఖాలూ తాత్కాలికాలే, కాస్త ఓర్చుకో అవే తొలగిపోతయ్!"

2–40 "ధర్మాన్ని కాస్తైనా ఆచరించు, అదినిన్ను గొప్ప భయాన్నుండి కాపాడుతుంది."

2–47 "చేసే పనుల మీద శ్రద్ధచూపు, ఫలితాన్ని పరమాత్మ చూచుకుంటాడు!"

2–48 "రాగద్వేషాల కతీతంగా ఈశ్వరుని ప్రీతికోసం నీవిధిని నిర్వహించు!"

2–50 "ఫలాపేక్ష (స్వార్థ) రహితంగా సత్కార్యాలు చేసే నేర్పే కర్మయోగం"

12–12 "ఫల(స్వార్థ) త్యాగం వల్లనే పరమశాంతీ, శాంతివల్ల సుఖం ప్రాప్తిస్తయ్"

3–9 "ప్రపంచ క్షేమంకోసం మంచి పనులు చేసేవారికి పాపపుణ్యాలంటవు"

3–15 "ఆత్మానంద భరితులకు లోక కళ్యాణదాయక కర్మలేగాని స్వార్థకర్మలుండవు"

3–21 "శ్రేష్ఠుని పనులే ప్రామాణికాలుగా భావిస్తుంటారు ప్రజలు. అందుకే శ్రేష్ఠులెన్నడూ పొరపాటు పనులు చేయకూడదు"

3–35 "తనవిధిని తాను నిర్వహించుటే శ్రేయస్కరం, ఇంకొకరి విధిని చేపట్టుట హానికరం" (ఇంజనీరు విధిని డాక్టరు, అతని విధిని ఇంజనీరు చేపట్టుట ప్రమాదకరమేగదా)

3–43 "దుర్జేయ కామ(కోర్కెల) శత్రువును అణిచెయ్!"

4–11 "ఎవరే మార్గాన పయనించినా వారంతా చేరుకునేది పరమాత్మనే"!

4–31 "ప్రపంచ క్షేమం కోసంపాటుపడని వాడీ ప్రపంచంలోనే ఉండదగడు. ఇంకా అలాంటి వానికి పరలోకం గూడానా?"

4-33 "ద్రవ్య యజ్ఞం కన్నా జ్ఞాన యజ్ఞమే శ్రేయోదాయకం"

4-36 "ఆత్మ జ్ఞానపు తెప్పతో మనిషి పాప జలధిని దాటగలడు"

4-38 "మనిషిని పాపరహితునిగ, పవిత్రునిగా రూపొందించటానికి ఆత్మజ్ఞానాన్ని మించింది లేదు"

4-39 "శ్రద్ధగలవానికి, జితేంద్రియునకు ఆత్మ(బ్రహ్మ)జ్ఞానం సిద్ధిస్తుంది."

5-5 "ప్రాణులన్నింటా ఉన్నది పరమాత్మయే నన్న ఆత్మజ్ఞానాన్నీ, నిష్కామకర్మను అభిన్నంగా చూచేవాడి దృష్టియే వాస్తవికదృష్టి"

5-23 "కామ క్రోధోద్వేగాలను జయించిన వానికి శాంతీ, సుఖం ప్రాప్తిస్తుంది"

6-31 "అందరి సుఖదుఃఖాలను తనవిగా భావించువాడు పరమశ్రేష్ఠుడు"

కావ్య : ఇంకా కొన్ని నిత్యసత్యాలను వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : 6-40 "సత్కార్యాలు చేయువారెన్నటికీ దుర్గతిపాలు కారు"

7-7 "దారమందు మణుల్లా, విశ్వమంతా ఈశ్వరుని యందు గుచ్చబడి ఉంది"

7-10 " ఆత్మజ్ఞానిని తన(ఆత్మ) తో సమునిగా భావిస్తాడు పరమాత్మ"

9-22 " సత్కార్యాలు చేయువారి యోగ క్షేమాలను సదా సర్వేశ్వరుడే చూసుకుంటాడు"

9-27 " నీ ప్రతి పని(కర్మ) నీ పరమాత్ముని కర్పించి చేయి"

12-14 " ప్రాణులన్నింటి కోసం పాటుపడువాడు పరమాత్మనే చేరుకుంటాడు"

12-10 "సర్వేశ్వరుని ప్రీతికోసం శ్రమించేవాడు సిద్ధిని పొందుతాడు"

13-14 "ఒకే సత్యాన్ని మహర్షులు పలు పేర్లతో పిలిచారు, ప్రార్థించారు"

13-21 " మనిషి యొక్క సద్గుణ, దుర్గుణాలే అతని యోగ్య, అయోగ్య జన్మల కారకాలు"

14-17 "సాత్విక గుణం జ్ఞానానికి - రజోగుణం స్వార్థానికి - తమోగుణం అజ్ఞానమూర్ఖత్వాలకు ప్రతీకలు"

14-24 "మట్టిని, బంగారాన్నీ, సుఖాన్నీ, దుఃఖాన్నీ సమంగా చూడగల్గినవాడు ఆత్మజ్ఞాని"

15-15 "అందరి హృదయాలలో అంతరాత్మగ నివసిస్తున్నది భగవంతుడే"

15-20 "భగవద్గీతా జ్ఞాన గ్రహీత బ్రహ్మజ్ఞానియై కృతార్థుడౌతాడు"

16-23 "శాస్త్ర నియమాల కతీతంగా విశృంఖలంగా ప్రవర్తించువాడు సిద్ధించలేడు"

16-24 "ధర్మాధర్మ కర్తవ్యాకర్తవ్య నిర్ణయానికి శాస్త్రమే ప్రమాణం"

18-20 "భిన్నంగా ఉన్న వాటన్నింటా ఉన్న పరమాత్మ ఒక్కడేనని గ్రహించిన వాని జ్ఞానమే సాత్విక జ్ఞానం! ఆత్మజ్ఞాన మన్నా, బ్రహ్మజ్ఞానమన్నా అదే!

18-45 "తనవిధిని శ్రద్ధగా నిర్వహించిన వాడు తప్పక సిద్ధిని పొందుతాడు"

18-46 "విధి నిర్వహణ ద్వారా ఈశ్వరుని పూజించువాడు కృతార్థుడు"

"విధి నిర్వహణకు మించిన ఈశ్వర పూజ - ప్రాణిసేవకు మించిన పరమాత్మ సేవలేవు"

18-65 "సదా సర్వేశ్వరునిపై మనసుంచు, సత్కార్యాలే చేయగల్గుతావు"

18-66 "దైవాన్నే శరణువేడు. అంతరాత్మగ నీలోవున్న ఆయన ఆదేశానుసారమే నడుచుకో"

6-5 "నీ ఆత్మ సహాయం (నీ అంతరాత్మ సూచనల)తో నిన్ను నీవు ఉద్ధరించుకో"

ఇలా భగవద్గీత చెప్పినవన్నీ నిత్య సత్యాలే! అందుకే అధ్యయనంతో వదిలేయక, వాటినిఆచరించిన వారు, వారిని వారే గాదు, సమస్త మానవాళినీ సముద్ధరించ గలరు! కాబట్టి, ప్రియతమ విద్యార్థినీ విద్యార్థులారా గీతాధ్యయనాచరణలద్వారా, మిమ్మల్ని మీరు, మీతోపాటు ప్రపంచ ప్రజలందరినీ సముద్ధరించెదరుగాక! తథాస్తు!

చారిత్రక పురుషుడే శ్రీకృష్ణుడు!

హర్ష : తాతయ్యా! శ్రీకృష్ణుడు చారిత్రక పురుషుడు కాడు, కేవలం కాల్పనిక కథానాయకుడే నంటున్నారు కొంతమంది. అదినిజమేనా?

వ్యాఖ్యాత : లేదు హర్షా, కొందరు మిడిమిడి జ్ఞానులు శ్రీకృష్ణుడు కాల్పనిక కథానాయకుడేనంటూ తమ విమర్శల ఎండమావులతో ప్రజలను భ్రమింప చేసేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు. కానీ, పలువురు పరిశోధనాత్మక చరిత్రకారులు శ్రీకృష్ణుడు చారిత్రక పురుషుడేనంటూ వక్కాణిస్తున్నారు. ఉదాహరణకు సుప్రసిద్ధ పరిశోధకులు, చరిత్రకారులైన ప్లిని ఆర్యన్ సోలినెస్ మెగస్తనీస్‌లు వ్రాసిన, ప్రాచీన భారత చరిత్రలో కౌరవ, పాండవ, శ్రీకృష్ణాదుల చారిత్రక వివరాలున్నట్లు ధృవీకరించారు. క్రీ॥పూ 326 సం॥లో భారత్‌పై అలెగ్జాండర్ చేసిన దండయాత్రను స్వయంగా చూసిన చరిత్రకారులువీరు.

మధురకు 9 కి.మీ. దూరంలో వున్న గోకులంలో శ్రీకృష్ణుడు గోపబాలురతో ఆటపాటలతో గడిపాడు బాల్యాన్ని. గోకులంలో నేటికీ శ్రీకృష్ణ,

బలరామ, మందిరాలున్నాయి. తనను చంపవచ్చిన పూతన రాక్షసిని బాలకృష్ణుడు సంహరించిన స్థలమదేనని అక్కడి ప్రజల ధృఢ విశ్వాసం. అందుకే దానిని పుణ్యస్థలంగా భావించి కృష్ణభక్తులు నేటికీ గోకులాన్ని భక్తిశ్రద్ధలతో సందర్శిస్తున్నారు.

ఆగ్రా పట్టణానికి 50 కి.మీ దూరంలోయమునా నదిని ఆనుకుని మధురా నగరమున్నది. అక్కడ 2500 సం॥ క్రితం నాటిదని చరిత్ర పరిశోధకులు ధృవీకరించిన శిధిలావస్థలో ఉన్న కోట ఉన్నది. అక్కడి చెరసాలలోనే దేవకీ, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించాడు. దానినిపుడు వ్రజభూమి అని పిలుస్తున్నారు. ఇప్పటికీ అసంఖ్యాకులైన భక్తులు, భక్తి శ్రద్ధలతో సదరు ప్రదేశాన్ని సందర్శిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు! అచట నెలకొన్న గీతామందిరంలో శ్రీకృష్ణుడు, రుక్మిణీ మాతలు కొలువై వున్నారు.ఆ సమీపంలోనే 17 మీటర్ల ఎత్తుగల సతీబురుజు ఉన్నది. యమునా నదీతీరంలో అన్నాచెల్లెళ్ళఘాట్, బలరామ శ్రీకృష్ణులు విశ్రాంతి తీసుకున్న విశ్రామ్‌ఘాట్ కూడ ఉన్నాయి. మధురకు 7 కి.మీ దూరంలో మహావన్ అనే పుణ్యస్థలముంది. మన్నుదిన్న చిన్నికృష్ణుని మందలిస్తున్న తల్లి యశోధరకు తన నోట్లో 14 భువనాలను చూపి తానే పరమాత్మ నన్న సంకేతాన్ని బాలకృష్ణ దందించిన పుణ్యస్థలమది. అలాగే పిడుగులతో కూడిన జడివాన బారినుండి తన గోకులాన్ని కాపాడేందుకు గొడుగులా ఎత్తిపట్టాడని చెబుతున్న గోవర్ధనగిరి గూడ మధురకు సమీపంలోనే ఉంది. – అక్కడికి చేరువలోనే మానసగంగ అను పెద్ద సరస్సు ఆ పరిసరాలలోనే విశ్వామిత్రుడు యాగం చేశాడని స్థల పురాణం చెబుతున్న ధరణీతీర్థం గూడ ఉన్నది. "మధురా దర్శనం, శ్రీకృష్ణ స్మరణం సర్వదా శుభప్రదం" అన్న నానుడిని నేటికీ ఆ ప్రాంతంలోనే గాక భారతదేశవ్యాప్తంగా భక్తులంతా విశ్వసిస్తున్నారు.

శ్రీకృష్ణుని నాయకత్వంలో యాదవులు కొన్ని అనివార్యకారణాల వలన తమ మూలస్థావరమైన గోకులం నుండి, మధురానగరికి, అక్కడనుండి

పశ్చిమదిశగా వలసవెళ్ళి, గుజరాత్ తీరప్రాంతంలోని ఒకదీవిలో శత్రుదుర్భేధ్యమైన నగరంగా ద్వారకానగరాన్ని నిర్మించుకున్నారని **మజుందార్, పుసాల్కర్ వంటి ప్రముఖ చరిత్రకారులు** తమ పరిశోధనా గ్రంథాలలో పేర్కొన్నారు. సురుచిర సుందరమైన ఆ ద్వారకానగరంలోనే సుభద్రార్జునుల వివాహం వైభవోపేతంగా జరిగినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ద్వారకానగరం గూర్చిన వివరాలు, వర్ణనలు ఒక్క మహాభారతంలోనే కాక, భాగవతం, హరివంశం, వాయు, వరాహ, విష్ణు, స్కాంద మొదలగు పురాణాలు, ఇంకా పలుగ్రంథాలలో గూడ పేర్కొనబడినాయి. **ఐతే శ్రీకృష్ణుని మరణానంతర మెప్పుడో, ద్వారకానగరం సముద్రగర్భంలో కలిసిపోయి ఉంటుందని పరిశోధకులు భావించారు. వారి భావన వాస్తవమని నిరూపిస్తూ, ఇటీవలే పురాతత్వవేత్తలు, గుజరాత్ తీరంలోని సముద్రపులోతుల్లో ఒకనగరపు అవశేషాలను కనుగొన్నారు.** పైన తెల్పిన పురాణాలు, గ్రంథాలు తెలియజేస్తున్న వివరాలకు – పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్న నగరావశేష వివరాలకు గల సామ్యాలు, పోలికలను బట్టి అది ఖచ్చితంగా ద్వారకానగరమేనన్న నిశ్చయాని కొచ్చారు పరిశోధకులు. మరియు ప్రస్తుతం అదే ప్రాంతంలో ఒకచిన్న తీరస్థ గ్రామమున్నది. అందులో ప్రధానంగా పశులకాపర్లు నివసిస్తున్నారు. వారిపుట్టుపూర్వోత్తరాలను గూర్చి ఆ గ్రామ పెద్దలనడిగినప్పుడు, తాము శ్రీకృష్ణుని వంశీయులమని సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ నిదర్శనాలన్నీ శ్రీకృష్ణుని చారిత్రకతను ధృవీకరించటం లేదా?

దేవాంశ్ : ఔను తాతయ్యా! పై నిదర్శనాలన్నీ మేం పాఠ్యగ్రంథాలలో చదువుకున్నట్లే ఉన్నాయి. శ్రీకృష్ణుడు కాల్పనిక కథానాయకుడు కాడు, చారిత్రక పురుషుడేనని నేను ధృఢంగా విశ్వసిస్తున్నాను తాతయ్యా!

విరాజ్ : శ్రీకృష్ణుడు భగవంతుడంటున్నారు గదా, మరి యుద్ధం జరిగి అన్ని లక్షలమంది, చనిపోకుండా కేవలం దుష్టకౌరవులను ఆయనే సంహరించవచ్చుగదా తాతగారూ?

వ్యాఖ్యాత : తెలివైన తండ్రి ఎప్పుడూ, తన బిడ్డలు తమ కాళ్ళమీద తాము నిలబడేలా, తమను తాము పోషించుకునేలా, తమను తాము ఉద్ధరించు (సంస్కరించు) కొనేలా జ్ఞానవంతుల్ని చేస్తుంటాడు. కేవలం ఒక పెద్దగా తగిన సలహాలు, సూచనలు మాత్రం యిస్తుంటాడు ఔనా విరాజ్ ! మరి శ్రీకృష్ణావతార పురుషుడు ఒక తెగకు అధిపతి, యుద్ధవీరుడై యుండి గూడ కురుక్షేత్రయుద్ధంలో తను స్వయంగా పాల్గొనలేదు. అందుకు కారణాలు రెండు 1. పాండవులు తమను తాముద్ధరించుకునేలా ప్రోత్సహించి, ధర్మాన్ని పరిరక్షించేందుకు 2. తను సారథ్యం వహిస్తున్న అర్జున రథానికేగాక, పాండవులందరికీ సరియైన దిశానిర్దేశం చేస్తూ వారిని విజయతీరానికి నడిపించడంకోసమై, ఆయన స్వయంగా యుద్ధంలో పాల్గొనకుండా కేవలం వారికి దిశానిర్దేశం చేశాడంతే! అదిగూడ కేవలం ఆదేశ పూర్వకంగా కాకుండా సృష్టిరహస్యాన్ని, ధర్మ పరిరక్షణావశ్యకతను, అందుకు మానవ కర్తవ్యాలనుగూర్చి సహేతుకంగ వివరించి చెప్పటం ద్వారా అర్జునుడు, తను పయనించాల్సిన దిశను, తన కర్తవ్యాన్నీ తనంతట తాను నిశ్చయించు కోగలిగేలా గీతోపదేశం చేశాడు శ్రీకృష్ణుడు! ఆయన నాడర్జునునకు చేసిన గీతోపదేశమే నేడు సమస్త మానవాళికీ ఆచరణాత్మక స్వయం సముద్ధరణా మార్గమై ప్రపంచ వ్యాప్తంగా శ్రీమద్భగవద్గీతగా విరాజిల్లుతున్నది. ఆయన శ్రీకృష్ణావతార పురుషునిగ ఆరాధించబడుతున్నాడు!

శ్రీకృష్ణుడు శాంతి కాముకుడు!

యువన్‌తేజస్ : శ్రీకృష్ణుడు హింసావాది, ఆయన గీతోపదేశం హింసను ప్రోత్సహిస్తుందని కొందరు విమర్శిస్తున్నారెందుకు తాతయ్యా?

వ్యాఖ్యాత : నిజమే యువన్! ఆ మధ్య రష్యాలోనూ, అక్కడక్కడా తరచుగా భారతదేశంలో కూడ కొందరు మిడిమిడిజ్ఞానులు భగవద్గీత హింసాత్మకమనీ, శ్రీకృష్ణుడు హింసావాదియనీ కువిమర్శలు చేస్తున్నారు. ఒక మహాపురుషుని

గూర్చి పూర్తిగా అధ్యయనం చేయకుండా అభాండాలు వేయటానికి అల్పజ్ఞానులు మాత్రమే సాహసిస్తారు. అలాంటివారు గ్రహించలేని వాస్తవమిదీ –

శ్రీకృష్ణుడు యుద్ధవీరుడే, కానీ మౌలికంగా ఆయన శాంతికాముకుడు. ఉదాహరణకు తనజాతి ప్రజలకు హానికలిగిస్తున్నట్టి కాళీయ ఘట్టంలోని నాగులను ఓడించినా, వారి నక్కడ నుండి వెళ్ళిపొమ్మనివదిలేశాడే కాని చంపలేదు. అలాగే సంప్రదింపుల ద్వారా కురుక్షేత్రయుద్ధాన్ని నివారించేందుకు శాయశక్తులా కృషిచేశాడాయన. మొదట పాంచాల రాజు ద్రుపదుని యొక్క పురోహితుని ధృతరాష్టుని వద్దకు దూతగా పంపి శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నించాడు. కానీ, అత్యాశతో పాటు అహంభావమూ మూర్తీభవించిన దుర్యోధనుని మొండితనం వలన సదరు శాంతి ప్రయత్నం ఫలించలేదు. ఇక తనే స్వయంగా రంగంలోకి దిగి శాంతి సాధనకోసం ప్రయత్నించాడు శ్రీకృష్ణుడు. ఆయనచేసిన విశిష్టశాంతి ప్రయత్నమంతా జగమొండి దుర్యోధనుని ముందు బూడిదలో పోసిన పన్నీరైంది. ప్రత్యామ్నాయాన్ని గూర్చి ఆలోచిస్తున్న శ్రీకృష్ణునకింకో ఉపాయం తట్టింది. ఎవరి అండ చూచుకుని దుర్యోధనుడు కయ్యానికి కాలు దువ్వుతున్నాడో ఆ కర్ణుని పాండవ పక్షానికి రప్పిస్తే నన్నా దుర్యోధనుడు శాంతి కంగీకరిస్తాడేమోనని ఆ దిశగానూ ప్రయత్నించి చూశాడు శ్రీకృష్ణుడు. కానీ, కర్ణుడు ససేమిరా అనటంతో ఇక గత్యంతరం లేక ధర్మపరిరక్షణార్థం పాండవులను యుద్ధానికి సన్నద్ధులయ్యేలా చేశాడు. శ్రీకృష్ణుడు శాంతి కాముకుడనటాని కింతకన్నా నిదర్శనాలేం కావాలి?

హర్షవర్ధన్ : ధర్మాత్ములైన పాండవులను కొన్నిసార్లు అధర్మానికి పాల్పడేలా శ్రీకృష్ణుడే ప్రోత్సహించాడని కొందరు విమర్శిస్తున్నారు గదా తాతగారూ?

వ్యాఖ్యాత : నిజమే, హర్షవర్ధన్ మంచిని కాపాడుకోవటం కోసం వంచకులను వంచనతోనైనా నిర్మూలించాల్సిందే నన్నది ధర్మశాస్త్రం తెలియజేస్తోన్న మర్మం.

ఐనాసరే శిష్ట పాండవులు ఎట్టి పరిస్థితిలోనూ ధర్మాన్ని విడనాడరనీ దుష్ట కౌరవులు స్వార్థంకోసం ఎట్టి అధర్మ కార్యాలకైనా వెనకాడరన్న వాస్తవం తెలిసిన శ్రీకృష్ణుడు, దుష్టకౌరవులు చేసే అధర్మ కృత్యాలకు పాండవు లెంతటి మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందో, వారికి ప్రత్యక్షంగా తెలియజేసేందుకు సంకల్పించాడు. ప్రత్యామ్నాయం లేని సమయంలో కాల్లో విరిగి సలుపుతున్న ముల్లును, ముల్లుతోనే తొలగించుకోవాలన్న ధర్మసూక్ష్మాన్ని పాండవులు, స్వయంగా తెలుసుకునేలా చేయాలనుకున్నాడు శ్రీకృష్ణుడు. అందుకే పద్మవ్యూహం పన్ని పాండవులకు కౌరవులు సవాలు విసిరిన సమయంలో సదరు వ్యూహాన్ని సమర్థవంతంగా చేదించగల్గిన ఏకైక పాండవ వీరుడు అర్జునుణ్ణి, అదే సమయంలో పద్మవ్యూహానికీ సమాంతరంగా మరొకచోట గల భీకర యుద్ధ పరిస్థితిని వివరించి ఒక వ్యూహం ప్రకారమే పద్మవ్యూహానికి దూరంగా తీసుకెళ్ళాడు శ్రీకృష్ణుడు.

ఇక అక్కడున్న పాండవ పక్షపు వీరులలో పద్మవ్యూహంలో ప్రవేశించగల్గినవాడు అభిమన్యుడొక్కడే! తండ్రి అర్జునునిలా అతనూ అరివీర భయంకరుడే! అందువలన అభిమన్యుని ముందుకు పంపి, అతనికి రక్షణగా తక్కిన పాండవులు వెంటవెళ్ళేందుకు నిశ్చయించుకున్నారు. ఐతే కౌరవుల కుట్రలో భాగంగానే అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించగానే తక్కిన పాండవులను ప్రవేశించనీయకుండా జయద్రధాదులు నిలువరించారు. ఐనా పద్మవ్యూహంలో ఒంటరిగానే అభిమన్యుడు అనన్యసామాన్యంగా అరివీరులను చీల్చి చెండాడుతున్నాడు. అనూహ్యమైన అతని ప్రతాపాన్ని యుద్ధ ధర్మానుసారం ఒక్కొక్కరుగా తట్టుకొని బ్రతికి బట్టకట్టడం అసాధ్యమని దుష్టకౌరవులు గ్రహించారు. బుద్ధిపూర్వకంగానే యుద్ధ ధర్మాలకు, సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి ద్రోణ, కృపాదిగురువులు, కర్ణ, అశ్వత్థామాది అతిరథ మహారథులంతా వీరాభిమన్యుని క్రూరమృగాల్లా చుట్టుముట్టి దశదిశలా దాడిచేసి విరథుని, నిరాయుధుని చేసి అధర్మమనే కారు మబ్బులా

కవ్వేసి ఉదయభానుని వంటి అభిమన్యుని క్రూరాతి క్రూరంగా అస్తమింపజేశారు దుష్టకౌరవులు.

ఆ అధర్మకృత్యం పాండవులను చలింపచేసింది. అత్యవసర కీలక సమయాలలో ధర్మాన్ని కాపాడుకోవటానికి అధర్మాత్ములను అధర్మంతో నైనా సరే నిర్మూలించేందుకు అభిమన్యుని హత్యోదంతాన్ని అంకుశంలా ఉపయోగించుకుంటూ ధర్మగజాలైన పాండవులను విజయతీరానికి నడిపించాడు శ్రీకృష్ణుడు! అలా దుష్టకౌరవులను శిక్షించి, శిష్ట పాండవులను రక్షించి, ధర్మానికి పట్టం కట్టాడు శ్రీకృష్ణావతార పురుషుడు!

శ్రీకృష్ణుడు ధర్మరక్షకుడే !

రిత్విక్ : ధర్మాన్ని కాపాడేందుకు అవతరించానని చెప్పుకుంటూ యుద్ధధర్మాలకు విరుద్ధంగా భీష్మ – ద్రోణ – కర్ణ – జయద్రధ – దుర్యోధనాదులను మాయోపాయతో చంపించిన శ్రీకృష్ణుడు దేవుడెలా ఔతాడని హేతువాదులంటున్నారుగదా, వారికేం జవాబు చెబుతారు?

వ్యాఖ్యాత : అర్ధవంతంగా మహాభారతాన్ని అధ్యయనం చేసిన వారెవరూ ఇటువంటి విమర్శకు పూనుకోలేరు. ఎందుకంటే ? పరిత్రాణాయ సాధూనాం... సంభవామి యుగే, యుగే అని తను చెప్పిందానినే ఆచరించి చూపాడు శ్రీకృష్ణుడు. పంటచేనులో కలుపుమొక్కల్ని సమూలంగా నిర్మూలిస్తేనే పైరుల్ని బాగా పెంచి ధాన్యాన్ని పండించలేం. అలాగే దుర్జనుల్ని శిక్షించి సజ్జనుల్ని కాపాడుకుంటేనే ధర్మాన్ని సుస్థిరం చేసుకోలేం. ఇదే పై గీత యొక్క ఆంతర్యం!

సదరు లక్ష్యంతోనే సజ్జన పాండవులను కాపాడేందుకు, దుర్జన కౌరవులను, వారికండగా నిలిచిన భీష్మ, ద్రోణ, కర్ణాదులను నిర్మూలించేందుకే తప్పనిసరి పరిస్థితుల్లో యుద్ధధర్మాల నతిక్రమించైనా చంపించాడు శ్రీకృష్ణుడు. అదీ అంతకుముందు వారు ధర్మాన్నే కాక యుద్ధ

ధర్మాలనూ అతిక్రమించియున్నారు. అట్టి అధర్మాత్ములను అధర్మంతోనే శ్రీకృష్ణుడు చంపించినట్లు సృష్టీకరిస్తున్నది మహాభారతం.

అధికార దాహంతో పినతండ్రిబిడ్డల్ని హతమార్చితే వారి రాజ్యమూ తన సొంత మౌతుందన్న దురాశతో దుర్యోధనుడు పాండవులపై విషాహారం, లక్కయింటి దహనం వంటి హత్యాప్రయత్నాలకు పూనుకొని ధర్మానికి హాని కలిగిస్తున్నా, ధర్మాన్ని కాపాడేందుకు, పై పెద్దలెవరూ పూనుకోలేదు. ధర్మరాజు బలహీనత నాధారం జేసుకుని మాయాజూదంతో అతన్ని ఓడించి, పాండవుల రాజ్యాన్నపహరించి, వారిని అడవుల పాల్జేసినా, దుర్యోధనుని నిరసించేందుకు వారిలో ఒక్కరూ ముందుకు రాలేదు. నిండు కౌరవ సభలో దుశ్శాసనుడు ద్రౌపదిని వివస్త్రను చేస్తుండగా, దుర్యోధనుడు తొడ చూపిస్తూ "రావే! వచ్చి నా యీ తొడపై కూర్చో" మంటూ నీచంగా మాట్లాడుతుంటే అసహాయురాలై రోదిస్తున్న ద్రౌపదిని కాపాడేందుకొక్కరూ పూనుకోలేదు. పైగా ఐదుగుర్ని కట్టుకున్న నీకు ఇంకెంత మందితో ఉంటే మాత్రం సిగ్గేమిటంటూ హేళనగా మాట్లాడాడు కర్ణుడు. వనవాసం చేస్తున్న పాండవులను హత మార్చేందుకు ఘోషయాత్రపేరిట అధర్మకార్యానికి పూనుకున్న దుర్యోధనుని వారించకపోగా, కర్ణాదివీరులంతా అతనికి దన్నుగా బయల్దేరారు. సభలో జరిగిన ఒప్పందం ప్రకారం, అజ్ఞాతవాసానంతరం పాండవులకు అర్ధరాజ్యాన్నిచ్చి వేయాలి. అలా ఇవ్వక కయ్యానికి కాలు దువ్విన దుర్యోధనుని అధర్మానికి సదరు వీరులంతా అండగా నిలిచారు. అధర్మాత్ముల కండగా నిలిచిన వారుకూడా అధర్మపరులేనని ఘోషిస్తున్నది ధర్మశాస్త్రం. ఈ విషయం తెలియని వారా భీష్మ, ద్రోణ, కృప, కర్ణాదులు? స్వార్ధమో, ప్రలోభమో, కారణమేదైతేనేం, వీరంతా అధర్మపరునకు కొమ్ముకాచిన గొప్ప అధర్మపరులే గదా! ఇక క్షమార్హం కాని వారి మరోనేరమేమంటే యువ వీరాభిమన్యునిపై పలువురు వీరులొకేసారి క్రూర మృగాల్లా చుట్టుముట్టి దాడిచేయటం, వెనుకపాటుగా విరుచుకుపడి అతన్ని ఆయుధ,

రథహీనుని చేయటం అలా నిరాయుధునిపై యుద్ధ ధర్మాలకు విరుద్ధంగా దశదిశలనుండి శరపరంపరతో దాడిచేసి క్రూరాతిక్రూరంగా, రాక్షసంగా హతమార్చటం, మహాభారతంలోకెల్లా అతిపెద్ద అధర్మకృత్యం!

'ధర్మోరక్షతి రక్షితః' అని మరచి వారాచరించిన అధర్మమే ఒకనాటికి తిరిగి వారినే హతమార్చుతుందన్న సత్యాన్ని భీష్మ ద్రోణ, కర్ణాదులకు అనుభవపూర్వకంగా అవగతం చేసేందుకు 'మంచిని కాపాడుకునేందుకు, వంచనకు పాల్పడినా పాపమంటదన్న' సంకేతాన్ని భావితరాలవారి కంద జేసేందుకు, కాల్లో ఇరుక్కుని సలుపుతున్న ముల్లును గత్యంతరం లేని పరిస్థితిలో, ఇంకో ముల్లునుపయోగించైనా తీసివేయక తప్పదుగదా, అలాగే ప్రాణాంతకంగా విజృంభిస్తున్న అధర్మాన్ని అధర్మంతోనైనా నిర్మూలించుకోక తప్పదని మానవాళికి తెలియజేసేందుకే శిఖండి నడ్డు పెట్టించి భీష్ముని **'అశ్వత్థామహతః'** అని బిగ్గరగాను **'కుంజరః'** అని మంద్రంగాను ధర్మరాజు నోటపలికించి ద్రోణుని, కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టించి జయద్రధుని, ఆయుధ, వాహన శూన్యుడై యున్న సమయాన కర్ణుని గదతో ఊరుభంగం గావించి దుర్యోధనుని, యుద్ధధర్మాలకు విరుద్ధంగానే అంతం చేయించాడు శ్రీకృష్ణభగవానుడు. నాడలా అధర్మంగానైనా సరే అధర్మకౌరవుల్ని అంతం చేయించకుంటే, ధర్మం, ధర్మాత్ములైన పాండవులూ బ్రతికి బట్టకట్టేవారు కాదనీ – **'ధర్మమేవ జయతే' – 'అంతిమ విజయం ధర్మాత్ములదే'** అన్న సంకేతాలు మానవాళికి అందియుండేవే కావన్న చారిత్రక సత్యాన్ని సృష్టీకరిస్తున్నది మహాభారత ఇతిహాసం!

నాడు కేవలం ధర్మపరిరక్షణార్థమే అధర్మాన్నాశ్రయించిన శ్రీకృష్ణ భగవానుని మాయోపాయాల నెత్తిచూపుతూ – ఆయనే మాకు ఆదర్శమంటూ అధికార, ధనార్జనా స్వార్థపరులు కొందరు అక్రమాలు, హత్యలు, విధ్వంసాలకు పాల్పడుతున్నారు నేడు. అదేమంటే? శ్రీకృష్ణభగవానుడే అధర్మానికి పాల్పడగా లేనిది, మానవమాత్రులం మేం చేయటంలో

తప్పేమున్నది? అని గడుసుగా ప్రశ్నిస్తున్నారు. శ్రీకృష్ణుడే పరిస్థితిలో ఎందుకోసం అధర్మాన్నాశ్రయించాడో గ్రహించలేని సామాన్య జనులు, సదరు అధర్మపరుల మాటలను, చేష్టలను నిర్విణ్ణులై చూస్తుండి పోతున్నారేతప్ప ఖండించలేకపోతున్నారు. సమాజంలో నేడు నెలకొనియున్న ప్రమాదకర ధోరణి, దురదృష్టకర వాతావరణమిది.

కాబట్టి, మానవ శ్రేయోభిలాషులంతా అట్టి అధికార, ధనార్జనా, స్వార్థపర దుర్జన శ్రేణుల మాటలను, చేతలను దీటుగా నిరసించాలి. నిరోధించాలి. మరియు సజ్జనులను స్వాగతిస్తూ ప్రోత్సహిస్తూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి! ఇది మనందరికీ అవశ్యకర్తవ్యం! మనందరికీ అట్టి ధర్మరక్షణ, అధర్మ నిర్మూలనా కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్న శ్రీమద్భగవద్గీతను అర్థవంతంగా అధ్యయనం చేద్దాం, చేయిద్దాం. అందుకే భారతజాతీయ సమైక్య పరిరక్షణకోసం మానవసమాజ శ్రేయస్సుకోసమై శ్రీమద్భగవద్గీతను భారత జాతీయ ధర్మశాస్త్రంగాను, పాఠ్యగ్రంథంగాను భగవద్గీతను ఏర్పరచుకుందాం. గీతాధ్యయన ఆచరణలద్వారా ఇంటింటినీ, ప్రతి పాఠశాలనూ శ్రీకృష్ణార్జున నిలయాలుగా రూపొందించుకుందాం! భారతదేశాన్ని 'ప్రపంచ ధార్మిక కేంద్రం'గా తీర్చిదిద్దుకుందాం! విశ్వమానవ శ్రేయస్సుకు ప్రపంచ శాంతికి, పరమ గమ్యానికి బాటలు వేద్దాం! తథాస్తు!

ఆధునిక శాస్త్రానికి – ఆధ్యాత్మికతకు వైరుధ్యం లేదు!

ఆదిత్య : ఆధునిక శాస్త్రమే (సైన్సే) వాస్తవమనీ, ఆధ్యాత్మికత కేవలం కొందరి వ్యక్తిగతానుభవం లేక ఊహ మాత్రమేనని నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టులు అంటున్నారు గదా వారికేం చెబుతారు తాతగారూ?

వ్యాఖ్యాత : వాళ్ళే కాదు, విద్యావంతుల్లో 90% మందిఇదే భావనతోఉన్నారు కానీ, అలాంటి భావన వారి అపరిపక్వతకు నిదర్శనం. ఎందుకంటే, ఆధునిక

శాస్త్రాన్నీ, భగవద్గీతాది ఆధ్యాత్మిక గ్రంథాలను అర్థవంతంగా అధ్యయనం చేసిన వారందరూ ఆ రెండూ చెబుతున్న వాస్తవమొక్కటేననీ, ఆరెండింటికీ వైరుధ్యమేలేదనీ, సమాజ ప్రగతికి అవి రెండూ అవశ్యా లనీ నిర్ధారించారు!

ఉదా॥

1. "శాస్త్రజ్ఞులు, మరియు సిద్ధ పురుషులు, వీరిరువురి ఆలోచనలూ మానవాళికి ఆవశ్యకములే!" – ప్రొ॥ జె.ఆర్.జోషి
2. "ఆధునిక శాస్త్రం జీవితాన్ని పొడిగిస్తుంది –ఆధ్యాత్మికత జీవిత లక్ష్యాన్ని స్పష్టీకరిస్తుంది" – కాకర్ల సుబ్బారావు
3. ఆధ్యాత్మిక విశ్వాసం లేకుండా నీతీ, నియమాలు బతకలేవు – ఆధునిక విజ్ఞానం లేకుండా ముందుకు సాగలేము" – నెపోలియన్
4. "భౌతిక జ్ఞానం తెలియనివాడు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందలేడు. అంటే ప్రకృతిని ప్రపంచాన్ని గూర్చి తెలుసుకోకుండా పరమాత్మను గూర్చి తెలుసుకోలేడని భావం" – బంకించంద్
5. "ఆధ్మాత్మికతను విడనాడిన విజ్ఞానం గుడ్డిది, శాస్త్రాన్ని తిరస్కరించిన ఆధ్మాత్మికత కుంటిది" – ఐన్‌స్టీన్
6. "ఆధ్యాత్మికతను తిరస్కరించరాదు. ఎందుకంటే దాని హృదయంలో అసలైన విజ్ఞానం దాగి ఉంది" – బ్రెట్రాండ్ రస్సెల్
7. "ఆధునిక శాస్త్రానికీ, ఆధ్యాత్మికతకూ మధ్య వైరుధ్యమెన్నటికీ ఉండబోదు, అవి రెండూ పరస్పర పూరకాలు" – మాక్స్‌ప్లాంక్

ఇలా యింకా పలువురు వైజ్ఞానికులు, జ్ఞానులూ చెప్పియున్నారు. ఐతే మీరు వారందరి పట్ల గౌరవభావనతో కాకుండా, మీకున్న సైన్సు పరిజ్ఞానంతోపాటు అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథం శ్రీమద్భగవద్గీతనూ సార్థకంగా అధ్యయనం చేసి, మీలో తలెత్తిన సందేహాలకు సంతృప్తికరమైన

జవాబు లభించే దాకా నన్ను ప్రశ్నిస్తూ, మీ స్వీయ చైతన్యంతో వాస్తవాన్ని నిగ్గు తేల్చుకోండి. ఏం పిల్లలూ?

పిల్లలు : అలాగే తాతగారూ?

అగస్త్య : వ్యక్తావ్యక్త స్వరూపుడు పరమాత్మ అంటున్నది భగవద్గీత అంటే ఏంటి తాతగారూ?

వ్యాఖ్యాత : వ్యక్తం అంటే కనిపిస్తున్నదనీ – అవ్యక్తం అంటే కనిపించనిదనీ భావం. అవ్యక్త పరమాత్మ నుండి ఒక (1/4) భాగం ప్రపంచం రూపంలో వ్యక్తమయ్యింది. కనిపించని పరమాత్మనే దైవం లేక విశ్వచైతన్యం అనియంటున్నాం. కనిపించే ప్రపంచం + కనిపించని దైవం ఈ మొత్తాన్ని కలిపి పరమాత్మ లేక పరబ్రహ్మయని వ్యవహరిస్తున్నాం అగస్త్యా!

విద్యాధర్ : గీత 10-42 నాలో ఒక పాదంతో మాత్రమే ఈ ప్రపంచాన్ని ధరించి యున్నావని శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు గదా దీన్నెలా అర్థం చేసుకోవాలి తాతగారూ?

వ్యాఖ్యాత : ఒక చదరపు కిలోమీటర్ స్థలంలో 1/4 భాగంలో కళాశాల భవనాలు నిర్మించియున్నప్పటికీ మిగిలిన ఖాళీ స్థలంతో సహా కళాశాలని యంటున్నాం కదా, అలాగే 1/4 భాగంతో మాత్రమే రూపొందియున్న ఈ ప్రపంచంతోసహా కనిపించని మొత్తాన్నీ కలిపి పరమాత్మ / దైవం అంటున్నాం. అంతేకాదు కనిపిస్తున్న యీ ప్రపంచమంతటికీ కనిపించని పరమాత్మయే ఆధారం.

తరణ్ : కనిపించేదానికి ఆధారంగా కనిపించనిది ఉన్నదంటే, ఎలానమ్మాలి తాతయ్యా?

వ్యాఖ్యాత : చూడు తరణ్, వ్యక్తా వ్యక్త స్వరూపానికి ఉదాహరణగా ఒకచెట్టును తీసుకుందాం. కనిపిస్తున్న కాండం, కొమ్మలు, ఆకులను – కనిపించకుండా

భూమిలోపలున్న వేరుభాగాన్ని మొత్తాన్నీకలిపి చెట్టు అంటున్నాం. పైకి కనిపిస్తున్న చెట్టు భాగం గాలికి పడిపోకుండాను, దానికి నీటిని, ఆహారాన్ని అందిస్తూనూ ఆధారంగా ఉన్నది కనిపించని వేరు భాగమే కదా! **అలాగే పైకి కనిపిస్తున్న ఓడ భాగాన్నీ నీటిలో మునిగి కనిపించకుండా ఉన్న ఓడభాగాన్నీ మొత్తాన్నీ కలిపి ఓడ అంటున్నాం – పైకికనిపిస్తున్న ఓడకు నీటిలో వుండి కనిపించని ఓడ భాగమే ఆధారం.** అలాగే మనకు కనిపిస్తున్న ఈ ప్రపంచానికి, కనిపించని పరమాత్మయే ఆధారమనటంలో సందేహించాల్సిందేమున్నది తరణ్?

వశిష్ఠ : అది సరే తాతయ్యా, భూమిని త్రవ్వి, వేరుభాగాన్ని చూడవచ్చు – నీటిలో మునిగి ఓడ భాగాన్నీ చూడొచ్చు – మరి కనిపించని పరమాత్మను కనుగొనేదెలా?

వ్యాఖ్యాత : చూడు వశిష్ఠా, మనిషికి భౌతిక నేత్రం(కన్ను)తో పాటు, మనోనేత్రం కూడ ఉంటుంది. కంటికి కనిపించేది వ్యక్త ప్రపంచరూపం! మనో నేత్రంలో అవలోకిస్తూ వివేచిస్తూ ఉంటే కనిపించే భావననే దర్శనం అంటారు. అట్టి దర్శనం ద్వారా మాత్రమే అవ్యక్త పరమాత్మను దర్శించగలం. **అలా అంతర్ముఖంగా అవలోకిస్తూ సుదీర్ఘంగా ఆలోచించటాన్నే చింతన-ధ్యానం-తపస్సని గూడ అంటారు.** జ్ఞానులు, మహర్షులు, అలా దర్శనం ద్వారా పరమాత్మను, ఆయన ఉనికినీ దర్శించారు. ఈ విషయమై **వ్యాసమహర్షి "కనిపించేదాని చాటున దాగున్న వాస్తవాన్ని దర్శించటాన్నే జ్ఞానమనీ, వ్యక్తం చాటున దాగున్న అవ్యక్తాన్ని గూర్చి చింతన చేయువారే మహర్షులనీ"** అన్నారు!

జయరామ్ : మనం చూడకున్నా, మన మహర్షులు చెప్పారు కాబట్టి నమ్మాలంటారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఆధ్యాత్మికతే గాదు జయరామ్, సైన్సుగూడ అలాంటిదే గదా? శాస్త్రవేత్తలు చెబుతున్నారు కాబట్టి మనం నమ్ముతున్నాం. ఉదా॥ పరమాణువు

అంటే ఏమిటి? ఇక విభజించటానికి వీల్లేనంత చిన్నదని భావం. ఔనా, మరి అంత సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాణువులోగూడ ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు, వాటిలో మళ్ళీ క్వార్కులు, లెప్టాన్లు, బాసన్లు అను శకలాలు గూడ ఉన్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నందువల్లనే మనం విశ్వసిస్తున్నాం.అంతేగాని పై తెల్పిన వాటిలో ఏ ఒక్కశకలాన్నైనా మనం చూశామా, పోనీ చూడగలమా? అంతేగాదు కేవలం తరంగ స్వభావం మాత్రమే ఉందని మనం చదువుకున్న కాంతికి, కణ స్వభావం కూడ ఉందనీ– అలాగే కేవలం కణస్వభావం మాత్రమే ఉందనుకున్న ఎలక్ట్రాన్‌కు తరంగ స్వభావం కూడ వుందనీ నోబెల్ బహుమతీగ్రహీతలైన డిబ్రోగ్లీ, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రజ్ఞులు ప్రయోగపూర్వకంగ తెలుసుకున్నామని చెప్పారు. అందువలన మనం నమ్మి ఆపాఠాలనే ప్రమాణంగా చదువుకుంటున్నాం. **శాస్త్రజ్ఞులు ప్రయోగపూర్వకంగా దర్శించామంటున్నారు ఆధ్యాత్మిక వేత్తలు మనో నేత్రంతో దర్శించామంటున్నారు. అదే తేడా!**

హిమాంశ్ : సరే సైన్సును విశ్వసించినట్లే, ఆధ్యాత్మికతనూ విశ్వసించుదాం తాతగారూ, కానీ కోట్లాది ప్రాణులకు నిలయమైన భూమి– దానిపుట్టిల్లైన సూర్యకుటుంబం – దానికి నిలయమైన పదివేల కోట్ల నక్షత్రాల పాలపుంత – దానికి 20 లక్షల కాంతి సంవత్సరాల దూరాన ఉన్న 40వేల కోట్ల నక్షత్రాల బిగ్‌గెలాక్సీ – అలాంటి గెలాక్సీలు లక్షలాదిగా యున్నట్టి యింత సువిశాల విశ్వం, అసలేమీ కనపడని దాన్లోనుండి వెలువడిందంటే, నాకంతా అయోమయంగా ఉంది తాతయ్యా!

ఆరాధ్య : నిజంగా ఈ విషయం హిమాంశ్‌కు లాగే నాకూ అయోమయంగానే ఉంది తాతగారూ?

వ్యాఖ్యాత : ఇప్పుడు మీకొచ్చిన సందేహమే శ్వేతకేతు అనుశిష్యునకు క్రీస్తు పూర్వమే వచ్చిందట. అతను తన గురువు గారితో యిలా అన్నాడు.

కనిపించని పరమాత్మనుండి, యింత పెద్ద విశ్వం ఉద్భవించిందంటే, ఎలా విశ్వసించాలో తెలియక నాకంతా అయోమయంగా వుంది గురువుగారూ? అన్నాడట. అప్పుడు ఉద్దాలకుడను అతని గురువు శ్వేతకేతును పెద్ద మర్రిచెట్టు దగ్గరకు తీసుకెళ్ళి, చెట్టెక్కి ఒక మర్రికాయను కోసుకు రమ్మన్నాడు. కోసుకొచ్చాక దాన్ని విచ్చి చూసి అందులో ఏముందో చెప్పమన్నాడు. ఇందులో చిన్న చిన్న విత్తనాలున్నవన్నాడు శ్వేతకేతు. వాటిలో ఒక విత్తనాన్ని బాగా చూర్ణంచేసి, అందులో ఏంకనిపిస్తుందో చూసి చెప్పమన్నాడు ఉద్దాలకుడు. చూర్ణం చేశాక నాకిప్పుడేమీ కనిపించటం లేదు గురువుగారూ అన్నాడు శిష్యుడు. చూడు శిష్యా ఏమీ కనిపించని దాన్లోనుండి, యింత పెద్ద మర్రివృక్షం వచ్చిందని తెలుసుకున్నావు గదా, ఇదెంత వాస్తవమో, కనిపించని పరమాత్మ నుండి యింత పెద్ద విశ్వం జనించటమూ అంతే వాస్తవం. అన్న ఉద్దాలకుని జవాబుతో సందేహనివృత్తియైన శ్వేతకేతు వదనం ఆనందంతో వికసించింది. ఇప్పుడు మీ సంశయం గూడ తొలగినట్లేనని మీ నవ్వుమొఖాలే చెబుతున్నాయి. ఔనా పిల్లలు? ఔనన్నట్లు ఆనందంగా తలలూపారు వాళ్ళిద్దరూ.

కావ్య : చైతన్యస్వరూపుడు పరమాత్మ అంటున్నది మళ్ళీ గీత (7-5) జడ, చేతన పదార్థాలు, ప్రాణులన్నీ నానుండే ఉద్భవించాయనీ అంటున్నది భగవద్గీత. మరి చైతన్య పరమాత్మనుండి చైతన్యవంతమైన ప్రాణులే కాని, చైతన్యరహితమైన రాళ్ళు, కొండలు, గ్రహాల వంటి జడాలెలుపుట్టాయి. ఉదా॥ చైతన్యవంతుడైన మనిషికి బాబో, పాపో పుడతారుగాని, బండరాయి పుట్టదు గదా?

వ్యాఖ్యాత : నీవన్నది నిజమే కావ్యా కానీ, అలా ఎందుకు జరిగిందో తెలుసుకుందాం. సాలెపురుగు నుండి జిగురు వంటి పదార్థం వెలువడి అదే దారాలుగ మారి అందమైన రకరకాల సాలెగూళ్ళు రూపొందించినట్లే పరమాత్మనుండి చైతన్యవంతమైన ఒకశక్తి పెల్లుబికింది. అదే అణువులుగ,

ఆ అణువుల సమూహాలే ఘన-ద్రవ-వాయు-జడ-జీవ పదార్థాలుగ, అవే పలు వస్తువులు, జీవులుగ రూపొందినాయి. జడ-జీవ రెండు పదార్థాలూ జన్మించడమేమిటనే గదా నీ సందేహం? దీనికి జవాబు దొరకాలంటే, చైతన్యం యొక్క చైతన్య వంతమైన ప్రాణి యొక్క లక్షణాలేమిటో ముందుగా తెలుసుకోవలసి ఉంది.

చైతన్యం యొక్క లక్షణాలు : చైతన్యం 1. మౌలికమైనది 2. స్వతస్సిద్ధమైనది 3. సజీవమైనది 4. ఆనందయుత, శాంతియుతమైనది 5. సృజనాత్మకమైనది అంటే తనను తాను పలు విధాలుగా రూపొందించుకో గల్గిన సర్వశక్తిమంతమైనది. 6. తన ఉనికిని తాను అనుభవించగల్గినది.

చైతన్యవంతమైన జీవిలక్షణాలు : ఇందుకుదాహరణగా పరమాత్మ అంశయైన ప్రాణులలో కెల్లా మిక్కిలి చైతన్యవంతమైమనిషినే తీసుకుందాం. అతను తన సంతానాన్ని ఉత్పత్తి చేయటంతో పాటు వారి జీవనానికి కావలసిన వనరులను, హంగులను సమకూర్చి పెడుతుంటాడు. ఇంకా చైతన్యవంతుడైన మనిషి తన సంతానానికవసరమైన వనరులను సమీకరించిన తర్వాతనే సంతానోత్పత్తికి పూనుకుంటాడు. మరింత చైతన్యవంతమైన మనిషి సంతానాన్ని కనకముందే వనరుల సమీకరణకు మార్గాల నేర్పరచి, తన ప్రమేయమేమీ లేకుండానే తమకు తామే కావలసిన వాటిని సమీకరించుకోటానికవసరమైన విద్య, జ్ఞాన, అనుభవాలను వారికందేలా చేస్తాడు గదా!

అదేవిధంగా పరమ చైతన్యవంతుడైన పరమాత్మగూడ ప్రాణులకు జన్మనివ్వకముందే, అవి జీవించేందుకు కవసరమైన భూమిని, సూర్యచంద్రులను, గాలి, నిప్పు, నీరు, నింగీ వగైరాలను భూమి మీద గూడ జలచరాల కోసం సముద్రాలు నదులు, జలాశయాలను, వన్యప్రాణుల కోసమని అడవులను, తదితర ప్రాణులకోసం మైదాన ప్రాంతాలను,

మానవుల నివాస గృహాలు, గృహోపకరణాల నిమిత్తం పలు జడపదార్థాలను, వారి భోజనాల నిమిత్తం పైరులను, ఫలవృక్షాలను మొదలగు వాటన్నింటినీ సృష్టించటంతో పాటు, వాటన్నింటినీ వినియోగించుకోగలిగే **జ్ఞానాన్ని, చైతన్యాన్ని, ప్రాణులన్నింటా నిక్షిప్తం చేశాకనే చిట్టచివరిగా స్త్రీ పురుషుల్ని సృష్టించాడు.** ఇప్పుడర్థమైందా కావ్యా! జడ, జీవపదార్థాల సృష్టి వెనుక గల పరమేశ్వరుని ఆంతర్యమేంటో?

శ్రేష్ఠ : ఓ మైగాడ్ నిజంగా దేవుడు చాలా చాలా గొప్పవాడు తాతయ్యా!

సాయికృత్తిక : ఇంతకూ పరమాత్మ నివాసమెక్కడ తాతగారూ?

వ్యాఖ్యాత : సముద్రంలో 'ఉప్పు' ఉండే దెక్కడ? అన్నట్లుంది సాయికృత్తికా నీ ప్రశ్న! నీలాగే దేవుడెక్కడున్నాడో చూపించుమన్న తండ్రి హిరణ్యకశిపునితో **"ఇందుగల డందులేడని సందేహము వలదు, చక్రి! సర్వోపగతుండెందెందు వెదకి చూచిన యందందేగలడు! దానవాగ్రణి! వింటే!"** అని చెప్పాడు ప్రహ్లాదుడు.అదెలా సాధ్యమనుకుంటున్నారా? పరమ చైతన్యవంతుడైన పరమాత్మకు మూడురకాల స్వభావాలున్నాయి. అవి :

1. అన్నింటా నిండియుండే స్వభావం – ఇట్టి చైతన్యాన్నే **'బ్రహ్మ'** అనీ
2. అంతటా వ్యాపించి యుండే స్వభావం – యిట్టి చైతన్యాన్ని **'విష్ణు'** అనీ
3. అంతా పవిత్రంగా (విశుద్ధంగా) వుండే స్వభావం – దీనిని **'శివ'** అనీ అంటారు.

పరమాత్మకుగల యీ స్వభావాలనుబట్టి ఆయనను బ్రహ్మ–విష్ణు–శివ యనీ సంబోధిస్తు న్నాము. అందువల్లనే ఆయన నీలో, నాలో ఇక్కడున్న మీ అందరిలో ప్రాణులు,పదార్థాలు, శూన్యం, ఆకాశం అంతటా నివసించగల్గుతున్నాడు నిర్మలంగా పవిత్రంగా ప్రకాశిస్తున్నాడు పరమాత్మ!

ఊహాశ్రీ : మీలో, మాలోనూ దేవుడున్నాడని అంటున్నారు గదా, మరిమేం మీకు నమస్కరిస్తున్నట్లే మీరు మాకు నమస్కరించాలిగదా తాతగారూ?

వ్యాఖ్యాత : తప్పనిసరిగా చిట్టితల్లీ! కానీ మనకు పెద్దలొక సంప్రదాయాన్ని రూపొందించారు. పిల్లలు పెద్దలకు నమస్కరించటం, పెద్దలు పిల్లల్ని ఆశీర్వదించటం. అందుకే సదరు సంప్రదాయానుగుణంగా మిమ్మాశీర్వదిస్తున్నాను. "చిరంజీవులారా! మీ అందరికీ పూర్ణ ఆయురారోగ్య, ఐశ్వర్య, విద్య, సాత్విక గుణాభివృద్ధిరస్తు! సర్వదా మీకు శుభమస్తు! తథాస్తు! అలాగే ఊహాశ్రీ కోర్కె ప్రకారం మీ అందరిలో నివసిస్తున్న పరమాత్మకు నమస్తే!

పిల్లలు : మీకూ మా హృదయపూర్వక నమస్సుమాంజలులు, మరియు ధన్యవాదాలు తాతగారూ!

హర్ష : జీవపదార్థాలతో పాటు జడపదార్థాలనుగూడ పరమాత్మ ఎందుకు సృష్టించాడో అర్థమైంది. కానీ, ఆయన్నుండి ఒకే శక్తి వెలువడిందంటున్నారు గదా, మరి ఒకే శక్తి నుండి ఒకదానికొకటి సంబంధంలేని మనిషి,కోతి, కుక్క, పిల్లి, ఏనుగు, చీమ, దోమవంటి ఇన్నిరకాల ప్రాణులెలా రూపొందాయి తాతయ్యా?

దేవాంశ్ : ప్రాణులేగాదు, ఒకదానికొకటి సంబంధంలేని మట్టి–రాయి–బొగ్గు–ఇనుము–బంగారం–వెండి–వజ్రం–ప్లాటినం వంటి భిన్న పదార్థాలెందుకు రూపొందినట్లు తాతగారూ?

వ్యాఖ్యాత : చిరంజీవులారా! మీకు చక్కగా అవగాహన అయ్యేందుకై, మీరిప్పుడు చదువుకుంటున్న సైన్సు పరంగానే మీ ప్రశ్నకు జవాబు చెబుతాను శ్రద్ధగా వినండి.

విరాజ్ ఉజ్వల్ : ముందు ఆధ్యాత్మికత ఏం చెబుతుందో చెప్పాక,తర్వాత భౌతికత (సైన్సు) ఏం చెబుతుందో అప్పుడు చెప్పండి తాతయ్యా?

వ్యాఖ్యాత : విశ్వచైతన్యం (పరమాత్మ) నుండి 'చైతన్యవంతమైన శక్తి' వెలువడింది. చైతన్యం యొక్క సృజనాత్మక స్వభావం కారణంగా సదరు చైతన్యశక్తి తనకుతానే పంచభూతాలు (నింగి, నేల. నిప్పు, నీరు, గాలి) గాను అవే పలు జడ, జీవ పదార్థాలుగ రూపొందిందని ఆధ్యాత్మికత చెబుతున్నది!

యువన్‌తేజల్ : ఇక సైన్సేం చెబుతుందో చెప్పండి తాతగారూ?

వ్యాఖ్యాత : సైన్సు చెప్పేదేమిటో పాఠ్యగ్రంథాల ద్వారా మీకు తెల్సిందే. ఐనా మీకు క్లుప్తంగా వివరిస్తాను వినండి. మొదట పదార్థమంతా ఒకే పెద్ద అండము **(కాస్మిక్ ఎగ్)** గా సమీకృతమై యున్నందున, వేడిమి పెరిగి పెరిగి గాలిఒత్తిడికి పేలిన బెలూన్‌లా ఒక్కసారిగా పేలిపోయింది, దీన్నే పాశ్చాత్య వైజ్ఞానికులు బిగ్‌బ్యాంగ్ Big Bang అన్నారు. అలా పేలిపోయిన పదార్థం అణువులుగ, తరంగాలుగ, దశదిశలా వెదజల్లబడింది. వెదజల్లబడిన అణువులన్నీ వాటికి గల **'గురుత్వాకర్షణ',** (Centre of gravitation) మరియు **విద్యుదయస్కాంత శక్తుల** కారణంగా తిరిగి సమీకృతమౌతూ **వాయు మేఘాలు** గానూ, అవి యింకా, యింకా చిక్కబడి ఘనీభవిస్తూ **నక్షత్రాలుగ, గ్రహాలుగ, భిన్న మూలకాలుగా,** వాటి రసాయనిక సమ్మేళనాల కారణంగా, **భిన్న వస్తువులుగా, విభిన్న జీవరాశులుగా** రూపొందాయని సైన్సు చెబుతున్నది.

హర్షవర్ధన్ : ఇంతకూసైన్సు, ఆధ్యాత్మికత చెబుతున్న దానిలో ప్రధానమైన తేడా ఏంటి?

వ్యాఖ్యాత : విశ్వంలోని అన్నింటికీ అంటే సృష్టి వైవిధ్యాన్ని కంతటికీ మూలం ఒకే **'శక్తి'** యని ఇటు సైన్సు, అటు ఆధ్యాత్మికత రెండూ అంగీకరిస్తున్నాయి. ఐతే పరమాత్మనుండి వెలువడిన చైతన్యశక్తి తన చైతన్య స్వభావం వలన తనను తానే భిన్నపదార్థాలుగ, ప్రాణులుగ రూపొందించుకున్నదని

చెబుతున్నది ఆధ్యాత్మికత. బిగ్‌బ్యాంగ్ కారణంగా 'కాస్మిక్ ఎగ్' పేలి శక్తి (విద్యుదయస్కాంత శక్తి) వెదజల్లబడింది. అలా వెదజల్లబడిన శక్తియొక్క అణువులు, తరంగాలన్నీ వాటికి గల ఆకర్షణ శక్తుల కారణంగా తిరిగి సమీకృతమైనక్షత్రాలు, గ్రహాలు, మూలకాలుగ, పలు జడ, జీవపదార్థాలుగ రూపొందాయేగాని ఇక్కడ **చైతన్యం యొక్క ప్రమేయమే లేదంటున్నది సైన్సు. ఈ రెంటికీ గల ప్రధానమైన తేడా ఇదే!**

రిత్విక్ : సృష్టి వైవిధ్యానికి కారణం 'చైతన్యం' అని ఆధ్యాత్మికత – కాదు శక్తి మూలకాల రసాయనిక పరిణామమే కారణమని భౌతికత చెబుతున్నది,తేడా ఇదే!

వ్యాఖ్యాత : చక్కగా గ్రహించారు. సరే, పిల్లలూ! ఇప్పుడు చెప్పండి. చైతన్యవంతమైన శక్తి ద్వారా సృష్టియేర్పడింది, అంటున్న ఆధ్యాత్మికతనా? లేక విద్యుదయస్కాంత శక్తి ద్వారా రూపొందిన మూలకాల రసాయనిక పరిణామం వల్లనే సృష్టియేర్పడిం దంటున్న భౌతికతనా? దేన్ని విశ్వసిస్తున్నారు మీరు?

ఆదిత్య : నాకెందుకో సైంటిస్టులు చెబుతున్న బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతమే విశ్వసనీయ మనిపిస్తున్నది తాతగారూ!

అగస్త్య : నేనూ యిప్పటిదాక బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్నే విశ్వసించాను. కానీ ఆధ్యాత్మిక, భౌతిక వాదాలను విన్నాక నాకిప్పుడొక సందేహం తలెత్తింది. భౌతిక వాదులు చెబుతున్న బిగ్‌బ్యాంగ్‌కు ముందు, అక్కడికా పదార్థమెలా వచ్చింది? ఈ ప్రశ్నకు భౌతికవాదులు ఎప్పటికీ జవాబు చెప్పలేరు. ఎందుకంటే ఎక్స్ వలన ఆ పదార్థం అక్కడి కొచ్చిందని చెప్పినా, ఆఎక్స్ అక్కడికెలా, ఎవరి వలన వచ్చింది? అనే ప్రశ్న అనంతంగా కొనసాగుతూనే ఉంటుంది. అందుకే పరమాత్మ నుండి వెలువడిన చైతన్యవంతమైన శక్తియే విశ్వసృష్టికర్తయని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను తాతగారూ!

విద్యాధర్ : ఓహ్! అభినందనలు అగస్త్యా! చాలా హేతుబద్ధంగా ఆలోచించావు. సహేతుకమైన నీ వాదనవిన్న తర్వాత నేనుగూడ నీలాగే ఆధ్యాత్మికత చెప్పిన దాన్నే విశ్వసిస్తున్నాను.

పిల్లలు : మేమందరమూ పరమాత్మయొక్క చైతన్యవంతమైన శక్తినుండే విశ్వం సృష్టించబడిందని విశ్వసిస్తున్నాం తాతగారూ!

వ్యాఖ్యాత : పిల్లలూ మీకు నేనో, ఇంకెవరో చెప్పారని కాకుండా, మీ సొంత చైతన్యంతో ఆలోచించి సరైన నిర్ణయానికొచ్చినందుకు శుభాభినందనలు! మీరు నాకు సంధిస్తున్న ప్రశ్నలుగూడ ఆషామాషీవి కావు అవి పదునైన జ్ఞానసాధనాలు అందుకు గూడ మీకు మరిమరీ అభినందనలు.

తరణ్ : మమ్మల్ని అభినందించినందుకు మీకు మా హృదయపూర్వక ధన్యవాదాలు తాతగారూ! దయచేసి సృష్టిలోని వైవిధ్యానికంతటికీ మూలం ఒకే శక్తి అన్న అంశాన్ని మొదట మాకు భౌతికపరంగా వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : సైన్సు చెబుతున్నదేమంటే? సృష్టిలోని వైవిధ్యానికంతటికీ ఆధారభూతమైనది ధార్మిక శక్తే! ఈ ధార్మిక శక్తే అటు తరంగాలుగాను, ఇటు కణాలుగానూ ప్రవర్తిస్తున్నది.ఈ కారణంగా సదరు శక్తే పదార్థంగాను, ఆ పదార్థం తిరిగి శక్తిగానూ మారుతుంటుందని **ఐన్‌స్టీన్,డిబ్రోగ్లీ** వంటి శాస్త్రజ్ఞులు ప్రయోగరీత్యా నిర్ధారించారు. ఉదా॥ నక్షత్రానికి, నక్షత్రానికీ మధ్య నక్షత్రమండలానికి మధ్య శూన్యంగా కనిపిస్తున్న స్థలం మనం భావిస్తున్నట్లు ఖాళీ ప్రదేశం కానే కాదు. అదంతా విద్యుదయస్కాంత శక్తిమయం. ఆ శక్తి క్రమక్రమంగా అణువులుగ, ఆ అణువులే ఆకర్షణ శక్తులవలన, దగ్గరగ చేరి వాయుమేఘాలుగ, అవి చిక్కబడిన కొద్దీ వేడిమి పెరిగి అవే నక్షత్రాలు, గ్రహాలుగ, సూర్యకుటుంబాలు, నక్షత్రమండలాలుగ రూపొందుతున్నాయి. ఇదే విషయాన్ని ప్రఖ్యాత శాస్త్రవేత్త **ఆర్నాల్డ్ శ్రీధర్**

యిలా వ్రాసారు. 'పదార్థమంటే ఏంటి? పర్వతాలు, లోయలు, ఆహ్లాదకరమైన పొలాలు, సందడిగా వుండే నగరాలు, మబ్బుల శిబిరాలు, అందమైన భవనాలు ఇవన్నీ విద్యుద్బంధనాలలో నిర్బంధింపబడిన, అంతరిక్షంలో అలా అలా పయనించే స్వభావాన్ని అరికట్టబడిన **ధార్మికశక్తి** గాక మరేంటి? ఈ బంధనాలనుండి వాటిని విడుదల చేయండి, తిరిగి అవన్నీ **శక్తితరంగాలు** అవుతాయి' అని అన్నాడు.

వశిష్ఠ : తాతగారూ! పరమాణువు దగ్గర్నుండి, పెద్ద గ్రహాలతో కూడిన సూర్యకుటుంబం, పలు నక్షత్రాలతో కూడిన గెలాక్సీల దాకా అన్నీ ఒకే శక్తితో రూపొందినట్లు మన మెలా నిర్ధారించుకోవాలి?

వ్యాఖ్యాత : అందుకు నిదర్శన మేమంటే ? అణువులో ఏ లక్షణాలున్నవో, సూర్యకుటుంబంలోను, గెలాక్సీలోనూ అవే లక్షణాలున్నాయి. ముందుగా సూర్యకుటుంబ లక్షణాలను పరిశీలించుదాం.

సూర్యకుటుంబపు ప్రధాన లక్షణాలు : 1. ఇందులో సూర్యుడుకేంద్రంగా ఉంటాడు. 2. గ్రహాలన్నీనిర్దిష్ట కక్ష్యలలో, నిర్ధిష్ట దూరాలలో వేల మైళ్ళ వేగంతో సూర్యుని చుట్టూ తిరుగుతుంటాయి. 3. సూర్యకుటుంబపు ద్రవ్యరాశి బరువులో సూర్యుడొక్కని లోనే 99.85% ఉంటుంది. మిగిలిన 0.15% బరువు మాత్రమే అన్ని గ్రహాలలోనూ ఉన్నది.

పరమాణువు ప్రధాన లక్షణాలు : సూర్యకుటుంబంలోని సూర్యునిలాగే ప్రొటాన్లు+న్యూట్రాన్లు కలిసి న్యూక్లియర్ (పరమాణుకేంద్రం)గ వుంటాయి. ఈ పరమాణుకేంద్రం చుట్టూ నిర్దిష్ట దూరాలలో, నిర్దిష్ట కక్ష్యలలో సెకనుకు వందల మైళ్ళ వేగంతో పరిభ్రమిస్తుంటాయి ఎలక్ట్రాన్లు. పరమాణు ద్రవ్యరాశి బరువులో 99.97% పరమాణు కేంద్రంలోను, మిగిలిన 0.03% బరువు కేంద్రం చుట్టూ తిరుగుతున్న ఎలక్ట్రాన్లలోను, ఉంటుంది. **ఐన్‌స్టీన్, డాల్టన్,మెండెలీన్** వంటి శాస్త్రజ్ఞులు ప్రయోగపూర్వకంగా నిరూపించిన ఈ

సామ్యాలను బట్టి పరమాణువు నుండి పాలపుంత దాకా వివిధ పదార్థాలన్నీ ఒకేశక్తి (విద్యుదయస్కాంతశక్తి) నుండి ఉద్భవించాయనీ, సమస్త ఘన, ద్రవ, వాయు, జడ, జీవ పదార్థాలన్నీ అణుసమూహాలతోనే ఒక క్రమపద్ధతిలో నిర్మించబడ్డాయని స్పష్టమౌతున్నది.

జయరామ్ : పరమాణువు నుండి, పాలపుంత దాకా ఒకే శక్తితో రూపొందాయన్న అంశాన్ని సోదాహరణంగా వివరించినందుకు ధన్యవాదాలు తాతయ్యా! కానీ, ఒకే శక్తి ఇన్ని విభిన్న పదార్థాలుగా ఎలా రూపొందిందో గూడ వివరిస్తారా?

వ్యాఖ్యాత : తప్పక వివరిస్తాను. శ్రద్ధగా వినండి. 1. పరమాణువు అంటే ఇక అంతకన్నా విభజించటానికి వీల్లేనంత చిన్నదని భావం. 2. మొదట ధార్మిక శక్తి తరంగాలు పరమాణువులుగాను, ఆ పరమాణువులు గుంపులుగానూ ఏర్పడి పదార్థాలుగా రూపొందినాయి. 3. ప్రోటాన్లు+ న్యూట్రాన్లు+ఎలక్ట్రాన్లతో పరమాణువులు రూపొందాయని మీకు తెలుసు. 4. అట్టి పరమాణు శకలాలలో రసాయనిక మార్పుకు తోడ్పడగల్గినవి ధనవిద్యుదావేశం గల ప్రోటాన్లు మరియు ఋణవిద్యుదావేశం గల ఎలక్ట్రాన్లు మాత్రమే! న్యూట్రాన్లనేవీ కేవలం అణువుయొక్క బరువుకు తోడ్పడతాయి. 5. పరమాణువుల రసాయనిక మార్పుకు తోడ్పడగల్గిన ప్రోటాన్లు–ఎలక్ట్రాన్ల క్రమసంఖ్యలో మార్పుల ద్వారా కొన్ని మూలకాలు (మూల పదార్థాలు) రూపొందేలా వాటిని చైతన్యవంతం చేశాడు సృష్టికర్త. అట్టి మూలకాలలో ఇప్పటికి మన దృష్టికొచ్చినవి 92 – మీ అవగాహన కోసం, మీకు సుపరిచితమైన కొన్ని మూలకాలను అందలి ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల సంఖ్యలతో సహా ఉదహరిస్తున్నాను. ప్రతి పరమాణువులోనూ ధన విద్యుదావేశం గల ప్రోటాన్లెన్ని ఉంటయో, రుణవిద్యుదావేశం గల ఎలక్ట్రాన్లన్నే ఉంటాయి. మూలకాల (మూలపదార్థాల) సృష్టి రహస్యమిదే.

ఉదా॥ 1 ప్రోటాన్+1 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – హైడ్రోజన్ పరమాణువు

2 ప్రోటాన్+2 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – హీలియం పరమాణువు

6 ప్రోటాన్+6 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – కార్బన్ పరమాణువు

7 ప్రోటాన్+7 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – నత్రజని పరమాణువు

8 ప్రోటాన్+8 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – ఆక్సిజన్ పరమాణువు

11 ప్రోటాన్+11ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – సోడియం పరమాణువు

12 ప్రోటాన్+12ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – మెగ్నీషియం పరమాణువు

47 ప్రోటాన్ + 47ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది –వెండి పరమాణువు

79 ప్రోటాన్ + 79 ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – బంగారం పరమాణువు

82 ప్రోటాన్ + 82ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – సీసం పరమాణువు

92 ప్రోటాన్ + 92ఎలక్ట్రాన్‌లను కల్గియున్నది – యురేనియం పరమాణువు

ఈ 92 మూలకాల పరమాణువులు భిన్న నిష్పత్తులలో ఒకదాన్తో మరొకటి కలవటం ద్వారా యేర్పడిన సమ్మేళనాలే విశ్వంలోని విభిన్న పదార్థాలు.

హిమాంశ్ : మూలకాలేర్పడిన విధం తెలిసింది, అలాగే వాటి పరమాణువులు భిన్న నిష్పత్తులలో కలియటం ద్వారా విభిన్న పదార్థాలెలా రూపొందాయో గూడ వివరిస్తారా తాతయ్యా?

వ్యాఖ్యాత : భిన్నపదార్థాలు రూపొందిన విధానాన్ని గూడ సోదోహరణంగా వివరిస్తాను వినండి.

ఉదా॥

H_2O = 2 హైడ్రోజన్ పరమాణువులు+1 ఆక్సిజన్ పరమాణువు = నీరు

C_2O= 1 కార్బన్ పరమాణువు + 2 ఆక్సిజన్ పరమాణువులు = కార్బన్‌డయాక్సైడ్

NACL =1 సోడియం పరమాణువు+1 క్లోరిన్ పరమాణువు = ఉప్పు (సోడియం క్లోరైడ్)

CH_4 = 1 కార్బన్ పరమాణువు+4 హైడ్రోజన్ పరమాణువులు = మిథేన్ వాయువు

NH_3 = 1 నైట్రోజన్ పరమాణువు+3 హైడ్రోజన్ పరమాణువులు = అమ్మోనియా

ఇలా భిన్న మూలకాలు భిన్న నిష్పత్తులలో కలియుట ద్వారా విభిన్న పదార్థాలు రూపొందినాయి. ఇప్పుడు ప్రపంచంలో మనకగుపిస్తున్న రకరకాల పదార్థాలన్నీ యిలా రూపొందినవే.

ఆరాధ్య : హమ్మో ఈ 92 మూలకాలతోనే యిన్ని కోట్ల పదార్థాలు రూపొందాయంటే నిజంగా చాలా ఆశ్చర్యంగా వుంది తాతయ్యా?

వ్యాఖ్యాత : చూడు, ఆరాధ్యా! మనకున్న పరిమిత చైతన్యంతోనే, కేవలం 56 అక్షరాలతో యెన్నో పదాలను, వాక్యాలను, వాటితో పాటలు, పద్యాలు, కథలు, నవలలు, నాటకాలు, పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాల వంటి యెన్నో మహా గ్రంథాలను సృష్టించుకున్నాం గదా – మరి పరమ చైతన్యవంతుడైన సృష్టికర్త 92 మూలకాలతో యెన్నో రకాల పదార్థాలను, ప్రాణులనూ సృష్టించటంలో ఆశ్చర్యమేముంది. ఇలా మూలకాల సమ్మేళనాల ద్వారానే కాక, ఒకే మూల పదార్థం యొక్క పరమాణువులు, భిన్న ఆకారాలలో, సమీకృతం కావటం ద్వారా గూడ విభిన్న పదార్థాలు రూపొందుతున్నాయి.

ఉదా॥ కార్బన్ పరమాణువులు వలయాకారంలో సమీకృతమైతే బొగ్గు వంటి గ్రాఫైట్ గాను అదే కార్బన్ పరమాణువులు పంజరాకారంలో సమీకృతమైతే వజ్రాలుగను రూపొందుతున్నాయి! అలాగే పరమాణువులు అతి చేరువగా సమీకృతమైతే ఘనపదార్థాలుగాను, పరమాణువులు ఎడఎడంగా సమీకృతమైతే ద్రవపదార్థాలుగాను, పరమాణువులు దూరదూరంగా సమీకృతమైతే వాయు పదార్థాలు గాను రూపొందుతున్నాయి. ఇలా భిన్న మూలకాలకు, విభిన్న పదార్థాలను సృష్టికర్త ఎలా రూపొందించాడో గ్రహించారు గదా!

కావ్య : ఈ అంశం మాకు స్పష్టంగా, చక్కగా అర్థమయ్యేలా చెప్పినందుకు చాలా చాలా ధన్యవాదాలు. ఇలాగే జడ, జీవ పదార్థాలు గూడ ఒకేశక్తి నుండి ఉద్భవించాయని మేం విశ్వసించటానికై దయచేసి కొన్ని పోలికలను లేక నిదర్శనాలను మాకు వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఆదిశక్తి నుండి భిన్నమూలకాలు, ఘన, ద్రవ, వాయు పదార్థాలు రూపొందించినట్లే జడ, జీవ పదార్థాలు గూడ జనించాయన్నది వాస్తవం ఐతే. జీవపదార్థాల్లో జీవలక్షణం బాహాటంగానే కనిపిస్తుంది. కానీ, అదే జీవలక్షణంజడ పదార్థాల్లో మాత్రం కేవలం బీజ(సూత్ర) ప్రాయంగా, నిద్రాణంగా ఉంటుంది.

ఉదా॥ 1. మనం రెండు అరచేతులను రాపిడిపెడితే బాగా వేడివస్తుంది. అలాగే రెండు చెట్ల కొమ్మలు రాపిడికి గురైతే వేడిమే కాదు, నిప్పుగూడ పుడుతుంది. (అడవుల దహనానికి రెండు కొమ్మల రాపిడి వలన పుట్టిన నిప్పుగూడ ఒక కారణమన్నది అందరికీ తెలిసిన సత్యమే).

ఉదా॥ 2. అలాగే రెండు ఎండు పుల్లల్ని , రెండు రాళ్ళను, రెండు చింత గింజల్ని, రెండు గచ్చకాయల్ని రాపిడి పెట్టినా – నీటిని వేగంగా తిరగ్గొట్టినా వేడిపుడుతుంది. ఐతే కొన్నింటిలో ఆ వేడి బాగా ప్రస్ఫుటంకాగా, కొన్నింటిలో నామమాత్రంగా ప్రస్ఫుటమౌతుంది.

ఉదా॥ 3. బియ్యం, జొన్నలు, పెసలు, కందులు వంటి ధాన్యాలు, కూరగాయలు, కూరాకులు, ఉడికించగానే జడపదార్థాలుగ మారిపోతాయి. ఆ జడ పదార్థాలను మనం తిని జీర్ణించుకున్నాక తిరిగి అవి జీవధాతువులై, మన శరీరంగా మారి పోతున్నాయి.

ఉదా॥ 4. పేడ, చెత్త వంటి సేంద్రియ ఫాస్ఫేట్, పొటాష్, యూరియా వంటి రసాయనిక, జడపదార్థాలను, నీరు వంటి ద్రవపదార్థాలను వేరుద్వారా పీల్చుకుని కొన్ని జీవక్రియలద్వారా వాటిని జీవధాతువులుగ మార్చుకుని పెంపొందుతున్నాయి చెట్లు, పైరులు, గడ్డి వగైరాలు!

పై ఉదాహరణలద్వారా మనిషి తినే జడ, వృక్షాలు పీల్చుకునే ముడి పదార్థాలలో కూడా జీవత్వం పొందగల లక్షణం సూత్రప్రాయంగా, నిక్షిప్తమైయుండి, జీవు(ప్రాణు)లలో కలిసే అవకాశం రాగానేవాటిలో నిద్రాణంగా యున్నట్టి జీవత్వం మేల్కొని చైతన్యవంత మౌతుందని స్పష్టమౌతున్నది. ఔనా పిల్లలూ?

శ్రేష్ఠ : ఔను తాతగారూ. సృష్టిలోని ఘన, ద్రవ, వాయు, జడ, జీవ పదార్థాలన్నీ చైతన్యవంతమైన ఆదిశక్తి యొక్క రూపాంతరాలేనని మాకు ఉదాహరణలతో సహా స్పష్టీకరించినందుకు మీకు చాలా చాలా ధన్యవాదాలు తాతగారూ! కానీ ఇప్పటికీ కొందరు శాస్త్రజ్ఞులు జీవకణాలన్నీ మూలకాల రసాయనిక పరిణామ ఫలితాలే తప్పచైతన్యం యొక్క ప్రమేయమేమీ లేదని గగ్గోలుపెడుతున్నారు గదా! అలాంటి వారికి మీరేం జవాబు చెబుతారు?

వ్యాఖ్యాత : శాస్త్రజ్ఞులు చెబుతున్నట్టి రసాయనిక మార్పు చెందగల్గిన మూలకాలలో గూడ, చైతన్యం నిక్షిప్తమై యుంటేనే, అనుకూల సమయాలలో అవి జీవ పదార్థాలుగ రూపొందగల్గుతున్నాయి.

ఉదా॥ 1. 2హైడ్రోజన్ పరమాణువులు + 1 ఆక్సిజన్ పరమాణువు కలిసినపుడు రసాయనిక పరిణామం ద్వారా అవి నీరుగ మారుతున్నాయి.

అంటే హైడ్రోజన్, ఆక్సిజన్ మూలకాలు 2:1 నిష్పత్తిలో కలిస్తేనే నీరుగ రూపాంతరం చెందుతాయి. అవిరెండూ ఈ నిష్పత్తిలో కలవకున్నా – ఇదే నిష్పత్తిలో మరే ఇతర మూలకాలతో కలిసినా నీరుగా మారవు. ఎందుకని? నీరు ఏర్పడకముందే ఈ నిష్పత్తిలో కలిస్తేనే నీరుగ మారే చైతన్యం, అటు హైడ్రోజన్, ఇటు ఆక్సిజన్ మూలకాలలో నిక్షిప్తమైయున్నందువల్లనే అవి రెండూ అలా కలవగానే నీరుగ రూపాంతరం చెందుతున్నాయని స్పష్టమౌతున్నది.

ఉదా॥ 2. అయస్కాంతానికి స్పందించే చైతన్యం ఇనుములో నిక్షిప్తమై యున్నందువల్లనే, ఆయస్కాంతానికి దగ్గరగా ఉన్నప్పుడు స్పందించగల్గుతున్నది ఇనుము! ఇనుములో తప్ప మరేలోహంలోనూ అట్టి చైతన్యం లేనందువల్లనే ఆయస్కాంతానికి మరే లోహమూ ఆకర్షింపబడటం లేదని, స్పష్టమౌతున్నది. పై ఉదాహరణల ద్వారా ఒక మూలకం, మరో మూలకంతో సంయోగం చెంది యే పదార్థంగా రూపొందినా, ఆ పదార్థంగా రూపొందగల చైతన్యం సదరు రెండు మూలకాలలో నిక్షిప్తమై యుంటే తప్ప, అట్టి రసాయనిక పరిణామం సాధ్యంకాదని స్పష్టమౌతున్నది. కాబట్టి శక్తి+చైతన్యం రెండూ సృష్టి కవశ్యమని యే శాస్త్రవేత్తకైనా అంగీకరించక తప్పదు. దీన్నే ప్రకృతి+పురుషుడని చెబుతున్నది శ్రీమద్భగవద్గీత!

సృష్టి నిర్మాణం గూర్చి శ్రీమద్భగవద్గీత

విశ్వవ్యాప్తమైయున్నట్టి విశ్వచైతన్యమే **పురుషుడు!** విశ్వవ్యాప్తంగా ఉన్నట్టి (విద్యుదయస్కాంత) శక్తియే ప్రకృతి లేదాచైతన్యానికి ప్రభావితమయ్యేదేవి! **'ప్రకృతి' పురుషుడు (శక్తి–చైతన్యం) ఇవి రెండూ సనాతనాలు. అంటే విడదీయ వీలులేనివని భావం.** ఉదా॥ నిప్పునుండి వేడిమినీ – నీటినుండి ద్రవత్వాన్ని విడదీయుట సాధ్యం కాదుగదా? అట్టి సనాతనాలైన 'ప్రకృతి పురుషుల' (శక్తి చైతన్యాల)వల్లనే సృష్టి జరుగుతున్నదని వక్కాణిస్తున్నది భగవద్గీత.

సృష్టికాధారమైన శక్తి (విద్యుదయస్కాంత శక్తి) ఇటు తరంగంగాను అటుకణంగాను పరిణమిస్తున్న వాస్తవాన్నంగీకరించినట్లే, శక్తి చైతన్యం ఒకే మూలతత్వం (విశ్వచైతన్య శక్తి) యొక్క రెండు అంశలనీ, అవి నాణేనికి బొమ్మా-బొరుసు వంటి వన్న వాస్తవాన్ని గూడ సైన్టిస్టు లంగీకరించక తప్పదు.

సాయికృత్తిక : తాతగారూ! మూలకాలయొక్క భౌతిక, రసాయనిక పరిణామ క్రమంలో జీవరాసులు కాకతాళీయంగా ఉద్భవించాయేగాని, వాటి సృష్టివెనుక విశ్వచైతన్యం (పరమాత్మా)ప్రమేయమేమీ లేదంటున్నారు చాలామంది శాస్త్రజ్ఞులు. మరి వాళ్ళ మాటలు విశ్వసనీయాలేనా?

వ్యాఖ్యాత : ఇప్పటిదాకా మీరు నన్ను పలు ప్రశ్నలడిగారు గదా, ఎందుకడిగినట్లు?

ఊహాశ్రీ : మాకు తెలియని విషయాలను మీ ద్వారా తెలుసుకుందామని!

వ్యాఖ్యాత : అలా తెలుసుకోమంటూ మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నదెవరు?

హర్ష : మా మెదడు తాతగారూ!

వ్యాఖ్యాత : మెదడుగా రూపొందిన కణజాలంలో మౌలికంగాచైతన్యం ఉన్నందువల్లనే వాటిచేత రూపొందించబడిన మెదడు గూడ చైతన్యాన్ని ప్రదర్శించ గల్గుతుందన్నది వాస్తవం. మీలో, నాలో, శాస్త్రజ్ఞులలో, ఆధ్యాత్మిక వేత్తలలో, ఇంకెవరిలోనైనా సరే జీవ, ప్రకృతి, ఖగోళ, భూగోళ వగైరాల రహస్యాలను తెల్సుకోవాలన్న ఆసక్తిని, తపనను మెదడు / మనసు ద్వారా రగిలిస్తున్నది చైతన్యమే నన్నది సత్యం! ఎందుకంటే? స్వతస్సిద్ధమైనది, మౌలికమైనది, స్వయం నిర్ణయశక్తి కల్గినది చైతన్యమొక్కటే!

కాబట్టి మౌలికమైన చైతన్యం యొక్క ఉనికి నంగీకరించనిదే, శాస్త్ర విజ్ఞాన సాధన అసాధ్యమని ష్రోడింజర్, కాప్రా, సెంట్ గ్యోరీ, డి.సింగ్, థామ్సన్, డిబ్రోగ్లీ, ఐన్‌స్టీన్, మొ॥ సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులే నిర్ధారించారు. సరే

కాసేపు ఈ అంశాన్ని ప్రక్కనబెట్టి సాయికృత్తిక ప్రస్తావించిన కాకతాళీయత లేక యాదృచ్ఛికత అంటే యేంటో తెలుసుకుందాం. ముందుగా మీకు తెల్సిన కాకతాళీయతా సంఘటనలకు కొన్నిఉదాహరణలు చెప్పగలరా ?

దేవాంశ్ : కారు, బైకు, రైలు, విమాన ప్రమాదాలు – ఇంకా భూకంపాలు, తుఫాన్లు, వరదలు, పిడుగులు వగైరాలన్నీ యాదృచ్ఛిక సంఘటనలే.

వ్యాఖ్యాత : చక్కగా చెప్పావు దేవాంశ్ ! ఉదాహరణకు పిడుగునే తీసుకుందాం. దీనికొక క్రమంగాని, నియమం గానీ ఉండవు. నేల, చెట్టు, ప్రాణి, పర్వతం, సముద్రం ఎక్కడంటే అక్కడ పడుతుంటుంది. అందుకే పెద్దలంటుంటారు పిడుగు, పిచ్చోడి చేతిలోని రాయి ఎప్పుడు? ఎక్కడ? ఎవరిమీద పడుతుందో తెలియదనీ.

జీవ పదార్థాల/ప్రాణుల పుట్టుక గూడ కాకతాళీయమే ఐతే, జీవుల పరిణామం గూడ పిచ్చోడి చేతిలోని రాయిలాగే జరిగుండేది. కానీ, భూమీమీది జీవరాసుల పరిణామం అలా ఉందని మీరు భావిస్తున్నారా పిల్లలూ?

విరాజ్ ఉజ్వల్ : లేదు తాతయ్యా, జీవ పరిణామం ఒక క్రమ పద్ధతిలో, ఆరోహణా క్రమంలో కొనసాగుతున్నది.

వ్యాఖ్యాత : అని ఏ ఆధారంతో చెప్పగల్గుతున్నావు?

యువన్‌తేజల్ : మొట్టమొదట ఏకకణజీవియైన అమీబాతో ప్రారంభమై బహుకణ జీవులు, క్రమంగా జలచరాలు, ఉభయచరాలు, ఖగచరాలు, భూచరాలు, వెన్నెముక గల జీవులు, క్షీరదాలు, వానరాలు, చింపాంజీలు, నరుడు, ఆటవిక మానవుడు, నాగరికుడు, అందమైన, తెలివైన మనిషి- ఎంత తెలివంటే, అన్ని ప్రాణులగూర్చి ప్రకృతి గురించి, అనంత విశ్వం గురించి, వీటన్నింటి సృష్టికర్త గూర్చి గూడ తెలుసుకోగలిగినంత తెలివైన మనిషి. ఇలా ఒక క్రమపద్ధతిలో, ఆరోహణా క్రమంలో జీవపరిణామం కొనసాగుతున్నది గదా తాతయ్యా!

వ్యాఖ్యాత : చాలా చాలా అభినందనలు యువన్! చాలా చక్కగా, ఖచ్చితంగా గ్రహించావ్ యింకా యీ వాస్తవాన్ని గ్రహించిన ప్రముఖులేమంటున్నారో వినండి.

1. "అంతా కాకతాళీయమనేది అసలు శాస్త్రమెలా ఔతుంది?" – రమణమహర్షి

2. "సృష్టికర్త దేన్నీ అనిశ్చితంగా వదిలిపెట్టడు, ప్రకృతిలో స్వతస్సిద్ధంగా ఒక క్రమం, పద్ధతి, నియతి ఉన్నాయి తప్ప, ప్రపంచం అడ్డగోలుగా లేదు. ఎందుకంటే, దేవుడు జూదగాడు కాడు" – ఐన్‌స్టీన్

3. "ఇరవయ్యో శతాబ్దానికి చెందిన అసమగ్రమైన, భౌతిక, రసాయనిక సిద్ధాంతాల దృష్ట్యా జీవ ప్రక్రియను కాకతాళీయ మైనదిగా నిర్వచించటం తొందరపాటే కాగలదు" – డి.బ్రోగ్లీ

4. "మనకనుభవమౌతున్న ఈ ప్రపంచ రూపంలో ఒక అతీత చైతన్యమున్నది, అదే దైవం, విశ్వసంబంధమైన యీ చైతన్యభావనే శాస్త్రీయ పరిశోధనకు బలవత్తమం,పవిత్రతమమైన దోహదకారియని నా అభిప్రాయం" – ఐన్‌స్టీన్

5. "మన విశ్వం మహత్తరం, నిర్మాణాత్మకమైనట్టి తెలివి తేటలతో నిర్దేశింప బడుతున్నదని, నిర్దిష్టమైన గణిత సూత్రాలతో నిరూపించవచ్చు – డి.సింగ్

6. "ప్రకృతిని గూర్చి మనకేర్పడిన సంకుచిత దృక్పథమే మనలోపల, వెలుపల గల చైతన్యం(భగవంతుని) యొక్క ఉనికిని గుర్తించకుండా చేస్తుంది. దైవం (చైతన్యం) తప్ప అన్యమేదీ వాస్తవం కాదు. దేశ, కాల సంబంధాలన్నీ ఆయన వ్యక్తమయ్యే క్రమం మాత్రమే. ఆయన వ్యక్త రూపమే యీ ప్రకృతి" – జె.బి. హాల్డేన్ (దిసైన్స్ అండ్ ఫిలాసఫీ (గ్రంథరచయిత).

7. "జీవకణాలు కాకతాళీయంగా ఎన్నటికీ ఏర్పడలేవు. మనకంతుబట్టని అతీత శక్తి యేదో అందుకు కారణమై ఉండాలి. కానీ, మూలకాల రసాయనిక పరిణామం వలన జీవకణాలు కాకతాళీయంగా వాటికవే యేర్పడ్డాయని విద్యార్థులకు బోధించటం మూర్ఖత్వమే. ఈ వాస్తవాన్నంగీకరించే నిజాయితీ లోపించి శాస్త్రం పేరిట అసత్యాన్ని ప్రచారం చేస్తూ యువత మనస్సును సత్యాన్వేషణనుండి ప్రక్కదారి పట్టిస్తున్నారని – **డి.సింగ్, థామ్సన్** అనే శాస్త్రజ్ఞులు తమ సమకాలీన శాస్త్రజ్ఞులను ముక్కుమీద గుద్దినట్లు హెచ్చరించారు. అంతేగాదు, జీవకణాలు కాకతాళీయంగా వాటికవే యేర్పడే అవకాశమేలేదని, కోట్లాది సంవత్సరాల పరిణామానంతరం గూడ కనీసం **ఇన్సులిన్** వంటి అతి సూక్ష్మ అణువుసైతం ఎట్టి రసాయనిక పరిణామం ద్వారా నైనా యేర్పడే అవకాశమే లేదని, ఎంతో జటిలమైన గణితాత్మక సమీకరణాలతో లెక్కించి చూపారు.

8. నోబెల్ బహుమతి గ్రహీత యైనశాస్త్రవేత్త **'సెంట్‌గ్యోరీ'** యిలా వ్రాసుకున్నారు "జీవ రహస్యాన్నన్వేషించే నా పరిశోధన, జీవమేలేని ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్లతో కూడిన పరమాణువులదాకా వచ్చి ఆగిపోయింది. ఈ మధ్యలో ఎక్కడో నాపట్టు నుండి తప్పించుకున్నది జీవం! అందువలన ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల రసాయనిక పరిణామం వల్లనే జీవపదార్థం జనించిందన్న నా అభిప్రాయాన్ని ఉపసంహరించుకుంటున్నాను అని **'బయాలజీ టుడే'** అను గ్రంథంలో వ్రాసుకున్నారు.

9. మౌలికమైన చైతన్యం యొక్క ఉనికి నంగీకరించకుండా (పరిశీలింపచేసే చైతన్యపు ప్రమేయమే లేకుండా) భౌతిక శాస్త్రవేత్తలకు శాస్త్రవిజ్ఞానార్జనసాధ్యం కాదు. ఎందుకంటే సూక్ష్మస్థాయి పదార్థాన్ని పరిశీలించి ప్రయోగాలద్వారా జ్ఞానవిజ్ఞానాలను పొందటానికి

చైతన్యానుభూతులే కారణం! అందుకే స్వతస్సిద్ధం మౌలికమూ ఐనట్టి చైతన్యం వాస్తవమని పలువురు శాస్త్రజ్ఞులు నిర్ధారించారని అంటున్నారు. **కాప్రా, ష్రోడింజర్** అను శాస్త్రజ్ఞులు.

10. "ప్రేమ, కరుణ, క్షమ, జ్ఞానం, శక్తి, సామర్థ్యం వంటి గుణాలుగల చైతన్యం (దైవం) అంతటా, అన్నింటా, అందరిలో వ్యాపించి యుండి నిన్ను కాపాడుతూ ఉందని సదా గుర్తుంచుకోవటమే అసలైన కృతజ్ఞత! పూజ్య, భక్తి, భావన! జ్ఞాన, విజ్ఞానార్జన కైనా, లోకకళ్యాణార్థం పరిశ్రమించటానికైనా, మానవాళిని ముందుకు నడిపిస్తున్నది, దేదీప్యమైన వెలుగుబాటను చూపుతున్నది. సదరు భావన" యేనని వక్కాణించారు ఆచార్య ఎక్కిరాల భరద్వాజ!

11. ఆధునిక శాస్త్రీయ దృక్పథంలో వచ్చిన మార్పేమిటంటే? కేవలం స్థూలదృష్టికి గోచరించనంత మాత్రాన మనలోని చైతన్య జనిత ఆధ్యాత్మికానుభూతులను భ్రమలంటూ కొట్టి పారేయరాదన్నదే ఆ మార్పు అని అంటున్నారు **'ఎడ్డింగ్‌టన్'** అను శాస్త్రజ్ఞుడు.

12. అణువులకు ఉద్దేశాలు, ఆశయాలు, లక్ష్యాలంటూ యేమీ ఉండవు, అట్టి అణువుల ఆకర్షణ, వికర్షణల వలన లేక వాటి రసాయనిక పరిణామాల వల్లనే ప్రాణులు ఉద్భవించాయని వాదిస్తున్న కొందరు పిడివాద శాస్త్రజ్ఞులీ క్రింది ప్రశ్నలకు జవాబు చెప్పగలరా?

ఏనుగు ఎముకలనైనా తునాతునకలు చేయగల్గిన నైలునదీ మొసలి తనగుడ్డులోని పిల్లకు ఏమాత్రం ఒత్తిడి తగలనంత సున్నితంగా గుడ్డునుకొరికి తన పిల్లబయటికొచ్చేందుకు సహకరించే దాని నైపుణ్యానికి మూలం చైతన్యంగాక, వేటి యొక్క రసాయనిక ప్రక్రియో వివరించగలరా?

పెరుగుతున్న చెట్టు వేరు భూమిలోని రాతి పొరలను సైతం తొలుచుకుంటూ వ్యాపించటానికి మూలకారణం అందలి చైతన్యం గాక, వేటివేటి రసాయనిక చర్యో తెలుపగలరా?

గట్టి మట్టి పెడ్డను సైతం పగలగొట్టుకుని పైకొచ్చే మొక్క – గొడ్డలికి తప్ప అలవిగాని దృఢమైన చెట్టు బెరడును సైతం తొలుచుకుంటూ వచ్చిన చిగురాకు, వీటి నైపుణ్యానికి పునాది చైతన్యంగాక, యెట్టి రసాయనిక ప్రక్రియో చెప్పగలరా?

ఒక జీవకణంలో లక్షల, కోట్ల పరమాణువులున్నాయి. వాటిలో ప్రతి ఒక్కటీ వేలాది ప్రక్రియలను వెంట్రుకవాసి తేడా లేకుండా, సకాలంలో, నియమబద్ధంగా నిర్వహించగల్గుతున్నాయని శాస్త్రజ్ఞులు, గణితశాస్త్ర సమీకరణాల ద్వారా అంచనా కొచ్చారు. అందుకు జన్యు పదార్థాలైన డిఎన్ఎ, ఆర్ఎన్ఎ జీవకణాల నుదహరించారు. ఇలా పరమాణుస్థాయిలో గూడ ఇట్టి సచేతన క్రియలను నడిపించగల్గిన రసాయనిక సూత్రమేదో చెప్పగలరా?

13. అంతేగాదు, అగ్రశ్రేణి ప్రాణులైన మానవులను సమాజంలో నెలకొన్న అవినీతి, అధికారదాహం, రౌడీ, గూండాయిజాలు, మాఫియా, దొంగతనం, దోపిడీలు, మద్యం మాదకద్రవ్యాలు వ్యభిచారం, అత్యాచారాలు, హత్యలు, కుల, మత, ప్రాంతీయ, ఆర్థిక, సామాజిక అసమానతలు, తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి సామాజిక రుగ్మతలపట్ల ఆందోళనకు గురిచేస్తున్నది వాటి పరిష్కారాలకోసం అన్వేషింపచేస్తున్నది. – దేశభక్తి, గౌరవమర్యాదలు, పరువుప్రతిష్ఠలు మానావ మానాలు, కీర్త్యపకీర్తుల వంటి భావోద్వేగాలకు గురిచేస్తున్నది. న్యాయం, ధర్మం, జాలి, కరుణ, క్షమ, ప్రేమాభిమానాలు, నీతి నిజాయితీల వంటి విలువల కొరకు ప్రజలకోసం, ప్రాణులకోసం, ప్రపంచ శాంతికోసం, లోకకళ్యాణం కోసం పాటుపడటం లాంటి ఉదాత్త ఆశయాల కోసం ప్రేరేపిస్తున్నది. సామాజిక రుగ్మతల నిర్మూలనార్థమై భౌతికవిద్యకు ఆధ్యాత్మిక విలువలను జోడించుట ద్వారా విద్యావిధానాన్నీ, విలువలను జోడించుట ద్వారా రాజకీయాన్ని గూడ పునరుద్ధరించుకోటానికి మానవాళిని ఉద్యమింపజేస్తున్నది చైతన్యం గాక రసాయనిక చర్యేనని నిరూపించగలరా?

అంటూ పలువురు భౌతిక, గణిత, రసాయనిక, జీవ శాస్త్రజ్ఞులు సైతం, నేటికీ అణురసాయనిక చర్యలే జీవావిర్భావానికి మూలమంటూ పిడివాదన చేస్తున్న వారందరినీ యిలా ప్రశ్నించి నిలదీస్తున్నారు! సవాలు చేస్తున్నారు! అందువలన ఇప్పుడిప్పుడే ఇక విశ్వచైతన్యాన్ని అంగీకరించక తప్పదన్న నిర్ణయానికి దాదాపుగా శాస్త్రజ్ఞులందరూ వచ్చేస్తున్నారు. సరే, ఈ జీవపరిణామం, ఇక ఇంతటితో ఆగిపోయినట్లనుకుంటున్నారా? లేక ఇంకా కొనసాగుతుందనుకుంటున్నారా?

యువన్ : ఆగదుగాక, ఆగదు తాతయ్యా! ఈ పరిణామం ఇంకా, ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. భగవద్గీత చెబుతున్నట్లు మనిషి విశుద్ధచైతన్య వంతునిగ అంటే నిస్వార్థ, పవిత్ర హృదయునిగాను, ప్రాణులన్నింటినీ ప్రేమించగల్గిన ప్రేమమూర్తిగాను, విదేశాల కెళ్ళివచ్చినంత అవలీలగ గ్రహాంతరాలకు వెళ్ళిరాగల్గిన విజ్ఞానిగా, యుద్ధమంటే తెలియనంతటి శాంతికాముకునిగా, వసుధైక, విశ్వకుటుంబీకునిగ, గ్రహాలు, నక్షత్రాలంతటి క్రమశిక్షణాశీలిగను, దేహావయవాలైన గుండె, జీర్ణాశయం, కాలేయం, శ్వాసకోశాలు, మూత్రపిండాల్లా నిరంతర విధినిర్వహణాశీలునిగ, ఒక్క వాక్యంలో చెప్పాలంటే సృష్టికర్త ఆశిస్తున్నంతటి సమున్నతునిగ మనిషి ఎదిగేంత దాకా యీ పరిణామమిలా కొనసాగుతూనే ఉంటుంది తాతయ్యా!

వ్యాఖ్యాత : శభాష్‌యువన్! నీ వాక్కు ఫలించుగాక! తథాస్తు! నీకు చాలా చాలా శుభాభినందనలు ఎందుకంటే, యీ జీవ పరిణామం గూర్చి, ఒక శాస్త్రవేత్త, ఒక ఆధ్యాత్మికవేత్త చేసిన ప్రకటనలు గూడ నీ ఆశాభావానికి, నీ ఊహకు చాలా దగ్గరగా ఉన్నాయి.

ప్రముఖ శాస్తవేత్త డా॥ సల్లీవన్ ప్రకటన : "అమీబా నుండి మానవుని దాకా జరిగిన జీవ పరిణామాన్ని చూస్తుంటే, దీనిలక్ష్యం చైతన్యాభివృద్ధేనని స్పష్టమౌతున్నది. ఉదాహరణకు చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచం గూర్చి,

మన జ్ఞానాన్ని పెంచేవేగదా? దీన్ని బట్టి చూస్తుంటే అమీబానుండి మానవుని దాకా, జరిగిన ఈ పరిణామం ఇంతటితో ఆగక, మనిషికి ఇంతకన్నా సంకీర్ణ స్థితికి తీసుకెళ్తుందని స్పష్టమౌతున్నది. అందువలన ప్రస్తుతపు మనిషిని, అతని వ్యక్తిత్వం తాత్కాలికాలే ! ఇప్పటి మానవులం ఏ చైతన్యశక్తి యొక్క తాత్కాలిక రూపాలమో, ఆశక్తే యిప్పటి మన లక్ష్యాల కతీతమైన మరో సమున్నత లక్ష్యందిశగా మనల్ని నడిపిస్తున్నదనీ సదరు సమున్నత లక్ష్యానికి మనమానవులమే సాధనాలమని, నేను చెప్పదలిచాను!" అని దృఢంగా ప్రకటించారు డా॥ సల్లీవన్.

అరవిందమహర్షి : భగవద్గీతా భాష్యకారులలో సుప్రసిద్ధులైన శ్రీ అరవిందుల వారిలా నిర్దేశించారు. నేడు మనిషికి – పశువుకు యెంత వ్యత్యాస మున్నదో రేపు ఉనికిలోకి రానున్న 'దివ్య మానవున'కు ఇప్పటి సగటుమనిషికి అంతటి వ్యత్యాస ముంటుంది. **'ఆధ్యాత్మిక విప్లవమే' రేపటి దివ్యమానవుల జీవనం.** వారి పరమగమ్యం గూడ అదే. సృష్టిపరిణామ క్రమంలో యీ పరిణతి ఆవశ్యం! అట్టి ప్రపంచైక దివ్య జీవనానికి భారతదేశం నాయకత్వం వహించనున్నది. **'వసుధైక కుటుంబం' 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' అన్నది వేల సంవత్సరాల నాటి మన మహర్షుల స్వప్నం. ప్రపంచ మానవ ఉదాత్త జీవనమే సదరు స్వప్న లక్ష్యం. వారి స్వప్నం సాకారమయ్యేందుకు, విశ్వసమైక్యతా సాధన మవశ్యం.** విశ్వసమైక్యతా సాధనకై ప్రపంచ మానవాళికి ఆధ్యాత్మిక దృక్పథాన్ని అలవరచాలి. ఆ బృహత్తర కార్యక్రమానికి భారతదేశం నడుం బిగించాలి. అందుకే మనమంతా ఆ దిశగా అడుగులు వేద్దాం. మన అడుగులు తడబడకుండా, మనం దారి తప్పకుండా మన చేయిపట్టి నడిపించే తల్లి గీతామాత! అందుకే ముందుగా భారతీయులంతా గీతామాత చేయిపట్టుకుని ఆమె వెంటే నడుస్తూ, మనతోపాటు ప్రపంచాన్నీ నడిపిద్దాం!" అంటూ భారతీయుల భావికర్తవ్యాన్ని నిర్దేశించారు శ్రీ అరవిందులవారు.

రిత్విక్ : దీన్నిబట్టి చూస్తే ఆధ్యాత్మికవేత్తలతో పాటు క్రమంగా శాస్త్రవేత్తలు గూడ ఆధ్యాత్మికతను అంగీకరిస్తున్నట్లు స్పష్టమవు తున్నది. మరి మనంగూడ ఆధ్యాత్మికతను స్వాగతించి, సైన్సుకు వీడ్కోలు చెబుదామా తాతగారూ?

వ్యాఖ్యాత : తప్పు రిత్విక్, ఆధ్యాత్మికతను అంగీకరించటమంటే, సైన్సును విడనాడటం కాదు, మానవాళి సంపూర్ణ ప్రగతికి ఆధ్యాత్మికత, సైన్సు రెండూ అవశ్యాలే. అవి రెండూ సామాజిక నాణేనికి బొమ్మా బొరుసుల వంటివి. అందుకే యీ విషయమై ఆధ్యాత్మిక, భౌతిక రంగాలకు చెందిన ప్రముఖులంతా సమాజానికవిరెండూ అవశ్యాలని నిర్దేశించారు.

మాక్స్‌ప్లాంక్ : ఆధునిక శాస్త్రం – ఆధ్యాత్మికత రెండూ పరస్పర పూరకాలు. అందువలన సైన్సుతో పాటు మనలోని ఆధ్యాత్మి కాంశాలను గూడ గుర్తించి, వాటిని పెంపొందించు కుంటేనే, మనిషిలోని అన్ని రకాల సామర్థ్యాలు సామరస్య పూర్వకంగా పనిచేయగలవన్న సత్యాన్ని ఆలోచనా పరులెవరైనా గ్రహించగలరు, గుర్తించగలరని అన్నారు.

ఆచార్య ఎక్కిరాల భరద్వాజ : మానవ భౌతిక జీవన సమస్యల పరిష్కారానికి, సామాజిక ప్రగతికి సైన్సు ఎంతైనా ఆవశ్యం. ఐతే సదరు శాస్త్రీయ విజ్ఞానాన్ని సామాజిక ప్రగతికి, లోక కళ్యాణానికి వినియోగించుకో గలగాలంటే, మానవ హృదయాలు విలువలతో ప్రతిష్ఠితమై ఉండాలి! ఎందుకంటే ? విలువలకు తావులేని హృదయం పొందిన విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యమంతా, వ్యాపారానికి, వినాశనానికి దారితీస్తుంది. అందువలన మానవ హృదయాలలోకి సమున్నత విలువలను ప్రవహింపజేసే చైతన్యఝరి ఐన 'ఆధ్యాత్మికత' గూడా మానవాళి కవశ్యమే! ఇంకా చెప్పాలంటే **ఆధ్యాత్మికత, భౌతికత మనిషికి రెండు పాదాల వంటివి! సమాజమనే పక్షికి రెండు రెక్కల్లాంటివి!**

చైనా తత్వవేత్తలు : వీరు **యాంగ్** (సైన్సు) **–యిన్** (ఆధ్యాత్మికత)ల గూర్చి యిలా విశ్లేషించారు. కేవలం 'యాంగ్'కు మాత్రమే ప్రాధాన్యతనిచ్చే

సమాజాల ప్రజల్లో 1. యాంత్రిక స్వభావం 2. వ్యక్తుల, జాతుల భేద భావం 3. సంపాదనే ధ్యేయంగా సాగే ఉరుకుల పరుగుల, విశృంఖలత్వం. నిరంతర అశాంతి, అసంతృప్తులు నెలకొని ఉంటాయి. ఎందుకంటే? బహిర్ముఖత్వం నానాత్వం యాంగ్ (సైన్సు) లక్షణాలు. కేవలం 'యిన్' (ఆధ్యాత్మికత) కు ప్రాధాన్యతనిచ్చే సమాజాల వారు, సమస్యల్లో చిక్కుకున్న ప్రజల బాధ్యతను దైవానికి వదిలేసి ఊరుకుంటారు. ఎందుకంటే? అంతర్ముఖత్వం, ధ్యానం, విశ్వాధారిత ఏకత్వభావనలు **'యిన్'** లక్షణాలు.

అందువలన కేవలం సైన్సునో, ఆధ్యాత్మికతనో, అనుసరించటం సమాజానికనర్ధ దాయకం. అటు **'యాంగ్'** ఇటు **'యిన్'** రెంటినీ సమాజానికి సమన్వయ పరచుకుంటేనే మానవాళికి క్షేమదాయకం! అని నిర్ధారించారు చీనీతత్వవేత్తలు. అందుకే మనం ముందుగా లౌకిక (భౌతిక) విద్య అలౌకిక (ఆధ్యాత్మిక) విద్యల స్వభావాలను, ప్రాముఖ్యానాలను గూర్చి తెలుసుకుందాం.

కాబట్టి, మానవాళికి భౌతికవిద్య, ఆధ్యాత్మిక విద్యలు రెండూ అవశ్యాలే! ఈ విషయమై భారతరత్న అబ్దుల్‌కలామ్ యిలా నిర్దేశించారు. 1. ఆధ్యాత్మిక విద్యను, భౌతిక విద్యతో తప్పక అనుసంధానం చేయాలి. 2. ఆత్మ సాక్షాత్కారాన్ని కల్గించుటే విద్యకు ప్రధాన లక్ష్యం కావాలి. తద్వారా ప్రతి మనిషిలో ఉన్నత వ్యక్తిత్వాన్ని మేల్కొలపాలి. 3. మనలో నిద్రాణంగా వున్న శక్తిని రగిలించి మానవాళిని ప్రగతి, మరియు శాంతి పథాన నడిపించే సాధనంగా విద్యను మలుచుకోవాలి. అందుకు విద్యతో ఆధ్యాత్మిక విద్యను అనుసంధానం చేసుకోవాల్సిందే. అప్పుడు విలువలతో కూడిన విద్యావంతులౌతారు విద్యార్థులు. అట్టి విద్యావంతుల హృదయాలలో జ్వలించే కాంతి, ప్రకాశం, మానవజాతికి, ప్రాణికోటికి, శాంతీ సౌభాగ్యాలను ప్రసాదించి తీరుతుందని వక్కాణించారు కలామ్. మరియు మహాత్మాగాంధీ, బాలగంగాధరతిలక్, అరవింద మహర్షి, వంటి అమరజీవులుగూడ భగవద్గీతాది అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథాలందుకుఎంతో దోహదపడతాయని

పదే పదే మానవాళికి దిశానిర్దేశం చేసియున్నారు. అందువలన ముందుగా మన భారతీయులందరమూ మన విద్యకు, ఆధ్యాత్మికతను అంటే విలువలను జోడించుకొనుట ద్వారా మన విద్యావిధానాన్ని సమూలంగా సంస్కరించుకోవటానికై తక్షణం ఉద్యమించాల్సిన అవసరత యేర్పడిందని అంటున్న మేధావులభావనతో నేనూ ఏకీభవిస్తున్నాను. మరి మీ సంగతేంటి పిల్లలూ?

పిల్లలు : విలువలు జోడింపబడిన విద్యావిధానం మనకే గాదు ప్రపంచశాంతి సౌభాగ్యాలకూ అవశ్యమని, గీతాబోధనద్వారా పెద్దల సందేశాల ద్వారా మేం గ్రహించాం. ఈ అంశాన్ని పూర్తిగా విశ్వసిస్తున్నాం తాతగారూ!

వ్యాఖ్యాత : పిల్లలూ ఆధ్యాతికత, సైన్సూ పరస్పర పూరకాలని, సమాజ ప్రగతికవి రెండూ అవశ్యాలేనని మీకుసోదాహరణంగా వివరించాను. ఐనా మీకింకా సందేహాలుంటే అడిగితెలుసుకోవచ్చు.

ఆదిత్య : మూడు భాగాల పరమాత్మ కనిపించకుండాను మిగిలిన ఒకభాగం ప్రపంచరూపంలో కనిపిస్తూవుందంటే నాకింకా నమ్మబుద్ధి కావటంలేదు, ఎందుకంటే? ఒక కాంతి సంవత్సరమంటే తొమ్మిదిలక్షల కోట్ల కిలోమీటర్ల దూరం, ఈ కొలమానంలో విశ్వం చుట్టుకొలత 1250 కోట్ల కాంతి సంవత్సరాలని హబుల్ టెలిస్కోప్ ద్వారా అంచనా వేశారు శాస్త్రజ్ఞులు. ఇలా అంచనా వేసుకోవటమేగాని ఎవ్వరికీ చూడ సాధ్యంకాని యీ విశ్వం కేవలం 25% యేనని, ఇక కనిపించని పరమాత్మ 75%గా ఉన్నాడంటే అసలు పరమాత్మ విశాలతను ఊహించటానికే సాధ్యంకావటం లేదు గదా తాతగారూ?

వ్యాఖ్యాత : ఆదిత్యకు సందేహాస్పదమైన ఈ విషయమై సైన్సేం చెబుతున్నదో చూడండి పిల్లలూ! 1370 కోట్ల సం॥క్రితం జరిగిన బిగ్‌బ్యాంగ్ ద్వారా వెదజల్లబడిన అణువులన్నీ, వాటియొక్క ఆకర్షణశక్తుల కారణంగా తిరిగి సమీకృతమౌతూ క్రమంగా నక్షత్రాలు, గ్రహాలు వగైరాలుగా రూపొందినాయి.

అట్లా రూపొందిన నక్షత్రాలు గ్రహాలు, తోకచుక్కలు, ఉల్కలు, సకల చరాచర జీవరాశులన్నీ కలిపి కేవలం 4% అణువులతోనే రూపొందాయనీ మిగిలిన 96% అణువులన్నీ అగోచరంగా (అదృశ్యంగా) ఉండిపోయాయని అగోచరంగా వున్న 96% అణువులను కృష్ణపదార్థమనీ, సదరు పదార్థాన్ని కేవలం విద్యుదయస్కాంత శక్తిద్వారా మాత్రమే కనుగొనగలమనీ విశ్వరూపంలో కనిపిస్తున్న 4% అణువులలో కన్నా, అగుపించని 96% అణువుల్లోనే భౌతిక శాస్త్రానికి చెందినట్టి, ఇప్పటికీ అంతుబట్టని ఎన్నో నిగూఢ రహస్యాలు నిక్షిప్తమై (దాగి) ఉన్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. 75% పరమాత్మ అదృశ్యంగా ఉన్నాడని ఆధ్యాతికత చెబుతుంటేనే ఆశ్చర్యపోతున్నారే. మరి 96% అగోచరంగా ఉందంటున్నది గదా సైన్సు మరి దానికేమంటారు పిల్లలూ?

అగస్త్య : ఆహా... మీరు చెబుతున్నట్లు సైన్సుకు, ఆధ్యాత్మికతకు తేడా లేదు తాతగారూ. ఎవరి దృక్పథంతో వారు పరమాత్మను గూర్చి ఆధ్యాత్మికవేత్త ప్రపంచాన్నిగూర్చి శాస్త్రవేత్తా, పరిశోధిస్తూ ఇద్దరూ సూర్యచంద్రుల్లా మానవాళికి వెలుగునందిస్తున్నారు. వారిరువురికి హేట్సాఫ్! మరియు చాలా చాలా ధన్యవాదాలు! మా సందేహాలనిలా నిశ్శేషంగా తీర్చుతున్నందుకు మీకూ కృతజ్ఞతాభివందనాలు తాతగారూ.

విద్యాధర్ : భగవద్గీత రెండో అధ్యాయం 22వ గీతలో మనిషి చిరిగిన వస్త్రాన్ని వీడి, నూతన వస్త్రాన్ని ధరించినట్లే ఆత్మశిథిలదేహాన్ని వీడి నూత్నదేహంలో ప్రవేశిస్తున్నదని అంటున్నది. కానీ, అలా ప్రవేశించటాన్ని మనంకానీ ఇంకెవ్వరుగానీ చూడలేదు గదా, మరి దాన్ని విశ్వసించట మెలా తాతగారూ?

వ్యాఖ్యాత : చూడు విద్యాధర్! సరిగ్గా ఇలాంటి అంశం గూర్చే మీరు పాఠ్యగ్రంథాల్లో చదువుకుంటున్న సైన్సు ఏం చెబుతుందో తెలుసుకుంటే

నీలాంటి వారందరి సందేహాలు పటాపంచలౌతాయి. సూర్యున్నిచుట్టూ నిర్దిష్ట కక్ష్యలో గ్రహాలు పరిభ్రమిస్తున్నట్లే పరమాణుకేంద్రం చుట్టూ వేర్వేరు కక్ష్యలలో తిరుగుతూ బలహీనపడిన ఒక ఎలక్ట్రాన్ లోపలి కక్ష్యలోకెళ్లిపోతుంది. అలాగే లోపలి కక్ష్యలో తిరుగుతూ శక్తిని పుంజుకున్న ఇంకో ఎలక్ట్రాన్ బాహ్యకక్ష్యలో ప్రవేశిస్తుంది. ఐతే అలా ఒక కక్ష్యలో నుండి యింకో కక్ష్యలోకి ఎలక్ట్రాన్ ప్రవేశించటాన్నింత వరకు యే శాస్త్రజ్ఞుడూ చూడలేదు. ఎందుకంటే ఎలక్ట్రాన్ ఒక కక్ష్యనుండి ఇంకో కక్ష్యలోకి ఎగిరి దూకదు. ఒక కక్ష్యలో అదృశ్యమై, యింకో కక్ష్యలో ప్రత్యక్షమౌతున్నది. అందువలన బాహ్యకక్ష్యలో ఒక ఎలక్ట్రాన్ తగ్గగానే, అంతర్కక్షలో ఒక ఎలక్ట్రాన్ పెరుగుతుంది. దీన్నిబట్టే ఎలక్ట్రాన్ కక్ష్యమారినట్లు గ్రహిస్తున్నాం తప్ప, అలా మారటాన్నింతవరకు మేం చూడలేదని శాస్త్రజ్ఞులే అంటున్నారు. అలాగే ఒక దేహంలో అదృశ్యమైన ఆత్మ మరో దేహంలో ప్రత్యక్షమౌతున్నది పిల్లలూ.

తరణ్ : ఆత్మశిథిల దేహాన్ని వీడి నూత్నదేహంలో ప్రవేశిస్తుందని అంటున్నారు గదా మనిషి దేహాన్ని వీడిన ఆత్మ. తిరిగి మనిషి దేహంలోనే ప్రవేశిస్తుందా? అలాగే ఏప్రాణి దేహాన్ని వీడిన యాత్మ తిరిగి అదే ప్రాణిలో ప్రవేశిస్తుందా తాతగారూ?

వ్యాఖ్యాత : లేదు తరణ్, దుర్మార్గుని దేహాన్ని వీడిన యాత్మను, అంతకన్నా అధమప్రాణిలోకి, సజ్జనుని దేహాన్ని వీడిన యాత్మను అంతకన్నా ఉన్నతమైన మహాత్మునిగా ఎదిగే దేహంలో ప్రవేశపెడతాడు పరమాత్మ!

వశిష్ఠ : అలా ఎందుకని తాతగారూ?

వ్యాఖ్యాత : ప్రస్తుతం మీరు చదువుకుంటున్న యీ లౌకిక విద్యకొక పరీక్షావిధానమున్నది అది మీకు తెలిసిందే.

జయరామ్ : ఔను తాతగారూ ఒకటో తరగతి పాసైనవారిని రెండో తరగతిలోకి అలా వరసగా పదోతరగతిలో, ఇంటర్‌లో, డిగ్రీలో, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అంతిమంగా పిహెచ్.డి., లోకి ప్రవేశపెడతారు. లౌకిక విద్యకు అత్యున్నత గమ్యస్థానం పిహెచ్.డి.,నే గదా!

వ్యాఖ్యాత : ఔను జయరామ్! అలాగే అలౌకిక (ఆధ్యాత్మిక) విద్యకు గూడ ఒక పరీక్షా విధానమున్నది. లౌకిక విద్యావిధానంలో ఒక తరగతి పాసైన వారికి పై తరగతిలోకి పంపి, తప్పిన వానిని అదే తరగతిలో ఉంచుతారు. కానీ, ఆధ్యాత్మిక పరీక్షా విధానంలో మాత్రం దైవాదేశానుసారం పుణ్యం చేసిన వాని ఆత్మను మరింత ఉత్తముని దేహంలోకి, పాపశీలి ఆత్మను అంతకన్నా అధమ ప్రాణిలోకి, బదిలీచేస్తాడు పరమాత్మ.

హిమాంశ్ : సర్వేశ్వరుడు సర్వశక్తిమంతుడు గదా, మరి ఒక జన్మలోనే మనుషులందర్నీ ఉత్తములుగా ప్రవర్తించేలా చేసి, మరుజన్మలో వారి ఆత్మను అత్యుత్తముల దేహాలలోకి, బదిలీ చేస్తాడు గదా తాతగారూ?

వ్యాఖ్యాత : ఉపాధ్యాయుడుపై తరగతిలోకి పంపే లక్ష్యంతోనే అందరికీ శ్రద్ధగా బోధిస్తుంటాడు. ఆ దిశగా అందర్నీ కృషి చేయమని ఆదేశిస్తాడు. ఆయన బోధల్ని శ్రద్ధగా విని, ఆయన ఆదేశాలను పాటించిన విద్యార్థులు మంచి మార్కులు, ర్యాంకులతో పై తరగతిలో ప్రవేశిస్తారు. ఉపాధ్యాయుని బోధల్ని సరిగావినని, ఆయన ఆదేశాలను పాటించని విద్యార్థులు విఫలురై, అదే తరగతిలో ఉండిపోతారు. ఔనా?

పిల్లలు : ఔను తాతగారూ...

వ్యాఖ్యాత : అదేవిధంగా ప్రతి మనిషినీ క్రమంగా ఎదిగేలా చేసి, అంతిమంగా అందర్నీ అత్యున్నత లక్ష్యానికి చేర్చాలన్నదే పరమాత్మ ఆశయం. అందుకోసమై మనిషి, మనిషికీ మంచీ, చెడుల విచక్షణాజ్ఞానాన్ని తెలియజేసేందుకు కర్తవ్యా కర్తవ్యాలను బోధించేందుకు, వారిలో తన ప్రతినిధిగా అంతరాత్మను ప్రతిష్ఠించాడు పరమాత్మ! ధర్మార్థ కామమోక్ష మార్గాన పయనిస్తూ పరమ లక్ష్యాన్ని చేరుకొమ్మంటూ అంతరాత్మ చేత నిరంతరం ప్రబోధింప చేస్తుంటాడు పరమాత్మ.

అంతరాత్మ ప్రబోధానుసారం ధర్మమార్గాన చరించిన వారిని ఉత్తమ జన్మలోకి, తద్విరుద్ధంగా అధర్మమార్గాన చరించిన వారిని అధమ జన్మలోకి నెట్టేస్తాడు పరమాత్మ.

ఆరాధ్య : అలా ఒకమనిషికి ఎన్ని పునర్జన్మలను కల్పిస్తాడు పరమాత్మ?

వ్యాఖ్యాత : పరమాత్మ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేంతదాకా మనిషికి జన్మపరంపర కొనసాగుతూనే ఉంటుంది ఆరాధ్యా! ఎందుకంటే పునర్జన్మ మనిషి తనను తాను సంస్కరించుకుంటూ, పరిపూర్ణతను సంతరించుకోటానికి తగిన శిక్షణనిస్తూ ఉంటుంది. ఏ ప్రాణినైనా, మనిషినైనా, వారి స్వయంకృషి, ప్రయత్నాలు లేకుండా, తానుగా ఎక్కదీసేందుకు పూనుకోదు పరమాత్మ. అందువలన ప్రతి ప్రాణికీ, ప్రతి మనిషికీ లక్ష్య సిద్ధికోసం స్వయంకృషిని, స్వయం సముద్ధరణను నిర్దేశిస్తున్నది ఆత్మ! పరమాత్మ సృష్టి ప్రణాళికలోని ముఖ్యాంశమిది. 'భౌతిక విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుని బోధను వినటం, ఆయన ఆదేశాన్ని పాటించటం విద్యార్థికి ఎంత అవసరమో, ఆధ్యాత్మిక ప్రగతికీ లక్ష్యసాధనకూ అంతరాత్మ ఆదేశాన్ని పాటించుట గూడ మనిషికి అంతే అవసరం. ఈ వాస్తవాన్ని గుర్తుంచుకున్న వారంతా తప్పక లక్ష్యాన్ని సాధిస్తారు.

కావ్య : కానీ, తాతగారూ! ఉత్తమ జన్మను పొందినవారు మరింత ఉత్తములుగా ఎదిగేందుకు కవకాశముంది. కానీ, మనిషిని అధమ ప్రాణియైన పశువుగా పుట్టించినప్పుడా పశువు ఉత్తమప్రాణిగా ఎలా ఎదుగుతుంది? మరింత ఉత్తమ జన్మకర్తత నెలా సంపాదించగల్గుతుంది?

వ్యాఖ్యాత : చూడు! కావ్యా! పశువుల్లోనూ, సంస్కారవంతమైనవి, సంస్కార హీనమైనవీ – సత్ప్రవర్తన గలవి, దుష్ప్రవర్తనగలవీ ఉన్నాయి. ఉదా॥ ఒక సంస్కారవంతమైన గేదె తనకు వేసినగడ్డిని ప్రక్కలకు వెదజల్లి వృథా చేయకుండా, గాటి ముందరే శుభ్రంగా తింటుంది. తనను కట్టివేసియున్న

తాడు వచ్చినంత దూరం వెనక్కు జరిగి పేడ, మూత్రాలను విసర్జించి తిరిగి గాటికి దగ్గరగా వచ్చి పడుకుంటూ పరిశుభ్రంగా ఉంటుంది. అదే సంస్కారహీనమైన గేదె తనముందు వేసిన గడ్డి తింటూ అటూ యిటూ చిందర వందరగా పడేసి తొక్కి వృథా చేస్తుంటుంది. అక్కడే పేడవేసి, అక్కడే మూత్రం పోసి అందులోనే పడుకుని తోకతో పేడ,మూత్రాలను ఒంటినిండా కొట్టుకుంటూ అసహ్యంగా తయారౌతుంటుంది. పై తెల్పిన మంచి పశువు తన చెంతకు వచ్చిన పిల్లల్ని, పెద్దల్ని కొమ్ము విసిరి భయపెట్టదు. తన యజమాని చేతిని ఆప్యాయంగా నాలుకతో స్పృశిస్తుంటుంది. పిల్లలూ, పెద్దలూ తన తలను నిమురుతుంటే తన్మయత్వంతో కనులు మోడ్చి ఆనందిస్తుంటుంది. అదే చెడ్డ పశువు చెంత కొచ్చిన వారిని పొడవబోతుంది. బుసకొడుతూ భయపెడుతుంటుంది.

ఉదా॥ 2. మనం ఒక వీధికుక్కకు మన యింటికొచ్చినప్పుడు అన్నం వేస్తుంటే కృతజ్ఞతతో పగలంతా ఎక్కడ తిరిగినా సాయంత్రం కాగానే మన యింటి కొచ్చి పడుకుంటుంది. కాపలాకాస్తుంటుంది.మనం ఆదమరచి ఉన్నాసరే యింట్లోకి దొంగలా దూరదు, మనం పెడితే తప్ప, తానుగా మనింట్లో యే పదార్థాన్ని ముట్టుకోదు. తన చెంత కొచ్చిన పిల్లల పట్ల ఆప్యాయతను ప్రదర్శిస్తూ విశ్వసనీయంగా ఉంటుంది. అదే చెడ్డ కుక్కైతే మనం దానికి రోజూ ఎంతగా అన్నం పెట్టినా సరే, మనం ఏమాత్రం ఆదమరిచినా యింట్లో చొరబడి దొరికొన వాటిని తినేస్తుంది. త్రాగేస్తుంది, దొర్లిస్తుంది. పిల్లలు చెంతకు రాబోతే గుర్రుగా మొరుగుతూ భయపెడుతుంది.

ఉదా॥ 3. యాండ్రోక్లీన్ అనే కుర్రవానిని దొంగగా భ్రమించి, చేయనినేరానికి శిక్షగా అతన్నిబోనులోని సింహానికి ఆహారంగా వదుల్తారు. కానీ, ఆ సింహం అతని దగ్గరగా వచ్చి వాసన చూసి అతని ముందు పరుండి అతన్ని ఆప్యాయంగా చూస్తుంటుంది. ఎందుకంటే, ఒకసారి అడవిలో తనకాలిలో ముల్లు విరిగి కాలువాచి, నడిచేందుకు వీలుగాక,

ఆహారం లేక చిక్కిశల్యమై యున్న సమయంలో తన కాలుకు కట్టు గట్టి తనను ఆదుకున్న కుర్రవానిని గుర్తించి, తనెంతో ఆకలిగా ఉన్నా సరే ఆ బాలుని చంపి తినకపోవటమే గాక అతనివైపు స్నేహభావంగా చూస్తూ కృతజ్ఞతను ప్రదర్శించింది. అందుకాశ్చర్యపోయిన రాజు ఆ బాలుని, సింహాన్ని గూడ స్వేచ్ఛగా వదలివేశాడు. సింహం అతనివెంట వెళ్ళింది. క్రూరమృగమే కావచ్చు, మేలుచేసిన వానిపట్ల కృతజ్ఞతను ప్రదర్శించడం ద్వారా మరింత ఉత్తమ జన్మకు అర్హతను సంపాదించిందా లేదా ఆ సింహం?

శ్రేష్ఠ : ఔను తాతగారూ ఆ సింహం మరింత ఉత్తమ జన్మకు పునాది వేసుకున్నట్లే యీ వాస్తవగాథను మేం పాఠ్యగ్రంథాల్లో చదువుకున్నాంగూడ.

వ్యాఖ్యాత : అలాగే చాలాకాలం క్రితం ఒక ఏనుగు యే కారణం చేతనో ఆగ్రహానికి గురై తన యజమానియైన మావటిని తొండంతో నేలకేసి కొట్టి చంపేస్తుంది. అతని భార్య తన ఒక్కగానొక్క పిల్లవాణ్ణి తెచ్చి యేనుగు ముందు పడేసి రోదిస్తూ యీ పిల్లవాని తండ్రిని చంపి మమ్మల్ని దిక్కులేని వాళ్ళను చేశావు దయచేసి మమ్మల్ని కూడా చంపి నీ కోపాన్ని పూర్తిగా తీర్చుకో మని చేతులు జోడించింది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న తల్లిని చూడగానే పశ్చాత్తాపానికి గురైన ఏనుగు వినమ్రంగా బాలుని ముందు మోకరిల్లి తొండంతో ఎత్తి అతన్ని తన వీపుపై కూర్చోబెట్టుకున్నది. నాటి నుండి ఆ బాలుని యజమానిగా స్వీకరించి అతని కనుకూలంగా నడుచుకుంటూ వారి కుటుంబానికాసరాగా నిలిచింది. అటవీ జంతువైనా చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెంది ప్రతిగా జీవితాంతం ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచిన ఆ యేనుగుగూడ మరింత ఉత్తమ జన్మకు అర్హతను సంపాదించుకుందా లేదా?

సాయికృత్తిక : ఖచ్చితంగా సంపాదించుకుంది. తాతగారూ!

వ్యాఖ్యాత : అంతేగాదు, జాతివైరం మరచి తల్లిలేని పిల్లిపిల్లకు పాలిచ్చి పెంచిన కుక్క, తల్లిలేని కుక్కపిల్లకు పాలిచ్చి పెంచిన కోతి – ఇంకా అట్టి ప్రేమ

పూర్వక స్నేహపూర్వక దృశ్యాలను సంఘటనల్ని పత్రికలు, టీవీల ద్వారా చూసే ఉంటారు. మరలాంటి పశువులు, వన్యమృగాలు తమ సత్ప్రవర్తన ద్వారా మరింత ఉత్తమ జన్మకు అర్హతను సంపాదించుకోలేదా పిల్లలూ?

ఊహాశ్రీ : ఔను తాతగారూ! మనిషికే గాదు ప్రతిప్రాణికీ ఉత్తమ జన్మకర్హతను సంపాదించుకునే అవకాశాన్ని పరమాత్మ కల్పించాడని నాకిప్పుడు స్పష్టంగా అర్థమైంది తాతగారూ.

హర్ష : లౌకిక విద్యలో ఒక విద్యార్థి నేర్చిన జ్ఞానానికి పరీక్ష నిర్వహించి అతను కృతార్థుడైందీ, లేనిదీ నిర్ణయించటానికి పరీక్షాధికారులుంటారు. మరి ఆధ్యాత్మిక (అలౌకిక) విద్యలో ప్రతిప్రాణికీ పరీక్ష నిర్వహించే పరీక్షాధికారి ఎవరు?

వ్యాఖ్యాత : ఆధ్యాత్మిక జ్ఞానార్జనలో ప్రతిప్రాణీ, ప్రతి మనిషీ కృతార్థులైందీ లేనిదీ నిర్ణయించి, వారిని ఉత్తమ జన్మకో, అధమ జన్మకో బదిలిచేసే పరమ పరీక్షాధికారి పరమాత్మ.

దేవాంశ్ : మనిషి చేసే పాపపుణ్యాలు మనిషి దేహానికే గాని, అతని ఆత్మకంటవని భగవద్గీత చెబుతున్నది గదా! మరి ఎట్టి మలినమూ అంటని నిర్మలమైన ఆత్మను మరి ఏ ప్రమాణాలతో అధమ, ఉత్తమ జన్మలకు బదిలీ చేస్తాడు పరమాత్మ?

వ్యాఖ్యాత : చాలా మంచి ప్రశ్నే వేశావు దేవాంశ్! ఒక మనిషిచేసే పాపపుణ్యాలతని దేహానికే గాని, ఆత్మకంట వన్న గీతయొక్క ఆంతర్యమేమంటే, ఉదాహరణకు ఒక మనిషి చేసిన పాపానికి పడే శిక్షగాని, పుణ్యానికి లభించే సన్మానం గానీ, ఆ మనిషి దేహానికే చెందుతాయిగాని అతని ఆత్మకు చెందవన్నదే గీతా, భావం. ఐతే దుర్మార్గుని దేహాన్ని వదిలివెళ్ళే ఆత్మ పాపపు వాసనతోను, పుణ్యశీలి దేహాన్ని వదిలివెళ్ళే ఆత్మ పుణ్యపు వాసనతోను వెళ్ళిపోతుంటుంది.

విరాజ్ : అదెలా తాతయ్యా? ఆత్మకు పాప పుణ్యాలంటవని అంటున్నారు. మళ్ళీ ఆయా దేహాలను వదిలివెళ్ళేటప్పుడు ఆత్మ పాప, పుణ్యాల వాసనలతో వెళ్ళిపోతుందంటున్నారు. దయచేసి ఈ అంశాన్ని సరిగ్గా అర్థమయ్యేలా వివరిస్తారా?

వ్యాఖ్యాత : చూడు విరాజ్, ఇద్దరన్న దమ్ములున్నారు. అన్న ఒక బుట్టనిండా చేపలు కొనుక్కొచ్చి అమ్ముకున్నాడు. తమ్ముడొక బుట్టనిండా మల్లెపూలు కొనితెచ్చి అమ్ముకున్నాడు. చేపలమ్మగా వచ్చిన లాభమో నష్టమో అన్నకు చెందుతుంది. పూలమ్మగా వచ్చిన లాభమో నష్టమో తమ్మునికి చెందుతుందే కాని, లాభనష్టాలు వాళ్ళబుట్టకు చెందవు కదా? అమ్మటమయ్యాక అన్నదమ్ములిద్దరూ ఆ బుట్టలు తెచ్చి ఒక మూలన పెట్టారు. ఆరెంటిలో ఏది చేపలబుట్టో? ఏది పూలబుట్టో? మీరెలా గుర్తించగలరు?

యువన్‌తేజల్ : వాటి వాసనను బట్టి అదేబుట్టో చెప్పవచ్చు తాతయ్యా.

హర్షవర్ధన్ : కొనుతాతగారూ, చేపలు, పూల, లాభనష్టాలు వాటినమ్మిన వాళ్ళకే గాని వాటితో నింపబడిన బుట్టలకు చెందవు, కానీ, వాటి వాసనలు మాత్రం బుట్టల నంటే ఉంటాయి. అలాగే మనిషిని వదిలివెళ్ళే ఆత్మ ఆ మనిషి చేసిన పాపపు వాసనతోనో, పుణ్యపు వాసనతోనో వెళ్ళిపోతుంటుందని మాకిపుడు బాగా అర్థమైంది తాతగారూ.

వ్యాఖ్యాత : వాటి వాసనను బట్టి అది చేపలబుట్టో, పూలబుట్టో మీరు తెలుసుకో గలిగినట్లే, వాసనను బట్టి అది పిండివంటల మీద నుండి, లేక పుష్పాలమీద నుండి వచ్చిన వాయువో, మలమూత్రాలనుండి, లేక కుళ్ళినశవాలనుండి వచ్చిన వాయువో మీరు పసిగట్టగలిగినట్లే, ఆత్మయొక్క వాసనను బట్టి, అది సజ్జనులనుండి వచ్చినదో, లేక దుర్జనుల నుండి వచ్చినదో స్పష్టంగా గ్రహిస్తాడు పరమాత్మ! ఇంకా చెప్పాలంటే మనిషిచేసే పాప పుణ్యాల మోతాదును బట్టి గూడ ఒక్కోమనిషినుండి ఘాటుగాను,

ఒక్కో మనిషినుండి సూక్ష్మంగాను వాసన వస్తుంటుంది. ఈ వాసనాభేదం ద్వారానే ప్రాణులన్నింటి అర్హతలను స్పష్టంగా గ్రహిస్తాడు పరమాత్మ!

రిత్విక్ : అల్లంత దూరాన ఉండగానే వాటి వాసననుబట్టి అవి మల్లెపూలో, ఉల్లిపూలో మనకు తెలిసిపోతున్నాయి. అలాగే మనుషుల వాసన గూడ మనకెందుకు తెలియదు? అలా తెలిస్తే వాళ్ళు మంచివాళ్ళో, చెడ్డవాళ్ళో గ్రహించి మనం ముందుగానే జాగ్రత్త పడవచ్చు గదా తాతగారూ?

వ్యాఖ్యాత : చూడు రిత్విక్! రెండు గిన్నెలనిండా రెండురకాల పూలుపోసి, అవి కనబడకుండా, రెండు వస్త్రాలను చుట్టి కప్పించామనుకో! అప్పుడు వాటి వాసన మనకు తెలియదు గదా, అలాగే (చర్మ) వసనముచే కప్పి ఉంచబడుతుంది ప్రాణులవాసన. అంటే చేసే పనులు, ఆలోచనలు, సంభాషణలను బట్టి ప్రాణులకు ప్రాప్తించే పాపపుణ్యాలన్నీ చెదిరిపోకుండా, (చర్మ) వసనంచే కప్పివుంచ బడతాయన్నమాట. అతని పాపపుణ్యాల వాసనే ఆ మనిషివాసన! ఐతే పదార్థాల వాసనను వాయువు మోసుకెళ్తుంటే, ప్రాణుల పాపపుణ్యాల వాసనను ఆత్మమోసుకెళ్తుంటుంది. అంతే తేడా!

ఆదిత్య : కానీ, ప్రపంచంలో ప్రతిరోజూ మనుషులు, తదితర ప్రాణులు కోట్ల సంఖ్యలో పుడుతూ, గిడుతూ ఉన్నవిగదా, మరి కోట్లాది మృత దేహాలను వదిలి వచ్చిన ఆత్మలను పాపపుణ్యాల వారీగా మళ్ళీ వాటిని వివిధ 'గ్రేడులు' (కక్ష్యలు) గా విభజించి, వాటి వాటి అర్హతలను బట్టి, సదరు ఆత్మలను తిరిగి ఉత్తమ, ఉత్తమోత్తమ – అధమ, అధమాధమ ప్రాణుల దేహాలలోకి ప్రవేశపెట్టగల్గుతున్నాడు పరమాత్మ అంటే నాకు పరమ ఆశ్చర్యంగా ఉంది తాతయ్యా?

వ్యాఖ్యాత : చూడు సిద్ధార్థా! 1. పాలూ, నీళ్ళ మిశ్రమం నుండి నీటిని వదిలిపాలను త్రాగుతుంది హంస. 2. కిలోమీటర్ల ఎత్తున ఎగురుతూ నేలమీద గడ్డిలోవున్నాసరే తన ఆహారాన్ని తన్నుకుపోగల్గుతుంది గద్ద.

3. నీటిలోపలి చేపపిల్లను నీటిలోకి దూసుకెళ్ళి ముక్కున గరచుకుపోతున్నది లకుముకిపిట్ట. 4. ఇసుకలో ఉన్న గుండు సూదిని సైతం తొండంతో తీయగల్గుతున్నది ఏనుగు. 5. కంప్యూటర్ ద్వారా మీ గదిలో కూర్చునే విశ్వాన్ని వీక్షించగల్గుతున్నారు మీరు. 6. ఉపగ్రహాల సహాయంతో గ్రహాంతరాల వివరాలను సేకరిస్తున్నాడు శాస్త్రజ్ఞుడు. 7. ప్రపంచ వ్యాప్తంగా పలుదేశాలలో ఉన్నతన వందలాది ఫ్యాక్టరీలు వేలాది బ్రాంచీలలోని లక్షలాది ఉద్యోగులు, కోట్లాది లావాదేవీల వివరాలన్నింటినీ, ఏదో ఒక నగరంలో, ఒక భవనంలోని గదిలో కూర్చుని నడిపించగల్గుతున్నాడు ఒక బహుళజాతి సంస్థల యజమాని. పరిమిత జ్ఞానం గల ప్రాణులూ, మనుషులే ఇన్ని ఘనకార్యాలు చేస్తుంటే భగవద్గీత చెబుతున్నట్లు విశ్వమంతటా కళ్ళూ, చెవులూ, ముఖాలు వ్యాపించియున్న పరమజ్ఞానియైన పరమాత్మ తన సృష్టినలా నడిపించడంలో ఆశ్చర్యమేముంది?

అగస్త్య : ఇంత సంక్లిష్టమైన గీతాంశాన్ని మాకు ఉదాహరణలతో చక్కగా వివరించినందుకు మీకు చాలా చాలా ధన్యవాదాలు తాతగారూ!

వ్యాఖ్యాత : ఈ అంశాన్నింత శీఘ్రంగా అవగాహన చేసుకోగల్గినందుకు మీ యందరికీ శుభాభినందనలు చిరంజీవులారా! సరే, భగవద్గీత ప్రబోధిస్తున్న ఈ అంశం ద్వారా మీరేం గ్రహించారు?

విద్యాధర్ : నేను చెబుతాను తాతయ్యా! ఈ జీవితంలో గొప్ప ఉద్యోగాన్ని సంపాదించటం కోసం యం.బి.బి.ఎస్., బి.టెక్, ఎం.టెక్, ఎం.ఏ, పిహెచ్.డి., ఐ.పి.ఎస్., ఐ.ఎ.ఎస్., వంటి పట్టాలను సంపాదించుకోవాలి. అందుకు మేము శ్రమించి చదవాలి. అలాగే మరుజన్మలో అత్యుత్తమ జన్మను పొందటానికి యీ జన్మలోనే పుణ్యాత్ముడు, ధర్మాత్ముడు , పరోపకారి, మానవ మహోపకారి, సర్వ భూతహిత కారి వంటి పట్టాలను పొందాలి. అందుకు మేం నిరంతరం శ్రమిస్తూ సత్కార్యాలు చేస్తుండాలి.

వ్యాఖ్యాత : చక్కగా గ్రహించినందుకు అభినందనలు విద్యాధర్! సరే ప్రియతమ చిరంజీవులారా! గత జన్మలో మీరంతా పుణ్యాత్ములే. అలాగే మరుజన్మలో అత్యుత్తమ జన్మకోసమై, మీరంతా మీ విద్యతో పాటు మానవతా విలువలను పెంపొందించుకుంటూ, పరులకోసం, ప్రాణులకోసం పాటుపడుతూ ఈ జన్మలోనే దృఢమైన పునాది వేసుకొందురు గాక! సాత్వికులుగా రూపొందెదరు గాక! విజయోస్తు చిరంజీవులారా! తథాస్తు!

తరణ్ : మీ ఆశీర్వాదానికి ధన్యవాదాలు తాతగారూ! కానీ, గతజన్మలో మేం పుణ్యాత్ములమని మీరెలా చెప్పగలరు?

వ్యాఖ్యాత : భగవద్గీతా ప్రబోధానుసారం, ఇప్పటి మీ స్థితినిబట్టి నేను చెప్పగలిగాను. 1. గీతానుసారం ప్రాణులన్నింటా ఉత్తమమైన మానవ జన్మను మీరు పొందగలిగారు. 2. అందులోనూ శ్రీమంతుల యిళ్ళలో సజ్జనుల బిడ్డలుగా మిమ్మల్ని జన్మింపజేసాడు పరమాత్మ. గతజన్మలో మీరు పుణ్యాత్ములేననటానికింతకన్నా నిదర్శన మేం కావాలి?

వశిష్ఠ : వావ్! గత జన్మలో మేం పుణ్యాత్ములమని మాకు సహేతుకంగా తెలియజెప్పినందుకు మాకు చాలా ఆనందంగా ఉంది తాతగారూ!

జయరాం : ఔను తాతగారూ! ఇంకా మీరు సూచించినట్లు మరుజన్మలో మరింత ఉత్తమ జన్మకోసంమేమంతా ఉత్తమ విలువలను పెంపొందించుకుంటూ, సదా సత్కార్యాలు చేస్తుంటాం తాతయ్యా!

వ్యాఖ్యాత : మీ సంకల్పానికి సర్వేశ్వరుని సహకారం, గీతామాత శుభాశీస్సులూ ప్రాప్తించు గాక!

హిమాంశ్ : ధన్యవాదాలు తాతగారూ! కానీ, లౌకిక విద్యలో ఒకటో తరగతి నుండి, పిహెచ్.డి. వరకని ప్రారంభం ముగింపంటూ ఉన్నాయి గదా, అలాగే ప్రాణుల జన్మ పరంపరకూ ప్రారంభం, ముగింపూ ఉండాలి గదా?

ఆరాధ్య : అసలీ జన్మపరంపర ద్వారా పరమాత్మ సాధించదలచిన లక్ష్యమేంటి తాతగారూ?

వ్యాఖ్యాత : చూడండి పిల్లలూ మిమ్మల్ని ఒకటో తరగతి నుండి ఎందాకా చదివిస్తారు మీ తల్లిదండ్రులు? అలాగే మీకేది మంచో, ఏది చెడో, ఏవి తినాలో, ఏవి తినకూడదో? ఏ సీజన్లో ఏ దుస్తులు ధరించాలో? ఇరుగు, పొరుగు వారితో, సమాజంతో, మీరెలా మసలుకోవాలో? డబ్బును వేటికోసం ఖర్చుచేయాలి, వేటికోసం ఖర్చుచేయరాదో? సూచిస్తూ, అవసరమైతే మిమ్మల్ని నియంత్రిస్తూ ఎంతకాలం వరకు మిమ్మల్ని కనిపెట్టి కాపాడుతుంటారు మీ తల్లిదండ్రులు?

కావ్య : మేం మా స్వయంశక్తితో బ్రతకటానికవసరమైన ఉద్యోగానికి సరిపడేంత వరకు మమ్మల్ని చదివిస్తారు! అలాగే మా ఉనికికి, ప్రగతికి, ఆరోగ్యానికి, సమాజంలో గౌరవ ప్రదంగా మేమెదగడానికి ఏవి సరైనవో, కావో మేం స్వయంగా నిర్ణయించుకోగలిగేంత దాకా మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటారు మా తల్లిదండ్రులు.

వ్యాఖ్యాత : సరిగ్గా చెప్పావు కావ్యా! అలాగే తన ప్రమేయం లేకుండానే ప్రాణికోటి సుఖశాంతులతో వర్ధిల్లేంత దాకా, అంతరాత్మ , విచక్షణా జ్ఞానం, తదితర మార్గాల ద్వారా సూచనలు, సంకేతాల నందజేస్తూ, సృష్టిలోని అన్నింటినీ మార్పులు, చేర్పులకు గురిచేస్తూ, ప్రతి మనిషినీ ప్రాణినీ స్వయంకృషి, జ్ఞానార్జనలద్వారా తమను తాముద్ధరించుకునేందుకై స్వయంసంస్కరణాచట్రంలో ఇమడ్చటం ద్వారా సంస్కార వంతులుగా రూపొందేలా జేస్తున్నాడు పరమాత్మ. సదరు చట్రంలో భాగమే యీ జన్మపరంపర! **ఆత్మజ్ఞానార్జన చేస్తూ విశ్వంలో తన ఉనికీ, ప్రగతికోసం పరమాత్మ కల్పించిన సదవకాశాలన్నింటినీ సద్వినియోగ పరచుకుంటూ వుంటే అతికొద్ది జన్మలలోనే పరమాత్మ ఆశించిన స్థాయికి పరిణతి చెందగలడు మనిషి! పరమాత్మ స్థాయికెదిగిన మనిషి చేసే పనులన్నీ**

అతనికోసం గాక, పరమాత్మవలెనే లోకకళ్యాణం కోసమే చేస్తుంటాడు. అదే అతని పరిణతికి హద్దు!

శ్రేష్ఠ : అంటే ప్రాణికి మరణమన్నది ముగింపుకాదు, కేవలం మార్పుమాత్రమే అంటున్నది గీత. అంతేనా తాతగారూ?

వ్యాఖ్యాత : ఔను, దేహానికి బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్యాలవలెనే మరణం కూడ మార్పేగాని, ముగింపుకాదు. అంటే మరణం ద్వారా వ్యక్తి ధరించిన రూపం (దేహం) నశిస్తుందే కాని, అందలి వ్యక్తిత్వం (ఆత్మ) నశించదు. పరిపూర్ణతను సంతరించుకునేంత దాకా సదరు వ్యక్తిత్వం (ఆత్మ) రూపాంతరాలను పొందుతూనే ఉంటుంది. అలా దేహం ఎన్నిసార్లు నశించినా, దేహాంతర్గత వ్యక్తిత్వం (ఆత్మ) మాత్రం తన వాసన (గుర్తింపు)ను కాపాడుకుంటూనే కొత్త రూపాన్ని ధరిస్తుంటుంది. **కాబట్టి, ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రతిమనిషీ ఆత్మ జ్ఞానార్జన చేస్తూ, ప్రయత్నపూర్వకంగా సాత్విక గుణాన్ని పెంపొందించుకుంటూ సచ్చిదానంద నిలయునిగా ఎదగాలన్న సందేశామృతాన్ని అందిస్తున్నది శ్రీమద్భగవద్గీత!**

సాయికృత్తిక : ఔనుతాతగారూ, గీతా నిర్దేశానుసారం 1. ఆత్మజ్ఞానార్జన 2. ఫలాపేక్షరహిత (నిష్కామ) కర్మ 3. విధి నిర్వహణల ద్వారా పరమాత్మను తృప్తిపరచాల్సిన బాధ్యత మానవాళిపై ఉన్నదన్న వాస్తవాన్ని గ్రహించాం. అందుకే మేం నిరంతరం ఆ దిశగానే పయనిస్తాం తాతయ్యా!

ఊహాశ్రీ : నేనింకో వాస్తవాన్నిగూడ గ్రహించాను, మన ఆత్మీయులు, బంధువులు చనిపోయినా మనం దుఃఖించాల్సిన పనిలేదు. ఎందుకంటే, వారు తక్షణం మరో రూపాన్ని ధరించి మనతో పాటు యీ ప్రపంచంలోనే ఎక్కడోచోట జీవిస్తూనే ఉంటారు. ఔనుగదా తాతగారూ?

వ్యాఖ్యాత : శభాష్ పిల్లలూ ! గీతామాత సందేశాన్ని అరటిపండును తిన్నంత అవలీలగ గ్రహిస్తున్నందుకు మీ యందరికీ శుభాభినందనలు. కురుక్షేత్రంలో

బంధువుల్ని చంపుకోవాల్సివచ్చిన దుస్థితికి దుఃఖభారంతో కూలబడిన అర్జునునికి శ్రీకృష్ణపరమాత్మ ఈ వాస్తవాన్ని తెలియజేయడం ద్వారానే, ఓదార్చి అతన్ని విధి నిర్వహణకై ఉత్తేజ పరచగలిగాడు!

సిద్ధార్థ : ఆచరణద్వారా ధర్మాన్ని పరిరక్షించిన శ్రీరాముడు – నిష్కామకర్మ ద్వారా ధర్మరక్షణకు దారిచూపిన శ్రీకృష్ణుడు, మానవ దుఃఖ నివారణ మార్గాన్వేషణార్థం సర్వస్వాన్నీ త్యజించిన గౌతమబుద్ధుడు మొదలగు వారి ఆత్మ, వారి పుణ్యాతిశయం చేత నేరుగా పరమాత్మను చేరి ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను తాతగారూ!

అగస్త్య : శ్రీమద్రామాయణం, శ్రీమద్భగవద్గీత, త్రిపిటకాలవంటి ఆధ్యాత్మిక గ్రంథాలన్నింటినీ పరమాత్మ యొక్క ప్రతినిధులుగ నేను విశ్వసిస్తున్నాను తాతగారూ!

వ్యాఖ్యాత : శభాష్ చిరంజీవులారా! పోటాపోటీలుగ మీరందించిన ఉదాహరణలు, ఉపమానాలు గీతా సందేశామృతాన్ని మీరెంతగా ఆస్వాదించారో సృష్టీకరిస్తున్నాయి. ఇందుకు మీ అందరికీ చాలా చాలా అభినందనలు!

విశ్వ శక్తి (హిగ్స్ ఫీల్డ్)

విద్యాధర్ : సృష్టికి మూలం విశ్వశక్తి యని సైన్సు – కాదు విశ్వచైతన్యం అని ఆధ్యాత్మికత అంటున్నవని మీరు చెప్పారు. అసలీవిశ్వశక్తి – విశ్వచైతన్యానికి గల తేడా యేంటో దయచేసి ఇంకొక్కసారి వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఈ అంశాన్ని గూర్చి మీ కింతకు ముందే వివరించాను గదా, మళ్ళీ ఏంటి? సరే దీన్ని ఇంకొంచెం వివరంగా విశదీకరిస్తాను. జాగ్రత్తగా వినండి! ముందుగా సైన్సు చెప్పే విశ్వశక్తి గూర్చి వివరిస్తాను వినండి. ఒకే ముద్దగ వున్న విశ్వశక్తి అంతా **'బిగ్‌బ్యాంగ్'** వలన విచ్ఛిన్నమై

పరమాణువులుగా మారి అంతటా వెదజల్లబడింది. అలా వెదజల్లబడ్డ పరమాణువులన్నీ వాటికి గల ఆకర్షణ శక్తుల మూలంగా తిరిగి సమీకృతమౌతూ వివిధ పదార్థాలుగా రూపొందాయని చెప్పాను గదా. ఇక ఇప్పుడు సదరు పరమాణువులలో దాగియున్న విశ్వశక్తి స్వరూపాన్ని గూర్చి **పీటర్ హిగ్స్** అను శాస్త్రజ్ఞుడు చెప్పిన వివరాలను మీకు తెలియజేస్తాను. ఈ విశ్వశక్తి స్వరూపాన్ని కనుగొన్నది ఆయన గనుక ఆయన పేరిటే విశ్వశక్తిని **'హిగ్స్‌ఫీల్డ'**ని వ్యవహరిస్తున్నారు.

పదార్థమంతా పరమాణువుల సమూహం. ఆ పరమాణువుల్లోని ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు రూపొందటానికి తోడ్పడే 24 ప్రాథమిక కణాలు మరియు 4 ప్రాథమిక శక్తులూ వున్నవనీ, వీటన్నింటినీ కలిపి ఉంచే శక్తి ఒకటుంది. అదే విశ్వశక్తి యని **'పీటర్‌హిగ్స్'** చెప్పాడు. ఇప్పటికీ శాస్త్రజ్ఞులంతా దాన్నే విశ్వసిస్తున్నారు.

తరణ్ : పరమాణువులే కంటికి కనబడవు. వాటికాధారమైన ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు యింకా సూక్ష్మాలు. ఆ సూక్ష్మాల నిర్మాణానికి తోడ్పడుతున్న సూక్ష్మాతి సూక్ష్మాలు ఇంకా 28 ఉన్నాయంటే అసలెలా నమ్మాలి తాతగారూ?

వ్యాఖ్యాత : అతిరథ మహారథులైన శాస్త్రజ్ఞులెన్నో ప్రయోగాలు, గణాంకాల ద్వారా పరిశీలించి నిర్ద్వంద్వంగా అంగీకరించిన వాస్తవాన్ని నమ్మకుండా యెలా ఉండగలం తరణ్?

వశిష్ఠ : విశ్వం యొక్క స్థిర నమూనా అంటే యేంటో వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : మాక్స్‌ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం ఈ రెండింటి మేలుకలయికతో విశ్వనిర్మాణ నమూనా రూపొందింపబడింది. దీన్నే స్థిరనమూనా అన్నారు. ఈ నమూనా ప్రకారం విశ్వమంతా 24 ప్రాథమిక కణాలు + 4 ప్రాథమిక శక్తులతోనూ రూపొందింపబడింది వాటి వివరాలివీ

24 ప్రాథమిక కణాలు : అప్, డౌన్, బోటమ్, టాప్, స్ట్రేంజ్, ఛార్మ్, అను 6 క్వార్కులు ఎలక్ట్రాన్, ఎలక్ట్రాన్ నూట్రినో – మునోవ్ – మునోవ్ న్యూట్రినో – టావు–టావు న్యూట్రినో అను 6 లెప్టాన్లు – ఇంకా 12 బాసన్లు వీటి (6 క్వార్కులు + 6 లెప్టాన్లు +12 బాసన్లు) నే ప్రాథమిక కణాలుగ నిర్ధారించారు.

4 ప్రాథమిక శక్తులు : 1.బలమైన (ధన+) శక్తి 2. బలహీన (రుణ) శక్తి 3. విద్యుదయస్కాంత శక్తి 4. గురుత్వాకర్షణ శక్తి. వీటిని ప్రాథమిక శక్తులుగా నిర్ధారించారు. ప్రాథమిక కణాలలోని క్వార్కులు – లెప్టాన్లు ప్రోటాన్, న్యూట్రాన్, ఎలక్ట్రాన్‌ల నిర్మాణంలో పాల్గొంటయ్! ఉదా॥ 2 అప్‌క్వార్కులు + 2 డౌన్‌క్వార్కుల బంధంతో ప్రోటాన్ – అట్టియింకో బంధంతో న్యూట్రాన్ మరో బంధంతో ఎలక్ట్రాన్ రూపొందుతాయి.

ఇక 12 రకాల బాసన్లలో కొన్ని ధనశక్తితో, ఇంకొన్ని ఋణశక్తితో, ఇంకా కొన్ని విద్యుదయస్కాంత శక్తితో, మరికొన్ని గురుత్వాకర్షణ శక్తితోను యిచ్చిపుచ్చు కుంటుంటయ్. ఉదా॥ ధనశక్తితో యిచ్చిపుచ్చుకునే బాసన్లను 'గ్లూవోన్స్' అని ఋణశక్తితో యిచ్చిపుచ్చుకునే వాటిని W+, W-, Z బాసన్లని అంటారు. అలాగే విద్యుదయస్కాంత శక్తితో యిచ్చిపుచ్చుకొనే బాసన్లు ఫోటాన్లు గురుత్వాకర్షణ శక్తితో యిచ్చి పుచ్చుకునేవి గ్రావిటాన్లు. ఈ 24 ప్రాథమిక కణాలను, 4 ప్రాథమిక శక్తుల్ని కలిపివుంచే శక్తే విశ్వశక్తి యని **పీటర్‌హిగ్స్** అనుశాస్త్రవేత్త 1964లో భౌతిక శాస్త్ర గణితాల ద్వారా సిద్ధాంతీకరించారు. **హిగ్స్‌ఫీల్డ్ (విశ్వశక్తి)** నుండి ప్రాథమిక కణాలకు ద్రవ్యరాశినందించే యింకో రకం బాసన్లు కూడా వున్నట్లు కనుగొన్నారు. వాటిని 'దైవ కణా'లని మరియు 'హిగ్స్ బాసన్ల' నీ వ్యవహరిస్తున్నారు. తమ సమీపానికొచ్చిన పరమాణువులోని ప్రాథమిక కణాలలో ప్రవేశించిన దైవకణాలే జీర్ణమైపోయి ప్రాథమిక కణాలకు ద్రవ్యరాశిని (బరువును) సమకూర్చుతుంటాయి. దీన్నిబట్టే 'విశ్వసృష్టి' కంతటికీ పై తెల్పిన విశ్వశక్తి యే ఆధారమని పలువురు సైంటిస్టులు వక్కాణిస్తున్నారు.

విశ్వచైతన్యం

కానీ, సమస్త సృష్టికి మూలం విశ్వచైతన్యశక్తియేనని అనుభవం ద్వారా నిర్ధారించారు. ఆధ్యాత్మిక వేత్తలు, మనమహర్షులు!

జయరామ్ : ఇంతకూ విశ్వశక్తి విశ్వచైతన్యం యీ రెంటికీ గల తేడా యేంటి తాతగారూ?

వ్యాఖ్యాత : శక్తీ – చైతన్యం రెండూ వేరు కావు. అగ్ని, ఉష్ణం, నీరు, ద్రవత్వం లాగే 'చైతన్యం–శక్తీ' అవిభాజ్యాలు. వేరుచేయలేని యిట్టి అవిభాజ్యాలనే సనాతనాలని అంటారని చెప్పాను గదా?

జయరామ్ : భగవద్గీత ప్రకృతి–పురుషులే' (విశ్వచైతన్యశక్తే) సృష్టికి మూలమంటున్నది గదా, మరి 'దైవ కణము' (హిగ్స్ బాసన్) గురించే చెప్పింది తప్ప 'దేవతాకణం' గూర్చి చెప్పలేదెందుకని?

వ్యాఖ్యాత : మంచి ప్రశ్నే అడిగావు జయరామ్! దైవకణా(హిగ్స్‌బాసన్)న్ని కనుగొన్న ఐదు సంవత్సరాల తర్వాత ఇటీవలే 2017లో దేవతాకణాన్ని (ఏంజల్ పార్టికల్‌ను) కనుగొన్నామని 'స్టాన్‌ఫర్డ్' – 'కాలిఫోర్నియా'వర్శిటీ పరిశోధకులు ప్రకటించారు. ఇలాంటి కణం ఉందని 1937లలో ప్రతిపాదించిన ఇటలీ శాస్త్రజ్ఞుడు **'ఎత్తోరేమయొరానా' పేరిట ఈ దేవతా కణానికి 'మయొరానా ఫెర్మియాన్' అని, 'ఏంజెల్‌పార్టికల్ '(దేవతాకణం) అని నామకరణం చేశారు.**

1937లో మయొరానా చేసిన ప్రతిపాదన ఇదీ 'కణా'లకు ద్రవ్యరాశినిచ్చే **'గాడ్స్ పార్టికల్' (దైవకణం)** (పాజిటీవ్)అనుకూల శక్తితో పాటు, (నెగెటివ్) వ్యతిరేకశక్తి ద్రవ్యరాశిని పుచ్చుకునే ఏంజెల్ పార్టికల్ (దేవతాకణం) గూడ ఉంది. **ఈ రెండూ కలిసి శక్తిని విడుదల చేస్తాయి. సైన్స్ అంటున్న విశ్వశక్తి – ఆధ్యాత్మికత అంటున్న 'విశ్వ చైతన్యశక్తి' అదే! ప్రతి కణంలోనూ ఈ రెండు శక్తులతో కూడిన ప్రాథమిక కణాలు కలిసే**

ఉంటాయన్నది ఎత్తోరే మయొరానా 1937లోనే చేసిన ప్రతిపాదన. అది నిజమని ఇప్పటికి రుజువు చేయగలిగారు స్టాన్‌ఫర్డ్, కాలిఫోర్నియా శాస్త్రజ్ఞులు.

పిల్లలూ ఇప్పుడు మీకు అవగాహన అయ్యింది గదా! **భగవద్గీత (ఆధ్యాత్మికత) చెబుతున్న ప్రకృతి, పురుషులతో కూడిన విశ్వచైతన్యశక్తీ, సైన్స్ చెబుతున్న 'దేవతా' 'దైవ' కణాలతో గూడిన విశ్వశక్తీ ఒక్కటేననీ.**

పిల్లలు : ఔను తాతయ్యా

హిమాంశ్ : గీత "10-20" **"అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయస్థితిః"** అని ఉండే అంతరాత్మ లేక ప్రత్యగాత్మ లేక అంతరంగమనస్సును నేనే అనిగదా భగవంతుడంటున్నాడు. ఇది వాస్తవం అన్న విశ్వాసం మాకు కలిగేలా ఉదాహరణలతో వివరించగలరా తాతయ్యా?

వ్యాఖ్యాత : మనిషైనా, పశువైనా, పక్షైనా, మృగమైనా, ఆడైనా, మగైనా ఎవరైనా సుఖం కలిగితే ఆనందించటం, కష్టం కలిగితే దుఃఖించటం ప్రాణులన్నింటికీ సహజమన్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే ప్రేమ, పగ, కరుణ, క్రౌర్యం, మాతృభక్తి, దేశభక్తి, ఆనందానికి పొంగిపోవటం, దుఃఖానికి కుంగిపోవటం వంటి భావోద్వేగాలన్నీ మోతాదులో తేడా ఉండవచ్చు గానీ మానవులందరిలో కనిపిస్తూనే ఉంటాయి. ఔనా పిల్లలు?

విద్యార్థులు : ఔను తాతగారూ!

వ్యాఖ్యాత : మరి ప్రాణులన్నింటా అంతరాత్మ రూపంలో నివసిస్తున్నది పరమాత్మయే అనటానికి ఇంతకన్నా నిదర్శన యేం కావాలి?

హిమాంశ్ : అదే పరమాత్మ అలా ప్రాణులన్నింటిలో ఒకేరకమైన భావోద్వేగాలను ఎలా ప్రదర్శింపజేయగల్గుతున్నాడో నా ఊహకందటం లేదు తాతయ్యా?

వ్యాఖ్యాత : సరే, మీరు కంప్యూటర్ యుగం వారుగదా! అందుకే ఈ అంశాన్ని మీకు కంప్యూటర్ల రూపేణా వివరిస్తాను. వినండి.

ఉదా॥ ఒక జిల్లాలోని రెవెన్యూ వివరాలను, ఆ జిల్లాకు చెందిన పొలాలకు సంబంధించిన సొంతదారులు, పంటలు, శిస్తులు, వర్షాభావానికి, వరదలకు, పంటనష్టాలు వగైరా వివరాలన్నీ ఏ కంప్యూటర్లో చూసినా ఒకే విధంగా ఉంటాయి. ఇదెలా సాధ్యమౌతుంది? కొన్నివేల, లక్షల కంప్యూటర్లన్నీ ఒక సర్వర్‌తో అనుసంధానం చేయబడివుంటాయి. సదరు సర్వర్ ద్వారా కంప్యూటర్లన్నింటికీ ఒకే రకమైన సమాచారం అందుతుంటుంది. ఔనా!

విద్యార్థులు : ఔను తాతయ్యా!

వ్యాఖ్యాత : అలాగే 'పరమాత్మ' అనే సర్వర్‌కు ప్రాణులనే కంప్యూటర్లన్నీ అనుసంధానం చేయబడి ఉంటాయి. అందుకే ఆయాసందర్భానుగుణంగా **ఆయాభావోద్వేగాలను ప్రాణులన్నింటిలో అంతరాత్మ యనెడి చిప్ (Chip)కు అందిస్తుంటుంది పరమాత్మయనే సర్వర్! అందువల్లనే మనందరమూ సుఖాలకు ఆనందిస్తూ, కష్టాలకు దుఃఖిస్తూ ఉంటాము** అలాగే ఆయా సందర్భాలలో ప్రాణులనే కంప్యూటర్లు ఆయాభావోద్వేగాలను ప్రదర్శించగల్గుతున్నాయి ఇప్పుడర్థమైందా హిమాంశ్?

హిమాంశ్ : చాలా స్పష్టంగా అర్థమైంది తాతగారూ

విద్యార్థులు : ఇంతక్లిష్టమైన అంశాన్ని మాకింత చక్కగా వివరించగల్గినందుకు మీకు చాలా చాలా ధన్యవాదాలు తాతగారూ!

హిమాంశ్ : నిప్పును పట్టుకుంటే కాల్తుంది - నీటిని పట్టుకుంటే జారిపోతుంది. కావున అవి (నిప్పు, వేడి, నీరు, ద్రవ్యత్వం) వేరు చేయ వీలులేనివని అనుభవపూర్వకంగా తెల్సుకుంటున్నాం. మరి చైతన్యము, శక్తీ వేరు కావని తెలుసుకునేదెలా?

వ్యాఖ్యాత : ఇలా ప్రశ్నించి నానుండి జవాబు రాబట్టాలనుకోవటం నీ చైతన్యానికీ, నీ ప్రశ్న నాకు వినిపించేంత బిగ్గరగా మాట్లాడగల్గటం, నీ శక్తికీ నిదర్శనం! నన్ను ప్రశ్నించాలన్న చైతన్యమున్నా, నాకు వినిపించేటంత బిగ్గరగా మాట్లాడే శక్తి నీకు లేకుంటే లేక నాకు వినిపించేలా బిగ్గరగా మాట్లాడే శక్తి నీకున్నప్పటికీ ప్రశ్నించడంద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్న చైతన్యం నీకు లేకుంటే యీ పని జరిగి ఉండేది కాదు. చైతన్యవంతమైన శక్తి వల్లనే నీవైనా, నేనైనా, మరెవరైనా పని చేయగల్గుతున్నామనీ **చైతన్యం – శక్తీ విడదీయ వీలులేని అవిభాజ్యాలనీ – అవిభాజ్యమైన చైతన్యశక్తి వల్లనే అనంత విశ్వమిలా ఒక క్రమ పద్ధతిలో పయనిస్తున్నది, పరిణామం చెందుతున్నది పిల్లలూ!**

ఆరాధ్య : విశ్వచైతన్యం / విశ్వచైతన్యశక్తి యొక్క స్వరూప, స్వభావాలను వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : విశ్వచైతన్యాన్నే పరమాత్మ – పరబ్రహ్మ – విశ్వేశ్వరుడు – పరమేశ్వరుడు – సర్వేశ్వరుడు – సృష్టికర్త – ఈశ్వరుడు – దైవం అనిగూడ పిల్చుకుంటున్నాం మనం. విశ్వసృష్టికర్త పరమేశ్వరుడేనన్న విశ్వాసంతో ఆయన్నిలా శరణువేడుకున్నాడు. సహజకవి బమ్మెర పోతన –

> "ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపలనుండు, లీనమై
> ఎవ్వనియందు డిందు, పరమేశ్వరుఁడెవ్వఁడు, మూల కారణం
> బెవ్వఁడనాది మధ్యలయుఁడెవ్వఁడు, సర్వము దానయైన, వా
> డెవ్వడు? వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్"

ఈ పద్యం పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలను క్లుప్తంగా వివరిస్తుంది. దీని భావాన్ని చెప్పగలరా?

కావ్య : ఎవని వలన విశ్వం పుట్టిందో, ఎవనిలో యీ విశ్వం వర్ధిల్లుతున్నదో, ఎవనిలో ఈ విశ్వం లీనమైపోతుందో, ఈ విశ్వానికి పరమ ప్రభుడెవ్వడో,

సకల చరాచర జీవరాసులన్నింటికీ మూలకారణం ఎవడో, ఆది, మధ్య, అంతాలు లేనివాడు తన నుండి తానే పుట్టినట్టి ఈశ్వరుని నేను శరణువేడుతున్నాను.

వ్యాఖ్యాత : చక్కగా చెప్పావు కావ్యా!

శ్రేష్ఠ : పరమాత్మ లక్షణాలివేనా, ఇంకా ఉన్నాయా తాతగారూ?

వ్యాఖ్యాత : ఇంకా ఇతిహాసాలు, పురాణాలు, వేదోపనిషత్తులద్వారా మన మహర్షులు తెలియజేసిన పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలను లేక లక్షణాలను గూడ వివరిస్తాను వినండి.

1. విశ్వచైతన్యం / విశ్వాత్మ మౌలికమైనది అంటే దానికదే మూలం, ఆధారం, అనిభావం.
2. సత్య, జ్ఞాన, ఆనందాల (సత్+చిత్+ఆనంద) నిలయం విశ్వచైతన్యం/ విశ్వాత్మ.
3. స్వేచ్ఛాయుతమైంది, స్వయం నిర్ణయాత్మకమైంది పరమాత్మ!
4. సృజనాత్మకమైంది అంటే ఊహించగల్గినది, ఊహించిన దానిని రూపొందించ గల్గినది విశ్వచైతన్యం.
5. సృష్టించటానికి, సృష్టించిన దాని రక్షణ, పోషణ, ప్రగతి, పరిపూర్ణతలకు అవసరమైన అన్ని లక్షణాలయొక్క ప్రేమ, కరుణ, క్షమ, ఆప్యాయత, కృతజ్ఞత, స్నేహశీలత మొ॥ అత్యుత్తమ సుగుణాలు లేక విలువల యొక్క అనంతత్వమే విశ్వచైతన్యశక్తి!
6. తన సృష్టియొక్క ప్రగతి, పరిపూర్ణత, అభ్యుదయ, వికాసాల సాధనార్థం, తన సృష్టిలోని పదార్థాలను, ప్రాణులనూ సదా పలు మార్పులకు, చేర్పులకు గురిచేస్తుండే పరిణామాత్మకమైనది విశ్వచైతన్యం! ప్రయోగాత్మకమైనది విశ్వచైతన్యం!

7. అధర్మం పెరిగి, ధర్మం యొక్క ఉనికి ప్రశ్నార్థకమైనప్పుడు తనకు తానే యేదో ఒక రూపంలో అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణల ద్వారా ధర్మాన్ని, ధర్మాత్ములను, తద్వారా ప్రపంచాన్నీ పరిరక్షించే అవతారాత్మకమైనది విశ్వచైతన్యం !

8. తన సృష్టిలో న్యాయం × అన్యాయం, సత్యం × అసత్యం, ధర్మం × అధర్మం, పుణ్యం × పాపం, ప్రేమ × ద్వేషం, నీతి × అవినీతి, త్యాగం× స్వార్థం, క్షమ × పగ, జ్ఞానం × అజ్ఞానం మొ॥ ద్వంద్వాలను రూపొందించి, అనుకూలాంశాలపట్ల ఆసక్తిని కలిగించి సన్మార్గాన కొందరినీ వ్యతిరేకాంశాల పట్ల ఆసక్తిని రేకెత్తించి దుర్మార్గాన కొందరినీ నడిపిస్తూ వారివారికి కలిగే అనుభవాల, లాభనష్టాలు, గుణపాఠాల ద్వారా, మానవాళికీ ప్రాణులన్నింటికీ విద్యాబుద్ధులు నేర్పిస్తుంటాడు పరమాత్మ!

ఉదాహరణకు కొన్ని ఉత్తమ, కొన్ని దుష్ట పాత్రలను సృజించి వారివారి చేతలు, ఫలితాలను చూపించడం ద్వారా చలనచిత్ర దర్శకుడు సమాజానికీ ఏదిమంచో, ఏదిచెడో, ఏ మార్గాన పయనించాలో, ఏ మార్గాన పయనించరాదో తెలియజేస్తున్న విధంగానే పరమాత్మగూడ మంచీ, చెడులను, సన్మార్గాన్ని, దుర్మార్గాన్ని రూపొందించి, వారివారిని ఆయా మార్గాలలో పయనింపజేయటం ద్వారా వారి వారికి సంభవించే సానుకూల, వ్యతిరేక ఫలితాలను చూచి, తద్వారా తమ పొరపాట్లను తెలుసుకుని, వాటిని సవరించుకుంటూ తమను తామే సంస్కరించుకునేలా స్వయం సముద్ధరణా మార్గాన్ని మానవాళికీ, ప్రాణులకూ రూపొందించాడు పరమాత్మ!

సాయికృత్తిక : అసలు మంచేదో, చెడేదో ప్రాణులైనా, మనుషులైనా తమంతటతామే ముందుగానే గుర్తించేదెలా తాతగారూ?

వ్యాఖ్యాత : ఈ ప్రశ్నకు భగవద్గీత చెబుతున్నదిలా గీత 10-20 **అహమాత్మా గుడాకేశ! భూతానామస్తిఏవచ** 'ప్రాణులన్నింటియందూ నా ప్రతినిధిగ

(ప్రత్యగాత్మగ) నిలిచియుండే ఆత్మను నేనే'నని స్వయంగా చెప్పుకున్నాడు పరమాత్మ! జీవాత్మ, అంతరాత్మ యన్నా ఇదే. ఇదే మనకు ధర్మాధర్మాలను, కర్తవ్యాకర్తవ్యాలను సూచిస్తూ సదా ధర్మ-అర్థ-కామ-మోక్ష మార్గాన పయనించమని మనల్ని హెచ్చరిస్తుంటుంది.

ఊహాశ్రీ : ఈ విషయమై భగవద్గీత యింకా ఏం చెబుతున్నది తాతయ్యా?

వ్యాఖ్యాత : గీత (7-2) **జ్ఞానం తేహం విజ్ఞాన మిదమ్... గీత 6-5 ఉద్ధరేదాత్మ నాత్మానం** పరమాత్మనైన నేను నీలోని నిక్షిప్తంచేసినట్టి, విచక్షణాజ్ఞానం, విజ్ఞానం, అంతరాత్మల సహాయంతో నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి/ సంస్కరించుకోవాలి అని భావం. ఇది ఒక్క అర్జునునికే కాదు. ప్రతి వ్యక్తికీ వర్తిస్తుంది. పరమాత్మ యొక్క ఈ ఆదేశాన్ని పాటిస్తూ పరమగమ్యాన్ని చేరుకోవలసిందిగా ప్రతిమనిషినీ నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత!

హర్ష : వీటిని మనిషిలోనేనా లేక ప్రాణులన్నింటిలోనూ నిక్షిప్తం చేశాడా పరమాత్మ!

వ్యాఖ్యాత : ఈ జ్ఞాన, విజ్ఞానాలను మనుషుల్లోనే కాదు, ప్రాణులన్నింటా నిక్షిప్తం చేశాడు పరమాత్మ. ఉదాహరణకు మఱ్ఱిచెట్టునే తీసుకుందాం. దాని కొమ్మలు సుదూరంగా వ్యాపిస్తుంటాయి. ఆ కారణంగా దాని కొమ్మ దానికే బరువై విరిగిపోయే ప్రమాదముంది. అందుకని కొమ్మకొంతదూరం వ్యాపించగానే పరమాత్మ తనలో నిక్షిప్తం చేసిన జ్ఞాన సహాయంతో, అవసరమనుకున్నచోట సదరు కొమ్మ అడుగున వేరులను పుట్టించి, వాటిని సూటిగా భూమిలోకి చొచ్చుకెళ్ళేలా చేసి కాండంగా బలపరచుకొని వానిచే కొమ్మ భారాన్ని మోయించే ఉపాయాన్నిపన్నుతుంది మఱ్ఱిచెట్టు. అలా కొమ్మలు వ్యాపించే కొద్దీ అట్టి ఉపాయాన్నే మళ్ళీ మళ్ళీ అవలంబిస్తూ మైళ్ళకొద్దీ విస్తరిస్తుంటుంది మఱ్ఱిచెట్టు.

దేవాంశ్ : ఆహా! మనిషిలోనేకాదు, చరించలేని మట్టిచెట్టులో సైతం ఎంతటి అద్భుత జ్ఞానాన్ని నిక్షిప్తం చేశాడు పరమాత్మ! అలాగే మరికొన్ని మానవేతర ప్రాణుల్లోని జ్ఞానాన్ని గూడ వివరిస్తారా?

వ్యాఖ్యాత : గద్ద తన పిల్లలకెలా శిక్షణనిస్తుందో, లేక విద్యనెలా నేర్పుతుందో చెబుతాను వినండి. గుడ్డుపెట్టే సమయం రాగానే ఎత్తైన కొండ శిఖరం మీది కెళ్తుంది గద్ద జంట. మగగద్ద ముళ్ళనేరి తెచ్చి రాళ్ళ పగుళ్ళ మధ్యపేర్చి, వాటిపై చెత్తను తనకొన్ని ఈకలను అమర్చి మెత్తని గూడు నిర్మిస్తుంది. ఆడగద్ద అందులో గుడ్లుపెట్టి పొదుగుతుంటుంది. పిల్లలు బయటకు రాగానే మగగద్ద వాటి కాహారాన్నిసమకూర్చుతుంటుంది. పిల్లలు వయసు వారం రోజులు దాటగానే తల్లిగద్ద వాటికి శిక్షణ ప్రారంభిస్తుంది. ఒక్కో పిల్లను గూటినుండి కొండ క్రిందికి తోసేస్తుంటుంది. పిల్లగద్ద భయంతో అరుస్తూనే రెక్కలు విప్పి ఆడిస్తుంటుంది. వాటిలో కొన్నిగాల్లో ఎగరటం వల్ల కలిగే అనుభూతికి ఆనందిస్తూ, మళ్ళీ మళ్ళీ ఎగిరేందుకు యత్నిస్తూ స్వయంగా ఎగిరేందుకు సంసిద్ధమై పోతాయి. కానీ, కొన్ని పిల్లలు భయంతో ఎగరలేక కిందపడి పోతుంటాయి. మగ గద్ద రివ్వున వెళ్ళి పడిపోతున్న పిల్లల్ని తనవీపుపై ఎక్కించుకుని గూటికి చేర్చుతుంటుంది. అలా మూడు నాల్గుసార్లు జరిగాక అవీ ఎగరటం నేర్చుకోగల్గుతాయి. పిల్లల్ని గూట్లో నుండి తోసేశాక అవి ఎగిరి మళ్ళీ మళ్ళీ వచ్చి గూట్లోనే కూర్చుంటుంటాయి. అపుడు తల్లిగద్ద గూట్లోని చెత్తను, ఈకల్ని తీసేసి కేవలం ముళ్ళను మాత్రమే ఉంచుతుంది. మళ్ళీ మళ్ళీ గూట్లో కొచ్చిన పిల్లలకు ముళ్ళు గుచ్చుకోవటం వలన చికాకు కలిగి వాటంతటవే తిరిగి గూటిని వదిలి ఎగిరిపోతుంటాయి. అలా అవి స్వయంగా సమర్థవంతంగా ఎగరగలిగేలా తమ పిల్లలకు శిక్షణ నిస్తుంటుంది గద్దజంట. అట్టి జ్ఞానాన్ని వాటిలో నిక్షిప్తం చేశాడు పరమాత్మ. గద్ద తన పిల్లల కలా కఠోర శిక్షణనిస్తున్నదని తెలిశాక మీరేం గ్రహించారో చెప్పగలరా?

విరాజ్ ఉజ్వల్ : మమ్మల్ని తల్లిదండ్రులు, మానవుల్ని భగవంతుడు కష్టపెట్టడం ఎందుకంటే? చాలినంత శిక్షణనిచ్చి సరైన మార్గాన నడిపించటానికి, లక్ష్యాన్ని సాధింపచేయటానికేనని అర్థం చేసుకుంటున్నాం తాతగారూ.

యువన్‌తేజల్ : ఇప్పటిదాకా కేవలం మానవులు మాత్రమే తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు కాబోలనుకునేవాణ్ణి. కానీ, పశుపక్ష్యాదులుగూడ తమ బిడ్డలకు విద్య నేర్పించటం గూర్చి విన్నాక చాలా ఆశ్చర్యంగా ఆసక్తిగా గూడా ఉంది. దయచేసి యింకో ప్రాణిలో నిక్షిప్తమైయున్న జ్ఞానాన్నిగూడ వివరించరా తాతగారూ?

వ్యాఖ్యాత : పాములో నిక్షిప్తమై యున్న జ్ఞానాన్ని మీకు తెలియజేస్తాను వినండి. పాము అనేప్రాణి మన మానవ సమాజంలాగే నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. ఐతే పాము పెరిగినట్లు దాని చర్మం మాత్రం సాగదు ఈ కారణంగా నెలరోజులయ్యే సరికి పెరిగిన పాము, పెరగని చర్మం కారణంగా ఉక్కిరి బిక్కిరౌతుంటుంది. అప్పుడు దానికి కళ్ళుగూడ కనిపించని పరిస్థితి యేర్పడుతుంది. అస్థితినుండి బయట పడటానికి, పాము తన మూతిని ఏదోగట్టి వస్తువుకు రుద్ది చర్మం పొరకు రంధ్రం చేసుకుని, దాన్నొక పుల్లకు, తగిలించి ఒక్క ఉదుటున ముందుకు దూసుకెళ్తూ తన పాత చర్మం పొరను చింపేసుకుంటుంది. కొత్తగా రూపొందిన చర్మం క్రమంగా దళసరి యౌతూ పాము దేహాన్ని రక్షిస్తుంటుంది. ప్రతినెలా పాముకీస్థితి పునరావృత మౌతుంటుంది. నెలకోసారి సాగని తన పాత చర్మపు పొరను త్యజిస్తూ హాయిగా జీవనయాత్ర సాగిస్తుంటుంది పాము. అలా పాము వదిలేసిన చర్మపు పొరనే కుబుసమని అంటారు. ఈ సంఘటనను మన మానవ సమాజానికెలా అన్వయించుకోవచ్చో మీలో ఎవరైనా చెప్పగలరా?

హర్షవర్ధన్ : నేను చెబుతాను తాతగారూ – మనం మన సమాజ భద్రత కోసం, మానవులందరి అవసరాలు తీర్చుకోవటం కోసమని ఒక వ్యవస్థను

రూపొందించు కుంటాం. కొన్నాళ్ళకు పెరుగుతున్న జనాభాతోపాటు, వాళ్ళ అవసరాలుగూడ పెరుగుతుంటాయి. అవసరాలు తీరని ప్రజలలో ఆగ్రహావేశాలు పెరుగుతుంటాయి. ఆకారణంగా సమాజంలో కొట్లాటలు తిరుగుబాట్లు, విప్లవాలు చెలరేగుతాయి. అలా మానవులొకసారి కోరి నిర్మించుకున్న వ్యవస్థే సమాజ ప్రగతి కాటంకంగా మారిపోతుంది. అప్పుడు ప్రజలు తిరగబడి పాత వ్యవస్థను విచ్ఛిన్నం చేసి, తిరిగి కొత్త వ్యవస్థను నిర్మించుకుంటారు. అలా రూపొంది, అదృశ్యమైన వ్యవస్థలే గణతంత్ర, రాచరిక, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద, సామ్యవాద, ప్రజాస్వామ్య మొదలగు వ్యవస్థలు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా, "ప్రజా స్వామ్యయుతమైన సమసమాజాన్ని" కోరుకుంటున్నది అత్యధిక ప్రజానీకం. సదరు రామరాజ్యం కోసం ఎదురు తెన్నులు చూస్తున్నది మానవాళి.

రిత్విక్ : శభాష్! పాము దాని చర్మం సంఘటనను మన మానవ సమాజానికి చాలా చక్కగా, ఖచ్చితంగా అన్వయించి చెప్పినందుకు నీకు అభినందనలు హర్షవర్ధన్!

ఆదిత్య : ప్రాణుల్లో చైతన్యాన్నీ, జ్ఞానాన్నీ పరమాత్మ నిక్షిప్తం చేశాడన్న విషయం మాకిప్పుడు స్పష్టమైంది. అలాగే ప్రాణుల్లో శక్తిని గూడ నిక్షిప్తం చేశాడనటానికి ఆధారాన్ని వివరించగలరా తాతగారూ?

వ్యాఖ్యాత : ప్రాణులైనా, పదార్థాలైనా అసలువేటితో రూపొందాయో చెప్పగలరా?

అగస్త్య : ప్రాణులైనా, పదార్థాలైనా పరమాణువుల కుప్పలేనని చెబుతున్నది గదా సైన్సు.

వ్యాఖ్యాత : ఔను గదా, మరి పరమాణు గర్భాన్ని విచ్ఛిన్నం జేసినా, లేక రెండు పరమాణుగర్భాలను సంయోగ పరచినా, అపారమైనశక్తి జనిస్తుంది. అణుబాంబు హైడ్రోజన్ బాంబు ప్రయోగాలద్వారా సదరు వాస్తవాన్ని

నిరూపించింది గదా, సైన్సు! అలా పరమాణువులతోనే ఎంతో శక్తిని నిక్షిప్తం చేసి, వాటి ద్వారానే పదార్థాన్నీ, ప్రాణులనూ రూపొందించాడు పరమాత్మ. అలా అన్నింటిలోశక్తిని నిక్షిప్తం చేయగలిగాడు పరమాత్మయని మీకు స్పష్టమౌతున్నది గదా!

విద్యాధర్ : ప్రతి పదార్థంలో, ప్రతి ప్రాణిలో, చైతన్యంతో పాటు శక్తినిగూడ నిక్షిప్తం చేశాడు పరమాత్మ అన్న వాస్తవాన్ని మీరు మాకు సహేతుకంగా స్పష్టీకరించినందుకు మీకు చాలా చాలా ధన్యవాదాలు తాతగారూ! కానీ నాదొక సందేహం, **మనిషితో సహా ప్రతి ప్రాణిలోని ఆత్మ, మరియు పరమాత్మ వేరుకావు, అవి అద్వైతాలు అంటే ఒక్కటేనంటున్నారుగదా ఆదిశంకరాచార్యులు.** అందువలన పరమాత్మయొక్క లక్షణాలన్నీ, ప్రతిప్రాణిలోని ఆత్మకూ వర్తించాలి గదా కానీ సదరు చైతన్యము, చైతన్య లక్షణాలన్నీ పరమాత్మలో అపరిమితంగాను, ప్రాణుల్లో అతి పరిమితంగా ఉంటున్నవెందుకనీ?

వ్యాఖ్యాత : సముద్రం నుండి కొంత నీరు తీసి ఒకగిన్నెలో, బిందెలో, గంగాళంలో పెద్దతొట్టిలో నింపావనుకో అప్పుడా పాత్రలోని నీరు, సముద్రంలోని నీరు వేరు కావు, సముద్రపు నీటి లక్షణాలు పాత్రలలోని నీటి లక్షణాలూ ఒక్కటే, ఔనా?

సరే, ఇప్పుడా పాత్రలన్నింటినీ తీసుకెళ్ళి సముద్రపు ఒడ్డునే ఉంచుదాం. అప్పుడు పెనుగాలి వీస్తుందనుకో, సముద్ర జలంతో పాటు పాత్రలలోని నీరుగూడ అలలు అలలుగా ఎగిసిపడుతుంది. కానీ, పెద్దతొట్టిలో చెలరేగిన అలలతో సహా తక్కిన పాత్రలలో రేగిన అలలన్నింటినీ కలిపినా, సముద్రంలోని అతిచిన్న కెరటంతో కూడా సరితూగలేవు. ఎందుకనీ?

తరణ్ : ఎందుకంటే, పాత్రలలోని అలల్ని అడ్డుకోవటానికి పాత్రలనే హద్దులున్నాయి. సముద్రపుటలల్ని అడ్డుకోవటానికి భూమి హద్దుగా ఉన్నా

అది చాలా సువిశాలమైనది. అందువల్లనే సముద్రపు టలలు అపరిమితంగా, అపారశక్తివంతంగా ఉంటే పాత్రలలోని అలలు మిక్కిలి పరిమితంగానూ, మితమైన శక్తిమంతంగా ఉన్నాయి.

వ్యాఖ్యాత : చక్కగా గ్రహించావు తరణ్! అలాగే పరమాత్మ యొక్క చైతన్య శక్తిలక్షణాలు, జీవులలోని జీవాత్మ యొక్క చైతన్యశక్తి లక్షణాలూ ఒక్కటే ఐనప్పటికీ, జీవులకు దేహమనే హద్దు (ఉపాదానం) ఉన్నందున జీవాత్మ చైతన్యశక్తి చాలా పరిమితంగా ఉంటుంది. ఈ అంశాన్నే జవహర్లాల్ నెహ్రూ యిలా వివరించారు. ఉదాహరణకు కుండలోపలి ఆకాశం కుండ వెలుపలి ఆకాశమూ రెండూ అద్వైతాలే. ఐతే కుండ లోపలి ఆకాశం, కుండ అనే ఉపాదానం కారణంగా పరిమితంగానూ, కుండ వెలుపలి ఆకాశం ఉపాదానమే (హద్దు) లేని కారణంగా అపరిమితంగా ఉంటున్నదని అన్నారాయన.

వశిష్ఠ : మాకీ అంశం చాలా బాగా అర్థమైంది తాతగారూ, కానీ, నాకింకో సందేహం, అదేమిటంటే? విశ్వచైతన్యం యొక్క అనుభూతిని జ్ఞానులు, యోగులు, మహర్షులే గాని సామాన్యమానవులు పొందలేరు గదా, సామాన్యులు సైతం విశ్వచైతన్యాన్ని గుర్తించేందుకుపాయమేమైనా ఉందా?

వ్యాఖ్యాత : నీవడిగిన ప్రశ్నకు **డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్** యిలా జవాబిచ్చారు. విశ్వచైతన్యం ప్రతి మనిషి చైతన్యంలోనూ (అంతరాత్మగ) ఉండి నిరంతరం పని చేస్తుంటుంది. అందువల్లనే మనిషి దురాలోచనలు, దుష్టసంకల్పాలకు, స్వార్థ, మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడినప్పుడల్లా కనీసం ఒక క్షణకాలమైనా సరే ఆ మనిషి మనసు అసంతృప్తి, అపరాధ, న్యూనతా, పశ్చాత్తాప భావనలకు గురౌతుంటుంది. కాబట్టి, విశ్వచైతన్యం ఒక ఊహగానీ, తత్త్వశాస్త్ర నిర్మాణానికి వేసుకున్న ప్రాతిపదికగానీ కాదు. ప్రతి మనిషి కలా నిత్యజీవితంలో అనుభవానికొచ్చేదే ఈ విశ్వచైతన్యం. మత పరిభాషలో విశ్వాత్మ, పరమాత్మ, ఈశ్వరుడు, భగవంతుడు, దైవం

అని మనం పిల్చుకుంటున్నది యీ విశ్వచైతన్యాన్నే! ఐతే ఇది మనిషిలో అంతర్గతంగా ఉండేది కాబట్టి, కేవలం ఆంతరదృష్టితో, మనో నేత్రంతో, చింతన, లేక తపస్సు ద్వారా మాత్రమే మనం విశ్వాత్మను దర్శించగలమని చెప్పారాయన.

జయరామ్ : విరాజ్ అడిగిన ప్రశ్నకిది చాలా ఖచ్చితమైన జవాబు తాతయ్యా. ఎందుకంటే? **ఎవ్వరూ చూడకుండా తప్పుజేసిన మనిషి గూడ క్షణకాలమైనా అపరాధ, పశ్చాత్తాప, న్యూనతా (గిల్టీఫీలింగ్) భావనలకు గురౌతుంటారన్నది వాస్తవం. అంటే ఆ మనిషి లోపల ఎవరో ఉండి చూస్తూ, అదేంటి తప్పుచేస్తున్నావు? అంటూ అతన్ని నిలదీస్తూ ఉండి యుండాలి.** లేకుంటే రహస్యంగా తప్పుచేసిన వ్యక్తిలోగూడ కాసేపైనా సరే అలాంటి అపరాధ భావన ఎందుకు కలుగు తుంటుంది? ఈ విషయమై ప్రజాకవి వేమనగూడ యిలా అన్నారు.

"అంతరంగమందు అపరాధములు జేసి – మంచివాని వలెను మనుజుడుండు
ఇతరులెరుగకున్న ఈశ్వరుడెరుగడా – విశ్వదాభిరామ వినురవేమ"

వ్యాఖ్యాత : నీవు చక్కగా గ్రహించటమే కాక సామాన్యులకు సైతం చక్కగా అర్థమయ్యే వేమన పద్యాన్నిగూడ ఉదహరించి నందుకు నీకు చాలా చాలా అభినందనలు జయరామ్!

హిమాంశ్ : పరమాత్మ ఈ విశ్వాన్ని సృష్టించటానికాకారణమేంటి? లేక దీన్ని సృష్టించి నందు వలన ఆయనకు కలిగే లాభమేంటి తాతగారూ?

హర్ష : కవి కావ్యాన్నెందుకు సృష్టిస్తున్నాడు? ఇంజనీరు లేక శాస్త్రజ్ఞుడు యంత్రాన్నెందుకు సృష్టిస్తున్నాడు. వాటిని సృష్టించినందువలన వారికి కలిగే లాభమేంటి?

ఆరాధ్య : వినూత్నమైన దాన్ని, ప్రయోజనాత్మకమైన దాన్ని సృజించాలన్న తపన వల్లనే వాటిని రూపొందించారు వాళ్ళు. తను సృజించిన కావ్యం

ద్వారా కవి. తను నిర్మించిన యంత్రం ద్వారా ఇంజనీరు ఆనందాన్ని పొందుతుంటాడు. ఔనా తాతగారూ?

వ్యాఖ్యాత : చక్కగా గ్రహించావు ఆరాధ్యా! సృజించాలన్న తపన చైతన్యలక్షణం! ఆ తపన చేతనే పరమచైతన్య మూర్తియైన పరమాత్మ ఈ విశ్వాన్ని సృజించాడు. కావ్యాన్ని సృష్టించిన వానిని కవి అన్నట్లే, విశ్వకావ్యాన్ని సృష్టించిన విశ్వచైతన్యాన్ని గూడ కవి అనే సంబోధించింది ఋగ్వేదం. ఋక్ 10-31-3 **"కవిః కవిత్వా దివిరూపమాసజత్"** అంటే "కవి తన కవితాశక్తి (సృజనాత్మకశక్తి)తో ఇంతటి అందాన్ని అంతరిక్షంలో నిలిపి ఉంచాడు" అనిభావం.

కావ్య : పరమాత్మ తనను తానే విశ్వంగా మార్చుకున్నాడని యజుర్వేదం చెబుతున్నది. అంటే ఇక ఈ విశ్వమే దేవుడనీ, విశ్వానికి భిన్నంగా దేవుడు లేడని భావించవచ్చా తాతగారూ?

వ్యాఖ్యాత : అలా భావించరాదు. ఎందుకంటే? **"పాదోఽస్య విశ్వాభూతాని..."** అని ఉపనిషత్తులు, గీత 10-42 **"... ఇదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్"** అని భగవద్గీత చెబుతున్నాయి. అంటే తనలో ఒక భాగం (1/4) చేత మాత్రమే ఈ విశ్వాన్ని ధరించి దానియందు నిండి యున్నాడని భావం.

శ్రేష్ఠ : ఒక భాగం మాత్రమే విశ్వంగా రూపొంది మిగిలియున్న మూడు వంతుల పరమాత్మ యేం చేస్తుంటాడు తాతయ్యా?

వ్యాఖ్యాత : చూస్తూ వుంటాడు శ్రేష్ఠా! తను ప్రసవించిన బిడ్డ కదలాడుతుంటే, చూచుకుంటూ మురిసిపోయే తల్లిలా – తను సృష్టించిన విశ్వం చలిస్తూ పురోగమిస్తుంటే, చూస్తూ ఆనందిస్తుంటాడు పరమాత్మ గూడ. ఈ విశ్వాన్నలా సదా చూస్తుంటాడు గనుక పరమాత్మను 'సాక్షి', విరూపాక్షుడు, జ్ఞాననేత్రుడని, గూడ వ్యవహరిస్తుంటాం.

సాయికృత్తిక : విశ్వచైతన్యశక్తిలో (1/4) ఒకభాగం మాత్రమే విశ్వంగా రూపొంది మిగిలిన (3/4) భాగమంతా దాన్ని చూస్తూ ఆనందిస్తున్నాడంటే, అదెలాగో ఊహించలేకపోతున్నాం తాతగారూ?

వ్యాఖ్యాత : నీవొక గొప్ప డాక్టరు వైనట్లు, కేన్సర్ నిరోధక వాక్సిన్ కనుగొన్నట్లు, అందుకు **'పద్మవిభూషణ్'** బిరుదుతో ప్రభుత్వం నిన్ను సత్కరిస్తున్నట్లు కలగంటూ ఉంటావనుకో, అపుడు నీ మనసంతా కలగా మారిపోదుగదా, నీ మనసులో కొంత భాగం కలగంటూవుంటే, మిగిలిన నీ మనోభాగం ఆ కలను చూస్తూ ఆనందిస్తుంటుంది. ఔనా?

ఊహాశ్రీ : ఔను తాతయ్యా, మీరన్నట్లు మనసులో కొంతభాగం కలగంటుంటే, మిగిలిన మనోభాగం దాన్ని చూస్తూ అది మంచి స్వప్నమైతే ఆనందిస్తూ అది పీడకలయైతే భయపడుతూ, విషాదస్వప్నమైతే దుఃఖిస్తూ ఉంటుందన్నది వాస్తవం.

వ్యాఖ్యాత : శభాష్ ఊహాశ్రీ! పరమేశ్వరుడు గూడ అంతే. ఆయన తన చైతన్య శక్తిలో కొంత భాగాన్ని విశ్వంగా రూపొందించి, మిగిలిన భాగంతో దాన్ని చూస్తూ అది ధర్మమార్గాన పురోగమిస్తుంటే ఆనందపడుతూ సంతృప్తి చెందుతుంటాడు. అది అధర్మమార్గాన తిరోగమిస్తుంటే అసంతృప్తికి గురౌతాడు పరమాత్మ. ఆయన అంశతో జన్మించిన మనిషి గూడ తను జన్మనిచ్చిన బిడ్డలు సజ్జనులై, ప్రయోజకులై ప్రగతి పథాన పురోగమిస్తుంటే ఆనందిస్తూ లేక దుర్జనులై, వ్యర్థులై, పతన మార్గాన తిరోగమిస్తుంటే దుఃఖిస్తూ ఉంటాడు. అలాగే తను సృజించిన కావ్యమో, నిర్మించిన చలనచిత్రమో, విజయవంతమైతే సంతృప్తి చెందుతూ, విఫలమైతే అసంతృప్తికి గురౌతుంటాడు ఔనా?

హర్ష : మరి అసంతృప్తికి గురైన కవి, సృష్టికర్త అనే కవి యేంచేస్తారు తాతగారూ?

వ్యాఖ్యాత : తను సృజించిన కావ్యం, నాటకం, నవలలోని ఆదర్శ కథానాయికా, నాయకులద్వారా సమాజాన్ని ధర్మమార్గాన పయనించేలా ప్రభావితం చేసేందుకు యత్నిస్తుంటాడు కవి. ఆ లక్ష్యంతో రూపొందింపబడిన ఆ గ్రంథం అసంతృప్తిని కలిగిస్తే అందుకు కారణాలను, లోపాలకు గుర్తించి తన గ్రంథంలోని సంఘటనలు, సన్నివేశాలు, సంభాషణలు, పాత్రల స్వరూప, స్వభావాలు వగైరాలన్నింటినీ సవరిస్తూ, తనకు పూర్తిసంతృప్తి కలిగేదాకా వాటన్నింటినీ పలుమార్పులు చేర్పులకు గురిచేస్తూ, అంతిమంగా సురుచిర సుందర ప్రయోజనాత్మక కళాఖండంగా తన గ్రంథాన్ని తీర్చి దిద్దుతాడు కవి! **అలాగే సృష్టికర్త యనెడు కవిగూడ తన విశ్వకావ్యంలోనిప్రకృతిని, ప్రాణులను, మనుషులనూ పలు మార్పులు, చేర్పులకు గురిచేస్తూ అంతిమంగా తన విశ్వకావ్యాన్ని సత్య-జ్ఞాన-అనంద (సచ్చిదానంద) నిలయంగా తీర్చిదిద్దుతాడు పరమాత్మ!**

దేవాంశ్ : సూర్యాదినక్షత్రాలు, భూమ్యాది గ్రహాలు, సముద్రాలు, నదులు, అడవులు, మేఘాలు, మానవాళితో సహా సకల చరాచర ప్రాణులన్నీ వేటి పనులవి చేస్తూ మనుగడ సాగిస్తున్నవి గదా, మరింకా ఇక్కడ దేవుని ప్రమేయమేమున్నది తాతగారూ?

వ్యాఖ్యాత : మనిషిలోని గుండె, కాలేయం, శ్వాసకోశాలు, విసర్జనావయవాలు, కళ్ళు, చెవులు, కాళ్ళూ, చేతులూ వేటిపని నవి చేసుకుంటున్నవి గదా, మరింకా మనిషి ప్రమేయమేముందని అనవచ్చా?

విరాజ్ : అలా అనటానికి వీల్లేదు తాతయ్యా. ఎందుకంటే, సదరు అవయవాలన్నీ సక్రమంగా పనిచేయటానికి తగిన ఆహారాన్నందించాలి, వాటికి దెబ్బతగిలినా జబ్బుచేసినా తగిన వైద్యం చేయించాలి. ఎలాంటి ఆహారాన్నందించాలో, ఏయే మందులు వాడాలో ఆలోచించి, ఆయా నిపుణుల, వైద్యుల సహాయ సహకారాలతో వాటన్నింటినీ పోషించుకుంటూ, కాపాడుకుంటూ ఉంటున్నది మనిషిరూపంలోని చైతన్యశక్తే గదా?

వ్యాఖ్యాత : చాలా ఖచ్చితంగా చెప్పావు విరాజ్ చూడండి పిల్లలూ, ఈ విశ్వాన్ని కావ్యంతోను, సృష్టికర్తను కవితోను పోల్చి చెప్పినాయి. ఐతే మీ అందరి అవగాహన కోసం, మీకు ఆసక్తిదాయకంగా యుండటం కోసం ఈ విశ్వాన్ని చలనచిత్రం తోను సృష్టికర్తను దర్శక-నిర్మాత తోను పోల్చి చెబుతాను శ్రద్ధగా వినండి!

పిల్లలు : ఊ... అలా ఐతే త్వరగా చెప్పండి తాతగారూ...!

వ్యాఖ్యాత : దర్శకుడు కాక, ఇంకా 26 శాఖలవారు క్రమశిక్షణతో ఎవరి కర్తవ్యాన్ని వాళ్ళు నిర్వహిస్తేగాని ఒక చలనచిత్రం రూపొందదు. అందువల్లనే చూసే వారికక్కడ దర్శకుని ప్రమేయమేంటో అర్థంకాదు. ఉదాహరణకు 1. **నిర్మాత** నుండి నిధులు సేకరించి అన్నిశాఖల వారి, అవసరాలన్నింటికీ వెచ్చిస్తుంటాడు **ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్** 2. అన్ని శాఖల వారినీ సమన్వయపరుస్తుంటాడు **ప్రొడక్షన్ మేనేజర్** 3. సినిమాకు కథ, **స్క్రీన్‌ప్లే,** మాటలు, పాటలను వ్రాస్తారు సినీరచయితలు 4. నటీనటులాయా పాత్రలలో నటిస్తుంటారు. 5. **డ్యాన్స్ మాస్టర్** నృత్యాలను 6.**ఫైట్‌మాస్టర్** ఫైటింగులను 7. **ఆర్ట్ డైరెక్టర్ సెట్టింగ్‌లను** 8. **లైట్‌మేన్ లైటింగును** 9. **కాస్ట్యూమ్ డిజైనర్** దుస్తులను సమకూర్చుతుంటారు. 10. **సినిమాటోగ్రాఫర్** చిత్రీకరిస్తుంటాడు 11. **ఆడియోగ్రాఫర్** మాటల్ని, పాటల్నిరికార్డు చేస్తుంటాడు. 12. **డబ్బింగ్** కళాకారులు డబ్బింగ్ చెబుతుంటారు 13. **ఎడిటింగ్** కళాకారుడు **అవసరంలేని ఫిల్ములను కత్తిరించి,** అవసరమైన వాటన్నింటినీ ఒక క్రమంలో అతికిస్తుంటాడు. **ఎడిటింగ్** అంటే అదే. ఇలాగే మిగిలిన శాఖల వారందరూ ఎవరి విధుల్ని వాళ్ళు నిర్వహిస్తుంటారు. అందువల్లనే దర్శకుడు కేవలం నిమిత్తమాత్రు డేననిపిస్తుంటుంది. కానీ, అది వాస్తవంకాదు. యిలా 26 శాఖల వారందరూ చేస్తున్న కృషి అంతా అంతిమంగా ఎలా ఆవిష్కృతం కావాలో, ఆ పరిపూర్ణ రూపం, దర్శకుని భావనలో ముందే నిశ్చయమై ఉంటుంది. అట్టి తన భావన సంపూర్ణంగా సాకార మయ్యేంత దాకా సదరు శాఖల వారందరిచేతా మళ్ళీమళ్ళీ కృషిచేయిస్తూనే ఉంటాడు దర్శకుడు!

అలాగే విశ్వచలనచిత్ర దర్శకుడైన పరమాత్మగూడ తన భావనలో ముందే నిశ్చయమై యున్న విధంగా విశ్వచలనచిత్రం సచ్చిదానంద నిలయంగా రూపొందేంతవరకు తన సృష్టిలోని ప్రతి పదార్థాన్నీ ప్రతిప్రాణినీ, ప్రతిమనిషినీ, ప్రకృతి యంతటినీ నిరంతరం పలు మార్పులు చేర్పులకు గురిచేస్తూ, అద్భుత, అపూర్వ కళాఖండంగా రూపొందేంతవరకు యీ విశ్వ చలనచిత్రానికి మెరుగులు దిద్దుతూనే ఉంటాడు పరమాత్మ అనే దర్శకనిర్మాత! ఇంకా మీరు గ్రహించవల్సిన ముఖ్యవిషయమేమంటే?

1. విశ్వ చలనచిత్రానికి రూపకల్పన చేస్తున్న కవి 'బ్రహ్మ'!
2. విశ్వచలన చిత్ర నిర్మాణంలో భాగస్వాములైన వారందర్నీ పోషించే నిర్మాత, దిశానిర్దేశం చేసే దర్శకుడు అంటే **దర్శక నిర్మాత 'విష్ణువు'!**
3. విశ్వచలన చిత్రానికవసరం లేవనుకున్న వాటిని తొలగించి, అవసరమైన వాటన్నింటినీ ఒకక్రమంలో జతపరిచే **ఎడిటర్ 'శివుడు'.**

బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులనెడి యీ మూడు ప్రధాన పాత్రలను నిర్వహిస్తున్నది పరమాత్మయే. ప్రాణుల్లోని గుండె–కాలేయం–శ్వాసకోశాలు, విసర్జనావయవాల వలెనే తన సృష్టిలోని సమస్త గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు వగైరాలన్నీ స్వచ్ఛందంగా క్రమశిక్షణతో పనిచేసేలా వాటన్నింటిలోను, సకల చరాచర జీవరాసులన్నింటిలోనూ చైతన్యశక్తిని నిక్షిప్తం చేసి నియంత్రిస్తున్నది, నడిపిస్తున్నది, విశ్వచైతన్యశక్తేనని నేడు ఆధ్యాత్మికవేత్తలే గాదు పలువురు శాస్త్రజ్ఞులు గూడ నిర్ధారించారు.

యువన్ : మనిషిలో జ్ఞానాన్నీ అంతరాత్మనూ నిక్షిప్తం చేసి వాటి సహాయంతో మనల్ని మననే సంస్కరించుకోమని, లేదా ఉద్ధరించుకో మని చెబుతున్న గీతాంశం స్పష్టంగా అర్థమైంది తాతగారూ కానీ... విశ్వం తనంతట తాను మనగలిగేలా కోట్ల రకాల సజీవ, నిర్జీవ పదార్థాలవతరించేలా అవన్నీ వేటి పని అవి చేసుకుంటూ తమ ఉనికిని కాపాడుకునేలా చేసేందుకు పరమాత్మ

రూపొందించుకున్న మహత్తరమైన ప్రణాళికా రచనను గూర్చి క్లుప్తంగా నైనా వివరించగలరా తాతగారూ?

వ్యాఖ్యాత : చెబుతాను యువన్, కాకుంటే అనంత విశ్వనిర్మాణానికి పరమాత్మ రూపొందించుకున్న సముద్రమంత ప్రణాళికలోని కేవలం కొన్ని నీటి బిందువులన్ని అంశాలను మాత్రమే మీకు వివరించగలను సుమా!

హర్ష : ఆ మాత్రమైనా చాలు తాతగారూ! అద్భుతమైన ఆయన ప్రణాళికలోని ఒకటి రెండంశాలనైనా తప్పక తెల్సుకోవాలని మా మనసు తహతహలాడుతున్నది తాతగారూ?

జయరామ్ : ముందు నాకీ విషయం చెప్పండి తాతయ్యా! మనం నిర్మలమైన మనసుతో మనకేం కావాలని ప్రార్థించినా పరమేశ్వరుడు వాటిని మనకు ప్రసాదిస్తాడని మా అమ్మమ్మ, తాతయ్యా చెప్పారు. మరి అది నిజమేనా?

విశ్వసృష్టికి పరమాత్ముని ప్రణాళిక

వ్యాఖ్యాత : మనం యేంకావాలని ప్రార్థించినా వాటిని మనల్నే సంపాదించు కోమంటూ, మనకు కేవలం దారి చూపుతాడు దేవుడు! అదెలాగో చూడండి.

"మాకు శక్తి నిమ్మని ప్రార్థిస్తే – కష్టాలు కలిగించి వాటిని తట్టుకో మంటాడు!

తెలివిని ప్రసాదించమంటే – సమస్యల్ని సృష్టించి పరిష్కరించుకో మంటాడు!

ధైర్యాన్నిమ్మంటే – ఆపదలు కల్పించి వాటినధిగమించమంటాడు!

సంపద నిమ్మంటే – బుద్ధిని, బలాన్నిచ్చి సంపాదించుకోమంటాడు!

గొప్ప విద్యను ప్రసాదించమంటే – ప్రకృతి బడిలో, అనుభవాల గురువుల నాశ్రయించమంటాడు!

ఉపాధి చూపమంటే – విద్యను, అవకాశాలనూ వినియోగించు కోమంటాడు!

కీర్తి, ప్రతిష్ఠలను కోరితే – నీతి, నిజాయితీలతో పదిమందికోసం పాటుపడ మంటాడు!

సన్మార్గాన నడిపించమంటే – సదా అంతరాత్మ ఆదేశానుసారం నడుచుకోమంటాడు!

లక్ష్యసాధనామార్గాన్ని చూపమంటే – తెలుసుకుని చేయి, తెలుసుకోమంటాడు!

నీసేవా భాగ్యాన్ని కలిగించమంటే – ప్రకృతిని, ప్రాణుల్నీ, సాటి మనుషుల్నీ సేవించమంటాడు!

సిసలైన నీపూజా విధానాన్ని తెల్పమంటే – విధి నిర్వహణకు మించిన ఈశ్వరపూజ లేదంటాడు!

మాకు పుష్టిని కలిగించమంటే – ముందు తనను తృప్తి పరచమంటాడు!

మమ్ము కాపాడుతండ్రీ యంటే – ధర్మాన్ని కాపాడుకోండి, అది మిమ్ము కాపాడుతుందంటాడు!

అత్యుత్తమ జ్ఞానాన్ని ప్రసాదించమంటే – అంతటా, అన్నింటా ఉన్నదితనేనని తెలుసుకోమంటాడు!

పాపపుణ్యాలంటని ఉపాయాన్ని తెల్పుమంటే – ఫలాపేక్ష రహితంగా తన కర్పించి పనులు చేయమంటాడు!

మానవోత్తమునిగ రూపొందించమంటే – సత్సంకల్పాల పైరునుండి దురాలోచనల పిచ్చిమొక్కల్ని పీకేసుకోమంటాడు!

మానవాళి సుఖశాంతుల కభయమిమ్మంటే – సదా 'ధర్మార్థ కామ మోక్షమార్గా'న పయనించమంటాడు!

విన్నారుగా పిల్లలూ, మనమేం కోరినా తానుగా మనకివ్వడు పరమాత్మ. మనకు కావలసిన వాటన్నింటినీ సృష్టించి వుంచి, కావలసిన వాటి నెంచుకుని, వాటిని పొందగలిగే చైతన్యాన్నీ, విచక్షణ జ్ఞానాన్నందించే, అంతరాత్మ అనే గురువును మనలో ప్రతిష్ఠించి, తద్వారా మానవాళిని స్వయం సాధకులుగ, స్వయం సముద్ధారకులుగ, స్వయం సంస్కారులుగ రూపొందించేందుకు, పరమాత్మ రచించుకున్న సృష్టి ప్రణాళిక యిదే! సదరు ప్రణాళికానుగుణంగా మసలుకుంటూ ఎవర్నివారే ఉద్ధరించుకోవాలి, సంస్కరించుకోవాలి. శోధించి సాధించుకోవాలంటూ ప్రబోధిస్తున్నది శ్రీమద్భగవద్గీత!

ఆదిత్య : సృష్టిని, సృష్టికర్తను గూర్చి, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ఏమి చెబుతున్నవో వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఋగ్వేదం చెబుతున్నట్లు విశ్వాన్ని అందంగానేగాదు, స్వయంగా చలిస్తూ పురోగమించే విధంగానూ విశ్వాన్ని రూపొందించాడు పరమాత్మయని చెబుతున్నది యజుర్వేదం. **"సోఽకామయత । బహుస్యాం ప్రజాయేతి । సతపోతప్యత।సతప్తత్వా ఇద్గ్ం సర్వమసృజత । యదిదం కించ ।"** తాననేకముగ కావాలని సంకల్పించాడు పరమాత్మ. నన్ను నేనే అనేకముగ రూపొందించుకొందునుగాక యని తపస్సు చేశాడు. తపస్సుచేసి (ఒకనిశ్చయానికొచ్చి)న అనంతర మీ విశ్వాన్ని సృజించాడు పరమాత్మ" యంటున్నది యజుర్వేదం.

ఇదే అంశాన్ని భగవద్గీత ఇలా చెబుతున్నది గీత –10–42 **అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే** – అంటే అన్నింటికీ ఉత్పత్తిస్థానం నేనే. నానుండే సర్వమూ (విశ్వమంతా) ఉద్భవిస్తున్నది అనిభావం. విశ్వసృష్టిని గూర్చి వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతాది గ్రంథాలు చెబుతున్న సారాంశమిదీ.

సచ్చిదానందాల నిలయమైన విశ్వచైతన్యం – చిచ్చుబుడ్డి వెలుగుల్ని విరజిమ్మినట్లు తన చైతన్య శక్తిని కాంతి వేగంతో అంతరిక్షంలోకి వెదజల్లాడు.

తపస్సుచేసి మరీ ఆయన రూపొందించుకున్న సృష్టి ప్రణాళికానుగుణంగానే 1. ఆయనచే వెదజల్లబడిన చైతన్యశక్తి అంతా వాయుమేఘాలుగ మారి సుడులు తిరగటం ప్రారంభించినాయి. 2. అవన్నీ క్రమబద్ధంగా తమచుట్టూ తాము తిరుగుతూనే మరోపెద్ద మేఘం చుట్టూను, ఆ పెద్ద మేఘం గూడ తనచుట్టూ తాను తిరుగుతూనే మరో పెద్ద మేఘం చుట్టూరా పరిభ్రమించటం ప్రారంభించినాయి. 3. పదార్థాలు రూపొందటానికవసరమైన పరమాణువులు, పరమాణువులలోని ప్రోటాన్, ఎలక్ట్రాన్ల సంఖ్యా భేదం ద్వారా 92 మూలకాలు, మూలకాలు భిన్న నిష్పత్తులలో కలవటం ద్వారా విభిన్న సజీవ, నిర్జీవ పదార్థాలు రూపొందే చైతన్యాన్ని 4. అలాగే తరంగ ధైర్ఘ్య భేదాల ద్వారా వివిధ రంగులు, ఎక్సరేలు, వగైరాలు రూపొందటాని కవసరమైన కాంతి, విద్యుదయస్కాంత తరంగాలనుగూడ సదరు వాయుమేఘాలలోనే నిక్షిప్తం చేసి ఉంచాడు పరమాత్మ. 4. ఆ చైతన్యశక్తి మేఘాలన్నీ వాటి వాటి పరిమాణాన్నిబట్టి ఒక్కో మేఘం 'నక్షత్ర కుటుంబం'గాను ఒక్కోమేఘం 'నక్షత్ర మరియు గ్రహకుటుంబం' గాను రూపొందినాయి. **'నక్షత్ర కుటుంబా'నికి పాలపుంత! 'నక్షత్ర గ్రహకుటుంబా'నికి సూర్యకుటుంబం!** ఉదాహరణలు.

అగస్త్య : ఒకే వాయుమేఘం నుండి కేవలం నక్షత్రకుటుంబ మేర్పడటంలో సందేహించాల్సిందేమీ లేదు. కానీ, ఒకే వాయు మేఘం నుండి దేదీప్యమానంగా ప్రకాశించే నక్షత్రం, చీకటి ముద్దల్లాంటి గ్రహాలూ రూపొందాయంటే విశ్వసించేదెలా తాతగారూ?

వ్యాఖ్యాత : అదెలా జరిగిందో వివరిస్తాను విను – సూర్యకుటుంబానికి మూలమైన పెద్ద వాయుమేఘం తనచుట్టూ తాను అమితవేగంగా పరిభ్రమిస్తున్నందువలన సదరు మేఘంమధ్యలో పెద్ద డిస్క్ రూపొంది, ఘనీభవించటం ప్రారంభించింది. డిస్క్ కేంద్రంలోని గురుత్వాకర్షణ శక్తి కారణంగా మేఘంలోని అత్యధిక 99.85% పదార్థమంతా డిస్క్‌వద్ద

కాకర్షింపబడి ఘనీభవించి సూర్యుడనే పెద్ద ముద్దగా రూపొందింది. అధిక పదార్థం ఘనీభవించిన కారణంగా ఆ ముద్దలో వేడిమి పెరిగి, పెరిగి తారస్థాయికి చేరింది. ఆ కారణంగా ఆ ముద్దలో అత్యధికంగాఉన్న హైడ్రోజన్ యొక్క పరమాణువులలో గొలుసుకట్టు సంయోగక్రియ ప్రారంభమైంది. అంటే అది హైడ్రోజన్ బాంబు పేలేటపుడు జరిగే చర్యన్నమాట. అట్టి చర్య సూర్యునిలో నిరంతరం జరుగుతుంటుంది. **సూర్యుని వంటి నక్షత్రాలన్నీ స్వయం ప్రకాశాలవటంలోని మర్మమిదే!**

ఇక సూర్యుని గురుత్వాకర్షణకు లొంగక దూరంగా మిగిలిపోయిన 0.15% మేఘపదార్థం గూడ అక్కడొకముద్ద, అక్కడోముద్దగ ఘనీభవించింది. ఆ ముద్దలే గ్రహాలు, దీన్ని బట్టి మనకు స్పష్టమౌతున్న దేమంటే? చైతన్యశక్తి యొక్క మేఘాలలోని అత్యధిక పదార్థం ఘనీభవించి రూపొందిన పెద్ద పెద్ద ముద్దలు నక్షత్రాలుగాను, వాటితో పోలిస్తే అతిచిన్న ముద్దలు గ్రహాలుగ రూపొందే స్వభావాలన్నిగూడ పరమాత్మ సదరు వాయుమేఘాలలోనే నిక్షిప్తం చేసి ఉన్నట్లు మనకు స్పష్టమౌతున్నది. ఔనా పిల్లలూ?

అన్వేష్ : ఔను తాతయ్యా ఇపుడు నా సందేహం పటాపంచలైంది.

తరణ్ : ఒకే చైతన్య శక్తితో రూపొందింది గదా విశ్వం. మరి భూమిమీది సమస్త, సజీవ, నిర్జీవ పదార్థాలన్నింటికీ ఆధారమైనట్టి 92 మూలకాలు విశ్వమంతటా ఉండాలి గదా? భూమిమీద లాగే విశ్వమంతటా ప్రాణులు వర్ధిల్లుతుండాలి గదా? కానీ, అలా ఎందుకని జరుగలేదు?

వ్యాఖ్యాత : భూమి, ఆకాశం, అగ్ని, వాయువు, నీరు అనే పంచభూతాలే ప్రాణుల ఆవిర్భావానికి మూలమన్నారు మన మహర్షులు. కానీ, **మెండలీన్ వంటి ఆధునిక శాస్త్రజ్ఞులు మాత్రం ప్రాణులతో సహా సమస్త విశ్వావిర్భావానికి మూలం 92 ధాతువులేనని నిర్ధారించారు.** ఈ 92 ధాతువులూ కేవలం

భూమిమీదనే కాదు, విశ్వమంతటా వ్యాపించి ఉన్నాయి. ఐతే ఆయాచోట్ల వాటి ఉనికి యొక్క నిష్పత్తిలో తేడాలున్నాయి. అవి –

ఉదా : 1. నక్షత్రాల మధ్య శూన్యంగా కనిపిస్తున్న అంతరిక్ష మంతటా 92 ధాతువుల యొక్క నిష్పత్తి యిలా వుంది. 1. హైడ్రోజన్ ధాతువు 90% 2. హీలియం ధాతువు 9% మిగిలిన 90 ధాతువులన్నీ కలిసి కేవలం 1%గా వ్యాపించి ఉన్నాయి.

ఉదా : 2 అవే ధాతువులు భూమ్మీద యీ నిష్పత్తిలో వ్యాపించి ఉన్నాయి. 1. వాతావరణంతో సహా భూమిమీద ఆక్సిజన్ 40%, సిలికాన్ 36%, అల్యూమినియం 8%, ఇనుము 4%, కాల్షియం 3%, సోడియం 3%, పొటాషియం 2%, మెగ్నీషియం 2% మిగిలిన 84 మూలకాలన్నీ కలిపి కేవలం 2%గా వ్యాపించి ఉన్నాయి. భూమిమీద వ్యాపించి ఉన్నట్లు ఇదే నిష్పత్తిలో 92 మూలకాలు వ్యాపించియున్న గ్రహంలో మాత్రమే ప్రాణులు మనగలుగతాయని మనకు స్పష్టమౌతున్నది.

వశిష్ఠ : మరి ప్రపంచ మంతటా ప్రాణులను వర్ధిల్లచేసేందుకు భూమిమీద వ్యాపించియున్న నిష్పత్తిలోనే యీ 92 మూలకాలను వ్యాపింపజేయవచ్చు గదా పరమాత్మ?

వ్యాఖ్యాత : చూడు వశిష్ఠా! ఒక రైతుకు పదెకరాల పంట భూమి ఉంది. అతను అంతకు ముందెన్నడూ పండించి యుండని ఓ సరికొత్తపంటను పండించాలని ఉత్సాహపడ్డాడు. ఐతే గతంలో సదరు పంటనుగూర్చి తనకు అనుభవం లేనందున మొదట ఆ పంటను కేవలం ఒక ఎకరా భూమిలో మాత్రమే పండించి, అక్కడ విజయవంతం అయ్యాక అపుడు మిగిలిన 9 ఎకరాలలోనూ పండించాలని భావించాడు. అలాగే ఒక్క భూగ్రహం మీద మాత్రమే సాగుచేస్తున్న ప్రాణులనెడి అపూర్వమైన ఈ పంటను యిక్కడ విజయవంతమయ్యాక దీనిని క్రమక్రమంగా గ్రహాంతరాలకు,

సూర్యకుటుంబాంతరాలకు అనంతరం విశ్వమంతటా విస్తరింప జేయదలిచాడేమో పరమాత్మ అనే కృషీవలుడు.

జయరామ్ : ఈ 92 మూలకాలెలా ఏర్పడ్డాయో తెలిసింది. కానీ, ఒకే ధార్మికశక్తి తరంగం, కాంతి-వేడి-ఎక్స్‌రే-వైర్లెన్-కాస్మిక్-మరియు పలు రంగుల కిరణాలుగా ఎలా రూపొందుతున్నదో వివరించగలరా తాతగారూ?

వ్యాఖ్యాత : ధార్మిక శక్తి సూర్యునినుండి భూమిమీదికి అటు తరంగాలుగ, ఇటు కిరణాలుగ ప్రసరిస్తుంటుందన్న సంగతి మీకు తెలిసిందే. పరమాణువులోని ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల సంఖ్యలో తేడాద్వారా వివిధ ధాతువులుగ, సదరు మూలకాల కలయిక ద్వారా వివిధపదార్థాలు రూపొందే స్వభావం చైతన్యశక్తిలో నిక్షిప్తమై ఉన్నట్లే తరంగాల పరిమాణంలో తేడాల ద్వారా ఒకే ధార్మిక శక్తి వివిధ కిరణాలుగ రూపొందే స్వభావం గూడ చైతన్యశక్తిలో నిక్షిప్తమైయున్నట్లు మనకు యీ ఉదాహరణలు నిరూపిస్తున్నాయి.

ఉదా॥ 1/1లక్ష అంగుళం పరిమాణం గల తరంగం... ఎరుపురంగు కిరణం

1.5/1లక్ష అంగుళం పరిమాణం గల తరంగం ... నీలిరంగు కిరణం

(ఇలాంటి తేడాలతో యింకా వివిధ రంగుల కిరణాలు రూపొందాయి)

1/100 అంగుళం పరిమాణం గల తరంగం... ఉష్ణకిరణం

3/10 కోట్లు అంగుళం పరిమాణం గల తరంగం... ఎక్స్‌రే కిరణం

0.5/10 కోట్లు అంగుళం పరిమాణం గల తరంగం... కాస్మిక్ కిరణం

1 మైలు పరిమాణం గల తరంగం... వైర్లెస్ కిరణం

ఇలా తరంగ పరిమాణ భేదాల ద్వారా ఒకే ధార్మిక శక్తి తరంగాలు వివిధ కిరణాలుగ రూపొందుతున్నాయి.

హిమాంశ్ : మనం ఒకేసారి అనేక రంగుల్ని చూడగల్గుతున్నాం గదా, మరి అన్నిరంగుల కిరణాలన్నీ కలిసే పయనిస్తుంటాయా తాతగారూ?

వ్యాఖ్యాత : ఔను సుధీర్! ఒకే వాయువులో ఆక్సిజన్, హైడ్రోజన్, నైట్రోజన్, కార్బన్‌డైయాక్సైడ్ వగైరాలన్నీ కలిసే పయనిస్తున్నట్లు ప్రతి చదరపు అంగుళం గుండా కాంతి కిరణాలు + వస్తువుల ఉండి వెలువడే కిరణాలు + వివిధ రంగుల కిరణాలు + నక్షత్ర కిరణాలు + వైర్లెస్ కిరణాలు + ధ్వని తరంగాలు మొదలగునవన్నీ కలిసే పయనిస్తుంటాయి. ఐనప్పటికీ అవి ఒకదాన్నొకటి ఆటంక పరచుకోవు మరి!

మనం 56 అక్షరాలతో సాహిత్యాన్నంతటినీ సృష్టించుకున్నట్లే- 92 మూలకాలు, కొన్ని రకాల కిరణాల ద్వారా రంగు, రంగుల అందాల విశ్వాన్ని సృష్టించాడు పరమాత్మ!

ఆరాధ్య : పరమాత్మ రూపొందించుకున్న సృష్టి ప్రణాళిక పరమాద్భుతంగా ఉంది తాతయ్యా కానీ. గీత 4-8లో **"పరిత్రాణాయ సాధూనాం... సంభవామి యుగేయుగే"** అంటున్నది భగవద్గీత. అసలు దుర్మార్గుల్ని పుట్టించట మెందుకు? తిరిగి వాళ్ళను నశింపజేయటమెందుకు? అందర్నీ మంచివాళ్ళగనే పుట్టించవచ్చు గదా?

వ్యాఖ్యాత : మీ కింతకుముందే చెప్పానుగదా పరమాత్మ ఒక ప్రణాళికా బద్ధంగా ఈ విశ్వాన్ని రూపొందించాడని అదిగో నదరు ప్రణాళికానుగుణంగానే ప్రతి పదార్థాన్ని ప్రతిప్రాణినీ పాజిటివ్ ప్రోటాన్లు, మరియు నెగెటివ్ ఎలక్ట్రాన్లు కలిగియున్న పరమాణువులతో సృష్టించాడాయన. అందువల్లనే **పంటచేనిలో ప్రయోజనాత్మకమైన పంటతో పాటు, పంటను చెడగొట్టే కలుపుమొక్కలు గూడ కలిసిపెరుగుతున్నట్లే ప్రతి మనిషిలోనూ అనుకూల సద్భావనలతోపాటు వ్యతిరేక దుష్టసంకల్పాలు**

కలిసే వర్ధిల్లుతుంటాయి. ఐతే తన పంట పొలంలోని కలుపు మొక్కల్ని పెరికేసుకోగల్గిన రైతు మేలైన పంటను పండించి ఉత్తమ రైతుగా నిలుస్తాడు! అలాగే తన మనసనే పొలంలోని దుష్టసంకల్పాల కలుపు మొక్కల్ని పెరికేసుకోగల్గిన వ్యక్తి సదాశయాల పంటను బాగా పండించి మంచి మనిషిగ, క్రమంగా మానవోత్తమునిగ ఎదుగుతాడు.

కావ్య : ఔను! కలుపు మొక్కల్ని నిర్మూలించి పైరును కాపాడుకున్నట్లే, దుర్జనుల్ని నిర్మూలించి, సజ్జనులను తద్వారాసమాజాన్ని పరిరక్షిస్తుంటాడు పరమాత్మ. ధర్మాన్ని కాపాడుకుంటే, ఆ ధర్మమే మనల్ని కాపాడుకుంటుందన్న జ్ఞానాన్ని మనలో నిక్షిప్తంచేసి, ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రత్యగాత్మ ద్వారా సదా మనల్ని ప్రోత్సహిస్తుంటాడు పరమాత్మ. ఇదంతా ఆయన రూపొందించుకున్న సృష్టి ప్రణాళికలోని భాగమే. అందువలన ఆరాధ్య భావిస్తున్నట్లు యీ సృష్టి ప్రణాళికను కేవలం మంచివాళ్ళు మాత్రమే పుట్టే విధంగా మార్పు చేయటమంటే? చెత్త సాహిత్యాన్ని రూపొందించుకోటానికి వీల్లేకుండా, కేవలం మంచి సాహిత్యాన్ని మాత్రమే సృజించుకునే విధంగా 56 అక్షరాల భాషా ప్రణాళికను మార్పుచేయటం వంటిదే. దీన్ని బట్టి చూస్తే పరమాత్మయొక్క దుష్టశిక్షణ, శిష్టరక్షణా కార్యక్రమం చక్కని ప్రణాళికాబద్ధమైనదేనని స్పష్టమౌతున్నది తాతయ్యా!

శ్రేష్ఠ : సాహిత్య సృష్టికి 56 అక్షరాల భాషా ప్రణాళికయెలా అద్వితీయమైనదో, పరమాత్మయొక్క సృష్టి ప్రణాళిక గూడ తిరుగులేనిది. 56 అక్షరాలతోనే రూపొందుతున్న ప్రగతి నిరోధక సాహిత్యాన్ని నిషేధించుకుంటూ అవార్డులు, రివార్డుల ద్వారా ప్రగతిదాయక సత్సాహిత్యాన్ని మనం ప్రోత్సహించు కుంటున్నట్లే దుర్మార్గుల్ని నిర్మూలించుకుంటూ, మంచివారిని రక్షించుకుంటూ మన మానవ సమాజాన్ని పరిరక్షించుకోటానికి మనం సదా అర్జునునిలా పాటుపడుతుంటే శ్రీకృష్ణునిలా మనధర్మపోరాటాన్ని సదా బలోపేతం

చేస్తుంటాడు పరమాత్మ! అలా ధర్మాన్ని కాపాడుకుంటూ తద్వారా మనల్ని మనమే కాపాడుకోవాలంటూ ఆయనే మనలో అంతరాత్మగ ఉంటూ సదా మనల్ని నిర్దేశిస్తున్నాడు! అందువలన ఆయన సృష్టి ప్రణాళిక అర్ధవంతం, అద్భుతమైనదే కాదు, తిరుగులేనిది కూడా! అందుకే సృష్టికర్త ప్రణాళికాను గుణంగా, ఆయన ఆదేశానుసారమే నడుచుకుంటూ మనల్ని మనం కాపాడుకుంటూ, మానవోత్తములుగ రూపొందించుకుంటూ పరమాత్మ ఆశయాన్ని నెరవేర్చటమే మనందరి కర్తవ్యం ఔనా తాతగారూ?

వ్యాఖ్యాత : శభాష్ పిల్లలూ చక్కగా గ్రహించారు.

సాయికృత్తిక : వ్యతిరేక శక్తులాకర్షించుకుంటాయి. అనుకూల శక్తులు వికర్షించుకుంటాయి. అంటున్నది గదా సైన్సు. మరి ధనవిద్యుదావేశం గల ప్రోటాన్లు వికర్షించుకోకుండా అణుకేంద్రంలో యెలా కలిసి ఉంటున్నాయి? తాతగారూ!

వ్యాఖ్యాత : ఇది తప్పక తెల్సుకోవలసిన అంశమే. అణుగర్భంలో ప్రోటాన్లు న్యూట్రాన్లతో పాటు మీజాన్స్ అనే శకలాలు గూడ ఉన్నవని **'యుకావా'** అను జపాన్ శాస్త్రవేత్త ప్రయోగపూర్వకంగా నిరూపించాడు. ఈ మీజాన్లలో **పైయాన్లు** అనబడేవి, ప్రోటాన్ల నుండి న్యూట్రాన్లకు, న్యూట్రాన్ల నుండి ప్రోటాన్లకు అమితవేగంగా బదిలీఅవుతుంటాయి. వేగవంతమైన వీటి బదిలీ ప్రక్రియ ధృఢమైన బంధన శక్తి గా మారుతుంది. ప్రోటాన్ల వికర్షణ శక్తికన్నా, పైయాన్ల బంధనశక్తి బలీయం కావటం వలన ప్రోటాన్లు విడిపోకుండా న్యూట్రాన్లతో కలిసియుండగల్గుతున్నవని యుకావా నిర్ధారించాడు!

ఊహాశ్రీ : ఎలక్ట్రాన్లవలె చరించకుండా స్థిరంగా ఉంటున్నవంటే వాటికి బరువుండి తీరాలి గదా ? మరి ఎలక్ట్రాన్లకు లేనిబరువు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల కెలా చేకూరింది?

వ్యాఖ్యాత : పైయాన్ల వలెనే ప్రోటాన్, న్యూట్రాన్ల మధ్య అటూ యిటూ చలిస్తుండే బాసన్లు కూడా ఉన్నాయి. అవి చలిస్తూ చలిస్తూ సమీప ప్రోటాన్లు న్యూట్రాన్లలో ప్రవేశించి జీర్ణమై పోతుంటాయి. అలా జీర్ణమై పోతున్న పలు బాసన్ల వలన ప్రోటాన్, నూట్రాన్లకు బరువు (ద్రవ్యరాశి) సమకూరుతున్నదని **పీటర్‌హిగ్స్** అను శాస్త్రవేత్త నిర్ధారించాడు. అట్టి ప్రాథమిక కణాల (బాసన్ల)నే 1. దైవకణాలు అని 2. వాటిని కనుగొన్న శాస్త్రవేత్త పేరిట **హిగ్స్ బాసన్లు** అని గూడ పిలుస్తున్నాం. ఇదే విషయాన్ని మీకులోగడ తెలియజేశానొక సందర్భంలో... పైయాన్ల వలన యేర్పడిన బంధనశక్తి + బాసన్లవలన ఏర్పడిన ద్రవ్యరాశి + గురుత్వాకర్షణ శక్తి, విద్యుదయస్కాంత శక్తి, ధనవిద్యుత్, రుణవిద్యుత్ అను నాల్గు ప్రాథమిక శక్తులు + అణుకేంద్రం చుట్టూ మిక్కిలి వేగంగా పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్లు, వీటన్నింటి వలన పరమాణువుకు స్థిరత్వ మేర్పడుతున్నది. అందుకే, పరమాత్మ యొక్క సృష్టిప్రణాళికా వృక్షానికి తల్లి వేరువంటిది. పరమాణు రూపకల్పన అని అంటున్నారు జ్ఞానులు.

హర్ష : పరమాణువులోని ఎలక్ట్రాన్లు వేగంగా పరిభ్రమిస్తుంటాయని చెబుతున్నారు. మరి, పరిభ్రమిస్తున్న వాటి వలన స్థిరత్వమెలా కలుగుతుంది తాతగారూ?

వ్యాఖ్యాత : ఉదాహరణకు ఫ్యానునే తీసుకుందాం అది తిరక్కుండా ఉంటే అందులోని రెక్కలు మనకు విడివిడిగా కనిపిస్తుంటాయి. అదే ఫ్యాను వేగంగా తిరిగేటపుడు ఫ్యాను రెక్కలన్నీ ఒకేపెద్ద పళ్ళెంలా కనిపిస్తుంటాయి. అలాగే అమితవేగంగా తిరిగే ఎలక్ట్రాన్లన్నీ ఒకే స్థిరపదార్ధంగాకనిపిస్తుంటాయి.

దేవాంశ్ : వాహ్! ఎంతటి మహత్తర, నిర్మాణాత్మకమైంది సృష్టిప్రణాళిక! ఎంతటి అద్భుతమైన, అపూర్వమైన శాస్త్రవేత్తయో కదా పరమాత్మ!

ప్రకృతి సమతుల్యత – సృష్టి ప్రణాళికానియమమే

విరాజ్ఉజ్వల్ : అబ్బ! ఆయన ప్రణాళికా మర్మాలను తెలుసుకునే కొద్దీ, ఇంకా, ఇంకా తెలుసుకోవాలనిపిస్తున్నది దయచేసి పరమాత్మ ప్రణాళికలోని ఇంకా కొన్ని మర్మాలను వివరించరా తాతగారూ?

వ్యాఖ్యాత : సృష్టి అంతటా నెలకొనియున్న సమతుల్యతగూడ పరమాత్మ యొక్క ప్రణాళికలోని భాగమే పిల్లలూ. గీత 13-29 **సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్...** 'ఈశ్వరుడు సర్వత్రా సమంగా నిల్చియున్నాడు'. ఈ వాస్తవాన్ని గ్రహించిన వారు, యే ప్రాణులనూ హింసింపక, నశింపజేయక, పరమ లక్ష్యాన్ని చేరుకుంటారని అంటున్నది భగవద్గీత. అంటే సమస్త ప్రాణుల సంక్షేమార్థం ప్రణాళికా బద్ధంగా అంతటా సమంగా నిల్చి ఉన్నాడు పరమాత్మ. అందువల్లనే ప్రకృతి అంతా సమతూకం నెలకొని ఉన్నది. దీనిని పరమాత్మ ప్రణాళికా నియమంగా భావించి సదా మనం ప్రకృతి సమతుల్యతను కాపాడు కుంటుండాలి. అలా కాపాడుకోగల్గితే మనిషి పరమ లక్ష్యాన్ని చేరుకోగలడని భగవద్గీత నిర్దేశిస్తున్నది!

ఉదా॥ 1. భూగ్రహం మీద భూమి, నీటి సమతూకమిలా ఉంది.
భూభాగం 25% – జలభాగం 75%

2. జలభాగంలో ఉప్పునీటి – మంచినీటిని సమతూక మిలావుంది
సముద్రంలోని ఉప్పునీరు – 97%
ధృవప్రాంతాలలోని మంచు – 2%

నదులు, సరస్సులు, చెరువుల, భూగర్భంలోని మంచినీరు 1% పిల్లలూ కేవలం 1%గా ఉన్న మంచినీటిని మనమెంత పొదుపుగా, జాగ్రత్తగా, వాడుకోవాలో ప్రత్యేకంగా మీకు చెప్పవలసిన పనిలేదు.

3. సముద్రాలు పోను మిగిలిన భూభాగంలో భూమి–అడవుల సమతుల్యత ఇలా ఉంది

అడవులు పోను మిగిలిన భూభాగం 66.66% (2/3) భాగం

అటవీప్రాంతంలో మిగిలిన భూభాగం 33.33% (1/3) భాగం

ఇలా 1/3 ఉండాల్సిన అడవులు ఏ మేరకు తగ్గినా, ఆమేరకు వర్షాభావ మేర్పడుతుంది. ఆమేరకు కార్బన్‌డయాక్సైడ్ పెరిగి వాతావరణం వేడెక్కుతుంది. తద్వారా కరువుకాటకాలు – గ్లోబల్ వార్మింగ్ వంటి ప్రమాదాలొచ్చి పడుతుంటాయి.

4. జనావాసాలు – తదితర భూభాగాల సమతుల్యత యిదీ

జనావాసాలు + నదులు+ చెరువులు+ ఎడారులు = 27%

నదుల జన్మకారకాలైన – కొండలు = 30%

వ్యవసాయాధారిత భూములు = 43%

మరి యింకా, యింకా జనావాసాల కోసం, వ్యాపారాలకోసమని కొండల్ని తొలవటం, చెరువుల్ని పూడ్చటం ద్వారా ఈ సమతుల్యతను దెబ్బతీస్తే 1. నదులు క్షీణిస్తాయి. 2. నీటి నిల్వలకు – నీరింకి భూగర్భజలాలు పెరగటానికి అవకాశం సన్నగిల్లి త్రాగు, సాగునీటికి కరువేర్పడుతుంది.

యువన్ తేజల్ : ఔను తాతయ్యా! ప్రకృతి సమతుల్యత గూడ పరమాత్ముని సృష్టి ప్రణాళికా నియమమేనన్న వాస్తవం మేం గ్రహించామిపుడు.

పరస్పర ఆధారిత స్వభావమూ, సృష్టిప్రణాళికా నియమమే

వ్యాఖ్యాత : సృష్టిలోని ఇంకో ముఖ్యనియమమేమంటే, విశ్వంలోని ప్రతిఒక్కటీ, ఇంకో దానికై ఆధారపడియుండే స్వభావం మరియు పరస్పరాధారిత స్వభావం.

ఉదా॥ 1. చెట్లు – వర్షం పరస్పరాధారితాలు. చెట్లు విస్తారంగా ఉంటే వర్షాలు బాగాకురుస్తాయి. వర్షాలు విస్తారంగా కురిస్తే చెట్లు బాగా పెరుగుతాయి.

2. ఒకదానిపై ఒకటి ఆధారపడి జీవించడం.

ఉదా॥ చెట్లకు – జింకలు, మేకలు, జిరాఫీలు, ఏనుగులూ వగైరాలకు సంబంధం

పులులు, సింహాలకు, జింకలు, జిరాఫీలు, మేకలూ, ఏనుగులు వగైరాలకూ సంబంధం

నేలలో తేమకూ – వానపాములకూ సంబంధం

నేలమీది పురుగులకూ – చెట్లమీది పక్షులకు సంబంధం

పంటపొలాల్లో ఎలుకలు, కప్పలకూ – పాములకూ సంబంధం

పాములకూ – ముంగిసలు, ఎంటవలకూ సంబంధం

నీటిలోని చేపలకూ – పిట్టలు, జంతువులు, మనుషులకూ సంబంధం

పారే నీటికీ – మట్టిలోని లవణాలకు సంబంధం

సూర్యునకూ – గ్రహాలకూ సంబంధం

సూర్యకుటుంబానికీ – పాలపుంతకూ సంబంధం

పాలపుంతకూ – గెలాక్సీల కేంద్రానికీ సంబంధం

సృష్టిలోని ఇట్టి పరస్పరాధారితాల యంశాన్ని ఇలా వివరిస్తున్నది భగవద్గీత. గీత 7–7 **"దారము నందు మణుల వలే, విశ్వమంతా నాయందు గుదిగుచ్చబడి ఉన్నది"** అంటే దారానికి గుచ్చబడిన రంగు రంగుల పూలు, లేక మణులన్నీ ఒకదానికొకటి ఆనుకొని, ఒకేహారంలా, ఒకే దండలా

భాసిస్తున్నట్లే. పరమాత్మయనెడు సూత్రానికి గుచ్చబడిన విశ్వపదార్థాలూ, ప్రాణులన్నీ, పరస్పరాధారితాలై, ఒకే విశ్వంగా వర్ధిల్లుతున్నదని భగవద్గీత వివరించి చెబుతున్నది!

హర్షవర్ధన్ : తాతయ్యగారూ, దయచేసి ఇంకో నియమాన్ని గూర్చి వివరించరా?

రిత్విక్ : ఔను తాతయ్యా. పరమాత్మ రూపొందించుకున్న సృష్టి ప్రణాళిక గూర్చి తెల్సుకునే కొద్దీ, ఇంకా తెలుసుకోవాలన్న ఆసక్తి పెరుగుతున్నది. అందుకే ప్లీజ్ ఇంకాకొన్ని సృష్టిప్రణాళికా నియమాల గూర్చి వివరించండి తాతగారూ!

ప్రతిదీ, ప్రతి ఒక్కరూ ఇచ్చిపుచ్చుకుంటూ జీవించటం సృష్టిప్రణాళికా నియమం

వ్యాఖ్యాత : బాలబాలికలారా! శ్రద్ధగా వినండి! ప్రకృతిలో, ప్రాణులలో ప్రతిదీ ఇచ్చి పుచ్చుకుంటూ జీవించటం లేక మనగలగటమన్నది సృష్టిప్రణాళికలోని అతిముఖ్యనియమం.

ఉదా॥ 1. సముద్రాలు, సరస్సులు, చెట్ల, ఆకుల లోని నీరు, ఆవిరిగా మారి అది భూభాగమంతటా వర్షంగా కురుస్తుంది. భూమిమీద పడిన వర్షపు నీరంతా నదులు, సెలయేరుల ద్వారా సముద్రాలకు, సరస్సులకు చేరుతుంటుంది. ఇలా యిచ్చిపుచ్చుకునే ప్రక్రియ, నిరంతరం చక్రభ్రమణంలా కొనసాగుతుంటుంది.

ఉదా॥ 2. జంతువులు, మనుషులు శ్వాసక్రియద్వారా గాలిలోని ఆక్సిజన్‌ను తీసుకుంటూ బదులుగా కార్బన్‌డయాక్సైడ్ ఇచ్చేస్తుంటారు. అలాగే మొక్కలు, వృక్షాలు తమ కిరణజన్య సంయోగక్రియ కొరకు గాలిలోని కార్బన్‌డైయాక్సైడ్‌ను తీసుకుని బదులుగా ఆక్సిజన్‌ను గాలిలోకి విడుదల జేస్తుంటాయి. ఇది కూడా నిరంతర చక్రభ్రమణంలా కొనసాగుతుంటుంది.

ఉదా॥ 3. భూమిమీది వాతావరణంలోని కార్బన్‌ను కరిగించుకొని తమనీటిలో కలుపుకుంటాయి సముద్రాలు. సముద్రజలాల్లోని కర్బనాన్ని, సముద్రాల్లో పెరిగే ప్రవాళాలు, ఆల్గేలు పీల్చుకుని పెరుగుతుంటాయి. ఇంకా సముద్రపు నీటి మొక్కలు, నాచు, వగైరాలు సముద్రజలాల్లోని కర్బనాన్ని వినియోగించుకుంటూ, బదులుగా ఉపరితల వాతావరణంలోకి ఆక్సిజన్‌ను విడుదల జేస్తుంటాయి. సముద్రాలు చేస్తున్నట్టి ఈ ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియ వలన సముద్ర జీవులకే కాక, భూమిమీది ప్రాణులక్షేమానికి గూడ ఎంతగానో తోడ్పడుతున్నది. చక్రభ్రమణంలా కొనసాగుతున్న ఈ ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియల ఆవశ్యకతను, ప్రయోజనాన్ని గూర్చి భగవద్గీత యిలా ప్రబోధిస్తున్నది. గీత 3-11 **"...పరస్పరం భావయన్తః శ్రేయః పరమాప్స్యథ** అంటే సృష్టిలోని భాగస్వాములందరూ పరస్పరం ప్రీతిని కల్గించుకుంటూ (యిచ్చిపుచ్చుకుంటూ) పరమశ్రేయాన్ని పొందాలి గాక అని భావం. గీత 3-13 "తమ సుఖప్రదాతలకేమీ పెట్టకుండానే కేవలం తమకోసమే వండుకుతింటున్న వారంతా పాపాన్ని తింటున్నట్లే" నంటూ ఇచ్చిపుచ్చుకునే నియమాన్ని ఉల్లంఘించిన వారిని హెచ్చరిస్తున్నది భగవద్గీత.

దీన్నిబట్టి విశ్వంలోని ప్రతిదీ, ప్రతి ఒక్కరూ ఇచ్చిపుచ్చుకుంటూ మనగలగడం పరమాత్మ సృష్టి ప్రణాళికలోని ఒక అనివార్యమైన నియమమని మనకు స్పష్టమౌతున్నది. పుచ్చుకున్న ప్రతి ఒక్కరూ ప్రతిగా యేదోఒకటి యివ్వకుంటే, తప్పక వారు ఏదో ఒక విధంగా నష్టపోతారన్న సత్యాన్ని అందరూ సదా గుర్తుంచుకొని సదరు నియమాన్ని విధిగా పాటించాలి పిల్లలూ!

ఉదాహరణకు మానవులనే తీసుకుందాం. ప్రపంచం నుండి ప్రాణవాయువు, నీరు, ఆహారాలను తీసుకుంటున్నాం. ప్రతిగా ప్రపంచానికి కార్బన్‌డైయాక్సైడ్, మలమూత్రాలను ఇస్తున్నాం. ఆహారం తీసుకుని

మలమూత్రాల రూపంలో తిరిగి యివ్వకపోతే మన శరీరం జబ్బున పడి హాస్పటల్ పాలౌతాము. మరి మనమలా నష్ట పోతున్నామా? లేదా? కావున పుచ్చుకున్నదానికి బదులుగ తిరిగి యివ్వటమన్నది అనివార్యమైప్రక్రియ! విధిగా పాటించాల్సిన సృష్టి ప్రణాళికా నియమం! అనటాని కింతకన్నా నిదర్శనమింకేం కావాలి?

అందువలన దేశం పునాదిపై ఆకాశమంతెత్తెదిగిన సంపన్నులతో సహా, ఇంకా ఎవ్వరేరూపంలో యెదిగినా సరే వారంతా విధిగా దేశానికివ్వాలి, అంటే ఏదైనా మేలు చేయాలి మరి. కాబట్టి, ఇచ్చి పుచ్చుకోవట మన్నది అనివార్యమైన సృష్టిప్రణాళికా నియమంగా భావించి ఈ ప్రపంచం నుండి మీరు పొందిన కూడు, గూడు, గుడ్డ, జ్ఞానం, విజ్ఞానం, ధనం, ధాన్యం అన్నీ మావేననుకోకండి. తాము పొందిన వాటికి ప్రతిగా ప్రతియొక్కరూ ప్రపంచానికి విధిగా అర్పించుకొని తీరాలన్నది పరమాత్మ ప్రాణులకు, ప్రకృతికీ నిర్దేశించిన నియమమని సదా గుర్తుంచుకోండి పిల్లలూ!

ఆదిత్య : అలా ప్రపంచానికి మనం ఏయే రూపాలలో అర్పించుకో వచ్చో, అందుకు పెద్దలు సూచించిన మార్గాలు, లేక విధానాలేమైనా ఉన్నవా తాతగారూ?

వ్యాఖ్యాత : ప్రకృతినుండి మనం తీసుకున్నవాటికి బదులుగ స్వచ్ఛందంగా తిరిగి యిచ్చేందుకు సేవా పద్ధతిని నిర్దేశించారు మన పెద్దలు.

అగస్త్య : ప్రకృతికి మనం ఏయే రూపాలలో సేవలందించవచ్చు తాతగారూ?

వ్యాఖ్యాత : సేవా పద్ధతిని ఐదు రకాలుగా విశ్లేషించారు శ్రీరామకృష్ణ పరమహంస. అవి. 1. దేవయజ్ఞం 2. ఋషి యజ్ఞం 3. పితృయజ్ఞం 4. నరయజ్ఞం 5. భూతయజ్ఞం

దేవయజ్ఞం : దైవపూజ, తీర్థ ప్రసాదాలు, దైవం పేరిట అన్నవస్త్రాది దానాల ద్వారా, బీద సాదల నాదుకోవటం పరమాత్మ సేవయే.

హిమాంశ్ : క్షమించాలి తాతగారూ! గీత 9 అధ్యాయం 26వ శ్లోకంలో "భక్తులు ప్రేమతో నాకిచ్చిన పత్రం, పుష్పం, ఫలం, జలాన్నై నా నేను స్వీకరిస్తానని అంటున్నాడు భగవంతుడు. కానీ, ఆయన ముందు మనం పెట్టిన పండ్లు పాయసం వగైరాలన్నీ మరుసటి రోజుక్కూడ అలాగే ఉంటున్నవి కదా, మరి ఆయన వాటిని స్వీకరించాడని మనమెలా నమ్మాలి?

వ్యాఖ్యాత : సరే ప్రియతమ విద్యార్థులారా! మీకు పది నిమిషాల సమయ మిస్తున్నాను. మీరంతా భగవద్గీత 9వ అధ్యాయంలోని 26వ శ్లోకాన్ని కంఠస్థం చేయండి!

విద్యార్థులు : 'అలాగే తాతయ్యా! అంటూ శ్లోకపఠనకు పూనుకున్నారు. కొంత సమయమయ్యాక,

వ్యాఖ్యాత : ఇప్పుడా శ్లోకాన్ని పుస్తకం చూడకుండా చెప్పగలరా?

విద్యార్థులు : ఆఁ చెప్పగలం!

వ్యాఖ్యాత : హిమాంశ్ నీవు చెప్పు

హిమాంశ్ : శ్లోకాన్ని నిర్దుష్టంగా ఒప్పగించాడు.

వ్యాఖ్యాత : శభాష్ హిమాంశ్! నీవిప్పుడు ఆ శ్లోకాన్ని పూర్తిగా స్వీకరించినట్లే, ఔనా?

హిమాంశ్ : ఔను తాతగారూ!

వ్యాఖ్యాత : పుస్తకం చూపుతూ మరి నీచేత స్వీకరించబడిన శ్లోకం ఇక్కడ యథాతథంగానే ఉన్నది గదా, మరి దీన్ని నీవెలా స్వీకరించావ్?

విద్యార్థులు : ఒకరి ముఖాలొకరు చూసుకుంటుంటారు.

వ్యాఖ్యాత : ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు హిమాంశ్, ఈ శ్లోకాన్ని నీ మనసు సూక్ష్మరూపంలోనే స్వీకరించింది. అందువల్లనే ఇది భౌతికంగా

పుస్తకంలో యథాతథంగా ఉండిపోయింది ఔనా?... అలాగే మనం భగవంతుని ముందుంచిన ప్రసాదంగూడ చూడటానికి మనం పెట్టింది పెట్టినట్లే ఉన్నప్పటికీ, దాన్ని దేవుడు సూక్ష్మరూపంలో స్వీకరించి ఉంటాడనటంలో సందేహమేమీ లేదు కదా?

విద్యార్థులు : ఓహ్! ఈ విషయంలో మాకిక సందేహమే లేదు, ఎంతోకాలంగా మాలో రగులుతున్న సందేహాన్నిలా పటాపంచలు చేసినందుకు మీకు చాలా చాలా ధన్యవాదాలు తాతగారూ!

ఋషియజ్ఞం : శాస్త్రాధ్యయనం, అధ్యాపనం, సద్గ్రంథరచన మొదలగు కార్యక్రమాల ద్వారా దేశ, ప్రపంచ కళ్యాణార్థం చేసే సద్బోధయే ఋషియజ్ఞం. అందుకే గీత 3-1 **"జ్యాయసీ చేత్కర్మణస్తే..."** "జ్ఞానమే శ్రేష్ఠమైన"దని భగవద్గీత - ప్రబోధిస్తున్నది. ఐతే "ఈశ్వరసాక్షాత్కారం పొందిన వారే, ఇతరులకు బోధించగలరంటున్నారు. శ్రీరామకృష్ణ పరమహంస. ఆయనెందుకిలా అన్నారంటే? **వెలిగే దీపమే మరికొన్ని దీపాలను వెలిగించగల్గినట్లు, జ్ఞానియైనవాడే యితరులకు జ్ఞానాన్ని బోధించగలడు. అట్టి జ్ఞానాన్ని పొందాలన్నా, జ్ఞానార్జన చేయాలన్నా సాత్విక గుణాన్ని పెంపొందించుకోగల్గినవాడే ఆ దిశగా కృషి చేయగలడు.** గీత 18-73 అచ్యుతా! నీకృపవలన నా అజ్ఞానం తొలగింది, నా సందేహం తీరింది" అంటాడు అర్జునుడు. అలా అర్జునుని మిషతో భగవద్గీత కూడా జ్ఞానాన్ని పొందేందుకు పరమాత్మ కృప అవసరమని సూచిస్తున్నది. అందువలన, జ్ఞాన బోధ చేయాలంటే ముందు జ్ఞానాన్ని పొందాలి. అందుకు సత్య, జ్ఞాన, ఆనందాలకు నిధియైనట్టి (అవ్యక్త పరమాత్మతో తాదాత్మ్యం పొంది, ఆయన శక్తులైన సత్యాన్నీ, జ్ఞానాన్నీ, ఆనందాన్నీ ఆస్వాదిస్తూ తిరిగి వాటిని నిస్వార్థంగా ప్రపంచ రూపంలో వ్యక్తమౌతున్న పరమాత్మకే అర్పించాలి! అంటే ప్రపంచసేవకు వినియోగించాలి. అదే అసలైన జ్ఞానయజ్ఞం. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు. ఎందుకంటే, గీత 7-3" **మనుష్యాణాం**

సహస్రేషు... తత్త్వతః" వేలాది మందిలో ఎవడో ఒక్కడే జ్ఞానార్జనకోసం యత్నిస్తాడు. అట్టి అరుదైన జ్ఞానార్థులలో కూడా యే ఒక్కడో పరమాత్మను (పరమాత్మయొక్క సృష్టిప్రణాళికా నియమాలను, ఆశయాలను గూర్చి) తెలుసుకోగల్గుతాడని వక్కాణిస్తున్నది భగవద్గీత.

పితృయజ్ఞం : మన పూర్వులలో గొప్పవారిని ఆదర్శంగా తీసుకుని వారి ఘనత ప్రతిబింబించేలా జీవించటం, మరియు తమ పెద్దల స్మృత్యర్థం ధన, ధాన్య, అన్న, వస్త్ర, విద్య, వైద్య దానాలు చేయటం, ఇంకా వారి పేరిట విద్యాలయాలు, వైద్యాలయాలు, పేదలకు గృహనిర్మాణాలు మరియు కళ్యాణ మంటపాల నిర్మాణాల ద్వారా మానవ సేవచేయటాన్నే పితృయజ్ఞ మంటారు.

నరయజ్ఞం : అనాథలు, ఆర్తులు, పీడితులు, రోగులు, వికలాంగులు, మొదలగు దీన జనుల కొరకు అనాథశరణాలయాలను నెలకొల్పి, వారికి పోషణ, విద్య, వైద్యాది సౌకర్యాలను కల్పిస్తూ అనాథ మానవ సేవ ద్వారా పరమాత్మను సేవించవచ్చు.

భూతయజ్ఞం : సమస్తప్రాణుల, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణా కార్యక్రమమంతా భూతయజ్ఞమే.

ఈ పంచ యజ్ఞాలలో మీమీ ఆసక్తి, అవకాశాల మేరకు విధిగా యేదో ఒక యజ్ఞం లేక సాధ్యమైనన్ని యజ్ఞాల ద్వారా ప్రపంచ రూపంలో వ్యక్తమౌతున్న పరమాత్మను నిత్యమూ సేవించే వారి దేహాలు దివ్యత్వాన్ని సంతరించుకుంటాయని శ్రీరామానుజాచార్యులు, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీరమణ మహర్షి, మొ।। మహనీయులు ప్రబోధిస్తున్నారు! మరి వారి ప్రబోధాన్ని పాటిస్తూ మనం మనజన్మను ధన్యం చేసుకొందాం పిల్లలూ! పెద్దలు నిర్దేశించిన విధంగా నిరంతరం మీరు వీలైనన్ని యజ్ఞాలను నిర్వహిస్తూ దివ్యత్వాన్ని సంతరించుకొని దివ్య స్త్రీ పురుషులుగా వర్ధిల్లుతారు గాక! తథాస్తు!

విద్యాధర్ : తాతయ్యా! దయచేసి సృష్టికర్త యొక్క ప్రణాళికలోని యింకో ముఖ్యనియమాన్ని వివరించండి. ప్లీజ్ తాతయ్యా!

వ్యాఖ్యాత : జ్ఞానార్జనార్థం మీ తపన చూస్తుంటే నాకూ ముచ్చటేస్తున్నది. అందుకే సృష్టికర్త ప్రణాళికలోని మరోముఖ్య నియమం గూర్చి మీకు వివరించ దల్చుకున్నాను. "నిరంతర శ్రమయే ప్రగతికి మార్గం" అన్నదే ఆ ముఖ్య నియమం.

నిరంతర శ్రమయే ప్రగతికి మార్గం – ఇది సృష్టి ప్రణాళికా నియమం!

నిరంతర శ్రమయే ప్రగతికి మార్గమన్నది విశ్వసృష్టి ప్రణాళికా నియమం. ఉదాహరణకు సూర్యుడు, నక్షత్రాలు, గ్యాలాక్సీలు మొదలగునవన్నీ నిరంతరం పరిభ్రమిస్తూనే ఉన్నాయి. అలాగే మానవశరీరంలోని గుండె, కాలేయం, జీర్ణాశయం, మూత్రపిండాలు, వగైరాలన్నీ నిరంతరం తమ విధిని నిర్వహిస్తూనే ఉంటాయి, కనిపించే ప్రాణుల్లో పెద్ద తిమింగలం నుండి, చిన్న చీమదాకా ప్రతిప్రాణీ శ్రమిస్తూనే జీవిస్తున్నాయి. అలా మానవులంకూడ నిరంతరం శ్రమిస్తూనే ఉండాలి. ఏ మనిషీ సోమరి కారాదు. గీత 3-8 ప్రతి మనిషీ నియత కర్మలను విధిగా చేస్తుండాలి. సోమరి, కనీసం దేహాన్నిగూడ పోషించుకోలేక నశిస్తాడని హెచ్చరిస్తున్నది భగవద్గీత!

గీత 3-10 **"సహయజ్ఞాః ప్రజాసృష్ట్వా ... వోఽస్విష్టకామధుక్"** బ్రహ్మ యజ్ఞం (శ్రమ)తో పాటు మనుషుల్ని సృష్టించి, యీ శ్రమ (యజ్ఞం) ద్వారా మీరువృద్ధి చెందుతారు. కామధేనువులా మీ కోర్కెల్ని తీరుస్తుంది శ్రమ!" అని గూడ సూచిస్తున్నది భగవద్గీత! అంటే **"శ్రమ ప్రగతిదాయకం, సోమరితనం వినాశదాయకమని"** వక్కాణిస్తున్నది. మరియు నిరంతర శ్రమయే ప్రగతి సాధనమన్న సృష్టిప్రణాళికా నియమాన్ని విధిగా పాటించాలని ప్రబోధిస్తున్నది శ్రీమద్భగవద్గీత! **"కుర్వన్నేహ కర్మాణి... నకర్మలిప్యతే నరే"**

మనిషన్నవాడు కర్మలు చేస్తూ నూరేళ్ళు బ్రతకాలని కోరుకోవాలి. అంటే తన దేహంకోసం తన కుటుంబం కోసం, అలాగే తన గ్రామం, దేశం, సమాజం, ప్రపంచం పట్ల గూడ తాను నిర్వహించాల్సిన కర్తవ్యాలను, ఇష్టమో, కష్టమో, నిష్ఠూరమో ఐనా సరే ప్రతి మనిషీ విధిగా చేసితీరాలని భావం. ఐతే తాత్కాలిక సుఖాలకోసం చేసే కర్తవ్యాలను విడనాడి విధ్యుక్తకర్తవ్యాలనే నెరవేర్చాలని నిర్దేశిస్తుంటుంది అంతరాత్మ. అంతరాత్మ ఆదేశానుసారం నిస్వార్థంగా చేసే విధ్యుక్త కర్మల వలన మనిషికి పాపపుణ్యాలంటవు.

ధర్మరక్షణార్థం ధర్మద్రోహులైన వారు బంధువులు, గురువులు, ఆత్మీయులైనా సరే వారిని చంపిన వారికి పాపమంటదని హామీ యిస్తున్నది భగవద్గీత! అందుకే మనిషి 'ఆత్మజ్ఞాని'గా ఎదుగుతూ ప్రకృతి మనకు ప్రసాదించిన శతాయుర్దాయాన్ని విధి నిర్వహణ ద్వారా సద్వినియోగ పరచుకోవాలన్నది. సృష్టిప్రణాళికా నియమం. అలా చేయని సోమరులు ఆత్మహననులు (ఆత్మను/ తనను, చంపుకున్నవారు) లేదా ఆత్మను ధిక్కరించిన వారేనన్నది గీతా సందేశం. పనిచేయకుండా భుజించేవాడు. పుచ్చుకోవటమే తప్ప ఇవ్వటం తెలియనివాడు ఆ కుటుంబానికే కాదు మానవ సమాజానికే దొంగ అన్నారుగాంధీ. కావున, పిల్లలూ మీ రెన్నడూ పనిదొంగలు కారు గదా?

పిల్లలు : కాముగాక కాము తాతయ్యా సూర్యకుటుంబంలోని గ్రహాల్లా, మా దేహంలోని గుండె, శ్వాసకోశాలు, మూత్రపిండాలవంటి అవయవాల్లా నిరంతరం శ్రమిస్తుంటాం తాతగారూ!

వ్యాఖ్యాత : కేవలం మీ కోసమే గాదు పిల్లలూ, గీత నిర్దేశిస్తున్నట్లు సదా పదిమంది క్షేమం కోసం ప్రపంచ శాంతికోసం గూడ పరిభ్రమిస్తుండాలి. ఎందుకంటే ప్రపంచ క్షేమంతోనే ప్రజలందరి, ప్రాణులన్నింటి క్షేమం ముడిబడి ఉంది. ఇది గూడ సృష్టి ప్రణాళికా నియమమే మరి. ప్రపంచ

క్షేమంకోసం పాటుపడాలంటే ప్రకృతినీ, ప్రాణుల్నీ, ప్రపంచాన్నీ ప్రేమించటం నేర్చుకోవాలి.

తరణ్ : కానీ, నాదొక సందేహం తాతయ్యా! 'నిన్ను నీవు ప్రేమించుకో' మని ఎవరికీ చెప్పాల్సినపని లేదు. కానీ, పరులను ప్రేమించమంటే, ఎందుకు ప్రేమించాలన్న ప్రశ్న ఉదయిస్తుంది గదా, దానికి మీరేం చెబుతారు?

వ్యాఖ్యాత : నీతో, నాతో సహా విశ్వప్రాణులు, పదార్థాలన్నీ ఉద్భవించింది విశ్వచైతన్యం (పరమాత్మ) నుండే గదా. పరమాత్మ నుండి పుట్టిన వాటన్నింటి తండ్రి పరమాత్మయేగదా, మరి ఆయన బిడ్డలందరూ సహోదరులు మరియు విశ్వమంతా ఆయన సొత్తే గదా!

వశిష్ఠ : ఔను తాతగారూ.

వ్యాఖ్యాత : నిన్ను ప్రేమించాల్సిన బాధ్యత మీ అన్నదమ్ములకు వారందర్నీ ప్రేమించాల్సిన బాధ్యత నీకూ, మీ తండ్రిగారి సిరిసంపదలను కాపాడుకోవలసిన బాధ్యత మీ అందరికీ ఉందా, లేదా పిల్లలూ?

జయరామ్ : తప్పక ఉంది తాతయ్యా?

వ్యాఖ్యాత : సూర్యుడొక్కడే ప్రపంచాన్నంతటినీ ప్రకాశింపజేస్తున్నట్లే, ప్రాణులన్నింటినీ చైతన్యవంతంచేస్తున్న ఆత్మ ఒక్కటే! అందువలన నిన్ను ప్రేమించుకున్నట్లే అందర్నీ ప్రేమించాల్సిన బాధ్యత, నాతో, నీతో సహా ప్రతి ఒక్కరికి ఉంది. ఎందుకంటే? అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉంటేనే, శరీరం సంతోషంగా ఉండగల్గినట్లు ప్రపంచ ప్రాణులు, మానవులంతా సంతృప్తిగా జీవిస్తుంటేనే విశ్వమంతా సుఖశాంతులతో వర్ధిల్లగలదని భగవద్గీత నిర్దేశిస్తున్నది. ఇది వాస్తవమేనని మీకనిపిస్తున్నదా?

సుధీర్ : ఇది నూరుశాతం వాస్తవమని మేము సహేతుకంగా గ్రహించాం. అందుకే ప్రపంచంలో ఏ దేశ ప్రజలకు, ప్రాణులకు, పర్యావరణానికీ నష్టం

వాటిల్లినా, సదరు ఆపదనుండి వారినీ, వాటినీ ఆదుకోవలసిన బాధ్యత ప్రతి దేశానికీ, ప్రతి మనిషికీ ఉందన్న వాస్తవాన్నిగూడ గుర్తించాం తాతగారూ!

ఆరాధ్య : ఈ అంశాన్ని భగవద్గీత ఎలా నిర్దేశించిందో తెలియజేస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : మీకిప్పటిదాకా నేను వివరించిందంతా గీతా సందేశమేను ఆరాధ్యా! ఐనా సరే భగవద్గీత నిర్దేశించిన విధానాన్ని మీకు తెలియజేస్తాను వినండి. గీత 15-15 అందరిలో ఆత్మరూపంలో నివసిస్తున్నది నేనే. గీత 7-7 నాకంటే ఇతరమైనదేమీ లేదు. దారమందు మణుల్లా, విశ్వమంతా నాయందు గుచ్చబడి ఉంది. గీత 6-30 అన్ని ప్రాణులలో నన్ను, నాలో అన్ని ప్రాణులనూ చూడగల్గిన వాడు నా నుండి విడిపోడు. గీత 6-31 ఏకత్వమందు సుప్రతిష్ఠుడై ప్రాణులన్నింటిలోని ఆత్మను నన్నుగ భావించు చుండువాడు నాలో జీవిస్తున్నట్లే. గీత 6-32 అందరి సుఖదుఃఖాలను తనవిగా భావించు జ్ఞానియే శ్రేష్ఠుడు. గీత 12-13, 14 ఎవర్నీ ద్వేషింపక, అందరిపట్లా దయతో ఉండువాడు, మాటలు, చేతలు, ఆలోచనలను నాకర్పించిన వాడు నాకు ప్రియభక్తుడు. పై గీతల సారాంశాన్ని మీరెంత వరకు గ్రహించారో చెప్పండి చూద్దాం.

కావ్య : శ్రీకృష్ణభగవానుడిలా చెబుతున్నాడు. ఈ విశ్వమంతటికీ జన్మస్థానం నేనే. ప్రాణులు, పదార్థాలన్నీ నానుండే పుడుతున్నాయి. ప్రాణులన్నింటా ఆత్మరూపంలో నివసిస్తున్నది నేనే. కాబట్టి, మీరెవర్ని ప్రేమించినా, నన్ను ప్రేమించినట్లే. ఎవర్ని ద్వేషించినా, హింసించినా, నన్ను ద్వేషించి, హింసించినట్లే. మానవసేవే మాధవసేవ ప్రకృతి పర్యావరణ ప్రాణుల సేవ యంతా నా (పరమాత్మ) సేవయేనని గ్రహించండి. అంతేగాదు, దారానికి గుచ్చబడిన మణులన్నీ ఒకదాని కొకటి ఆనుకొని హారంలా భాసిస్తున్నాయి. హారంలోని యే ఒక్కమణి పగిలినా, రాలినా, ఆ మేరకు తన పరిపూర్ణతను,

అందాన్నీ కోల్పోతుంది హారం. అలాగే నా చేత గుచ్చబడిన ప్రాణులు, పదార్థాలన్నీ విశ్వంలా భాసిస్తున్నాయి. విశ్వంలోని యే ప్రాణులు, పదార్థాలు నశించినా, ఆ మేరకు విశ్వ సౌందర్యానికీ, పరిపూర్ణతకు, ఆనందానికీ, శాంతికీ భంగం వాటిల్లుతుంది. అన్ని ప్రాణుల్లో పరమాత్మను దర్శిస్తూ త్రికరణ శుద్ధిగా ఆయన కర్పించుకొని, అంటే ఆయన (ఆత్మ) ఆదేశానుసారం నడుచుకుంటూ లోకకళ్యాణంకోసం, విశ్వశాంతి కోసం పాటుపడుతూ జీవిస్తుండాలి. అందరి **దుఃఖాలను తనవిగా భావిస్తూ, తాను దుఃఖ విముక్తు కావడానికి యత్నించినట్లే, అందర్నీ దుఃఖ విముక్తుల్ని చేసేందుకు కృషి చేయువాడే శ్రేష్ఠుడైన జ్ఞాని మరియు పరమాత్ముని ప్రియభక్తుడు అన్నదే పై గీతల సారాంశం.** ఔనా తాతగారూ?

వ్యాఖ్యాత : చాలా చక్కగా గ్రహించావు కావ్యా! ఇదే గీతా సందేశాన్నింకా మీమీసొంత ఉదాహరణలతో ఇంకెవరైనా చెప్పగలరా?

శ్రేష్ఠ : మన శరీరావయవాలన్నీ ఒకే చర్మంతో కప్పబడి ఒకదానిపై ఒకటి ఆధారపడి పరస్పరం సహకరించుకుంటూ, దేహంలా భాసిస్తున్నాయి. ఈ కారణంగా వాటిలో యే ఒక్క అవయవానికి దెబ్బతగిలినా, అనారోగ్యానికి గురైనా ఆ బాధ దేహమంతటికీ బాధగా పరిణమిస్తుంది. అవయవాలే కాదు, మన దేహంలోని జీవ క్రియలు గూడ యేదిముందో, యేది తర్వాతో చెప్పలేని విధంగా ఒక పద్ధతి ప్రకారం సమిష్టిగా జరిగిపోతుంటాయి. అలాగే మన శారీరక ధాతువులన్నీ వేటి కర్తవ్యాన్ని అవి నిర్వహిస్తూనే, శరీరంలో ఎక్కడ వైషమ్యమేర్పడినా, దాన్ని తొలగించేందుకు సదరు ధాతువులన్నీ సమిష్టిగానూ కృషి చేస్తుంటాయని వైద్యశాస్త్రం సృష్టీకరిస్తున్నది. అంతేగాదు, మనబాహ్య, అంతర అవయవాలన్నీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు అవి తమ ఆనందాన్ని విడివిడిగా రాకుండా సంయుక్తంగా అంటే ఏకత్వంగా వ్యక్తీకరిస్తుంటాయి. అందువల్లనే మన దేహం స్వస్థతతో కూడిన ఆనందానుభూతిని పొందుతూ, ఉత్సాహభరితంగా ఉంటుంది.

అదే అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉన్నప్పటికీ గోరు విరిగితేనో, పన్ను సలుపు తుంటేనో కేవలం ఆ ఒక్క బాధ కారణంగా ఆనందానుభూతికి బదులుగా అసహనానికీ, చికాకుకూ గురౌతుంటుంది మనదేహం. తగిన చికిత్స ద్వారా సదరు నొప్పిని నివారించే దాకా మన శరీరం హాయిగా, ప్రశాంతంగా మనలేదు. అలాగే ప్రపంచంలో ఏ దేశం కరువుకాటకాలకో, లేక యుద్ధానికో గురైనా సరే, ఆ దేశపు బాధ, ఏదో ఒక రూపంలో ప్రపంచానికంతటికీ బాధగా పరిణమిస్తుంది. అలాగే ఒక దేశంలోని ఒక జాతి/వర్గ ప్రజలు ఆర్థిక అసమానతకో, వర్గవివక్షకో గురైతే వారి బాధ, ఆగ్రహం, విప్లవకల్లోలంగా పరిణమించి, ఆ దేశమంతా, అంతర్యుద్ధానికీ, తద్వారా అశాంతికీ లోనౌతుంది. అందువలన సంక్షోభానికి గురైన దేశాన్ని ప్రపంచ దేశాలన్నీ ఒకదేశంలోని బాధిత ప్రజల్ని ఆదేశ ప్రజలందరూ కలిసి ఆదుకుంటేనే, ప్రపంచమైనా, దేశమైనా శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లలేవని స్పష్టమౌతున్నది.

కాబట్టి, మనదేహాన్ని ఈ విశ్వానికి నమూనాగా భావించుకొని, దేహపుష్టికోసం, దేహారోగ్యంకోసం దేహంలోని ప్రతి అవయవమూ, ప్రతి జీవకణమూ, విడివిడిగానూ, సమిష్టిగానూ నిరంతరం శ్రమిస్తున్నట్లే. ప్రపంచ ప్రగతికోసం, విశ్వశాంతికోసం ప్రపంచ దేహానికి అవయవాల వంటి దేశాలు/ మరియు విశ్వదేహంలోని జీవకణాలు / జీవధాతువుల వంటి మనుషులూ వ్యక్తిగతంగానూ, సమిష్టిగానూ కృషి చేస్తుండాలని నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత! ఔనా తాతగారూ?

వ్యాఖ్యాత : శభాష్, శ్రేష్ఠా! చాలా చక్కగా ఉదహరించావు, అంతేగాదు, పిల్లలూ, మన మిలా సుఖంగా జీవిస్తున్నామంటే? దీని వెనక ఎందరెందరి ఎంతెంత శ్రమదాగివుందో సదా మనం గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు మనం తింటున్న ఆహారాన్నే తీసుకుంటే, అందులో ఎన్నో జీవుల శ్రమ ఇమిడి ఉంది. మననోట్లో కెళ్ళే ప్రతి ముద్ద వెనకా, ఎంత శ్రమ దాగుందో

గుర్తుచేసుకో మంటున్నది భగవద్గీత! అలా మన జీవనానికి తోడ్పడుతున్న ప్రాణులు, ప్రకృతి, పర్యావరణాలన్నింటి పట్లా సదా కృతజ్ఞతతో ఉండాలి. వారందరి, వాటన్నింటి రుణం తీర్చుకోవటం మన బాధ్యత. అందుకోసం ప్రతి మనిషి కనీసం తన సమయంలో కొంత, తన తెలివిలో కొంత, తన శక్తిలో, సంపదలో పలుకుబడిలో కొంతైనా విధిగా పదిమంది కోసం, గ్రామం, దేశం, ప్రపంచం, ప్రకృతి, పర్యావరణాలకోసం తప్పక వినియోగించాలి. అలా అర్పించని వాడు కృతఘ్నుడే కాదు. దొంగ కూడా అని అంటున్నది గీత. అందుకే, అలాంటి వారి నుద్దేశించి గీత 4-31లో లోక కళ్యాణంకోసం పాటుపడనివాడు, ఈ లోకంలో జీవించటానికే అనర్హుడంటూ హెచ్చరిస్తున్నది భగవద్గీత!

కాబట్టి, భూమి తనచుట్టూ తాను తిరుగుతూనే, సూర్యునిచుట్టూ గూడ పరిభ్రమిస్తున్నట్లు, మనం గూడ మన కుటుంబం కోసం శ్రమిస్తూనే మన సామాజిక, ప్రాపంచిక, ప్రగతి, శాంతికోసం గూడ మన శక్తి మేరకు, విధిగా పరిభ్రమిస్తుండాలి. ఔనా పిల్లలూ?

పిల్లలు : ఔను! మేమీ సృష్టినియమాన్ని విధిగా పాటిస్తామని మీకు మాట ఇస్తున్నాం తాతగారూ!

వ్యాఖ్యాత : తథాస్తు చిరంజీవులారా! సర్వదా మీకు శుభమస్తు!

సాయికృత్తిక : నాకో సందేహం మనం సొంతంగా మంచికారో, అందమైన యిల్లో, డ్రస్‌లో, నగలో కొనుకున్నా మనకిష్టమైన పదార్థాలు తింటున్నా, మనకెంతో ఆనందం కల్గుతుంటుంది. అందుకే వాటిని పొందటం కోసం మనమంతగా శ్రమిస్తున్నాం. అలాగే పరులకోసం, గ్రామం, దేశం, ప్రపంచం, ప్రకృతి, పర్యావరణాల కోసం పాటుపడటం వల్ల గూడ మనకానందం కల్గుతుంటే గదా మన మాదిశగా శ్రమించటానికిష్టపడేది? మరి సృష్టికర్త ప్రాణుల్లోను, మనుషుల్లోనూ అలాంటి యేర్పాటే చేసి ఉంటే

అందరూ, తమకోసం పాటుపడినట్లే పరులకోసం గూడ పాటుపడుతూ ఉండేవారు గదా, తాతగారూ?

వ్యాఖ్యాత : మంచి ప్రశ్నే అడిగావు కృత్తికా! నీవనుకుంటున్నట్టి యేర్పాటును చేసేవుంచాడు సృష్టికర్త. మనంకోరుకున్న వాటిని పొందినప్పుడెల్లా ఆనందం కల్గుతుందో, అలాగే పరులకు సహాయపడినప్పుడు గూడ వారు చూపే కృతజ్ఞతా పూర్వకమైన చూపులు, పలికే మాటలు, అప్పటి వారి హావభావాలు వారికి సహాయపడిన వారిలో ఆనందాన్నీ, తృప్తినీ, ధన్యతాభావాన్నీ కలిగిస్తుంటాయి. అట్టి సానుకూల భావోద్వేగాలను పొందగల్గిన పరోపకారాల సగటు ఆయుర్ధాయం, కేవలం తమకోసం పాటుపడేవారి సగటు ఆయుర్ధాయం కన్నా అధికంగా ఉంటుందన్న సత్యాన్ని 1930 సం॥లోనే గుర్తించారు శాస్త్రజ్ఞులు. నాడు సత్కార్యాలు చేసిన వారియొక్క ఉద్వేగాలను మాత్రమే పరిశీలించి, పై వాస్తవాన్ని కనుగొన్నారు శాస్త్రజ్ఞులు.

ఐతే 2009సం॥లో జరిగిన అలాంటిదే మరొక పరిశోధనలో పరోపకారుల భావోద్వేగాలతోపాటు, పరోపకారం చేసిన సమయంలో వారి దేహంలోని జీవరసాయనాలలో కలిగే మార్పులను గూడ, పరిశీలించి, వాటి ఫలితాలను నిర్ధారించారిలా. ప్రతిఫలాపేక్షలేని స్వచ్ఛంద పరోపకారులను రెండువేల మందిని ఎంపిక చేసుకుని పరిశీలించారిలా 1.అసహాయులు, ఆర్తులు, అనాధలకు, శరణాలయాలకు, స్వచ్ఛందసంస్థలకు విరాళాలిచ్చి ఆదుకునేందుకు ముందుకొచ్చిన సమయంలో వారి మెదడును ఎమ్మారై స్కాన్ చేసి పరిశీలించారు అప్పుడు వారి మెదడులోని 'మెసాలింబిక్ వ్యవస్థ' బాగా చైతన్యం కావటాన్ని గుర్తించారు శాస్త్రజ్ఞులు.

ఊహాశ్రీ : ఈ మెసాలింబిక్ వ్యవస్థ సహజంగా ఎవరెవరిలో చైతన్యమౌతుంటుంది తాతయ్యా?

వ్యాఖ్యాత : గొప్ప పదవులు, అవార్డులు, బహుమతులు, గొప్ప బిరుదులు, సత్కారాలు పొందిన సందర్భాలలోను, దాంపత్య సుఖంలో సంపూర్ణ

భావప్రాప్తి పొందిన సందర్భాలలోను, ఇంకా అసాధారణ సంతోషకర సంఘటనలు జరిగిన సందర్భాలలోను వాళ్ళ మెదళ్ళలో మెసాలింబిక్ వ్యవస్థ చైతన్యవంత మౌతుంటుందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. మరియు సహాయం పొందిన వారి వదనంలో తాండవించే కృతజ్ఞతతో కూడిన సంతృప్తి, వారి చూపుల నుండి జాలువారే కృతజ్ఞతా పూర్వకమైన ఆనందపు వెలుగు. వారి నాదుకున్న, సహాయ పడిన వారి మెదడులో ఆక్సిటోషన్ వంటి ఫీల్‌గుడ్ రసాయనాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తాయని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

లాలిత్య : మెసాలింబిక్ వ్యవస్థా, మరియు ఆక్సిటోషన్ రసాయనాలు మనిషి ఆయుష్షును పెంచుతాయా తాతయ్యా?

వ్యాఖ్యాత : తరచుగా మెదడులో మెసాలింబిక్ వ్యవస్థ చైతన్యవంత మౌతున్నా, ఆక్సిటోషన్ వంటి ఫీల్‌గుడ్ రసాయనాలు ఉత్పత్తి ఔతున్నా, డిప్రెషన్‌కు, ఆందోళనకు, ఒత్తిళ్ళు, దిగులు, విచారాలు, నిరాశా, నిస్పృహలకు, గురి కాబోరని, ఒకవేళ వాటికి గురైనా, శీఘ్రంగా బయటపడేలా అవి తోడ్పడతాయనీ, అంతేకాదు, అవి వారికానంద పరవశాన్ని, పూర్తి సంతృప్తినీ, జన్మధన్యతా భావాన్నీ గూడ కలిగిస్తుంటాయని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. తద్వారా అవి వారికి అదనపుశక్తిని ఆరోగ్యాన్ని, ఆయుష్షును గూడ పెంపొందిస్తాయని గుర్తించారు శాస్త్రజ్ఞులు. తమకోసం చేసే పనులు కేవలం ఆనందాన్ని కలిగిస్తే, పరోపకార్ధం, లోకకళ్యాణార్ధం చేసే సత్కార్యాలు ఆనందంతోపాటు ఆయుర్ధాయాన్ని గూడ పెంపొందిస్తాయని ఆధ్యాత్మికవేత్తలే గాదు, శాస్త్రజ్ఞులు గూడ పరిశోధించి మరీ నిర్ధారించారు.

దేవాంశ్ : శాస్త్రజ్ఞులు చెబుతున్న యీ వాస్తవాన్ని ప్రతిబింబించే సంఘటనల్ని మీరెన్నడైనా చూశారా తాతయ్యా?

అన్నపూర్ణమ్మ

వ్యాఖ్యాత : పరోపకారులకు ఆ భావన అదనపు శక్తిని సమకూర్చుతుందన్న వాస్తవాన్ని నేను నా కళ్ళారా చూశాను. నా బాల్యంలో మా అమ్మ

అన్నపూర్ణమ్మ గారు, నేను ఉదయం 6 గంటలకెళ్ళి మధ్యాహ్నం ఒంటి గంటదాకా పంట చేనిలో కలుపుతీసి తీసి, బాగా అలిసిపోయాం. ఐనా సరే ఇంటిదగ్గరి గేదె కోసమని, అమ్మా, నేనూ, గడ్డి మోపులు గూడ తెస్తున్నాం మా వూరి చెరువు కట్టకల్లంత దూరం వచ్చే సరికి కట్టమీద ఉన్న ఒక సన్నటి చెట్టును గేదె ఒకటి కొమ్ములోత్తే చెలగటం చూసిన మా అమ్మ గడ్డి మూట నక్కడ పడేసి హాయ్ హాయ్ అని పెద్దగాకేక లేస్తూ రాళ్ళు విసురుతూ పరుగెత్తుకెళ్ళి దాన్ని పారద్రోలింది. కానీ, అలసటతో చెట్టు క్రిందే రొప్పుతూ కూర్చుండి పోయింది. ఎందుకమ్మా నీ కింత శ్రమ? ఇదేం మన చెట్టు కాదుగదా అన్నాన్నేను. లేదురా, ఇది మనూరి వాళ్ళందరి చెట్టు. దీన్ని కాపాడుకుంటే చెరువులో ఎప్పుడూ నీళ్ళుంటాయి. కాబట్టి, దానంతటదే పెరిగి పెద్ద వృక్షమౌతుంది. అపుడు వేసవి కాలంలో మనుషులకేగాదు, ఎన్నో పశువులకు, పక్షులకూ ఎంతో చల్లదనాన్ని, హాయినీ కలిగిస్తుందీ చెట్టు! అని చెప్పి 'హమ్మయ్య' యెలాగో దీన్ని కాపాడగలిగాం. మళ్ళీ యిలాంటి ప్రమాదం రాకుండా, దీన్ని భద్రం చేయాలంటూ, చేతిలోని కొడవలితో పక్కనేవున్న నాలుగు ముళ్ళమండల్నికొట్టి, చెట్టు చుట్టూ వుంచి, వాటి తాటతోనే వాటిని చెట్టుకు కలిపికట్టింది. చెట్టువైపు తృప్తిగా చూస్తూ యిక కొన్నాళ్ళ వరకు పశువులు దీని జోలికిరావు. అనుకుంటూ వెనక్కెళ్ళి గడ్డి మోపెత్తుకొచ్చింది. ఆమే మా అమ్మ అన్నపూర్ణమ్మ! ఆచెట్టును కాపాడుకోవాలన్న తపన, భూత దయ, బాగా అలిసిపోయున్న సమయంలో గూడ ఆమెలో అంతశక్తిని కలిగించినాయి. ఆ చెట్టును కాపాడాగలిగానన్న తృప్తి, ఆనందం, ఆమెచూపుల్లో జాలువారటం నాకిప్పటికీ గుర్తుంది. **'చెట్లను కాపాడండి, అవి మిమ్మల్ని కాపాడతాయి'** అన్న దైవ సందేశాన్ని తెలియకుండానే పాటించింది అమ్మ!

అగస్త్య

ఇక 2003లో పత్రికాముఖంగా వచ్చిన మరో వాస్తవ సంఘటన ఇది. ఐదో తరగతి చదువుతున్న కలవారింటబ్బాయి అగస్త్యకు దీపావళి

టపాకాయల కోసమని వెయ్యి రూపాయలిచ్చాడు వాళ్ళ తాతయ్య. వాటి కోసం వెళ్తున్న ఆ బాబు దారి పక్కన ఓ పూరింటి ముందు 24 గంటల జబ్బు (ఎపెండి సైడ్) తో ఒక బాలుడూ, అతనికి వైద్యం చేయించేందుకు డబ్బుల్లేవంటూ అతనితల్లి దీనంగా ఏడుస్తున్న దృశ్యాన్ని చూశాడు. అయ్యోపాపం అంటున్నారే గాని అక్కడ చేరిన వాళ్ళెవరూ సాయం చేయకపోవటం చూసి చలించిన అగస్త్య తనవద్ద ఉన్న వెయ్యి రూపాయలాతల్లికిచ్చి వైద్యం చేయించమన్నాడు. తక్షణం ఆపరేషన్‌చేసి ఆ బాలుణ్ణి బ్రతికించిన డాక్టర్లు, సమయానికి తీసుకొచ్చి మంచి పని చేశారు. ఇంకేమాత్రం ఆలస్యమైనా యీ బాబును బ్రతికించటం కష్టమయ్యేదన్నారు. అప్పుడే కళ్ళు తెరచిన ఆ బాలుడు నీరసం గానే అగస్త్య వైపు చూస్తూ చాలా చాలా థ్యాంక్స్ అన్నాడు. ఆ తల్లైతే అగస్త్య దగ్గరగా వెళ్ళి, ఆనంద బాష్పాలతో అతని తల నిమురుతూ, బాబూ! నా ఆయుష్షు గూడ పోసుకుని నిండు నూరేళ్ళు వర్ధిల్లయ్యా అంటూ హృదయపూర్వకంగా ఆశీర్వదించింది. ఆ తల్లీ కొడుకులిద్దరూ తన పట్ల చూపుతున్న కృతజ్ఞత, ఆప్యాయతలు, వారి చూపుల్లో జాలువారుతున్న ఆనందపు కాంతులూ అగస్త్య కెంతో తృప్తినీ, ఆనందాన్ని కలిగించినాయి.

ఆ మరుసటిరోజు సాయంత్రం మేడమీద అటూ, యిటూ తిరుగుతూ యిరుగు పొరుగు పిల్లలు కాల్చే టపాసుల మోతల్ని, మతాబులు, తారాజువ్వల వెలుగుల్నీచూస్తూ ఉన్నాడు అగస్త్య. అతను మతాబులు కాల్చకపోవటానికి కారణమడిగి తెలుసుకున్న తాతయ్య 'మరి నన్నడిగుంటే మళ్ళీ యిచ్చుండే వాడ్ని గదా నాన్నా...' అన్నాడు. మరి మతాబులు కాల్చకున్నా యింత ఆనందంగా ఎలా ఉండగల్గుతున్నావంటుంది వాళ్ళ నానమ్మ. ప్రాణాపాయం నుండి బయటపడిన ఆ అబ్బాయి, వాళ్ళమ్మా కృతజ్ఞతా భావంతో నావైపు చూసిన చూపుల్లోని ఆనందపు కాంతులు, ఈ టపాసులూ మతాబుల వెలుగులకన్నా నాకెక్కువ ఆనందాన్ని కలిగిస్తున్నాయి

తాతగారూ, నిజంనానీ.. అంటున్న మనువణ్ణి చూసి మురుసుకుంటూ ఆప్యాయంగా అతని తల నిమిరాడు తాతయ్య! వాళ్ళనానీ స్వర్ణమ్మైతే మనవణ్ణెత్తుకుని, అతని ముఖాన్ని ముద్దుల్తో అభిషేకించింది. అప్పుడే అక్కడి కొచ్చిన వాళ్ళ నాన్న విక్రాంత్, అమ్మ అపూర్వ తమ తనయుడు చేసిన సత్కార్యానికి పొంగిపోతూ హృదయానికి హత్తుకుని ముద్దాడారు అగస్త్యను. చాలామంచి పనిచేశావు చిట్టితండ్రీ! అంటూ తల్లీ! చాలా గొప్ప పనిచేశావు అగస్త్యా అంటూ తండ్రీ! తనను అలా అభినందింస్తుంటేను, తాతయ్యా! నానమ్మలు తనవైపు తృప్తిగా, ఆనందంగా, సగర్వంగా చూస్తుంటేను ఆనందంతో పరవశించిపోయాడు అగస్త్య!

ఆనాటి మా అమ్మ అన్నపూర్ణమ్మ, ఆ చిన్నారి అగస్త్య మెదళ్ళలో గూడ మెసాలింబిక్ వ్యవస్థ చైతన్యవంతమై ఆక్సిటోషన్ వంటి ఫీల్‌గుడ్ రసాయనాలు ఉత్పత్తి అయ్యే ఉంటాయనటంలో సందేహమేమీ లేదు.

అబ్రహాంలింకన్

పరోపకారులకు అప్పుడప్పుడూ పుణ్యకార్యం చేసిన తక్షణమే, అరుదైన అనూహ్యమైన బహుమతిని గూడ ప్రసాదిస్తుంటాడు పరమాత్మ. అట్టి అరుదైన ఓ సంఘటన అబ్రహాం లింకన్ జీవితంలో జరిగింది. ఒకసారి భయంకర తుఫానులో సముద్రపు ఒడ్డుకు అల్లంత దూరాన ఓడ యొకటి మునిగి పోతుంటుంది. అందలి ప్రయాణీకుల్ని కాపాడాలంటే సముద్రపు రేవునుండి నావల్ని ఓడ ప్రాంతానికి నడుపుకుంటూ వెళ్ళి వాళ్ళ నెక్కించుకు రావాలి. ఆ భీకర తుఫానులో నావ అటు నడుపుకెళ్ళటానికి ఎవరికి వాళ్ళే తటపటాయిస్తున్నారు. కానీ, అబ్రహాం లింకన్ నావను నడుపు కెళ్ళేందుకు తనకనుమతి నిమ్మని తల్లిని కోరాడు. అప్పటి కార్నెల్ల క్రితం సముద్రంలో కెళ్ళిన అతని తండ్రి ఇంకా తిరిగిరానేలేదు. అతను చనిపోయి ఉంటాడని భావించారందరూ. అందువలన తనకాధారం కొడుకు అబ్రహం లింకన్ ఒక్కడే. అందుకామె ఆలోచనలో పడింది.కానీ, ఓడ వైపు చూస్తున్న ఆమెకిలా

అనిపించింది. ఓడలోని వాళ్ళను కాపాడకుంటే ఎంతోమంది తనలా అనాథలౌతారు. అంతమంది నిరాధారులు కావటం కంటే, తనొక్కతే అనాథగా మిగిలిపోవటం మేలుగదా యన్న నిర్ణయాని కొచ్చిన తల్లి, సరే జాగ్రత్తగా వెళ్ళి వాళ్ళను కాపాడునాయనా, నిన్నాభగవంతుడు కాపాడుగాక! అంటూ ఆకాశంవైపు చేతులు జోడించిందామె. తక్షణం ఒక్క ఉదుటున నావను నడుపుకుంటూ వెళ్ళాడు అబ్రహాం లింకన్. దఫాల వారీగా పలువురిని కాపాడాడతను. అలా అతను కాపాడిన వారిలో, అతని తండ్రిగూడ ఉన్నాడు. అదే భగవంతుడతనికి, అతని తల్లికి యిచ్చిన గొప్ప బహుమతి. గీత 12-13 **"అందరిపట్లా దయగలిగి ఉండేవారు నాకు ప్రియభక్తులు."** దీనిప్రకారం ఆపదలో ఉన్నవారిని దయతో కాపాడిన అబ్రహాం లింకన్ దయతో వారిని కాపాడేందుకనుమతించిన ఆయన తల్లీ భగవంతునకు ప్రియ భక్తులయ్యారు. అందుకే చనిపోయాడనుకుంటున్న అతని తండ్రిని, ఆమె భర్తను అనూహ్యమైన, అమూల్యమైన బహుమతిగా వారికందించాడు పరమాత్మ!

విరాజ్ ఉజ్వల్ : గీత 12-15 లోకాన్ని క్షోభిల్ల జేయక, లోకం చేత తాను క్షోభిల్లక యుండువాడు, నాకు ప్రియుడంటున్నాడు పరమాత్మ! ఈ గీతయొక్క ఆంతర్యాన్ని వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ప్రకృతిలో ఇచ్చిపుచ్చుకుంటూ సామరస్యంగా జీవించాలన్నది సృష్టి ప్రణాళికా నియమం. దీన్ని ధిక్కరిస్తూ వ్యక్తిగత సుఖ సౌఖ్యాలకోసం, వ్యాపారార్థం ప్రకృతిని శాసించేందుకు యత్నిస్తూ మనిషి లోకాన్ని క్షోభిల్లజేసి, తద్వారా తానూక్షోభిల్లుతున్నాడు.

ఉదా॥ 1. వ్యాపారార్థం, కలప స్మగ్లింగ్ కోసం విచక్షణారహితంగా అడవుల్ని నరికి అటవీ సమతౌల్యానికి భంగం కలిగిస్తున్నారు పలువురు. అలాగే విశృంఖలంగా వాహన, ఇంధన కాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. తత్కారణంగా భూమిమీద కార్బన్‌డైయాక్సైడ్ శాతం పెరిగి, ప్రాణవాయువు తగ్గిపోతున్నది.

ఫలితంగా ఏర్పడిన గ్లోబల్ వార్మింగ్‌తో భూగోళం వేడెక్కి, పంటలు, ప్రాణులూ నశిస్తాయి. ఉదా॥ ఇటీవలే ఐ.యు.సి.ఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ & నేచురల్ రిసోర్సెస్) సంస్థ ప్రకటించిన రెడ్‌లిస్ట్‌లో 85% మొక్కలు, ప్రాణులూ ఉన్నాయి. మరి ఇది లోకాన్ని క్షోభింపచేయటమే గదా ఉజ్వల్? మన దేశంలో 33.3%గా ఉండాల్సిన అడవులు 19%కి పడిపోయినాయి. మరి, ఇదెంతటి ప్రమాదానికి సంకేతమో గ్రహించండి పిల్లలూ!

ఉదా॥ 2. ఏప్రాంతంలో పండే పంటలు, ఫలాలు, పూలూ, ఉపయోగకరమైన వృక్షాలు, ఆ ప్రాంతంలో మాత్రమే అనువుగా పండుతాయి. ఫలిస్తాయి. చిత్తూరు జిల్లా శేషాచలం అడవుల్లో విస్తారంగా పెరుగుతున్న మేలైన ఎర్రచందనం చెట్లు ప్రపంచంలో మరెక్కడా పెరగకపోవటం అందుకొక నిదర్శనం. ఐతే అధిక దిగుబడుల కోసమని విదేశాలనుండి కొత్త కొత్త వంగడాలను తెచ్చి అంతటా పండించేందుకు యత్నిస్తున్నాం. కానీ కొత్తప్రాంతం, భౌగోళిక వాతావరణం సరిపడక, కొత్తవి పండటమూ లేదు, కొత్తవాటి మోజులోపడి ప్రాంతీయ, సాంప్రదాయ వంగడాలను నిర్లక్ష్యం చేయటం వలన అవి కనుమరుగై, రెంటికీ చెడ్డ రేవడుల మౌతున్నాం. – అలాగే ఆయా ప్రదేశాలలో, దేశాలలో అక్కడి భౌగోళిక వాతావరణానికి అనుగుణంగా రూపొందింపబడినవే ఆయా సంప్రదాయాలు, దుస్తులు, గృహనిర్మాణాలు, ఆచార, ఆహార, వ్యవహారాదులు. అవి పాశ్చాత్యదేశాలలో ఒక విధంగా అరేబియన్ దేశాల్లో మరోరకంగా, భారత్‌వంటి దేశాల్లో యింకో విధంగా ఉంటాయి. ఇవన్నీ ఏ ప్రాంతానికి చెందినవి ఆ ప్రాంతం వారికి క్షేమదాయకంగా ఉంటాయి. ఈ వాస్తవాన్ని విస్మరించి, ఒక దేశం వారు ఇంకో దేశం వారిని అనుకరిస్తూ ఉండటం లేక ఒకరి ఆచార, ఆహార, వ్యవహారాదులను యింకొకరు ద్వేషించటం, అసహ్యించుకోవటం, కలహానికి, కయ్యానికి రహదారులు! మరియు పతనానికి సంకేతాలు! అట్టి అజ్ఞాన ప్రవృత్తి గూడ లోకాన్ని క్షోభింపచేసేదే.

ఉదా॥ 3. ప్రకృతి సంపదను, భూగర్భ వనరులను యెంత యెక్కువగా వాడుకుంటే అంత అత్యధికంగా అభివృద్ధి చెందుతామన్నది తప్పుడు భావన. అట్టి ప్రమాదకరమైన ఆలోచనతో ఉరుకులు, పరుగులు పెడుతున్నది నేటి వ్యాపార ప్రపంచం. కానీ, విచక్షణారహితంగా ప్రకృతి వనరులను కొల్లగొట్టుకోవటం ప్రమాదకరం. ఎందుకంటే వాటిల్లో యే ఒక్క వనరు అయిపోయినా దాని ఆధారంతో రూపొందే వస్తూత్పత్తి అంతా నిలిచిపోతుంది. తద్వారా ఆర్థికవ్యవస్థ అంతా కుప్పగూలుతుంది. అంటే వనరుల క్షీణత, ఆర్థిక క్షీణతకు, అది మానవ క్షీణతకూ, రహదారియని స్పష్టమౌతున్నది. అందువలన, వనరుల వాడకంలో క్రమశిక్షణ పాటించని వారంతా లోకాన్ని క్షోభిల్లజేస్తున్నట్లే! – అలాగే, **ధర్మ మార్గంలో ధనం సంపాదించుకుంటూ ధర్మమార్గంలో కామం తీర్చుకునే సృష్టిప్రణాళికా నియమాన్ని ధిక్కరించిన వారంతా అవినీతి భూతాలుగ, ఎయిడ్స్‌పిశాచాలుగా లోకాన్ని క్షోభిల్లజేస్తున్నట్లే!** (గీత 7-7) **దారానికి గుచ్చబడిన మణుల్లా పరమాత్మ చేత గుచ్చబడిన విశ్వపదార్థాలన్నీ పరస్పరాధారితాలన్న సత్యాన్ని గుర్తుంచుకుని ప్రకృతి వనరుల విషయంలో విధిగా క్రమ శిక్షణను పాటించాలి.** (గీత 13-28) **అంతటా సమంగా విస్తరించి ఉన్నది ఈశ్వరుడేనన్న వాస్తవాన్ని గుర్తుంచుకుని ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకుంటూ తదితర మానవీయ లక్షణాలను పెంపొందించుకుంటూ సృష్టి ప్రణాళికానుగుణంగా నడుచుకోమంటున్నది భగవద్గీత!**

మిక్కిలి వైవిధ్యం, అత్యంత విశిష్టతలతో, ప్రాణికోటి కాలవాలమైనట్టి అపూర్వం, అద్భుతమైనది ఒకే ఒక్క భూగోళం! అత్యుత్తమ ప్రాణియైన మానవునీ, అతని ద్వారా ప్రాణికోటినీ విశ్వమంతటా విస్తరింప చేసేందుకు, తనంతవానిగా మనిషిని తీర్చిదిద్దేందుకై అతనికి శిక్షణ నివ్వటానికి పరమాత్మ రూపొందించుకున్న వ్యాయామశాలయే ఈ భూగోళం! మరి, మనం వ్యక్తిగత స్వార్థానికి లోనై చేజేతులారా

పాడుచేసుకుంటే, దీన్ని పునర్నిర్మించుకోగలమా చెప్పండి? అందుకే భావి ప్రపంచ పౌరులారా! ఎన్నడూ భూలోకాన్ని క్షోభిల్ల జేయకండి. మీరూ క్షోభించకండి. తస్మాత్ జాగ్రత! జాగ్రత! జాగ్రత! ఇప్పుడే జాగరూకులుకండి!

యువన్ తేజల్ : మానవులెదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలంటూ లేవా?

వ్యాఖ్యాత : ఉన్నాయి. ఐతే వాటికోసం వెదకాలి. సమస్యలకటు తాత్కాలిక పరిష్కారాలను కనుక్కోవటంతోపాటు, శాశ్వత పరిష్కారాలకోసం నిరంతరం అన్వేషిస్తుండాలి. మనిషిని సుశిక్షితుని చేసేందుకు ఈ ప్రక్రియను తన సృష్టి ప్రణాళికా నియమంగా చేశాడు పరమాత్మ. **తాత్కాలిక పరిష్కారాల కోసం విజ్ఞానశాస్త్రం! శాశ్వత పరిష్కారాలకోసం ఆధ్యాత్మిక శాస్త్రం. యిరెండింటినీ ఆశ్రయించాల్సిందే మానవులు.**

విజ్ఞాన శాస్త్రం : శాశ్వత పరిష్కారాలను చూపటంలో తరచూ విఫలమౌతూ, ప్రకృతిమీద ప్రాణంమీద ఆధిపత్యంకోసం ప్రయత్నిస్తున్నది సైన్సు. మనిషికిది తాత్కాలిక సుఖ సంతోషాలను కల్గించగల్గుతున్నదిగానీ ఆ తర్వాత అది మనిషి సుఖశాంతులనేకాదు, అతని ఉనికినే సవాలుచేసే పెద్ద ముప్పు యేదో ఒకటి సంభవిస్తుంటుంది. ఉదా॥ విచ్చలవిడి శృంగారం వలన కలిగే సిఫిలిస్, గనేరియా వంటి సుఖవ్యాధులకు అనేక రకాల రోగ నిరోధక ఔషధాలను, నిరోధ్‌లనూ కనుగొన్నది సైన్సు కానీ, అనంతరం యే మందుకు లొంగని 'హెచ్ఐవి' మానవాళి ఉనికికే ప్రమాదంగా మారింది కదా?

ఆధ్యాత్మిక శాస్త్రం : సమస్యలయొక్క అంతరంగిక మూలకారణాలను కనుగొని వాటి శాశ్వత పరిష్కారం కోసం సృష్టిప్రణాళికా నియమానుసారం ప్రకృతితో సామరస్యంగా మసలుకునే రహదారిని చూపుతుంది భగవద్గీత వంటి ఆధ్యాత్మిక శాస్త్రం. ఆ రెండూ చూపే పరిష్కారాలిలా ఉంటాయి.

విజ్ఞాన శాస్త్రం :

1. వర్షాలు పడకుంటే, మేఘ మధనం చేద్దాం అంటుంది సైన్సు. 2. భూమిమీది వేడినుండి ఏసిలు, కూలర్లు, ఫ్రిజ్‌ల ద్వారా ఉపశమనం కలిగిస్తుంది సైన్సు. 3. సుఖవ్యాధుల నిరోధానికి, నిరోధ్‌లు, రోగ నివారక ఔషధాలను కనుగొంటున్నది విజ్ఞానశాస్త్రం.

ఆధ్యాత్మిక శాస్త్రం : 1. అటవీ సమతౌల్యాన్నీ, పర్యావరణాన్నీ సదా పరిరక్షించుకుందామంటుంది ఆధ్యాత్మిక శాస్త్రం. 2. వేడిమి పెంచే ఇంధనాల వాడకంలో, ఫ్లూరో కార్బన్ల విడుదలలో, పారిశ్రామిక కాలుష్యాల విడుదల విషయంలో క్రమశిక్షణను పాటిద్దామంటున్నది ఆధ్యాత్మిక శాస్త్రం. 3. విచ్చల విడి శృంగారమే సుఖవ్యాధులకు మూలం గనుక, ఏక సతీ, పతీవ్రతం ద్వారా ధర్మమార్గంలో కామాన్ని తీర్చుకోమంటున్నది ఆధ్యాత్మిక శాస్త్రం.

ఈ ఉదాహరణల ద్వారా మీరేం గ్రహించారో చెప్పగలరా పిల్లలూ?

హర్షవర్ధన్ : ఎదురౌతున్న విపత్తులన్నింటికీ తాత్కాలిక పరిష్కారాలను కనుగొంటూ ముందు కెళ్తూనే ఉంటుంది సైన్సు. కానీ, వాటికి మూల కారణాలను ఛేదించలేదు. ప్రతి విపత్తుకూ దాని అంతరంగిక మూలకారణాల పట్ల అవగాహన కలిగించి, సృష్టి ప్రణాళికా నియమానుసారం ప్రకృతితో సామరస్యంగా మసలుకునే ప్రమాదరహిత మార్గాన్ని చూపుతుంది ఆధ్యాత్మిక శాస్త్రం. కాబట్టి, ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ప్రాచీన ఆధ్యాత్మిక శాస్త్రమనే రెండు పట్టాలనూ పటిష్టపరచుకుంటేనే మన సామాజిక రైలుబండి నిరపాయకరంగా పయనిస్తుంది. భగవద్గీత వంటి ఆధ్యాత్మిక శాస్త్ర ప్రబోధ మిదేగదా తాతగారూ?

వ్యాఖ్యాత : శభాష్ హర్షా! గీతా సందేశాన్ని చాలా చక్కగా గ్రహించావు బాబూ!

రిత్విక్ : సమాజంలో ఈ మంచీ-చెడులు ఎప్పటిదాకా కొనసాగుతుంటాయి తాతగారూ?

వ్యాఖ్యాత : నిరంతరంగా, నిర్విరామంగా ఇవి కొనసాగుతూనే ఉంటాయి రిత్విక్. ఎందుకంటే మీకింతకు ముందు చెప్పినట్లే, **పాజిటివ్ (సానుకూల) ప్రోటాన్లు – నెగెటివ్ (ప్రతికూల) ఎలక్ట్రాన్లు గల పరమాణువులతోనే గదా విశ్వాన్ని సృష్టించాడు పరమాత్మ. ఆకారణంగానే అమృతము–హాలాహలం ఒకే చోటునుండి పుట్టినాయి. పాండవులు, కౌరవులూ ఒకే వంశంలో జన్మించారు.** పైరులూ, కలుపు మొక్కలూ ఒకే చేలో పెరుగుతుంటాయి. ఇంకా చెప్పాలంటే ఒకే వ్యక్తిలో సదాలోచనలూ, దురాలోచనలూ కలిసే సాగుతుంటాయి. ఐతే కలుపు మొక్కల్ని పదే పదే పెరికేయబడిన రైతు చేనిలో పైరు బాగా ఫలిస్తుంది. సదా దురాలోచనల్ని నిర్మూలించుకోగల్గిన మనిషిలో సత్సంకల్పాలు, సదాలోచనలు ప్రవర్ధిల్లుతాయి. అలాంటి సజ్జనులనుండే సత్కార్యాలు ప్రవహిస్తుంటాయి. అవి లోక కళ్యాణానికి, విశ్వ శాంతికి పునాదులౌతాయి.

ఆదిత్య : మరి తనలోని మంచీ చెడులను గుర్తించటానికి, చెడును విసర్జించి, మంచిని స్వీకరించేందుకు మనిషి వేటిని ఆశ్రయించాలి తాతయ్యా?

వ్యాఖ్యాత : మంచీ, చెడులను గుర్తించడానికి విచక్షణ జ్ఞానాన్నీ చెడును వదిలేసి మంచినే స్వీకరించుమని సదా ఆదేశించేందుకు అంతరాత్మను ప్రతిప్రాణిలో ప్రతిమనిషిలోనూ నిక్షిప్తం చేశాడు గదా పరమాత్మ.

అగస్త్య : ఐనా సరే మరి మానవులు ప్రగతిదిశయని భ్రమిస్తూ ప్రమాద దిశవైపు పయనిస్తున్నారెందుకని తాతగారూ?

అన్వేష్ : ఎందుకంటే, మనుషులు తాత్కాలిక సుఖాలు, ఆకర్షణలు, రుచులు, లాభాలు, ఇంకా రకరకాల ప్రలోభాలకు లోనై, విచక్షణ జ్ఞానాన్ని, అంతరాత్మను ధిక్కరిస్తూ మనసుకు నచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఆధునిక శాస్త్ర జ్ఞానాన్ని అతిగా నమ్ముకుని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకే విలువల్ని గాలికొదిలేసి కేవలం విజయాల వెంట పరుగులు తీస్తూ

ప్రమాదపుటంచుకు వెళ్ళిపోతున్నది సమాజం. ఇట్టి ప్రమాదం నుండి మన సమాజాన్ని కాపాడు కోవాలంటే మానవులేది తినవచ్చో ఏది తినరాదో, వారికర్తవ్యమేదో, అకర్తవ్యమేదో, ఆవేశకావేశాలను, రాగ ద్వేషాదుల నెలా నిగ్రహించుకోవచ్చో సాటి మానవాళిని, ప్రాణుల్ని ఎందుకు ప్రేమించాలో, లోకకళ్యాణార్ధం విశ్వశాంతికోసం ఎందుకు పాటుపడాలో, **ప్రతి ఒక్కరి క్షేమం, అందరి, అన్నింటి క్షేమంతో ఎలా ముడిపడి వుందో సోదాహరణంగా, సహేతుకంగా ప్రబోధించిన భగవద్గీత వంటి అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథాధ్యయనమే తిరుగులేని పరిష్కార మార్గం!** అని మనకు స్పష్ట మౌతున్నది. అందుకే మేం గ్రహించిన యీ గీతా సందేశామృతాన్ని భారతీయులకే గాదు, ప్రపంచ పౌరులందరికీ అందజేయాలి. అందుకు మావంతు కృషిని మేం తప్పక నిర్వహిస్తాం.

వ్యాఖ్యాత : తథాస్తు చిరంజీవులారా! మీ ఈ విధి నిర్వహణకు పరమాత్మ ఆశీస్సులు మీకు సదా ప్రాప్తించును గాక!

తరణ్ : (గీత 3-21) శ్రేష్ఠుడేపనిజేస్తే లోకులదే పని చేస్తుంటారని చెబుతున్నది గదా, ఇదెంత వరకు వాస్తవం తాతగారూ?

వ్యాఖ్యాత : ఇదీ సృష్టిప్రణాళికలోని ఒక నియమమే. ఇది భగవంతుడు మానవాళికి చేసే జ్ఞానబోధనా ప్రక్రియలో భాగమే తరణ్! భగవంతుడు మానవాళికి బోధించడానికి 1. మనిషిలో అంతరాత్మను, విచక్షణజ్ఞానాన్ని నిక్షిప్తం చేసాడు. 2. మహర్షుల, జ్ఞానుల ధార్మిక గ్రంథాల, బోధల ద్వారా మానవాళికి ప్రబోధింపజేస్తున్నాడు. 3. శ్రేష్ఠులను ఆదర్శంగా చేసుకుని వారు చేస్తున్నట్లే చేసి, వారు నడిచే మార్గాన, నడిచే స్వభావాన్ని గూడ మానవాళిలో నిక్షిప్తం చేసాడు. తద్వారా ప్రపంచం యొక్క గజిబిజి నుండి మానవాళిని సురక్షిత మార్గాన పయనింపచేసేందుకు వారికిలా జ్ఞానబోధ చేసే విధానాన్ని తన సృష్టి ప్రణాళికలో పొందు పరచుకున్నాడు పరమాత్మ.

వశిష్ఠ : ఒక వేళ శ్రేష్ఠుడే పొరపాటు చేశాడనుకో, మరప్పుడెలా తాతగారూ?

వ్యాఖ్యాత : అందుకే శ్రేష్ఠుడు చిన్నపొరపాటు చేసినా సహించడు సర్వేశ్వరుడు. ఎందుకంటే డాక్టరు తప్పుచేస్తే పేషంటూ, ఇంజనీరు తప్పుచేస్తే ఒక కట్టడం, దెబ్బతింటాయి. బోధించే శ్రేష్ఠుడే తప్పుచేస్తే మానవ సమాజమంతా పాడైపోతుంది. అందువలన శ్రేష్ఠులు, జ్ఞానులు, ఎప్పుడూ, ఎక్కడా పొరపాటుకు, అనాలోచనకు, బలహీనతకు లోనుకాకుండా నిరంతరం అప్రమత్తులై వ్యవహరిస్తుండాలి. **చంద్రునికి మచ్చవున్నా పర్వాలేదు గాని శ్రేష్ఠునకు చిన్న మచ్చగూడ ఉండరాదన్నది సృష్టి ప్రణాళికానియమం!** అందుకే అవతార పురుషోత్తముడైన గౌతమ బుద్ధుడు గూడ, అతను చేసిన ఒక అనాలోచిత చర్యకారణంగా ఆకాశవాణిచే తీవ్రంగా హెచ్చరించబడ్డాడిలా.

బోధివృక్షం కింద తపస్సు చేస్తున్న సమయంలో రోజూ సమీప జలాశయంలో స్నానం చేసి వస్తుండేవాడు సిద్ధార్థుడు. సదరు జలాశయం తామరలు, వాటి పుష్పాలతో అల్లుకు పోయివుంది. ఒక రోజు సిద్ధార్థునికన్నా ముందుగా వచ్చిన వేటగాడొకడు జలాశయంలో దిగాడు. అంతటా అల్లుకుని యున్న తామరలను చూసి చికాకు పడుతూ, వాటిని చెడా మడా పెరికి, వాట్లు వాట్లుగా తెచ్చి ఒడ్డున వేశాడు. తర్వాత అందులో తనివిదీరా ఈది వెళ్ళి పోయాడు.

సిద్ధార్థుడదే జలాశయంలో మరోదిక్కుగా దిగి స్నానం చేసి దేన్నిగూర్చో తదేకంగా ఆలోచిస్తూ, అసంకల్పితంగానే ఒక తామరపువ్వును తెంపి పట్టుకుని ఒడ్డెక్కాడు. సుదీర్ఘాలోచనా మగ్నుడైన గౌతముడు అనాలోచితంగా తామర పూరెమ్మలను ఒక్కొటొక్కటిగా తుంపి పడేసుకుంటూ, బోధివృక్షం చెంతకొస్తున్నాడు. హటాత్తుగా సిద్ధార్థా ఆగు! నీలాగే జీవిస్తున్న తామర పువ్వును తెంపి ఖండ ఖండాలుగా చిద్రంచేసే హక్కును నీకెవరిచ్చారు? ఈ అమానవీయ చర్య కారణంగా శిక్షార్హుడవయ్యావు నీవు! అన్న ఆకాశవాణి

వినిపించింది. అప్పుడు సిద్ధార్థుడు ఆకాశం వైపు చూస్తూ అమ్మా వేటగాడు గుట్టలు గుట్టలుగా తామరలను తెంపివేసినా పల్లెత్తు మాటనని నీవు, కేవలం ఒక్కపువ్వును అదీ కావాలని తుంపలేదు, నీవాణి వినిపించేదాక అసలు దాన్ని తుంపానన్న స్పృహే లేదు నాకు. అట్టి నేను శిక్షార్హుడినా? అతనికోన్యాయం, నాకో న్యాయమా తల్లీ? అని ప్రశ్నించాడు. చూడు సిద్ధార్థా! అతనో మూర్ఖుడు, అతనేం చేసినా ఎవ్వరూ పట్టించుకోరు. కానీ శ్రేష్ఠుడవు, జ్ఞానివైన నిన్ను లోకులంతా అనుసరిస్తుంటారు. నీవేది చేస్తే సామాన్యులదే చేస్తుంటారు. నీవు ఒక్క తప్పుచేసినా అందరూ అదే తప్పు చేస్తారు. అలా లోకమంతా పాడుకావటానికి నీవు కారకుడవౌతావు. అందుకే నీవల్ల అసంకల్పితంగా నైనా సరే చిన్న పొరపాటుగూడ జరక్కుండా సదా జాగరూకుడవై ఉండాలి. తస్మాత్ జాగ్రత! అని మరో మారు హెచ్చరించింది ఆకాశవాణి. అందుకే తస్మాత్ జాగ్రత! శ్రేష్ఠులైన మీరెప్పుడూ తప్పులు చేయకండి విద్యార్థులారా!

జయరామ్ : మరి ప్రజలందర్నీ సిద్ధార్థునిలా శ్రేష్ఠులుగా, జ్ఞానులుగా రూపొందించవచ్చు గదా తాతయ్యా?

వ్యాఖ్యాత : (గీత 3-25, 26) ఫలాపేక్షతోనే పామరులు శ్రమిస్తుంటారు. ఐతే జ్ఞానులు మాత్రం ఫలాపేక్షరహితంగా లోకకళ్యాణం కోసం శ్రమిస్తుండాలేగాని, ఫలాపేక్షనుండి సామాన్యుల బుద్ధిని మళ్ళించేందుకు ప్రయత్నించరాదు. ఎందుకంటే? ఫలాపేక్ష, ఆసక్తి యీ రెండే పలురకాల పనులుచేసేలా వారిని ప్రేరేపిస్తుంటాయి. వారలా అన్ని రకాల పనులు చేస్తుంటేనే అందరి అవసరాలు తీరుతున్నాయి. అదే సమయంలో వారి అధర్మమార్గం పట్టకుండా ధర్మమార్గాన పయనించేలా, ఫలాపేక్ష రహితంగా ప్రబోధిస్తూ లోక కళ్యాణానికి పాటు పడుతుండాలి జ్ఞానులు! **సామాన్యులు, జ్ఞానులూ అలా జోడుగుర్రాల్లా పయనిస్తుంటేనే సామాజిక రథం ప్రగతి పథాన పయనిస్తూ గమ్యానికి చేరుతుంది. ఇదే గీతా సందేశామృతం!**

సుధీర్ : (గీత 5-3) రాగ ద్వేష రహితుడు సన్యసింపకున్నా సన్యాసియంత గొప్పవాడని అంటున్నది గదా గీత. కానీ, చెడ్డవారిని, దుర్మార్గుల్ని ద్వేషించకుండా, మంచివారిని పరోపకారులను ప్రేమించకుండాను ఎలా ఉండగలం తాతగారూ?

ఆరాధ్య : (గీత 6-8)లో మట్టిని, రాతిని, బంగారాన్నీ ఒక్కటిగ చూడ గల్గినవాడు జ్ఞానియని అంటున్నది గీత. కానీ, జ్ఞానియైనా, అజ్ఞానియైనా, బంగారాన్ని భద్రపరచుకుంటారే గాని మట్టిని, రాయినీ దాచుకోరుగా తాతయ్యా?

వ్యాఖ్యాత : చూడండి పిల్లలూ ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లూ గల పరమాణువులతోనే గదా పదార్థాలు, ప్రాణులన్నీ, సృష్టించబడ్డాయి. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల సంఖ్యాభేదంతోనే మూలకాలు, వాటిమిశ్రమాలతోనే మట్టి, రాయి, బంగారం వంటి భిన్న పదార్థాలు, ఉత్తమ, అధమ ప్రాణులూ రూపొందాయన్నది, వీటన్నింటికి ఉత్పత్తి స్థానం పరమాత్మయొక్క చైతన్యశక్తేనన్నది వాస్తవం. అందువలన, **పరమాత్మ అంశతో ఉద్భవించిన మట్టి, రాయి, బంగారం, మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళందరినీ సమభావంతో, అంటే అన్నింటినీ పరమాత్మయొక్క సంభూతాలుగా గ్రహించగల్గినవాడు జ్ఞానియన్నదే గీతా సందేశం.**

ఇక దుష్టులు, దుర్మార్గుల పట్ల కలిగే ద్వేషాన్ని, ఆగ్రహాన్ని నిగ్రహించుకో గలిగేదెలా? అనే గదా మీ సందేహం? ఉదాహరణకు సినిమాలోని విలన్ పాత్ర భీభత్సాన్ని, భయంకర విధ్వంసాన్నీ సృష్టిస్తుంటాడు. కుట్రలు, కుతంత్రాలు చేస్తుంటాడు. ఐనా విలన్‌పాత్రధారిని మీరు ద్వేషించరు, ఎందుకని?

కావ్య : ఎందుకంటే? కుట్రలు, కుతంత్రాలు, భయంకర విధ్వంసాల ద్వారా మంచి వాళ్ళూ, అమాయకులూ ఎలాబలైపోతారో, తద్వారా సమాజంలో

ఎంత అశాంతి నెలకొంటుందో, దుర్మార్గుడు అంతిమంగా ఎలా నశిస్తాడో నన్న సందేశాన్ని విలన్ పాత్రధారి ద్వారా ప్రజల కందజేస్తున్నాడు చలన చిత్రదర్శకుడు. అట్టి సందేశాన్ని మనకందచేయడానికే విలన్‌చేత అలా నటింపచేశాడు దర్శకుడు. అందువలన మనం విలన్, పాత్రధారిని ద్వేషించం.

వ్యాఖ్యాత : కదా! మరి, అలాగే మనుషులచే చెడుచేయిస్తూ, అలాంటి వారిద్వారా సమాజానికెంత కీడు జరుగుతుందో, చివరికలాంటి వారెలా పతనమౌతారో తెలియజేయడం ద్వారా, మానవులను చెడువైపు పయనించకుండా, సన్మార్గాన నడిపించడానికై, విశ్వదర్శకుడైన పరమాత్మ చేత సృజించబడిన దుష్టపాత్రలేనన్న సత్యాన్ని గ్రహించగల్గితే వాళ్ళను ద్వేషించకుండా నిగ్రహించుకోగలం మరి.

శ్రేష్ఠ : మరి, అలాంటప్పుడు దుర్మార్గుల్ని వాళ్ళేంచేస్తున్నా ద్వేషించకుండా, వారినేం చేయకుండా వదిలేయాలంటారా తాతగారూ?

వ్యాఖ్యాత : చెడ్డవాళ్ళు తమవారైనా, పరాయివారైనా వదిలేయరాదు, ధర్మాన్ని కాపాడుకోటానికి తద్వారా మనల్ని కాపాడుకోటానికి దుర్మార్గులపై యుద్ధానికైనా వెనకాడరాదన్నదే గదా అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ చేసిన గీతా బోధ.

దయ, కృతజ్ఞతలు, సృష్టి ప్రణాళికా నియమాలే!

సాయికృత్తిక : (గీత 6-31) అందరి సుఖదుఃఖాలను తనవిగా భావించువాడు పరమశ్రేష్ఠుడు అంటున్నది గీత. నిజమా తాతయ్యా?

ఊహాశ్రీ : (గీత 9-22) అన్నింటి, అందరి క్షేమం కోసం పాటుపడటం ద్వారా నన్ను సేవించువాని యోగక్షేమాలను నేను చూచుకుంటానని చెబుతున్నాడు పరమాత్మ. ఇది వాస్తవమా తాతగారూ?

వ్యాఖ్యాత : నిజమే పిల్లలూ ఇతరుల పట్ల మనం చూపే దయను తిరిగి వేయింతలుగ మనపై వర్షింపజేస్తాడు పరమాత్మ. అంటూ గీతాభావాన్నే విపులీకరించారు రామకృష్ణ పరమహంస! ఇది వాస్తవమని మానవాళి విశ్వసించేందుకు నిదర్శనాలనదగిన సంఘటనలను అప్పుడప్పుడు, అక్కడక్కడా సంభవింపజేస్తూనే ఉన్నాడు పరమాత్మ. జర్మనీలో జరిగిన వాస్తవ సంఘటన ఇది. బెర్లిన్‌కు దూరంగా ఒక గ్రామంలో కెల్లీయను అనాథబాలుడు ఇల్లిల్లూ తిరిగి సామాన్లు అమ్ముకుని జీవిస్తూనే శ్రద్ధగా చదువుకుంటుండేవాడు. అప్పుడప్పుడు అతనికి పస్తులు తప్పటం లేదు. ఒకరోజు ఆకల్తో నీరసించిన కెల్లీ, ఓ యింటి తలుపుతట్టాడు. నిలబడలేక గోడకి చేరగిలపడ్డాడు. బాలుని వదనంలోని దీనతను చూసి అతని ఆకలిని గుర్తించిందామె. ఓ పెద్ద గ్లాసునిండా పాలుతెచ్చిచ్చింది. ఆకలితో ప్రాణం పోయేలా వున్న కెల్లీకి అవి అమృతంలా పనిచేశాయి. అవి త్రాగాక తేరుకుని థ్యాంక్స్ అమ్మా అంటూ కృతజ్ఞతా భావంతో ఆమె వైపు చూస్తూనే జేబులోని చిల్లరతడుముకుంటూ వీటి కెంతిమ్మంటారమ్మ అన్నాడు. దయతో యిచ్చిన వాటికి డబ్బు తీసుకోరాదని చెప్పింది మా అమ్మ వెళ్ళిరా బాబూ అంటూ లోపలికెళ్ళిందామె. ఆమె రూపాన్ని మననం చేసుకుంటూ, తన హృదయం నిండా ఆమెపట్ల కృతజ్ఞతా భావాన్ని నింపుకుని వెళ్ళాడు కెల్లీ! **"కృతజ్ఞతాభావం వ్యక్తిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుస్తుంది" అన్న మహర్షులవాక్కు ఫలించింది.**

చిల్లర మల్లరపనులు చేసుకుంటూనే శ్రద్ధగా చదివి డాక్టర్ కోవర్ట్ కెల్లీగ ఎదిగాడు ఆ అనాథబాలుడు. గొప్ప డాక్టరుగ పేరు ప్రఖ్యాతులతో బాటు సిరిసంపదలు గూడ సంపాదించాడు డా॥ కెల్లీ! – ఆ నేపథ్యంలోనే తీవ్ర సంక్షోభానికి గురైంది జర్మనీ. ఫలితంగా అనాథలై ఎందరెందరో రోడ్డున పడ్డారు. ఒకరోజు రోడ్డు ప్రక్కనే స్పృహతప్పిపడివున్న మహిళను చూసి కారు దిగాడు కెల్లీ. ఆ వృద్ధురాలిని చూడగానే యేదో గుర్తుకొచ్చిన

అతను ఆదుర్దాగా, ఆప్యాయంగా ఎత్తుకుని తన కార్లో చేర్చి, తను పనిచేస్తున్న కార్పోరేట్ హాస్పటల్లోనే చేర్పించాడామెను. ప్రత్యేక శ్రద్ధతో నెలరోజులపాటు ఖరీదైన వైద్యం చేసి ఆమెను బ్రతికించగలిగింది డా॥ కెల్లీ బృందం. అందుకైన ఖర్చునంతా తన ఖాతానుండి జమ చేసుకోమని హాస్పటల్ యాజమాన్యానికి చెప్పాడు కెల్లీ. ఇంకా బిల్లుకు బదులు డా॥కెల్లీ యిచ్చిన లేఖనుంచిన కవరును ఆమెకందించారు సిబ్బంది.

బికారినై వీధినబడిన నేనింత డబ్బెలా చెల్లించగలను దేవుడా అనుకుంటూ వణుకుతున్న చేతులతో కవరు తెరిచి చూసిందామె. బిల్లుకు బదులుగా "అమ్మా నాడు దయతో మీరిచ్చిన గ్లాసెడు పాలు నన్ను బ్రతికించి, యింతటివాణ్ణి చేసింది. అందుకుకొంతైనా మీరుణం తీర్చుకోటానికి నాకవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు!" డాక్టరు కెల్లీ. అని వ్రాసిన లేఖను చదివి, ఆనంద బాష్పాలతో ఆకాశంవైపు రెండుచేతులూ జోడించి, "హే ప్రభో! నాడు ఆకలిగొన్న బాలునిపట్ల నే చూపిన కాస్తంత దయనిలా వేయింతలుగా నాపైన కురిపించినందుకు నీకు శతకోటి ధన్యవాదాలు తండ్రీ! అంటూ ఆనందోద్వేగాన్ని ఆపుకోలేక అలా నమస్కరిస్తూనే ఏడ్చేసిందావృద్ధురాలు. ఈ వాస్తవగాథ పై భగవద్గీతలనే కాదు చిత్తశుద్ధికలిగి చేసిన పుణ్యంబు కొంచెమైన నదియు కొదువగాదు. విత్తనంబు మర్రి వృక్షంబునకునెంత? విశ్వదాభిరామ, వినురవేమ అన్న పద్యం కూడ రుజువు చేస్తున్నది.

అంతేగాదు, పరోపకార కృతజ్ఞతా స్వభావాలు వ్యక్తులకేగాక, ఒక్కోసారి అవి లోకానికి అంటే ప్రపంచానిక్కూడా ఎంతటి మేలు కలిగిస్తాయో చాటి చెప్పే వాస్తవ సంఘటనను గూడ వివరిస్తాను. శ్రద్ధగా వినండి పిల్లలూ!

విద్యార్థులు : ఊ... త్వరగా చెప్పండి తాతగారూ!

వ్యాఖ్యాత : స్కాట్‌లాండ్ దేశంలో జరిగిన వాస్తవ సంఘటన ఇది. ఫ్లెమింగ్ అను ఒక పేద రైతు తన పొలానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక బాలుని

ఆర్తనాదం వినిపించింది. ఆ దిశగా పెళ్ళిచూడగా అక్కడొక బాలుడు ఎరువు కుప్పలో కూరుకు పోయి, బయట పడటమెలాగో తెలియక, భయంతో ఏడుస్తూ తనను కాపాడమంటూ ఆర్తనాదాలు చేస్తున్నాడు. ఆ దృశ్యానికి చలించి పోయాడు ఫ్లెమింగ్. తక్షణం తన చేతిలోని పారతో చకచకా ఎరువుకుప్పను ఛేదించి, ఆ బాలుని కాపాడి అతన్ని ఊరిదాపు వరకు దిగవిడిచి తిరిగి తన పొలానికెళ్ళిపోయాడు.

ఆ మరుసటి రోజున తన కొడుకుతో పాటు పొలం పనిలో మునిగిన ఫ్లెమింగ్ చెంతకు, తన బిడ్డతో పాటు ఖరీదైన కార్లో వచ్చాడో కోటీశ్వరుడు. "నన్ను కాపాడింది ఈ అంకులే డాడీ!" అంటూ చూపించాడాబాలుడు. ఆ రైతుకు నమస్కరిస్తూ, నా బిడ్డను కాపాడిన నీకు చాలా చాలా ధన్యవాదాలు. అందుకు ప్రతిగా నీకేం కావాలో కోరుకోమంటాడు కోటీశ్వరుడు. అందుకారైతు ప్రతినమస్కారం చేస్తూ, అయ్యా! అందుకు నాకేమి వద్దు, ఆ స్థితిలో ఈ బిడ్డను చూడగానే, నా బిడ్డే ప్రమాదంలో చిక్కుకున్నాడన్నంతగా చలించి పోయింది నా హృదయం. అంతే! భగవంతుడు నా కిచ్చిన ఆ బిడ్డ నెత్తుకుని ముద్దాడి, ఇప్పుడు బాగానే ఉన్నావుగా బాబూ అంటూ దించేశాడు. **ఆ సమయానికొచ్చి ఈ బిడ్డను కాపాడే అవకాశాన్నిచ్చి, నా హృదయం నిండా బోలెడంత ఆనందాన్ని నింపాడు భగవంతుడు. నాకింతకన్నా గొప్ప బహుమతి ఇంకేం కావాలి? అన్నాడు ఫ్లెమింగ్.**

అందుకారైతు పట్ల మరింత కృతజ్ఞతాభావానికి లోనైన కోటీశ్వరుడు దయచేసి నా ఈ కోర్కెను కాదనకు, నేనూ నీ బిడ్డను నా బిడ్డలాగే భావిస్తున్నాను. నాబిడ్డతో పాటు నీ బిడ్డనూ చదివిస్తాను రా బాబూ అంటూ తండ్రి చేయి పట్టుకుని సన్నివేశాన్నంతటినీ ఆసక్తిగా చూస్తున్న ఫ్లెమింగ్ కుమారుని తన బిడ్డతో పాటు కారులో తీసుకెళ్ళాడు కోటీశ్వరుడు. అలా వెళ్ళిన ఆ బాలుడు గొప్ప విద్యావేత్తయై, ఎన్నో పరిశోధనలు చేసి 'పెన్సిలిన్' మందును కనుగొన్నాడు. తద్వారా ప్రపంచ వ్యాప్తంగా భయంకర రోగాలకు

లోనై మృత్యువుకు చేరువైన ఎంతోమందిని కాపాడగలిగాడు. ఆయనే **సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్**. అలా మృత్యుముఖం నుండి బయటపడిన వారిలో ప్రపంచ ప్రముఖులు కూడా ఉన్నారు. ప్రాణాంతకమైన న్యూమోనియా వ్యాధికి లోనై, మృత్యువుతో కొట్టుమిట్టాడుతున్న రోగికి అంతిమ ప్రయత్నంగా వైద్యులందించిన పెన్సిలిన్ అమృతంలా పనిచేసి అతన్ని బ్రతికించింది. అతనే **లార్డ్ రుడాల్ఫ్ చర్చిల్** తనయుడు గొప్ప రాజ్యాంగ వేత్త. ఒకప్పటి బ్రిటిష్ ప్రధాని **'సర్‌లిన్‌స్టన్ చర్చిల్'.**

అలా పేద రైతు ఫ్లెమింగొ యొక్క పరోపకారం ఆ కోటీశ్వరుని యొక్క కృతజ్ఞతా స్వభావం కేవలం ఆ ఇరువురికేగాక ప్రపంచానికే ఎంతటి ప్రయోజనాన్ని చేకూర్చిందో గ్రహించారుగా పిల్లలూ!

విద్యార్థులు : గ్రహించాం తాతయ్యా! అరుదైన ఇట్టి వాస్తవిక సంఘటనల ద్వారా మాకు భగవంతుని పట్ల భగవద్గీత పట్ల మరింత విశ్వసనీయతను కలిగిస్తున్నారు. ఇందుకు మీకు చాలా, చాలా ధన్యవాదాలు తాతగారూ!

శ్రేష్ఠ : అట్టి అరుదైన సంఘటననేదీ మన భారతదేశంలో జరగలేదా తాతగారూ?

వ్యాఖ్యాత : నీ మాతృదేశాభిమానానికి శుభాభినందనలు శ్రేష్ఠా. ఇట్టి మహత్తర సంఘటన క్రీస్తుకు పూర్వమే మన దేశంలో జరిగింది. ఐతే ఎప్పుడో జరిగి మరుగున పడిపోయిన ఆ సంఘటన కంటే, ప్రస్తుతం మీరు పాఠ్య పుస్తకాల్లో చదువుకుంటున్న అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అను శాస్త్రజ్ఞుని సంఘటనైతే వెంటనే మీకు విశ్వసనీయతను కలిగిస్తుందన్న ఉద్దేశంతో చెప్పాను. కానీ, నీ ప్రశ్న నన్ను ముగ్ధుణ్ణి చేయటమే గాక, ఓ అపూర్వ త్యాగమూర్తికి అద్భుతమైన ఓ మాతృమూర్తి పెట్టిన ప్రాణభిక్షే ప్రపంచానినకెంతటి మేలు చేకూర్చిందో చాటిచెప్పే భారతీయ వాస్తవిక సంఘటనను మీకేగాదు ప్రపంచానికే అందజేయాల్సిన అవశ్యకర్తవ్యాన్ని గూడ స్ఫురింపచేసింది. అందుకు నీకు ధన్యవాదాలు చిట్టితల్లీ!

క్రీ॥పూ 563 సం॥లో నాటి భారత, నేటి నేపాల్ దేశపు కపిలవస్తు జిల్లాలోని లుంబినీ వనంలో, వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు శుద్ధోదన చక్రవర్తి, మాయావతి దంపతులకు జన్మించాడు సిద్ధార్థుడు. ఇది బుద్ధ భగవానుని జన్మస్థలం అని చెక్కించి అశోక చక్రవర్తి నాటించిన రాతి స్తంభం నేటికీ అక్కడ దర్శనమిస్తున్నది పిల్లలూ!

సురుచిర సుందరుడైన సిద్ధార్థునకు 16వ ఏట వెదకి, వెదకీ అతిలోక సుందరి యశోధరతో వివాహం జరిపించి, ఆ యా ఋతువుల కనుగుణమైన వివిధ సౌధాలను నిర్మించి సిద్ధార్థునకు స్వర్గ సౌఖ్యాలను కల్పించాడు చక్రవర్తి. అలా 13 సంవత్సరాల పాటు కష్టమంటే తెలియకుండా గడిపాడు సిద్ధార్థుడు. కానీ, అనుకోకుండా ఒకనాడు తన కెదురైన విషాదకర దృశ్యాలకు చలించి పోయి, ఎలాగైనా సరే, దుఃఖరహిత జీవనమార్గాన్ని కనుగొని మానవాళికి తెలియజేయాలని సంకల్పించాడు సిద్ధార్థుడు. అంతే, ఒక రాత్రివేళ తన లక్ష్యసాధనార్థం ఆలు బిడ్డలతో సహా సర్వస్వాన్నీ త్యజించి అడవి వెళ్ళిపోయాడాయన!

మానవమాత్రులు ఏదో వృద్ధాప్యంలోనైతే, అలాంటి త్యాగం చేయగలిగేవారేమో గాని, 29 సంవత్సరాల కోడె వయసులో దేనికీ కొదువ లేనట్టి యువరాజై కష్టాలు, కన్నీళ్ళ నుండి మానవాళికి విముక్తి మార్గాన్ని చూపాలన్న సంకల్పంతో సిద్ధార్థుడు చేసినట్టి ఆ మహత్తర త్యాగాన్నీ జీర్ణించుకోలేక ఆయన్నొక చారిత్రక పురుషునిగ కాక, సాక్షాత్తు దైవాంశ సంభూతుని (అవతారపురుషుని)గ ఆరాధిస్తున్నారు కోట్లాది మానవులు.

అలా సత్యాన్వేషణార్థం బయలుదేరిన సిద్ధార్థుడు తొలుత సాంఖ్యదర్శనాన్ని పాటించే ఆలారకాముని శిష్యరికం చేసాడు. అక్కడ తృప్తిలేక రుద్రకరామపుత్రుని వద్దచేరి యోగాభ్యాసం ద్వారా సమాధిస్థితికి చేరుకోవటాన్ని అభ్యసించాడు. అదీ చాలదని వైదిక గురువుల

నాశ్రయించాడు. యజ్ఞయాగాదులలో వారి జంతుబలులను చూడలేక., వైశాలిని వీడి, మగధ రాజ్యంలోని ఉరువేల అడవికెళ్ళాడు. అక్కడ పంచవర్గీయులనబడే కౌండిన్యుడు, అతని నలుగురు శిష్యుల చెంతచేరి ఐదు సంవత్సరాలుగా ఉపవాసాలతో కఠోర దీక్షచేస్తూ, శుష్కించి, ఎముకల గూడుగ మారి మృత్యువుకు చేరువగా వెళ్ళాడు సిద్ధార్థుడు.

ఆ స్థితిలో ఒక సంధ్యా సమయాన నిరంజన నదిలో స్నానం చేసి నీరసించినందున ఒడ్డెక్కలేక, నదిలోకి వంగిన కొమ్మను పట్టుకుని ఎలాగో ఒడ్డెక్కాడు గాని, తూలుతూ నడుస్తూ ఆశ్రమానికి చేరుకోలేక మార్గమధ్యంలో మఱ్ఱిచెట్టు సమీపాన స్పృహతప్పి పడిపోయాడు సిద్ధార్థుడు. ఎంతసేపటికీ ఆయన ఆశ్రమానికి రాకపోయేసరికి, ఈ కఠోర దీక్షకు తట్టుకోలేక పారిపోయైనా ఉంటాడు, లేదా నీరసం మితిమీరి మరణించైనా ఉంటాడు సిద్ధార్థుడని భావించారు పంచవర్గీయులు. బహుశా, వారు భావించినట్లు ఆ త్యాగమూర్తి కదేచివరి రాత్రై ఉండేది. ఎందుకంటే సూర్యుడస్తమించాక అడవిలో నరసంచారం జరుగదు. కానీ, దైవ సంకల్పమా! అన్నట్లు అప్పుడొక అనూహ్య సంఘటన జరిగింది.

ఉరువేల అటవీ సమీపాన గల ఒక గ్రామంలో సేనాని అనే ఒక గృహస్తూ అతని ఏకైక కుమార్తె సుజాత, ఆమె భర్త జీవిస్తున్నారు. పెళ్ళై ఏళ్ళూ, పూళ్ళు గడిచినా సంతానం కలగని సుజాత, తన కడుపు పండితే మఱ్ఱిచెట్టు సమీపానగల నాగదేవతకు పాలుపోసి, పొంగలి పెడతానని మొక్కుకుంది. కానీ, బిడ్డ పుట్టిన ఆనందంలో తేలిపోతున్న ఆమెకు రెండు, మూడేళ్ళు గడిచినా తన మొక్కు గుర్తుకు రాలేదు. మబ్బులు ముసిరిన ఆకాశంలో తళుక్కున ఓ మెరుపు మెరిసినట్లు ఆ సంధ్యాసమయాన సుజాత హృదయంలో ఠక్కున ఆమె మొక్కు స్ఫురించింది. అయ్యయ్యో! ఎంత పొరపాటయ్యిందీ అని ఆందోళన పడుతూ చకచకా పాయసం వండింది, గబగబా పాలు పితికింది. ఒక గిన్నెనిండా పాయసం ఒక చెంబునిండా

పాలు తీసుకుని మసకపడుతున్నందున వడివడిగా అడుగులేస్తూ పుట్టచెంతకు చేరింది సుజాత. నాగదేవతకు సభక్తికంగా నమస్కరిస్తూ, తనకు బిడ్డనిచ్చినందుకు, మరిచిపోయిన తన మొక్కు నిప్పటికైనా తిరిగి గుర్తుచేసినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నది. ఆప్యాయంగా పుట్టలో కాసిని పాలుపోసి, పుట్టమీద ఒక ఆకులో కొంత పాయసముంచి, మిగిలిన వాటిని ప్రసాదంగా ఇంటికి పట్టుకెళ్తున్న సుజాతకు మఱ్ఱిచెట్టును దాటిందో లేదో పక్కనుండి మూలుగు వినిపించింది. అటుగా వెళ్ళి చూస్తే అక్కడొక బక్కచిక్కిన దేహం మూలుగుతూ కనిపించింది. స్పృహలో లేని అతని మీద చల్లటానికి నీళ్ళులేక, చెంబులోని పాలనే చేత్తో అతని ముఖం మీద చిలకరించింది. చటుక్కున అతని పక్కనే కూర్చుని, చీర చెంగుతో అతని ముఖాన్ని అద్దుతుండగా అతనిలో చలనం కనిపించింది. అంతే ఆతురతగా అతని శిరస్సును తన ఒడిలో చేర్చుకుని మిగిలిన పాలను కొంచెం కొంచెంగా అతని నోట్లో పోస్తూ తాగించింది. కొంతసేపటికి కళ్ళుతెరచి అమ్మా! అని నీరసంగాపిలిచాడు సిద్ధార్థుడు. తన బిడ్డే పిలుస్తున్నంతగా పరవశించి పోయినది సుజాత! ఆకాశంవైపు చేతులు జోడించి, భగవంతుడా! ఈ బిడ్డను బ్రతికించినందుకు నీకు కృతజ్ఞతలు అంటూ నమస్కరించి, అతని తలను మరింతగా లేపి తన కాలుకానించుకుని గిన్నెలోని పాయసాన్నిగూడ గోరు ముద్దలుగా అతనికి తినిపించింది. ఫలితంగా మరికాస్త తేరుకొని కూర్చోగలిగాడు సిద్ధార్థుడు. "నాయనా ఇంకాస్త ఓపిక తెచ్చుకొని లేచి నా భుజాన్ని ఆసరా చేసుకొని నడువు, మా ఇంటివద్ద సేద తీర్చుకుని నీకు ఓపిక వచ్చాక, నీ గమ్యానికి వెళ్దువు గాని లేనాయనా అంటూ ఆప్యాయంగా స్వాగతించింది సుజాత.

తల అడ్డంగా తిప్పుతూ లేదమ్మా అంటూ క్లుప్తంగా తన లక్ష్యాన్ని చెప్పి ఇలా అన్నాడు. "అమ్మా అంతా అగమ్యగోచరంగా, ఎటు చూచినా అంధకార మయంగా ఉన్న స్థితిలో, నాకిప్పుడు నీ మానవత్వంలో గొప్ప

వెలుగు కనిపిస్తున్నది. అంతేకాదు, నా అన్వేషణకు అర్థం గూడ స్ఫురించిందమ్మా! పొద్దు పోతున్నది ఇంటిదగ్గర గాబరా పడుతుంటారు వెళ్ళిరా తల్లీ! నా 'ప్రాణదాతా! నీ కివే నా ప్రణామాలు! అంటూ అశ్రునయనాలతో ఆ మాతృమూర్తికి అంజలి ఘటించాడు సిద్ధార్థుడు. ఆమె హృదయం ఆర్ద్రమైంది. దుఃఖపర్యంతమైన సుజాత గద్గదికంగా నాయనా! ఈ మఱ్ఱిచెట్టు వద్ద పుట్ట ఉంది. అందుకే ఇక్కడొద్దు, నీకు ఓపికొచ్చేదాకా అదిగో ఆరావి చెట్టుకానుకుని కూర్చుందువు గాని పదమంటూ మెల్లగా నడిపించుకెళ్ళి, చెట్టుకింద శుభ్రంచేసి, గడ్డీ, ఆకులతో మెత్తు ఏర్పాటు చేసి, దానిపై రావిచెట్టు బోదె కానించి, సిద్ధార్థుని కూర్చోబెట్టింది సుజాత! అనంతరం ఆకాశం వైపు చేతులు జోడించి "భగవంతుడా! త్వరగా ఈ బిడ్డ లక్ష్యాన్ని నెరవేర్చు, ఈయనకు బుద్ధత్వాన్ని కలిగించు" అంటూ ప్రార్థించింది. తిరిగి మఱ్ఱిచెట్టుకింది పుట్టవైపు చేతులు జోడించి అమ్మా! నాగదేవతా! ఈ బిడ్డకే ఆపదా రాకుండా కాపాడు తల్లీ! అని నమస్కరించింది. వస్తాన్నాయనా! అంటూ వ్యథాభరిత హృదయంతో వెళ్ళలేక వెళ్తూ కనుచూపుమేరకు సిద్ధార్థుని వైపు తిరిగి తిరిగిచూస్తూ వెళ్ళింది సుజాత. ఆనాటి నుండి క్రమం తప్పక సిద్ధార్థునకు ఆహారాదుల నందిస్తూనే ఉంది సుజాతమాత!

క్రమంగా ఆయన శరీరం పుంజుకుంటున్నది. నాటినుండి రావిచెట్టు క్రిందనే పద్మాసనంలో కూర్చుని అంతర్ముఖుడై దుఃఖ విమోచనా మార్గాన్వేషణ ప్రారంభించాడు.అదే పనిగా ఆలోచిస్తున్నాడు సిద్ధార్థుడు. ఆయన చేస్తున్న ఆ పనిని మేథోమథనం అని కొందరు, ధ్యానం అని కొందరు, తపస్సు అని ఇంకొందరన్నారు. **అలా48 రోజులు గడిచాక 49వ రోజున, ఆయన 36వ జన్మదినాన క్రీ.పూ. 528 సం॥ వైశాఖ పూర్ణిమ నాడు ఆయన లక్ష్యం సిద్ధించి, సార్థక నామధేయుడయ్యాడు సిద్ధార్థుడు.**

అలా సుజాతామాత, ఆ త్యాగశీలికి పెట్టిన ప్రాణభిక్ష ద్వారా బుద్ధత్వాన్ని సిద్ధింపచేసుకొని ప్రపంచానికి దుఃఖ విమోచనా మార్గాన్ని చూపగలిగాడు

బుద్ధుడు. చూశారా పిల్లలూ! ఆ మాతృమూర్తి యొక్క మానవత్వం మృత్యువునుండి కాపాడటమేగాదు సిద్ధార్థుని లక్ష్య సంకల్పాన్ని ఫలింపచేసి ప్రపంచానికి ఎనలేని మేలు చేకూర్చగలిగింది గదా!

పిల్లలు : ఔను తాతయ్యా! ఓ మహోన్నత త్యాగమూర్తీ గౌతమబుద్ధా! ఓ మహోన్నత మానవతామూర్తీ సుజాతా! ఓ మానవ మహోపకారులారా! మీకు సర్వదా కృతజ్ఞతాభి వందనాలు! అంటూ ఆకాశంవైపు తమ చేతులు మోడ్చి ఆనందబాష్పాలను రాల్చారు విద్యార్థులంతా.

వ్యాఖ్యాత : మీ ఈ కృతజ్ఞతా స్వభావమే మీ ఉన్నతికి సోపానమగుగాక తథాస్తు పిల్లలూ!

నిజాయితీ సృష్టిప్రణాళికా ముఖ్యనియమం

సృష్టి ప్రణాళికలోని మరోనియమమైన నిజాయితీ గూర్చి మీకు వివరిస్తాను. ఇది శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన చిన్నకథ. వర్షం కురుస్తున్నరోజు నల్గురు వ్యక్తులొచ్చి ఒక ఇంటి చూరు కింద నిలబడ్డారు. వాళ్ళనింట్లోకి రమ్మని ఆహ్వానించారింటివాళ్ళు. మేం నలుగురము ఒకేసారి యింట్లోకి రాలేం. మాపేర్లు నిజాయితీ, సిరి, కీర్తి, శక్తి మాలో మీకిష్టమైన ఒక్కర్ని ఆహ్వానించమన్నారు. ఇంటి వాళ్ళొక్కరి మొఖాలొకరు చూచుకుంటూ కీర్తిని పిలుద్దామా అన్నాడు యజమాని. వద్దు సిరిని పిలుద్దామా అన్నది అతని భార్య. కాదమ్మా శక్తిని పిలుద్దామన్నాడు కొడుకు. వద్దండీ నిజాయితీని ఆహ్వానిద్దామన్నది కోడలు. అందుకంగీకరించి అందరూ నిజాయితీని తమ యింట్లోకి స్వాగతించారు. నిజాయితీ వాళ్ళింట్లో ప్రవేశించగానే, ఆశ్చర్యకరంగా అతని వెంటే సిరి, కీర్తి, శక్తి గూడ వాళ్ళింట్లో ప్రవేశించారు. అదేంటి పిలవకుండానే వచ్చేశామని ఆశ్చర్యపోతున్నారా మీరు? వాస్తవమేమంటే మేం ముగ్గురమైతే ఎవరికి వాళ్ళం ఒంటరిగానే ఉండిపోగలం. ఐతే నిజాయితీ తోడులేకుండా మాలో ఏ ఒక్కరమూ

ఉండలేము. అందుకే మీరు పిలవకున్నా సరే నిజాయితీ వెంటబడి మాకు మేముగానే వచ్చేశామన్నారు. అప్పుడు నిజాయితీ ఎక్కడుంటే సిరి, కీర్తి, శక్తి గూడ అక్కడే ఉంటాయన్న వాస్తవాన్ని గ్రహించిన ఆయింటి వారు, ఆనందంతో పొంగిపోయారు. ఈ చిన్ని కథద్వారా నిజాయితీ యొక్క విశిష్టతను గ్రహించారుగా పిల్లలూ!

జ్ఞానం కూడా సృష్టి ప్రణాళికా నియమమే!

వ్యాఖ్యాత : జ్ఞానాన్ని కూడ సృష్టి ప్రణాళికా నియమంగా రూపొందించుకున్నాడు పరమాత్మ! ఎందుకంటే ? మనిషిని పవిత్రీకరించేది, ప్రగతిపథాన నడిపించేది, పతన మార్గం పట్టిన వానినుద్ధరించేదీ జ్ఞానమే.

హర్ష : (గీత 4-38) లోకంలో జ్ఞానాన్ని మించి పవిత్రీకరించే వస్తువేదీ లేదని చెబుతున్నది భగవద్గీత. మనుషుల్ని జ్ఞానం ఎలా పవిత్రీకరిస్తుంది తాతయ్యా?

వ్యాఖ్యాత : నీ ప్రశ్నకు గీత (4-35)లో ఆత్మజ్ఞానాన్ని తెలుసుకున్నవారు తనతో సహా ప్రాణులన్నింటాగల ఆత్మఒక్కటే. ప్రతీది పరమాత్మ అంశయేనన్న జ్ఞానాన్ని పొందిన వ్యక్తి ఏ మనిషినీ, ఏ ప్రాణినీ ద్వేషింపడు, హింసింపడు. అలాచేస్తే ఆ మనిషిలోని, ప్రాణిలోని పరమాత్మను ద్వేషించి, హింసించినట్లేనని తెల్పే ఆత్మజ్ఞానమే, అతనిచేత ఏ పాపమూ చేయించకుండా నిరోధిస్తుంది! అతన్ని పవిత్రంగా జీవింపజేస్తుంది. జ్ఞాన మావిధంగా మనిషిని పవిత్రీకరిస్తుందని భగవద్గీతే నీ ప్రశ్నకు జవాబు చెబుతున్నది హర్షా!

దేవాంశ్ : ఆత్మజ్ఞానమే, జ్ఞానమా తాతయ్యా? అదొక్కటే సరిపోతుందా మనకు?

వ్యాఖ్యాత : మనిషి శారీరక బలాన్ని, ఆరోగ్యాన్ని, ప్రగతిని పెంపొందించుకోటానికి, భౌతిక (శాస్త్రీయ) జ్ఞానం ఎంత అవసరమో,

మనోబలాన్ని మానసిక ఆరోగ్యాన్ని (పవిత్రతను) నైతిక ప్రగతిని పెంపొందించుకోటానికి ఆధ్యాత్మిక (ఆత్మ) జ్ఞానం అంతే అవసరం. స్పష్టంగా చెప్పాలంటే, మానవ సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ జ్ఞానం, సామాజిక మానసిక ప్రశాంత స్థితికి ఆధ్యాత్మిక జ్ఞానం అవసరం. ఈ స్పృహతోనే జ్ఞానమొక్కటే (అన్ని సమస్యలకు) విముక్తి మార్గమన్నారు ఆదిశంకరులు.

విరాజ్ ఉజ్వల్ : సరే, శాస్త్రీయ జ్ఞానాన్ని పాఠ్యగ్రంథాల ద్వారా గ్రహిస్తాం. మరి ప్రజలందరికీ ఆధ్యాత్మిక జ్ఞానమెలా చేరువౌతుంది. అందరూ తమ తమ నిత్య కృత్యాలు మాని ఆశ్రమాలలోని గురుసన్నిధి కెళ్ళలేరుగదా తాతయ్యా?

వ్యాఖ్యాత : అందుకే ఆంతరంగికమైన ఆత్మజ్ఞానాన్ని, భౌతికశాస్త్రీయ విజ్ఞానంతో అనుసంధానం చేసి సదరు విజ్ఞాన సహిత జ్ఞానాన్ని, సామాజిక అవసరాలను తీర్చేందుకు, సమస్యల్ని పరిష్కరించేందుకు, తోడ్పడేలా రూపొందించాలి. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సులభశైలిలో సరళీకరించి ప్రజలందరికీ చేరువ చేయాలి. మరియు అత్యున్నత ఆధ్యాత్మిక గ్రంథాలనుండి, విశ్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వశాంతి అహింస, భూత దయాదులను ప్రబోధించే ప్రగతిశీల అంశాలను వెలికితీసి కాలానుగుణమైన స్వల్ప మార్పులు, చేర్పులతో విశ్వసనీయాలుగా రూపొందించి పాఠ్య గ్రంథాలంత ప్రముఖంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి! ఆర్థిక అసమానతలు, జాతి, కుల, మత, వర్గ భేదాది సామాజిక కల్లోలాలతోను, మద్యం మాదక ద్రవ్యాలు, అవినీతి, కల్తీ, అత్యాచారాలు, మాఫియా, తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి రుగ్మతలతో సమాజమూ, ప్రపంచమూ సతమతమౌతున్న ప్రస్తుత స్థితిలో, మేధోవికాసం పొందిన వివిధ రంగాల మేధావులంతా తక్షణం ఇట్టి కృషికి పూనుకొని విశ్వశాంతికి తోడ్పడటం వారి అవశ్యకర్తవ్యమని నోబెల్ బహుమతీ గ్రహీతయైన 'ఎర్నెస్ట్' నిర్దేశించారు!

అవతార పురుషుల ద్వారానే కాదు నిర్దిష్ట చారిత్రక పురుషుల ద్వారానూ మానవాళి నాదుకుంటుంటాడు పరమాత్మ.

యువన్‌తేజల్ : (గీత 4-7, 8)లో ధర్మానికి హానికలిగినప్పుడల్లా దుష్టశిక్షణ, శిష్ట రక్షణార్థం యుగయుగాన అవతరిస్తుంటానని మాట యిచ్చాడు గదా! శ్రీకృష్ణ పరమాత్మ. కానీ, సమాజంలో ఇన్ని ఘోరాలు నేరాలు జరుగుతున్నా మళ్ళీ అవతార పురుషుడు జన్మించడం లేదెందుకని తాతగారూ?

వ్యాఖ్యాత : చూడు, యువన్! సదా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, మొదలగు అవతారాల పురుషులు స్థాయిలోనే ఆలోచించరాదు. ఎందుకంటే? ఆయా తరాలలో అప్పటి అవసరాలమేరకు తన శక్తిని, మంచితనాన్నీ నిర్దిష్ట చారిత్రక వ్యక్తుల ద్వారా గూడ ప్రదర్శిస్తూ మానవాళిని ఆదుకుంటుంటాడు పరమాత్మ. అందుకాయన రూపొందించుకున్న విధానమేమంటే?

తన సృష్టిని కొనసాగించుకోటానికి స్త్రీ, పురుషులలో బలీయమైన లైంగిక వాంఛను నిక్షిప్తం చేసినట్లే, మానవ సమాజాన్ని కష్టాలు, ప్రమాదాలనుండి గట్టెక్కించటానికి, మానవాళిని నైతికంగా బలోపేతం చేసి, సమ్యక్ జ్ఞానబోధ ద్వారా చైతన్యపరచి సమాజాన్ని ఉద్ధరించాలన్న బలీయమైన వాంఛను, అందుకు అవసరమైతే, తమ సర్వస్వాన్నీ త్యాగంచేసే సద్గుణాన్నీ నిక్షిప్తం చేసి వారిని మానవ మహోపకారులుగ రూపొందించు కుంటుంటాడు సృష్టికర్త. మరియు అట్టి త్యాగజీవులకు అమరత్వాన్ని ప్రసాదించుట ద్వారా వారి అడుగుజాడల్లోన నడచేలా భావితరాల వారికి ప్రేరణ కలిగిస్తుంటాడు సర్వేశ్వరుడు. అదిగో ఆకోవకు చెందినవారే బాలగంగాధరతిలక్, జవహర్‌లాల్‌నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్దార్‌వల్లభాయ్‌పటేల్, మహాత్మాగాంధీ, అంబేద్కర్, వంటి పలువురు మహనీయులందరూ ఆయా కాలాలలో ఆయా సామాజిక అవసరాల నిమిత్తం పరమాత్మచేత వినియోగించుకోబడిన అమరజీవులే.

అట్టి మానవ మహోపకారుల్ని రూపొందించుకోవటం గూడ సృష్టి ప్రణాళికలోని భాగమే పిల్లలూ.

హర్షవర్ధన్ : (గీత 6-5)లో తనను తానుద్ధరించుకోవలసిందిగా నిర్దేశిస్తున్నది గదా భగవద్గీత! ఈ స్వయం సంస్కరణకు ఒక హద్దంటూ వుందా? లేక అదొకనిరంతర ప్రక్రియయా?

వ్యాఖ్యాత : ఇదీ నిరంతర ప్రక్రియయే, ఎందుకంటే, సృష్టిలో ప్రతిదీ నిరంతరం మార్పుచెందుతూ ఉంటుందని, బుద్ధుడు, మార్క్స్, శాస్త్రజ్ఞులూ కనుగొన్న సత్యం. అందువలన మనిషిగూడ ఉన్నస్థితినుండి, ఉన్నత స్థితికెదిగేందుకు, మానవోత్తమునిగా తననుతాను సంస్కరించేందుకు నిరంతరం పరిశ్రమి స్తుండాల్సిందే. అంటే **"ప్రతి వ్యక్తీ నిరంతరం ఉన్నత వ్యక్తిత్వంతో జన్మిస్తూ (ఎదుగుతూ) ఉండాలి. అలా ఎదగటం ఆగిపోతే అది ఆ వ్యక్తికి ఆంతరంగిక మరణమే" నన్నారు. శ్రీరామకృష్ణపరమహంస.** సదా కలుపుమొక్కల్ని పెరికేసు కుంటూ మంచి పైరును పెంచుకుంటున్న రైతులా, నిరంతరం దురాలోచనలను నిర్మూలించుకుంటూ, సత్సంకల్పాల పైరును పెంపొందించుకుంటుండాలి. **అలా ప్రతి మనిషీ సదా తనను తాను సమున్నతునిగా సంస్కరించుకోవాలన్నదే గీతా సందేశం!** అలా సదా మిమ్మల్ని మీరు మానవోత్తములుగ సంస్కరించు కొందురుగాక పిల్లలూ!

శాస్త్రజ్ఞులు దేవుని విశ్వసించటానికి గల ఏడు కారణాలు

దేవాంశ్ : శాస్త్రజ్ఞులు సైతం విశ్వచైతన్యపు (దేవుని) ఉనికిని విశ్వసించటానికి సహేతుకమైన, బలమైన కారణాలు, లేక సంఘటన లేవైనా ఉంటే చెప్పండి తాతగారూ?

వ్యాఖ్యాత : నేను చెప్పటం కాదు దేవాంశ్! వివిధ రంగాల్లో ఎన్నో పరిశోధనలు చేసిన ప్రముఖ శాస్త్రవేత్తలు పలుదేశాలవారు దేవుని ఉనికిని విశ్వసించక తప్పనివైన, సహేతుకమైన ఏడు కారణాలను ఎంపిక చేశారు.

వారు స్పష్టీకరించిన ఆ ఏడు కారణాలను, 1960వ సం॥లో **'రీడర్స్‌డైజెస్ట్'** ఆంగ్ల పత్రికలో **సెవెన్ రీజన్స్ వై ది సైంటిస్ట్స్ బిలీవ్ ఇన్ గాడ్!** అను శీర్షికతో ఒక వ్యాసాన్ని ప్రచురించారు. బహుశా 1999లో ననుకుంటా దానిని **మన్నవ గిరిధరరావు** గారు అనువదించగా తెలుగు దినపత్రిక ఆంధ్రభూమిలో ప్రచురించారు. సదరు వ్యాసాన్నే క్లుప్తంగా మీకు వివరిస్తాను శ్రద్ధగా వినండి.

ఈ వ్యాసంలోని సంఘటనలన్నీ శాస్త్రజ్ఞులు పరిశోధించి నిగ్గుదేల్చిన వాస్తవాలు. వారిలా ప్రారంభించారు. సృష్టిలో శాస్త్రవేత్తలకు అంతుబట్టకుండా వారిని ఆశ్చర్యంలో ముంచెత్తుతున్న అద్భుతాలు, విచిత్రాలు ఎన్నో ఉన్నాయి. ఈ కారణంగానే సృష్టి వెనక అద్భుతమైన దివ్యశక్తి యేదో ఉండి తీరాలని, సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు పలువురు భావిస్తున్నారు. అందుకు ప్రపంచ ప్రముఖ శాస్త్రజ్ఞులు చూపిన సహేతుకమైన కారణాలివే.

ప్రథమకారణం : కాంతివేగం సెకనుకు 3 లక్షల కిలోమీటర్లు. మన భూమిచుట్టూ ఒకసారి తిరిగి వచ్చేందుకు కాంతికి 1/4 సెకను చాలు. అంతవేగం గల కాంతికి మన సూర్యకుటుంబం పూర్వం అటువంటి పాలపుంతను చుట్టి రావటానికి 1లక్ష సంవత్సరాలు పడుతుంది. పాలపుంతంత సువిశాలమైన గెలాక్సీలు ఇంకెన్ని వున్నాయో శక్తివంతమైన టెలిస్కోపుల ద్వారా కూడా ఖచ్చితంగా కనిపెట్టలేక పోతున్నారు. (దాదాపుగా 40 లక్షల గెలాక్సీలుండొచ్చని అంచనా). సృష్టిలోని ప్రతి గ్రహం, నక్షత్రం, గెలాక్సీ నిరంతరం వాటి వాటి వేగాలతో వాటి కక్ష్యలలోనే తిరుగుతుంటాయి. అవి ఏమాత్రం తారుమారైనా సృష్టి అల్లకల్లోలమౌతుంది. కానీ, అలా కావటం లేదంటే? **మహాశక్తిమంతుడైన ఒక గణిత శాస్త్రవేత్త ఈ సృష్టిని చాలా ఖచ్చితంగా ఒక లెక్క ప్రకారం నడుపుతున్నట్లు ఇన్నీ క్రమబద్ధంగా నడుస్తున్నాయి. అలానడుపుతున్న అద్భుతమైన శక్తియేదో ఉండి తీరాలి అని జోడ్‌వంటి ఖగోళ శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.**

ద్వితీయకారణం : భూమ్మీద జీవులేర్పడటానికి ఎన్నో పరిస్థితులు, కాస్తైనా అటూ, ఇటూ కాకుండా ఒకనియమానుసారంగా ఉంటున్నాయి. ఉదా॥భూమిగంటకు వెయ్యిమైళ్ళ వేగంతో తిరుగుతున్నది. అలా కాకుండా 100 మైళ్ళవేగంతో తిరిగినట్లైతే రాత్రింబవళ్ళు 10 రెట్లు పెరిగి 120 గంటల పగలు, 12 గం॥లు రాత్రి ఏర్పడి ఉండేది. అప్పుడంత సుదీర్ఘ సమయపు పగటి వేడిమికి జీవరాసులన్నీ మాడిపోయేవి. ఇంకేమైనా మిగిలివుంటే, సుదీర్ఘ రాత్రికి గడ్డకట్టుకు పోయేవి! సూర్యుని ఉపరితల ఉష్ణోగ్రత 6000 డిగ్రీలు, భూమికి, సూర్యునకు ఇప్పుడున్న దూరం వలన భూమిమీది జీవరాసులు మనగలగటానికి సరిపడినంత వేడిమాత్రమే లభిస్తున్నది. ఇంతకన్నా భూమి సూర్యునకింకొంచెం దగ్గరగా ఉండి ఉంటే, భూమిమీదివన్నీ దగ్ధమయ్యేవి. లేదా ఇంకొంచెం దూరంగా ఉండి ఉంటే, భూమిమీదివన్నీ గడ్డకట్టుకు పోయేవి. సూర్యుడిప్పుడు ప్రసరిస్తున్న తేజస్సులో సగం పెరిగితే భూమ్మీది వన్నీ మండిపోతాయి. సగం తిరిగితే భూమ్మీదివన్నీ గడ్డకట్టుకుపోతాయి. భూగోళమిప్పుడు ఏటవాలుగా 230 డిగ్రీలు వంగి ఉన్నది. అందువల్లనే ఋతువులేర్పడుతున్నాయి. అదే ఏటవాలుగా కాకుండా పూర్తిగ నిలువునా ఉండిఉంటే సముద్రపుటావిరులు ఉత్తర, దక్షిణ దిశలకు సాగి మంచుగడ్డల మహాఖండాలనేర్పరచి ఉండేవి. చంద్రుడిప్పుడున్న దూరంకన్నా భూమికి 50 వేల మైళ్ళు దగ్గరగా ఉండి ఉంటే ప్రతిరోజూ రెండుసార్లు భూఖండాలన్నింటినీ ముంచి వేసేటంత అతిపెద్ద సముద్రపుటలలు ఎగసిపడేవి. భూమిమీది వాతావరణం ఇప్పుడున్నంత చిక్కగా కాక పల్చగా... ఉండి ఉంటే, మండి పోయే ఉల్కలు ప్రతిరోజూ భూమిమీదికి నిరాటంకంగా దూసుకొచ్చి మంటలు రేపుతుండేవి.

ఇలా పలు కారణాల వలన అంటే సూర్యుడు, భూమీ మొదలగునవన్నీ నిర్దిష్ట కక్ష్యలలో, నిర్దిష్ట దూరాలలో, నిర్దిష్టవేగాలతో, నిర్దిష్ట కోణాలలలో స్థిరంగా తిరుగుతూ ఉండటం వంటి అనేక కారణాల మూలంగా ప్రకృతి

క్రియలన్నీ నియమబద్ధంగా, క్రమబద్ధంగా జరుగుతూ భూమిమీద ప్రాణికోటి మనుగడకు సానుకూల వాతావరణాన్ని కల్గిస్తున్నవని స్పష్టమౌతున్నది.

తృతీయ కారణం : భూమిమీద ప్రాణులక్కావలసిన అన్ని రకాల వనరులను ఎప్పటికప్పుడు సృష్టించుకుంటూ, ప్రాణులూ పరిపుష్టంగా జీవించగలిగేశక్తి అనంతంగా ఉంది. మరి ఇలాంటి శక్తి అంతటా వ్యాపించియున్న మహాజ్ఞానం యొక్క వ్యక్తీ కారణమే. **అసలు జీవమంటే ఏంటి? దీనిని ఏ శాస్త్రజ్ఞులూ నిర్ధిష్టంగా నిర్వచించలేకపోతున్నారు. జీవానికి బరువు, కొలతలు, రంగు, రుచి, వాసన, రూపం ఏమీ లేవు. కానీ, జీవానికి శక్తి మాత్రం ఉంది. ఉదా॥ పెరుగుతున్న మొక్క యొక్క వేరు భూమిలోని రాళ్ళను సైతం ఛేదించుకుంటూ పోతుంది. జీవం నీటిని, గాలినీ జయించింది. పంచభూతాలనూ, మూలకాలనూ పరస్పరం సంయోగపరచి, వాటిని వివిధ సమ్మేళనాలుగా పునర్నిర్మాణం పొందేలా చేయగలశక్తి జీవానికున్నది. సజీవ వస్తువులన్నింటికీ తగిన రూపకల్పన చేసే రూపశిల్పి జీవం!** ఆకు, ఆకుకూ, పూవు, పూవుకూ రకరకాల రంగులను చిత్రవిచిత్రంగా అద్దుతున్న అద్భుత కళాకారుడు జీవం! పక్షులకు ప్రేమ గీతాలను, పరస్పరం స్వాగతించుకోటానికి కీటకాలకు అశేషశబ్ద సంగీతాన్ని నేర్పిన సంగీత గురువు జీవం!

పుష్పాలకు సుగంధాలను, పండ్లకు మాధుర్యాన్నీ, పదార్థాలకు రుచులను, నారి కేళాల్లోకి నీటినీ చేకూర్చుటమే కాదు, రంగులకు ఆకర్షణను, రుచులకు కమ్మదనాన్ని, సువాసనలకు ఆహ్లాదాన్నీ చేకూర్చుతున్న మహత్తర మాంత్రికుడు జీవం! నీటినీ, కర్బనామ్లాన్నీ పంచదారగాను, కొయ్యగాను మార్చే ప్రక్రియద్వారా ప్రాణులకు ప్రాణవాయువు నిప్పిస్తున్న మహత్తర రసాయనిక శాస్త్రవేత్త జీవం! జీవాన్ని, జీవానికంతటి మహత్తర శక్తినీ ప్రసాదిస్తున్నది, అతీతమైన దైవశక్తిగాక మరేమిటి?

చతుర్థ కారణం : జంతుజాలంలో నిక్షిప్తమైయున్న సహజ జ్ఞానం పరమశక్తిమంతుడైన భగవంతుని ఉనికిని రుజువు చేస్తున్నది.

ఉదా॥ 1 చిన్న సాల్మన్‌చేప కొన్ని సంవత్సరాలు సముద్రంలో గడిపాక తిరిగి తాను జన్మించిన ఉపనదిలోకి వెళ్ళిపోతుంది. సదరు ఉపనది కలిసిన మహానది సముద్రంలో కలిసిన చోటుకెళ్ళి, ఆ మహానది కెదురీదుకుంటూ వెళ్ళి తను జన్మించిన ఉపనది ఆ మహానదిలో కలిసిన చోటును గుర్తించి, ఖచ్చితంగా సదరు ఉపనదీ జిల్లాల్లోకే ప్రవేశిస్తుంది. ఒకవేళ ఆ సాల్మన్ చేపను మనం పట్టుకొని దాన్ని వేరొక ఉపనదిలోకి వదిలేసినాసరే, కొద్దిసేపటికే తాను దారి తప్పానని గుర్తించి తిరిగి దాన్నుండి మహానదిలో ప్రవేశించి వెదుక్కుంటూ వెళ్ళి తన జన్మస్థలమైన ఉపనదిలోకి ఖచ్చితంగా చేరుకుంటుంది. అలా అది వందలాదిమైళ్ళు నదీజలాల కెదురీదుకుంటూ వెళ్ళి తన జన్మస్థలమైన ఉపనదిలోకెళ్ళి దానిలోగూడ మొదట తానుపుట్టిన ప్రాంతానికెళ్ళి ఖచ్చితంగా అక్కడేగుడ్లు పెట్టి మరణిస్తుంది.

ఉదా॥ 2 : యూరప్, అమెరికా ప్రాంత సముద్రజలాల్లో ఈల్ చేపలు నివసిస్తుంటాయి. అవిపిల్లల్నిపెట్టే వయసురాగానే అటు అమెరికా ప్రాంత ఈల్‌చేపలు – ఇటు యూరప్ ప్రాంత ఈల్‌చేపలు గూడ వందల, వేలమైళ్ళు ఈదుకుంటూ వెళ్ళి అమెరికాతీరపు బెర్ముడా వద్దనున్న అగాథాల్లోకి చేరుకుని, అక్కడ పిల్లల్ని పెట్టి చనిపోతాయి. అట్లా పుట్టిన పిల్ల చేపలకు, అసలేమీ తెలిసే అవకాశమే లేదు. తమ తల్లి దండ్రులెక్కణ్ణుంచి వచ్చాయో ఆ ప్రాంతానికి దారీతెన్నూ తెలియనట్టి అగాథజలాల్లో జన్మించినాయి పిల్లచేపలు. ఐనాసరే బాగా ఈదటం రాగానే అక్కణ్ణుంచి బయల్దేరి, తమ తల్లిదండ్రులు నివసించిన ప్రాంతం దిశగా ఈదుకుంటూ వెళ్ళి తమ తల్లిదండ్రులు నివసించిన అమెరికా సాగర జలాల్లోగానీ యూరప్ సాగరజలాల్లోకి ఖచ్చితంగా చేరుకుంటాయి సదరు ఈల్ చేపపిల్లలు. అదీగూడ అమెరికా ప్రాంతపు ఈల్ చేపలు యూరప్ సాగరజలాల్లోని

యూరప్ ప్రాంతపు ఈల్ చేపలు అమెరికా సాగర జలాల్లోకానీ పొరపాటున గూడ ప్రవేశించవు. అమెరికన్ ఈల్‌చేపలకన్నా, యూరప్ ఈల్‌చేపలకు అవి చేయాల్సిన సుదీర్ఘ ప్రయాణం దృష్ట్యా వాటి సంతానోత్పత్తి వయసును ఒక ఏడాది పొడిగించింది ప్రకృతి. అంత చిన్న ప్రాణులలో అంత గొప్ప జ్ఞానాన్ని నిక్షిప్తం చేసినది మరి అతీత శక్తిగాక ఇంకెవరు?

ఉదా॥ 3. తేనెటీగ జాతికి చెందిన వాస్ప్ అను కందిరీగ ఒకరకమైన గడ్డిపురుగు మీద బడి దాన్ని వశం చేసుకుని సరిగ్గా కుట్టాల్సిన తావులో కుడుతుంది. దాన్తో ఆ పురుగు కోమాలో కెళ్ళి, భద్రపరచబడిన మాంసంరూపంలో బ్రతుకుతుంటుంది. కానీ చావదు. అలా అచేతనంగా పడివున్న పురుగుకు తగినంత సమీపంలో గుడ్లుపెట్టి ఎగిరిపోతుంది సదరు కందిరీగ ఆ గుడ్ల నుండి వచ్చిన పిల్లలుగూడ సమీపంలో ఉన్న పురుగును కొంచెం కొంచెం కొరుక్కుని తింటుంటాయి కానీ, అవిగూడ ఆ పురుగును చంపవు. ఎందుకంటే చచ్చినపురుగుల మాంసం వాటికి ప్రాణాంతకం. తన పిల్లల్ని తానెన్నడూ చూడదు సదరు కందిరీగ. అది సృష్టి ఆరంభం నుండి అలాచేస్తూవుండి ఉంటుంది. లేకుంటే దాని జాతే ఉండేది కాదు గదా, మరి ఈ పనిని అదెక్కడో చూసి నేర్చుకున్నది అనటానికి వీల్లేని పరిస్థితి గదా అది. మరలాంటప్పుడు దానికావిధానాన్ని బోధించిన గురువు సృష్టికర్త గాక ఇంకెవరు?

ఉదా॥ 4. ఏనుగు ఎముకలనైనా తునాతునకలు చేయగలిగిన నైలునదీ మొసలి, భయంకరమైన తన దంతాలతో ఏ మాత్రం ఒత్తిడి తగలనంతలీలగా, గుడ్డుపై పెంకును కొరికి అందులోనుండి తన పిల్ల బయిటకొచ్చేందుకు సహకరిస్తుంది. చిన్నఉడుత పిల్ల గూడ ఒక చెట్టు కొమ్మనుండి మరో కొమ్మమీదికి అవలీలగా దుముకుతుంటుంది. వాటిలో అంతటి ఆశ్చర్యకరమైన నైపుణ్యాన్ని నిక్షిప్తంచేయటం సృష్టికర్తకుగాక, ఇంకెవరికి సాధ్యం?

పంచమ కారణం : అపార ప్రజ్ఞావంతమైన జన్యుప్రక్రియను గూర్చి శాస్త్రజ్ఞులు చెప్పిన విషయం చక్కగా అవగాహన కావటం కోసం ముందుగా జన్యువులను గూర్చి మీకు క్లుప్తంగా పరిచయం చేస్తాను. మానవ శరీరంలో కోట్లాది జీవకణాలుంటాయి. ప్రతీ జీవకణంలో కేంద్రకముంటుంది. ఆ కణకేంద్రంలో 23 జతల క్రోమోజోములుంటాయి. ఆ క్రోమోజోములు డి.ఎన్.ఎ. (డి-యాంటి-న్యూక్లిక్‌యాసిడ్)తో నిర్మితమై యుంటయ్. డిఎన్ఎ ఆరడుగుల పొడవుంటుంది. అందులో జన్యువులు ఒక క్రమపద్ధతిలో అమరి ఉంటాయి. ఇలా ఒకమనిషిలో 80వేల జన్యువులుంటయ్. అవి 300 కోట్ల సంకేతాలను రూపొందించుకొని ఉంటాయి. మనిషి మెదడు, పొట్ట, గుండె, కాలేయం మొదలగు ప్రతి శారీరక భాగంలోని జీవకణాల్లో ఉన్న జన్యువులు, ఆయా సంకేతాలతో ఆయా శరీరభాగాలతో వేర్వేరు జీవక్రియలను నిర్వహింపజేస్తుంటాయి. అంతేగాదు, ఆయామనిషియొక్క వంశపారంపర్య లక్షణాలకు సంబంధించిన సమాచారాన్నంతా వాటి డిఎన్ఎలో నిక్షిప్తం చేసుకుని ఉంటాయి. క్లుప్తంగా ఇదీ జన్యుసమాచారం. ఇక వీటిపనితనం గూర్చి ఆశ్చర్యపడుతున్న శాస్త్రజ్ఞులే మంటున్నారో చూడండి.

మానవుల జీవలక్షణాలన్నిటినీ తమలో నిక్షిప్తం చేసుకున్న ఈ జన్యువు లెంత సూక్ష్మమైనవంటే, వందల కోట్లసంఖ్యలో ఉన్న ప్రపంచ మానవులందరి జన్యువులనూ ఒకచోట చేర్చగలిగితే అవి వేలెడుపొడవు, వేలెడు లావుకుగూడ తగ్గవచ్చు. ఆల్ట్రావైొక్రోస్కోపుతో మాత్రమే చూడగలిగినంత సూక్ష్మాతిసూక్ష్మాలివి. అంత సూక్ష్మాలైన జన్యువులు 1. మానవ జాతులన్నింటి సమస్తలక్షణాలను 2. వందలకోట్లమానవుల వ్యక్తిగత లక్షణాలను 3. వాళ్ళ వాళ్ళ వంశపారంపర్య లక్షణాలను, మనస్తత్వాలను, అన్నింటినీ ఎలా బంధించి ఉంచగల్గుతున్నాయి? కొన్ని లక్షల పరమాణువులతో కలిసి రూపొందించిన ఆ సూక్ష్మ జన్యువులు భూమిమీద జీవాన్నంతటినీ ఎలా

ఏలగల్గుతున్నాయి? ఇంతటి అగాధమైన ప్రజ్ఞకు, చాకచక్యానికి నిదర్శనమైన ఈ జన్యుప్రక్రియ తప్పకుండా సృష్టికర్తయొక్క పరమజ్ఞానజనితమే తప్ప, అన్యము కాదు గాక కాదు.

ఆరవ కారణం : ప్రకృతిలో సహజంగా ఉన్నట్టి పొదుపు, అదుపుల అద్భుతాన్ని చూస్తే దాని వెనకగల అనంతబుద్ధి, జ్ఞాన వైభవానికి ఆశ్చర్యం కలిగి తీరుతుంది. ఉదా॥ చాలా ఏళ్ళక్రితం ఆస్ట్రేలియాలో ఒక విధమైన జెముడు (నాగ జెముడు) వంటి మొక్కల్ని పొలాలకు కంచెలుగ నాటారు. ఆ కంచెలు వెర్రితలలు వేసి పిచ్చిగా వ్యాపించాయి. దాన్ని తినేసే పురుగులేవీ లేనందున అడ్డూ, ఆపూ లేకుండా ఇంగ్లండు దేశమంత సువిశాలంగా విస్తరించినాయి. ఇంకా ఇంకా విస్తరిస్తూనే ఉన్నాయి. అ కంచెలలా వ్యాపిస్తూ పంట పొలాలనే కాదు, గ్రామాలకు గ్రామాలనే మింగేస్తుంటే ప్రజలు హడలెత్తి పోయారు. దిక్కుతోచక ఇళ్ళూ వాకిళ్ళూ వదిలేసి ఒక చోటినుండి ఇంకోచోటికి పారిపోవడం మొదలెట్టారు. అప్పుడాస్ట్రేలియా శాస్త్రజ్ఞులు ప్రపంచ దేశాలన్నీ తిరిగి ఆ కంచెను తినేసే పురుగును పట్టుకొచ్చారు. అది అతిశీఘ్రంగా సంతానాభివృద్ధి చేసుకోగలిగిన పురుగు. ఆ పురుగుకు ఆస్ట్రేలియాలో శత్రువులు గూడ లేనందున అది అదే పనిగ కంచెను తినటం ప్రారంభించింది. దాని ధాటికి కంచె నశించటం ప్రారంభమైంది. కానీ కంచెతో పాటు పురుగూ క్షీణిస్తూ వచ్చింది. మరి విస్తృత సంతానాభివృద్ధి గలిగిన, శత్రువులే లేనట్టి సదరు పురుగు ఆస్ట్రేలియా అంతటా వ్యాపించాల్సింది పోయి ఎందుకు నశించినట్లు? ఎందుకంటే ఆ పురుగుకు ఊపిరితిత్తుల్లేవు. కేవలం రెండు గొట్టాలద్వారా గాలి పీల్చుకుంటన్నవి. ఐతే పురుగు పెరిగినంతగా అవి గాలిపీల్చుకునే గొట్టాలు పెరగవు. వ్యాకోచించవు. అందువలన వాటికి చాలినంత గాలి అందక చనిపోతుంటాయి. అందువల్లనే ఆ పురుగు అదుపులో ఉండిపోయింది. ఇలాంటి పొదుపు అదుపుల సంఘటనకు ఇంకొన్ని నిదర్శనాలు గూడ ఉన్నాయి.

సప్తమ కారణం : మనకు కన్ను, ముక్కు, చెవి, చర్మం, నాలుక వంటి జ్ఞానేంద్రియాలున్నాయి. వాటి ద్వారా రంగు, వాసన, శబ్దం, స్పర్శ, రుచులను గ్రహించగల్గుతున్నాం. కానీ అవి మనస్సు తెలుసుకునేవే తప్ప, వాటికి సరైన నిర్వచనాలను గాని, కారణాలనుగానీ చెప్పలేకపోతున్నారు శాస్త్రజ్ఞులు. మరి అవి ఆయా పనులను నిర్వహించటం గొప్ప విచిత్రమే. వీటన్నింటినీ పరిశీలిస్తున్నపుడు విశ్వాన్ని నడిపిస్తున్న మహాశక్తి లేక అతీత శక్తి ఉన్నదని అంగీకరించక తప్పదు. వివిధ రంగాల శాస్త్రజ్ఞులు, పరిశోధకుల అభిప్రాయాలతో **రీడర్స్‌డైజెస్ట్ అను ఆంగ్ల పత్రికలో** 1960లో ప్రచురించిన వ్యాస సారాంశమిదే!

మానవశిశు జననమూ మహాద్భుతమే!

సహజంగా మనం శిశుజననాన్ని చూస్తుంటామే గాని, ఆ జననం వెనుక జరిగే అద్భుతాల గూర్చి మనకు అవగాహన తక్కువ. అందువలన ఈ విషయమై, జీవ శాస్త్రజ్ఞులు, వైద్యులు వివరించిన అంశాలను క్లుప్తంగా మీకు వివరిస్తున్నారు.

1. పురుషుని వీర్యంలోని స్పెర్మటోజోవా, స్త్రీ అండంతో కలిసి 4 వారాల తర్వాత ఊహాతీతమైన సంక్లిష్ట నిర్మాణం గల శిశువు రూపొందటం ప్రకృతిలోని ఒక అద్భుతం!

2. అలా రూపొందిన శిశువు తల్లి గర్భంలోని ద్రవ పదార్థాల్లో తేలియాడుతూ ఏమీ తినకుండానే పెరుగుతూ నిర్దిష్ట సమయం రాగానే గర్భం నుండి వెలుపలకు గెంటుకు రావటం ఊహకందని ఒక అతీత ప్రకృతి చర్యయే!

3. తల్లి కడుపులోని బిడ్డకు హానికరమైన సూక్ష్మ క్రిముల బెడద లేకుండా, ఉష్ణోగ్రత మార్పులకు లోను కాకుండా, రక్షణ కవచంలాంటి సౌకర్యంఅమరి ఉండటం ఆశ్చర్యకరం!

4. తల్లి రక్తం నుండి ప్రాణవాయువు పోషకపదార్థాలూ శిశువు నాభినుండి ప్రాసెంటా ద్వారా, బిడ్డరక్తంలో కెళ్ళటమూ ఆశ్చర్యకరమే!

5. బిడ్డ పుట్టగానే బొడ్డు తాడు విడిపోవటం విశేషం. అప్పటిదాకా అచేతనంగా ఉన్నట్టి రెండు ఖాళీ సంచుల వంటి ఊపిరితిత్తులు, శిశువుగుండె, పనికి ఉపక్రమించటం, గర్భం నుండి బయటకు రాగానే శిశువులో జరిగే తొలి అద్భుతమది!

6. తొలిసారిగా శిశువు శ్వాసక్రియ ప్రారంభం కావటంతో పాటు, నిద్రాణ స్థితిలో ఉన్న శిశువు శారీరక వ్యవస్థలన్నీ బిడ్డ శరీరంలో పనిని ప్రారంభించటం సృష్టిలోని క్రమశిక్షణకు పరాకాష్ఠ!

7. బిడ్డ పుట్టగానే తల్లినుండి బిడ్డకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుంది. అప్పుడు శిశువు రక్తంలో కార్బన్‌డైయాక్సైడ్ పెరిగిపోతుంది. ఆకారణంగా శిశువు శ్వాసనియంత్రణాకేంద్రం ప్రేరణ చెంది, శ్వాసకోశాలకు ఆదేశాలు పంపటం వలన శ్వాసకోశ కండరాలు పనిని ప్రారంభించి, బిడ్డకు ఊపిరి ఆడటం ఊహకందని అద్భుతం. ఖాళీగా వున్నఊపిరితిత్తుల్ని గాలితో నింపే ప్రయత్నం క్రమబద్ధమయ్యేదాక బిడ్డకు ఊపిరి సరిగా అందదు. అందుకే బిడ్డ గట్టిగా ఏడుస్తుంది. తద్వారా శ్వాసకోశాలు మామూలు స్థితి కొచ్చేస్తాయి. పుట్టగానే బిడ్డ ఏడవటంలో గల ఆంతర్యమిదే! అందుకే బిడ్డ పుట్టగానే ఏడుస్తుంటే కుటుంబ సభ్యులంతా తెగ సంబర పడిపోతుంటారు. శిశువు ఆరోగ్యంగా ఉందనటానికి సంకేతమే ఆ ఏడ్పు!

8. తల్లికి నెలలు నిండిన చివరిరోజుల్లో గర్భస్థ శిశువు ఎక్కువ ఆహారం తీసుకుని శరీరంలో నిల్వ చేసుకుంటుంది. పుట్టిన తొలి నాలుగురోజుల్లో ఆహారం సరిగా అందకపోయినా, తనలో నిల్వచేసుకున్న ఆహారాన్ని వినియోగించు కుంటుంది శిశువు. ఎడారిలో

పయనించే ఒంటె ముందు జాగ్రత్త చర్యగా నీటిని, ఆహారాన్ని శరీరంలో నిల్వచేసుకున్నట్లు శిశువు గూడ గర్భం నుండి వెలుపలికి రాబోయే ముందుగా యిలా ఆహారాన్ని నిల్వచేసుకోవటం అద్భుతం, ఆశ్చర్యం!

9. బిడ్డ తల్లి చనుమొనల్ని చప్పరించగానే తల్లి నరాలలో కలిగే స్పందనలు హైపోథాల్మస్‌కు వెళ్ళి దానిద్వారా ప్రోలాక్టినో హార్మోన్ విడుదలౌతుంది. అప్పుడు తల్లికి పాలు ఊరటం ప్రారంభమౌతుంది. ఇదొక చిత్రం!

10. పుట్టగానే శిశువు ఆహారం కోసం వెదుక్కుంటుంది. శిశువుల్లో రాడార్ వ్యవస్థ వంటి నిర్మాణముంటుంది. అందువలన శిశువు బుగ్గకేం తగిలినా అప్రయత్నంగా తల అటు తిప్పి, నోట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రకృతిలో ఇదీ ఓ అద్భుతమే!

11. అప్పుడే పుట్టిన బిడ్డ తలను నిలుపలేదు. శిశువుకు తలపై అదుపుఉండదు. అట్టి స్థితిలో గూడ బిడ్డ పొరపాటున బోర్లాపడినట్లైతే, ఊపిరి తీసుకునేందుకై ముక్కుమంచాని కతుక్కోకుండా, బలమంతా ఉపయోగించి శిశువు తలను పక్కకు తిప్పుకుంటుంది. ఇదీ అద్భుతమే. ఈ అద్భుతాలన్నీ అతీతమైన దివ్యశక్తి వల్లనే సుసాధ్యాలని పలువురు శాస్త్రజ్ఞులు నిర్ధారించారు మరి!

సంక్షిప్త గీతా సందేశామృతమ్

శిరీష : మా విద్యార్థుల అవగాహనార్థం దయచేసి ఈ అష్టాదశాధ్యాయాల గీతా సందేశాన్ని సంక్షిప్తంగాను, సరళంగాను వివరిస్తారా గురువుగారూ?

శ్వేత : తమరు అందించే గీతా సందేశామృతాన్ని మా విద్యార్థులు తనివిదీరా ఆస్వాదిస్తుంటే చూసి మనసారా ఆనందించాలనుంది గురువుగారూ!

వ్యాఖ్యాత : అలాగే తప్పక ఆనందించండి. సరే పిల్లలూ ఆస్వాదించండి, ఇదిగో గీతాసందేశామృతమ్.

1. అర్జున విషాదయోగం

యువన్ తేజల్ : ముందుగా అర్జున విషాదయోగ మంటే, ఏంటో వివరించండి తాతగారూ?

వ్యాఖ్యాత : (విషాదమంటే దుఃఖం –యోగం అంటే పొందటం. అర్జునుడు దుఃఖాన్ని పొందటమే అర్జున విషాదయోగం. తన ప్రియ బంధువుల నందర్నీ స్వహస్తాలతో చంపుకోవలసి వచ్చిన దుస్థితే అర్జునునకు దుఃఖాన్ని కలిగించింది. బంధుజనాలను చూడగానే కలిగిన దుఃఖభారంతో మోహితుడయ్యాడర్జునుడు. ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా భావించుటే మోహం. ఉదా॥ ఇంటికి నిప్పు పెట్టేవాడు, విషమిచ్చేవాడు, ధనాపహారి, మారణాయుధధారి, భూకబ్జాదారు, స్త్రీ హింసకుడు – ఈ ఆరుగురు **ఆతతాయులు. స్వ-పర-లింగ-వయోభేద రహితంగా వీరిని వధించుట ధర్మం, వధించక వదిలివేయుట అధర్మం.** ఇవన్నీ చేసినట్టి ఆతతాయులైన కౌరవులను వధించుట క్షత్రియునిగ అర్జునుని ధర్మం. కానీ ఆతతాయులైనప్పటికీ బంధువులు గనుక వారిని వధించుట పాపమన్న మోహానికి లోనై యుద్ధం చేయనుగాక చేయనంటూ, విల్లమ్ములను జారవిడిచి, దుఃఖిస్తూ రథంలో కూర్చుండి పోయాడు అర్జునుడు. దీని వివరణయే ప్రథమాధ్యాయం)

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో నావాళ్ళూ, పాండవులూ ఏం చేశారన్న ధృతరాష్ట్రునికి సంజయుడిలా చెప్పాడు. సమరానికి మోహరించిన పాండవ సైన్యాన్ని జూచి ద్రోణాచార్యునితో దుర్యోధనుడిలా అన్నాడు. ఆచార్యా! మీ శిష్యుడైన ధృష్టద్యుమ్నుడు వ్యూహం పన్ని సన్నద్ధం చేసిన పాండవ సైన్యాన్ని చూడండి. భీమార్జునసములైన సాత్యకి, విరటుడు, ద్రుపదాది వీరులూ, ఇంకా అభిమన్యుడు ద్రౌపదీపుత్రులూ, వీళ్ళంతా మహారథులే! ఇక నా సైన్యంలోని వీరుల గూర్చి చెబుతా వినండి. మీరూ, భీష్ముడు,కర్ణ, కృప, అశ్వత్థామ, వికర్ణ, జయద్రధాది పలువురు వీరులు నాకోసం

ప్రాణాలర్పించవచ్చారు. పాండవ సైన్యం పరిమితంగా ఉంటే, మన సైన్యమపారంగా ఉంది చూడండి. ఇక మీరంతా మీమీ స్థానాల్లో నిల్చి, భీష్ములవారికి సంపూర్ణ రక్షణ కల్పించెదరు గాకన్నాడు. దుర్యోధనుని మాటలు విన్న భీష్ముడు అతని ప్రీత్యర్థం సింహనాదం చేస్తూ శంఖాన్ని పూరించాడు. అనంతరం కౌరవ సైన్యమంతా శంఖాలు, భేరీలు, రణశృంగాలూ, వగైరా యుద్ధ వాద్యాలన్నింటినీ ఒక్కసారిగా మ్రోగించడంతో అవి భీకరంగా వినిపించినాయి.

అప్పుడు శ్వేతాశ్వరథారూఢులైన కృష్ణార్జునులు,పాంచజన్య, దేవదత్త శంఖాలను పూరించారు. ఆ ధ్వనులు కౌరవ గుండెలను అదర గొట్టినాయి. శ్రీకృష్ణా! మన రథాన్ని ఉభయసేనల మధ్యగా పోనిచ్చి అధర్మ కౌరవుల ప్రీత్యర్థం యుద్ధసన్నద్ధులై వచ్చిన వీరులెవరో, వారిలో నేను తలపడాల్సిన వారెవరో చూసి నిశ్చయించుకునే దాక నిలిపియుంచమన్నాడర్జునుడు. రథాన్ని భీష్మ ద్రోణాదుల కెదురుగా నిలిపి, అర్జునా! శత్రు వీరులందర్నీ తేరిపార జూచుకోమన్నాడు శ్రీకృష్ణుడు. ఎదురుగావున్న బంధుమిత్రులందర్నీ చూడగానే వారిని స్వీయ హస్తాలతో చంపుకోవలసి వచ్చిన దుస్థితికి చలించి పొంగుకొచ్చిన దుఃఖంతో అర్జునుడిలా వాపోయాడు. హాశ్రీకృష్ణా! నాపై దండెత్తి వచ్చిన నా బంధుమిత్రులను చూడగానే పొంగి పొరలిన దుఃఖంతో నా దేహం వణుకుతుంది. మనస్సు చలిస్తున్నది. చేతిలో గాండీవం జారిపోతుంది, అసలు నిలబడలేకపోతున్నాను. ఏ బంధుమిత్రుల శ్రేయస్సుకొరకై నేనీ రాజ్యాన్ని కోరుకున్నానో, వాళ్ళనే చంపుకున్నాక నాకీ రాజ్యంతో లాభమేంటి? ఇక నేనెవరికోసం జీవించాలి? వీళ్ళందర్నీ చంపితే వంశమే నాశనమైపోతుంది. అప్పుడు స్త్రీలు చెడి అధర్మ సంతానానికి తల్లులౌతారు. తద్వారా కులధర్మాలు, జాతీయ ప్రణాళికలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ విఘాతమేర్పడుతుంది. అట్టి వంశనాశకులు ఘోర నరకాల కెళ్తారని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అయ్యో! రాజ్య సుఖ

లోభంతో ఎంతటి ఘోరపాపానికి పూనుకున్నాం కృష్ణా! అయ్యయ్యో! తెలిసి, తెలిసీ నేనీ పాపానికి పూనుకోలేను. భిక్షమెత్తుకునైనా జీవిస్తాను గాని, ఈ రాజ్యం కోసం నా వాళ్ళను నేను చంపుకోలేను గాక చంపుకోలేనంటూ ధనుర్బాణాలను జారవిడిచి రథంలోనే కూలబడి పోయాడర్జునుడు!

2. సాంఖ్యయోగం

హర్షవర్ధన్ : సాంఖ్యయోగ మంటే ఏంటో వివరించండి తాతగారూ?

వ్యాఖ్యాత : (సాంఖ్య యోగమంటే సమ్యక్(సరియైన) జ్ఞానాన్ని కలిగించేదని భావం. ధర్మరక్షణా! బంధురక్షణా! యుద్ధమా! యుద్ధవిరమణా! ఏది కర్తవ్యం! ఏదకర్తవ్యం! తేల్చుకోలేక తనను శరణువేడిన అర్జునుని ధర్మసంకట స్థితినుండి గట్టెక్కించడానికి శ్రీకృష్ణుడు చేసిన సమ్యక్ జ్ఞానబోధయే సాంఖ్యయోగం. 1.అర్జునుని పాపభీతిని పోగొట్టేందుకు పాప పుణ్యాలంటకుండా కర్మలు చేసే కర్మజ్ఞానాన్నీ 2. రాగ ద్వేషాలను, సుఖదుఃఖాల నధిగమింపజేసే స్థిత ప్రజ్ఞతా స్థితిని కలిగించే ఆత్మజ్ఞానాన్నీ 3. మోహానికి గురికానీయని బ్రాహ్మీస్థితిని 4. ఈశ్వరునకు ప్రీతిని, లోకానికి కళ్యాణాన్ని చేకూర్చే ధర్మయుద్ధం అవశ్యకర్తవ్యమనీ అర్జునునికేగాదు మానవులందరికీ వాసుదేవుడు (అందరిలో ఆత్మగ వసించే దేవుడు) చేసిన సమ్యక్ జ్ఞాన బోధయే సాంఖ్యయోగం).

యుద్ధారంభ సమయాన దయార్ద్ర హృదయంతో, దుఃఖాశ్రునయనాలతో కూలబడిన అర్జునుని చూస్తూ కష్ట సమయాన విజ్ఞులకు తగనట్టి, అపకీర్తి దాయకమైన ఈ దుఃఖమోహం నీకెక్కడ దాపురించిందయ్యా అర్జునా? శత్రుతాపనుడవైన నీకిది తగదు. నీచమైన హృదయ దౌర్బల్యాన్ని వీడిలే, లేచి యుద్ధానికి పూనుకోమన్నాడు శ్రీకృష్ణుడు.

పిరికితనంతో నేనీ యుద్ధానికీ వెనుకాడ్డంలేదు, పూజ్యులైన భీష్మ ద్రోణాదులను బాణాలతో హింసించి వారి రక్తంతో తడిసిన

రాజ్యభోగాలనుభవించడంకంటే, భిక్షమెత్తి జీవించుట మేలుగదాయని భావిస్తున్నాను. అంతేకాదు, ఐన వాళ్ళందర్నీ చంపుకుంటే, దీనుణ్ణీ, పాపాత్ముణ్ణీ ఐపోతానని భయపడుతున్నాను. ఈ కారణంగానే ధర్మరక్షణార్థం యుద్ధమా? బంధురక్షణార్థం యుద్ధవిరమణా? ఏది కర్తవ్యమో తేల్చుకునే విచక్షణ కోల్పోయాను. అందుకే నీ శిష్యుడనై నిన్ను శరణు వేడుకుంటున్నాను. దయతో నాకేది శ్రేయస్కరమో నీవే తేల్చి చెప్పు శ్రీకృష్ణా ! అదీగాక నావాళ్ళను చంపుకోవటం వల్ల నాకు కలిగే దుఃఖం ఈ రాజ్యంతోనే గాదు, స్వర్గలోకాధిపత్యంతో నైనా ఉపశమించేలా లేదు. అందుకని నేనీ యుద్ధం చేయలేకపోతున్నాను శ్రీకృష్ణా! అని మౌనంగా కూర్చుండి పోయాడర్జునుడు.

అట్టి అర్జునుని మందహాసంతో చూస్తూ, శ్రీకృష్ణుడిలా అన్నాడు ఏ మాత్రం, శోకింపదగని అధర్మ పరులకోసం దుఃఖిస్తున్నావు, మళ్ళీజ్ఞానిలా మాట్లాడుతున్నావు కానీ, అర్జునా! ఈశ్వరునకు ప్రీతిని కల్గించటానికి, లోకానికి మేలుచేయటానికి, ధర్మాన్ని రక్షించడానికి తమ కర్తవ్యమేంటోదాన్ని గూర్చి ఆలోచిస్తారే తప్ప, ఇలా చనిపోయే వాళ్ళకోసమో, బ్రతికున్న వాళ్ళకోసమో దుఃఖిస్తూ కూర్చోరు జ్ఞానులు! ఎందుకంటే? దేహధారియైన **ఆత్మకు జనన, బాల్య, యౌవన, వార్ధక్యాలవలె మరణం కూడా అవశ్యమే. విశ్వంలో శాశ్వత, (సత్) అశాశ్వత(అసత్) వస్తువులు రెండూ ఉన్నాయి. అసత్తులైన దేహాలు నశిస్తాయి. సద్వస్తువైన ఆత్మ నశించదు.** అందువలన నీవు చంపగలిగేది వాళ్ళ దేహాలనే గానీ, వాళ్ళ ఆత్మనేమీ చేయలేవు. ఎందుకంటే? ఈ ఆయుధాలు, అగ్ని, వాయువు, జలం ఏవీ విశ్వవ్యాప్తమైయున్న ఆత్మకు హాని కలిగించలేవు. చావు, పుట్టుక, వృద్ధి, క్షీణత, ఆది, అంతం లేనిది ఆత్మ. కాబట్టి, యుద్ధంలో వాళ్ళ దేహాలు కూలినా, వాళ్ళ ఆత్మమాత్రం తిరిగి నూత్న దేహాలలో ప్రవేశించి జీవిస్తూనే ఉంటుంది. ఇది వాస్తవం, ఈ వాస్తవం తెలిశాక గూడ యింకా దుఃఖం

కల్గుతున్న డీలాపడకు, కాస్త ఓర్చుకో కాసేపటికదే తొలగిపోతుంది. ఎందుకంటే? ఋతువుల్లా దుఃఖం గూడ వచ్చిపోతుండే అశాశ్వత వస్తువే. అర్జునా! ఇక ఈ ధర్మయుద్ధం క్షత్రియునకు కేవలం కర్తవ్యమే గాదు, తలుపుతెరచి ఉంచిన స్వర్గం వంటిది. ఇందు జయించిన వానికి రాజ్యమూ, మరణించిన వానికి స్వర్గమూ ప్రాప్తిస్తాయి. అందుకే పాపపుణ్యాలను, జయాపజయాలను, లాభనష్టాలను గూర్చి పట్టించుకోక నీవీధర్మయుద్ధం చేయి. దీనివలన నీకు పాపమంటదు గాక! అలా చేయక నీవీధర్మయుద్ధాన్ని వదిలేస్తే మాత్రం కర్తవ్యాన్ని విడనాడిన పాపాన్నీ, పిరికివాడి వన్న అపకీర్తినీ మూటగట్టుకోగలవు? తస్మాత్ జాగ్రత అర్జునా!

నీ దుఃఖ నివారణార్థం నీకిప్పటిదాకా ఆత్మజ్ఞానాన్ని బోధించాను. ఇక పాప మంటకుండా కర్మ(పని)చేసే ఉపాయాన్నిఅంటే కర్మయోగాన్ని నీకు బోధిస్తా విను. ఫలితాన్ని పరమాత్మ కర్పించి, ఆయన ప్రీతికోసం, లోకకళ్యాణం కోసం నీ కర్తవ్యాన్ని నీవు నిర్వహించడమే కర్మయోగం ఇట్టి నిష్కామకర్మను పూర్తిగా చేయలేక కొంచెం జేసినా అది నిన్ను గొప్ప ప్రమాదం నుండి కాపాడుతుంది. అట్టి కర్మయోగి యొక్క బుద్ధి ఫలితాన్ని గూర్చి ఏమాత్రం ఆలోచించదు గనక, అది పూర్తిగా లక్ష్యసాధనమీదనే కేంద్రీకృతమై ఉంటుంది. అందువలన అతనికి పూర్తి ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అట్టి నిష్కామకర్మ యోగికిక వేద జ్ఞానంతో గాని, విశ్వంలో మరేజ్ఞానంతో గాని పనేలేదు. అట్టి. జ్ఞాన పరిపూర్ణతను, ఆత్మవిశ్వాసాన్ని లక్ష్యసాధనపై ఏకాగ్రతనూ పాపపుణ్యాలనుండి విముక్తినీ ప్రసాదించే కర్మయోగాన్ని నీవు పాటించు అర్జునా! ఈ ధర్మయుద్ధ ఫలితంపై పరమాత్మకే గాని నీకధికారంలేదు. కేవలం ధర్మయుద్ధ కర్తవ్యంమీదనే నీకధికారమున్నది. ఈ వా స్తవాన్ని గ్రహించి పాపపుణ్యాల, జయాపజయాల వంటి ద్వంద్వాల పట్ల సమభావంతో నీ విధిని నిర్వహించు. అలా చేసే కర్మనైపుణ్యమే కర్మయోగం! లేక బుద్ధియోగం! వేదజ్ఞానం కారణంగా పాపపుణ్యాలు,

స్వపరభేదాలవంటి పలు దిక్కులకు పరుగెత్తుతున్న నీ మనసును ఆత్మైకత జ్ఞానంతో సుస్థిరపరచుకొని సమాధిస్థితిలో నిల్పుకోగల్గితే, నీకట్టి కర్మయోగం ప్రాప్తిస్తుంది అర్జునా! అని ప్రబోధించాడు శ్రీకృష్ణుడు.

అట్టి సమతాస్థితిలో యుండగల్గిన స్థితప్రజ్ఞుని లక్షణాలేంటని అడిగా డర్జునుడు. అందుకు శ్రీకృష్ణభగవానుడిలా చెప్పాడు. 1. కోర్కెల్ని త్యజించి ఆత్మాధీనుడై ఆత్మనిర్దేశానుసారం ఆత్మప్రీతికొరకే చేస్తూ ఆత్మతోనే ఆనంది స్తుంటాడు స్థితప్రజ్ఞుడు. 2. రాగ, ద్వేష , భయాదుల కతీతంగా ఉంటాడు. 3. ప్రియాప్రియాలు, సుఖదుఃఖాది ద్వంద్వాల పట్ల సమంగా వ్యవహరిస్తాడు. నీవీ స్థితప్రజ్ఞతాస్థితికి చేరుకోవాలంటే ఆత్మకు అధీనుడవై, ఆత్మాదేశానుసారం వ్యవహరిస్తూ నీ మనసును తమవెంట లాక్కుపోయే నీ ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవాలి. అలా **నీవు జితేంద్రియుడవు కాకుంటే నీలో చెలరేగే కోర్కెలు కోపాన్ని, మతిమరపును,మూఢతనూ కలిగిస్తాయి. అందుకే ముందు నీవు జితేంద్రియుడవు కమ్ము. అప్పుడు నీజ్ఞానమంతా ఆత్మయందే సుస్థిరం కాగలుగుతుంది.** మరియు, జితేంద్రియుడైన వాడు ఆత్మసుస్థిరుడు కావటమే కాక నేను అన్న అహంకారాన్నీ నాది అన్న మమకారాన్ని వీడి సుఖదుఃఖాలు స్పృహ లేకుండా ఉండగల్గుతాడు. పలు నదుల నుండి వచ్చి ఎంతో నీరు తనలో చేరుతున్నా తొణకని సముద్రం లాగే తనలోని కోర్కెల పరంపరకే మాత్రం చలింపక ప్రశాంతంగా జీవించగల్గుతాడు. బ్రాహ్మీస్థితి / ఆధ్యాత్మిక స్థితియంటే అదే. అట్టి ఆధ్యాత్మిక స్థితికి చేరినవారు ఇక ఎప్పటికీ మోహగ్రస్తులు కాలేరు. జీవిత చరమాంకంలోనైనా సరే అట్టి స్థితికి చేరగల్గినవారు బ్రహ్మ (పరమాత్మ)తో విలీన మౌతారర్జునా! యని ప్రబోధించాడు వాసుదేవుడు!

3. కర్మయోగం

రిత్విక్ : కర్మయోగ మంటే యేంటో తెల్సుకోవాలని నాకుబాగా ఆసక్తిగా ఉంది తాతగారూ?

వ్యాఖ్యాత : (పాప మంటకుండా పనిచేసే నైపుణ్యాన్ని పొందటమే కర్మయోగం. సృష్టిలోని సజీవ, నిర్జీవాలన్నీ పరస్పరాధారితాలై, దేని విధి నది నిర్వహిస్తున్నందు వల్లనే విశ్వం కొనసాగుతున్నది. ఉదా॥ సూర్యకుటుంబం, పాలపుంత వగైరాలు. అలాగే గుండె, జీర్ణాశయం, మూత్రపిండాలు మొ॥ అవయవాలన్నీ పరస్పరాధారితాలై దేని విధి నది నిర్వహిస్తున్నందు వల్లనే మనిషి, పశు, పక్ష్యాది ప్రాణులు మనగల్గుతున్నాయి. అలాగే మనుషులు గూడ పరస్పరాధారులై ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహిస్తున్నందువల్లనే కుటుంబం, సమాజం, దేశమూ పురోగమించ గల్గుతున్నాయి. ఇలా పరమాత్మచే రూపొందింపబడిన ఈ కర్మచక్రంలో ఇమిడి ఉంటూ ప్రతిఒక్కరూ తన విధిని తాను అవశ్యంగా నిర్వహించవలసి ఉంది. ఈ సత్య ప్రబోధం ద్వారా, పాపభీతితో యుద్ధాన్ని తిరస్కరించి దుఃఖిస్తూ కూర్చున్న అర్జునుని అవశ్యమైనధర్మపోరాటవిధికి సంసిద్ధం చేశాడు శ్రీకృష్ణభగవానుడు. నారాయణుడు చేసిన కర్తవ్యబోధ కేవలం నరునొక్కనికే కాదు. మన మానవులందరికీ సుమా!)

కేశవా! కర్మకన్నా, జ్ఞానమే శ్రేష్ఠమని నీవు భావిస్తున్నపుడు, మరి నన్నెందుకీ హింసాత్మక కర్మకు ప్రోత్సహిస్తున్నావు ? ఇలా విరుద్ధ భావాలతో నన్నయోమయానికి గురిచేయకు, దయ చేసి నాకు శ్రేయస్కరమైన దేదో ఆ ఒక్కదాన్ని గూర్చే చెప్పమన్నాడర్జునుడు. **అర్జునా! పరిణతిచెందిన వారికి జ్ఞానమార్గాన్నీ పరిణతి చెందని వారికి కర్మమార్గాన్ని నిర్దేశించాను. అంతేగాని అసలేపనీ చేయకుండా చేతులు ముడుచుక్కూర్చున్నంత మాత్రాన అతడు నిష్కర్ముడు కాలేడు. ఫలాపేక్ష రహితంగా పనిచేయగల్గిన జ్ఞానియే నిష్కామ కర్ముడు.** అంతేగాని ఏకర్మలు చేయనివాడని కాదు. మనిషిలో నిక్షిప్తమై యున్న సత్వ, రజో, తమో గుణాలు ప్రతిమనిషి చేత, ఆయాపనులను చేయిస్తూ ఉంటాయి. ఈ కారణంగానే ఏదో ఒక పనిచేయకుండా ఏ మనిషీ ఊరికే కూర్చోలేడు. అంతేగాదు, ఏపనీ చేయని వాడు. కనీస మతని దేహాన్ని

గూడ పోషించుకోలేడు గదా? కానీ, ప్రకృతి గుణాల ప్రేరణ వల్లనే తాను పనిచేస్తున్నానన్న జ్ఞానంలేకపోవడం చేత, తానే ఆ పనికి కర్త నని భ్రమిస్తున్నాడు మనిషి! ఈ వాస్తవాన్ని గ్రహించి తానే కర్తనన్న ఆహాన్ని, వివిధ కోర్కెల్ని విడనాడి ఫలాపేక్షరహితంగా తన విధిని నిర్వర్తించేవాడే శ్రేష్ఠుడు. అందుకే నీ మనసు కోరుకుంటున్నట్లు బంధు రక్షణకోసం కాక శాస్త్రం. ఆత్మ నిర్దేశిస్తున్నట్లు ధర్మరక్షణార్థం నీ విధిని నిర్వర్తించు. ఇలా ఈశ్వరప్రీత్యర్థం, ప్రపంచ కళ్యాణం కోసం చేసే కర్మలు తప్ప తక్కిన కర్మలన్నీ మనిషిని పాప పుణ్యాలచేత బంధించేవే. అంతేగాదు, యజ్ఞంతోపాటు మనిషినీ సృష్టించి ఇలా నిర్దేశించాడు బ్రహ్మ. మీరంతా సదా శ్రమిస్తూ జీవించండి. శ్రమే కామధేనువులా మీ కోర్కెల్ని తీర్చుతుంది. శ్రమవల్లనే మీరు వృద్ధి చెందుతారు. మీ యందరి యజ్ఞానికి సంతృప్తి చెందిన ప్రకృతి శక్తులనెడు దేవతలు మీకు భోగభాగ్యాలను ప్రసాదిస్తారు. ప్రతిగా మీ భాగ్యాన్ని కొంత ప్రకృతి దేవతల కర్పించుకోండి. అలా ప్రకృతినుండి పుచ్చుకోవటమే కాదు ప్రకృతికివ్వటమూ నేర్చుకోండి. అలాగే యజ్ఞ ఫలాన్ని భాగస్వాములందరికీ పంచి, మిగిలిన దాన్ని భుజించేవాడు పాపవిముక్తుడు. కేవలం దాన్ని తనొక్కడే అనుభవించువాడు పాపాన్ని భుజిస్తున్నట్లే.

అంతేగాదు, ప్రాణులు అన్నంవలన, అన్నం వర్షం వలన, వర్షం యజ్ఞం వలన, యజ్ఞం వేదం వలన, వేదం బ్రహ్మవలన జనిస్తున్నాయి. ఇలా ప్రకృతిలోని ప్రతిదీ పరస్పరాధారితమై దేని పని నది చేస్తున్నందువల్లనే సమాజం మనగల్గుతుంది. ఇట్టి కర్మచక్రంలో ఇమిడి పోయి, తన కర్తవ్యాన్ని నిర్వహించకుండా, మనసుమాటవింటూ ఇంద్రియ సుఖాల కోసం వెంపర్లాడేవాడు వ్యర్థజీవి. కానీ, ఆత్మస్థితి కెదిగిన జ్ఞానికి, తనకంటూ చేయాల్సిందేమీ లేదు. ఐనా సరే, లోకుల ఆదర్శం కోసం, లోక కళ్యాణార్థం జ్ఞానిగూడ కర్మలు చేస్తూనే ఉండాలి. ఏమి చేయాల్సిన అవసరమేలేని పరమాత్మనైన నేను. కర్మలు చేయకుంటే, నన్ను జూచి లోకులూ

సోమరులౌతారని నేనుసైతం శ్రమిస్తూనే ఉన్నా, అదీగాక శ్రేష్ఠుడేంజేస్తే, సామాన్యుడూ అదే చేస్తుంటాడు. కాబట్టి, శ్రేష్ఠుడవైన అర్జునా! బంధుప్రీతితో నీవీధర్మయుద్ధాన్ని విరమిస్తే నిన్నుజూచి అందరూ నీ బాటనే నడుస్తారు. అప్పుడు రక్షించే నాథుడే లేక ధర్మం, ధర్మంతో పాటు ప్రపంచమే ప్రమాదాన పడుతుంది.

ప్రకృతి జనిత గుణాలవల్లనే జ్ఞాని, క్షత్రియుడు ఆయా కర్మలను నిర్వహించగల్గుతున్నారు. అందువలన అన్యుల కర్తవ్యనిర్వహణకన్నా ఎవరికైనా స్వీయకర్తవ్య నిర్వహణయే శ్రేయోదాయకం. కాబట్టి, పాపపుణ్యాల విశ్లేషణ, భిక్షాటన వంటి అన్యుల ధర్మ నిర్వహణలకన్నా, క్షత్రియునిగా నీదైన ధర్మపోరాట నిర్వహణయే నీకు, లోకానికీ క్షేమదాయకమర్జునా! మరియు ఫలాసక్తులై సదా శ్రమిస్తున్న పామరుల్లా నీవంటి విజ్ఞులు సైతం లోక కళ్యాణార్థం ఫలాపేక్ష రహితంగా సదా పరిశ్రమిస్తుండాలి. ఇట్టి నిష్కామ కర్మద్వారానే జనకాది జ్ఞానులు ముక్తి పొందారు. నాయీ బోధను శ్రద్ధాసక్తులతో విన్నవారంతా పాపవిముక్తు లౌతారు. తిరస్కరించిన అజ్ఞానులు మూఢులై పరమార్థ భ్రష్టులౌతారన్నాడు శ్రీకృష్ణుడు.

మరి మనిషి కిష్టం లేకున్నా అతన్ని బలవంతంగా పాపానికి ప్రేరేపిస్తున్న దెవరని అడిగాడర్జునుడు. రజోగుణం నుండి పుట్టిన కామమే మనిషిని పాపానికి ప్రేరేపిస్తున్నది. తృప్తేలేని అనలం వంటిది కామం. మకిలి అద్దాన్ని కప్పేసినట్లు కామం జ్ఞానాన్నికప్పేస్తుంది. హరిస్తుంది గూడ! అందుకే మనసును, ఇంద్రియాలనూ ఆశ్రయించి యుండే కామశత్రువును అన్నింటికన్నా ఉత్తమమైన ఆత్మ యొక్క సహకారంతో అణిచివేయి అర్జునా! అంటూ కర్మయోగాన్ని ప్రబోధించాడు శ్రీకృష్ణుడు.

4. జ్ఞాన యోగం

ఆదిత్య : జ్ఞానకర్మ సన్న్యాస యోగమంటే, ఏంటి తాతగారూ?

వ్యాఖ్యాత : (ఆత్మజ్ఞానంతో కర్మలు చేస్తూనే కర్మ సన్న్యాసాన్ని పొందుటే జ్ఞానకర్మ సన్న్యాస యోగం విశ్వమంతటా వ్యాపించియున్న ఆత్మ ఒక్కటే. అదే విశ్వాత్మ యను ఆత్మైక జ్ఞానంతో ఏ విధిని నిర్వహించినా అదిలోక కళ్యాణానికే తోడ్పడుతుంది. అట్టికర్మలతనని బంధించవు. కనుక అతడు కర్మలు చేస్తున్నా కర్మన్న్యాసియే మరియు యజ్ఞం అంటే వేదోక్త కర్మగాదు, ప్రపంచ కళ్యాణానికి తోడ్పడే ఫలాపేక్ష రహిత కర్మ! అదే అసలైన యజ్ఞం. లోకకళ్యాణానికిపాటు పడని వ్యర్థజీవి ఈ లోకంలో ఉండటానికే అనర్హుడు. కాబట్టి, అర్జునా! తన, పర–పాప, పుణ్యాలవంటి నీ సంశయాలన్నింటినీ ఆత్మైక జ్ఞాన ఖడ్గంతో ఛేదించి, ఫలాపేక్ష రహితంగా ధర్మపోరాట విధి నిర్వహణకు పూనుకో. లోక కళ్యాణాయక మైన ఈ ధర్మయుద్ధం వలన నీకు పాపమంటదు. ఆత్మైక జ్ఞానంతో నీవీ ధర్మ పోరాట కర్మను నిర్వహించినా నీకు పాప పుణ్యాలంటవు. కాబట్టి, నీవు కర్మ సన్న్యాసివే నంటూ అర్జునుని ధర్మ యుద్ధానికి ప్రోత్సహిస్తున్నాడు వాసుదేవుడు).

తరగని ఫలదాయకమైన ఈ యోగాన్ని నేను సూర్యునకు– సూర్యుడు మనువుకు, మనువు ఇక్ష్వాకునకు బోధించాడు. ఇలా వంశపారంపర్యంగా రాజర్షులకు తెలిసిన ఈ యోగం కాలక్రమంలో మరుగున పడిపోయింది. అట్టి అత్యున్నత రహస్యాన్ని నీకిపుడు బోధిస్తున్నానర్జునా! అన్నాడు శ్రీకృష్ణుడు. అదేంటి నీకన్నా ముందు పుట్టిన సూర్యునకు బోధించడం నీకెలాసాధ్యం? అని ప్రశ్నించా డర్జునుడు. నీకూ నాకూ చాలా జన్మలు గడిచినాయి. ఈ వాస్తవం నాకు తెలుసుగాని నీకు తెలియదర్జునా! నాకు జనన మరణాల్లేవు ఐనా సరే ధర్మం క్షీణించి, అధర్మం విజృంభించినప్పుడల్లా నాకు నేనే యేదో ఒక అవతారాన్ని ధరిస్తాను. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనార్థం ఇలా యుగ యుగాన అవతరిస్తుంటాను. ఇట్టి నా యొక్క అలౌకిక జన్మను గ్రహించిన జ్ఞానులు రాగ, ద్వేష,భయా, గ్రహ దూరులై నన్ను స్మరిస్తూ నాలో ఐక్యమౌతారు. ఎవ్వరేమార్గంలో ఏ రూపాన నన్ను హింసించినా

వారి కామార్గంలోనే ఇష్టార్థసిద్ధిని కలిగిస్తాను. మనుషులయొక్క గుణ కర్మల విభాగం ద్వారా వారిని నాలుగు వర్ణాలుగా విభజించాను నేను. కానీ, కర్మఫలాసక్తి రహితుడనైన నాకాకర్మలంటవు. నన్నిట్టి ఆత్మస్వరూపునిగ తెల్సుకోగల్గినవాడు కర్మలచే బంధితుడు కాడు.

మరియు నిష్కామ కర్ముని కర్మలో అకర్మను – కర్తృత్వాభిమానియొక్క అకర్మలోనూ కర్మను చూడగల్గిన వాడే మేధావి. కాబట్టి, కర్తృత్వ బుద్ధిని విడిచి ఫలాపేక్షరహితంగా కర్మలు చేసేవాడు ప్రాజ్ఞుడు. అట్టి ఆత్మజ్ఞాని కర్మలు చేసినా సన్న్యాసియే. అప్రయత్నంగా ప్రాప్తించినవాటితో తృప్తిపొంది, సుఖదుఃఖాలు, ఫలాఫలాల వంటి ద్వంద్వాల కతీతంగా సమభావనతో కర్మలు చేసినా అతడు బంధితుడు కాడు. పరబ్రహ్మ / పరమాత్మ కర్పించి, పరమాత్మ యందే నిమగ్నమై యుండువాడు పరమాత్మనే పొందుతాడు.

యజ్ఞం పేరిట కొందరు ఇంద్రియాలను నిగ్రహాగ్నిలోను– మరికొందరు ఆత్మనిగ్రహ యోగాగ్నిలో ఇంద్రియ కర్మలను, ఇంకను కొందరు ప్రాణవాయువునందు అపాన వాయువునూ దహిస్తున్నారు. ప్రాణ అపానవాయువులను నిరోధిస్తున్నా రింకొందరు. ఆహార నియంత్రణ ద్వారా ప్రాణాలను ప్రాణులలోనే ఆహుతి చేస్తున్నారు మరికొందరు. తపోయజ్ఞం చేస్తున్నారింకొందరు. వీళ్ళంతా తాము చేస్తున్నది యజ్ఞమనే భావిస్తున్నారు. కానీ, అవి యజ్ఞాలు కావు, వేదోక్త కర్మలు! ఆత్మజ్ఞాన జనితాలు కావవి! ప్రపంచ కళ్యాణానికి తోడ్పడు నిష్కామకర్మ నిర్వహణయే అసలైన యజ్ఞం. అలా లోకకళ్యాణానికి తోడ్పడని వాడి లోకాన ఉండటానికే అనర్హుడు. అట్టి వ్యర్థజీవికిక పరలోక ప్రాప్తి గూడానా ? వేదోక్త ద్రవ్య యజ్ఞంకన్నా ఆత్మైక స్పృహతో చేయు నిష్కామ విధినిర్వహణయే సర్వశ్రేయోదాయకం. కాబట్టి, అట్టి ఆత్మజ్ఞానార్జనార్థం శుశ్రూష చేసి మరీ జ్ఞానులచే ఉపదేశింపబడాలి. అగ్నికట్టెల్ని దహింపచేసినట్లు, ఆత్మజ్ఞానాన్ని కర్మఫలాలపట్ల ఆసక్తిని దహించేస్తుంది. అందుకే ఆత్మ జ్ఞానాన్ని మించిన

పవిత్ర వస్తువు ప్రపంచంలో మరొకటి లేదు. కర్మయోగం ద్వారా సిద్ధిని పొందిన వాడు మాత్రం ఎవరి బోధనతో పనిలేకుండానే కాలక్రమాన స్వయంగానే ఆత్మజ్ఞానాన్ని పొంద గల్గుతాడు. నిశ్చల శ్రద్ధాభక్తులు గలవానికి, జితేంద్రియునకూ శీఘ్రంగా ఆత్మజ్ఞాన సిద్ధి కలుగుతుంది. తద్వారా అతనికి పరమశాంతి / ముక్తి కలుగుతుంది. ఆత్మజ్ఞానం పట్ల శ్రద్ధాశక్తులు లేనివాళ్ళు, సంశయాత్ములూ నశిస్తారు. ఆత్మజ్ఞానం చేత సంశయ రహితుడై ఆత్మయందు సుస్థిరుడైన వాడు కర్మలచే బంధితుడు కాడు. కాబట్టి, అర్జునా! స్వపర పాప, పుణ్యాది నీ సంశయాలన్నింటినీ ఆత్మజ్ఞాన ఖడ్గంతో ఛేదించి నిష్కామ కర్మయోగాన్నాశ్రయించు అంటూ అతన్ని ధర్మపోరాట విధి నిర్వహణకు ప్రోత్సహించాడు శ్రీకృష్ణుడు.

5. కర్మ సన్యాస యోగం

అగస్త్య : సన్యసింపకుండానే సన్యాసి కావడమెలా సాధ్యం తాతగారూ?

వ్యాఖ్యాత : అటువంటి సన్యాసాన్ని పొందట మెలాగో తెలియజేసేదే సన్యాసయోగం. (రాగ ద్వేషాలను జయించగల్గినవాడు సన్న్యసింపకున్నా సన్యాసియే. ఎలాగంటే? రాగద్వేషాది ద్వంద్వాతీతుడు ఈశ్వరార్పితంగా తన విధిని నిర్దుష్టంగా నెరవేర్చగల్గుతాడు! కావున అతడు కర్మబంధవిముక్తుడే (సన్యాసియే). అందుకే నీవూ రాగద్వేషాల కతీతుడవై ఈశ్వరార్పితంగా నీ ధర్మపోరాట విధిని నిర్వహించు. సన్న్యసించిన జ్ఞానిలా నీవూ కర్మబంధ విముక్తుడివౌతా వర్జునా! అంటూ దిశానిర్దేశం చేశాడు శ్రీకృష్ణభగవానుడు).

శ్రీకృష్ణా! రెంటినీ ప్రశంసిస్తున్నావు! అసలు కర్మ సన్యాసమా? కర్మాచరణయా? ఏది శ్రేయస్కరమో తేల్చి చెప్పమన్నాడర్జునుడు. ఈ రెండూ మోక్ష సాధనాలే. ఐతే రాగద్వేషరహితుడు సన్న్యసింపకుండానే సన్యాసియౌతున్నాడు. ఎందుకంటే, రాగద్వేషాలు లేనివాడు సన్యాసి వలెనే కర్మబంధ విముక్తుడౌతున్నాడు. మరియు జ్ఞాన నిష్ఠగల్గిన సన్యాసి, కర్మనిష్ఠ

గల్గిన కర్మయోగీ, ఇరువురూ చేరే గమ్యమొక్కటే. కానీ, యీరెంటిలోనూ కర్మాచరణయే ఎక్కువ శ్రేయస్కరం. ఎందుకంటే, కర్మానుష్ఠానం లేకుండా కర్మసన్యాసం కష్టసాధ్యం. నిష్కామకర్మ ద్వారా నిర్మల మనస్కుడై దేహేంద్రియాలను నిగ్రహించుకోగల్గుతాడు. తనతో సహజీవులన్నింటిలోని ఆత్మ ఒక్కటేనన్న జ్ఞానాన్నీ పొందగల్గుతాడు. అలా ఆత్మైక్యానుభూతిని పొందగల్గిన కర్మయోగి, ఆత్మయందే సుస్థిరుడై తింటూ, వింటూ, చూస్తూ, నడుస్తూ మొ॥ పనులు చేస్తూ గూడ ఇందు నా ప్రమేయమేమీ లేదు ఇంద్రియాలు వాటి విధులనవి చేసుకుంటున్నవని భావిస్తూ, కోర్కెల్ని, రాగద్వేషాలనూ త్యజించి ఈశ్వరార్పితంగాను, కర్తృత్వాభిమాన రహితంగానూ కర్మలు చేస్తుంటాడు. కాబట్టి, అతడు కర్మబంధ విముక్తుడే (సన్యాసియే) అర్జునా! ఈ కర్తృత్వాభిమానాన్ని కర్మలను, కర్మఫలాలను పరమాత్మ సృజించలేదు. ప్రకృతి వలన కలిగిన అవిద్యేవాటిని రూపొందించుకున్నది. ఇట్టి అవిద్య (అజ్ఞానం) చేతనే జ్ఞానులు మూఢులౌతున్నారు. అందుకే పరమేశ్వరుడెవరి పాపపుణ్యాలకూ బాధ్యుడు కాడు. ఐతే ఆత్మైక్యజ్ఞానం చేత అవిద్యను నశింపజేసుకున్న వాని జ్ఞానం సూర్యునిలా పరమాత్మను భాసింపజేస్తుంది. **అలా ఎవరి బుద్ధి ఆత్మతో కలిసి, ఎవరి ఆత్మ పరమాత్మతో సమమై, ఎవరు బ్రహ్మనిష్ఠగల్గి, బ్రహ్మనే గమ్యంగా కలిగి యుంటుందో అతడు మోక్షాన్ని పొందుతాడు.**

ఆత్మజ్ఞానాన్ని పొందినవాడు, ఆత్మయందే సుస్థిరుడై, మూఢరహితునిగ, ప్రియ, అప్రియులకు అతీతునిగా ఉంటాడు. అశాశ్వత, దుఃఖకారక, బాహ్యేంద్రియ సుఖాలపట్ల ఆసక్తి చూపక బ్రహ్మ ధ్యానమగ్నుడై, అక్షయానంద భరితుడౌతాడు. అతడిహలోకంలో మరణానికి ముందే కామక్రోధోద్వేగాలను జయించి, యోగ ప్రతిష్ఠుడై సుఖిస్తాడు. ఇంకా తన లోపాలను సంశయాలనూ నిర్మూలించుకొని, సర్వభూత హితార్థం పాటు పడుతుంటాడు. **అట్టి ఆత్మజ్ఞాని విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుని, ఆవును, ఏనుగును, కుక్కను,**

కుక్కల మాంసభక్షకుణ్ణీ ఒకే ఆత్మగ భావిస్తాడు. అలా ఆత్మైక భావనా సుస్థిరుడు బంధవిముక్తుడౌతాడు. కామక్రోధోద్వేగాలను జయించి, ఆత్మయందే సుఖిస్తూ, క్రీడిస్తూ, ఆత్మజ్ఞాన జ్యోతిని దర్శించగల్గిన యోగప్రతిష్ఠుడు బ్రహ్మస్వరూపుడై మోక్షాన్ని పొందుతాడు!

అన్ని యజ్ఞాలకు, తపస్సులకు మూలంగా, పరమగమ్యంగా, కర్మఫల ప్రదాతగా లోకేశ్వరునిగ, సకల భూత హితునిగ, నన్ను గ్రహించినవారు శాంతిని పొందుతారు. కాబట్టి, అర్జునా! రాగద్వేషాతీతుడవై నీవు నీ (ధర్మపోరాట) కర్తవ్యాన్ని నిర్వహించు. నీకు పాపపుణ్యాలంటవు. సన్యసించిన జ్ఞానిలా నీవు సశరీర (జీవించి యుండగానే) మోక్షాన్నీ, శాంతినీ పొందుతావు అంటూ అర్జునునకు ధర్మపోరాట కర్తవ్యాన్ని నిర్దేశించాడు శ్రీ కృష్ణభగవానుడు.

6. ఆత్మసంయమ యోగం

విద్యాధర్ : కష్టమైన ధ్యానాన్ని పొందట మెలాగో తెలియజేసే ధ్యానయోగాన్ని వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : ఎంతటి కష్టసమయంలోనైనా, ధర్మ సంకట స్థితిలోనైనా దుఃఖితుడై మనిషి బేలపడగూడదు. ఆత్మ సహాయంతో తనను తానే ఉద్ధరించుకోవాలి. స్థిత ప్రజ్ఞుడై నిలవాలి. అదెలాగంటే? మనిషికి మనసే బంధువు, శత్రువుగూడ. ఆత్మకు ఆధీనమై ఆత్మాదేశానుసారం నడుచుకునే మనసు ఇంద్రియాలను జయించగల్గుతుంది. తద్వారా పవిత్రంగా ఉంటూ సదా సన్మార్గాన నడుస్తూ మనిషికి బంధువులా మేలుచేస్తూ అతన్ని గమ్యానికి చేరుస్తుంది. అదే ఆత్మను ధిక్కరించి, ఇంద్రియాలందించే సుఖాలకు బానిసైన మనస్సు, మలినమై సదా అక్రమ మార్గాన పయనిస్తూ మనిషికి శత్రువులా కష్టాలను, దుఃఖాన్ని కలిగించి అతణ్ణి వ్యర్థుని చేస్తుంది. ఐతే ఇంద్రియ సుఖాలనుండి మరల్చి మనసును ఆత్మాధీనం చేయటం కష్టమే, కానీ, ధ్యానం

ద్వారా మనసును ఆత్మాధీనం చేయవచ్చు. అలా చేయగల్గిన మనిషి, ఆత్మైక్యత్వానుభూతిని పొంది ప్రాణులన్నింటిలోనూ, మాన, అవమానాలలోను, పురస్కార, తిరస్కారాలలోను, పరమాత్మనే దర్శించగలుగుతాడు. నిర్మల, ప్రశాంత స్థితిని పొంద గలుగుతాడు. తనకు హితులను, అహితులను, ప్రియులను, అప్రియులనూ రాగ ద్వేషాతీతంగా సమభావంతో చూడగలిగే, తన అసలైన కర్తవ్యాన్ని తనకు తానే నిశ్చయించుకోగల్గిన సమున్నత స్థితికి చేరుకోగల్గుతాడు అంటూ అర్జునుని మిషతో మానవులందరికీ అత్యున్నత మార్గాన్ని నిర్దేశిస్తున్నాడు శ్రీకృష్ణభగవానుడు)

అర్జునా! సన్యాసి అంటే, యజ్ఞ, దాన, తపో, తటాక నిర్మాణాది కర్మలన్నింటినీ త్యజించినవాడు కాదు, నిత్యకర్మలను నిర్దిష్ట కర్తవ్యాలను ఫలాపేక్షరహితంగా నిర్వహించిన వాడే సన్యాసి. అసలు కర్మయోగ మంటేనే సన్యాసం. ఎందుకంటే ? సంకల్పాలను (కోర్కెల్ని) త్యజించిన వాడే గదా కర్మయోగి, యోగ సాధనకు నిష్కామ కర్మాచరణం, యోగాన్ని పొందిన వానికి కర్మత్యాగం మార్గమంటారు. సంకల్పాలు, ఇంద్రియ సుఖాలు, కర్మలందు అనాసక్తుడే యోగారూఢుడు. **ఎట్టి కష్ట సమయంలోనైనా మనిషి ఆత్మసహాయంతో తనను తానుద్ధరించుకోవాలే గాని, తనను తాను బలహీనపరచుకోరాదు. మనిషికి మనసే బంధువు. మనసే శత్రువుగూడ. మనసును ఆత్మాధీనం చేసి దేహేంద్రియాలను జయించగల్గిన వానికి మనసు బంధువై గమ్యానికి చేర్చుతుంది. ఇంద్రియ సుఖాలకు బానిసైన మనసు మనిషికి శత్రువై పతనం చేస్తుంది.**

మనసును, ఆత్మాధీనం చేయగల్గిన జితేంద్రియుడు పవిత్రుడు, ప్రశాంత మనస్కుడై ఆత్మైకత్వ అనుభూతితో, మానావమాన, సుఖదుఃఖాది ద్వంద్వాలలో సదా పరమాత్మనే దర్శిస్తుంటాడు. ఆత్మ సాంగత్యంతో సంతృప్తి మనస్కుడైన ఆత్మజ్ఞాని సృష్టిలోని ప్రతి పదార్థాన్నీ, ప్రతి ప్రాణినీ మట్టి, రాయి, బంగారాలను,

హితాహితులను, మిత్రశత్రువులను, తటస్థుల్ని పుణ్యుల్ని, పాపుల్నీ రాగద్వేషాతీతంగా సమబుద్ధితో చూడగల్గుతాడు. అట్టి ఆత్మజ్ఞానియే యోగయుక్తుడు. అట్టిసమున్నత స్థితికి చేరాలంటే, మనిషి యోగా (ధ్యానా) భ్యాసం చేయాలి. ఎలాగంటే యోగాభిలాషి ఏకాంతంగా పరిశుభ్ర ప్రదేశాన అంతెత్తూ, పల్లం కాకుండా దర్భాసనంపై చర్మాన్ని , దానిపైవస్త్రాన్నీ పరచుకొని దానిపై కూర్చుని మనోబుద్ధుల్ని స్వాధీన పరచుకొని, మనసును ధ్యాననిష్ఠయందే కేంద్రీకరించాలి. శరీరాన్ని, శిరస్సును, కంఠాన్ని సమంగా సుస్థిరంగా నిలిపి దృష్టిని, నాసికాగ్రాన కేంద్రీకరించి ప్రశాంత చిత్తంతో నన్నే లక్ష్యంగా చేసుకుని కూర్చోవాలి. అలా మనసును ఆత్మాధీనం చేసిన యోగి ప్రశాంతిని పొంది పరమాత్మను చేరుతాడు!

అమితంగాను, అతి స్వల్పంగానూ తినేవాడు, నిద్రించేవాడూ సిద్ధిని పొందలేడు. ఆహారవిహారాలు, కర్మాచరణ, ఉద్యమాలు, నిద్రమెలకువలలో పరిమితిని, క్రమశిక్షణను పాటించిన వానికి యోగసిద్ధి కల్గుతుంది. అలా పూర్తిగా నిరోధింపబడిన మనసు సకల కామవర్జితమై ఉంటుంది. అట్టి యోగి సదా ఆత్మయందు సుస్థిరుడై ఉంటాడు. అప్పుడతడు ఇంద్రియాల కతీతంగా ఆత్మానందభరితుడై దుర్భర దుఃఖానికి సైతం చలించడు. అట్టి **దుఃఖనిర్మూలనాస్థితే యోగ (ధ్యాన) స్థితి. కాబట్టి, పట్టుదలతో నీవా యోగస్థితిని సాధించు అర్జునా! ఆత్మాదేశానుసారం దిక్కులన్నింటాగల విషయాలనుండి, ఇంద్రియాలను, వాటి సుఖాల నుండి మనసును, ధ్యానం ద్వారా నిగ్రహించి ఆత్మాధీనం చేయాలి! అప్పుడతడు ఆత్మానుభూతిని పొంది, నిర్మల మనస్కుడై, ప్రాణులన్నింటా పరమాత్మను, పరమాత్మలో ప్రాణుల్నిదర్శిస్తూ, అందరి సుఖదుఃఖాలను తనవిగా భావించే పరమశ్రేష్ఠునిగా ఎదుగుతాడు.**

శ్రీకృష్ణా! నీవిపుడు బోధించినయోగం, మనసు చంచలత కారణంగా స్థిరంగా ఉండదనిపిస్తున్నది. మనసును నిగ్రహించుట కష్టం గదా!

అన్నాడర్జునుడు. అది కష్టమే గాని యోగాభ్యాసం ద్వారా నిగ్రహించి మనసును ఆత్మకు ఆధీనం చేయవచ్చునని చెప్పాడు శ్రీకృష్ణుడు. ధ్యానం పట్ల శ్రద్ధాశక్తులున్నా, మనసును నిగ్రహించలేక యోగం మధ్యలో భ్రష్టుడైన వానికే గతిపడుతుంది కృష్ణా? అట్టి యోగంలో విఫలుడైనప్పటికీ, అతనికి ఇహపరాలలో వినాశనముండదు. ఎందుకంటే, ప్రపంచ కళ్యాణార్థం శుభకార్యాలు చేసే వానికెన్నటికీ దుర్గతి పట్టదు. **యోగ విఫలుడైనవాడు కూడ పుణ్యాత్ములు పొందేలోకాన్నే పొంది, అచట చిరకాలం జీవించాక, తిరిగి పవిత్రులైన శ్రీమంతుల యింట, లేక ప్రాజ్ఞులైన యోగుల యింట జన్మిస్తాడు. ఇహలోకంలో అలాంటి అత్యుత్తమ జన్మ మిక్కిలి దుర్లభం.** అలా జన్మించిన వ్యక్తి గత జన్మలోనిబుద్ధి సంస్కారంతో సిద్ధత్వం పొందటానికి మరింత శక్తిమంతంగా శ్రమిస్తుంటాడు. గత జన్మయొక్క అభ్యాసఫలం అతన్ని శక్తిమంతంగా పురోగమింపజేస్తుంది. ఆకారణంగా అతను యోగాభ్యాసకుల్ని, వేదనిర్దిష్ట కర్మాచరణ పరాయణులను సైతం అధిగమించి దూసుకెళ్తాడు. పవిత్ర శీలయుతుడై సంపూర్ణంగా శ్రమించే యోగి పాపవిమోచనచే మరింత పవిత్రుడై, జన్మజన్మకూ క్రమక్రమంగా సంసిద్ధిని పొందుతూ పరమ గమ్యాన్ని చేరుకుంటాడు. కాబట్టి, అర్జునా! నీవునూ అట్టి యోగివై, నీ అంతరాత్మను నా(పరమాత్మ)పై నిలిపి, శ్రద్ధతో నన్ను భజించు. అప్పుడు నిన్ను యోగి శ్రేష్ఠునిగ రూపొందిస్తాను అంటూ అర్జునునకు ధ్యానయోగ బోధచేశాడు శ్రీకృష్ణభగవానుడు.

7. విజ్ఞాన యోగం

తరణ్ : జ్ఞానిని నన్ను (దైవం) గానేభావిస్తానంటున్నాడు శ్రీకృష్ణుడు ఎందుకని తాతగారూ?

వ్యాఖ్యాత : (వేలవేలాదిమందిలో జ్ఞానార్థియొక్కడే. అరుదైన అట్టి జ్ఞానార్థులలోను ఏ ఒక్కడో అదీ పెక్కుజన్మల అనంతరం నన్ను యథార్థంగా,

(జగమంతా పరమాత్మగ) గ్రహించగల్గుతాడు. అరుదైన అట్టి మహనీయ జ్ఞానిని నన్ను (పరమాత్మ)గనే భావిస్తాను. ఎందుకంటే ? నేనే అతని పరమలక్ష్యం అంటే నాలాగే అతని లక్ష్యంగూడ దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపన, ప్రపంచ కళ్యాణమే ! అందుకే నాకతను ప్రియుడు. నేనతనికి ప్రియుడను. అరుదైన జ్ఞానార్థులు అనేక జన్మల కృషిఫలితంగా పొందగలిగిన పరమ (ఆత్మ) జ్ఞానాన్నివిజ్ఞానంతో సహా బోధిస్తున్నానంటున్నాడు. శ్రీకృష్ణభగవానుడు అదే ఈ అధ్యాయం). అర్జునా! పరమాత్మ యందే మనసు నిల్పి నన్నాశ్రయించి, యోగాభ్యాసం చేస్తే నాసంపూర్ణ స్వభావాన్ని తెలుసుకోగలవు. దేన్ని తెలుసుకుంటే, ఇక తెలుసుకోవలసిందేమీ ఉండదో అట్టి పరమజ్ఞానాన్ని బోధిస్తావిను. వేల వేలాదిమందిలో యే ఒక్కడో జ్ఞానార్థి. అరుదైన యట్టి జ్ఞానార్థులలో సైతం పలుజన్మల కృషిఫలితంగా ఏ ఒక్కడో నన్ను యథార్థంగా అందరిలో వసించే పరమాత్మగ తెలుసుకోగల్గుతాడు.

నా (చేత సృజింపబడిన) జీవ ప్రకృతి భూమి,ఆకాశం, వాయువు, అగ్ని, జలం, మనసు, బుద్ధి, అహంకారాలతో కూడియున్నది. ఇది అపరాప్రకృతి! దీనికి వేరుగ జీవ, నిర్జీవ జగత్తంతా ధరింపబడి యున్న విశ్వచైతన్య రూపము నాది. నాయొక్క అపరాప్రకృతి మరియు పరమచైతన్యం వీటిచేతనే సకల చరాచర ప్రాణులు ఉద్భవించినాయి. **ఈ విశ్వోత్పత్తి, వినాశాలకు మూలం నేనే. నా కన్నా అన్యమైనది, ఉన్నతమైనది, మరేవీలేవు. దారమందు మణులవలె, ఈ విశ్వమంతా నాయందు గుచ్చబడి ఉన్నది.** నీటిలో రసాన్నీ, సూర్యచంద్రుల్లో కాంతిని, వేదాల్లో ఓంకారాన్నీ, ఆకాశంలో శబ్దాన్నీ, నరుల్లో పౌరుషాన్నీ, భూమియందలి సుగంధాన్నీ, అగ్నిలో తేజస్సునూ, జీవుల్లో జీవాన్నీ, తాపసులతపస్సును, ప్రాణులకు బీజాన్నీ, ప్రాణుల ధర్మబద్ధకామాన్ని నేనే. సత్వరజస్తమో గుణాలసృష్టికర్తనూ నేనే. వాటిలో నేనేలేను. నాలో అవి ఉన్నాయి. (ఉదా॥ మనిషి సృజించిన భాషల అక్షరాలలో మనిషి ఉండడు. కానీ, అవి మనిషిలో ఉంటాయి కదా అలా).

మానవులలో వేర్వేరు కార్యక్రమాభిలాషను రగిలించేందుకై నేను నిక్షిప్తం చేసిన గుణత్రయమిది. ఆ కారణంగానే సమాజంలో తమ అవసరాలు తీర్చుకుంటూ మనగల్గుతున్నారు మానవులు. ఈ వాస్తవాన్ని గ్రహించలేక తమ తమ పనులకు తామే కర్తల మన్న అజ్ఞానానికి లోనై, వాటికి మూల కర్తనైన నన్ను గుర్తించలేక పోతున్నారు. దుష్టులు, మూఢులు, అధములు మాత్రం వివేకహీనులై త్రిగుణాలమాయకు లోనై అసత్య, అధర్మ, అకృత్యాలను, క్రౌర్యాన్నీ ఆశ్రయిస్తున్నారు.

నన్నాశ్రయిస్తూ భజిస్తున్న ఆర్తులు, జ్ఞానార్థులు, భోగార్థులు, జ్ఞానులూ యీ నల్గురూ గొప్పవారే. కానీ, నా (ఆత్మ) యందే సుస్థిరుడై నాకనన్య భక్తుడైన జ్ఞానియే శ్రేష్ఠుడు. అట్టి పరమజ్ఞానిని నన్నుగానే భావిస్తాను. ఎందుకంటే, నేనే అతని లక్ష్యంగూడ. జన్మజన్మల సాధన ద్వారా (విశ్వం) అంతా పరమాత్మయేనన్న సత్యానుభూతిని పొంది, నన్నాశ్రయిస్తాడు. అట్టి మహితాత్ముడు చాలాచాలా అరుదు. ఇక తదితరులు మాత్రంకోర్కెల చేత వివేకహీనులై తమతమ స్వభావానుగుణ కర్మల నాచరిస్తూ, ఆయాదేవతల నాశ్రయిస్తుంటారు. వారికాదేవతలందే శ్రద్ధను కలిగించి వారిద్వారానే వారి కోర్కెలు నెరవేరేలా చేస్తుంటాను. కానీ, వాస్తవ ఫలదాతను నేనే. ఇట్టి సర్వాతీత నాపరమ స్వరూప, స్వభావాలను గ్రహించలేక, అవ్యక్తుడనైన నన్ను వ్యక్త స్వరూపునిగ భావిస్తున్నారు. నేనగుపించను గనుక నిత్యుడనైన నన్ను తెలుసుకోలేకపోతున్నారు. ఈలోకంలో ఉండిపోయిన, ఉంటున్న, ఉండబోతున్న ప్రాణులన్నింటినీ నేనెరుగుదును. కానీ, నన్నెవరూ ఎరుగరు. మనుషులు రాగద్వేషజనితాలైన సుఖ దుఃఖాది ద్వంద్వాలకు ప్రభావితులై భ్రాంతికి లోనౌతున్నారు.

సత్కర్మల ద్వారా పాపవిముక్తులైనవారు భ్రాంతికి లోనుగాక దృఢవ్రతులై నన్నుసేవిస్తూ నా శరణు జొచ్చినవారు, అధిభూత, అధియజ్ఞ సహితంగా నన్ను తెలుసుకుంటారు. అట్లు తెలుసుకోగల్గిన వారు, అవసానదశలో సైతం

నన్ను గుర్తుంచుకుంటారు. కాబట్టి, అర్జునా! ఇట్టి పరమ(ఆత్మ) జ్ఞానం ద్వారా నన్నే లక్ష్యంగా, నాలక్ష్యమే తన లక్ష్యంగా భావించుకొని లోకకళ్యాణార్థం నీవీధర్మ పోరాటాన్ని కుపక్రమించుమని ఇలా అన్యాపదేశంగా అర్జునునకు, తద్వారా సమస్త మానవాళికి ప్రబోధించాడు శ్రీకృష్ణభగవానుడు!

8. అక్షర బ్రహ్మయోగం

వశిష్ఠ : అక్షర బ్రహ్మమంటే ఏంటి? ఈ యోగాన్ని గూర్చి వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : (అవినాశ బ్రహ్మ / పరమాత్మను పొందే ఉపాయాన్ని తెలుపుతుందీ అక్షర బ్రహ్మయోగం. మనిషి దేహంలో అంతర్యామిగా జీవరూపంలో నివసిస్తూ దేహాధిపతిగా ధర్మాధర్మాలను సూచిస్తూ సదా మనిషిని ధర్మమార్గాన నడిపేందుకు యత్నిస్తున్న పరమాత్మయొక్క అంశ (ప్రతినిధి / ప్రత్యగాత్మయే) ఆధ్యాత్మ. కాబట్టి, అర్జునా! సదా నీ మనోబుద్ధుల్ని నా (పరమాత్మ) మీద కేంద్రీకరించి, నీలోని ఆధ్యాత్మ నిర్దేశిస్తున్నట్లు లోకకళ్యాణం కోసం, నీవీ ధర్మయుద్ధం చేయి. తప్పక నన్ను చేరుకుంటావంటూ అర్జునుని మిషతో ప్రతిమనిషినీ తన గీతోపదేశం ద్వారా ధర్మపోరాటానికి ప్రోత్సహిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు).

శ్రీకృష్ణా! బ్రహ్మ యెవరు? ఆధ్యాత్మ యెవరు? ఏదికర్మ? ఆదిభూతం ఎవరు? అధి దైవం ఎవరు? అధియజ్ఞం ఎవరు? అతడు దేహంలో ఎలా నిలిచియుంటాడు? ఆత్మనిగ్రహులు, అవసాన దశలోనూ నిన్నెలా గ్రహించగలరు? అని ప్రశ్నించాడర్జునుడు.

అర్జునా! వినాశరహిత తత్వమే పరబ్రహ్మ (పరమాత్మ), దేహంలో జీవరూపాన ఉంటూ దేహాధిపతిగా ధర్మాధర్మాలను నిర్దేశిస్తూ పరమాత్మ ఆశయానుగుణంగా మనిషిని ధర్మ మార్గాన నడిపేందుకు యత్నించే

పరమాత్మ ప్రతినిధి (ప్రత్యగాత్మ) యే ఆధ్యాత్మ. ప్రాణుల సృష్టి, స్థితుల కవసరమైన, దేహాంతర్గత జీర్ణ, శ్వాస, రక్తప్రసరణ, విసర్జన, సృష్టికారకాది క్రియలు, మరియు బాహ్యకర్మావయవాల, జ్ఞానేంద్రియాలక్రియ(యజ్ఞా) లే కర్మలు. దేహం యొక్క బాహ్య, అంతర అధియజ్ఞం – వినాశ స్వభావంగల సజీవ నిర్జీవ పదార్థమంతా అధిభూతం. సూర్యచంద్రాది ప్రకృతి దేవతల కధిపతియైన విరాట్పురుషుడే అధిదైవం. పరమాత్మ యొక్క అంశయే, దేహంలో అంతర్యామిగ, జీవాత్మ (అంతరాత్మ)గ, దేహాధిపతిగ నిల్చి ఉంటుంది. నిరంతరమూ తన మనోబుద్ధుల్ని నా యందే నిల్పి ఉంచగల్గిన ఆత్మనిగ్రహులు, మరణ సమయాన సైతం నన్నే స్మరిస్తూ నన్ను చేరుకుంటారు. **ఔను, మనిషి ఏ ఆశయం(లక్ష్యం)తో జీవిస్తుంటాడో, మరణసమయాన గూడ దాన్నే స్మరిస్తాడు. దేన్ని స్మరిస్తూ మరణిస్తాడో, తిరిగి అదే భావం(లక్ష్యం) తో పునర్జన్మిస్తాడు. ఐతే మరణసమయాన పరమాత్మను స్మరించినవాడు పరమాత్మనే చేరుకుంటాడు.** కాబట్టి, అర్జునా! సదా నీవు నన్ను స్మరిస్తూ, నా లక్ష్యమే నీ లక్ష్యంగా నీవీ ధర్మపోరాటం చేయి. తప్పక నన్నే చేరుకుంటావు. యోగంలో సుస్థిరుడై జ్యోతిర్మయుడైన అధిదైవాన్ని స్మరించు. యోగి సర్వాధార, సర్వజ్ఞ, అనూహ్య స్వరూప, స్వయం ప్రకాశకుడైన, అణువులో పరమాణువుగా ఉన్న పరమాత్మనే చేరుకుంటాడు. వేదవిదులు అవినాశియని దేని నంటారో, ముక్త సంగులు దేన్ని పొందుతారో, అట్టి బ్రహ్మపదాన్నిగూర్చి నీకు క్లుప్తంగా వివరిస్తాను విను అర్జునా!

ఇంద్రియ ద్వారాల నరికట్టి, మనసును హృదయమందు, ప్రాణాన్ని శిరస్సునందు నిలిపి, యోగారూఢుడై, ఓంకారోచ్చారణతో నన్ను స్మరిస్తూ దేహాన్ని వీడిన వాడు పరమపదాన్ని పొందుతాడు. అనన్యచిత్తంతో నన్ను స్మరిస్తూ యోగారూఢుడైన వానికి నేను సులభుడను. బ్రహ్మలోకంతో సహాలోకాలన్నీ పునర్జన్మయుతాలే. కానీ నన్ను (పరమ పదాన్ని) చేరిన వానికిక మరుజన్మలేదు. బ్రహ్మకు వేయి యుగాలు పగలు, వేయి యుగాలు

రాత్రి. ఈ విశ్వమంతా సదరు పగటివేళ వ్యక్తమౌతూ, రాత్రివేళ అవ్యక్తమౌతుంటుది. ఈ వాస్తవం తెలిసినవాడే రాత్రింబవళ్ళు వాస్తవం తెలిసినవాడు. **వ్యక్తం కన్నా అతీతమూ, అక్షరమూ ఐనట్టి పరమగమ్యమే నా పరంధామం. దాన్ని చేరిన వాని కిక పునర్జన్మ లేదు.** ప్రాణులన్నింటికీ నిలయుడు. అంతటా వ్యాపించి యున్నవాడు పరమాత్మ. దేవయాన, పితృయాన, మార్గాలను గూర్చి చెబుతా విను. **అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణపు ఆరునెలల కాలమూ దేవయానం. ఇది పరబ్రహ్మను చేరేమార్గం. ధూమం, చీకటి, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనపు ఆరునెలల కాలమూ పితృయానం. ఇది చంద్రకాంతిని పొంది తిరిగి జన్మించే మార్గం.** ఈ రెండు మార్గాను తెలుసుకున్న యోగులు, జ్ఞానులూ, వేదాధ్యయన, యజ్ఞ, తపో, దానాదులు చేయు పుణ్యాత్ములనధిగమించి దేవయాన మార్గాన పయనించి బ్రహ్మను చేరుకుంటారు. కాబట్టి, అర్జునా! యోగసుస్థిరుడవై నన్ను స్మరిస్తూ, నా ఆశయం(లోక కళ్యాణం) కోసం నీవీ ధర్మపోరాటం చేసి నన్ను (పరమపదాన్ని) చేరుకొందువు గాకని అర్జునుని సందేహాలను తీర్చి అతనికీ, మానవాళికీ సరైన దిశానిర్దేశం చేశాడు శ్రీకృష్ణభగవానుడు.

9. రాజ విద్యా, రాజ గుహ్య యోగం

జయరామ్ : రాజ విద్యా, రాజ గుహ్య మంటే ఏమిటో చెప్పి, ఆ యోగాన్ని వివరించండి తాతగారూ?

వ్యాఖ్యాత : (రహస్యాలలో రాజు, విద్యలలో రాజైన బ్రహ్మ రహస్యాన్ని, బ్రహ్మవిద్యను పొందట మెలాగో తెలుపుతుందీ రాజవిద్యారాజగుహ్య యోగమనే అధ్యాయం. సత్వరజోమోగుణాలతో స్వార్థవాంఛలు, మూఢ సంకల్పాలతో అనర్థదాయకమైన అధర్మకర్మలకు పాల్పడుతూ విశ్వాత్మ (దైవ) ద్రోహులు, వ్యర్థజీవులై పోతున్నారు అజ్ఞానులు. కానీ, జ్ఞానులు మాత్రం

సాత్వికగుణం, ఆత్మైక్యతా భావనతో ప్రాణులు, పదార్థాలన్నీ పరమాత్మగ నా ఆశయమే తమ ఆశయంగా అనుభూతి చెందుతూ సదా లోకకళ్యాణం కోసం పాటుపడుతున్నారు. అట్టి నా అనన్య భక్తుల యోగ క్షేమాలను నేనే చూచుకుంటానని భరోసా ఇస్తున్నాడు. మరియు స్వార్థ మూర్ఖత్వాలకు ప్రతీకలైన రజో, తమోగుణాల నతిక్రమించి సాత్విక గుణాన్ని పెంపొందించుకుంటూ లోక కళ్యాణార్థం ధర్మపోరాటం చేయవలసిందిగా అర్జునుని, మనల్నికూడ నిర్దేశిస్తున్నది శ్రీమద్భగవద్గీత. దీని వివరణయే ఈ అధ్యాయం).

అర్జునా! నన్ను దురాక్షేపించని నీకిపుడు గోప్యమైన విజ్ఞాన సహిత జ్ఞానాన్ని తెలియజేస్తాను. దీన్ని తెలుసుకుంటే జీవిత క్లేశాల నుండి విముక్తుడవౌతావు. విద్యలలో శ్రేష్ఠము, రహస్యాలలో నిగూఢమూ, శుద్ధికరాలలో అత్యుత్తమమూ, చూడటానికి వీలైనదీ, సాధనకుసులువైనదీ, ధర్మయుక్తమూ, తరగని ఫలదాయకమైన బ్రహ్మజ్ఞానమిది. దీని పట్ల శ్రద్ధాహీనులు పరమ పదాన్ని చేరలేక పునర్జన్మ బాటపడతారు. అవ్యక్తుడనైన నాతో విశ్వం పరివ్యాప్తమై ఉంది. సదా అంతటా సంచరిస్తూనే ఆకాశానికంటకుండా, ఆకాశంలోనే నిల్చియుండే వాయువులా ప్రాణులన్నీ నాలోనిల్చి ఉన్నాయి. కల్పాంతాన ప్రాణులన్నీ ప్రకృతిలోకెళ్ళిపోతాయి. కల్పాదిన సదరు ప్రాణులన్నింటినీ తిరిగి సృజిస్తాన్నేను. ఐనా అనాసక్తుడనైన నన్నీ కర్మలంటవు. నా అధ్యక్షతన చరాచర ప్రాణులన్నింటినీ సృష్టిస్తున్నది ప్రకృతి. అలా ప్రాణులన్నింటికీ మహేశ్వరుడైన నా పరతత్వాన్ని గ్రహించలేక, మనుష్యరూపాన ఉన్న నన్ను, అలక్ష్యభావంతో చూస్తుంటారు మూఢులు.

అజ్ఞానులు రజో, తమోగుణాలతోస్వార్థవాంఛలు, మూఢసంకల్పాలతో, అనర్థదాయక కర్మలుచేస్తూ విశ్వాత్మ ద్రోహులూ, వ్యర్థజీవులై పోతున్నారు. జ్ఞానులు మాత్రం సాత్విక గుణంతో సమతాభావంతో, ప్రపంచం, పదార్థాలు, ప్రాణులన్నీ పరమాత్మయే(నేనే)నని, నా ఆశయమే తమ ఆశయంగా

అనుభూతి చెందుతూ అన్నింటి, అందరి (లోక) ప్రగతి, క్షేమం, సుఖ, శాంతుల కోసం పాటుపడుతుంటారు. **అట్టి నా అనన్యభక్తులు యోగ క్షేమాలను నేనే చూచుకుంటాను. అట్టి భక్తులర్పించే ఫలం, పత్రం, జలాన్నైనా ప్రీతితో స్వీకరిస్తాను.**

అర్జునా! నీవునూ నీ పనులను, భోజ్యాలను, దానాదులను, తపస్సులనూ అనన్యభక్తితో నా కర్పించు. అప్పుడు నీవు జీవించి యుండగనే పాపవిముక్తుడవై మరణానంతరం నన్నే చేరుకుంటావు. సకల ప్రాణి సముడను, ద్వేషులు, ప్రియులూ లేని వాడను నేను కానీ, నాయొక్క అనన్యభక్తుల యందు నేను, నాలోవారూ సదా ఉంటాము. ఘోరపాపియైనా సరే, ప్రపంచ కళ్యాణానికి పాటుపడువాడు సాధువే! అలా నా (లోకం) కోసం పాటు పడు నా భక్తులకు నాశనం లేదని నిశ్చయంగా తెలియజేయి. అర్జునా! పాపులు, వ్యవసాయాదుల్లో మునిగితేలే వైశ్యులు, పని పాటలలో మునిగి అధ్యయన దూరులైన స్త్రీలు, శూద్రులు సైతం నన్ను (నా వ్యక్తరూపాన్ని) అంటే ప్రాణులను సేవిస్తూ విముక్తు లౌతున్నారంటే, ఇక పుణ్యాత్ములు, బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులు, పూర్ణభక్తులైన రాజర్షుల గూర్చి ప్రత్యేకంగా చెప్పాలా? కాబట్టి, అర్జునా! నీలో నన్ను నిల్పుకొని అనన్యభక్తునివై, నా(లోక) కళ్యాణంకోసం యజ్ఞం (ధర్మయుద్ధ) చేయి. పరమ గమ్యమైన నన్ను (పరమాత్మను) చేరుకుంటావంటూ అర్జునునితోపాటు మనకూ ప్రపంచ కళ్యాణంకోసం పాటుపడుతూ పరమాత్మ (తన) ను చేరుకోమని ప్రబోధిస్తున్నాడు శ్రీకృష్ణభగవానుడు!

10. విభూతి యోగం

హిమాంశ్ : విభూతి యోగం దేన్ని గూర్చి తెలియజేస్తుంది తాతగారూ?

వ్యాఖ్యాత : (ఈ విశ్వంలో అన్నీ భగవంతుని (పరమాత్మ) అంశతో జన్మించినవే. ఐతే వాటిలోని మహనీయ, సంపద్యుక్త, శక్తి సమేతాలు మాత్రం,

పరమాత్మ అంశతో పాటూ ఆయన తేజస్సు గూడ జతగూడి ఉద్భవించాయని తెలుసుకోమంటున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ. పరమాత్మయొక్క అట్టి విభూతి రూపాలను తెలియజేసేదే ఈ విభూతియోగం).

అర్జునా! మిక్కిలి ప్రీతితో నా మాటలు వింటున్న నీ మేలు గోరి మరోసారి నా పరమ వచనాలను ప్రబోధిస్తావిను. దేవతలు, మహర్షులు సైతం నా పుట్టుక నెరుగరు. ఎందుకంటే, వారి జన్మకూ మూలం నేనేగదా. ఆదీ, అంతం లేని జన్మరహితునిగా నన్నెరిగిన వాడు అజ్ఞానం తొలిగినవాడే. జీవుల బుద్ధి, జ్ఞానం, సహనం, సత్యం, కీర్తి, అపకీర్తి వంటి భావాలన్నీ నానుండే పుట్టినాయి. నా మానస పుత్రులైన సప్తఋషులు, ప్రాచీన మనువులు నల్గురూ నాతో సమప్రభావులు. ఈ ప్రాణులన్నీ వారి సంతతే. నా వివిధ వ్యక్తరూపాలను, యోగశక్తినీ యథార్థంగా గ్రహించగల్గినవాడు సమాధియందు సుస్థిరుడౌతాడు. **విశ్వమంతటికీ ఉత్పత్తి స్థానం నేనేనని గ్రహించి జ్ఞానులు ఇంద్రియాలను నాలో లీనం చేసి, చిత్తం నామీదేనిల్పి, ప్రేమతో భజిస్తూ, నా గురించే పరస్పరం బోధించుకుంటూ ఆనంది స్తుంటారు. అట్టి భక్తులకు బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాను. తద్వారా వారు నన్ను చేరుకుంటారు.** వారిమీది దయతో నేను వారి బుద్ధిలో నిలిచి, వారి యజ్ఞాన్ని తొలగించి సత్యపు వెలుగునిచ్చే వివేకదీపాన్ని వెలిగిస్తున్నాను అన్నాడు శ్రీకృష్ణుడు.

హే శ్రీకృష్ణా! పరమపావన పరబ్రహ్మవు, పరమపదానివి నీవే. నారద, అసిత, దేవల వ్యాసాది ఋషులంతా నిన్ను జన్మరహిత దివ్య స్వరూపునిగ, సర్వవ్యాప్తిగ కీర్తిస్తున్నారు. నీవునూ అదే చెబుతున్నావు. ఇది యథార్థమని నేను నమ్ముతున్నాను. నీకు నీవే తప్ప దేవదానవు లెవరూ తెలుసుకోలేని నీతత్వాన్ని తెలుసుకునేందుకై నిన్నెలా భజించాలి? వేటి యందు నిన్ను ధ్యానించాలి? నీయోగశక్తినీ, వ్యక్తస్వరూపాలను, భావాలను గూర్చి మరోసారి

వినగోరుతున్నాను. ఎందుకంటే? 'ఎంత గ్రోలినా తనివితీరనిది కృష్ణా! నీవాగమృతం' అన్నాడర్జునుడు.

అర్జునా! నా దివ్యానుభూతులు అనంతాలు, కాబట్టి, వాటిలో ప్రధానమైన కొన్నింటిని వివరిస్తావిను. ప్రాణులన్నింటా నిల్చియుండు ప్రత్యగాత్మను నేను. ప్రాణుల ఉత్పత్తి, ఉనికీ, అంతమూ నేనే. ఆదిత్యులలో సూర్యుడను, చుక్కల్లో చంద్రుడను, వేదాలలో సామవేదాన్ని, సామాలలో బృహత్సామాన్ని, దేవతల్లో ఇంద్రుడను, రుద్రుల్లో శంకరుడను, యక్షుల్లో కుబేరుణ్ణి, పురోహితుల్లో బృహస్పతినీ, సేనానుల్లో కుమారస్వామిని, ఆయుధ దారుల్లో శ్రీరాముడను, నదుల్లో గంగానదిని, నీటి నిలయాలలో సముద్రుడను, మాటలలో ఓంకారాన్ని , ఏనుగుల్లో ఐరావతాన్ని, ధేనువుల్లో కామధేనువును, సర్పాలలో వాసుకిని, శాసకుల్లో యముణ్ణి, దైత్యుల్లో ప్రహ్లాదుడను, పక్షుల్లో గరుత్మంతుణ్ణీ, మృగాల్లో సింహాన్నీ, మృత్యువునూ, అమృతత్వాన్నీ, అభ్యుదయాన్నీ, వృష్ణివంశీయులలో వాసుదేవుణ్ణీ, పాండవుల్లో అర్జునుణ్ణీ, నేరస్థులకు రాజదండాన్నీ, జయశీలురకు నీతినీ, జ్ఞానుల్లోని జ్ఞానాన్ని, రహస్యాలలో మౌనాన్నీ, ప్రాణులకు బీజాన్ని, ఆధారాన్నీ ఇలా మహిత, సంపద్యుక్త శక్తి సమేతాలన్నీ నా యొక్క అంశ, తేజస్సులతో భావిస్తున్నవేనని గ్రహించు. ఇట్టి వైవిధ్య విశ్వమంతా నాలో ఒక భాగం చేత మాత్రమే ధరించి నిండియున్నానని గ్రహించు అర్జునా! అన్నాడు శ్రీకృష్ణుడు.

11. విశ్వరూప సందర్శన యోగం

ఆరాధ్య : పరమాత్మ యొక్క విశ్వరూపాన్ని మీ అధ్యాపనా అద్దంలో మాకు స్పష్టంగా చూపించగలరా, తాతగారూ?

వ్యాఖ్యాత : తప్పక ఆరాధ్యా! శ్రీకృష్ణ పరమాత్మ తన విశ్వరూప ప్రదర్శనలో భాగంగా, తన సృష్టి, స్థితి, లయ విధానాన్ని గూడ అర్జునునకు అంతర్లీనంగా

ప్రబోధించాడు. మీ అవగాహనకోసం దీనిని క్లుప్తంగా వివరిస్తున్నాను వినండి. తన సృష్టిని ప్రగతి మార్గాన పయనింపజేసేందుకు, ప్రాణులు, పదార్థాలన్నింటా నిరంతర పరిణామతత్వాన్ని నిక్షిప్తం చేయడమేగాక, ఈ సృష్టి , స్థితి, లయ విధానాన్ని గూడ రూపొందించుకున్నాడు పరమాత్మ. వారి వారి ప్రవర్తనను వారిని వినియోగించదలచిన తన ప్రణాళికనూ దృష్టిలో ఉంచుకొని ప్రతి ప్రాణికీ, మనిషికీ నిర్దిష్టకాల పరిమితిని నిర్ణయిస్తాడు. వారి నమయం మూర్తికాగానే కాలునిరూపంలో వారిని లయింపజేస్తుంటాడాయన. ఈ విధానంలో భాగంగానే అధర్మ పక్షాన కౌరవుల్నీ, ధర్మం పక్షాన పాండవుల్నీ మోహరింపచేసి యుద్ధంలో ఉభయుల్నీ సంహరించినా అధర్మం పక్షం వారికి పాపాన్నీ, వ్యర్థత్వాన్నీ, ధర్మంపక్షం వారికి పుణ్యాన్ని, జీవిత సాఫల్యాన్నీ ప్రసాదిస్తాడు! సదరు ఫలితాలను బట్టే వివిధ స్థాయిల్లో ఉత్తములు, ఉత్తమోత్తములు, అమరులుగ, అధములు, అధమాధములుగ పునర్జన్మిస్తుంటారు వారు. ఇదే పరమాత్మయొక్క సృష్టి స్థితి, లయ విధానం. దీన్నే అర్జునున కిలావివరించాడు కృష్ణ పరమాత్మ).

హే కృష్ణా! దయతో నీవు బోధించిన పరమ గోప్యమైన ఆత్మ, అనాత్మల వివేక బోధద్వారా నా మూఢత తొలగింది. ప్రాణుల ఉత్పత్తి, విలయాల గూర్చి నీ అక్షయ మాహాత్మ్యం గూర్చి వివరంగా తెలుసుకున్నాను. నీ గూర్చి నీవు చెప్పిందంతా నిజమే. కానీ, నీ ఈశ్వరరూపం చూడాలని తహతహలాడుతున్నాను. నేనందుకు అర్హుడనని భావిస్తే దయచేసి నీ విశ్వాత్మ రూపాన్ని నాకు చూపించుమని అభ్యర్థించాడర్జునుడు. అర్జునా! వందలు, వేలాది వివిధ వర్ణాలు, ఆకృతులు గల నా దివ్యరూపాలను చూడు. నాలోకేంద్రీకృతమై యున్న చరాచర జగత్తునందు నీవు చూడదలచిన వాటన్నింటినీ చూడు. ఐతే నీ యీ భౌతిక నేత్రాలతో చూడలేవు గనుక. నీకు దివ్యనేత్రాలను ప్రసాదిస్తున్నాను. వాటితో దర్శించుమంటూ తన విశ్వేశ్వర రూపాన్ని ప్రదర్శించాడు శ్రీకృష్ణుడు. పలునేత్రాలు, నోళ్ళతో, దివ్య ఆభరణాలతో,

ఆయుధాలతో, అద్భుత దృశ్యాలు, దివ్య మాల్యాలు, వస్త్రాలు, పరిమళ గంధ లేపనాలతో సహస్ర సూర్యులను మించిన కాంతితో, ఆశ్చర్యకరతేజోమయ ఆనంతరూపంతో, విశ్వమంతా దేవ దేవునిలో కేంద్రీకృతమై యుండటాన్ని చూసిన అర్జునుడు ఆశ్చర్యంతో హర్షపులకాంకితుడై విశ్వరూపునకు వినమ్రంగా తలవంచి నమస్కరిస్తూ యిలా అన్నాడు.

దేవా! నీదేహంలో సకల దేవతలను, చరాచర ప్రాణులు, బ్రహ్మ, రుషులు, దివ్య సర్పాలను, ఇంకా పలు బాహువులు, ఉదరాలు, ముఖాలు, కన్నులూగల ఆదీ, అంతంలేని నీ అనంతరూపాన్ని దర్శిస్తున్నాను. సూర్యచంద్రులనే నేత్రాలతో జగత్తునంతా దీపింపచేస్తున్నావు. భూమ్యాకాశ మధ్య ప్రదేశమంతా నీతో నిండి ఉంది. నీ ఉగ్రరూపానికి ముల్లోకాలన్నీ కంపిస్తున్నాయి. దేవతలు నీలో ప్రవేశిస్తున్నారు. భయంతో కొందరు, భక్తితో ఇంకొందరు నిన్ను స్తుతిస్తున్నారు. రుద్ర, ఆదిత్య, యక్ష, గంధర్వాదులంతా ఆశ్చర్యంతో నిన్నుచూస్తున్నారు. అగ్నిలోకి దూసుకెళ్తున్న మిడుతల్లా, భీష్మ, ద్రోణ, కర్ణాది, రారాజులంతా అగ్ని శిఖల్లాంటి కోరలతో భయంకరమైన నీ నోట్లోకి ప్రవహిస్తున్నారు. ఇట్టి ఉగ్రరూపంలో ఉన్న నిన్నుగూర్చి తెలుసుకోవాలని ఉంది కృష్ణా! అన్నాడర్జునుడు.

అర్జునా! లోకంలో సంహారార్థం విజృంభించిన కాలుడను నేనే. నీవు యుద్ధం చేయకున్నాసరే. కాలం చెల్లిన ఈ వీరులు, రాజులిక బ్రతకరు. **ఈపాటికే నాచే చంపబడిన భీష్మ ద్రోణాదులను చంపటానికి పాపభీతి చెందకు. నీవు నిమిత్త మాత్రుడవు. విజయం తథ్యం. కాబట్టి, అర్జునా! లే, లేచి నీ ధర్మపోరాట కర్తవ్యాన్ని నెరవేర్చి, ఈ రాజ్యాన్నీ, కీర్తినీగూడ సాధించుమన్నాడు కృష్ణుడు.**

కృష్ణపరమాత్మకు చేతులు మోడ్చి సాగిలమ్రొక్కి హే అనంతరూపా! విశ్వాత్మా! సర్వవ్యాపీ! నీ మహిమ నెరుగక, మిత్రునిగా భావించి

ప్రేమతోనైనాసరే కృష్ణా! యాదవా! సభా! అంటూ పిలిచీ, అభిమానంతోనైనా సరే, భోజన విహారాది సమయాలలో బహిరంగంగానూ, ఏకాంతంగానూ, పరిహాసాలాడి, అవమానించి నందుకు దయచేసి తండ్రి బిడ్డను, ప్రియుడును ప్రేయసినీ మన్నించినట్లు నన్ను క్షమించుమంటూ సాష్టాంగపడ్డాడర్జునుడు. శ్రీకృష్ణా! అపూర్వమైన నీ విశ్వరూపాన్ని గాంచి సంబరపడ్డాను. కానీ అంతలోనే భయంతో వణికిపోతున్నాను. కాబట్టి, దయచేసి తిరిగి నీ పూర్వరూపాన్ని ధరించుమని అభ్యర్థించా డర్జునుడు.

నా యోగశక్తిచేత పరమతేజోమయమైన నా విశ్వరూప దర్శనాన్ని నీకనుగ్రహించాను. వేదాధ్యయన, యజ్ఞ, దానాది నిర్వాహకు లెవరికీ ప్రాప్తించని నాయీ విశ్వరూపాన్ని చూడగల్గిన అర్జునా! భీతిచెందకు, ఇదిగో! నాపూర్వ రూపమంటూ, తన యథార్థ రూపాన్ని ధరించాడు కృష్ణుడు. హే జనార్దనా! సౌమ్యమైన నీ మానుషరూపాన్ని చూశాక, యిప్పుడు స్థిమిత పడ్డాను అన్నాడర్జునుడు. అర్జునా! నీవిపుడు దర్శించిన నా ఈ విశ్వరూపాన్ని దర్శించుట, నన్ను చేరుకొనుట, నా పట్ల అనన్య భక్తితో మాత్రమే సుసాధ్యం. కాబట్టి, అర్జునా (పరమాత్మ) ప్రీతికొరకు, ప్రపంచ కళ్యాణార్థం ధర్మాన్ని కాపాడ, నాకర్పించి నీవీ ధర్మయుద్ధం చేయి. నన్నే పరమగమ్యంగా ఉంచుకుని నాకనన్యభక్తుడవై, రాగ, ద్వేషాతీతంగా నీ విధిని నిర్వహించు. తప్పక నన్ను చేరుకుంటావంటూ, అర్జునుని విధి నిర్వహణకు ప్రోత్సహించాడు శ్రీకృష్ణభగవానుడు.

12. భక్తి యోగం

కావ్య : భక్తియోగమంటే, భక్తితో ముక్తి (పరమాత్మను) పొందే మార్గమేనా తాతగారూ?

వ్యాఖ్యాత : ఔనమ్మా (అంతా పరమాత్మే నన్న ఆత్మైక జ్ఞానాన్ని పొందినవాడు పరమాత్మకు అనన్య భక్తుడౌతాడు. పరమాత్మపట్ల భక్తిగలవాడు ఆత్మజ్ఞాని

అవుతాడు. ఇందుకు మనిషి ప్రయత్నించాలి. ఇదే అంశాన్ని శ్రీకృష్ణుడు అర్జుననకిలా తెలియజేస్తాడు. అర్జునా! 1) నీమనోబుద్ధులను నావైపే కేంద్రీకరించు తప్పక నన్ను చేరుకుంటావు. 2) స్థిరంగా నీ మనసును నాపైనిల్పలేకుంటే, ధ్యానాభ్యాసంద్వారా దాన్ని సాధించు. 3) ధ్యానం గూడ చేయలేననుకుంటే నాకు ప్రీతికరమైన లోకకళ్యాణదాయకర్మలు చేస్తూ సిద్ధిని పొందు. 4) అలానూ చేయలేననుకుంటే, నీ మనసును నిగ్రహించుకొని, నీలో అంతరాత్మగ నిలిచియున్న నన్ను శరణువేడి , నా ఆదేశానుసారం ఫలాపేక్ష రహితంగా ధర్మమార్గాన నడుపు. అజ్ఞానంతో కూడిన అభ్యాసం కన్నా జ్ఞానం శ్రేష్ఠం. కేవల జ్ఞానంకన్నా జ్ఞానంతోచేసే ధ్యానం మిన్న. ఆచరించని ధ్యానంకన్నా ఆత్మాదేశానుసారం సదా ధర్మాచరణం శ్రేష్ఠమంటూ భక్తితో ముక్తిని పొందే ఉపాయాలను తెలియజేశాడు జగద్గురువు శ్రీకృష్ణుడు. వాటి వివరణే ఈ అధ్యాయం).

శ్రీకృష్ణా! నిష్ఠతో నిన్నుపాసించువారా? అవ్యక్త పరమాత్మను ఉపాసించువారా? వీరిలో ఎవరు బాగా యోగం తెల్సినవారు? ప్రశ్నించా డర్జునుడు. అర్జునా! నాయందే మనసునిల్పి, శ్రద్ధతో నన్నుభజించువారే యోగశ్రేష్ఠులని నా యభిప్రాయం. అవ్యక్త పరమాత్మనుపాసించువారు అంతా పరమాత్మేనన్న భావనతో సకల భూతహితం కొరకు పాటుపడువారు కూడ నన్నే చేరుకుంటారు. అ వ్యక్తుని యందాసక్తులకు నిర్గుణ బ్రహ్మను చేరుకోవడం కష్టం. కర్మలన్నింటినీ నాకర్పించి నన్నే పరమ గమ్యంగా భావించి తదేకధ్యానంతో నన్ను భజించేవారిని నాపట్ల ఆసక్తులను అచిరకాలంలోనే సంసారసాగరం నుండి సముద్ధరిస్తాను. కాబట్టి, **అర్జునా! నీ మనోబుద్ధుల్ని నా యందు లగ్నంచేయి. తప్పక నన్ను చేరుకుంటావు. నా మీద మనస్సును సుస్థిరం చేయలేకుంటే, ధ్యానం ద్వారా నన్ను చేర యత్నించు. ధ్యానాభ్యాసం గూడ చేయలేకుంటే నాకు ప్రీతికర కర్మలాచరిస్తూ సిద్ధిని పొందు. సత్కార్యాలూ చేయలేకుంటే నా శరణుజొచ్చి నీ కర్మఫలాలను త్యాగం చేయి.**

అజ్ఞానంతో కూడిన అభ్యాసం కన్నా జ్ఞానం , జ్ఞానంకన్నా ధ్యానం, ధ్యానం కన్నా కర్మఫలత్యాగం శ్రేష్ఠం. అది శాంతిని కలిగిస్తుంది. మరియు ఏ ప్రాణినీ ద్వేషింపనివాడు, సుస్థిర ధ్యాశీలి, నిగ్రహాత్ముడు, దృఢ సంకల్పుడు, మనోబుద్ధుల్ని నాకర్పించినవాడు ప్రాణులన్నింటా దయగలవాడు, మమతాహంకార రహితుడు, సుఖదుఃఖాది ద్వంద్వాల పట్ల సమస్థితుడు, సహనశీలి, లోకాన్ని క్షోభిల్లచేయనివాడు, హర్షాసూయ భయాగ్రహాలకు లోనుగానివాడు, పరుల ఆధారాన్ని అక్షించనివాడు, పవిత్రుడు, దక్షుడు, ఉదాసీనుడు, ముక్తసంగుడు, నిష్కామ కర్ముడు, వాక్సంయమన శీలి, భక్తి ప్రపూర్ణుడు, లభించిన దానితో తృప్తిపడువాడు నాకు ప్రియుడు. ఇట్టి సత్ప్రవర్తనయే అజరామరధర్మం. ఇట్టి ధర్మాచరణులే నా కత్యంత ప్రియులు. తద్వారా నన్ను చేర యత్నించు వారు ధన్యులు, కృతార్థులు. అని అర్జునునకు తద్వారా మానవాళికి దిశానిర్దేశం చేశాడు జగద్గురువు. (భగవంతుని పట్ల భక్తిగలవాడు, భగవంతునికి ప్రీతికరమైన, లోకకళ్యాణదాయకమైన ధర్మకార్యాలు చేస్తుండాలి. అదే అసలైన భక్తి. అట్టి భక్తులే భగవంతునికి ప్రీతి పాత్రులు, మోక్ష గాములని భావం. తథాస్తు!)

13. క్షేత్రం క్షేత్రజ్ఞ విభాగయోగం

శ్రేష్ఠ : క్షేత్రమంటే ఏంటి? క్షేత్రజ్ఞుడంటే ఎవరు? దయచేసి మాకర్థమయ్యేలా వివరిస్తారా తాతయ్య?

వ్యాఖ్యాత : క్షేత్రమంటే శరీరం. క్షేత్రజ్ఞుడంటే శరీరాలను చైతన్యవంతం చేసే పరమాత్మ. ప్రపంచదేశాలన్నింటినీ ఒకే సూర్యుడు ప్రకాశింపచేస్తున్నట్లే, ప్రాణులన్నింటినీ చైతన్యవంతం చేస్తున్నది ఒకే ఆత్మ. అంతేగాదు, మనిషి చేసే మంచి, చెడు ఆలోచనలు, చేతలకు అతనియందున్న ప్రత్యగాత్మయే సాక్షి! అర్జునా! బంధుప్రీతితో నీవీ యుద్ధాన్ని విరమిస్తున్నావో, కులనాశన పాపభీతితో అస్త్రాలను విడనాడావో పరమాత్మ గ్రహించడానికి నీలోని

అంతరాత్మయే సాక్షి. కాబట్టి, పాపపుణ్యాలనెడి సాకులు చెప్పటం మాని లోక కళ్యాణార్ధం నీవీ ధర్మపోరాట విధిని నిర్వర్తించు అర్జునా! అని ఆదేశించాడు శ్రీకృష్ణభగవానుడు. అర్జునునకే గాదు మానవులందరికీ ఇదే భగవదాదేశం. తద్వివరణమే ఈ అధ్యాయం) .

అర్జునా! క్షేత్రం అంటే శరీరం. శరీరాలన్నింటా నెలకొనియున్న నేనే (ఆత్మే)) క్షేత్రజ్ఞుడను. ఈ క్షేత్రం, క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానమే యథార్థ జ్ఞానం. వాటి వివరణ.

క్షేత్రము : పంచ భూతాలు, అహంకారం, బుద్ధి, మూల ప్రకృతి, దశేంద్రియాలు, ఇచ్ఛ, సుఖం, దుఃఖం, ద్వేషం, బాహేంద్రియాలు మొత్తం, తెలివి, ధైర్యం ఇవన్నీ కలిసి క్షేత్రం (శరీరం).

జ్ఞానం : దురభిమాన రాహిత్యం, దంభోక్తు(బడాయిమాట) లాడకుండుట, అహింస, సహనం, సరళత, ఆచార్యసేవ, మనో, దేహ పరిశుభ్రత, స్థిరత్వం, ఆత్మనిగ్రహం, ఇంద్రియ విషయాలపట్ల వైరాగ్యం, అహంకారం లేకుండడం, జనన, మరణ, వృద్ధాప్య, వ్యాధి, సుఖ, దుఃఖాది అనుభవాలపట్ల ఆసక్తి లేకుండా ఉండడం (ఆసక్తిలేకపోవడమే అనాసక్తత) నిస్సంగం, ఆలుబిడ్డల్ని, గృహాదులను అనాత్మగభావించుట, శుభాశుభాలపట్ల సమచిత్తత, నా (పరమాత్మ) పట్ల నిశ్చలభక్తి, ఏకాంత ప్రదేశ నివాసం, జనసాంగత్యం పట్ల విముఖత, ఆత్మజ్ఞాన నిష్ఠ, సత్య, జ్ఞాన, పరమార్థాల అవగాహన, ఇదంతా జ్ఞానం, తక్కినదంతా అజ్ఞానం.

జ్ఞేయం (తెలుసుకోదగినది) : విముక్తి దాయకం, సత్యాసత్యాల కతీతం, అనాది అయినట్టి బ్రహ్మను గూర్చి వివరిస్తున్నావిను. పరబ్రహ్మ లేక పరమాత్మ, తన కాళ్ళు, చేతులూ, చెవులూ, కళ్ళూ, తలలు, ముఖాలతో లోకమంతటా వ్యాపించియున్నాడు. ఇంద్రియ గుణాలన్నింటా దీపిస్తున్న పరబ్రహ్మకు ఇంద్రియాలు లేవు. సంగరహితుడైన ఆయనే అన్నింటికీ ఆధారం. అతడు గుణరహితుడు, కానీ, గుణానుభూతులన్నింటినీ

పొందుతాడు. **విశ్వమంతటా, జీవులన్నింటా ఉంటాడు పరమాత్మ. సూక్ష్మమగుటచే గ్రహింపరానిది, దగ్గరగానూ, దూరంగానూ అందరిలో అంతటా ఉంటాడు పరబ్రహ్మ. విభజింపవీలులేనిదది, ప్రాణుల్ని సృష్టిస్తుంది, పోషిస్తుంది. లయిస్తుంది పరబ్రహ్మ. జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాన గమ్యం అదే. అందరి హృదయాలలో అంతరాత్మగ వుండే ఆ పరబ్రహ్మయే జ్ఞేయం.**

ప్రకృతి – పురుషుడు : ప్రకృతియందు ఐక్యమైన పురుషుడు ప్రకృతి జనిత గుణాలను పొందుతున్నాడు. వాటి ప్రభావానుగుణంగా పుణ్య, పాపమార్గాల్లో పయనిస్తుంటాడు. ఆకారణంగా యోగ్య, అయోగ్య యోనులందు జన్మిస్తుంటారు. శరీరంలో ఉన్న పరమ పురుషుడే (పరమాత్మే) సాక్షి, పోషకుడు, మహేశ్వరుడు, ఇట్లా పరమ పురుషుని గుణాలతో సహా ప్రకృతిని గురించి తెలుసుకున్నవాడు జనన మరణవిముక్తుడు. నిర్మలహృదయులై ధ్యానంతో కొందరు, యోగాభ్యాసంతో కొందరు, కర్మయోగం ద్వారా కొందరు ఆత్మను దర్శిస్తున్నారు. గురుబోధానుసారం ఆత్మను పూజిస్తుంటారు మరికొందరు.

అనాది, నిర్గుణమైన ఆత్మ శరీరమందున్నా, కర్మలచే అంటుకోబడదు. ఒకే సూర్యుడు లోకాన్నంతటినీ ప్రకాశింపచేస్తున్నట్లు, ఒకే ఆత్మ క్షేత్రాలన్నింటినీ ప్రకాశింపజేస్తున్నది. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదాన్ని, ప్రకృతినుండి ప్రాణులు విముక్తి పొందటాన్ని జ్ఞాన నేత్రంతో చూడగల్గిన వారు పరమాత్మను చేరుకుంటారు. చరాచర ప్రాణులన్నీ క్షేత్రాలే, ప్రకృతి, పురుషుల ఐక్యత వల్లనే అవి జనిస్తున్నాయి. వినాశ శీల ప్రాణులన్నింటా నిలిచియుండు వాడే పరమేశ్వరుడు అని గ్రహించినట్టి యథార్థదర్శి ఆత్మచే ఆత్మను హింసింపక పరమ గమ్యం చేరుకుంటాడు. మరియు కర్మలు చేయునది ప్రకృతియే గాని పరమాత్మ కాడని గ్రహించగల్గినవాడు యథార్థదర్శి, ప్రాణిసమూహాల నానాత్వమంతా కేవలుడై పరమాత్మయందు ఒక్కటిగనే యుండి, అక్కడి నుండి విస్తరించటాన్నిచూడగల్గినవాడు పరమాత్మలో ఐక్యమౌతాడు.

14. గుణత్రయ విభాగ యోగం

సాయికృత్తిక : తాతగారూ! త్రిగుణాలూ మనుషులచేత ఏయే పనులను చేయిస్తాయి. త్రిగుణాతీతులెలాంటి పనులు చేస్తారు? దయచేసి వివరిస్తారా?

వ్యాఖ్యాత : (సత్వ, రజో, తమో గుణాలే త్రిగుణాలు. వీటిలో దేని ప్రభావం కల్గియున్న వారిచేత ఆయాపనులను చేయిస్తూ ఉంటాయి. ఐతే ఒక వ్యక్తి ఊగిస లాడకుండా నిశ్చలబుద్ధితో తన కర్తవ్యాన్ని నిర్వహించాలంటే, లేక లక్ష్యాన్ని సాధించాలంటే, ప్రకృతి జనితమైన ఈ త్రిగుణాల నతిక్రమించి, పరమాత్మయందే సుస్థిరబుద్ధిని కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే ఆత్మ(పరమాత్మ) ఆదేశానుసారం తన లక్ష్యాన్ని(విధిని) విజయవంతంగా నెరవేర్చగలుగుతాడు. సుఖ, దుఃఖ, స్తుతి, నింద, స్మశాన, అవమాన, తన, పర, మిత్ర, అమిత్ర, రాగ, ద్వేషాతీత సమతాస్థితే త్రిగుణాతీతస్థితి. అట్టి సమున్నత సమతాస్థితికి చేరుకోగల్గినవాడే ఆత్మాదేశానుసారం, పరమాత్మ కర్పించి, తన అసలైన కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించగలడు. ప్రయత్నపూర్వకంగానైనా, నరే (మట్టిరాయి, బంగారం అన్నీ పరమాత్మజనితాలే నన్న) యథార్థ స్థితికి చేరుకొని నీ ధర్మపోరాట కర్తవ్యాన్ని నిర్వహించవలసిందిగా అర్జునునితోపాటు ప్రతి ఒక్కరికీ శ్రీకృష్ణభగవానుడు చేసిన గీతోపదేశమే ఈ గుణత్రయ విభాగయోగం).

అర్జునా! దేన్ని తెలుసుకొని మునులు దేహబంధ విముక్తులై, పరమస్థితిని పొందుతున్నారో అట్టి అత్యుత్తమ పరమజ్ఞానాన్నీ నీకు మళ్ళీ చెబుతా విను. ఈ జ్ఞానాన్ని అనుష్ఠించి నా(ఆత్మ) స్వరూపాన్ని పొందినవారు తిరిగి జన్మించరు. ప్రళయకాలాన ఆపదలకు గురికారు.

మహనీయ ప్రకృతియే గర్భం. అందు నా బీజాన్ని నిక్షిప్తం చేస్తాను. ఆయా గర్భాలన్నింటి నుండి జన్మించు ప్రాణులన్నీ ప్రకృతి గర్భ జనితాలే. కాబట్టి, ప్రాణులన్నింటికీ గర్భధారిణియైన తల్లి ప్రకృతి. బీజ ప్రదాతనైననేను

తండ్రిని. (ప్రకృతి, పురుషులే ప్రాణుల తల్లిదండ్రులు). **ప్రకృతి జనిత సత్వ, రజో, తమో గుణాలే గుణత్రయం. ఇవే అక్షయమైన ఆత్మను శరీరమందు బంధించి ఉంచుతున్నాయి. గుణత్రయ లక్షణాలివీ.**

సత్వగుణం : ప్రకాశవంతం, దోషరహితం, నిర్మలమై ఉంటుంది. ఇది సుఖ, జ్ఞానాల పట్ల ఆసక్తిని కలిగించి బంధిస్తుందీ గుణం.

రజోగుణం : అనురాగ స్వభావాన్నికలిగి ఉంటుంది. వివిధ కర్మల పట్ల ఆసక్తిని కలిగించి బంధిస్తుంది.

తమోగుణం : అజ్ఞాన జనితమైనదీ గుణం. అవివేకం, పొరపాటు, సోమరితనం, నిద్రాదులచే మనిషిని బంధిస్తుందీ గుణం. అంటే సత్వం జ్ఞానాసక్తిని, రజోగుణం కర్మాసక్తిని, తమోగుణం పొరపాట్లు, తప్పుల పట్ల ఆసక్తిని కలిగింపజేస్తుంటాయి. వీటిలో రజో, తమో గుణాల నతిక్రమించిన వానిని సాత్వికగుణం, సత్వ, తమోగుణాల నతిక్రమించినవానని రజోగుణం, – సత్వరజోగుణాల నతిక్రమించిన వానిని తమోగుణం నడిపిస్తుంటాయి. ఆయాపనులను చేయిస్తుంటాయి.

ఇంద్రియాల ద్వారా జ్ఞాన తేజస్సు జ్వలిస్తుంటే, అది సత్వ గుణ ప్రాబల్యానికి నిదర్శనం. సత్వగుణం చేయించే సత్కర్మల వలన పవిత్రత, సుఖమూ ప్రాప్తిస్తాయి.

పేరాస, చురుకుదనం, కార్యారంభం, అశాంతి, కాంక్షలు రజోగుణ ప్రాబల్యానికి నిదర్శనాలు. రజోగుణం ఆత్యాశతో, ఆత్రుతతో చేయించే కర్మల వలన దుఃఖం, అశాంతి ప్రాప్తిస్తాయి.

మందబుద్ధి, జడత్వం, పొరపాట్లు, మూఢత, మూర్ఖత్వం తమోగుణ ప్రాబల్యానికి నిదర్శనాలు తమోగుణం చేయించే తప్పుడు, మూర్ఖపు కర్మలు దుఃఖాన్నీ, పతనాన్నీ ప్రాప్తింపచేస్తాయి.

ఈ కారణంగా మరణానంతరం సాత్వికులు ఉత్తమ దేవోపాసకులువెళ్ళే ఊర్ధ్వ (పుణ్య) లోకాల కెళ్తారు. రజోగుణులు మధ్యమ లోకాలకెళ్ళి తిరిగి కర్మాసక్తులకు పునర్జన్మనిస్తారు. తమోగుణులు అధోలోకాలకెళ్ళి తిరిగి మూఢులకు పునర్జన్మి స్తారు. దేహోత్పత్తి కారకాలైన త్రిగుణాల నధిగమించిన వాడు జనన, మరణ, వార్ధక్య, దుఃఖ విముక్తుడై అమృతత్వాన్ని పొందుతాడు. ఇలా గుణత్రయ విభాగాలను వివరించాడు శ్రీకృష్ణుడు. హే కృష్ణా! త్రిగుణాల నధిగమించిన వాని లక్షణాలు, ప్రవర్తన ఎలా ఉంటాయో తెలుపమన్నాడర్జునుడు.

అర్జునా! త్రిగుణాల నధిగమించగల్గినవాడు 1. సత్త్వజనిత ప్రకాశం, రజోజనిత కార్యోత్సాహం, తమోజనిత మూఢతలు సంభవించినపుడు వానిని ద్వేషింపడు 2. అవి తొలగి పోయినపుడు కావాలని వాటిని వాంఛింపడు 3. త్రిగుణాలకు చలింపడు, వాటిపనిని అవి చేసుకుంటున్నాయంతేనని ఉదాసీనుడై, అతనియందు సుస్థిరుడై ఉంటాడు. 4. సుఖదుఃఖాలు, ప్రియాప్రియాలు, నిందాస్తుతులు, మానావమానాలు, మిత్రామిత్రుల వంటి ద్వంద్వాలపట్ల సమభావంతో ఉంటాడు. మట్టిని, రాతిని, బంగారాన్నీ ఒక్కటిగ (పరమాత్మ జనితాలు)గనే చూడగల్గుతాడు. సనాతన ధర్మం, అక్షయ సుఖం, అక్షర, నిర్వికార బ్రహ్మమునైన నన్ను (పరమాత్మను) నిశ్చల భక్తితో సేవిస్తూ నా (ఆత్మా) ఆదేశానుసారం, నాకర్పించి తన విధిని నిర్వహిస్తు ఉండటం కూడ త్రిగుణాతీతుని లక్షణమే. అట్టి త్రిగుణాతీతులే బ్రాహ్మీభూతు (దైవసము)లగుటకు అర్హులు. వారే పరమ లక్ష్యసాధకులు కాగలరు. అర్జునా! యంటూ సరైన దిశానిర్దేశం చేశాడు శ్రీకృష్ణభగవానుడు.

15. పురుషోత్తమ ప్రాప్తియోగం

ఊహాశ్రీ : పురుషోత్తముని అంటే పరమాత్మను పొందే ఉపాయాన్ని తెలిపేదేనా పురుషోత్తమయోగమంటే? దీని ప్రధాన బోధనా లక్ష్యమింకేమైనా ఉందా తాతగారూ?

వ్యాఖ్యాత : ఔను! ఊహా ఖచ్చితంగానే ఊహించావు. పురుషోత్తముని పొందటమెలాగో తెల్పటమే కాక అసలు ధర్మాధర్మాలు, కర్తవ్యాకర్తవ్యాలు పరమాత్మనుండి ప్రారంభమైన కూకటి వేరులే. పరమాత్మ ప్రతినిధిగ నీలో నెలకొనియున్న అంతరాత్మ ద్వారా సదరు ధర్మాధర్మ, కర్తవ్యాకర్తవ్యాలను మనిషికి నిర్దేశిస్తుంటాడు పరమాత్మ! కాబట్టి, నీ మనసు సూచిస్తున్నట్లు బంధు రక్షణార్థం యుద్ధవిరమణ కాదు. నీ ఆత్మ నిర్దేశిస్తున్నట్లు ధర్మ రక్షణార్థం యుద్ధ నిర్వహణమే నీ కర్తవ్యం అర్జునా! యంటూ, ధర్మాధర్మాల ఉత్పత్తిస్థానం పరమాత్మయేనని, ధర్మాధర్మనిర్దేశకుడు అంతరాత్మేనన్న ఆధ్యాత్మిక సత్యాన్ని మానవాళికి ప్రబోధిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు. అదే ఈ పురుషోత్తమ యోగం).

పరంధాముడైన పరమాత్మయే మూలం (వేరు). క్రింది (భూ) లోకంలోని ప్రాణులన్నీ దానికొమ్మలు, వేదవిదితాలు, ఇంకా కర్మలన్నీ దాని ఆకులు. (కిరణజన్యసంయోగాది కర్మల ద్వారా చెట్టును పోషిస్తున్నది ఆకులే గదా అలాగే మానవ సామాజిక వృక్ష పోషణకూ కర్మలనే ఆకులే ఆధారమని భావం) త్రివిధ గుణజలాలతో తడుస్తూ పెంపొందుతున్న వివిధశాఖలే ప్రాణులు. **ఈ సంసారవృక్షపు కొమ్మలు క్రింద మనుష్యుని మొదలుకొని, మీది బ్రహ్మ దాకా వ్యాపించియున్నాయి. ఇంద్రియాలు వాటి చిగుళ్ళు. పరమాత్మునుండి వ్యాపించిన దాని వేరులే మనుజలోకంలోని ధర్మాధర్మాలు, కర్తవ్యాకర్తవ్యాలకు జనకాలు.** అంటే ధర్మాధర్మ నిర్దేశకుడు పరమాత్మయేకాని మానవులం కాదని అర్థం. ఆది, అంతం, ఉనికీ అగుపించక సుస్థిరమై యున్నట్టి అశ్వత్థ మనెడు యీ సంసార వృక్షాన్ని అనాసక్తియనెడు ఖడ్గంతో ఛేదించి, పునర్జన్మలేనట్టి యీ పరంధామాన్ని చేరుకోవాలి. అనాదియైన యీ ప్రపంచ మెవరినుండి వెలువడిందో అట్టి పరమాత్మ నాశ్రయించాలి. అనురాగ, గర్వ, మోహ రహితులైన ఆత్మనిష్ఠులు, సుఖదుఃఖాది ద్వంద్వాతీత జ్ఞానులూ అట్టి అక్షయ పరంధామాన్ని చేరుకుంటారు.

నిత్యసత్యమైన నా(పరమాత్మ) లోని ఒక అంశయే జీవునిగ పుట్టి, ప్రకృతిలోని పంచేంద్రియాలను మనసును ఆకర్షిస్తున్నది. పుష్పాలలో ప్రవేశించిన వాయువు వెళ్ళేటప్పుడు పుష్పాల వాసనలను తనతో తీసుకెళ్తున్నట్లే ఒక దేహంలోని జీవాత్మ, ఆ దేహాన్ని వీడి వెళ్తూ సదరు దేహపు మనో ఇంద్రియాలను, పాపపుణ్య సంస్కారాదులను వెంట తీసుకుని వెళ్ళి వాటితో సహా మరో దేహంలో ప్రవేశిస్తుంటుంది. శరీరపు జ్ఞానేంద్రియాలు మనసుల ద్వారా ఇంద్రియ విషయాలను అనుభవిస్తుంటుంది జీవాత్మ. ఐతే జీవాత్మ ఒక దేహంలో ఉండటాన్ని, మరో దేహంలో ప్రవేశించటాన్ని, ఇంద్రియ విషయాలతో కూడి ఉండటాన్ని జ్ఞానులే తప్ప, అన్యులు చూడలేరు. (ఉదాహరణకు వివిధ కక్ష్యల్లో వేగంగా పరిభ్రమించే ఎలక్ట్రాను ఒక కక్ష్యలో అదృశ్యమై, మరో కక్ష్యలో ప్రత్యక్షం కావటాన్ని శాస్త్రజ్ఞులే తప్ప, సామాన్యుడు చూడలేనట్లన్నమాట).

అర్జునా! ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తున్న సూర్యచంద్రాగ్నులలోని తేజస్సును నేనే. నా యొక్క ఓజోశక్తితో భూమిమీద ప్రాణులన్నింటినీ ధరించి పోషిస్తున్నాను. జలస్వరూప చంద్రునిగ ఓషధుల్నీ పోషిస్తున్నాను. ప్రాణులందు జఠరాగ్నిగ, ప్రాణ–అపాన వాయు సంయుక్తునిగ ఉంటూ అన్నాన్ని అరిగిస్తున్నాను. సర్వహృదయ నిలయుడను, గత జన్మ స్మృతిని, అతిలోక జ్ఞానాన్నీ, ఈ రెండింటి విస్మృతిని గూడ నేనే. మరియు వేదవిదుడను, వేదాంత కర్తనూ నేనే. లోకంలోని వినాశశీలప్రాణి సమూహ మంతా క్షరుడు ప్రాణుల్లోని జీవాత్మ అక్షరుడు (నశింపనివాడు) ఈ రెండింటికన్నా అంతటా వ్యాపించి, అన్నింటినీ పోషిస్తుండే పరమాత్మయే అత్యుత్తముడు క్షరున కతీతుడను, అక్షరునికన్నా ఉత్తముడైన నేనే పురుషోత్తమునిగ వేదాలలో, లోకాలలో విఖ్యాతి గాంచాను. ఈ వాస్తవాన్ని గ్రహించినట్టి జ్ఞాని నిండు హృదయంతో నన్ను భజిస్తూ, నా (ఆత్మ) ఆదేశానుసారం నడుస్తుంటాడు. అర్జునా! నీకిపుడు చెప్పిన గోప్యమైన ఈ

తత్వాన్ని గ్రహించగల్గినవాడు, మహోన్నతమైన ఆత్మజ్ఞాని, మరియు కృతార్థుడు. కాబట్టి, పురుషోత్తముడనైన నా (పరమాత్మయొక్క) ఆదేశానుసారం నీ యొక్క విధిని నిర్వహించి కృతార్థుడవు కమ్మని అర్జునునకే గాదు ప్రతియొక్కరికీ ప్రబోధిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు.

16. దైవాసుర సంపద్విభాగయోగం

హర్ష : దైవీ సంపద, అసురీసంపద అంటే ఏమిటో దయచేసి వివరిస్తారా తాతగారూ?

వ్యాఖ్యాత : (పవిత్రత, శాస్త్రాధ్యయనం, శాస్త్ర నిర్దేశానుసారం మసలుకోవటం మొ॥ దైవీసంపద లక్షణాలు. మోక్షప్రదాయని దైవీ సంపద అపవిత్రత, విశృంఖలత్వం (మనసు కోరినట్లల్లా ప్రవర్తించటం) వంటివి అసురీ సంపద లక్షణాలు. అసురీ సంపద బంధదాయకం. దైవీసంపదతో జన్మించిన అర్జునా! కర్తవ్యాకర్తవ్య నిర్ణయానికి లోకంలో శాస్త్రమేప్రమాణం. కాబట్టి, శాస్త్ర నిర్దేశానుసారం ధర్మపోరాటమే నీ కర్తవ్యం. శాస్త్రోక్త కర్తవ్య నిర్వహణద్వారా నీవు పరమగమ్యానికి చేరుకొందువు గాక దిశానిర్దేశం చేస్తూ, ఇంకా ఇలా వివరించాడు శ్రీకృష్ణభగవానుడు).

అర్జునా! నిర్భయత్వం, చిత్తశుద్ధి, జ్ఞాననిష్ఠ, యోగనిష్ఠ, సాత్వికదానం, నిగ్రహం, యజ్ఞం, తపస్సు, శాస్త్రాధ్యయనం, పారదర్శకత, అహింస, సత్యం, త్యాగం, శాంతి, భూతదయ, కోపరాహిత్యం, మృదువర్తన, వినమ్రత, స్థిరత్వం, పరులదోషాలెంచకుండుట, దురాశ, ద్రోహచింతన లేకుండడం, గర్వంలేకపోవడం, ధైర్యం, సహనం, చిత్తస్థైర్యం, శుచిత్వం ఇవన్నీ దైవీసంపద గలవారి లక్షణాలు. ఇది మోక్షదాయకం. ఇట్టి దైవీ సంపదతో పుట్టిన అర్జునా! నీవు (పాపభయంతో) దుఃఖించవలసిన పనిలేదు.

బంధహేతువులైన అసురీ సంపద లక్షణాలివీ గర్వం, అహంకారం, ఆగ్రహం, కఠినత్వం, అజ్ఞానం, అసూయ, అపవిత్రం, కపటత్వం,

విశృంఖలత్వం, క్రూరత్వం, ఇంకా జన్మసార్థకానికి కర్తవ్యాకర్తవ్యాల నెరుగనిది. సత్యానికి సత్ప్రవర్తనకు బహుదూరులు, కామ ప్రేరేపిత స్త్రీ పురుష సంగమమే జగదుత్పత్తికి కారణం గాని ఈశ్వరుడే లేడంటారు. ఈ జగత్తు అశాశ్వతం, దీనికి నైతిక మూలమేమీలేదంటూ ఇష్టకామ్య భోగార్థం అధర్మమార్గాన ధనార్జన చేస్తుంటారు. ఇప్పటికిది సాధించాను. ఇంకా ధనార్జన చేయగల కార్యసాధకుడను నేను. నా కోర్కెలన్నీ తీర్చుకుంటాను. ఇప్పటికీ శత్రువును చంపాను. ఇలా నా శత్రువులందర్నీ చంపుతాను. బలశాలినీ, సర్వాధిపతినీ, సిద్ధులన్నీ నా గుప్పెట ఉన్నాయి. సుఖిని, ధనాఢ్యుణ్ణీ, సద్వంశ సంభూతుడను, సరి లేరు నాకెవ్వరూ! యజ్ఞం, దానం, ఏదైనా చేస్తానంటూ పలు సంకల్పాలు, ఆశాపాశాలతో బంధింపబడి ధనదురహంకారంతో పొరపాట్లమీద పొరపాట్లు చేస్తుంటారు. ఆడంబరం, పేరు, ప్రతిష్ఠలకోసం, శాస్త్రవిరుద్ధంగా నామకః యజ్ఞయాగాదులు చేస్తుంటారు. అహంకార బలగర్వంతో అందరిలో అంతర్యామిగ ఉన్న నన్ను దూషిస్తుంటారు. అట్టి పాపాత్ములు ఆసురగర్భాలలో ఇంకా ఇంకా అధమాధములుగ జన్మిస్తుంటారు.

నరక ద్వారాలైన కామ,క్రోధ, లోభాల దుర్గుణత్రయాన్ని త్యజించాలి. వీటినుండి బయటపడగల్గినవారు, ఆత్మశ్రేయోదాయక కర్మాచరణ ద్వారా పరమగతిని పొందుతారు. శాస్త్ర విరుద్ధంగా విశృంఖలంగా ప్రవర్తించువారు ఇహపరసుఖాలను, పరమగమ్యాన్నీ పొందలేరు. కాబట్టి, అర్జునా! శాస్త్రవిరుద్ధంగా నీ మనసుకు నచ్చినట్లు బంధుప్రీతితో యుద్ధాన్ని వీడక శాస్త్రనిర్దేశానుసారం ధర్మపోరాటకర్తవ్యాన్ని నిర్వహించి పరమ గమ్యానికి చేరుకొందువు గాక! అంటూ అర్జునునకు కర్తవ్య నిర్దేశం చేశాడు శ్రీకృష్ణభగవానుడు.

17. శ్రద్ధాత్రయ విభాగయోగం

దేవాంశ్ : ఫలాపేక్షరహితంగా పని చేయగలిగే ఉపాయాన్ని మాకు తెలియజేస్తారా తాతయ్యా?

వ్యాఖ్యాత : (సాత్త్విక ఆహార, వ్యవహార అభ్యాసాల ద్వారా రజస్తమో గుణాల నతిక్రమించి సత్త్వగుణాన్ని పెంపొందించుకో, అప్పుడే ఫలాపేక్ష రహితంగా శాస్త్రోక్తమైన లోకకళ్యాణదాయకమైన కర్మలను కర్తవ్యభావనతో చేయగలవని అర్జునునకు, సమస్త మానవాళికీ, ఈ శ్రద్ధాత్రయ విభాగయోగం ద్వారా నిర్దేశిస్తున్నాడు శ్రీకృష్ణభగవానుడు).

హే కృష్ణా! శాస్త్ర విధుల్ని విడనాడి, శ్రద్ధగా యజ్ఞం చేయువారి నిష్ఠ సాత్త్వికమా? రాజసికమా? తామసికమా? చెప్పమన్నాడర్జునుడు. అర్జునా! దేహధారుల స్వభావసిద్ధమైన శ్రద్ధ, సాత్విక, రాజసిక, తామసికాలని త్రివిధాలు. ప్రతివాని శ్రద్ధ అతని పూర్వజన్మ వాసనలకనుగుణంగానే ఉంటుంది. అంటే అతని శ్రద్ధ యేలాంటిదో, అతడలాంటి వాడని భావం.

సాత్వికులు దేవతల్ని, రాజసికులు యక్షరాక్షసుల్నీ, తామసికులు ప్రేతభూతాల్నీ పూజిస్తుంటారు. దంభం, అహంకారం కలవాళ్ళు కామకాంక్షలచేత నడిపించబడుతూ, శాస్త్రవిరుద్ధంగా మనసుకు తోచినట్లు, ఘోర తపస్సు నాచరిస్తూ దేహావయవాలతో పాటు, దేహంలోని నన్నూ (ఆత్మనూ) క్షీణింపజేస్తున్న అసుర స్వభావులు, శ్రద్ధాత్రయులకు ప్రీతికరమైన ఆహార, యజ్ఞ, తపో, దానాదులుగూడ త్రివిధాలు.

సాత్వికులకు ఆరోగ్య, బల, కార్యోత్సాహ, సుఖదాయకాలైనట్టి రసవంతాలు నేయి (నూనె)తో కూడిన పుష్టికర, మనోహర పదార్థాలు ప్రీతిదాయకాలు.

రాజసికులకు దుఃఖ, చింత, రోగ దాయకాలైన మిక్కిలి పులుపు, చేదు, ఉప్పు, కారాలతో కూడినవి, వేడివి మాడినవి, దప్పిక కలిగించే ఆహారపదార్థాలు ప్రీతికరాలు.

తామసికులకు చల్లారినవి, చద్దివి, మిగిలిన, పాచిపోయిన, రుచిహీన పదార్థాలు ప్రీతిదాయకాలు.

ఫలాపేక్ష రహితంగాశాస్త్రోక్త యజ్ఞాన్ని కర్తవ్య భావనతో పరమాత్మ కర్పించి చేసేది సాత్వికయజ్ఞం. ఫలాపేక్షతో ఆడంబరంగా చేసే యజ్ఞం రాజసికం. మంత్ర, దాన, అన్నదాన, శ్రద్ధారహితంగా చేసే యజ్ఞం తామసికం. **1) గురువులు, దేవతలు, ద్విజులను పూజించుట, అహింస, శుచిత్వం, నిష్కపటత్వం, బ్రహ్మచర్యం ఇవి శారీరకతపస్సు 2) అన్యుల నొప్పింపని, సత్య, హితకర సంభాషణ, వేదాధ్యయనాలు వాక్ తపస్సు 3) పరోపకారశీలత, ప్రశాంత చిత్తం, చిత్తశుద్ధి మౌనం, ఆత్మనిగ్రహం యివి మానసిక తపస్సు. ఫలాపేక్షరహితులు కర్తవ్యనిష్ఠతో చేసే ఈ త్రివిధ తపస్సే సాత్విక తపస్సు!**

సన్మాన, గౌరవ, పూజలను పొందగోరి విశ్వాసరహితంగా, దంభంతో చేయు తపస్సు రాజరికం! అజ్ఞానంతో తన మనోదేహాదులను బాధించుటకో, పరులకు హాని చేసేందుకో చేయు తపస్సు తామసికం!

'ఓం తత్సత్' అనేది పరబ్రహ్మ (పరమాత్మ)కు నామత్రయం. ఓం శబ్దోచ్చారణతోనే వేదాచరణులు శాస్త్రోక్త యజ్ఞ, తపో, దానాదులను నిర్వహిస్తుంటారు. 'తత్' శబ్దోచ్చారణతో వాటినే ఫలాపేక్షరహితంగా చేస్తారు. 'సత్' శబ్దాన్ని వాస్తవమైనదని, మంచిది, శుభకరమని చెప్పడానికి, యజ్ఞ, తపోదానాదులందరి నిష్ఠ అని తెలుపడానికి వాడుతుంటారు.

శ్రద్ధాహీనంగా చేసిన యజ్ఞ, తపో,దాన క్రియాదులను 'అసత్' శబ్దం సూచిస్తుంది. అలాంటి యజ్ఞాదు లిహపరమందు నిష్ప్రయోజనం. అంటూ శ్రద్ధాత్రయాన్ని వివరించి, సాత్విక శ్రద్ధాయుతుడవై, ఫలాపేక్షరహితంగా పరమాత్మ కర్పించి ధర్మపోరాట కర్తవ్యాన్ని నిర్వహించుమని అన్యాపదేశంగా ఆదేశిస్తాడు శ్రీకృష్ణ భగవానుడు!

18. మోక్ష సన్న్యాస యోగం

విరాజ్ ఉజ్వల్ : సన్న్యాసమంటే ఏంటి? త్యాగమంటే ఏమిటి? సాత్విక త్యాగమంటే ఏమిటి? వీటిలో మోక్షదాయకమేది? దయచేసి వివరిస్తారా?

వ్యాఖ్యాత : (కర్మలను త్యజించటం సన్న్యానం! కర్మఫలాలను త్యజించటం త్యాగం! ఫలాపేక్ష రహితంగా, కర్తృత్వభావనను వీడి, పరమాత్మకర్పించి, లోకకళ్యాణదాయక కర్మలను, కర్తవ్యంగా భావించి నిర్వహించుట సాత్వికత్యాగం! కాబట్టి, అర్జునా! పాపమనెడి యుద్ధఫలితం పట్ల ఆసక్తిని కర్తృత్వభావనను వీడి, నాకర్పించి, నాప్రీత్యర్థం లోకకళ్యాణదాయకమైన ఈ ధర్మపోరాటాన్ని నీ కర్తవ్యంగా భావించి నిర్వహించు. ఇలా, సాత్వికత్యాగివై మోక్షాన్ని పొందుమంటూ, అర్జునునితోబాటు మానవాళికి మోక్షమార్గాన్ని చూపుతున్నాడు శ్రీకృష్ణపరమాత్మ, తద్వివరణమే ఈ అధ్యాయం).

సన్న్యాస, త్యాగ తత్త్వాలను విడివిడిగా తెలుసుకోవాలనుంది అన్న అర్జునునితో శ్రీకృష్ణుడిలా అన్నాడు. అర్జునా! చేసే కర్మలన్నింటినీ త్యజించటాన్ని సన్న్యాసమనీ, కర్మఫలాలను త్యజించటాన్ని త్యాగమనీ అంటున్నారు జ్ఞానులు. మనసును పవిత్రం చేసే యజ్ఞ, తపో, దానాది కర్మలను త్యజించరాదు. వాటిని కర్తృత్వాభిమాన, ఫలాపేక్ష రహితంగా, పరమాత్మ కర్పించి చేయాలని ప్రాజ్ఞులంటున్నారు. **త్యాగం త్రివిధాలు 1. ఫలాపేక్షరహితంగా నియతకర్మలను కర్తవ్యభావనతో నిర్వహించటం సాత్విక త్యాగం 2. శారీరక ప్రయాస అనే భావనతో కర్మలను త్యజించటం రాజసికత్యాగం. 3. నిత్య కర్మలను సైతం త్యజించటం తామసికత్యాగం.**

కర్మలను పూర్తిగా త్యజించటం మనిషికి అసాధ్యం. కాబట్టి, కర్మఫలాలను మాత్రమే త్యజించాలి. అతడే త్యాగిఔతాడు. కర్మఫలాలను త్యజించకుంటే మరణానంతరం వాటిని అనుభవించకతప్పదు. కర్మఫలత్యాగులకు పాపపుణ్యాలంటవు. కర్మలు నెరవేరటానికి కారణాలైదు. అవి 1. దేహం 2.కర్త 3. ఇంద్రియాలు 4. ఇంద్రియాల చేష్టలు 5. అధిష్ఠాన దేవతావర్గం. మనిషియొక్క శారీరక, మానసిక, వాగ్రూప, న్యాయాన్యాయాలన్నింటికీ ఈ ఐదే హేతువులు. ఈ వాస్తవాన్ని గ్రహించలేక,

అన్నింటికీ కర్తను తానేనని భావించువాడు అజ్ఞాని. గుణబేధాన్ని బట్టి జ్ఞానం, కర్మలు, కర్తలు త్రివిధాలు అంటున్నది సాంఖ్యదర్శనం.

జ్ఞానం : వివిధ ప్రాణులన్నింటా ఉన్నది పరమాత్మ ఒక్కడేనని గ్రహించిన జ్ఞానం సాత్త్వికజ్ఞానం. విభిన్న ప్రాణుల ఆత్మలు గూడ భిన్నాలనుకునేవారి జ్ఞానం రాజసికజ్ఞానం. దేహాన్నే సర్వస్వంగా భావించి, దాని యందే ఆసక్తిని కలిగి యుండునది తామసిక జ్ఞానం.

కర్మలు : కర్తృత్వాభిమాన, ఫలాపేక్ష, రాగ ద్వేషరహితంగా కర్తవ్యభావనతో చేయునది సాత్త్విక కర్మ. కోర్కెలు, అహంకారంతో ప్రయాసపడుతూ చేయునది రాజసిక కర్మ. తను చేయుకర్మలశుభాశుభాలు, కార్యనిర్వహణ సామర్థ్యం గూర్చి అంచనా లేకుండా మూఢంగా చేయునది తామసిక కర్మ.

కర్తలు : ఆసక్తి, అహంకార రహితుడు, ఫలాఫలాలకు పొంగక,కుంగక, ధైర్యోత్సాహంగా కర్మలు చేసే, కర్త **సాత్త్వికుడు**. ఆసక్తి, ఫలాపేక్ష గలవాడు, లోభి, హింసాశీలి, అపవిత్రుడు, హర్ష విభేదాల విధేయుడైన కర్త **రాజసికుడు.** వినయ, స్థిరత్వాలు లేనివాడు, వంచకుడు స్వార్థం కోసం అన్యులకు హానిచేయువాడు, అధీరుడు, సోమరి,అలసత్వం వహించు కర్త **తామసికుడు.** మరియు వారి వారి గుణాలను బట్టి వారిబుద్ధి ధృతి (పట్టుదల) యొక్క తేడాలివీ.

బుద్ధి : కర్మ, కర్మత్యాగం, కర్మమార్గం, కర్తవ్యం, అకర్తవ్యం, భయం, అభయం వీటిని గూర్చి, బంధ, మోక్ష కారణాలను గూర్చి తెలుసుకున్న వానిది సాత్త్వికబుద్ధి. ధర్మాధర్మాలను, కర్తవ్యాకర్తవ్యాలను పొరపాటుగ గ్రహించిన వానిది రాజసిక బుద్ధి.

ధృతి (పట్టుదల) : మనసు, ప్రాణం, ఇంద్రియాల క్రియలను సక్రమంగా నడుపుతూ యోగస్థిరత చెందిన వానిది సాత్త్విక ధృతి. ధర్మాధర్మాల దిశగా బుద్ధిని మరల్చి వాటి ఫలాన్నభిలషించేది రాజసిక ధృతి. భయం, నిద్ర,

సంతాప, వ్యాకులత, మద, బుద్ధిహీనతలను వదలకుండా చేయునది తామసిక ధృతి.

సుఖం : దేని ద్వారా దుఃఖాన్ని పోగొట్టుకొని, ఆనందాన్ని పొందునో, ఏది మొదట విషప్రాయంగా ఉండి కడకమృతప్రాయమౌతుందో, ఆత్మానుభూతి వలన కలుగు ప్రసన్న బుద్ధి ద్వారా కలుగు అట్టి సుఖమే సాత్త్విక సుఖం! ఇంద్రియసుఖాలవలన మొదట అమృతప్రాయంగా ఉంటూ చివరకు విషప్రాయమయ్యే సుఖం రాజసికసుఖం. ఆత్మమూఢత, నిద్ర, పొరపాటు, మాంద్యాలయందు ప్రారంభమై, వాటియందే అంతమయ్యేసుఖం తామసిక సుఖం. భూలోక ప్రాణులైనా, స్వర్గదేవతలైనా యీ త్రిగుణాల కతీతులుకారు.

వారి వారి స్వభావ జనిత గుణాలకనుగుణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కర్మాలు విభజింపబడినవి. 1. ఇంద్రియ, మనోనిగ్రహం, తపస్సు, శుచిత్వం, సహనం, జ్ఞానం, విజ్ఞానం, నిష్కాపట్యం, ఆస్తికతాదులు బ్రాహ్మణ స్వభావ జనిత కర్మలు. 2. శౌర్యం, స్థైర్యం, ధీరత, సద్యస్ఫూర్తి, యుద్ధభయంలేమి, త్యాగగుణం, అధికారం, క్షత్రియ స్వాభావిక కర్మలు. 3. సేద్యం, పశుపోషణ, వర్తకం వైశ్య స్వభావ జనిత కర్మలు. 4. సేవ (వస్తూత్పత్తి) కర్మలు శూద్ర స్వాభావిక కర్మలు. స్వీయ కర్మల (కర్తవ్యాల)ను శ్రద్ధతో పరమాత్మ కర్పించి చేయువాడు సిద్ధిని పొందుతాడు. **చక్కగా నిర్వహించిన అన్యులకర్మకన్నా, పొరపాటుగా చేసినా స్వీయ (స్వభావజనిత)కర్మయే శ్రేయస్కరం. దోషయుక్త మైనా సరే స్వభావ జనిత కర్మను త్యజించరాదు. ఎందుకంటే దోషమేలేని కర్మే లేదు గనుక.**

వేటిపట్లనూ ఆసక్తి, వాంఛలేనివాడు, ఆత్మ నిగ్రహం కలవాడు, నైష్కర్మ్య సిద్ధిని పొందుతాడు. పవిత్రబుద్ధి, ఇంద్రియనిగ్రహం, రాగద్వేషాల త్యాగం, మితాహారాలతో, ఏకాంతవాసాన దేహ, మనో వాక్కుల నియంత్రణ ద్వారా

ధ్యాననిమగ్నుడై, వైరాగ్యంతో, అహంకారాల, దర్పకామక్రోధాదులను త్యజించిన శాంతుడు. పరమాత్మను పొందుట కర్హుడు. **అలా బ్రహ్మాత్వమంది, ప్రసన్న మనస్కుడైన యోగి అనన్యభక్తితో తత్త్వాన్ని గ్రహిస్తాడు. అప్పుడతను సమస్త ప్రాణుల పట్ల సమభావంతో ఉంటాడు. వెంటనే నాలోలీనమౌతాడు.** కాబట్టి, అర్జునా! నీవలా ప్రసన్న మనస్కుడవై, నన్నే పరమగమ్యంగా పెట్టుకొని, నాయందే సుస్థిరుడవైతే నీవీబంధుహత్యాదోషం, పాపభీతి వంటి) అవాంతరాలన్నింటినీ దాటగలవు. తద్విరుద్ధంగా నా (పరమాత్మ) ఆదేశాన్ని ధిక్కరిస్తే పరమార్థ భ్రష్ఠుడవౌతావు. అహంకారంతో యుద్ధంచేయనని అనకు (దుఃఖవైరాగ్యంతో నీవిప్పుడిలా అన్నా) నీ క్షత్రియ స్వభావమే (ఎదుటివారి హేళనతో రెచ్చిపోయి) నీచేత తప్పక యుద్ధం చేయిస్తుంది.

కాబట్టి, నీ నిండు హృదయంతో నన్నాశ్రయించు అర్జునా! నామాటవిను, నీకు పరమశాంతి, పరమగమ్యం ప్రాప్తిస్తాయి. (మరుగునపడి) గోప్యంగా ఉండిపోయిన ఆత్మజ్ఞానాన్ని నీకు సంపూర్ణంగా బోధించాను.దీనిని బాగా మననం చేసుకో. అప్పుడిక నీకు తోచినట్లు చేయి. అర్జునా! (మరోసారి చెబుతున్నావిను) నీమనసు చెప్పే కర్మలను వదిలి, నీలో ఆత్మరూపాన ఉన్న నన్ను ఆశ్రయించి, నా ఆదేశానుసారం నడుచుకో పాపవిముక్తుడవౌతావు. నా యీ గీతాబోధను భక్తిహీనులకు కాక నా భక్తులకు బోధించువాడు నన్ను చేరుకుంటాడు అని చెప్పడం ద్వారా తన యీ గీతోపదేశాన్నితన భక్తుల కందించవలసిందిగా అర్జునునికి అన్యాపదేశంగా ఆదేశించాడు కృష్ణుడు. మరియు తన గీతాబోధను శ్రద్ధగా అధ్యయనం చేసినవారు, విన్నవారు పరమాత్మను జ్ఞాన యజ్ఞంతో పూజించినట్లే కాగలదనీ, దీనిని శ్రద్ధగా విన్న అర్జునా! నీ మూఢత తొలగినట్లేనా యనీ అన్నాడు శ్రీకృష్ణభగవానుడు!

నీ దయవలన, నా మూఢత తొలగింది. ఇక నీ ఆజ్ఞను శిరసావహిస్తా నంటూ (యుద్ధసన్నద్ధుడై లేచి నిలిచాడర్జునుడు. వ్యాసుని కృపచేత

అద్భుతమైన ఆ శ్రీకృష్ణ సంవాదాన్నంతా నేరుగా వినగలిగాను నేను. వినిహర్షాతిరేకంతో పులకించి పోతున్నాను. యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడు(ఆత్మజ్ఞానం, ఆచరణ) ఎక్కడుంటే అక్కడ సిరి, విజయం, ప్రగతి,రాజనీతి, ధర్మం ప్రవర్ధిల్లుతాయని, ధృతరాష్ట్రునికి తద్వారా మానవాళికీ శ్రీమద్భగవద్గీతా సందేశామృతాన్ని అందజేశాడు సంజయుడు!

ప్రియతమ సహోదరీ! సహోదర ఆంధ్రులారా! ముందుగా మనమంతా సదరు గీతామృతాన్ని తనివిదీరా గ్రోలెదము గాక! అనంతరం సహోదర భారతీయులకు, విశ్వసహోదరులందరికీ శ్రీమద్భగవద్గీతా సందేశామృతాన్ని అందజేసెదము గాక! తథాస్తు! సర్వేజనాః స్సుఖినోభవన్తు! విశ్వశాంతిర్భవేత్! ఓం శాంతిః! శాంతిః! శాంతిః! ఓం తత్ సత్!

ఓమ్

ధ్యాన శ్లోకాలు

నమోఽస్తుతే వ్యాస విశాల బుద్ధే
ఫుల్లారవిందాయత పత్రనేత్ర ।
యేన త్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥ 1

ప్రపన్న పారిజాతాయ తోత్రవేత్రైక పాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృత దుహే నమః ॥ 2

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥ 3

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 4

శ్రీమద్భగవద్గీత

ప్రథమాధ్యాయం

అర్జునవిషాదయోగం

ధృతరాష్ట్ర ఉవాచ –

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సఞ్జయ ॥ 1

ధృతరాష్ట్రుడన్నాడు–

సంజయా! ధర్మభూమి కురుక్షేత్రంలో మావాళ్ళు, పాండవులూ ఏం చేశారు?

సంజయ ఉవాచ –

దృష్ట్వాతు పాణ్డవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్యముపసఙ్గమ్య రాజా వచనమబ్రవీత్ ॥ 2

సంజయుడన్నాడు –

అంతట వ్యూహబద్ధంగా ఉన్న పాండవ సైన్యాన్ని చూసిన దుర్యోధనుడు ద్రోణాచార్యునివద్దకెళ్ళి యిలా అన్నాడు.

పశ్యైతాంపాణ్డుపుత్రాణామాచార్య మహతీం చమూమ్ ।
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3

ఆచార్యా! ధీమంతుడైన నీ శిష్యుడు ద్రుపదునిచే వ్యూహపరచబడిన పాండవసైన్యాన్ని చూడండి.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథ ః ॥ 4

అందు భీమార్జునులతో సమానశూరులు, మేటి విలుకాండ్రుసాత్యకి, విరాటుడు, ద్రుపదుడును

ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ ।
పురుజిత్ కున్తిభోజశ్చ శైబ్యశ్చ నరపుఙ్గవః ॥ 5

పరాక్రమశీలురైన ధృష్టకేతువు,చేకితానుడు, కాశీరాజు, నరశ్రేష్ఠులు పురుజిత్తు, కుంతి, భోజుడు, శైబ్యుడు.

యుధామన్యుశ్చ విక్రాన్త ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6

మహాబలశాలి యుధామన్యుడు, ధైర్యశాలి ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపదీపుత్రులు వీరంతా మహారథులే.

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥ 7

బ్రాహ్మణోత్తమా! నీగుర్తుకోసం, నా సైన్యంలోని ప్రముఖ సేనాయకుల పేర్లు చెబుతా వినండి!

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ॥
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిర్జయద్రథః ॥ 8

మీరు, భీష్ముడు,కర్ణుడు, విజయశీలి కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తసుతుడు, జయద్రథుడు.

అన్యేచ బహవఃశూరాః మదర్థే త్యక్త జీవితాః ।
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥ 9

ఇంకా వివిధ శస్త్రాయుధధారులు, యుద్ధనిపుణులైన వీరులు, శూరులెందరో నాకోసం ప్రాణాలర్పించ వచ్చియున్నారు.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విదమే తేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 10

భీష్ముని రక్షణలోని మనసైన్య మపారంగాను, భీముని రక్షణలోని వారి సైన్యం పరిమితంగానూ ఉన్నాయి.

అయనేషు చ సర్వేషు యథా భాగమవస్థితాః ।
భీష్మమేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవ హి ॥ 11

ఇక మీరంతా సేనావ్యూహంలోని మీమీస్థానాలలో నిలిచి భీష్ముని రక్షింతురు గాక!

తస్య సంజనయన్‌హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః శబ్దం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12

అప్పుడు కురువృద్ధుడు, ప్రతాపశాలియైన భీష్మ పితామహుడు, దుర్యోధనున కానందోత్సాహాలు కలిగించుటకై పెద్దగా సింహనాదం చేసి, శంఖాన్ని పూరించాడు.

తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః ।
సహసై వాభ్యహన్యన్త స శబ్దస్తుములోఽ భవత్ ॥ 13

అంతట(కౌరవ సైన్యం నుండి) శృంఖాలు, దుందుభులు, ధక్కలు, తప్పెట్లు,రణశృంగాలు హఠాత్తుగా ఒకేసారి మ్రోగినాయి. వాటి శబ్దం భయంకరంగా ఉంది.

తతః శ్వేతైర్హ యైర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ ।
మాధవః పాణ్డవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14

పిమ్మట శ్వేతాశ్వాలనుపూన్చిన రథంలో కూర్చునియున్న కృష్ణార్జునులు తమదివ్య శంఖాలను అద్భుతంగా పూరించారు.

పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనఞ్జయః ।
పౌణ్డ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మావృకోదరః ॥ 15

కృష్ణుడు పాంచజన్యం అర్జునుడు దేవదత్తం, భీకర కార్యదక్షుడు భీముడు పాండ్రం అనుమహాశంఖాలను పూరించారు.

అనన్తవిజయం రాజాకున్తీపుత్రో యుధిష్ఠిరః ।
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥ 16

ధర్మరాజు అనంత విజయం, నకులుడు సుఘోషమణి, సహదేవుడు పుష్పకం అనే శంఖాలను పూరించారు.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥ 17

విలువిద్యలో మేటి కాశిరాజు, మహారథుడు శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, ఓటమి నెరగని సాత్యకి.

द्रुपदो द्रौपदेयाश्च सर्वशः पृथिवीपते ।
सौभद्रश्च महाबाहुः शंखान् दध्मु ः पृथक् पृथक् ॥ 18

ద్రుపదుడు, ద్రౌపదీ పుత్రులు, అభిమన్యుడు, వీళ్ళంతా అన్ని దిశలనుండి తమ తమ శంఖాలు పూరించారు రాజా!

सघोषोधार्तराष्ट्राणां हृदयानि व्यदारयत् ।
सभश्च पृथिवीञ्चैव तुमुलोऽव्यनुनादयन् ॥ 19

అభయంకర ధ్వని భూమ్యాకాశాలలో ప్రతిధ్వనిస్తూ కౌరవపక్షం వారి గుండెల్ని దడదడలాడించాయి.

अथव्यवस्थितान् दृष्ट्वा धार्तराष्ट्रान् कपिध्वजः ।
प्रवृत्ते शस्त्रसम्पाते धनुरुद्यम्य पाण्डवः॥ 20

రాజా! యుద్ధసన్నద్ధులైన ధార్తరాష్ట్రులు ఆయుధ ప్రయోగానికి సిద్ధం కావటం చూసిన అర్జునుడు వింటినెత్తి కృష్ణునితో ఇలా అన్నాడు.

అర్జున ఉవాచ –

हृषीकेशं तदा वाक्यमिदमाह महीपते ।
सेनयोरुभयोर्मध्ये रथं स्थापय मेऽच्युत ॥ 21

కృష్ణా, యుద్ధ సన్నద్ధులై వచ్చినవారిని నేను చూచుటకొరకు నారథాన్ని ఉభయసేనలమధ్య నిలుపు.

यावदेतान्नि रीक्षे हं योद्धुकामानवस्थितान् ।
कैर्मया सह योद्धव्यमस्मिन्नरणसमुद्यमे ॥ 22

ఈ యుద్ధారంభ సమయంలోనే నేనవరెవరితో పోరాడాలో నన్ను తెలుసుకోనిమ్ము.

योत्स्यमानान वेक्षेऽहं य एतेऽत्र समागताः ।
धार्तराष्ट्रस्य दुर्बुद्धेर्युद्धे प्रिय चिकीर्षवः ॥ 23

దుష్టదుర్యోధనుని పక్షాన పోరాడి, అతనికి ప్రీతిగూర్చవచ్చినవారెవరో నేచూడాలి.

సఞ్జయ ఉవాచ –

एवमुक्तो हृषीकेशो गुडाकेशेन भारत ।
सेनयोरुभयोर्मध्ये स्थापयित्वारथोत्तमम् ॥ 24

మహారాజా అర్జునుని మాటవిని శ్రీకృష్ణుడు తమ రథోత్తమాన్ని ఇరుసేనలధ్య నిలిపాడు.

भीष्मद्रोण प्रमुखत ः सर्वेषां च महीक्षिताम् ।
उवाच पार्थ पश्यैतान् समवेतान् कुरूनिति ॥ 25

భీష్మ ద్రోణాదుల, రాజులందరి యెదురుగామేటి రథాన్నినిలిపి, పార్థా!, ఇదిగో, ఇచట సమీకృతమై ఉన్న కౌరవుల నందర్నీ చూడుమన్నాడు.

तत्रापश्यत् स्थितान् पार्थः पित्रूनथ पितामहान्!
आचार्यान् मातुलान् भ्रातॄन् पुत्रान् पौत्रान् सखींं स्तथा ॥ 26

అప్పుడర్జునుడు తండ్రులు, తాతలు, గురువుల, మేనమామలు, అన్నదమ్ములు, పుత్రులు, మనుమలు, మిత్రులనూ

श्वशुरान् सुहृदश्चैव सेनयोरुभयोरपि ।
तान् समीक्ष्य स कौन्तेयः सर्वान् बंधूनवस्थितान् ॥ 27

దాయాదులను, శ్రేయోఽభిలాషులను, మామలను, ఉభయసేనలలోని బంధువులందర్నీ చూసి

అర్జున ఉవాచ –

కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।
దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28

సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి !
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చజాయతే ॥ 29

కృష్ణా! యుద్ధాభిలాషతో ఇచట కూడిన నావాళ్ళందర్నీ చూడగానే నా అవయవాలు తేలిపోతున్నాయి. నో రెండి పోతుంది, శరీరం కంపిస్తుంది, రోమాలు గగుర్పొడుస్తున్నాయి.

గాణ్డీవం స్రంసతే హస్తాత్త్వక్ చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30

గాండీవం జారిపోతున్నది, చర్మం మండిపోతున్నది, నిలబడలేకపోతున్నాను. మనసు చలిస్తున్నది.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥ 31

నాకన్నీ అపశకునాలే కనిపిస్తున్నయ్. ఐనవాళ్ళందర్నీ చంపుకున్నాక ఇకనాకొనగూడే మేలేంటో నాకర్థం కావటం లేదు.

న కాంక్షే విజయం కృష్ణ! నచ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవిన్ద! కిం భోగైర్జీవి తేన వా ॥ 32

కృష్ణా! నాకీ విజయం, రాజ్యం, సుఖభోగాలేవీ వద్దు, అందర్నీ పోగొట్టుకున్నాక నాకీజీవితం వల్ల లాభమేంటి?

యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వాధనాని చ॥ 33

ఎవరికోసమై రాజ్యాన్ని, సుఖభోగాలను కోరుకున్నామో, వాళ్ళే యుద్ధంలో చావసిద్ధమై ఉన్నారు.

ఆచార్యాః పితర ః పుత్రా స్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబన్ధిన స్తథా ॥ 34

అదిగో! గురువులు, తాతలు,తండ్రులు, పుత్రులు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరుదులు మొదలగు బంధువులంతా ఇక్కడే ఉన్నారు.

ఏతాన్న హన్తుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక రాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35

కృష్ణా! త్రిలోకాధిపత్యం కోసమైనా వీళ్ళను నేనుచంపలేను., ఇక యీ రాజ్యం కోసమెలా చంపగలను?

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాత్ జనార్దన ।
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ॥ 36

వీళ్ళు నన్ను చంపవచ్చిన ఆతతాయులే ఐనా సరే వీళ్ళను చంపితే పాపమేగాని, సంతోషమెలా కలుగుతుంది?

తస్మాన్నార్హావయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాన్ధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37

కాబట్టి బంధువులైన ధృతరాష్ట్రసుతులను చంపరాదు, సొంతవాళ్ళను చంపుకుని ఎలాసుఖపడగలం?

యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38

వంశనాశనానికి, మిత్రద్రోహానికి పూనుకోవటమెంతటి పాపం, దోషమో రాజ్యలోభులైన దుర్యోధనాదులకు తెలియవు.

కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్ని వర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥ 39

కానీ, వంశనాశనానికి పూనుకుంటే కలిగే పాపమెంతో తెలిసిన మనమైనా పాపంనుండి ఎందుకు తప్పుకోరాదు?

కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవత్యుత ॥ 40

కులం నశిస్తే సనాతన కులధర్మాలన్నీ నశిస్తయ్. తద్వారా కులమంతా అధర్మంపాలౌతుంది.

అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయజాయతే వర్ణసఙ్కరః॥ 41

అధర్మం ప్రారంభమై విస్తరిస్తే కులస్త్రీలు దుష్ప్రవర్తనకు లోనౌతారు. స్త్రీలు దుష్టులైతే వర్ణసంకరం జరుగుతుంది.

సఙ్కరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదక క్రియా ॥ 42

వర్ణసంకర, వంశనాశన కారకుల కులమంతా నరకం పాలౌతుంది. పిండ, తర్పణోదక దాన విహీనులై వాళ్ళ పితరులు గూడ నరకాన పడతారు.

దోషైరేతైః కులఘ్నానాం వర్ణసఙ్కర కారకైః ।
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః॥ 43

కులనాశనం, వర్ణసంకర కారకుల దోషఫలితంగా అనాది జాతి, కుల ధర్మాలు, సమూలంగా శాశ్వతంగా నశిస్తాయి.

ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ॥ 44

కృష్ణా! కులధర్మ భ్రష్టులు తప్పక నరకనివాసులౌతారని నేను తరతరాలుగా వింటున్నాను.

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనముద్యతాః ॥ 45

అయ్యో! రాజ్య సుఖ లోభంతో స్వజనాలను చంపుకోటానికి పూనుకొని ఎంతటి ఘోర పాపానికొడిగట్టాం?

యదిమా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః।
ధార్తరాష్ట్రారణేహన్యుస్తన్మేక్షేమతరం భవేత్॥ 46

ధృతరాష్ట్ర పుత్రులు ఆయుధధారులై, నిరాయుధుడనై తిరిగిపోరాడని నన్నుచంపినా నాకు శ్రేయస్కరమే.

సఞ్జయ ఉవాచ –

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్న మానసః ॥ 47

సంజయుడన్నాడు –

అలా వాపోతూ ధనుర్బాణాలను జారవిడిచి, దుఃఖోద్విగ్న మనస్కుడై రథంలో కూలబడ్డాడర్జునుడు.

శ్రీమద్భగవద్గీతోపనిషత్తులలో, బ్రహ్మవిద్యనూ, యోగశాస్త్రాన్నీ, శ్రీకృష్ణార్జున సంవాద రూపమైన దానిలో –

అర్జున విషాదయోగం అనే పేరుగల మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయాధ్యాయం

సాంఖ్యయోగం

సఞ్జయ ఉవాచ –

తం తథా కృపయావిష్టమశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదన్తమిదం వాక్యమువాచ మధుసూదనః ॥ 1

సంజయుడన్నాడు –

కరుణా వివశుడై దుఃఖిస్తుండగా కన్నీటితో నిండి కలత బారిన కన్నులు గల అర్జునునితో శ్రీకృష్ణుడిలా అన్నాడు.

శ్రీభగవానువాచ –

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమ కీర్తికరమర్జున ॥ 2

శ్రీభగవానుడన్నాడు –

కష్టసమయంలో ఆర్యులకు తగనిది, స్వర్గ ప్రతిబంధకం, అపకీర్తి దాయకమూ ఐనట్టి యీ విషాదం నీకెక్కడ దాపురించిందర్జునా?

క్లైబ్యం మాస్మ గమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వో త్తిష్ఠ పరన్తప ॥ 3

శత్రుతపనుడా! పిరికితనానికి లోనుగాకు, నీచమైన హృదయ దౌర్బల్యాన్ని వదిలేసిలే, లేచినిలబడు!

అర్జున ఉవాచ –

కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥ 4

అర్జునుడన్నాడు –

కృష్ణా! పూజ్య భీష్మ ద్రోణాదులపై, బాణాలతో నేనెలా యుద్ధం చేయగలనూ?

గురూనహత్వా హి మహానుభావాన్
శ్రేయోభోక్తుం భైక్ష్యమపీహ లోకే ।
హత్వార్థకామాంస్తు గురూనిహైవ
భుఞ్జీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్ ॥ 5

మహానుభావులైన, గురువులను చంపి, వారి రక్తంతో తడిసిన సిరిసంపదలు, భోగభాగ్యాల ననుభవించుటకంటె, భిక్షాన్నం తినుట మేలు కదా?

న చైతద్విద్మః కతరన్నో గరీయో
యద్వా జయేమ యది వానోజయేయుః ।
యానేవ హత్వాన జిజీవిషామ
స్తే వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6

మనం వారినా, వారు మనల్నా ఎవరు జయించుట శ్రేయస్కరమో తెలుసుకోలేక పోతున్నాను. ఎవర్నిచంపుకొని జీవించనిష్టపడమో, ఆ కౌరవులే మనకెదురుగా నిల్చియున్నారు.

కార్పణ్యదోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసంమూఢచేతాః।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తే హం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

దుర్బల దుఃఖదోషానికి లోనైన నా మనసు ధర్మాధర్మవివేకాన్ని కోల్పోయింది. అందుకే నిన్ను ప్రార్థిస్తున్నా. నాకేది శ్రేయస్కరమో

నీవేనిశ్చయించి చెప్పు. నేను నీ శిష్యుడనై శరణువేడుతున్నా నాకు ప్రబోధించు!

న హి ప్రపశ్యామి మమాపనుద్యాద్
యచ్ఛోకము చ్ఛోషణమిన్ద్రి యాణామ్ ।
అవాప్యభూమావసపత్న మృద్ధం
రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥ 8

శత్రురహిత, సకల సంపత్సమేత భూలోక రాజ్యమూ, స్వర్గాధిపత్యం ప్రాప్తించినా, నా ఇంద్రియాలను శుష్కింపజేస్తున్న నా దుఃఖాన్ని శమింపజేసేది కనిపించేలా లేదు.

సఞ్జయ ఉవాచ –

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరన్తపః ।
నయోత్స్య ఇతిగోవిన్దముక్త్వా తూష్ణీం బభూవ హ॥ 9

సంజయుడన్నాడు –

కృష్ణునితో అలా చెప్పి నేను యుద్ధం చేయనని మౌనం దాల్చి కూర్చున్నాడర్జునుడు.

తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।
సేనయోరుభయోర్మధ్యేవిషీదన్తమిదం వచః ॥ 10

ఉభయసేనలమధ్యవిషాదమగ్నుడైయున్న అర్జునునితో నవ్వులాడుతున్నట్లు కృష్ణుడిలా అన్నాడు.

శ్రీభగవానువాచ –

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తిపణ్డితాః॥ 11

శ్రీకృష్ణభగవానుడన్నాడు –

శోకింపదగని (అధర్మాత్ములైన) వారికోసం శోకిస్తున్నావు, మళ్ళీ జ్ఞానిలా మాట్లాడుతున్నావు. యదార్ధ జ్ఞానులు మృతులకోసంగానీ, సజీవుల కోసంగాని శోకింపరు.

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామ ః సర్వే వయమతః పరమ్ ॥ 12

ఒకప్పుడు నేనులేననీ, నీవూ, యీరాజులూ లేరనీ, ఇకముందు ఉండబోమన్నదీ లేనేలేదు.

దేహినో స్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తరప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి ॥ 13

కౌమార, యౌవన, వార్ధక్యాలు దేహానికెలాగో, ఆత్మకు మరో దేహధారణ అలాగేనన్న అనుభూతితో శాంతించిన వారు అందుకు చింతించరు.

మాత్రాస్మర్శాస్తు కౌన్తేయ శీతోష్ణసుఖదుఃఖదాః।
ఆగమాపాయినో నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

విషయ, ఇంద్రియాల సంయోగం వల్లనే శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కల్గుతున్నాయి. ఆదీ, అంత్యంగల అశాశ్వతాలివి. కాబట్టి ఓర్పుతో వాటిని సహించు అర్జునా!

యం హి న వ్యథయ న్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15

సుఖదుఃఖాది ద్వంద్వాలను సమంగా చూస్తూ వాటికి బాధపడని ధీరుడే మోక్షానికర్హుడు!

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోన్త స్త్వనయోస్తత్త్వదర్శిభిః ॥ 16

అసత్ (అసత్యానికి) శాశ్వత ఉనికీ లేదు. సత్(సత్యాని)కి వినాశమూలేదు. సదసద్వస్తు వాస్తవికత నిలా గుర్తించారు తత్త్వవేత్తలు.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి ॥ 17

ఈ విశ్వమంతా విస్తరించియున్నదాని(ఆత్మ)కి నాశనం లేదనీ, మార్పులేని దానిని ఎవరూ నశింపజేయలేరనీ తెల్సుకో!

అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః।
అనాశినో ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥ 18

నిత్యము, అవినాశి, అపరిమితము ఐన ఆత్మదాల్చుదేహాలు అశాశ్వతాలంటున్నారు. కాబట్టి (వాటికొరకు దుఃఖించక) యుద్ధం చేయి అర్జునా!

య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥ 19

ఆత్మచంపుతుందనీ, చంపబడుతుందనీ భావించే యిరువురూ జ్ఞానులు కారు, (ఎందుకంటే) ఆత్మ చంపదు, చంపబడదు.

నజాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వా భవితా వానభూయః ।
అజోనిత్యః శాశ్వతో యం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

ఆత్మ పుట్టేది, గిట్టేది కాదు, ఒకప్పుడుండి యింకొకప్పుడు లేకుండా పోయేదీకాదు. పుట్టుకలేని నిత్యము, శాశ్వతము, పురాతనము ఐనది ఆత్మ. శరీరం చంపబడినా, చావదు ఆత్మ.

వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హ న్తికమ్ ॥ 21

ఆత్మ పుట్టుకలేనిది, తరగనిది, పెరగనిది, మారనిది, నాశనంలేనిదని తెల్సినవాడు దాన్నెలా చంపగలడు? చంపించగలడు?

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో వరాణి।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥22

మనిషి చినిగిన వస్త్రాలను వదిలి, నూతన వస్త్రాన్ని ధరిస్తున్నట్లే, పనికిరాని దేహాన్ని వదిలి కొత్త దేహాన్ని ధరిస్తుంటుంది ఆత్మ.

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥ 23

ఆత్మను శస్త్రాలు చేధించలేవు, అగ్ని దహించలేదు, నీరు తడుపలేదు, గాలి శుష్కింపచేయలేదు.

అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః ॥ 24

నరకను, కాల్చను, తడపను, ఎండించను అసాధ్యమైన ఆత్మ నిత్యం, నిశ్చలం, సనాతనం, సర్వవ్యాపితం.

అవ్యక్తోఽయమచిన్త్యోఽయ మవికార్యోఽయముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హ సి ॥ 25

అగోచరం, అవ్యయం, అనూహ్యమైనది ఆత్మయని తెలుసుకో, దుఃఖించకు అర్జునా!

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥ 26

ఒకవేళ ఆత్మకు చావు పుట్టుకలున్నవని నీవు భావించినప్పటికీ దుఃఖించరాదు (ఎందుకంటే)

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ ।
తస్మాదపరిహార్యేఽర్థేనత్వం శోచితుమర్హసి ॥ 27

పుట్టిన దానికి చావు, చచ్చినదానికి పుట్టుకా తప్పదు. అలా తప్పనిసరైనా దానికోసం నీవు దుఃఖించరాదు మరి!

అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28

పుట్టకముందు కనిపించవు, పుట్టాక కనిపిస్తాయి, చచ్చాక మళ్ళీ కనిపించవు ప్రాణులు. మరి యీ మాత్రం దానికి దుఃఖించాల్సిన పనేముంది?

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవచ్చై నమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥ 29

ఆత్మను అద్భుతమైన దాన్నిగ చూస్తారు కొందరు –అద్భుతమైందని చెబుతారు కొందరు, అద్భుతమైనదని వింటారు కొందరు. తదితరులు ఎంత విన్నా ఆత్మను గూర్చియే మాత్రం గ్రహించలేరు.

దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత !
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥ 30

దేహాలన్నింటా నివసించు ఆత్మ ఎప్పటికీ చంపనలవికానిది. కాబట్టి ఏ ప్రాణికొరకూ దుఃఖించరు అర్జునా!

స్వధర్మ మపిచావేక్ష్య న వికమ్పితుమర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్క్ష త్రియస్య న విద్యతే ॥ 31

నీ స్వధర్మానుగుణంగా చూసినా చలించాల్సిన పనిలేదు. క్షత్రియునకు ధర్మయుద్ధం కన్నా శ్రేయస్కరమైనది లేదు గదా!

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థలభన్తేయుద్ధ మీదృశమ్ ॥ 32

అప్రయత్నంగా తెరుచుకున్న స్వర్గం వంటిది ధర్మయుద్ధావకాశం. ఇది లభించిన క్షత్రియులు ధన్యులు.

అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తించ హిత్వాపాపమవాప్స్యసి ॥ 33

నీవీ ధర్మయుద్ధాన్ని విడనాడితే స్వధర్మాన్నీ కీర్తినీ పోగొట్టుకొని పాపాన్ని మూటగట్టుకుంటావు.

అకీర్తి ఞ్చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥ 34

ప్రజలు సదా నీ యపకీర్తిని ప్రస్తావించుకుంటుంటారు. మాన్యునకు మరణంకన్నా బాధాకరమైనది అపకీర్తి!

భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।
యేషాం చత్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35

మహారథులంతా నీవు భయపడి యుద్ధాన్ని విరమించావని భావిస్తారు. నిన్ను గౌరవంగా చూస్తున్న వారందరూ ఇక చులకనగా చూస్తారు.

అవాచ్యవాదాంశ్చ బహూన్వదిష్యన్తి తవాహితాః ।
నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

విరోధులు నీ సామర్థ్యాన్ని నిందిస్తారు. అనరాని మాటలంటారు. నిన్ను – అంతకన్నా దుర్భరమేముంటుంది?

హతోవా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వాభోక్ష్యసే మహీమ్ ।
తస్మాదు త్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

చంపబడితే స్వర్గాన్ని, జయించితే భూ రాజ్యాన్ని భోగిస్తావు.కాబట్టి యుద్ధానికి కృతనిశ్చయుడవై లెమ్ము.

సుఖదుఃఖే సమే కృత్వాలాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥ 38

సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలను సమంగా భావించి, యుద్ధానికి పూనుకో అప్పుడు నీకు పాపమంటదు.

ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥ 39

ఇప్పటిదాకా నీకు ఆత్మానుభూతి విషయిక జ్ఞానబోధ చేశాను. ఇక కర్మయోగ విషయిక జ్ఞానాన్ని బోధిస్తాను. దాన్తో నీవు కర్మబంధం నుండి విముక్తుడవౌతావు.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

దీన్ని (నిష్కామకర్మను) ప్రారంభించి పూర్తిచేయలేకపోయినా, అది విఫలంకాదు. వ్యతిరేకఫలితాలను కలిగించదు. ఈ ధర్మాన్ని కొద్దిగ ఆచరించినా గొప్పభయాన్నుండి కాపాడుతుంది.

వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునన్దన ।
బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్ ॥ 41

కర్మయోగమునందు బుద్ధియేకాగ్రమై ఉంటుంది.దీన్ని పాటించని వారి బుద్ధులు చంచలములై, బహుశాఖలుగా చీలి, అనంతాలుగా, బహువిధాలుగ ఉంటాయి.

యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్య విపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్యద స్తీతివాదినః ॥ 42

అవివేకులు పలు కోర్కెలతో స్వర్గప్రాప్తినే పరమలక్ష్యంగా భావించి, వేదోక్త ప్రశంసావాక్యాల కానందిస్తూ, ఇంతకన్నా మేలైనది (ఈశ్వరతత్త్వమేది) లేదని వాదిస్తుంటారు.

కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।
క్రియా విశేష బహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43

వాంఛాపరులు, స్వర్గకాములు, కర్మల వల్ల కలిగే జన్మలకొరకు, భోగైశ్వర్యప్రాప్తికీ, లాభదాయకకర్మాచరణకూ ప్రోత్సహిస్తున్నారు.

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥ 44

భోగైశ్వర్య లాలసులకు అట్టివారిచే ఆకర్షింపబడు బుద్ధిగలవారికీ (ఈశ్వరునిపట్ల) స్థిర నిశ్చయం, దృఢ విశ్వాసం కలుగనేరవు.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వన్ద్వో నిత్యస త్త్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్ ॥ 45

వేదాలు త్రిగుణాలను గూర్చి చెప్పేవి, కాబట్టి నీవు త్రిగుణాలకు ద్వంద్వాల కతీతుడవై, సర్వదాసమబుద్ధితో ఉండు. సంపాదనలో దీన్ని కాపాడుకోవటంలో నిమగ్నుడవు కాక, ఆత్మయందే సుస్థిరుడవై ఉండు.

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।
తావాన్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

అంతటా వెల్లువగా నీరున్నచోట బావి వలన ఏ పాటి ప్రయోజనమో ఆత్మజ్ఞానాన్ని సాధించిన జ్ఞానికి వేదాల వలన అంతే ప్రయోజనం.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూర్మా తేసఙ్గోఽస్త్వకర్మణి॥ 47

కర్మచేయుట యందేగాని, కర్మఫలం మీద నీకధికారంలేదు. అందువలన కర్మఫలం మీదగానీ, కర్మల విరమణ యందు గానీ మక్కువ చూపకు, అర్జునా!

యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ ।
సిద్ధ్యసిద్ధ్యోఃసమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

యోగమందు సుస్థిరుడవై, ఆసక్తిరహితంగా, సిద్ధినీ, అసిద్ధినీ సమభావంతోచూస్తూ ఉండు అర్జునా!

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనఞ్జయ ।
**బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాఃఫలహేతవఃఃః

యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రి యార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

తాబేలు అంగాలను తనలోకి ముడుచుకున్నట్లే, ఇంద్రియ సుఖాల వెంట పడనివ్వక, తన ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకోగల్గిన వాని జ్ఞానం సుస్థిరమైనది.

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

ఇంద్రియ సుఖాల్ని అనుభవించటం మానేసిన వానినుండి అవి తొలగి పోతాయిగానీ, వాటిపట్ల అతనికి వాంఛమిగిలే ఉంటుంది. పరమాత్మను దర్శించగల్గిన వానిలో ఆవాంఛ కూడ నశిస్తుంది.

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః।
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥ 60

సదా సిద్ధత్వం కోసం యత్నిస్తున్న వివేకికైనా, ఇంద్రియాలు లొంగక అతని మనస్సును బలంగా ఆకర్షిస్తూనే ఉంటాయి.

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః।
వశేహి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

సుస్థిర చిత్తుడు జితేంద్రియుడై, పరమాత్ముడవైన నాయందే బుద్ధినిలిపి యుంచుతాడు. జితేంద్రియుని జ్ఞానమే సుస్థిరమైనది.

ధ్యాయతో విషయాన్పుంసః సఙ్గస్తేషూపజాయతే ।
సఙ్గాత్ సఞ్జాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ॥ 62

విషయాలపట్ల ధ్యాసగలవానికి వాటిపట్ల ఆసక్తీ, ఆసక్తినుండి కామం, కామంనుండి కోపం జనిస్తాయి.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతి భ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 63

కోపం నుండి మూఢత, దానివల్ల మతిమరుపు, దానివల్ల యుక్తాయుక్త వివేక నాశనం కల్గుతయ్.

రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥ 64

సుస్థిరచిత్తుడు మాత్రం జితేంద్రియుడై, ప్రియప్రియాల కతీతుడై ఇంద్రియ విషయాలమధ్య సంచరిస్తూనే ఉంటాడు.

ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥ 65

చిత్తప్రశాంతి నందిన వాని దుఃఖాలు నశిస్తాయి. ఎందుకంటే ప్రశాంత చిత్తనిబుద్ధి, త్వరితంగా ఆత్మయందు ప్రతిష్ఠమౌతుంది.

నాస్తి బుద్ధిరయుక్తస్య నచాయుక్తస్యభావనా ।
న చాభావయతః శాన్తిరశాన్తస్య కుతః సుఖమ్ ॥ 66

అస్థిరచిత్తులకాత్మ జ్ఞానం, ధ్యానంకూడా ఉండదు. ధ్యానహీనులకు శాంతీ, శాంతిలేని వారికి సుఖమూ ఉండవు.

ఇంద్రియాణాం హి చరతాం యన్మనో నువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివామ్భసి ॥ 67

నీటిమీది నావను గాలి తనవెంట లాక్కెళ్ళినట్లే, ఇంద్రియ సుఖాల వెంట పరెగెత్తే మనసు అతని వివేకాన్నిగూడ తనవెంట లాక్కుపోతుంది.

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

తన ఇంద్రియాలను, ఇంద్రియ విషయాలనుండి పూర్తిగా నిగ్రహించుకోగల్గిన వాని జ్ఞానమే సుస్థిరంగా ఉంటుంది.

యా నిశా సర్వభూతానం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69

జీవులన్నింటికీ రాత్రిగా (ఏకత్వంకన్పించక) ఉన్నపుడు వశీకృతాత్ముడు వేల్కొని (ఏకత్వాన్ని) చూస్తూ ఉంటాడు. జీవులన్నీ వేల్కొని (భౌతికసుఖాలకోసం వెంపర్లాడుతూ) ఉన్నపుడు, జ్ఞాని (లౌకిక విషయాలు పట్టించుకోక) రాత్రిలో ఉండిపోతాడు.

ఆపూర్యమాణమచల ప్రతిష్ఠం సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే సశాన్తి మాప్నోతి నకామ కామీ ॥ 70

నదులెంత నీటిని తెచ్చి తనను నింపుతున్నాతొణకని సముద్రం లాగే ఎడతెగని కోర్కెల ప్రవాహానికి చలించని ముని శాంతినందుతాడు. కోర్కెలతో విషయలోలు డైనవాడు శాంతికి దూరమౌతాడు.

విహాయ కామాన్య ః సర్వాన్పుమాంశ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహఙ్కారః స శాన్తిమధిగచ్ఛతి ॥ 71

కోర్కెలను, 'నేను' అనే అహంకారాన్నీ 'నాది'యనే మమకారాన్నీ, త్యజించి, సుఖదుఃఖాల పట్ల స్పృహలేక యుండువాడు శాంతిని పొందుతాడు.

ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ! నైనాం ప్రాప్యవిముహ్యతి ।
స్థిత్వాఽస్యామన్తకాలేఽ పి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥ 72

ఆధ్యాత్మిక స్థితికి చేరిన వారిక మోహగ్రస్తులు కాలేరు. జీవిత చరమాంకం లోనైనా సరే, యీ స్థితికి చేరినవారు బ్రహ్మంలో ఐక్యమౌతారు.

సాంఖ్య యోగమనే పేరుగల రెండవ అధ్యాయం సమాప్తం

తృతీయాధ్యాయం

కర్మ యోగం

అర్జున ఉవాచ –

జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన !
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

అర్జునుడన్నాడు –

కృష్ణా! కర్మ కంటే జ్ఞానం శ్రేష్ఠమన్నది నీ అభిమతమైతే, మరి నన్నెందుకీ ఘోరకర్మకు నియోగిస్తున్నావు?

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్ ॥ 2

పరస్పర విరుద్ధాలైన నీ మాటలతో నా బుద్ధిని తికమక పెడుతున్నావు. దేనివలన నాకు శ్రేయస్సుకలుగుతుందో దాన్నొక్కదాన్నే నిశ్చితంగా తెలియజేయి.

శ్రీ భగవానువాచ –

లోకేఽస్మిన్ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

అర్జునా! సృష్ట్యాదియందు లోకంలో ధ్యానశీలురకు జ్ఞానమార్గాన్ని, కర్మశీలురకు కర్మమార్గాన్నీ రెండు నిష్ఠలనూ తెలియజేశాను.

న కర్మణామనారమ్భాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

కర్మము చేయనంత మాత్రాన మనిషి ఆత్మస్వరూపావస్థితిని పొందలేడు. కర్మసన్యానం చేసినంతమాత్రాన నైష్కర్మ్య సిద్ధిని పొందలేడు.

నహి కశ్చిత్క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మసర్వః ప్రకృతిజైర్గుణైః॥ 5

కర్మలు చేయకుండా మనిషి క్షణమైనా ఉండలేడు. ప్రకృతి జనిత గుణాలచే బద్దులై సర్వజనులూ ఇష్టమున్నా, లేకున్నా కర్మలుచేస్తూనే ఉంటారు.

కర్మేంద్రియాణి సంయమ్య య ఆ స్తే మనసా స్మరన్ ।
ఇన్ద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ 6

కర్మేంద్రియాలను నిగ్రహించి, ఇంద్రియ విషయాలను మనసులో స్మరిస్తూ ఉండు, విమూఢుడు కపటి అనబడతాడు.

యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।
కర్మేన్ద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే ॥ 7

కానీ, మనసుచేత ఇంద్రియాలను నిగ్రహించి, నిస్సంగుడై, కర్మేంద్రియాలతో కర్మయోగ మారాన్ని అనుసరించు, మానవుడు శ్రేష్ఠుడు.

నియతం కురుకర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపిచ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥ 8

నీవు సదా శాస్త్ర నిర్దిష్ట కర్మలనుచేస్తూ ఉండు. ఏలన కర్మలు చేయక ఉండడం కంటే చేయడమే శ్రేష్ఠం. కర్మ చేయకుంటే నీదేహపోషణగూడ జరగదు.

యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః ।
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసఙ్గః సమాచర ॥ 9

కౌంతేయా! యజ్ఞార్థం (ఈశ్వరప్రీత్యర్థం) చేసే కర్మలు తప్ప, తక్కిన కర్మలు కర్మాధికారిని బంధిస్తాయి, కాబట్టి కోర్కెల్ని వీడి ఈశ్వరప్రీత్యర్థం కర్మలు చేస్తుండు.

సహయాజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వమేష వోఽస్త్విష్ట కామధుక్ ॥ 10

పూర్వం బ్రహ్మయజ్ఞంతో పాటు ప్రజలను సృష్టించి వారికిలా చెప్పాడు. యజ్ఞం చేత మీరు వృద్ధి చెందుతారు. కామధేనువులా మీకోర్కెల్ని తీర్చుతుంది యజ్ఞం!

దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః ।
పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ॥ 11

యజ్ఞంతో ప్రకృతి దేవతలకు ప్రీతి కలిగించండి. దేవతలు మీకు తృప్తి కలిగిస్తారు. పరస్పరం మీరిలా ప్రీతిని కలిగించుకుంటూ పరమశ్రేయాన్ని పొందెదరుగాక.

ఇష్టాన్భోగాన్హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తాన ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

మీ యజ్ఞంతో సంతుష్టులై మీరు వాంఛించే భోగాలనిస్తారు ప్రకృతి దేవతలు. అట్టి మీ భోగ ప్రదాత లైన దేవతల కర్పించకుండ, వాటి ననుభవించువాడు దొంగయే.

యజ్ఞ శిష్టాశినః సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మ కారణాత్ ॥ 13

యజ్ఞ (సమిష్టికృషి) ఫలంలో (అందరికీ పంచాక) మిగిలిన దానిని తినువారు పాపవిముక్తులు. అంతా తామేవండుకు తినువారు పాపాన్నే తింటున్నారు.

అన్నాద్భవ న్తి భూతాని పర్జన్యాదన్న సమ్భవః ।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥ 14

ప్రాణులన్నీ అన్నంనుండి – అన్నం వర్షంనుండి – వర్షం యజ్ఞం (ప్రకృతి శక్తుల) నుండి యజ్ఞం వేదవిహిత కర్మలనుండి జనిస్తాయి.

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15

కర్మ వేదనిర్దిష్టం, వేదం అవినాశియైన బ్రహ్మజనితమని తెలుసుకో. సర్వవ్యాపియైన వేదం, యజ్ఞమందు సుస్థిరంగా ఉంటుంది.

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।
అఘాయురిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

అర్జునా లోకాన (ఈశ్వరునిచే) ప్రవర్తింపబడిన కర్మచక్రాన్ని అనుసరింపక, ఇంద్రియ సుఖాలకోసం వెంపర్లాడు పాపాత్ముని జీవితం వ్యర్థం.

యస్త్వాత్మరతి రేవ స్యాదాత్మతృ ప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సన్తుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ 17

ఆత్మయందే ప్రీతితో, ఆత్మవల్లనే తృప్తిపడుతూ, ఆత్మయందే ఆనందించు వానికి కర్తవ్యాకర్యాలేమీలేవు.

నై వ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥ 18

అట్టి ఆత్మజ్ఞానికి లోకాన కర్మచేసి సాధించాల్సిన ప్రయోజనమేమీ లేదు. కర్మచేయకున్నా అతనికెట్టి నష్టమూ లేదు. అతను దేనికీ, ఎవర్నీ ఆశ్రయించాల్సిన పనిలేదు.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర
అసక్తో హ్యాచర న్కర్మ పరమాప్నోతి పూరుషః ॥ 19

వేటినీ పట్టించుకోక సదా నీకర్తవ్య కర్మలు చేస్తూ ఉండు. అలా దేన్నీ ఆశించక తనకర్తవ్య కర్మలు నిర్వహించువాడు పరమాత్మను చేరుతాడు!

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।
లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥ 20

అట్లు కేవల కర్తవ్య కర్మాచరణం వల్లనే జనకాదులు సిద్ధిని పొందారు. ఇంకా ప్రజల మార్గదర్శకత్వం కోసం కర్మలనాచరించాలి.

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః ।
సయత్ ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ 21

శ్రేష్ఠుడేపనులు చేస్తే సామాన్య ప్రజలాపనులే చేస్తుంటారు. కార్యరూపాన శ్రేష్ఠుడు దేన్నీ ప్రామాణికంగా నిర్ణయిస్తాడో, దాన్నే అనుసరిస్తుంటుంది లోకం.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కిఞ్చన ।
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

పార్థా! ముల్లోకాల్లో నాకు కర్తవ్యమన్నదే లేదు. నేను సాధించాల్సింది గానీ, నాకు సాధ్యం కానిది గానీ లేదు. ఐనా నేనుకర్మలు చేస్తూనే ఉంటాను.

యది హ్యహం న వర్తేయం జాతుకర్మణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

అలసట అనుకోక సదా నేను కర్మాచరణ చేయకుంటే, మనుషులంతా నామార్గాన్నే అనుసరిస్తుంటారు.

ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సఙ్కరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః ॥ 24

నేను కర్మలు చేయకుంటే లోకాలు నశిస్తాయి. వర్ణసాంకర్యకారకుడనై, ప్రజలకు చేటు కలిగించినవాడనౌతాను.

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।
కుర్యాద్విద్వాంస్తథాఽసక్తశ్చికీర్షుర్లోక సంగ్రహమ్ ॥ 25

కర్మాసక్తులై పామరులు పనులు చేస్తున్నట్లే జ్ఞానులు ఫలాపేక్షరహితంగా ప్రపంచ కళ్యాణవాంఛతో పనిచేయాలి.

న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసఙ్గినామ్ ।
యోజయేత్సర్వ కర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్ ॥ 26

కర్మాసక్తుల బుద్ధిని ప్రాజ్ఞులు చలింపజేయరాదు. జ్ఞాని ఫలాపేక్షరహితంగా పనిచేస్తూనే ప్రజలను వాళ్ళ పనులనలా చేస్తుండేందుకు ప్రోత్సహించాలి మరి.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహఙ్కారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥ 27

ప్రకృతిలోనిత్రిగుణాలే పనులన్నింటినీ చేయిస్తుంటయ్. కానీ అజ్ఞానాహంకారియైన మనిషి తానే కర్తనని భావిస్తుంటాడు.

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః।
గుణాగుణేషువర్తన్తే ఇతి మత్వాన సజ్జతే ॥ 28

గుణ కర్మవిభాగాన్ని వాస్తవంగా తెలిసినవాడు, ఇంద్రియాల గుణాలు, విషయాల గుణాలపట్ల ఆకర్షింపబడు తున్నాయే గాని, ఆత్మనిష్క్రియ మైనదని గ్రహిస్తాడు. అట్టి జ్ఞాని ఆసక్తుడు కాడు.

ప్రకృతేర్గుణ సంమూఢాః సజ్జన్తే గుణకర్మసు ।
తానకృత్స్ను విదో మన్దాన్కృత్స్ను విన్న విచాలయేత్ ॥ 29

ప్రకృతి గుణాలచే మూఢతనంది ఇంద్రియ వ్యాపారాలందు నిమగ్నులైయున్న అల్పజ్ఞుల బుద్ధిని పూర్ణజ్ఞానులు చలింపచేయరాదు.

మయి సర్వాణి కర్మాణి సంన్యస్యాధ్యాత్మ చేతసా ।
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వర ఃఃః

అర్జునుడన్నాడు –

కృష్ణా! యిష్టం లేకున్నాసరే. దేని ప్రేరణచేత మనిషి బలవంతంగా పాపం చేస్తున్నాడు?

శ్రీభగవానువాచ –

కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ 37

శ్రీకృష్ణభగవానుడన్నాడు –

రజోగుణం నుండి పుట్టి సంతృప్తి పరచసాధ్యంకాని మహాపాపి కామం, కోపం దానిమరోరూపం. లోకంలోకల్లా శత్రువు కామమేనని తెలుసుకో!

ధూమేనా వ్రియతే వహ్ని ర్యథాదర్శో మలేన చ ।
యథోల్బేనావృతో గర్భస్తథా తే నేదమావృతమ్ ॥ 38

పొగ అగ్నిని–మురికి అద్దాన్ని – మావి పిండాన్నీకప్పివేసినట్లే, కామం జ్ఞానాన్ని కప్పివేస్తుంది.

ఆవృతం జ్ఞానమే తేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణా నలేన చ ॥ 39

జ్ఞానులకు నిత్యవైరి, తృప్తిపరచనసాధ్యమైనది ఐన ఈ కామాగ్ని చేత జ్ఞానం మరుగుపడుతున్నది.

ఇన్ద్రియాణి మనో బుద్ధిర స్యాధిష్ఠానముచ్యతే ।
ఏతైర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥ 40

కామానికి ఉనికిపట్టు మనసు, బుద్ధి, ఇంద్రియాలు అని చెబుతున్నారు. ఇవి జ్ఞానాన్ని కప్పివేసి మనిషిని మోహితుణ్ణి చేస్తున్నాయి.

తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌనియమ్య భరతర్ష భ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥ 41

కాబట్టి తొలుత ఇంద్రియాల నరికట్టి, జ్ఞానవిజ్ఞానాల నాశనకారియైన, పాపరూపియైన కామాన్ని నశింపజేయి.

ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42

దేహంకన్నా ఇంద్రియాలు – వాటికన్నా మనసు – దానికన్నాబుద్ధి, బుద్ధికన్నా ఆత్మ శ్రేష్ఠ మైనవని అంటున్నారు.

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సం స్తభ్యాత్మానమాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43

బుద్ధికన్నా శ్రేష్ఠుడైన ఆత్మయొక్క జడప్రకృతిని, ఆత్మయొక్క ఉత్తమ ప్రకృతిచేత అరికట్టి పట్ట శక్యంగాని కామాన్ని రూపుమాపు.

"కర్మయోగం" అనే పేరుగల మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థ ధ్యాయం

జ్ఞాన యోగం

శ్రీభగవానువాచ –

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।
వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాక వేఽబ్రవీత్ ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

అవ్యయఫలమునిచ్చు ఈ యోగాన్ని సూర్యునకు బోధించగా, సూర్యుడు మనువుకు, మనువు ఇక్ష్వాకునకు బోధించారు.

ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప ॥ 2

ఇలా పరంపరాగతంగా ఈ యోగం రాజర్షులకు తెలిసింది. కానీ, సుదీర్ఘ కాలక్రమాన ఇది లోకంలో లుప్తమై పోయింది అర్జునా!

స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోఽసి మేసఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥ 3

నీవు నా మిత్రుడవు, భక్తుడవు గనుక, యీ పురాతన యోగాన్ని నేడు నీకు తెలియజేశాను. ఇది అత్యుత్తమ రహస్యం!

అర్జున ఉవాచ –

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥ 4

అర్జునుడన్నాడు –

సూర్యుడు ముందు పుట్టి తర్వాత నీవు పుట్టావు. మరి, ఆదికాలంలోనే నీవతనికి చెప్పానంటున్నావు. దీన్నెలా అర్థం చేసుకోవాలి?

శ్రీభగవానువాచ –

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరన్తప ॥ 5

శ్రీకృష్ణభగవానుడన్నాడు–

అర్జునా నీకూ, నాకూ పెక్కు జన్మల గడిచినయ్. ఇదినాకు తెలుసు, నీకు తెలియదు.

అజోఽపి సన్న వ్యయాత్మా భూతానామీశ్వరోఽపిసన్।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సమ్భవామ్యాత్మమాయయా ॥ 6

జన్మరహితుడను నేను, మార్పులేని అవ్యయాత్ముడను. ప్రాణులన్నింటికీ ఈశ్వరుడను ఐనా ప్రకృతిని స్వాధీనం చేసుకుని, నా దివ్యశక్తితో అవతరిస్తుంటాను.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 7

అర్జునా! ధర్మానికి హానికలిగి, అధర్మం పెరిగి పోయినప్పుడల్లా దేహం దాల్చి జన్మిస్తుంటాను.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8

దుర్జనుల్ని శిక్షించి, సజ్జనుల్ని కాపాడి, ధర్మాన్ని సంస్థాపించేందుకు యుగయుగంలో అవతరిస్తుంటాను నేను!

జన్మకర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తితత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥ 9

నా దివ్య జన్మల వాస్తవాన్నిలా గ్రహించిన వాడు మరణానంతరం పునర్జన్మించక నన్ను పొందుతాడు.

వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః ।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః ॥ 10

అనురాగ, క్రోధ, భయరహితులై, మనసు నాయందే నిలిపి, నన్నాశ్రయించి ఆత్మజ్ఞానాగ్నిచేత పవిత్రులై పలువురు నాతో ఐక్యమందారు.

యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్!
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః॥ 11

ఎవరేమార్గంలో నన్ను ఉపాసిస్తే వారికామార్గంలోనే ఇష్టార్థ సిద్ధిని ప్రసాదిస్తాను. వివిధ మార్గాలగుండా మానవులు నాదారికే వస్తున్నారు.

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥ 12

లోకాన కర్మఫలాన్నాశిస్తూ దేవతలను ఉపాసిస్తుంటారు మనుషులు. ఎందుకంటే, మనుజలోకాన కర్మసిద్ధి త్వరితంగా కలుగుతుంది.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥ 13

గుణాలను, కర్మలను బట్టి నేను నాల్గుకులాల నేర్పరచాను. ఈ చాతుర్వర్ణానికి కర్తను నేనే. ఐనా నేను అవ్యయుడననీ, కర్మచేయని వాడననీ గ్రహించు.

న మాం కర్మాణి లిమ్పన్తిన మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥ 14

నాకు కర్మఫలాలపై కోర్కెలేనందున, కర్మలు నన్నంటవని తెలుసుకున్నవారు కర్మలచే బంధింపబడరు!

ఏవం జ్ఞాత్వా కృతం పూర్వైరపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 15

ప్రాచీన కాలపు మోక్షార్థులు కూడకర్మలు చేశారు. పూర్వులెలాచేశారో, అలా నీవు కర్మలుచేయి.

కిం కర్మ కిమకర్మేతి కవయో ప్యత్ర మోహితాః ।
తత్తేకర్మ ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్ ॥ 16

కర్మాకర్మలను గ్రహించుటలో సిద్ధపురుషులు సైతం తికమకపడుతున్నారు. అట్టి కర్మతత్వాన్ని చక్కగా వివరిస్తాను. దాన్నితెలుసుకుని నీవీ సంసార చక్రం నుండి విముక్తుడివి కమ్ము!

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యఞ్చ వికర్మణః ।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17

ఈ కర్మతత్వాన్ని ఆవశ్యంగా తెలుసుకోవాలి. ఎందుకంటే కర్మస్వభావం గ్రహింప నశక్యమైనది. వికర్మ (చేయరానిపని) అకర్మలయొక్క తత్వాన్ని గూడ గ్రహించాలి.

కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్మనుష్యేషు సయుక్త ః కృత్స్నకర్మకృత్ ॥ 18

కర్తృత్వ బుద్ధిరహితంగా చేసినది అకర్మ (బంధించనికర్మ)గాను-కర్తృత్వ బుద్ధితో చేసినది అకర్మ ఐనా సరే దాన్ని (బంధించు) కర్మగానే గ్రహించినవాడే మేధావి, యోగి, కృతకృత్యుడు.

యస్య సర్వే సమారమ్భాః కామసఙ్కల్పవర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః॥ 19

ఎవని కర్మలు ఫలాపేక్షకర్తృత్వాభిమాన రహితాలో. ఎవని కర్మఫలాలు ఆత్మజ్ఞానాన్ని చేత దగ్ధమౌతాయో అట్టి వానిని ప్రాజ్ఞుడంటారు విజ్ఞులు.

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మణభిప్రవృత్తో పినైవ కిఞ్చిత్క రోతి సః ॥ 20

కర్మఫలాక్తిని వీడి, నిత్య సంతృప్తుడై, దేనిమీదా ఆధారపడనివాడు కర్మలు చేసినా నిష్కర్ముడే.

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 21

వాంఛారహితుడై, మనోదేహాలను వశపరచుకొని, సర్వస్వాన్ని విడనాడినవాడు. కేవలమతని దేహమే పనిచేస్తున్నందున అతడు బంధింపబడడు.

యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22

అప్రయత్నంగా ప్రాప్తించిన వాటితో సంతృప్తుడై, సుఖదుఃఖాది ద్వంద్వాల కతీతుడై అసూయ రహితుడు, జయాపజయాలపట్ల ఉదాసీనుడైనవాడు కర్మలు చేస్తున్నాబంధింపబడడు!

గతసఙ్గస్య ముక్తస్య జాకఞనావస్థిత చేతసః ।
యజ్ఞాయాచరతః కర్మసమగ్రం ప్రవిలీయతే ॥ 23

ఆసక్తి రహితుడు, విముక్తుడు, జ్ఞాన సుప్రతిష్ఠిత బుద్ధికలవాడు చేయు కర్మలన్నీ లోకకళ్యాణదాయకాలే గనుక అవి లయిస్తాయి. బంధింపబడవు.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥ 24

జ్ఞాని, అర్పణను, హవిస్సును, హోమాగ్నిని, అర్పించువానిని, అన్నింటినీ బ్రహ్మము (ఆత్మ)గనే చూస్తాడు. అలా కర్మరూప బ్రహ్మము నందు నిమగ్నమై యుండువాడు బ్రహ్మమునే చేరుతాడు.

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥ 25

యోగులు కొందరు దేవతల నుద్దేశించి చేస్తున్నదే కర్మ యజ్ఞం! ఇంకొందరు బ్రహ్మాగ్నియందు, ఆత్మచేత తమ ఆత్మనే ఆహుతి చేస్తున్నారు. ఇది జ్ఞానయజ్ఞం!

శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।
శబ్దాదీన్విషయానన్యే ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి ॥ 26

మరికొందరు యోగులు చెవులవంటి ఇంద్రియాలను నిగ్రహాగ్నిలోను కొందరు శబ్దాది ఇంద్రియ విషయాలను (ధర్మ విరుద్ధం కానివాటిని) ఇంద్రియ రూపాగ్నిలోను వేల్చుచున్నారు.

సర్వాణీన్ద్రియక ర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥ 27

కొందరు యోగులు జ్ఞాన ప్రదీప్తమైన ఆత్మనిగ్రహాగ్నిలో ఇంద్రియ కర్మలన్నింటినీ, ప్రాణవాయువు మొదలగు వాటికర్మలతో సహా ఆహుతిస్తారు.

ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥ 28

ఇంకా ఇతరులు, ద్రవ్య, తపో, దానరూప, ప్రాణాయామాది యోగ యజ్ఞాలను చేస్తుంటారు.

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే పానం తథాపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥ 29

ప్రాణాయామాభ్యాసంతో ప్రాణవాయువు నందు అపానవాయువును, అపానవాయువు నందు ప్రాణవాయువు నాహుతిస్తారు కొందరు. ప్రాణాపాన వాయువుల రాకపోకల్ని నిరోధిస్తారు ఇంకకొందరు.

అపరే నియతాహారాः ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।
సర్వేప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షయితకల్మషాः ॥ 30

మరికొందరాహార నియంత్రణతో, ప్రాణములందితర ప్రాణములు (ఐక్యమగునట్లు) అన్నింటినీ ఆహుతిచేస్తున్నారు. ఇలా ఈ యజ్ఞాలను తెల్సుకొన్నవారు, ఆచరిస్తున్నవారు పాపవిముక్తులౌతున్నారు.

యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మసనాతనమ్ ।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ॥ 31

ఈపై తెల్పిన వారికి అసలైన యజ్ఞమేమిటో తెలియనివారు. (సిసలైన) యజ్ఞ నిర్వాహకులు యజ్ఞశేషాన్ని (అందరికీ పంచగా మిగిలిన దానిని) తిని శాశ్వత బ్రహ్మను చేరుతారు. యజ్ఞం చేయని (లోకకళ్యాణం కోసం పాటుపడని) వారీలోకానికే అనర్హులు. అట్టి వారికిక పరలోకప్రాప్తియా?

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణోముఖే ।
కర్మజాన్విద్ధి తాన్సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32

పై తెల్పినవి వేదవిదిత యజ్ఞాలన్నీ కర్మయజ్ఞాలేగానీ ఆత్మజ్ఞాన యజ్ఞాలు కావని తెలుసుకుంటే ముక్తినందుతావు.

శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే ॥ 33

ద్రవ్యయజ్ఞం కన్నా, జానయజ్ఞం శ్రేష్ఠమైనది.ఎందుకంటే కర్మలన్నీ జ్ఞానమందే పరిసమాప్తమౌతాయ్.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ 34

తత్త్వద్రష్ఠలైన జ్ఞానులు నీకు బ్రహ్మజ్ఞానాన్ని బోధించగలరు, సాష్టాంగ ప్రణామాలతో సేవిస్తూ ప్రశ్నిస్తూ వారినుండి నీవీ జ్ఞానాన్ని పొందెదవు గాక!

యద్జ్ఞాత్వాన పునర్మోహమేవం యాస్యసి పాణ్డవ ।
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్య స్యాత్మన్యథో మయి ॥ 35

ఈ బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకుంటే నీవిక మోహంలో పడవు. సృష్టినంతా నాలో, నీలోనూ చూడగలవు.

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి ॥ 36

పాపులలో మహాపాపివైనా సరే ఆత్మజ్ఞానమనే తెప్పద్వారా సర్వపాపాలనూ దాటగలవు.

యథై ధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున ।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా॥ 37

ప్రజ్వలిస్తున్న అగ్ని సమిధలన్నింటినీ భస్మం చేసినట్లు ఆత్మజ్ఞానాగ్ని కర్మ(ఫలా)లను భస్మం చేస్తుంది.

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥ 38

లోకంలో జ్ఞానం కన్నా స్వచ్ఛమైన, పరిశుద్ధమైన వస్తువేదీ లేదు. కర్మయోగం ద్వారా మనసును పవిత్రం చేసుకోగల్గిన సాధకుడు కాలక్రమంలో తనకుతానే బ్రహ్మ(ఆత్మ) జ్ఞానాన్ని పొందుతాడు.

శ్రద్ధావాన్లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధిగచ్ఛతి ॥ 39

శ్రద్ధాభక్తులు గల్గిన జితేంద్రియుడు ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు, పొందిన వెంటనే పరమశాంతి పొందుతాడు.

అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ 40

ఆత్మజ్ఞానం లేనివాడు, గురుబోధపట్ల శ్రద్ధారహితుడు, సంశయాత్ముడూ నశిస్తాడు. సంశయాత్మునకిహ పరలోకాలలో సుఖశాంతులుండవు.

యోగసన్న్య స్తకర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్ ।
ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనఞ్జయ ॥ 41

అర్జునా! కర్మయోగం ద్వారా కామ్య కర్మలను విడనాడి, ఆత్మజ్ఞానం ద్వారా సంశయనివృత్తి చేసుకుని, ఆత్మయందే సుప్రతిష్ఠుడైన కర్మలచేత బద్ధుడు కాడు.

తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత ॥ 42

కాబట్టి, అజ్ఞానం చేత నీ హృదయంలో నెలకొన్న సంశయాన్ని ఆత్మజ్ఞాన ఖడ్గంతో ఛేదించి యోగము (నిష్కామకర్మ) నాశ్రయించు లెమ్ము అర్జునా!

జ్ఞాన యోగమనే పేరుగల నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచమో ధ్యాయం

కర్మసన్న్యాస యోగం

అర్జున ఉవాచ –

సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥ 1

అర్జునుడన్నాడు –

శ్రీకృష్ణా! కర్మ సన్న్యాసాన్ని ప్రశంసించి, మళ్ళీ కర్మాచరణనూ ప్రశంసిస్తున్నావు. ఇంతకూ రెంటిలో యేది శ్రేయస్కరమో నాకు తేల్చి చెప్పు.

శ్రీభగవానువాచ –

సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ।
తయోస్తు కర్మసన్న్యాసాత్కర్మయోగో విశిష్యతే ॥ 2

శ్రీభగవానుడన్నాడు –

కర్మసన్న్యాసం, కర్మాచరణం రెండూ మోక్ష సాధనాలే. వీటిలో కర్మసన్యాసం కన్నా కర్మాచరణయే మిక్కిలి శ్రేయస్కరం.

జ్ఞేయఃస నిత్యసన్న్యాసీ యోన ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వన్ద్వో హి మహాబాహో సుఖం బన్ధాత్ప్రముచ్యతే ॥ 3

రాగద్వేష రహితుడు సన్యసింపకున్నా సన్న్యాసియే. ఏలన అట్టి ద్వంద్వాతీతుడు సంసారబంధం నుండి సులువుగా విముక్తుడౌతాడు.

సాంఖ్య-యోగౌ పృథగ్బాలాః ప్రవదన్తి, న పణ్డితాః ।
ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విన్దతే ఫలమ్ ॥ 4

జ్ఞాన, కర్మ యోగాలను భిన్నములనే వారు జ్ఞానులు కారు. వీటిలో ఏ ఒక్కదానియందు సుప్రతిష్ఠుడైనా రెండింటి ఫలాన్ని పొందుతాడు మనిషి.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5

జ్ఞానులు చేరే స్థానాన్నే కర్మయోగులూ చేరతారు. జ్ఞాన, కర్మ యోగాలను అభిన్నాలుగా చూచేవాని దృష్టే సమ్యక్(వాస్తవిక) దృష్టి.

సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ॥ 6

కర్మానుష్ఠానం లేకుండా కర్మసన్న్యాసాన్ని పొందటం మిక్కిలికష్టం. ధ్యానశీలి (ముని) కర్మాచరణనిష్ఠతో పవిత్రుడై త్వరగా బ్రహ్మమును చేరుతాడు.

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః ।
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7

నిష్కామ కర్మ నిష్ఠ ద్వారా నిర్మల మనస్కుడై, దేహ స్వాధీనుడు, జితేంద్రి యుడునై ప్రాణులన్నింటి ఆత్మను తన ఆత్మగ చూచు కర్మయోగి కర్మలు చేసినా బంధింపబడడు.

నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8

బ్రహ్మ (ఆత్మా)ను భూతిగల కర్మయోగి చూస్తూ, వింటూ, స్పృశిస్తూ, ఆఘ్రాణిస్తూ, తింటూ నడుస్తూ, నిద్రిస్తూ, శ్వాసక్రియలు నడుపుతూ

ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ ఉన్మిషన్ నిమిషన్నపి ।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్ ॥ 9

మాట్లాడుతూ, విసర్జిస్తూ, పరిగ్రహిస్తూ, కళ్ళుతెరుస్తూ, మూస్తూకూడా ఇంద్రియాలు వాటి పనిని అవి చేసుకుంటున్నాయి. ఇందులో నాప్రమేయమేమీ లేదని భావిస్తుంటాడు.

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సఙ్గం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్రమివామ్భసా ॥ 10

ముక్తసంగుడై పరమాత్మకర్పించి కర్మలు చేయువాడు, నీటితో అంటబడని తామరాకులా పాప పుణ్యాలచేత అంటబడడు.

కాయేన మనసా బుద్ధ్యా కేవలైరిన్ద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాత్మశుద్ధయే ॥ 11

నిష్కామ కర్మయోగులు మమతాసక్తులను వీడి, కర్తృత్వాభిమాన రహితంగా చిత్తశుద్ధి కొరకు, కేవలం దేహం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలతో కర్మలు చేస్తుంటారు.

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ 12

సమబుద్ధి యందు సుస్థిరుడైనవాడు, కర్మఫలాలను త్యజించి, జ్ఞాన మార్గంలో ముక్తి పొందుతాడు. సమబుద్ధి లేనివాడు కోర్కెలకు లొంగి కర్మఫలాసక్తుడై బంధింపబడతాడు.

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీనైవ కుర్వ న్నకారయన్ ॥ 13

జితేంద్రియుడు వివేకబుద్ధితో కర్మల(ఫలాల)నుత్యజించి తొమ్మిది ద్వారాలు గల దేహమనే నగరంలో, తాను కర్మలు చేయకున్నా నిర్లిప్తుడై ఆనందంగా ఉంటాడు.

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14

కర్తృత్వబుద్ధిని, కర్మలను వాటితో కర్మఫలాసం యోగాలను సృష్టించింది పరమేశ్వరుడు కాదు, ప్రకృతియే ఇదంతా చేస్తున్నది.

నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః ।
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥ 15

పరమేశ్వరుడెవరి పాపపుణ్యాలనూ పరిగ్రహింపడు, అజ్ఞానంచే జ్ఞానం కప్పివేయబడి జీవులుమూఢత నందుచున్నారు.

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16

ఆత్మజ్ఞానం చేత తమ అజ్ఞానాన్ని నశింపజేసుకున్నవారి జ్ఞానం, సూర్యునివలె పరమాత్మను ప్రకాశింపజేస్తుంది.

తద్బుద్ధయస్త దాత్మాన స్తన్నిష్ఠాస్తత్పరాయణాః ।
గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥ 17

బ్రహ్మనిష్ఠులు – బ్రహ్మాత్ములు– బ్రాహ్మీస్థితులు – బ్రహ్మపరమార్ధులు– బ్రహ్మజ్ఞానం చేత పాపవిముక్తులూ మోక్షాన్ని పొందుతారు.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః ॥ 18

విద్యావినయసంపన్నుడైన బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, కుక్కను, కుక్కల్ని తినువానిని, ఆత్మజ్ఞానులు సమదృష్టితో (తమ ఆత్మగానే) చూస్తుంటారు.

ఇహైవ తైర్జితః సర్గోయేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః ॥ 19

తమబుద్ధి సమభావమున సుస్థిరులైనవారు ఇహలోకంలోనే జన్మ విజేతలౌతారు. బ్రహ్మసములు, దోషరహితులగుటచే వారు బ్రహ్మము నందే సుస్థిరులౌతారు.

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసంమూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥ 20

బ్రహ్మజ్ఞుడు, బ్రహ్మయందే ప్రతిష్ఠుడై, సుస్థిరబుద్ధితో మూఢరహితుడై, ప్రియప్రాప్తికి హర్షింపక, ఆప్రియ ప్రాప్తికి విషాదమొందక ఉంటాడు.

బాహ్య స్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥ 21

బాహ్య విషయాల (భౌతిక సుఖాల) పట్ల అనాసక్తుడైనవాడు, అటువంటి సుఖాలను ఆత్మానుభూతి ద్వారా పొందుతుంటాడు. బ్రహ్మధ్యాన మనస్కుడై సదా అక్షయానందాన్ని అనుభవిస్తుంటాడు.

యే హి సంస్పర్శజా భోగా దుఃఖ యోనయ ఏవ తే ।
ఆద్యన్తవన్తః కౌన్తేయ న తేషు రమతే బుధః ॥ 22

విషయస్పర్శ ద్వారా కల్గే సుఖాలు దుఃఖకారకాలు, అశాశ్వతాలు కాబట్టి జ్ఞాని అటువంటి సుఖాలనుకోరడు.

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం సయుక్తః స సుఖీ నరః । 23

ఈ లోకంలో మరణానికి ముందే కామక్రోధోద్వేగాలను నిగ్రహించగల్గినవాడు యోగి మరియు సుఖి!

యోఽన్తఃసుఖోఽన్తరారామస్తథాన్తర్జ్యోతిరేవ యః ।
స యోగీ బ్రహ్మ నిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24

ఆత్మయందే సుఖిస్తూ, క్రీడిస్తూ, ఆత్మయందే జ్ఞానజ్యోతిని చూచుయోగి బ్రహ్మస్వరూపుడై సశరీర ముక్తిని పొందుతాడు.

లభన్తే బ్రహ్మనిర్వాణమృషయః క్షీణకల్మషాః ।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25

లోపాలను, సంశయాలను, నిర్మూలించుకొని, జితేంద్రియులై సర్వభూత హితులై, ఋషులు సశరీర ముక్తిని పొందుతున్నారు.

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26

కామ, క్రోధ, విముక్తులై, వశీకృత చిత్తులై, ఆత్మజ్ఞానానుభూతినందిన సన్యాసులు, మృతికిముందూ తర్వాత గూడ మోక్షానందాన్ని పొందుతారు.

స్పర్శా కృత్వాబహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాన్తరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వానాసాభ్య న్తరచారిణౌ ॥ 27

బాహ్య (భౌతిక) విషయాలను, మనసులోకి రానివ్వకుండా, చూపును భ్రూమధ్యంలో నిలిపి నాశికాంతరాన చరించు ప్రాణాపాన వాయువులను సమానపరచి

యతేన్ద్రియమనో బుద్ధిర్మునిర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః ॥ 28

ఇంద్రియాలను, మనోబుద్ధుల్ని గ్రహించి, కామక్రోధ భయాలను వీడి, మోక్షాన్నే పరమ లక్ష్యంగా కల్గియున్నవారు శాశ్వత సుఖాన్నిపొందుతారు.

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదయం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాన్తిమృచ్ఛతి ॥ 29

నన్ను యజ్ఞాలు, తపస్సులయొక్క భోక్తగ (మూలం, గమ్యం అయిన సర్వకర్మఫలప్రదాతగా) లోకాలన్నింటికీ మహేశ్వరునిగ, సర్వభూత మిత్రునిగ నన్నెరిగినవారు శాంతిని పొందుతారు.

కర్మసన్న్యాస యోగమనే పేరుగల ఐదవ ఆధ్యాయం సమాప్తం.

షష్ఠ ధ్యాయం

ఆత్మసంయమ యోగం

శ్రీభగవానువాచ –

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః ॥ 1

శ్రీభగవానుడన్నాడు–

ఫలాపేక్ష రహితంగా కర్తవ్యకర్మలను, నిత్యకర్మలను నిర్వహించువాడే సన్యాసి, యోగి. అంతేగాని, అగ్ని, అగ్నేతర యజ్ఞ, తపో, దాన, తటాక నిర్మాణాది కర్మలను త్యజించినవాడు కాదు.

యం సన్న్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాణ్డవ ।
న హ్యంసన్యస్తసఙ్కల్పో యోగీ భవతి కశ్చన ॥ 2

అర్జునా! సన్యాసమంటే, నిష్కామ కర్మయోగమని తెలుసుకో, ఎందుకంటే కర్తృత్వభావనను విడనాడని వాడు కర్మయోగి కానేరడు.

ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।
యోగారూఢస్యత స్యైవ శమః కారణముచ్యతే ॥ 3

చిత్తశుద్ధితో యోగాన్ని సాధింపనెంచిన ధ్యానశీలికి, నిష్కామ కర్మానుష్ఠానమే మార్గమనీ, యోగసిద్ధిని పొందిన వానికి కర్మత్యాగమే మార్గమని అంటారు.

యదా హి నేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।
సర్వసఙ్కల్ప సంన్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥ 4

సంకల్పాలను వీడి, ఇంద్రియ విషయాలు, కర్మలయందు, అనాసక్తుడై ఉండేవాడే యోగారూఢుడు.

ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మన ः ॥ 5

ఆత్మసహాయంతో తనను తానుద్ధరించుకోవాలి మనిషి. ఆత్మను బలహీన పరచుకోరాదు. ఏలన మనిషికి ఆత్మయే బంధువు, శత్రువు కూడా! (ఎలాగంటే?)

బన్ధురాత్మాత్మనస్తస్య యేనా త్మైవాత్మనా జితః ।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥ 6

ఆత్మ సహకారంతో మనో దేహేంద్రియాలను లోబరచుకున్నవానికి ఆత్మబంధువైతే వాటికి లొంగిపోయిన వానికి ఆత్మయే(అతనికతనే) శత్రువు.

జితాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః ।
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥ 7

వశీకృతాత్ముడు, ప్రశాంతుడు, శీతోష్ణ, సుఖ, దుఃఖ, పురస్కార తిరస్కారాలలో సదాపరమాత్మనే చూస్తుంటాడు.

జ్ఞానవిజ్ఞానతృప్తాత్మాకూటస్థోవిజితేన్ద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః ॥ 8

జ్ఞాన విజ్ఞానాలతో ఆనందమనస్కుడైనవాడు, నిర్వికారుడు, జితేంద్రియుడు, మట్టిని,రాతిని బంగారాన్నీ సమబుద్ధితో చూస్తాడు.

సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబన్ధుషు ।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥ 9

శ్రేయోఽభిలాషిని, మిత్రుని, శత్రుని, సంబంధం లేనివానిని, మధ్యస్తుని, ద్వేషించు వానిని , బంధువును, సాధువును, పాపినీ సమబుద్ధితో చూచువాడు అత్యుత్తముడు!

యోగీ యుఞ్జీత సతతమాత్మానం రహసి స్థితః
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ॥ 10

యోగి సదానిర్జన ప్రదేశంలో, ఏకాంతంగా ఉంటూ, మనోబుద్ధుల్ని వశపరచుకొని కలిమిని, కోర్కెల్ని వీడి, మనసును సదా ధ్యాననిష్ఠయందే కేంద్రీకరింప యత్నించాలి.

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరామాసనమాత్మనః ।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్ ॥ 11

మరీఎత్తు, మరీ పల్లం కాకుండా, పరిశుభ్ర ప్రదేశాన ఆసనాన్నేర్పరచుకొని, దాని పైవరుసగా దర్భాసనం, దానిపై చర్మాసనం, దానిపై వస్త్రాన్ని పరచుకొని

తత్రైకాగ్రం మనఃకృత్వా యతచిత్తేన్ద్రియక్రియః ।
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగ మాత్మవిశుద్ధయే ॥ 12

అటువంటి ఆసనంపై ఆసీనుడై, మనసును ఏకాగ్రం చేసి,చిత్త, ఇంద్రియ కార్యాల నరికట్టి, చిత్తశుద్ధికొరకు యోగాభ్యాసం చేయాలి.

సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥ 13

శరీరాన్ని, శిరస్సును, కంఠాన్ని, సమంగా సుస్థిరంగా, నిశ్చలంగా నిలిపి దృష్టిని నాసికాగ్రంపై కేంద్రీకరించి, దిక్కులు చూడక

ప్రశాన్తాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః ।
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14

ప్రశాంత చిత్తం, నిర్భయం, బ్రహ్మచర్యవ్రత నిష్ఠలతో, మనసును నిరోధించి, బుద్ధిని దానియందే నిలిపి, నన్నే పరమలక్ష్యంగా ఉంచుకొని యోగంలో కూర్చోవాలి.

యఞ్జన్నేవంసదాత్మానం యోగీ నియతమానసః ।
శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి ॥ 15

ఇలా మనసును సదా స్థిరంగా ఉంచుకొని, వశీకృత చిత్తుడైన యోగి, నా అధీనమై ఉన్న నిర్వాణ రూపమైన పరమశాంతిని పొందుతాడు.

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్తమనశ్నతః ।
న చాతిస్వప్న శీలస్యజాగ్రతో నైవ చార్జున ॥ 16

మరీ అతిగా, మరీ స్వల్పంగా భుజించే, నిద్రించేవానికి యోగసిద్ధి కలగనేరదు.

యుక్తాహారవిహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా॥ 17

ఆహారవిహారాలు, కర్మాచరణ, యత్నాలలో, నిద్రించుట, మేల్కొనుటలో పరిమితిని పాటించుయోగికి దుఃఖం నశిస్తుంది.

యదావినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే ।
నిఃస్పృహః సర్వకామేభ్యోయుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18

పూర్తిగా నిరోధించబడి, కోర్కెలన్నింటినీవీడి, వేటిపట్ల స్పృహలేకుండా, ఆత్మయందే ప్రశాంతంగా, నిశ్చలంగా సదా మనసునునిల్పియుంచువాడు యుక్తుడు! యోగసిద్ధుడు!

యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య యుఞ్జతో యోగమాత్మనః ॥ 19

మనోనిగ్రహంతో ఆత్మయోగాభ్యాసంచేయువాని చిత్తాన్ని గాలిలేనిచోట గల దీపశిఖతో పోల్చుతారు.

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥ 20

యోగాభ్యాసంతో పూర్తిగా నిరోధింపబడిన మనసెపుడానందిస్తుందో, ఆత్మతో ఆత్మను చూస్తూ మనిషి ఆత్మ యందెప్పుడానందిస్తాడో, అదే బ్రహ్మస్థితి.

సుఖమాత్యన్తికం యత్తద్బుద్ధి గ్రాహ్యమతీన్ద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ॥ 21

ఇంద్రియాతీతమైనది, బుద్ధితో పొందలేనిది, అట్టి బ్రహ్మానందాన్ని అనుభూతి చెందుతూ, దానియందే సుస్థిరుడైన యోగి, సత్యం నుండి దూరం కాలేడు.

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ 22

యోగి దేన్ని పరమాత్మకన్నా అధికమని భావించడు. అలా పరమాత్మయందు స్థిరుడైన యోగినిఎంతటి పెను దుఃఖాలూ చలింపచేయలేవు.

తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్।
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణ చేతసా ॥ 23

దుఃఖాన్ని దూరం జేసే స్థితేయోగం. అట్టి యోగాన్ని విసుగులేని ఉత్సాహపూరిత దృఢత్వంతోపట్టుదలతో అభ్యసించాలి.

సఙ్కల్ప ప్రభవాన్కామాంస్త్యక్త్వా సర్వానశేషతః ।
మనసైవేన్ద్రియగ్రామ వినియమ్య సమన్తతః ॥ 24

మనసున జనించే స్వార్థవాంఛలన్నింటినీ త్యజించి, విషయాలనుండి ఇంద్రియాలను చిత్తంతో నిగ్రహించి...

శనైశ్శనైరుపర మేద్బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వాన కిఞ్చిదపి చిన్తయేత్ ॥ 25

ధృతితో బుద్ధిని పట్టి, మనస్సును ఆత్మబద్ధంచేసి మెల్లమెల్లగా శాంతిస్తూ దేన్నిగూర్చి చింతించకుండాలి.

యతో యతో నిశ్చరతి మనశ్చఞ్చలమస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥ 26

చంచలం, అస్థిరమైన మనసు వేటివెంట పరుగిడుతుందో వాటినుండి మరల్చి ఆ మనస్సును ఆత్మవశం చేసుకోవాలి.

ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥ 27

శాంత చిత్తుడై, రజోగుణ త్యాగియై, పాపదూరుడై, బ్రహ్మను చేరిన యోగి బ్రహ్మానందాన్ని పొందుతాడు.

యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ విగత కల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యన్తం సుఖమశ్నుతే ॥ 28

నిర్మలమైన సదా మనసునాత్మతో మమేకంచేయు యోగి, బ్రహ్మానుభూతిని పరమసుఖాన్నిపొందుతాడు.

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29

యోగనిరతుడైనవాడు, ఏకాగ్రచిత్తుడై ప్రాణులన్నింటినీ సమదృష్టితో చూస్తాడు.అట్టి యోగి ప్రాణులన్నింటినీ తనలో, అన్నిప్రాణులలో తనలో చూడగలుగుతాడు.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30

ప్రాణులన్నింటిలో నన్నూ, నాలో ప్రాణులన్నింటినీ చూచువాడు నానుండి విడిపోడు, నేనతన్ని వీడను.

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31

ఆత్మైకత్వంతో సుప్రతిష్ఠుడై, ప్రాణులన్నింటా ఉన్న నన్ను జీవులలోని జీవాత్మగ భజించువాడు యెలా జీవిస్తున్నా, నాయందే జీవిస్తుంటాడు.

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32

అంతటాగల సుఖఃదుఖాలను, తన సుఖ, దుఃఖాలతో సమంగా చూడగల్గిన యోగి పరమశ్రేష్ఠుడు.

అర్జున ఉవాచ –

యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన ।
ఏతస్యాహం న పశ్యామి చఞ్చలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥ 33

అర్జునుడన్నాడు –

కృష్ణా! సమబుద్ధితో కూడినదని నీవు బోధించిన యోగం మనసుయొక్క చంచల స్వభావం కారణంగా స్థిరంగా వుంటుందని నాకు అన్పించటం లేదు.

చఞ్చలం హి మనః కృష్ణ! ప్రమాథి బలవద్ధృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ 34

చంచలం, సంక్షోభకరం, బలయుతం, ధృఢతరమైన మనసును వశపరచుకొనే, వాయువును అరికట్టటం ఎంత కష్టమో అంతకష్ట మనిపిస్తున్నది.

శ్రీభగవానువాచ –

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 35

శ్రీభగవానుడన్నాడు –

అర్జునా! మనసు చంచలమైతే దాన్ని నిగ్రహించుట కష్టమే. కానీ, అభ్యాస వైరాగ్యాల ద్వారా మనసును నిగ్రహించవచ్చు.

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతిమే మతి ఃI
వశ్యాత్మనా తు యతతా శక్యో వాప్తు ముపాయతఃII 36

ఆత్మనిగ్రహం లేనవానికి యోగసాధన దుష్కరమే, కానీ, వశీకృతాత్ముడు యుక్తమార్గంలో యత్నించి దాని సాధించగలడు.

అర్జున ఉవాచ –

అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసఃI
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతిII 37

అర్జునుడన్నాడు –

కృష్ణా! శ్రద్ధావంతుడైనాసరే, ఆత్మనిగ్రహలేమిచే అతని మనసు యోగం నుండి చలిస్తే, అతను యోగ భ్రష్టుడు కాడా? అప్పుడతని కేగతి పడుతుంది?

కచ్చిన్నోభయవిభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతిI
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణఃపథిII 38

కర్మ, జ్ఞానాలనే, రెండు మార్గాలనుండి తప్పిపోయి, నిరాధారుడైనట్టి వ్యక్తి బ్రహ్మను చేరుమార్గాన్ని గ్రహించలేక చెదరిన మేఘంలా నశించిపోడా?

ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్య శేషతఃI
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతేII 39

నీవు తప్ప, ఇతరులెవరూ తీర్చలేని నాయీ సందేహాన్ని నిస్సంశయంగా నీవే తీర్చాలి కృష్ణా!

శ్రీభగవానువాచ –

పార్థ! నై వేహ నాముత్ర వినాశస్తస్య విద్యతేI
నహి కల్యాణకృత్క శ్చిద్దుర్గతిం తాత గచ్ఛతిII 40

పార్థాయోగం చేస్తూ చేస్తూ విఫలమైనా అతనికిహ, పరాలలో వినాశముండదు. ఇది నిస్సంశయం. శుభకార్యాచరణుడు (విఫలుడైనా) ఎన్నడూ దుర్గతి పొందడు!

ప్రాప్య పుణ్యకృతాంల్లోకానుషిత్వా శాశ్వతీఃసమాఃI
శుచీనాం శ్రీమతాం గేహే యోగ భ్రష్టోభిజాయ తేII 41

యోగవిఫలుడు గూడ, పుణ్యాత్ములు చేరు లోకాలకే చేరి, అచట చిరకాలముండి, తిరిగి పవిత్రులైన శ్రీమంతుల ఇంట జన్మిస్తాడు.

అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్I
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మయదీదృశమ్II 42

లేదా జ్ఞానులైన యోగుల ఇంట జన్మిస్తాడు. అట్టి అత్యుత్తమ జన్మప్రాప్తి ఇహలోకాన కడు దుర్లభం!

తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వ దైహికమ్I
యతతే చ తతో భూయఃసంసిద్ధౌ కురునన్దనII 43

అతడు పూర్వదేహంతో ఆర్జించిన బుద్ధి, సంస్కార సంయోగంతో తిరిగి ఆ ఇంట సిద్ధత్వంకై అతడు పూర్వం కన్నా అధికంగ పరిశ్రమిస్తాడు.

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సఃI
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతేII 44

ఆపూర్వాభ్యాస బలం చేత యోగసాధనదిశగా ముందుకు లాక్కుపోబడుతుంటాడు. కాబట్టి వేద నిర్దిష్ట కర్మాచరణులను సైతం అతిక్రమించి ముందుకు పోతుంటాడు.

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేక జన్మసంసిద్ధస్తతో యాతి పరాంగతిమ్ ॥ 45

గత జన్మకంటే మరింతగా యత్నిస్తూ, పాపాలు కడిగివేయబడినవాడై, పలు జన్మలలో క్రమ, క్రమంగా సంసిద్ధిని పొందుతూ పరమగమ్యాన్ని చేరుతాడు!

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥ 46

తాపసులు, శాస్త్రజ్ఞులు, వేదోక్త కర్మాచరణుల కన్నా యోగి అధికుడైనందున, నీవు యోగివికమ్ము అర్జునా!

యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా ।
శ్రద్ధావాన్భజతే యో మాం సమే యుక్తతమో మతః ॥ 47

యోగులలోనూ ఎవరి యంతరాత్మ నాయందే నిమగ్నమై యుండునో, ఎవడు శ్రద్ధావంతుడై నన్ను భజిస్తుంటాడో అట్టి యోగిని యోగులలోకెల్లా యుక్తతము (సర్వశ్రేష్ఠ)నిగా భావిస్తాను!

ఆత్మసంయమ యోగమనే పేరుగల ఆరవఅధ్యాయం సమాప్తం.

సప్తమో ధ్యాయము

విజ్ఞాన యోగము

శ్రీభగవానువాచ –

మయ్యాసక్తమనాః పార్థ! యోగం యుఞ్జన్మదాశ్రయః ।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసితచ్ఛృణు ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

మనసునాపై నిలిపి, నన్నాశ్రయించి, యోగాన్ని అభ్యసించి, నన్ను (పరమాత్మ) గూర్చి సంపూర్ణంగా తెలుసుకోవటమెలాగో చెబుతాను వినుపార్థా!

జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః ।
యద్ జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్య మవశిష్యతే ॥ 2

ఏ జ్ఞానాన్ని పొందితే లోకంలో నీకిక తెలుసుకోవాల్సిందేమీ ఉండదో, అట్టి బ్రహ్మ జ్ఞానాన్ని విజ్ఞానంతో సహా నీకు బోధిస్తాను.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 3

వేలాదిమందిలో యే ఒక్కడో జ్ఞానసిద్ధికి యత్నిస్తాడు. అట్టి ముముక్షువుల్లోనూ, యే ఒక్కడో నన్ను యథార్థంగా తెలుసుకోగల్గుతాడు!

భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ ।
అహఙ్కార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥ 4

భూమి, అగ్ని వాయువు, ఆకాశం, నీరు, మనసు, బుద్ధి, అహంకార మను 8 విధాలుగా నా ప్రకృతి విభజింపబడింది.

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరామ్ ।
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥ 5

ఇది అపరా (జడ) ప్రకృతి. ఇదిగాక విశ్వమంతటినీ ధరించి, పోషిస్తున్న చైతన్యరూప పరా(ఉత్తమ) ప్రకృతి ఉంది.

ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।
అహం కృత్స్న స్య జగతః ప్రభవః ప్రలయస్తథా ॥ 6

ఈ రెండు రకాల ప్రకృతినుండే చేతనా చేతన ప్రాణులన్నీ ఉద్భవించినాయి. అఖిల జగదుత్పత్తికి, విలయానికి కారకుడను నేనని తెలుసుకో.

మత్తః పరతరం నాన్యత్కిఞ్చిదస్తి ధనఞ్జయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7

నాకన్నా అన్యమైనది, అధికమైన దేమీలేదు, దారమందు మణుల్లా విశ్వమంతా నాయందు గుచ్చబడి ఉంది.

రసోఽహమప్సు కౌన్తేయ! ప్రభాస్మి శశిసూర్యయోః ।
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8

నీటిలో రసాన్ని, సూర్యచంద్రుల్లో కాంతిని, వేదాలలో ఓంకారాన్ని, ఆకాశంలో నిశ్శబ్దాన్ని, నరులలో పౌరుషాన్నీ నేనే.

పుణ్యోగన్ధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ 9

భూమిలోని సుగంధాన్ని, అగ్నిలో తేజస్సును, సర్వప్రాణులలో జీవ శక్తిని, తాపసుల్లోని తపస్సునూ నేనే.

బీజం మాం సర్వభూతానాం విద్ధిపార్థ! సనాతనమ్ ।
బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజ స్తేజస్వినామహమ్॥ 10

ప్రాణులకు నిత్య బీజాన్ని, బుద్ధిమంతుల్లో బుద్ధిని, శూరుల్లోని శౌర్యాన్నీ నేనే.

బలం బలవతామస్మి కామరాగవివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మిభరతర్షభ ॥ 11

బలశాలురలో కాంక్షానురాగాలు లేని బలాన్ని, ప్రాణుల్లోని ధర్మబద్ధమైన కామాన్నీ నేనే.

యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తేమయి ॥ 12

ఇంకా సాత్విక, రాజసిక,తామసిక భావాలన్నీ నానుండే ఉద్భవించాయని తెలుసుకో, అన్నీ నాయందున్నాయి.

త్రిభిర్గుణమయైర్భావై రేభిః సర్వమిదం జగత్ ।
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥ 13

ఈ త్రిగుణాలచేతనే మోహంలో పడినందున, త్రిగుణాల కతీతుడను, అవ్యయుడనైన నన్ను తెలుసుకో లేకున్నది లోకం.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తితే ॥ 14

అతిక్రమించటానికి అతికష్టమైన యీ త్రిగుణాత్మక మాయను నన్నాశ్రయించిన వారు దాటగల్గుతారు.

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః ।
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥ 15

దుష్కర్ములు, అజ్ఞులు, నరాధములు, మాయాగ్రస్తులై వివేకాన్ని కోల్పోయినవారు, క్రౌర్య, అసత్యాలకు లోనైన వారు నన్ను భజింపకున్నారు.

చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16

ఆర్తులు, జ్ఞానార్థులు, ధనార్థులు, జ్ఞానులు, యీ నల్గురూ నన్ను భజిస్తున్నారు అర్జునా?

తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః ॥ 17

ఆ నల్గురిలోనూ సదా నాయందే సుస్థిరుడై ఉండు, అనన్య భక్తుడైన జ్ఞానియే శ్రేష్ఠుడు! అట్టి జ్ఞానికి నేనూ, నాకు తనూ ప్రియులము.

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైన మేమతమ్ ।
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥ 18

అట్టి నాలు విధాలుగా ఉన్న భక్తులందరూ ఉదార బుద్ధులే కానీ, జ్ఞానిని మాత్రం నన్నుగానే భావిస్తాను. ఏలన, అతడు నన్నే పరమ గమ్యంగా వుంచుకొని, సదా నాయందే ఏకాగ్రచిత్తుడై నిల్చి ఉంటాడు.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 19

పలు జన్మల అనంతరం, అంతా జగమంతా వాసుదేవుడే (పరమాత్మయే) నన్న అనుభూతితో జ్ఞాని నన్నాశ్రయిస్తాడు. అట్టి మహితాత్ముడు మిక్కిలి అరుదైనవాడు.

కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్యదేవతాః ।
తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా॥ 20

ఆత్మ జ్ఞానేతరులు, వివిధ వాంఛలతో వివేకాన్ని కోల్పోయి, తమ స్వభావానుగుణంగా వివిధ కర్మల నాచరిస్తూ, ఇతర దేవతల నాశ్రయిస్తుంటారు.

యోయో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥ 21

ఏ భక్తుడే రూపాన్ని ఆరాధింపగోరుతాడో, ఆ భక్తున కాదేవతామూర్తి యందే నిశ్చల శ్రద్ధను కలిగిస్తాను నేను.

సతయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధనమీహతే ।
లభతే చ తతః కామాన్ మయ విహితాన్ హితాన్ ॥ 22

అందుచే శ్రద్ధతో అతనా మూర్తినే భజించి, అభీష్టసిద్ధిని పొందుతాడు. వాస్తవానికా ఫలప్రదాతను నేనే!

అన్తవత్తుఫలం తేషాం తద్భవత్యల్ప మేధసామ్।
దేవాన్దేవయజో యాన్తి మద్భక్తా యాన్తిమామపి ॥ 23

కానీ, అట్టి అల్ప జ్ఞానులు పొందు ఫలాలు అశాశ్వతాలు. ఏ దేవతల నర్చించు వారాదేవతలనే చేరుతారు. నన్ను (పరమాత్మను) అర్చించువారు నన్నే చేరుతారు.

అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః ।
పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్ ॥ 24

అక్షయం, సర్వాతీతమైన నాపరమ స్వరూపాన్నెరుగని అవివేకులు అవ్యక్తుడనైన నన్ను వ్యక్త మానవునిగా భావిస్తుంటారు.

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః।
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ ॥ 25

త్రిగుణ యోగ మాయచే కప్పబడి నేనెవ్వరికీ అగుపించను. అజ్ఞాన ప్రపంచం జన్మ రహితుడనైన నన్నెరుగదు.

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాని చ భూతాని మాం తు వేద న కశ్చన ॥ 26

అర్జునా, భూత!, వర్తమాన, భవిష్యత్కాలాలోని ప్రాణులన్నీ నాకు తెలుసు. కానీ, నన్నెవరూ ఎరుగరు.

ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వ మోహేన భారత ।
సర్వభూతాని సంమోహం సర్గేయాన్తి పరన్తప ॥ 27

అనురాగ, ద్వేషజనిత, సుఖదుఃఖాది ద్వంద్వాలచేత అజ్ఞానానికి గురై పుట్టుక తోడనే భ్రాంతులౌతారు.

యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తేద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః ॥ 28

పుణ్యకర్మల ద్వారా పాపవిముక్తులైనవారు మాత్రం, ద్వంద్వ భ్రాంతినుండి విముక్తులై ధృఢవ్రత నిరతులై నన్ను భజిస్తున్నారు.

జరామరణ మోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే ।
తే బ్రహ్మతద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥ 29

వృద్ధాప్య, మరణాలనధిగమించ యత్నించువారు నాశరణుజొచ్చి, బ్రహ్మ (ఆత్మ)ను,ఆధ్యాత్మ (పరమాత్మ)ను, కర్మాన్ని గూర్చి సంపూర్ణంగా తెలుసుకుంటారు.

సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।
ప్రయాణకాలే పి చ మాం తే విదుర్యుక్త చేతసః ॥ 30

అధిభూత, అధియజ్ఞ, అధిదైవ సహితంగా నన్ను తెలుసుకున్నవారు, యోగారూఢబద్ధులై ఉంటారు. మరణ సమయాన సైతం నన్ను గుర్తుంచుకునే ఉంటారు.

విజ్ఞాన యోగమనే పేరుగల ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టమా ధ్యాయం

అక్షరబ్రహ్మ యోగం

అర్జున ఉవాచ –

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే ॥ 1

అర్జునుడన్నాడు –

శ్రీకృష్ణా! బ్రహ్మ, అధ్యాత్మ, కర్మ, అధిభూతం, అధిదైవం అంటే ఏమిటి? వీటి గూర్చి నాకు తెలియజేయి.

అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మి మధుసూధన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2

ఈ దేహంలో అధియజ్ఞం ఎవరు? అతడు దేహంలో ఎలా నిల్చియున్నాడు? నియతాత్ముడు అంతిమ సమయాన నిన్నెలా తెలుసుకోగలడు?

శ్రీభగవానువాచ –

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥ 3

శ్రీభగవానుడన్నాడు –

నాశనము లేనిదే సర్వోత్తమ బ్రహ్మము (ప్రాణుల్లో ఆత్మగ వెలిగే) బ్రహ్మయొక్క స్వభావమే ఆధ్యాత్మ, భూతోత్పత్తికి, ఉనికికి, అవసరమైన యజ్ఞము (శ్రమ)నే, కర్మయని అంటారు.

అధిభూతం క్షరోభావః పురుషశ్చాధిదైవతమ్ ।
అధియజ్ఞ హమేవాత్ర దేహే దేహభృతాం వర ॥ 4

వినాశశీల శరీరాది అధిప్రకృతి రూపాలే అధిభూతము. శరీరాంతర్వర్తియైన పురుషుడే, అధిదైవతము. అంతర్యామిగా శరీరంలో ఉన్న నేనే అధియజ్ఞాన్ని!.

అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 5

అంతిమసమయాన నన్నే స్మరిస్తూ దేహాన్ని వీడినవాడు నా స్వరూపాన్నే పొందుతాడు.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేబరమ్ ।
తం తమేవైతి కౌన్తేయ! సదా తద్భావభావితః ॥ 6

మరణ సమయాన యేభావాన్ని స్మరిస్తూ దేహాన్ని వీడినవాడు ఆ స్వరూపాన్నే పొందుతాడు!

తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।
మయ్యర్పితమనో బుద్ధిర్మామే వైష్యస్యసంశయః ॥ 7

కాబట్టి సదా నన్ను మదినుంచుకొని యుద్ధంచేయి. నీ మనోబుద్ధులు నాయందే నిల్చివుంటే, తప్పక నన్నేచేరుకుంటావ్.

అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్ ॥ 8

నిరంతర ధ్యానాభ్యాసం చేత యోగసుస్థిరుడవై, అనన్యచిత్తంతో, పరముడు, జ్యోతి స్వరూపుడు అగు అధిదైవతాన్ని స్మరించువాడు ఆయననే పొందుతాడు.

కవిం పురాణమనుశాసితారం అణోరణీయాం సమనుస్మరేద్యః ।
సర్వస్య ధాతారమచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 9

సర్వజ్ఞుడు, సనాతనుడు, విశ్వాసకుడు, అణువులో పరమాణువైనవాడు, సర్వాధారుడు, అనూహ్య స్వరూపుడు, మాయాంధకారాతీతుడు, సూర్యునిలా స్వయంప్రకాశకుడనీ...

ప్రయాణకాలే మనసా చలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ సతం పరం పురుష ముపైతి దివ్యమ్॥10

మరణసమయాన, భక్తి పూరిత నిశ్చల చిత్తంతో, యోగబలంతో, భ్రూమధ్యంలో ప్రాణాన్ని అనుసంధించి, ఆ పరమపురుషుని స్మరించు యోగి, ఆయననే పొందుతాడు.

యదక్షరం వేదవిదో వదన్తి విశన్తి యద్యతయో వీతరాగాః ।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥ 11

వేదవిదులు అవినాశియని దేన్ని అంటారో, ముక్తసంగులు, యతులూ దేన్ని పొందుతారో, దేన్ని పొందగోరి నిష్ఠుర బ్రహ్మచర్యాన్ని పాటిస్తారో, ఆబ్రహ్మపదాన్ని నీకు సంగ్రహంగా వివరిస్తాను.

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్నాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్ ॥ 12

ఇంద్రియద్వారాల నరికట్టి, మనసును హృదయంలో, ప్రాణాన్ని శిరస్సులో నిలిపి, యోగధారణనభ్యసిస్తూ

ఓమిత్యేకాక్షరం బ్రహ్మవ్యాహరన్మామనుస్మర ।
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13

ఏకాక్షర ఓం కారము (బ్రహ్మనినాదం) ఉచ్చరిస్తూ, నన్ననుసరిస్తూ, శరీరాన్ని విడిచేవారు పరమగమ్యాన్ని చేరుకుంటారు.

అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః ॥ 14

అనన్య చిత్తంతో నిత్యమూ, సదా నన్ను స్మరిస్తూ , యోగ సుస్థిరుడైన యోగికి నేను సులభుడను.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।
నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥ 15

పరమసిద్ధిని పొంది నన్ను చేరిన మహాత్ములు దుఃఖయుత, అశాశ్వత పునర్జన్మను పొందరుగాక!

ఆబ్రహ్మభువనాల్లోకాः పునరావర్తినోఽర్జున ।
మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥ 16

బ్రహ్మలోక సహితంగా, లోకాలన్నీ పునర్జన్మతో కూడినవే. కానీ, నన్ను పొందిన వారికిక పునర్జన్మ యుండదు.

సహస్రయుగపర్యన్త మహర్యద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాः ॥ 17

బ్రహ్మకు వేయియుగాల కాలమొక పగలు. అంతే కాలమొకరాత్రి, బ్రహ్మకు పగటియందు

అవ్యక్తాద్వ్యక్తయः సర్వాः ప్రభవన్త్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞకే ॥ 18

జగత్తు వ్యక్తమౌతుందనీ, రాత్రియందు వ్యక్త ప్రాణులన్నీ అవ్యక్తమౌతాయని గ్రహించిన వారే రాత్రింబవళ్ల వాస్తవం తెలిసినవారు. (జగత్తుయొక్క వికాస సంకోచాలివే).

భూతగ్రామः స ఏవాయం భూత్వాభూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాగమే వశః పార్థ ప్రభవత్యహరాగమే ॥ 19

పార్థా! (పూర్వకల్పమందున్న) ఆ ప్రాణి సమూహమే మళ్ళీమళ్ళీ పుడుతూ, బ్రహ్మకు రాత్రి కాగానే లయిస్తున్నాయి. తిరిగి బ్రహ్మకు పగలుకాగానే తమ కర్మలకు లోనై మళ్ళీ జన్మిస్తున్నాయి.

పరస్తస్మాత్తు భావోఽన్యో వ్యక్తోఽవ్యక్తాత్సనాతనः ।
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ 20

కానీ, అవ్యక్తాతీతమైన శాశ్వతసద్వస్తువొకటున్నది. ప్రాణులన్నీ నశించు విలయవేళలోనూ అది నశించదు.

అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుः పరమాం గతిమ్ ।
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥ 21

అవ్యక్తం, అవినాశనమైన దానినే పరమగతి, పరమపదం అంటారు. అదే నా పరంధామం (నిలయం) దాన్ని పొందిన వారికిక పునర్జన్మయుండదు.

పురుషः స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా ।
యస్యాన్తः స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥ 22

పార్థా! ప్రాణులన్నింటినిలయుడు, సర్వవ్యాపియైన పరమపురుషుడు, అనన్యభక్తితో లభిస్తాడు!

యత్రకాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినः ।
ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ 23

ఏకాలంలో మరణించినయోగులు తిరిగి జన్మించరో, ఏ కాలంలో మరణిస్తే తిరిగి పుడతారో చెబుతావిను.

అగ్నిర్యోతిరహः శుక్లः షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాः ॥ 24

అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణపు ఆరు నెలలకాలం కల్గిన దేవయాన మార్గాన పయనించిన (మరణించిన) ఈశ్వరోపాసకులు బ్రహ్మను పొందుతారు.

ధూమో రాత్రిస్తథా కృష్ణः షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ 25

ధూమం, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనపు ఆరు నెలలు. ఈ మార్గాన పయనించి (మరణించి)న యోగి చంద్రకాంతిని పొంది తిరిగి జన్మిస్తాడు.

శుక్ల కృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।
ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పునః ॥ 26

లోకంలోని దేవయాన (శుక్లగతి), పితృయాన (కృష్ణగతి) మార్గాలు శాశ్వతాలు.. దేవయానం మోక్షాన్నీ, పితృయాగం పునర్జన్మనూ కలిగిస్తాయి.

నైతే సృతీ పార్థ! జానన్ యోగీ ముహ్యతి కశ్చన ।
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥ 27

ఈ రెండు మార్గాల నెరిగిన యోగి ఎన్నడూ మూఢత నందడు. కాబట్టి అర్జునా నీవు యోగంలో సుస్థిరుడవు కమ్ము!

వేదేషు యజ్ఞేషు తపఃసు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సరమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥ 28

ఇది తెలిసిన యోగి, వేదాధ్యయనం, యజ్ఞానుష్ఠానం, తపోదానాలవల్ల కల్గు శాస్త్రోక్త పుణ్యాలన్నింటినీ అతిక్రమించి ఆద్యము, పరమమునగు పరంధామానిరి చేరుతాడు.

అక్షర బ్రహ్మయోగమనే పేరుగల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవమాధ్యాయము

రాజవిద్యారాజగుహ్య యోగము

శ్రీభగవానువాచ –

ఇదంతు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।
జ్ఞానం విజ్ఞాన సహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

దురాక్షేపించని నీకిపుడు మిక్కిలిగోప్యమైన విజ్ఞాన సహిత జ్ఞానాన్ని బోధిస్తాను విను. దీన్ని తెలుసుకుంటే అశుభాలనుండి విముక్తుడి వౌతావు అర్జునా!

రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥ 2

విద్యలలో శ్రేష్ఠతమం – రహస్యాలలో గోప్యతమం, శుద్ధికరాలలో అత్యుత్తమం – అనుభవపూర్వకంగా ప్రత్యక్షంగా చూడదగినది, ధర్మయుక్తం, అనుష్ఠాన సులభం, తరగని ఫలదాయక మీ జ్ఞానం!

అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరన్తప ।
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని ॥ 3

ఇట్టి జ్ఞానాన్ని పొంద శ్రద్ధలేనివారు నన్నుచేరాక, మృత్యుసంయుత పునర్జన్మ మార్గాన మళ్ళీవస్తారు.

మయా తతమిదం సర్వం జగదవ్యక్త మూర్తినా ।
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ 4

నా యొక్క అవ్యక్త రూపంతో ఈ లోకం పరివ్యాప్తమై ఉన్నది. ప్రాణులన్నీ నాలో ఉన్నాయి. వాటిలో నేనులేను.

న చ మత్ స్థాని భూతాని పశ్యమే యోగమైశ్వరమ్ ।
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5

ఐశ్వర(అసాధారణ)మగు నాయోగాన్ని చూడు. ప్రాణులు నాయందుండుట లేదు, ప్రాణులకు, పోషకం, మూలమై యుండికూడ నేను వాటియందుండనని తెలుసుకో!

యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ ।
తథా సర్వాణి భూతాని మత్ స్థానీత్యుపధారయ ॥ 6

మహాబలసంపన్నమైన వాయువు, అంతటా సంచరిస్తూనే ఆకాశమంతటా (అంటక) నిల్చి యుండునట్లు ప్రాణులన్నీ (నన్నంటక) నాయందు నిలిచి ఉంటాయి.

సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥ 7

కల్పాంతాన ప్రాణులన్నీ నా అపరాప్రకృతిలోకి మరలిపోతాయి. మరో కల్పాదిన తిరిగి వాటిని సృజిస్తాను.

ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।
భూతగ్రామమిమం కృత్స్న మవవం ప్రకృతేర్వశాత్ ॥ 8

కల్పాదిన నా అపరా ప్రకృతిని కల్పాదిన పునఃప్రాణవంతం చేసి, ప్రకృతి అధీనంలో అవశమైయున్న ప్రాణికోటి నంతటినీ మళ్ళీసృష్టిస్తాను.

న చ మాం తాని కర్మాని నిబధ్నన్తి ధనఞ్జయ ।
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు ॥ 9

కర్మల పట్ల అనాసక్తుడను, ఉదాసీనుడను అయి ఉన్నందున అవి నన్ను బంధించవు.

మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్ ।
హేతునా నేన కౌన్తేయ జగద్విపరివర్తతే ॥ 10

నా అధ్యక్షతన చరాచర ప్రాణులన్నింటినీ సృష్టిస్తున్నది ప్రకృతి. కాబట్టి ఈ జగత్తు ఇలా చరిస్తున్నది.

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావమజానన్తోమమ భూతమహేశ్వరమ్ ॥ 11

ప్రాణులన్నింటి మహేశ్వరుడనైన నా పరమ తత్వము నెరుగక, మనుష్య రూపధారియై యున్న నన్ను అజ్ఞానులు నిర్లక్ష్యబుద్ధితో చూస్తున్నారు.

మోఘాశా మోఘ కర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12

వ్యర్థకాంక్షలతో, వ్యర్థకర్మలు చేస్తూ, వ్యర్థ జ్ఞానార్జన చేస్తూ, అవివేకులై రాజసిక, తామసిక ప్రకృతి కలిగి ఉంటారు బుద్ధిహీనులు.

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితా ः ।
భజన్తనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥ 13

కానీ, సాత్విక ప్రకృతిగల మహాత్ములు, నన్ను ప్రాణులన్నింటి మూలముగ, మార్పులేని వానిని గ్రహించి ఏకాగ్ర చిత్తంతో నన్ను భజిస్తుంటారు.

సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాः ।
నమస్యన్తశ్చ మాం భక్త్యానిత్యయుక్తా ఉపాసతే ॥ 14

సర్వదా నన్ను కీర్తిస్తూ దృఢవ్రతులై సాధనచేస్తూ, భక్తితో నమస్కరిస్తూ, ఏకాగ్రచిత్తంతో సదా నన్ను ప్రార్థిస్తుంటారు.

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే ।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్ ॥ 15

జ్ఞానయజ్ఞంతో కొందరు, విశ్వరూపుడనైననన్ను ఏకత్వ భావనతో యింకొందరు, భిన్నరూపునిగ మరికొందరు, నన్ను వివిధంగా పూజిస్తున్నారు.

అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।
మన్త్రోఽహమహమేవాజ్యమహమగ్ని రహం హుతమ్ ॥ 16

క్రతువును, యజ్ఞాన్ని, శ్రాద్ధాన్ని, ఓషధిని, మంత్రాన్ని, ఆజ్యాన్ని, అగ్నిని, నైవేద్యాన్ని నేనే.

పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।
వేద్యం పవిత్రమోఙ్కార ఋక్-సామ-యజు-రేవ చ ॥ 17

ఈ జగత్తుకు తండ్రిని, తల్లిని, ధాతను, పితామహుడను, పవిత్రీకరించు వాడను తెలుసుకోవలసిన ఏకైక వస్తువును, ఓంకారాన్ని, ఋగ్యజుస్సామ వేదాలనునేనే.

గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్ ।
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥ 18

పరమగమ్యాన్ని, పోషకుడను, ప్రభుడను, సాక్షిని, నివాసాన్ని, శరణమును, సఖుడను, సృష్టికర్తను, సంహారకుడను, అధిష్ఠానాన్ని, ధనాగారాన్నీ, అక్షయబీజాన్నీ నేనే.

తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥ 19

నేను వేడిమినిస్తాను, వర్షాన్ని నిరోధిస్తాను, కురిపిస్తాను, అమృతత్వాన్ని, మృత్యువును గూడ నేనే.సదసత్‌ను, (దృశ్యప్రపంచాన్ని, అదృశ్య దైవాన్ని) నేనే.

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే।
తే పుణ్యమాసాద్య సురేన్ద్ర లోక మశ్నన్తి దివ్యాన్దివి దేవభోగాన్ ॥ 20

వేదజ్ఞులు యజ్ఞరూపాన నన్ను పూజించి, సోమపానంతో పాపవిముక్తులై స్వర్గంకోసం ప్రార్థిస్తారు. దేవేంద్రుని స్వర్గలోకం చేరి, అచట దేవత లనుభవించు దివ్యభోగాల ననుభవిస్తారు.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్య లోకం విశన్తి ।
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే ॥ 21

విస్తార స్వర్గ సుఖా లనుభవించాక, వారి పుణ్యం పూర్తై తిరిగి మనుష్యలోకాని కొస్తున్నారు. వేద ధర్మాశ్రయులైన భోగేశ్చా పరులిలా వస్తూ పోతూ ఉంటారు.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాంనిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 22

పూర్తి నిష్ఠతో నన్ను తాముగా భావిస్తూ సదాయోగయుక్తులై నన్ను ఉపాసించు వారి యోగ క్షేమభారాన్ని నేను వహిస్తుంటాను.

యేఽప్యన్య దేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః ।
తేఽపి మామేవ కౌన్తేయ యజన్త్య విధిపూర్వకమ్ ॥ 23

అర్జునా! శ్రద్ధాభక్తులతో అన్యదేవతల్ని పూజించువారుగూడ నన్ను పూజిస్తున్నట్లే. కాని, వారిది తప్పుత్రోవ.

అహం హి సర్వయాజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే ॥ 24

ఎందుకంటే? ఈ యజ్ఞాలన్నింటి భోక్తను, ప్రభుడను నేనేగదా, కానీ యథార్థంగా నన్ను తెలుసుకోలేక పునర్జన్మిస్తారు వాళ్ళు.

యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్యాన్తి పితృవ్రతాః ।
భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోఽపి మామ్ ॥ 25

దేవోపాసకులు దేవతలను, పిత్రోపాసకులు పితరులను, భూతోపాసకులు భూతాలను, పొందుతారు. నన్ను ఉపాసించువారు నన్నే (పరమాత్మనే) పొందుతారు.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥ 26

పవిత్ర హృదయులు భక్తితో నాకు సమర్పించిన ఫలాన్నీ, పత్రాన్నీ, జలాన్ని గూడ కానుకగా స్వీకరిస్తాను నేను.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోసి దదాసియత్ ।
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27

నీవు చేయు కర్మలను, భుజించు పదార్థాలను, వేల్చు హవిస్సులను, ఇచ్చు దానాలను, అభ్యసించు తపస్సులను నాకర్పించు చున్నట్లు భావించు.

శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబన్ధనైః ।
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥ 28

అప్పుడు నీవు శుభాశుభఫలదాయక కర్మబంధం నుండి విముక్తుడవౌతావు. సన్న్యాసయోగంలో సునిష్ఠిత చిత్తుడవై, జీవన్ముక్తుడవై, మరణానంతరం నన్ను చేరుకుంటావు.

సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి న ప్రియః ।
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 29

ప్రాణులన్నింటికీ సముడను, ద్వేషులు, ప్రియులు, నాకెవ్వరూ లేరు. కానీ, భక్తితో నన్ను భజించువారు నాయందు,నేను వారియందు ఉంటాము!

అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥ 30

సునిష్ఠితభక్తితో నన్ను భజించు ఘోరపాపినైనా సాధువుగనే భావించాలి.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి ।
కౌన్తేయ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి॥ 31

ఏలన నన్ను భజించుటచే త్వరగా అతను ధర్మచిత్తుడై, శాశ్వతశాంతి నొందుతాడు. నా భక్తుడెన్నడూ నాశన మొందడు. ఈ విషయాన్ని పలువురకు సునిశ్చితంగా తెలియజేయి.

మాంహి పార్థ! వ్యపాశ్రిత్య యేఽపిస్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపియాన్తి పరాంగతిమ్ ॥ 32

పాపజన్ములైన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు గూడ నా శరణు జొచ్చి మోక్షం పొందుతారు.

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాభక్తా రాజర్షయస్తథా ।
అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33

ఇక పుణ్యవంతులు బ్రాహ్మణులు, భక్తి ప్రపూర్ణులైన రాజర్షులు గూర్చి చెప్పాలా. అనిత్యము, అసుఖదాయక లోకంలో జన్మించావు గనుక నీవు నన్ను భజించు అర్జునా!

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః ॥ 34

నీ మనసును నాతో నింపుకొని, నా భక్తుడవై, నన్ను గూర్చి యజ్ఞం చేస్తూ, నాకు నమస్కరిస్తూ నీ మనసునిలా నాయందు సుస్థిరం చేసి నన్ను పరమగమ్యంగా చేసుకుంటివేని, నన్ను చేరుకుంటావు.

రాజవిద్యా రాజగుహ్యమనే పేరుగల తొమ్మిదో అధ్యాయం సమాప్తం.

దశమాధ్యాయము

విభూతియోగము

శ్రీభగవానువాచ –

భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

అర్జునా! సంప్రీతుడవై నా మాటలు వింటున్న నీహితం గోరి నా పరమ వచనాలను మరోసారి చెబుతాను విను.

న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ 2

దేవగణాలు, మహర్షులెవరూ నా పుట్టుక నెరుగరు. ఏలన వారందరికీ అన్నివిధాలా మూలాన్ని నేనే.

యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 3

జన్మరహితునిగ, అనాదిగ, సర్వలోకేశ్వరునిగ, నన్ను తెల్సుకున్నవాడు, మూఢతారహితుడు, పాప విముక్తుడు.

బుద్ధిర్జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః ।
సుఖం దుఃఖం భవో భావో భయం చాభయమేవ చ ॥ 4

బుద్ధి, జ్ఞానం, సహనం, సత్యం, అసమ్మూఢత, బాహ్యేంద్రియనిగ్రహం, శాంతచిత్తత, సుఖం, దుఃఖం, ఉత్పత్తి, విలయం, భయం, నిర్భయత్వం నేనే.

అహింసా సమతా తుష్టిస్తపో దానం యశోఽయశః ।
భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః ॥ 5

అహింస, సమచిత్తత, తృప్తి, తపస్సు, దానం, కీర్తి, అపకీర్తి, నానుండే యుత్పత్తి యౌతున్నాయి.

మహర్షయః సప్తపూర్వే చత్వారో మనవస్తథా ।
మద్భావా మానసాజాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥ 6

సప్తమహర్షులు, ప్రాచీన మనువులు నల్గురు, నాతో సమభావులు, నా మానస పుత్రులు, లోకంలోని జీవులందరూ వారి సంతతే.

ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।
సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ 7

వివిధంగా అగుపించే నానావిధ రూపాలను, నాయోగశక్తినీ, వాస్తవ రూపంలో గ్రహించగలవాడు ఆత్మయందు సుప్రతిష్ఠుడౌతాడు. సందేహమేమీ లేదు.

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వాభజన్తే మాం బుధా భావసమన్వితాః ॥ 8

సమస్త విశ్వానికీ ఉత్పత్తి స్థానాన్ని నేనే. జగత్తంతా నానుండే ఉద్భవిస్తున్నది అని గ్రహించిన జ్ఞానులు, ప్రేమపూరిత హృదయాలతో నన్ను భజిస్తుంటారు.

మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయన్తః పరస్పరమ్ ।
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ ॥ 9

మనస్సు నా యందే నిలిపి, ఇంద్రియాలను నాలో లీనం చేసి, పరస్పరం బోధించుకుంటూ నన్నుగూర్చే సంభాషించుకుంటూ సదా సంతుష్టులు, ఆనందభరితులై ఉంటారు జ్ఞానులు.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే ॥ 10

సదా భక్తి యుక్తులై, ప్రీతితో నన్ను భజించువారికి బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాను. తద్వారా వారు నన్ను చేరుకుంటారు.

తేషామేవానుకమ్పార్థమహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥ 11

కేవలం వారిపై దయచేతనే వారి బుద్ధిలో నేను నెలకొని, పరిపూర్ణ సత్యదీప్తిని కలిగించు వివేక దీపంతో వారి అజ్ఞానాన్ని నశింపజేస్తున్నాను.

అర్జున ఉవాచ –

పరం బ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్ ॥ 12

అర్జునుడన్నాడు –

పరబ్రహ్మవు, పరమపదానివి, పరమ పావనుడవు, నిత్యుడవు, దివ్య పురుషుడవు, ఆది దేవుడవు, జన్మరహితుడవు, సర్వవ్యాప్తుడవు అని

ఆహుస్త్వామృషయః సర్వే దేవర్షిర్నారదస్తథా।
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥ 13

సప్తర్షులు, నారదుడు, అసితుడు,దేవలుడు, వ్యాసుడూ, అందరూ చెప్పారు. నీవు అట్లే చెబుతున్నావు.

సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ।
నమితే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥ 14

కేశవా! నీవు చెప్పినదంతా నిజమేనని భావిస్తున్నాను. హే భగవాన్! నీలీలామయ స్వరూపాన్ని దేవదానవులెవరూ తెలుసుకోలేరయా!

స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన! భూతేశ! దేవదేవ! జగత్పతే! ॥ 15

పురుషోత్తమా! సమస్త భూతోత్పత్తి కారకా!, జీవేశ్వరా!, దేవదేవా!, జగదీశ్వరా! నిన్ను నీవే ఆత్మద్వారా తెలుసుకొంటున్నావు.

వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।
యా భిర్విభూతిభిర్లోకానిమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16

అలౌకికాలైన ఏయే, వ్యక్తభావాలతో లోకాలలో నిండి, నిలిచియున్న ఆ దివ్యభావాలను పూర్తిగా నీవే చెప్పాలి.

కథం విద్యామహం యోగిస్త్వాం సదా పరిచిన్తయ।
కేషు కేషుచ భావేషు చిన్తో సి భగవన్మయా ॥ 17

యోగీశ్వరా! నిన్ను తెలుసుకోటానికి సదానేనెలా ధ్యానించాలి? భగవాన్! ఏయే వస్తువులందు నిన్ను చింతించాలి?

విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మే ఽమృతమ్ ॥ 18

నీ వాగమృతాన్ని శ్రవణం చేయుటలో తనివి తీరటం లేదు కృష్ణా! నీ యోగ శక్తులను, వ్యక్త భావాలను నాకు మళ్ళీ వివరించవా?

శ్రీభగవానువాచ –

హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః ।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యన్తో విస్తరస్య మే ॥ 19

శ్రీభగవానుడన్నాడు –

నా దివ్యానుభూతులు అనంతాలు గనుక సవిస్తరంగా చెప్పటం సాధ్యంకాదు. కావున వాటి ప్రాధాన్యతానుగుణంగా వివరిస్తాను విను.

అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః ।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥ 20

ప్రాణులన్నింటి హృదయాలలో నిల్చియుండు ప్రత్యగాత్మను నేనే. వాటి పుట్టుక, ఉనికి, అంతమూ నేనే.

ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్ ।
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ ॥ 21

ఆదిత్యులలో విష్ణువును, జ్యోతులలో రశ్మివంతుడైన సూర్యుడను, మరుత్తులలో మరీచిని, నక్షత్రాలలో చంద్రుణ్ణి.

వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః ।
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥ 22

వేదాలలో సామవేదాన్ని, దేవతలలో ఇంద్రుణ్ణీ, ఇంద్రియాలలో మనసును, ప్రాణులలో చైతాన్యాన్ని (తెలివిని).

రుద్రాణం శఙ్కరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।
వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్ ॥ 23

రుద్రులలో శంకరుణ్ణి, యక్షరాక్షసుల్లో కుబేరుణ్ణి, వసువుల్లో పావకుడను, పర్వతాలలో మేరువును.

పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।
సేనానీనామహం స్కన్దః సరసామస్మి సాగరః ॥ 24

పురోహితుల్లో ప్రధానుడైన బృహస్పతిని, సేనానుల్లో కుమార స్వామిని, సరస్సులలో సముద్రుణ్ణి.

మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మిస్థావరాణాం హిమాలయః ॥ 25

మహర్షుల్లో భృగుణ్ణీ, మాటల్లో ఏకాక్షర ఓం కారాన్నీ, యజ్ఞాలలో మనోజపాన్నీ, స్థావరాల్లో హిమాద్రిని.

అశ్వత్థః సర్వవృక్షాణం దేవర్షీణాం చ నారదః ।
గన్ధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలోమునిః॥ 26

చెట్లలో రావిచెట్టును, దేవర్షులలో నారదుణ్ణి, గంధర్వుల్లో చిత్రరథుణ్ణీ, సిద్ధుల్లోకపిలమునిని.

ఉచ్చైఃశ్రవస మశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।
ఐరావతం గజేన్ద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27

అశ్వాలలో అమృతంతోబుట్టువైన ఉచ్చైఃశ్రవాన్నీ, గజేంద్రుల్లో ఐరావతాన్నీ, నరులలో రాజుననీ తెలుసుకో.

ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।
ప్రజనశ్చాస్మి కన్దర్పః, సర్పాణామస్మివాసుకిః ॥ 28

ఆయుధాల్లో వజ్రాయుధాన్ని, గోవుల్లో కామధేనువును, విషసర్పాల్లో వాసుకిని, సంతాన కారక మన్మథుడనూ నేనే!

అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్।
పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్॥ 29

వాగుల్లో అనంతుడను, జలదేవతల్లో వరుణుడను, పితృదేవతల్లో ఆర్యముడను, శాసకుల్లో యముడను!

ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్।
మృగాణాం చ మృగేన్ద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥ 30

దైత్యుల్లో ప్రహ్లాదుణ్ణీ, గణకుల్లో కాలాన్నీ, మృగాలలో సింహాన్నీ, పక్షుల్లో గరుడుణ్ణి.

పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్ ।
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥ 31

పవిత్రం చేసే వాటిలో గాలిని, ఆయుధధారుల్లో రాముడను, మత్స్యాల్లో మొసలిని, నదుల్లో గంగానదిని.

సర్గాణామాదిరన్తశ్చ మధ్యం చైవాహమర్జున ।
అధ్యాత్మవిద్యావిద్యానాం వాదః ప్రవదతామహమ్ ॥ 32

అగుపించే వాటన్నింటి ఆది, మధ్య, అంతాలను నేనే. విద్యలో ఆత్మవిద్యను, తర్కాలలో వాదాన్నీ!

అక్షరాణామకారోఽస్మిద్వన్ద్వ సామాసికస్య చ ।
అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥ 33

అక్షరాల్లో అకారాన్నీ, సమాసాల్లో ద్వంద్వాన్ని, అనంతకాలాన్నీ, సర్వతో ముఖఫల ప్రదాతనైన ధాతను నేనే!

మృత్యుః సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిః శ్రీర్వాక్ చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా॥ 34

సర్వసంహారక మృత్యువును, ప్రగతి సాధకుల అభ్యుదయాన్ని, స్త్రీ గుణాలలో సిరిని, కీర్తినీ వాక్కును, జ్ఞప్తిని, తెలివినీ, స్థైర్యాన్నీ, ఓరిమినీ నేనే!

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసామహమ్।
మాసానాం మార్గశీర్షోఽహమృతూనాం కుసుమాకరః ॥ 35

సామగీతాల్లో బృహత్సామాన్నీ, ఛందస్సుల్లో గాయత్రిని, మాసాల్లో మార్గశిరాన్నీ, ఋతువుల్లో వసంతాన్నీ!

ద్యూతం ఛలయతామస్మి తేజ స్తేజస్వినామహమ్ ।
జయోఽస్మి వ్యవసాయోఽస్మిసత్త్వం సత్త్వవతామహమ్ ॥ 36

వంచకుల జూదాన్నీ, తేజశ్శాలుర ప్రభావాన్నీ, జయశాలుర జయాన్నీ, ఉద్యమకారుల ఉద్యమాన్నీ, సాత్వికుల సత్వగుణాన్ని!

వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాణ్డవానాం ధనఞ్జయః।
మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః ॥ 37

వృష్ణి వంశీయుల్లో వాసుదేవుణ్ణీ, పాండవుల్లో అర్జునుణ్ణీ, మునుల్లో వ్యాసుడను, సూక్ష్మార్థ వివేకుల్లో శుక్రుడను.

దణ్డో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్ ।
మౌనం చైవాస్మి గుహ్యానం జ్ఞానం జ్ఞానవతామహమ్ ॥ 38

శిక్షకులకు రాజదండాన్నీ, విజేతలు కాగోరు వారికి నీతినీ, గోపనీయాల్లో మౌనాన్నీ, జ్ఞానుల జ్ఞానాన్నీ నేను.

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున।
న తదస్తి వినాయత్స్యాన్మయా భూతం చరాచరమ్ ॥ 39

నేను లేనిదే స్థావర, జంగమ ప్రాణులలో ఏదీ మనలేదు, ప్రాణులన్నింటి మూలం నేనే.

నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప ।
ఏషతూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా॥ 40

(ఇలా) నా దివ్యానుభూతులనంతాలు, కానీ వాటిని నీకిప్పుడు సంక్షిప్తంగా వివరించాను.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసమ్భవమ్ ॥ 41

మహితం, సంపద్యుక్తం, శక్తి సమేతం అగు వస్తువేదియున్నా అది నా తేజస్సులోని ఒక అంశం వల్ల కలిగిందేనని తెలుసుకో!

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహమిదం కృత్స్న మేకాం శేన స్థితో జగత్ ॥ 42

ఈ వైవిధ్య వివరణవల్ల నీకు ప్రయోజనమేముంటుందీ? అందుకే ఈ విశ్వమంతటినీ కేవలం నాలోని ఒకభాగం చేత మాత్రమే నిండి ధరించి యున్నానని మాత్రం తెలుసుకో అర్జునా!

విభూతి యోగమనే పేరుగల పదవ అధ్యాయం సమాప్తం.

ఏకదశాధ్యాయం

విశ్వరూప సందర్శనయోగం

అర్జున ఉవాచ –

మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ॥ 1

అర్జునుడన్నాడు –

శ్రీకృష్ణా! నన్ననుగ్రహించి, నీవు పల్కిన ఆత్మ, అనాత్మ వివేక సంబంధమైన పరమ రహస్యబోధ ద్వారా నా అజ్ఞానం తొలగింది!

భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥ 2

ప్రాణుల ఉత్పత్తి, విలయాలను గూర్చి నీ అక్షయ మాహాత్మ్యాన్ని గూర్చి సవివరంగా తెలుసుకున్నాను.

ఏవమేతద్యథాత్థ త్వమాత్మానం పరమేశ్వర ।
ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ ॥ 3

పరమేశ్వరా! నీ వెంతటి వాడవని చెప్పావో, అంతటివాడివే! కానీ, నీ విశ్వేశ్వరరూపాన్ని చూడగోరుతున్నాను!

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।
యోగేశ్వర తతో మేత్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥ 4

చూచుటకు నేనర్హుడనేనని భావిస్తే, నాకొక్కసారి నీ విశ్వాత్మ స్వరూపాన్ని చూపించు ప్రభో!

శ్రీభగవానువాచ –

పశ్యమే పార్థ! రూపాణి శతశోఽథ సహస్రశః ।
నానావిధాని దివ్యాని నానావర్ణకృతీని చ ॥ 5

శ్రీభగవానుడన్నాడు –

అర్జునా! వందలూ, వేలాది వివిధ వర్ణాలు, ఆకృతులతో కూడియున్న నా దివ్యరూపాలను చూసెదవు గాక!

పశ్యాదిత్యాన్వసూన్ రుద్రాన్ అశ్వినౌ మరుతస్తథా ।
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత। ॥ 6

ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులు, మరుత్తులనూ చూడు, ఇంకా ఇంతవరకు చూడని పలు ఆశ్చర్యాలనుచూడు !

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి ॥ 7

నా దేహాన కేంద్రీకృతమైయున్న స్థావర జంగమాత్మకమగు, అఖిల జగత్తును, యింకా నీవు చూడాలనుకుంటున్న వాటన్నింటినీ చూడు!

న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥ 8

ఐతే, నీ యీ భౌతిక నేత్రాలతో నా విశ్వరూపాన్ని దర్శించలేవు. అందుకే నీకు అలౌకిక జ్ఞాన నేత్రాన్ని ప్రసాదిస్తున్నాను. ఇక నా ఈశ్వరీయ యోగశక్తిని దర్శించు అర్జునా!

సఞ్జయ ఉవాచ –

ఏవముక్త్వాతతో రాజన్! మహాయోగేశ్వరో హరిః ।
దర్శయామాసపార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥ 9

సంజయుడన్నాడు–

రాజా అలాచెప్పి, మహాయోగీశ్వరుడైన హరి తన పరమేశ్వర రూపాన్ని చూపాడర్జునునకు.

అనేక వక్త్ర నయనమనేకాద్భుతదర్శనమ్ ।
అనేక దివ్యాభరణం దివ్యానేకో ద్యతాయుధమ్ ॥ 10

అనేకమైన నోళ్ళు, కళ్ళూ, అద్భుత దృశ్యాలు, పలు దివ్యాభరణాలు, దివ్యాయుధాలతో

దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్ ॥ 11

దివ్యవస్త్రాలు, దివ్య మాల్యాలు,పరిమళాల పూతలతో సర్వాశ్చర్యంగా తేజోవంతమై అనంత రూపాత్మకమై

దివి సూర్య సహస్రస్య భవేద్యుగ పదుత్థితా ।
యదిభా స్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః ॥ 12

ఆకాశంలో ఒకేసారి వేయి సూర్యులుదయించి నంతటి మహాకాంతితో ప్రకాశిస్తున్నాడు.

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।
అపశ్యద్దేవ దేవస్య శరీరే పాణ్డవస్తదా ॥ 13

అసంఖ్య వైవిధ్యాలను కల్గియున్న విశ్వమంతా, అప్పుడొకేచోట, దేవదేవుని దేహంలో కేంద్రీకృతమై యుండటాన్ని చూశాడర్జునుడు.

తతస్స విస్మయావిష్టో హృష్టరోమా ధనఞ్జయః ।
ప్రణమ్య శిరసాదేవం కృతాఞ్జలిరభాషత ॥ 14

ఆ అద్భుతాన్ని చూచి, పూర్ణాశ్చర్య పులకాంకితుడై, శిరస్సు వంచి, ప్రణమిల్లి, చేతులు మోడ్చి విశ్వేశ్వరరూప దేవునితో ఇలా అన్నాడు.

అర్జున ఉవాచ –

పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేష సంఘాన్ ।
బ్రహ్మాణమీశం కమలాసనస్థం ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥15

అర్జునుడన్నాడు –

దేవా! నీ విశ్వరూపదేహంలో సమస్త దేవతలను, సకల చరాచర ప్రాణులను, పద్మాసనుడైన బ్రహ్మను, ఋషులను, దివ్య సర్పాలను, అన్నింటినీ చూస్తున్నాను.

అనేక బాహూదరవక్త్ర నేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్ ।
నాన్తం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥16

విశ్వేశ్వరా! విశ్వరూపా! పలు భుజాలు, ఉదరాలు, ముఖాలు, నేత్రాలు గల, నీ అనంతరూపాన్ని అంతటా చూస్తున్నాను. ఆది, మధ్య అంతాలే కన్పించటంలేదు.

కిరీటినం గదినం చక్రిణం చ తేజో రాశిం సర్వతో దీప్తిమన్తమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాద్ దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్॥17

కిరీట, చక్ర, గదాధిరివి, తేజోరాశివై, సర్వత్రా ప్రకాశిస్తూ దుర్నిరీక్షుడివై, ప్రజ్వలాగ్నిలా, సూర్యునిలా, దిశలన్నింటా దీపించుచున్ననిన్ను దర్శిస్తున్నాను.

త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా సనాతన స్త్వం పురుషోమతో మే ॥18

అవినాశివి, పరబ్రహ్మవు, తెలుసుకోవలసిన ఏకైక వస్తువువు, జత్తుకు పరమశరణ్యుడవు. శాశ్వత, సనాతన, ధర్మరక్షకుడవు, పురాణపురుషుడవు నీవేనన్నది నాభావన.

అనాదిమధ్యాన్తమనన్తవీర్య మనన్త బాహుం శశిసూర్య నేత్రమ్ ।
పశ్యామి త్వాం దీప్త హుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥19

ఆది, మధ్య, అంతం లేనివానిగ, అనంత శక్తిమంతునిగ, బహుబాహునిగ నిన్ను చూస్తున్నాను. సూర్య చంద్రులు నీ నేత్రాలు, ప్రజ్వలితాగ్ని నీ నోరు, నీ తేజస్సుతో విశ్వాన్ని తపింప జేస్తున్నవు.

ద్యావాపృథివ్యోరిదమన్తరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।
దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్॥ 20

మహాత్మా! భూమ్యాకాశాల మధ్య, దిక్కులన్నింటా, అంతరిక్ష మంతట, విస్తరించి యున్న నీ అద్భుత ఉగ్రరూపాన్ని జూచి ముల్లోకాలూ కంపించి పోతున్నాయి.

అమీహిత్వాం సురసఙ్ఘా విశన్తి కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి ।
స్వస్తీ త్యుక్త్వా మహర్షిసిద్ధ సఙ్ఘాః స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః॥21

అరుగో! దేవతలంతా నీలో ప్రవేశిస్తున్నారు. భీతితో అంజలిఘటించి నిన్ను స్తుతిస్తున్నారు కొందరు. (ఈ జగత్తుకు శుభమగుగాక యంటూ) స్వస్తి వాచకాలతోను, ఉదాత్త గీతాలతోను నిన్ను స్తుతిస్తున్నారు.

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।
గన్ధర్వయక్షాసురసిద్ధ సఙ్ఘా వీక్షన్తేత్వాం విస్మితాశ్చైవ సర్వే ॥ 22

రుద్రులు,ఆదిత్యులు వసువులు, సాధ్యులు, విశ్వదేవతలు, అశ్వినీ కుమార ద్వయం, మరుత్తులు, పితరులు, సిద్ధా,సుర, యక్ష,గంధర్వ సమూహాల వారందరూ ఆశ్చర్య చకితులై చూస్తున్నారు నిన్ను!

రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహుబాహూరుపాదమ్।
బహూదరం బహుదంష్ట్రాకరాళం దృష్ట్వాలోకాః ప్రవ్యథితాస్తథాహమ్॥ 23

మహానుభావుడా! అసంఖ్యాకాలైన నీనోళ్ళు, కళ్ళూ, చేతులూ,తొడలూ, పాదాలు,ఉదరాలూ, కోరలు గల్గిన భయంకరమూ, మహత్తరమూ అయినట్టి నీరూపాన్ని జూచి, లోకాలన్నీ గడగడలాడుతున్నాయి. దేవా! నేను కూడ అట్లే వణుకుతున్నాను.

నభఃస్పృశం దీప్తమనేక వర్ణం వ్యాత్తాననం దీప్తవిశాల నేత్రమ్ ।
దృష్ట్వాహిత్వాం ప్రవ్యథితాన్తరాత్మా ధృతిం న విన్దామి శమం చ విష్ణో ॥ 24

విష్ణో, ఆకాశమంతటా పలు వర్ణాలతో ప్రకాశిస్తూ, పూర్తిగా తెరుచుకున్న నోళ్ళతో, దీపించునేత్రాలతో, ప్రజ్వలిస్తున్న నిన్ను చూస్తూ ధైర్యాన్ని కోల్పోయి అశాంతికి గురయ్యాన్నేను.

దంష్ట్రాకరాళాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని ।
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 25

ప్రళయాగ్నిలా జ్వలించే కోరలతో, భయంకరమైన నీ నోళ్ళనుచూసి, దిగ్భ్రమ చెంది శాంతిని కోల్పోయాను. దయచేసి ప్రసన్నుడవు కమ్ము జగదాశ్రయా!

అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వేసహైవావనిపాలసఙ్ఘైః ।
భీష్మోద్రోణః సూతపుత్రస్తథా॒సౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥ 26

మన ధార్త రాష్ట్రులు, రాజులు, భీష్మ, ద్రోణ, కర్ణాది ప్రధానయోధులతో సహా,

వక్త్రాణి తే త్వరమాణా విశన్తి దంష్ట్రాక రాళాని భయానకాని ।
కేచిద్విలగ్నాః దశనాన్తరేషు సందృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గైః ॥ 27

భయంకర కోరలతో భీషణాలైన నోళ్ళలోకి వేగంగా కొట్టుకుపోతున్నారు. నీ పళ్ళలో చిక్కుకున్నకొందరి తలలు చూర్ణాలై కనిపిస్తున్నవి దేవా!

యథానదీనాం బహవోఽమ్బువేగాః సముద్రమేవాభిముఖా ద్రవన్తి।
తథాతవామీ నరలోకవీరా విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి ॥ 28

నదులు వేగంగా సముద్రంలోకి ప్రవహిస్తున్నట్లు, నరలోక వీరులంతా సర్వత్రా జ్వలిస్తున్న నీనోళ్ళలోకి ప్రవహిస్తున్నారు.

యథాప్రదీప్తం జ్వలనం పతఙ్గా విశన్తి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశన్తి లోకా స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ 29

మిడతలు చావటానికి మంటల్లో దూకుతున్నట్లు, ప్రజలు చావటానికి నీ నోళ్ళలోకి దూసుకుపోతున్నారు.

లేలిహ్యసే గ్రసమానః సమన్తా ల్లోకాన్సమగ్రాన్వదనైర్జ్వలద్భిః ।
తేజోఽభిరాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో ॥ 30

విష్ణో! మంటలు గక్కే నోళ్ళతో లోకాలన్నింటినీ కబళిస్తూ, దిశలంతటా నాల్కలు చాపుతూ, ఆస్వాదిస్తున్నావు. నీతీవ్ర ప్రభలు, కాంతులతో జగత్తును తపింప జేస్తున్నావు.

ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో నమోఽస్తు తే దేవవర ప్రసీద ।
విజ్ఞాతుమిచ్ఛామి భవన్తమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥31

ఓ ఉగ్రస్వరూపా! నీవెవరో నాకు తెలియజేయి. దేవశ్రేష్ఠా! నీకు వందనం. నిన్నూ, నీ ఉద్దేశాన్ని తెలియగోరుచున్నాను. ఆదిదేవా! నన్ననుగ్రహించు.

శ్రీభగవానువాచ –

కాలోఽస్మిలోకక్షయకృత్ప్రవృద్ధో లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః ।
ఋతేఽపి త్వాం న భవిష్యన్తిసర్వే యేఽవస్థితాః ప్రత్యనీకేషుయోధాః ॥ 32

శ్రీభగవానుడన్నాడు –

లోకసంహారార్థం విజృంభించిన మహాకాలుడను నేను. ఇప్పుడీ ప్రాణుల్నీ సంహరింపబూనుకున్నాను. నీవు యుద్ధం చేయకున్నా సరే, శత్రుపక్షంలోని వీరులెవరూ బ్రతకరు.

తస్మాత్త్వము త్తిష్ఠ యశోలభస్వ జిత్వాశత్రూ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥ 33

కాబట్టి అర్జునా! లే, లేచి (నీ కర్తవ్యాన్ని నిర్వహించి)కీర్తిని గడించుకో. శత్రువుల్ని జయించి నిష్కంటక రాజ్యాన్ని భోగించు. వీళ్ళంతా ఇప్పటికే నా చేత చంపబడ్డారు. నీవిక నిమిత్త మాత్రుడివే!

ద్రోణఞ్చ భీష్మఞ్చ జయద్రథఞ్చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।
మయా హతాం స్త్వం జహి మా వ్యథిష్ఠాయుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్॥ 34

ఇప్పటికే నా చేత వధింపబడ్డ, భీష్మ, ద్రోణ, కర్ణ, జయద్రధాది వీరుల్ని నీవిపుడు చంపు. చింతించకు, యుద్ధంలో శత్రువుల్ని జయించ గలవు. లేయుద్ధం చెయ్!

సఞ్జయ ఉవాచ –

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాఞ్జలిర్వేపమాన ः కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥ 35

సంజయుడన్నాడు –

శ్రీకృష్ణుని మాటలు విన్న యర్జునుడు మిక్కిలి భయపడుతూ, చేతులు మోడ్చి నమస్కరించి, సాగిల మ్రొక్కి మరల కృష్ణునితో ఇలా అన్నాడు.

అర్జున ఉవాచ –

స్థానే హృషీకేశ! తవ ప్రకీర్త్యా జగత్ ప్రహృష్యత్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి సర్వే సమస్యన్తి చ సిద్ధసఙ్ఘాः ॥ 36

అర్జునుడన్నాడు –

కృష్ణా! ప్రీతితో నిన్నుస్తుతిస్తూ జగత్తు ఆనందించటం, రక్కసులు భయంతో అన్ని దిక్కులకు పారిపోవటం, సిద్ధ సంఘాలు నీకు నమస్కరించటం సమంజసమే.

కస్మాచ్చ తే న నమేరన్మహాత్మ గరీయసే బ్రహ్మణో ప్యాదికర్త్రే ।
అనన్త! దేవేశ! జగన్నివాస! త్వమక్షరం సదసత్తత్పరం యత్ ॥ 37

బ్రహ్మకు అధికుడవు, మూలమూ ఐన మహాత్మా!, అనంతమూర్తీ!, దేవదేవా!, జగదాశ్రయా!, నీకువారేల మొక్కుకుంటారు? అవినాశివీ, వ్యక్తావ్యక్తములు, ఆరెండిటి కతీతుడవుగూడ నీవే!

త్వమాదిదేవः పురుషः పురాణ స్త్వమస్యవిశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనన్తరూప ॥ 38

ఆదిదేవుడవు, పురాణపురుషుడవు, జగత్తుకు పరమశరణ్యమవు, సర్వజ్ఞుడవు, సర్వవేద్యుడవు, పరంధాముడవు ఈ విశ్వమంతా నీచే పరివ్యాప్తమై యున్నది ఓ అనంతరూపా!

వాయుర్యమోఽగ్నిర్వరుణः శశాఙ్కः ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।
నమోనమస్తేఽస్తుసహస్రకృత్వः పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥39

వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు, ప్రజాపతివి, బ్రహ్మకు తండ్రియైన ప్రపితామహుడవూ నీవే. అట్టి నీకు వేయి నమస్కారాలు, మళ్ళీ నమస్సులు. మరిమరీ నీకు నమస్కరిస్తాను.

నమः పురస్తాదథ పృష్ఠత స్తే నమోఽస్తుతే సర్వత ఏవసర్వ ।
అనన్తవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసిసర్వः ॥ 40

సర్వత్రా, అనంతశక్తీ, అమేయ విక్రమా, అంతటా వ్యాపించియున్నది నీవే. ముందునుండి, వెనకనుండి, అన్నిదిక్కుల నుండి నీకు నేను నమస్కరిస్తాను.

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి! ।
అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదాత్ప్రణయేన వాపి ॥ 41

నీ మహిమ నెరుగక మిత్రునిగ భావించి చనువుతో కృష్ణా!, యాదవా!, సఖా! యంటూ పొరపాటున గానీ ప్రేమతో గానీ వినయరహితంగా సంబోధించినందుకు నన్ను క్షమించు.

యచ్చావహాసార్థమసత్కృతోఽసి విహారశయ్యాసనభోజనేషు ।
ఏకోఽథవాప్యచ్యుత తత్సమక్షం తత్క్షామయే త్వామహమప్రమేయమ్॥42

విహార, శయన, ఆసన, భోజన సమయాలలో ఒంటరిగ గానీ, పరుల సమక్షంలో గానీ, పరిహరిస్తూ నిన్నవమానించి యుంటే, దయచేసి నన్ను క్షమించమని వేడుకుంటున్నాను అప్రమేయా!

పితాసిలోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమ ప్రభావ ॥ 43

చరాచరలోకాన నీవు తండ్రివి, పూజ్యుడవు, మహితులకన్నా మహితుడవు, ముల్లోకాలలో సాటిలేరు నీకెవ్వరూ, మరిక నిన్నుమించిన వారెవరయ్యా అసమాన ప్రభువా?

తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥44

పూజ్య ప్రభో! నన్ను క్షమించుమని సాష్టాంగపడి ప్రార్థిస్తున్నా, తండ్రి బిడ్డను, మిత్రుడు మిత్రుని, ప్రియుడు ప్రేయసిని మన్నించినట్లు నన్ను క్షమించుదేవా!

అదృష్టపూర్వం హృషితోస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।
తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 45

ఎవ్వరూ, ఎన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని దర్శించి, పరమానంద భరితుడనయ్యాను. కానీ, భయంతో నా మనసు కలవరపడుతున్నది. దయచేసి తిరిగి నీ పూర్వరూపంలో నాకు దర్శనమివ్వుదేవా!

కిరీటినం గదినం చక్రహస్త మిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ ।
తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో భవ విశ్వమూర్తే ॥ 46

ఎప్పటిలాగే గదా, చక్ర, కిరీట ధారివైన నిన్ను చూడగోరుతున్నాను. నీ చతుర్భుజాకృతినే ధరించు కృష్ణా!

శ్రీ భగవానువాచ –

మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।
తేజోమయం విశ్వమనన్త మాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥ 47

శ్రీభగవానుడన్నాడు –

నిన్ననుగ్రహించి, నా స్వీయ యోగశక్తిచేత, పరమమూ, తేజోమయమూ, ఆద్యమూ, అనంతమూ ఐనట్టి మున్నెన్నడూ ఎవ్వరూ దర్శించని నా విశ్వరూపాన్ని నీకుదర్శింప జేశాను.

న వేదయజ్ఞాధ్యయనైర్న దానై ర్న చ క్రియాభిర్న తపోఽభిరుగ్రైః ।
ఏవం రూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥ 48

అర్జునా!, తపో, దాన, యజ్ఞ, వేదాధ్యయనాలతో గాని, అగ్న్యాది క్రియలు, ఉగ్ర తపస్సులతోగానీ విశ్వరూపాన్ని ఎవ్వరు దర్శింపలేదు.

మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్।
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥ 49

నాయీ భీకర విశ్వరూపానికి భీతిల్లకు. విగత భయుడవు, ప్రీత చితుడవై ఇప్పుడు నాపూర్వరూపాన్ని చూడు.

సఞ్జయ ఉవాచ –

ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా స్వకం రూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీతమేనం భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా ॥50

సంజయుడన్నాడు –

అలా చెప్పితిరిగి తన పూర్వరూపాన్ని చూపాడు. భీతిల్లిన అర్జునుని తన సౌమ్యరూపం చూపి ఓదార్చాడు శ్రీకృష్ణుడు.

అర్జున ఉవాచ –

దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।
ఇదానీమస్మిసంవృత్తః సచేతాః ప్రకృతిం గతః ॥ 51

హా జనార్దనా! నీ సౌమ్యరూపాన్ని చూశాక కుదుటపడిన నా హృదయ మిపుడు మామూలు స్థితికొచ్చినది.

శ్రీ భగవానువాచ –

సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।
దేవా! అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాఙ్క్షిణః ॥ 52

శ్రీభగవానుడన్నాడు –

దేవతలు సదా దర్శించాలనుకుంటున్న, నీవుదర్శించిన, నాయీ విశ్వరూప దర్శనం మిక్కిలి దుర్లభం.

నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥ 53

నీవు దర్శించగల్గిన నా విశ్వరూపాన్ని వేదాధ్యయన, యజ్ఞ, తపో, దానాలతో నైనా సరే ఎవ్వరూ చూడలేరు.

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప ॥ 54

అనన్యభక్తి చేత మాత్రమే నన్నీ రూపాన గ్రహించడానికి, చూడటానికి, నాలో ప్రవేశించడానికి సుసాధ్యం!

మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సఙ్గవర్జితః ।
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ ॥ 55

నాకొరకే కర్మలాచరిస్తూ, నన్నే పరమ గమ్యంగా చేసుకొని, నాకు భక్తుడవై, సంగ వర్జితుడవై ఎవరి పట్లా విరోధం లేకుండా ఉండేవాడు నన్నే పొందుతాడు.

విశ్వరూప సందర్శనయోగమనే పేరుగల పదునొకండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశాధ్యాయం

భక్తియోగం

అర్జున ఉవాచ –

ఏవం సతతయుక్తాయే భక్తాస్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1

అర్జునుడన్నాడు –

నిరంతర నిష్ఠతో నిన్నుపాసించువారు– అక్షరుడు, అవ్యయుడైన పరమాత్మను ఉపాసించువారు. వీరిలో యోగం బాగా తెలిసినవారెవరు?

శ్రీభగవానువాచ –

మయ్యావేశ్యమనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః ॥ 2

శ్రీభగవానుడన్నాడు –

సదా ఏకనిష్ఠలై, నాయందే మనసునిల్పి, పరమ శ్రద్ధతో నన్ను భజించువారే యోగజ్ఞులలో శ్రేష్ఠులు.

యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగమచి చ కూటస్థచలం ధ్రువమ్ ॥ 3

అవినాశం, అగోచరం, అనిర్వచనీయం, సర్వవ్యాపినం, అచలం, అనూహ్యం, నిర్వికారం, నిత్యం ఐనదాన్ని ఉపాసించు వారుగూడ నన్నే పొందుతున్నారు.

సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥ 4

జితేంద్రియులై, సర్వత్రా సమబుద్ధితో, సకల ప్రాణిహితంకోసం పాటుపడుచుండే వారు నన్నే పొందుతున్నారు.

క్లేశోఽధికతర స్తేషామవ్యక్తాసక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ 5

అవ్యక్తుల యందాసక్తులకు కష్టమధికం, ఏలన దేహధారులకు అవ్యక్త గమ్యము చేరుట మిక్కిలి కష్టము.

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥ 6

కర్మలన్నీ నాకర్పించి, నన్నే పరమార్ధంగా యెంచి, ఏ కనిష్ఠధ్యానం (యోగం)తో నన్ను భజించే వారినీ

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి న చిరాత్పార్థమయ్యావేశితచేతసామ్ ॥ 7

నాయందాసక్త హృదయాలను, అచిర కాలంలోనే జనన మరణరూప సంసార సాగరం నుండి సముద్ధరిస్తాను.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ 8

నీ మనసును, బుద్ధిని నాయందేనిల్పి ఉంచితివేని, మరణానంతరం నన్నే చేరుకుంటావు అర్జునా!

అథచిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనఞ్జయ ॥ 9

మనసు నాయందు స్థిరంగా నిలపజాలకుంటే, యోగాభ్యాసం ద్వారా నన్నుచేర యత్నించు!

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।
మదర్థమపి కర్మాణి కుర్వన్సిద్ధిమవాప్స్యసి ॥ 10

అభ్యాసం గూడ చేయలేకపోతే, నాకోసం, నాకు ప్రీతికర కర్మలు చేస్తుండు. అలాగూ నీవు సిద్ధిపొందగలవు!

అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మ ఫలత్యాగం తతః కురుయతాత్మవాన్ ॥ 11

ఇట్టి సత్కార్యాలు చేయజాలకుంటే, నిగ్రహాత్ముడవై, నా శరణుజొచ్చి, కర్మఫలం త్యాగంచేయి.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ ॥ 12

అభ్యాసంకంటె జ్ఞానం, ధ్యానం కన్న కర్మఫలత్యాగమూ శ్రేష్ఠం. సదరు త్యాగానంతరం శాంతి లభిస్తుంది.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహఙ్కారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13

ఏ ప్రాణినీ ద్వేషింపక, ప్రాణులన్నింటిపట్లా దయ, మైత్రికలవాడు, మమత, అహంకారరహితుడు, సుఖదుఃఖ సముడు, సహనశీలి.

సన్తుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పితమనో బుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియః ॥ 14

నిత్య సంతుష్ముడు,సుస్థిర ధ్యానశీలి, నిగ్రహాత్ముడు, ధృడసంకల్పుడు, మనోబుద్ధుల్ని నాకర్పించినవాడు. అట్టి భక్తుడు నాకు ప్రియుడు.

యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చ యః ।
హర్షామర్ష భయోద్వేగైర్ముక్తో యః స చ మే ప్రియః ॥ 15

లోకాన్ని క్షోభిల్లచేయక, తద్వారా తాను క్షోభిల్లక యుండువాడు, హర్ష, అసూయ, భయ, విచారరహితుడు నాకు ప్రియుడు.

అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తః సమే ప్రియః ॥ 16

పరుల ఆధారాన్నపేక్షించని వాడు, పవిత్రుడు, దక్షుడు, ఉదాసీనుడు, చిత్తవికార రహితుడు, సర్వకర్మఫలత్యాని నాకు ప్రియ భక్తుడు.

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాఙ్క్షతి ।
శుభాశుభపరిత్యాగీ భక్తి మాన్ యః సమే ప్రియః ॥ 17

హర్ష, ద్వేష,శోక, వాంఛరహితుడు, శుభాశుభాలను త్యజించునట్టి భక్తి ప్రపూర్ణచిత్తుడు నాకు ప్రియుడు.

సమః శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమః సఙ్గవివర్జితః ॥ 18

శత్రులు, మిత్రులు, సన్మాన తిరస్కారాలు, సుఖదుఃఖాలపట్ల సమభావం కల్గినవాడు, ముక్తసంగుడైన భక్తుడు నాకు ప్రియుడు.

తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సన్తుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః ॥ 19

నిందాస్తుతుల పట్ల సమభావం కలవాడు, మౌనశీలుడు, లభించిన కొంచెంతోనే తృప్తి పడువాడు, సుస్థిరచిత్తుడు, భక్తి ప్రపూర్ణ హృదయుడూ నాకు ప్రియుడు.

యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్దధానా మత్పరమా భక్తాస్తే తీవ మే ప్రియాః ॥ 20

పై దెల్పిన అమృత ధర్మాన్నీ, శ్రద్ధాయుక్తులై ఆచరిస్తూ, నన్నే పరమార్ధమూ, పరమగమ్యంగా, ఎంచుకొన్న భక్తులు నా కత్యంత ప్రియులు.

భక్తియోగమనే పేరుగల పన్నెండవ అధ్యాయం సమాప్తం!

త్రయోదశాధ్యాయం

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగం

అర్జున ఉవాచ –

ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ ।
ఏత ద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥

అర్జునుడన్నాడు –

కేశవా! ప్రకృతి, పురుషులు, క్షేత్ర, క్షేత్రజ్ఞులు, జ్ఞాన, జ్ఞేయములను గూర్చి తెలుసుకోగోరుచున్నాను.

(ప్రక్షిప్తముగా నెంచి శంకరాదులా శ్లోకాన్ని వదిలేశారు.)

శ్రీ భగవానువాచ –

ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే ।
ఏతద్యో వేత్తి తంప్రాహుః క్షేత్రజ్ఞ ఇతితద్విదః ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

కౌంతేయా! ఈ శరీరమే క్షేత్రం, క్షేత్రాన్ని గూర్చి తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు అంటరాని క్షేత్ర క్షేత్రజ్ఞ జ్ఞానులు చెబుతున్నారు.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధిసర్వక్షేత్రేషు భారత ।
క్షేత్రక్షేత్రజ్ఞయోర్ జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥ 2

క్షేత్రాలన్నింటా వెలయు క్షేత్రజ్ఞుడను నేనేననితెలుసుకో. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞానమే యథార్థజ్ఞానమని భావన!

తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చయత్ ।
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥ 3

క్షేత్రమంటే ఏది? ఎటువంటిది? ఎట్టి మార్పులు కల్గినది? క్షేత్రజ్ఞుడెవరు? అతని ప్రభావమేమిటో సంగ్రహంగా విను.

ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధైః పృథక్ ।
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥ 4

(ఈసత్యం) ఋషులచే బహువిధాలుగా కీర్తింపబడింది. సహేతుకాలు, సంశయరహితాలైన బ్రహ్మసూచక వాక్యాలలోనూ వర్ణింపబడింది.

మహాభూతాన్యహఙ్కారో బుద్ధిరవ్యక్తమేవ చ ।
ఇన్ద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః ॥ 5

పంచమహాభూతాలు, అహంకారం, బుద్ధి, మూలప్రకృతి, దశేంద్రియాలు, మనసు, ఇంద్రియ విషయాలు

ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సఙ్ఘాత శ్చేతనా ధృతిః ।
ఏతత్క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥ 6

ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, దేహేంద్రియసమిష్టి, తెలివి,ధృతి, ఇవన్నీ క్షేత్రము లనబడుతాయి. ఇంద్రియాది మార్పులతో కూడిన క్షేత్రత్వం సంగ్రహంగా చెప్పాను.

అమానిత్వం అదంభిత్వం అహింసా క్షాన్తిరార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥ 7

అభిమాన రాహిత్యం, దంభోక్తులాడకుండుట, అహింస, సహనం, సరళత, ఆచార్యసేవ, మనోదేహపరిశుద్ధత, స్థిరత్వం, ఆత్మ నిగ్రహం.

ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహఙ్కార ఏవ చ ।
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్ ॥ 8

ఇంద్రియ విషయాలపట్ల వైరాగ్యం, అహంకార శూన్యత, జనన, మరణ, వార్ధక్యాలలోని దుఃఖ దోష విచారణ

అసక్తిరనభిష్వఙ్గః పుత్రదారగృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు॥ 9

నిస్సంగం, ఆలుబిడ్డలు,గృహాదులపట్ల మమకార రాహిత్యం, ఇష్టాయిష్టాలు, శుభశుభాల పట్ల సమస్థితి.

మయి చానన్య యోగేన భక్తి రవ్యభిచారిణీ ।
వివిక్త దేశ సేవిత్వ మరతిర్జన సంసది ॥ 10

అనన్యచిత్తంతో సదానన్ను ధ్యానించుట, నాయందునిశ్చల భక్తి కలిగియుండుట. ఏకాంత ప్రదేశ నివాసం, జనసాంగత్యం పట్ల నిరాసక్తత

అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।
ఏతద్ జ్ఞానమితి ప్రోక్తం అజ్ఞానం యదతోఽన్యథా ॥ 11

ఆత్మజ్ఞాననిష్ఠ, సత్యజ్ఞాన పరమార్థాన్ని గ్రహించుట, మొదలైనదంతా జ్ఞానం, తదితరం అజ్ఞానం.

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥ 12

తెలుసుకోవలసిందేమిటో? దేన్ని తెలుసుకుంటే అమరత్వం (ముక్తి) కల్గుతుందో, ఏది సత్యాసత్యాల కతీతమో అనాదియైన ఆ పరబ్రహ్మం గూర్చి చెబుతా వినండి.

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 13

లోకమంతటా కాళ్ళూ, చేతులూ, తలలూ, నోళ్ళూ, కళ్ళూ, చెవులూ కల్గి అంతటా ఆవరించి ఉంది (ఆత్మ).

సర్వేన్ద్రియగుణాభాసం సర్వేన్ద్రియవివర్జితమ్ ।
అసక్తం, సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృచ ॥ 14

ఇంద్రియగుణాలన్నింటా దీపిస్తున్నా, ఇంద్రియాలులేనిదది, సంబంధం లేనిదైనా అన్నింటి కాధారమది, సూక్ష్మకావడంచే తెలియనిది

బహిరన్తశ్చ భూతానామచరం చరమేవ చ ।
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికేచతత్ ॥ 15

ప్రాణులన్నింటి లోపలా, బయటా ఉంటుందది. అది స్థావరమూ, జంగము కూడ, దూరమైనదీ, దగ్గరైనది కూడ.

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృచ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥ 16

అది విభజింప వీలుకానిది. కానీ, విభజింపబడినట్లు ప్రాణులన్నింటా ఉంటుంది. ప్రాణి పోషకమిది. ప్రాణుల్ని సృష్టిస్తుందీ, లయిస్తుందది (ఆత్మ) యని తెలుసుకో.

జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్యధిష్ఠితమ్ ॥ 17

జ్యోతులన్నింటినీ ప్రకాశింపజేయు ఆ వస్తువు చీకటి కతీతమైనది. జ్ఞానము, జ్ఞాన గమ్యముగ అందరి హృదయాలలో సుస్థిరమై ఉంటుంది (ఆత్మ).

ఇతి క్షేత్రం తథాజ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥ 18

క్షేత్రం, జ్ఞానం, జ్ఞేయము అలా సంగ్రహంగా వర్ణించబడినాయి. ఇది తెలుసుకున్నవా భక్తుడు నా స్వరూప పొందడానికి అర్హుడు.

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సమ్భవాన్ ॥ 19

ప్రకృతి, పురుషులూ ఆదిరహితులనీ, మార్పులు, గుణాలూప్రకృతి జనితాలనే తెలుసుకో.

కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।
పురుషఃసుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥ 20

దేహేంద్రియాల ఉత్పత్తి కారకం ప్రకృతి. సుఖదుఃఖాలు అనుభూతి కారకం పురుషు(జీవు)డని అంటున్నాం.

పురుషః ప్రకృతిస్థో హి భుఙ్క్తే ప్రకృతిజాన్గుణాన్ ।
కారణం గుణసఙోఽ స్య సదసద్యోని జన్మసు ॥ 21

ప్రకృతి యందు పురుషుడు ఐక్యభావంతో నిలిచి, ప్రకృతి జనిత గుణాలను భోగిస్తుంటాడు.

ఉపద్రష్టానుమన్తాచభర్తాభోక్తా మహేశ్వరః ।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేన్ స్మిన్ పురుషః పరః ॥ 22

శరీర మందుండే పరమపురుషుడు ఐక్యభావంతో నిలిచి, ప్రకృతి జనిత గుణాలను భోగిస్తుంటాడు.

య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణై ః సహ ।
సర్వథా వర్తమానోఽ పి న సభూయోఽ భిజాయతే ॥ 23

ఇలా పురుషుని, గుణాలతో సహా ప్రకృతిని గూర్చి తెలుసుకున్నవాడు, ఎలా జీవించినా తిరిగి జన్మించడు.

ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మ యోగేన చాపరే ॥ 24

నిర్మల హృదయాలతో ధ్యానశీలురై, తమ బుద్ధియందే పరమాత్మను దర్శిస్తారు కొందరు. జ్ఞానయోగం ద్వారా కొందరు, కర్మయోగం ద్వారా మరికొందరు పరమాత్మను దర్శిస్తుంటారు.

అన్యే త్వేవమజానన్తః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తే పి చాతితర న్త్యేవ మృత్యుం శ్రుతి పరాయణాః ॥ 25

ఇలా తెల్సుకోలేనివి ఇంకొందరు గురువుద్వారా విన్నట్లు ఉపాసిస్తూ, తాము విన్నదాన్నే పరమశరణ్యంగా భావిస్తూ వారుగూడ మృత్యువు అతిక్రమిస్తారు.

యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజంగమమ్ ।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్తద్విద్ధి భరతర్షభ ॥ 26

చరాచర భూతాల్లో ప్రతిదీ క్షేత్రక్షేత్రజ్ఞుల కలయిక వల్లనే జనిస్తుందని తెలుసుకో.

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్ ।
వినశ్యత్స్వ వినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి ॥ 27

ప్రాణులన్నింటా సమంగాను, నాశమొందువాటిలో అవినాశిగాను, నిల్చియుండు పరమాత్ముని దర్శించగలవాడే యథార్థదర్శి.

సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాంగతిమ్ ॥ 28

సర్వేశ్వరుడు సర్వత్రా సమంగా నిల్చియుండుటను చూచువాడు, ఆత్మచేత ఆత్మను హింసింపక పరమ గమ్యాన్ని చేరుతాడు.

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథాఽఽత్మానమకర్తారం స పశ్యతి ॥ 29

కర్మలన్నీ చేయునది ప్రకృతియేననీ, ఆత్మ నిష్క్రియమనీ తెలుసుకున్నవాడు యథార్థదర్శి.

యదా భూతపృథగ్భావమేక స్థమను పశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సమ్పద్యతే తదా ॥ 30

ప్రాణుల భిన్నత్వం పరమాత్మలో ఒక్కటై నిల్చియుండటాన్ని, అన్నీ పరమాత్మనుండే విస్తరిస్తున్నవని తెలుసుకున్న వాడు బ్రహ్మైక్య మందుతాడు.

అనాదిత్వాన్నిర్గుణ త్వాత్ వత్పర మాత్మాఽయమవ్యయః ।
శరీరస్థోఽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే ॥ 31

అనాది, నిర్గుణుడగుటచే అక్షయ పరమాత్మ దేహమందుండి కూడా నిష్క్రియమే. అందుకే కర్మలచే అంటుకోబడడు.

యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే ॥ 32

ఆకాశం సర్వవాపియైనా సూక్ష్మత్వ కారణంగా మరి దేన్తోనూ కలవదు. అట్లే, ఆత్మ దేహమంతటా ఉన్నప్పటికీ దేహంతో అంటుకోదు.

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ 33

సూర్యుడొక్కడే లోకాన్ని ప్రకాశింప జేస్తున్నట్లు, క్షేత్రాలలో ఉండే ఆత్మ క్షేత్రాలన్నింటినీ ప్రకాశింపజేస్తున్నది

క్షేత్రక్షేత్రజ్ఞ యో రేవమన్తరం జ్ఞానచక్షుషా ।
భూత ప్రకృతి మోక్షం చయే విదుర్యాన్తి తే పరమ్ ॥ 34

క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదాన్ని, ప్రకృతినుండి ప్రాణులు విముక్తి నందటాన్నీ, జ్ఞాన నేత్రంతో చూడగల్గినవారు, పరాత్పరుని చేరుతారు.

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగమనే పేరుగల పదమూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్దశాధ్యాయం

గుణత్రయ విభాగ యోగం

శ్రీభగవానువాచ –

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।
యద్ జ్ఞాత్వామునయః సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

దేన్ని తెలుసుకుని మునులంతా మరణానంతరం పరమసిద్ధిని పొందారో అట్టి జ్ఞానోత్తమ ఆత్మజ్ఞానాన్ని నీకు మళ్ళీ చెబుతాను.

ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।
సర్గేఽపి నోపజాయన్తే ప్రళయే న వ్యథన్తి చ ॥ 2

ఈ జ్ఞానాన్ననుష్ఠించి, నా స్వరూపాన్ని అందుకొన్నవారు, సృష్టికాలంలో, పుట్టరు, ప్రళయకాలాన ఆపదల్ని పొందరు.

మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మి గర్భం దధామ్యహమ్ ।
సమ్భవః సర్వభూతానాం తతో భవతి భారత ॥ 3

మహనీయ ప్రకృతి గర్భస్థానం.దానియందు నా బీజం నిక్షిప్త పరుస్తున్నారు. దాని నుండి ప్రాణులన్నీ పుడుతున్నాయి.

సర్వయోనిషు కౌన్తేయ మూర్తయః సమ్భవన్తి యాః ।
తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా ॥ 4

అన్ని గర్భాలనుండి పుట్టే శరీరాలన్నింటికీ మహత్తర ప్రకృతే గర్భం. బీజాన్ని విత్తు నట్టి తండ్రిని నేను.

సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥ 5

ప్రకృతి జనిత సత్వరజ, తమో గుణత్రయం, అక్షయుడగు ఆత్మను దేహమందు గాఢంగా బంధిస్తున్నాయి.

తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశకమనామయమ్ ।
సుఖసఙ్గేన బధ్నాతి జ్ఞానసఙ్గేన చానఘ ॥ 6

వీటిలో సత్వం ప్రకాశవంతం నిర్దోష, నిర్మలత్వం చేత సుఖ జ్ఞానాల యందు ఆసక్తిని కల్పించి బంధిస్తున్నది.

రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గసముద్భవమ్ ।
తన్ని బధ్నాతి కౌన్తేయ కర్మసఙ్గేన దేహినమ్ ॥ 7

అనురాగ స్వభావం గల రజోగుణం వాంఛను, కర్మము లందు ఆసక్తినీ కల్గించి బంధిస్తుందని తెలుసుకో.

తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్యనిద్రాభిస్తన్ని బధ్నాతి భారత ॥ 8

అజ్ఞాన జనితమైన తమస్సు దేహధారులకు అవివేకాన్ని కల్గించి, దేహి(ఆత్మ)ని పొరపాటు, బద్ధకం, నిద్రాదులతో బంధిస్తుంది.

సత్త్వం సుఖే సఞ్జయతి రజః కర్మణి భారత ।
జ్ఞానామావృత్య తు తమః ప్రమాదే సఞ్జయత్యుత ॥ 9

సత్యం సుఖాన్ని కలిగిస్తుంది. రజస్సు కర్మలు చేయిస్తుంది. తమస్సు అవివేక అజ్ఞానాలను కలిగిస్తుంది.

రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।
రజః సత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥ 10

రజస్తమముల నతిక్రమించినపుడు సత్వగుణం, సత్వతమోగుణాల నతిక్రమించినపుడు రజోగుణం, సత్వరజోగుణాల నధిగమిస్తే తమోగుణం మనిషిని ప్రభావితం చేస్తుంటాయి.

సర్వద్వారేషు దేహేఽస్మి ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత ॥ 11

శరీరమందు, ఇంద్రియాలన్నింటా జ్ఞానతేజస్సు ప్రకాశిస్తున్నపుడు సత్వగుణం ప్రబలంగా ఉందని గ్రహించాలి.

లోభః ప్రవృత్తిరారమ్భః కర్మణామశమః స్పృహా ।
రజస్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన ॥ 12

అత్యాశ, చురుకుదనం, కాంక్ష, కార్యారంభం, అశాంతీ ప్రజ్వలిస్తుంటే రజోగుణం ప్రబలంగా ఉందని గ్రహించాలి.

అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।
తమస్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన ॥ 13

బుద్ధి మసకలు కమ్మటం, జడత్వం, ప్రమాదం, మూఢతలు తమోగుణ ప్రబలత్వాన్ని సూచిస్తాయి.

యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రళయం యాతి దేహభృత్ ।
తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే ॥ 14

సత్వగుణ ప్రాబల్యవేళ మరణించినవాడు అత్యున్నదేవతోపాసకులు పోవు నిష్కళంక లోకాలకెళ్తాడు.

రజసి ప్రళయం గత్వాకర్మసఙ్గిషు జాయతే ।
తథా ప్రలీన స్తమసి మూఢయోనిషు జాయతే ॥ 15

రజోగుణ ప్రాబల్యవేళ మరణించినవారు కర్మాసక్తులయందునూ, తమోగుణ ప్రాబల్యవేళ మరణించినవారు మూఢజన గర్భాలలో పుడతారు.

కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।
రజసస్తు ఫలం దుఃఖమజ్ఞానం తమసః ఫలమ్ ॥ 16

సత్కర్మల ఫలం సాత్వికం, నిర్మలం, రాజసికకర్మలఫలం దుఃఖం, తామసిక కర్మలఫలం అజ్ఞానం.

సత్త్వాత్సఞ్జాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాద మోహౌ తమసో భవతో జ్ఞానమేవ చ ॥ 17

సత్వంనుండి జ్ఞానం – రజస్సు నుండి అత్యాశ, తమస్సునుండి పొరపాటు, అజ్ఞానం, మూఢత్వం జనిస్తాయి.

ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా అధోగచ్ఛన్తి తామసాః ॥ 18

సాత్వికులు ఊర్ధ్వలోకాలకు, రాజసికులు మధ్యమ భూలోకానికి, తామసికులు అధోలోకాలకు వెళ్లుతారు.

నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19

త్రిగుణాలకన్న వేరుకర్తలేడని, గుణాతీత పరమాత్మ ఉన్నాడనీ తెలుసుకోగల్గినవాడు నాస్వరూపాన్ని అందుకుంటాడు.

గుణానేతానతీత్య త్రీన్దేహీ దేహసముద్భవాన్ ।
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే ॥ 20

దేహోత్పత్తి కారకాలైన త్రిగుణాల నతిక్రమించివాడు, జనన, మరణ, వార్ధక్య దుఃఖాల నుండి విముక్తుడై అమృతత్వాన్ని పొందుతాడు.

అర్జున ఉవాచ –

కైర్లింగైః త్రీన్ గుణాన్ ఏతాన్ అతీతో భవతి ప్రభో ।
కిమాచరః కథం చైతాన్ త్రీన్‌గుణాన్ అతి వర్తతే ॥ 21

ప్రభో! ఏ లక్షణాల ద్వారా త్రిగుణాల నతిక్రమించిన వానిని గుర్తించగలం? అతని ప్రవర్తన యెలా ఉంటుంది? ఈ త్రిగుణాల నతడెలా అతిక్రమించగలడు?

శ్రీభగవానువాచ –

ప్రకాశం చ ప్రవృత్తించ మోహమేవ చ పాణ్డవ ।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాఙ్క్షతి ॥ 22

సత్వజనిత ప్రకాశం, రజోజనిత కార్యోత్సాహం, తమోజనిత మూఢతలు కలిగినపుడు వాటిని ద్వేషింపని వాడు, అవి లేనపుడు వాటికోసం కాంక్షించని వాడు గుణాతీతుడు.

ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।
గుణావర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే ॥ 23

సంబంధం లేనివానిలా కూర్చుండి, గుణాలచే చలింపక, గుణాలు వర్తిస్తున్నవని తెలిసినా ఆత్మనిష్ఠుడై తమక పడకుండ ఉండేవాడు!

సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాఞ్చనః ।
తుల్యప్రియాప్రియో ధీరస్తుల్యనిన్దాత్మ సంస్తుతిః ॥ 24

సుఖదుఃఖాల పట్ల సమబుద్ధితో, ఆత్మయందు సుస్థిరుడై, మట్టిని, రాతిని, బంగారాన్నీ ఒక్కటిగనే చూస్తూ, ఇష్టానిష్టాలపట్ల సముడై, నిందాస్తుతులకు సమచిత్తుడగుధీరుడు.

మానావమానయోస్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారమ్భపరిత్యాగీ గుణాతీస్స ఉచ్యతే ॥ 25

పురస్కార తిరస్కారాల పట్ల, మిత్రా అమిత్రుల పట్ల సమబుద్ధిగల్గి, యత్నాలన్నింటినీ త్యజించిన వాడు గుణాతీతుడు.

మాం చ యోఽవ్యభిచారేణ భక్తి యోగేన సేవతే ।
స గుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మ భూయాయ కల్పతే ॥ 26

నన్ను, నిశ్చల భక్తితో సేవించువాడు గూడ, గుణాతీతుడై బ్రహ్మీ భూతుడగుట కర్హత పొందుతాడు.

బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమమృత స్యావ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ ॥ 27

ఎందుకంటే? సనాతన ధర్మానికి, అఖండ సుఖానికీ, అక్షయ నిర్వికార బ్రహ్మమునకు నేను నిలయాన్ని!

గుణత్రయ విభాగ యోగమనే పేరుగల పదునాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశాధ్యాయము

పురుషోత్తమ ప్రాప్తి యోగము

శ్రీభగవానువాచ –

ఊర్ధ్వ మూలమధః శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

పైనున్నపరమాత్మ మూలము(చెట్టువేరు)గ – కింది బ్రహ్మాదులు (జీవాత్మలు) శాఖలుగ – కర్మకాండ రూపాలైన వేదాలు ఆకులుగ కలిగిన, యీ సంసార రూప అశ్వత్థ (రావి)వృక్షం శాశ్వతమని చెప్పబడింది.

అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా ः గుణప్రవృద్ధా విషయప్రవాళాः ।
అధశ్చ మూలాన్యనుసన్తతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2

త్రిగుణాలచే పోషింపబడి దాని కొమ్మలు క్రిందను, మీదను వ్యాపించి ఉన్నాయి. ఇంద్రియ విషయాలు దాని చిగుళ్ళు. మనుజలోకంలో ధర్మాధర్మ కర్మలను ఉత్పత్తి చేయుచున్నవే దానివేళ్ళు

న రూపమస్యేహ తథోపలభ్యతే నాన్తో న చాదిర్న చ సమ్ప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూల మసఙ్గశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥ 3

దీని యథార్థరూప మిచట గోచరించదు. దాని ఆది, అంతం, ఉనికీ కనిపించవు. స్థిరంగా పాతుకుని ఉండే సంసారనెడి అశ్వత్థ వృక్షాన్ని, నిశిత వైరాగ్య (అనాసక్తి) శస్త్రంతో ఖండించాలి.

తతः పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్గతా న నివర్తన్తి భూయः ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతः ప్రవృత్తిः ప్రసృతా పురాణీ ॥ 4

ఎక్కడికి వెళ్లితే జ్ఞానులిక తిరిగిరారో, ఆ బ్రహ్మపదాన్వేషణ చేయాలి. అనాదియైన సంసార ప్రవాహ మెవని నుండి వెలువడిందో, ఆదిమ పురుషు (పరమాత్మ) నాశ్రయించాలి. (శరణు పొందాలి).

నిర్మానమోహా జితసఙ్గదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।
ద్వంద్వైర్విముక్తా ః సుఖదుఃఖ సంజ్ఞైగచ్ఛన్త్యమూఢాః పదమవ్యయంతత్॥ 5

గర్వ, మోహరహితులై, అనురాగదోషాన్ని జయించి, ఆత్మ నిష్ఠులై, నిష్కాములై, సుఖదుఃఖ ద్వంద్వాతీతులై జ్ఞానులా అక్షయ పదాన్ని చేరుకుంటారు.

న తద్భాసయతే సూర్యోన శశాఙ్కో న పావకః ।
యద్గత్వాన నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥ 6

ఎచటి కేగిన వారిక తిరిగిరారో, సూర్య చంద్రాగ్నులు ప్రకాశింపని (వాటితో అవసరంలేని) దే నా పరమపదం.

మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।
మనః షష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7

నాలోని నిత్యాంశ యొకటి ప్రాణిలోకంలో జీవునిగ పుట్టి ప్రకృతిలోని పంచేంద్రియాలను మనసును ఆకర్షిస్తున్నది.

శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥ 8

వాయువు పుష్పాదుల నుండి పరిమళాలను కొనిపోవునట్లు శరీరాన్ని ధరించు విడుచు సమయాల్లో ఆత్మ వీనిని (ఇంద్రియాలు+మనసు) తీసుకెళ్తుంది.

శ్రోతం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥ 9

ఆత్మ కన్ను, ముక్కు, చెవి, చర్మం, నాలుక, మనసుల నాశ్రయించి ఇంద్రియ విషయాలను బోధిస్తుంటుంది.

ఉత్క్రామన్తం స్థితం వాపి భుఞ్జానం వా గుణాన్వితమ్ ।
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుష ఃు ॥ 10

ఆత్మయొక్క దేహంనుండి మరో దేహానికెళ్తున్నప్పుడు గాని, ఆ దేహంలోనే ఉన్నప్పుడు గాని విషయాలను భోగించునపుడైనా గుణాలతో కూడియున్నప్పుడైనా మూఢులు చూడలేరు గాని, జ్ఞాన నేత్రులు చూస్తారు.

యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మ న్యవస్థితమ్ ।
యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్య చేతసః ॥ 11

సిద్ధత్వం కోసం ప్రయత్నించే యోగులు పరమాత్మ తమ యందే యుండటాన్ని చూస్తారు. అపవిత్రులు, అవివేకులు ప్రయత్నించినా చూడజాలరు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయ తేఽఖిలమ్ ।
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ ॥ 12

జగత్తునంతా ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సు చంద్రాగ్నుల తేజస్సుగూడ నా తేజస్సేనని తెల్సుకో.

గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా ।
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వారసాత్మకః ॥ 13

నా ఓజోశక్తితో నేను భూలోకాన ప్రవేశించి, ప్రాణులన్నింటీ భరిస్తున్నాను. జలస్వరూప చంద్రుడునై ఓషధులనెల్ల పోషిస్తున్నాను.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14

జఠరాగ్ని రూపాన ప్రాణుల దేహాన నిలిచి, ప్రాణ, అపానవాయు సమాయుక్తుడనై నాల్గువిధాలా అన్నాన్ని అరిగిస్తాను. (జీర్ణమయ్యేలా చేస్తాను.)

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తఃస్మృతి జ్ఞానమపోహనం చ ।
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్ ॥ 15

సకల హృదయాలలో నేనే నిల్చియుంటాను. గత జన్మస్మృతి, అతిలోకజ్ఞానం యీ రెండిటి విస్మృతి, నావల్లనే కలుగుతాయి. వేదవిదుడను, వేదాంత కర్తను, వేదజ్ఞుడను కూడ నేనే.

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే ॥ 16

ఈ లోకంలో క్షరుడు – అక్షరుడను పురుషులిద్దరున్నారు. వినాశశీలమైన ప్రాణి సమూహమంతా, క్షరుడు – జీవుల్లో కూటస్థరూపాన ఉన్న జీవాత్మ అక్షరుడు.

ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।
యో లోక త్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ 17

ఇంకా పరమాత్ముడనే పురుషోత్తముడున్నాడు. అతడు అవ్యయుడు, ముల్లోకాల్లో వ్యాపించి వానిని పోషించు ఈశ్వరుడతడే!

యస్మాత్క్షరమతీతోఽహమక్ష రాదపి చోత్తమః ।
అతోఽస్మిలోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ 18

క్షరునకతీతుణ్ణి, అక్షరుని కన్నా ఉత్తముణ్ణి నేను. అందువలన వేదాలలో పురుషోత్తమ నామంతో లోకంలో ప్రసిద్ధుడనై ఉన్నాను.

యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19

మూఢతారహితుడై, పురుషోత్తమునిగా నన్ను తెలుసుకున్నవాడు, పూర్ణజ్ఞానియై, నిండు హృదయంతో నన్ను భజిస్తుంటాడు.

ఇతి గుహ్యతమం శాస్త్రమిదము క్తం మయాఽనఘ ।
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్కృతకృత్యశ్చ భారత ॥ 20

అర్జునా! అత్యంత గుప్తమైన ఈ శాస్త్రాన్ని నీకు బోధించాను. దీని తత్వాన్ని తెల్సుకోగల్గినవాడు మహోన్నత ఆత్మజ్ఞానియై కృతార్థుడౌతాడు.

పురుషోత్తమ ప్రాప్తియోగమనే పేరుగల, పదిహేనవ అధ్యాయం
సమాప్తం.

షోడశాధ్యాయం

దైవాసురసంపద్విభాగయోగం

శ్రీభగవానువాచ –

అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞాన యోగవ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ 1

శ్రీభగవానుడన్నాడు –

భారతా! నిర్భీతి, చిత్తశుద్ధి, జ్ఞాననిష్ఠ, యోగసుస్థిరత, దానం, నిగ్రహం, యజ్ఞం, శాస్త్రపఠనం, తపస్సు, సరళత్వం.

అహింసా సత్యమక్రోధస్త్యాగః శాన్తిరపైశునమ్ ।
దయా భూతేష్వలోల త్వం మార్దవం హ్రీ రచాపలమ్ ॥ 2

అహింస, సత్యం, కోపరాహిత్యం, త్యాగం, శాంతి, పరులదోషాలెంచ కుండుట, భూతదయ, దురాశలేమి, మృదువర్తన, వినమ్రత, స్థిరత్వం.

తేజః క్షమాధృతిః శౌచమద్రోహో నాతిమానితా ।
భవన్తి సమ్పదం దైవీమభిజాతస్య భారత ॥ 3

ధైర్యం, సహనం, చిత్తస్థైర్యం, శుచిత్వం, ద్రోహచింతలేమి, గర్వరాహిత్యం, ఇవన్నీ దైవీ సంపద.ఇవి దైవీ స్థితిలో పుట్టిన వాని లక్షణాలు.

దమ్భో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థసమ్పదమాసురీమ్ ॥ 4

కపటం, గర్వం, అహంకారం, కోపం, పరుషత్వం, అజ్ఞత, ఇవి అసుర సంపద, ఆసురీస్థితిలో పుట్టిన వాని లక్షణాలు.

దైవీ సమ్పద్విమోక్షాయ నిబన్ధాయాసురీ మతా ।
మా శుచః సమ్పదం దైవీమభిజాతోఽసి పాణ్డవ ॥ 5

దైవీస్థితి ముక్తికి, అసుర స్థితి బంధనానికీ మార్గమంటారు. అర్జునా శోకింపకు, నీవు దైవీ స్థితిలో జన్మించావు.

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥ 6

లోకంలో దైవగుణం ఆసురగుణం అను రెండురకాల ప్రాణి సమూహాలు సృష్టించబడినాయి. దైవగుణ లక్షణాలను సవిస్తరంగా చెప్పాను. ఇక అసురగణ లక్షణాలను వివరిస్తాను విను.

ప్రవృత్తిం చ నివృత్తించ జనా న విదురాసురా ఃఽ ।
న శౌచం నాపి చాచారో న సత్యం తేషువిద్యతే ॥ 7

(అసురగణాలవారు) జన్మ సాఫల్యతా కార్యాకార్యాల నెరుగరు. శుచిత్వం, సత్యం, సత్ప్రవర్తన వీరి యందుండవు.

అసత్య మప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।
అపరస్పరసమ్భూతం కిమన్యత్కామహైతుకమ్ ॥ 8

జగత్తు అసత్యం, నైతిక మూల మేమీలేదు. ఈశ్వరుడు లేడు, కామ ప్రేరిత స్త్రీ పురుష సంయోగ ఫలితమే జగదుత్పత్తి. ఇందుకు మించిన మూలమేమీ లేదంటారు.

ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః ।
ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః ॥ 9

ఇట్టిభావాలు గల్గిన ఈ అల్పబుద్ధులు, వినష్టాత్ములు, ఉగ్రకర్ములు, జగద్విరోధులౌతున్నారు. వారు జగద్వినాశనానికే పుడుతున్నారు.

కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమానమదాన్వితాః ।
మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ప్రవర్తన్తే శుచివ్రతాః ॥ 10

తీరని కోర్కెలు, కపట, అహంభావ, గర్వ, విమూఢతల కారణంగా దుష్టభావాలతో అశుద్ధవర్తను లౌతున్నారు.

చిన్తామపరిమేయాం చ ప్రళయాన్తాముపాశ్రితాః ।
కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితాః ॥ 11

చావుతోగాని అంతంగాని, అపరిమిత కోర్కెలతో కామోపభోగాన్నే సర్వస్వంగా భావించి, అదే జీవిత పరమార్థమనుకుంటారు.

ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః।
ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసఞ్చయాన్ ॥ 12

వందలాది ఆశల పరంపరలతో బంధించబడి కామక్రోధ పరాయణులై ఉంటారు. కామభోగాల నిమిత్తమై అధర్మ మార్గాలలో ధనార్జనకు పాల్పడుతుంటారు.

ఇదమద్య మయా లబ్ధమిదం ప్రాప్స్యే మనోరథమ్ ।
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥ 13

నేడిది లభించింది. ఇంకానా కోర్కెల్ని సాధించుకుంటాను. ఈ ధనం నాది. ఇంకా ధనాన్ని సంపాదిస్తాను.

అసౌ మయా హతః శత్రుర్హనిష్యే చాపరానపి ।
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్సుఖీ ॥ 14

ఈశత్రువును చంపాను. మిగిలిన శత్రువుల్నీ చంపుతాను, నేను ప్రభుడను, భోగిని, పురుషార్థ సాధకుడను, బలశాలిని సుఖినీ

ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తిసదృశో మయా ।
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః॥ 15

నేను ధనాఢ్యుణ్ణి, సద్వంశ సంజాతుణ్ణి, నాకు సాటి వేరెవ్వరు లేరు. నేను యజ్ఞం జేస్తా, దానం జేస్తా, ఆనందిస్తానని అజ్ఞాన మోహితులై

అనేక చిత్తవిభ్రాన్తా మోహజాలసమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽశుచౌ ॥ 16

పలు సంకల్పాలతో, చిత్ర విభ్రమకులోనై, మూఢత అనే వలలో చిక్కుకొని, కామభోగాల్లో మునిగి తేలుతూ కశ్మలమైన నరకంలో పడతారు.

ఆత్మసమ్భావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః ।
యజన్తే నామయజ్ఞైస్తే దమ్భేనా విధిపూర్వకమ్ ॥ 17

తామే గొప్పవారమని భావిస్తూ, గర్వోన్మత్తులై, ధన, దురహంకారంతో, కన్నుమిన్నుగానక విధ్యుక్త విధానాన్నుల్లంఘించి, కపటంగా, నామ యజ్ఞాలు చేస్తారు.

అహఙ్కారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।
మామాత్మపరదేహేషు ప్రద్విషన్తోఽభ్యసూయకాః ॥ 18

అహంకార, బల, గర్వ, కామ, క్రోధ, యుక్తులైన అసూయపరులు, తమలోను, పరులలోను ఆత్మరూపాన ఉన్న నన్ను ద్వేషిస్తుంటారు.

తానహం ద్విషతః క్రూరాన్సంసారేషు నరాధమాన్ ।
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు ॥ 19

విద్వేషులు, క్రూరులు, అశుభవర్తనులు, అగు యీ నరాధములను, నేను సదా ఈ లోకంలోని అసుర (పులులు, సర్పాల) యోనులందే కూలదోస్తాను.

ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।
మామప్రాప్యైవ కౌన్తేయ! తతో యాన్త్యధమాం గతిమ్ ॥ 20

అసుర గర్భాలలో పడిన వారు జన్మజన్మకూ మూఢులౌతూ, నన్నుచేరక మరీమరీ అధమాధములుగా పుడుతుంటారు.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథా లోభ స్తస్మాదేతత్త్రయంత్యజేత్ ॥ 21

ఆత్మ వినాశకర నరక ద్వారాలు మూడు అనేవి కామం, క్రోధం, లోభం. కాబట్టి ఈ మూడింటిని విడనాడాలి.

ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైస్త్రిభిర్నర ః ।
ఆచరత్యాత్మనః శ్రేయస్తతో యాతిపరాంగతిమ్ ॥ 22

ఈ నరకద్వారాలు మూడింటినీ దాటినవాడు, ఆత్మ శ్రేయోదాయకాచరణ మొనర్చి మోక్షం పొందుతాడు.

యః శాస్త్రవిధిముత్సృజ్యవర్తతే కామకారతః ।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాంగతిమ్ ॥ 23

శాస్త్ర విధులనుల్లంఘించి, విశృంఖలంగా ప్రవర్తించువాడు, సిద్ధత్వమందడు, సుఖాన్ని, మోక్షాన్ని పొందలేడు.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్త కర్మ కర్తుమిహార్హసి ॥ 24

కాబట్టి కర్తవ్యాకర్తవ్య నిర్ణయంలో శాస్త్రాలే నీకు ప్రమాణం. శాస్త్రోక్త విధినిషేధాల కనుగుణంగా నీవీ లోకంలో ప్రవర్తించాలి అర్జునా!

దైవాసుర సంద్విభాగయోగ అనే పేరుగల పదునారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశాధ్యాయం

శ్రద్ధాత్రయ విభాగయోగం

అర్జున ఉవాచ –

యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః ।
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥ 1

అర్జునుడన్నాడు –

శ్రీకృష్ణా! శాస్త్ర విధుల్ని విడనాడి శ్రద్ధగా యజ్ఞాలు చేయువారి నిష్ఠ సాత్వికమా? రాజసికమా? తామసికమా?

శ్రీభగవానువాచ –

త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ 2

శ్రీభగవానుడన్నాడు –

శరీరధారులకు ఉండే సహజశ్రద్ధ త్రివిధం సాత్త్వికం, రాజసికం, తామసికం, వీటి గూర్చివిను.

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయో యం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవసః ॥ 3

ప్రతిమనిషి యొక్క శ్రద్ధ అతని పూర్వ సంస్కారాలకనుగుణంగా ఉంటుంది. మనిషి శ్రద్ధాస్వరూపుడు, కాబట్టి అతని శ్రద్ధనుబట్టి అతని జీవన విధానముంటుంది.

యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।
ప్రేతాన్భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనాః ॥ 4

సాత్వికులు దేవతల్ని, రాజసికులు యక్షరాక్షసుల్ని, తామసికులు ప్రేత, భూత గణాలను అర్చిస్తుంటారు.

అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః ।
దమ్భాహఙ్కారసంయుక్తాః కామరాగబలాన్వితాః ॥ 5

దంభం, అహంకారం కలవారు, కామం, కాంక్షల బలంచేత నడిపించబడుతూ శాస్త్రవిరుద్ధంగా ఘోరతపస్సు చేస్తూ...

కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమచేతసః ।
మాం చైవాన్తఃశరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్ ॥ 6

బుద్ధిహీనులై, శరీరావయవాలను, శరీరమందలి అంతరాత్మనైన నన్ను పీడించు వారు అసుర స్వభావులు.

ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు ॥ 7

మనుషుల స్వభావాలనుబట్టి వారికి ప్రీతికరమైన ఆహారాలు, యజ్ఞాలు, దానాలు గూడ త్రివిధాలు.

ఆయుఃసత్త్వబలారోగ్య సుఖప్రీతివివర్ధనాః ।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః ॥ 8

ఆయుష్షు, బలం, ఆరోగ్యం, ఆకలి, సుఖం, కార్యోత్సాహశక్తి వీటిని పెంపొందించే రసవంతాలూ నెయ్యి నూనెతో కూడినవి. పుష్టికర, మనోహర పదార్థాలు సాత్వికులకు ప్రీతికరాలు.

కట్వామ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః ।
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥ 9

మిక్కిలి చేదు, పులుపు, ఉప్పు, కారాలతో వేయించినవి. మంట, బాధ, కన్నీళ్ళను కలిగించేవి, ఉష్ణ,రోగదాయక ఆహార పదార్థాలు రాజసికులకు ప్రీతికరాలు.

యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।
ఉచ్ఛిష్ట మపిచామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥ 10

నిల్వయుండినవి పాసి పోయిన దుర్వాసన, రుచిలేనివి, చద్దివి, ఎవరో ఎంగిలి చేసి వదలినవి. అపరిశుభ్ర ఆహార పదార్థాలు తామసికులకు ప్రీతికరాలు.

అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।
యష్టవ్యమే వేతి మనః సమాధాయ స సాత్త్వికః ॥ 11

ఫలాపేక్ష రహితంగా, శాస్త్రవిధ్యుక్తంగా, యజ్ఞ మందే బుద్ధినిలిపి, కర్తవ్య భావనతో చేయుయజ్ఞం సాత్వికం!

అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్ ।
ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥ 12

ఫలాపేక్షతో దంభార్థమై ఆడంబరంగా చేయు యజ్ఞం రాజసికం.

విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13

శాస్త్రవిరుద్ధంగా మంత్ర, దాన, అన్నదాన రహితంగా శ్రద్ధాహీనంగా చేయ యజ్ఞం రాజసికము.

దేవద్విజగురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥ 14

దేవతలను, జ్ఞానులు,ద్విజులు, గురువులను పూజించుట, శుచిత్వం, నిష్కల్మష ప్రవర్తనం, అహింస, బ్రహ్మచర్యం, ఇవిశారీరక తపస్సులు.

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 15

అన్యుల మనసునొప్పించనిది,సత్యం, ప్రియం, హితకరమైన సంభాషణం, వేదాధ్యయనం ఇవివాచికతపస్సులు.

మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।
భావసంశుద్ధిరిత్యేత్త త్తపో మానసముచ్యతే ॥ 16

ప్రశాంతబుద్ధి, ఉపకార శీలత, మౌనం, ఆత్మనిగ్రహం, చిత్తశుద్ధి, ఇవి మానసిక తపస్సులు.

శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరై ః ।
అఫలా కాంక్షిభిర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే ॥ 17

ఫలాపేక్షలేని కర్తవ్యనిష్ములు, పరమ శ్రద్ధతో ఆచరించు యీ త్రివిధ తపస్సులే సాత్విక తపస్సు.

సత్కారమానపూజార్థంతపో దమ్భేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్ ॥ 18

సన్మాన, గౌరవ, పూజలు పొందగోరి, విశ్వాసరహితంగా చేయు నిలకడలేని, స్థిరంకాని తపస్సు రాజసిక తపస్సు.

మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ ॥ 19

మూఢత్వం (మూర్ఖత్వం)తో, తనమనోదేహాలను బాధించుకొనుటకో, అన్యులకు హాని జరుగుటకో చేయునది తామసిక తపస్సు.

దాతవ్యమితి యద్దానం దీయతే నుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20

దానం చేయటాన్ని కర్తవ్యంగా భావించి, ప్రత్యుపకారం చేయలేని దానపాత్రునకు, సముచిత ప్రదేశాన తగినసమయాన చేయు నిస్వార్థదానం సాత్విక దానం.

యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వాపునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21

ప్రత్యుపకారార్థమో, ఫలాపేక్షతోనో, మనసున నొచ్చుకుంటూ, ఇష్టం లేకుండా చేయు దానం రాజసిక దానం.

అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే ।
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥ 22

తగని చోట, అపాత్రులకు, దానస్వీకర్తలపట్ల గౌరవాదరాలు చూపక, తృణీకారంగా ఛీత్కరిస్తూ చేయునది తామసిక దానం.

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥ 23

ఓం-తత్-సత్ అన్నది బ్రహ్మకు త్రివిధనామం, వాటివల్లనే ఆదిలో విప్రులు, వేదాలు, యజ్ఞాలు రూపొందింప బడినాయి.

తస్మాత్ 'ఓం' ఇత్యుదా హృత్య యజ్ఞదానతపఃక్రియాః ।
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24

అందుకే, వేదానుసారులు సదా ఓం శబ్దోచ్చారణతోనే శాస్త్రోక్త యజ్ఞ, తపో, దానాలు చేస్తుంటారు.

తదిత్యనభిసన్ధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః ।
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాఙ్క్షిభిః ॥ 25

మోక్షాను రక్తులు, 'తత్' శబ్దోచ్చారణతోనే, వివిధ యజ్ఞ, తపోదాన క్రియలను ఫలాపేక్ష రహితంగా చేస్తుంటారు.

సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే ।
ప్రశస్తే కర్మణి తథా 'సత్' శబ్దః పార్థ! యుజ్యతే ॥ 26

'సత్' శబ్దం సత్తా(సత్యమైనది) మంచిది, సత్కార్యమను అర్థంలో ఉచ్చరింపబడుతోంది.

యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే ।
కర్మచైవ తదర్థీయం 'సత్' ఇత్యేవాభిధీయతే ॥ 27

యజ్ఞ తపోదాన నిష్ఠ అనిగూడ సత్ శబ్దభావం. ఈశ్వర ప్రీత్యర్థం చేయుకర్మ అనుభవాన్ని గూడ తెలియజేస్తుంది సత్‌శబ్దం.

అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।
అసదిత్యుచ్యతే పార్థ! న చ తత్ప్రేత్యనో ఇహ ॥ 28

విశ్వాసరహితంగా చేసిన యజ్ఞం-దానం-క్రియ-తపస్సు, యివన్నీ అసత్ శబ్దంచేత సూచించబడుతాయి. ఇహ పరాలలోనూ అవి నిష్ఫలాలు.

శ్రద్ధాత్రయవిభాగమనే పేరు గల పదునేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశాధ్యాయం

మోక్షసన్న్యాసయోగం

అర్జున ఉవాచ -

సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీ కేశ పృథక్కేశినిషూదన ॥ 1

అర్జునుడన్నాడు -

సన్న్యాసము, త్యాగము వీటి తత్వాన్ని నాకు విడివిడిగా తెలుసుకోవాలని ఉంది కేశి నిషూదనా! కృష్ణా!

శ్రీభగవానువాచ -

కామ్యానాంకర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥ 2

ఫలాకాంక్షతో చేసేకర్మల్ని త్యజించటాన్నేసన్న్యాస మన్నారు ప్రాజ్ఞులు. సకల కర్మఫలాలను త్యజించటాన్నే త్యాగమన్నారు జ్ఞానులు.

త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।
యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యమితి చాపరే ॥ 3

కర్మలన్నీ దోషయుక్తాలు గనుక త్యజించాలని కొందరు, యజ్ఞం, దానం, తాపం త్యజించరాదని మరికొందరు ప్రాజ్ఞులు చెబుతున్నారు.

నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సమ్ప్రకీర్తితః ॥ 4

త్యాగాన్ని గూర్చి నా నిశ్చితాభిప్రాయాన్ని విను. త్యాగం మూడు విధాలుగా చెప్పబడింది.

యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవతత్ ।
యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 5

యజ్ఞ, తపో, దాన కర్మలు జ్ఞానులకు చిత్తశుద్ధిదాయక కర్తవ్యాలు. కాబట్టి వాటిని త్యజించరాదు.

ఏతాన్యపితుకర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ ।
కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మతము త్తమమ్ ॥ 6

ఈ కర్మలను గూడ, ఫలాపేక్ష, కర్తృత్వాభిమాన రహితంగా చేయాలన్నది నా నిశ్చయం. ఇదే ఉత్తమ సిద్ధాంతం.

నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।
మోహా త్తస్య పరిత్యాగస్తామసః పరికీర్తితః ॥ 7

నిత్యకర్మల సన్న్యాసం యుక్తం కాదు, మూర్ఖంగా వాటిని త్యజించడం తామసమౌతుంది.

దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయా త్త్యజేత్ ।
సకృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥ 8

కష్టమైనదని, తద్వారా దేహానికి శ్రమ యన్న భావనతో చేసే త్యాగం రాజసికం. తద్వారా అతడాకార్య ఫలాన్ని కోల్పోతాడు.

కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।
సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః॥ 9

అర్జునా! శాస్త్ర బద్ధకర్మల్ని, విధ్యుక్త కర్మలుగా భావించి, ఆసక్తిని, ఫలాపేక్షను త్యజించి వాటిని నిర్వహించుట సాత్త్విక త్యాగం.

న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్న సంశయః ॥ 10

సంశయ రహితుడు, జ్ఞాననిష్ఠుడు, శుద్ధ సత్వగుణి యైన త్యాగి, ఇష్టకర్మల యందాసక్తిని, అయిష్టకర్మల పట్ల ద్వేషాన్నీ చూపడు.

న హి దేహభృతా శక్యంత్యక్తుం కర్మాణ్యశేషతః ।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥ 11

కర్మలను పూర్తిగా త్యజించుట శరీరధారులకు సాధ్యంకాదు. కాబట్టి, కర్మలనుగాక, కర్మఫలాలను త్యజించుటే త్యాగం.

అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।
భవత్య త్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥ 12

కర్మఫలాలను త్యజించని వారికి మరణానంతరం ఇష్ట-అనిష్ట-మిశ్రమ ఫలితాలు సంభవిస్తాయి. త్యాగులకవి కలగవు.

పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాఙ్ఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥ 13

అర్జునా! కర్మలన్నీ నెరవేరుటకు కారణాలైదని, సాంఖ్యం చెబుతున్నది. వాటిని నా వలన.

అధిష్ఠానం తథా కర్తాకరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్ ॥ 14

1. అధిష్ఠానం(దేహం) 2. కర్త 3. వివిధ ఇంద్రియాలు 4. వేర్వేరు చేష్టలు 5. ఇంద్రియాధిష్ఠానదేవతలు.

శరీరవాఙ్మ నోభిర్యత్కర్మ ప్రారభతే నరః ।
న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥ 15

మనిషి చేసే-న్యాయ, అన్యాయ, దైహిక, మానసిక,వాగ్రూప కర్మలన్నింటికీ ఈ ఐదే కారణాలు.

తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు యః ।
పశ్యత్యకృతబుద్ధిత్వాన్న సపశ్యతి దుర్మతిః ॥ 16

ఈ వాస్తవాన్ని మరచి, అజ్ఞానంతో వాటన్నింటికీ కర్తను తానేనని భావించి దుర్మతి సత్యాన్నిదర్శించలేడు.

యస్య నాఽహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।
హత్వాపి స ఇమాల్లోకాన్న హన్తిన నిబధ్యతే ॥ 17

కర్తృత్వభావ, అహంభావశూన్యుడు, శుభాశుభాలకు పొంగని కుంగని నిష్కాముడు, చంపిననూ, చంపనివాడే!

జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధాకర్మచోదనా ।
కరణం కర్మకర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥ 18

జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాత యీ మూడూ (త్రిప్పటి) కర్మాచరణకు ప్రేరేపణకారణాలు. ఉపకరణం, ఉద్దేశం, కర్త యీ మూడు కర్మకు ఆశ్రయాలు.

జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణుతాన్యపి ॥ 19

గుణ భేదానుసారం జ్ఞానం, కర్మ, కర్తలు త్రివిధాలని సాంఖ్యం చెబుతున్నది. వాటిని యథాతథంగా విను.

సర్వభూతేషు యేనై కం భావమవ్యయమీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తద్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥ 20

విభిన్నాలుగా కనిపించే ప్రాణులన్నింటా ఒక్కటైయున్న అద్వితీయ, అక్షయ వస్తువు (ఆత్మ)ను చూచువాని జ్ఞానం సాత్వికం.

పృథక్త్వేవన తు యద్ జ్ఞానం నానాభావన్పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు తద్ జ్ఞానం విద్ధి రాజసమ్ ॥ 21

ప్రాణులన్నింటా వివిధ, విభిన్న, ఆత్మలను చూచువానిజ్ఞానం రాజసికం.

యత్తుకృత్స్నవదేకస్మి కార్యే సక్తమ హైతుకమ్ ।
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥ 22

ప్రకృతి కార్యమైన శరీరాన్నే సర్వస్వంగా భావించి, దానియందే ఆసక్తిని కలిగించునట్టి, తాత్వికంగా అర్థరహితమైన, అహేతుకం, అవాస్తవం తుచ్ఛమైన, అటువంటి జ్ఞానం తామసికం!

నియతం సఙ్గరహితమరాగద్వేషతః కృతమ్ ।
అఫలప్రేప్సునా కర్మయత్తత్సాత్త్వికముచ్యతే ॥ 23

కర్తృత్వాభిమాన, ఫలాపేక్ష, రాగద్వేష రహితంగా చేయు కర్తవ్య కర్మ సాత్వికం.

యత్తుకామేప్సునా కర్మ సాహఙ్కారేణ వా పునః ।
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥ 24

కోర్కెలతోనో, అహంకారంతోనో మిక్కిలి ప్రయాసపడి చేయు కర్మం రాజసికం.

అనుబన్ధం క్షయం హింసామనపేక్ష్యచ పౌరుషమ్ ।
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే ॥ 25

చేసే కర్మల శుభాశుభాలను,శక్తిని, ద్రవ్యక్షయాన్ని, పరహింసను, స్వీయ సామర్థ్యాన్నీ అంచనా వేసుకోకుండానే మూర్ఖంగా చేయుకర్తవ్యం తామసికం.

ముక్తసఙ్గోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥ 26

ఆసక్తిరహితుడు, అహంకార శూన్యుడు, ధైర్యోత్సాహయుక్తుడు, ఫలాఫలాలకు పొంగక, కుంగక యుండు కర్త సాత్వికుడు.

రాగీ కర్మఫల ప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకో శుచిః ।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥ 27

నిషిద్ధాలను కోరువాడు, కర్మఫలాకాంక్షిలోభి, హింసాశీలుడు, అపవిత్రుడు, హర్షవిషాదవిధేయుడు ఐనట్టి కర్త రాజసికుడు.

అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికో లసః ।
విషాదీ దీర్ఘసూత్రీచకర్తా తామస ఉచ్యతే ॥ 28

అస్థిరుడు, పామరుడు, వినయహీనుడు, వంచకుడు, స్వార్థంకోసం పరులకు హాని చేసేవాడు, సోమరి, అధీరుడు, జాగులు చేయువాడు అట్టి కర్త తామసికుడు.

బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥ 29

గుణాలను బట్టి బుద్ధిలో, ధృతిలో యేర్పడు త్రివిధ బేధాలను విడివిడిగా పూర్తిగా వివరిస్తాను.

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।
బన్ధం మోక్షం చ యా వేత్తిబుద్ధిః సా పార్థ! సాత్త్వికీ ॥ 30

కర్మ,కర్మత్యాగ మార్గాలను, కర్తవ్యాకర్తవ్యాలను, భయాభయాలను, బంధ మోక్షకారణాలను, తెల్సుకున్న వాని బుద్ధి సాత్వికం!

యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।
అయథా వత్ప్రజానాతి బుద్ధిః సా పార్థ! రాజసీ ॥ 31

ధర్మాధర్మాలను, కార్యాకార్యాలను తప్పుగా గ్రహించు వాని బుద్ధి రాజసం!

అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా ।
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ! తామసీ ॥ 32

తమస్సుతో కప్పివేయబడి, ధర్మాన్ని అధర్మంగాను అలాగే అన్నింటినీ తారుమారుగా గ్రహించువాని బుద్ధి తామసం.

ధృత్యాయయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః ।
యోగేనాఽవ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ! సాత్త్వికీ ॥ 33

మనసు, ప్రాణం, ఇంద్రియాల క్రియలను సక్రమంగా నడుపుతూ యోగం చేత సుస్థిరత చెందిన ధృతి సాత్వికం!

యయా తు ధర్మ కామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున ।
ప్రసఙ్గేన ఫలాకాంక్షీధృతిః సా పార్థ! రాజసీ ॥ 34

ధర్మార్థకామాల దిశగా బుద్ధిని మరల్చి, అందు ప్రతిదాని ఫలాన్నీ పూర్ణమైన ఆసక్తితో అభిలషింపజేయు ధృతి రాజసం.

యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।
న విముఞ్చతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ ॥ 35

బుద్ధిహీనతచే నిద్ర, భయ, శోక, చింత, ఉన్మత్తాదులను పరిత్యజింపకుండా చేయు ధృతి తామసం.

సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి ॥ 36

త్రివిధ సుఖాన్ని గూర్చి ఇక విను. అభ్యసించేకొద్దీ మనిషి దేనియందు ఆనందిస్తాడో దేనియందు దుఃఖాన్ని పోగొట్టుకుంటాడో...

యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధిప్రసాదజమ్ ॥ 37

తొలుత విష ప్రాయంగాను, కడకు అమృత ప్రాయంగా ఉండే సుఖం సాత్వికం. ప్రసన్న బుద్ధిత్వం వల్ల సాత్విక సుఖం కలుగుతుంది.

విషయేంద్రియసంయోగాద్యత్తదగ్రేఽమృతోపమమ్ ।
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥ 38

విషయాలతో ఇంద్రియాల కలయికచే కలుగు సుఖం మొదట అమృత ప్రాయంగా, అంతిమంగా విషప్రాయమయ్యే సుఖం రాజసం!

యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః ।
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥ 39

నిద్ర, మాంద్యం, పొరపాటు, వీనిచే కలుగు సుఖం ఆత్మ సమ్మోహతయందు ప్రారంభమై దానిలోనే అంతమగు సుఖం తామసికం!

న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్ త్రిభిర్గుణైః ॥ 40

భూలోక ప్రాణులలోగాని, స్వర్గదేవతల్లోగాని ఈ త్రిగుణాలులేని వారు లేనేలేరు.

బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరన్తప ।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥ 41

వారి వారి స్వభావ జనిత గుణాలకనుగుణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కర్మాలు విభజింపబడినాయి.

శమోదమస్తపః శౌచం క్షాన్తిరార్జవమేవ చ ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥ 42

శమ, దమాలు (మనో, ఇంద్రియ నిగ్రహాలు) తపస్సు, శుచిత్వం, సహనం, నిష్కాపట్యం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తికత ఇవి బ్రాహ్మణులకు స్వభావజనితమైన పనులు.

శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।
దానమీశ్వరభావశ్చ క్షాత్రంకర్మ స్వభావజమ్ ॥ 43

శౌర్యము, ధీరత, స్థైర్యం, సద్యఃస్ఫూర్తి, యుద్ధానికి వెన్ను చూపమి, ఈవి, ప్రభుత్వం ఇవి క్షత్రియులకు స్వభావ జనితమైన పనులు.

కృషిగౌరక్ష్య వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥ 44

సేద్యం, పశుపోషణం, వర్తకం, వైశ్యులకు సేవాకార్యక్రమాలు శూద్రులకు స్వభావజనితమైన పనులు.

స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।
స్వకర్మనిరతః సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు ॥ 45

తనపనిని తాను శ్రద్ధతో నిర్వహించు ప్రతియొక్కడూ సిద్ధత్వం పొందుతాడు. స్వీయ కర్మ నిరతులెలా సిద్ధిని పొందుతారో చెబుతాను విను.

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః ॥ 46

ఎవనినుండి ప్రాణులన్నీ ఉద్భవిస్తున్నాయో, విశ్వమంతా ఎవనిచే పరివ్యాప్తమై యున్నదో, అతనిని (పరమాత్మను) తనవిధి నిర్వహణ ద్వారా పూజించిన మానవుడు సిద్ధిని పొందుతాడు.

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47

చక్కగా, నిర్వహించిన అన్యునిపని కన్నా, దోషంతో నిర్వహించిన స్వీయకర్మమే శ్రేయస్కరం. స్వభావ జనిత కర్మాచరణుడు పాపమందడు.

సహజం కర్మ కౌన్తేయ సదోషమపి న త్యజేత్ ।
సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥ 48

జన్మసిద్ధమైన పని దోషయుక్తమైనా దాన్ని త్యజించరాదు. ఎందుకంటే? పొగచేత అగ్నివలె, కర్మములన్నీ దోషం చేత ఆవరించబడినవే.

అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సంన్యాసేనాధిగచ్ఛతి ॥ 49

అర్జునా ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తిలేనివాడు,ఆత్మనిగ్రహం కలవాడు, వాంఛారహితుడూ యుండు వాడు సంన్యాసం వలన పరమ శ్రేష్ఠమైన నైష్కర్మ్య సిద్ధిని పొందుతాడు.

సిద్ధిం ప్రాప్తోయథా బ్రహ్మతథాఽఽప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ 50

అట్టి సంసిద్ధి నందిన మనిషి, జ్ఞాన పరమార్ధమైన బ్రహ్మానెలా పొందుతాడో సంగ్రహంగా విను.

బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।
శబ్దాదీన్ విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 51

నిర్మలమైన బుద్ధితో, స్థైర్యంతో, దేహేంద్రియాలను నిగ్రహించి, శబ్దాది విషయాలను త్యజించి, రాగద్వేషాలను వదిలి...

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ 52

ఏకాంత ప్రదేశంలో, అల్పాహారంతో మనోవాక్కాయ కర్మాలను నియంత్రించి, నిత్యధ్యాన యోగాభ్యాసం ద్వారా వైరాగ్య సాధన చేస్తూ...

అహఙ్కారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమః శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53

అహంకార, బల, దర్ప, కామ, క్రోధాలను వీడినవాడు, నిస్సంగుడు, శాంతుడైనవాడు బ్రహ్మను పొందుట కర్హుడు.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥ 54

బ్రహ్మత్వమంది ప్రశాంత చిత్తుడైన యోగి శోకింపడు, వాంఛింపడు, సర్వప్రాణిసముడై, నాపట్ల పరమభక్తుడౌతాడు.

భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ॥ 55

అట్టి భక్తుడు నేనెవరో, ఏమిటో యధార్ధంగా తెలుసుకోగల్గుతాడు తెలుసుకున్న వెంటనే అతను నాలో ప్రవేశిస్తాడు.

సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥ 56

సదాసర్వకర్మాల నాచరిస్తూకూడ, నాశరణుజొచ్చుట చేత, నా కృపవలన నిత్యనూతన పరమపదాన్ని పొందుతాడు.

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ॥ 57

నిండుమనసుతో కర్మలన్నింటినీ నా కర్పించి, నన్నే పరమార్ధంగా భావించి స్థిరత్వబుద్ధితో సదానాయందే మనసు నిల్పుకో, అర్జునా!

మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।
అథచేత్త్వమహఙ్కారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి ॥ 58

మనసు నాపై నిల్పితే, నా కృపచేత అంతరాయాలన్నీ దాటగలవు. అహంకారంతో నామాట వినకుంటే నశిస్తావు!

యదహఙ్కార మాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥ 59

అహంకారంతో నీవు యుద్ధం చేయనని నిశ్చయించుకొనుట వృధా ఏలన నీస్వభావమే నిన్ను యుద్ధానికి ప్రేరేపిస్తుంది.

స్వభావజేన కౌన్తేయ! నిబద్ధః స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్క రిష్యస్యవశోఽపి తత్ ॥ 60

మూఢతచే నీవు చేయ నిచ్చగింపని యుద్ధాన్ని, నీ స్వభావ జనిత సంస్కారబద్ధుడవైన నీవు తప్పించుకోలేవు. ఇష్టం లేకున్నా యుద్ధం చేసి తీరుతావ్.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥ 61

ప్రాణులన్నింటా నెలకొనియున్న పరమాత్మ, తన మాయచేత వాటిని యంత్రాల్లా తిరిగేలా చేస్తుంటాడు.

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్ర సాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥ 62

నిండు హృదయంతో పరమాత్మ నాశ్రయించు (శరణు పొందు) అతని కృపచేత పరమశాంతినీ, పరమపదాన్నీ పొందుతావు.

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథాకురు ॥ 63

గోప్యాలలో, గోప్యతర జ్ఞానాన్ని నీకుప్రబోధించాను. పూర్తిగా దాన్ని మననం చేసుకుని నీకుతోచినట్లు చెయ్.

సర్వగుహ్యతమం భూయః శృణుమే పరమం వచః ।
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥ 64

నాకు ప్రియతముడవు కావున, గోప్యతమం, శ్రేష్ఠతమం,నీకు హితం, ఐనదానిని మళ్ళీ చెబుతున్నావిను.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥ 65

ప్రియుడవు కనుక నీకుప్రతిజ్ఞా పూర్వకంగా చెబుతున్నానర్జునా! నాభక్తుడవై నా (పరమాత్మ)కు నమస్కరించు. నీ యజ్ఞా(ప్రపంచ శుభదాయక కర్మ)లను నాకర్పించు. తప్పకనన్ను చేరుకుంటావ్.

సర్వధర్మా న్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 66

అర్జునా! (పాపభీతితో) దుఃఖించకు, (నీమనసు చెప్పే) ధర్మా (ధర్మా) లన్నింటినీ విడనాడి (సర్వాత్ముడనైన) నన్నాశ్రయించు, పాపాలన్నింటినుండి నిన్ను విముక్తుణ్ణి చేస్తాను.

ఇదంతే నా తపస్కాయ నా భక్తాయ కదాచన ।
న చాశుశ్రూషవే వాచ్యంన చ మాం యోఽభ్యసూయతి ॥ 67

భక్తిహీన, సేవా, తపోరహితులకు, నన్ను దురాక్షేపించినవారికీ, ఈ గీతా శాస్త్రాన్నెన్నటికీ తెలుపరాదు.

య ఇదం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥ 68

నాపట్ల భక్తితో, ఈ గీతాశాస్త్ర రహస్యాన్ని నా భక్తులకు తెలియజేయువాడు తప్పక నన్ను చేరుకుంటాడు, సందేహమేమీ లేదు.

న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి ॥ 69

అత (గీతాబోధకు)ని కన్నా నాకు ప్రీతి కలిగించువాడు మరొకడు లేడు.

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।
జ్ఞానయజ్ఞేన తేనాహమిష్టః స్యామితి మే మతిః ॥ 70

మా యొక్క ధర్మ సంవాదాన్ని భక్తితో అధ్యయనం చేసినవాడు, జ్ఞానయజ్ఞంతో నన్ను పూజించినట్లే, ఇది నా నిశ్చయం.

శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యోనర ః ।
సోఽపిముక్తః శుభాల్లోకాన్ ప్రాప్నుయాత్పుణ్యకర్మణామ్ ॥ 71

అసూయారహితుడై గీతను శ్రద్ధగా వినువాడు పుణ్యశాలు రెళ్ళేలోకాని కెళతాడు.

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ!త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చిదజ్ఞానసంమోహః ప్రనష్టస్తే ధనఞ్జయ ॥ 72

అర్జునా! దీనిని (గీతోపదేశాన్ని) ఏకాగ్రచిత్తంతో విన్నావా? నీ అజ్ఞాన జనిత మూఢత్వం నశించిందా?

అర్జున ఉవాచ –

నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాద్యుత।
స్థితోఽస్మి గతసన్దేహః కరిష్యేవచనం తవ ॥ 73

అచ్యుతా నీ కృపచేత మూఢతనశించి (ఆత్మజ్ఞాన)స్మృతి కలిగింది. నా సందేహాలు పటాపంచలైనయ్. స్థైర్యం కలిగింది (ఇక) నీ మాటను పాటిస్తాను.

సఞ్జయ ఉవాచ –

ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।
సంవాదమిమమశ్రౌషమద్భుతం రోమహర్షణమ్ ॥ 74

(అందరిలో ఆత్మరూపాన వసించే) వాసుదేవునకు, అర్జున మహాత్మునకు జరిగిన అద్భుత సంవాదాన్ని రోమాలు గగుర్పొడుస్తుండగా విన్నాను.

వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానిమం గుహ్యమహం పరమ్ ।
యోగం యోగేశ్వరాత్కృష్ణాత్సాక్షాత్కథయతః స్వయమ్ ॥ 75

యోగేశ్వరుడు శ్రీకృష్ణుడు వివరిస్తుండగా, వ్యాసుని కృపచేత పరమగోప్యమైన ఈ యోగాన్ని నేరుగావిన్నాను నేను.

రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్ ।
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥ 76

పుణ్యదాయకమూ, అద్భుతమూ అయిన శ్రీకృష్ణార్జున సంవాదం మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చి నప్పుడల్లా ఆశ్చర్యానందాలను పొందుతూనే ఉన్నాను రాజా!

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।
విస్మయో మే మహారాజ హృష్యామి చ పునఃపునః ॥ 77

(అలాగే) శ్రీకృష్ణ విశ్వరూపం గూడ గుర్తుకొచ్చినప్పుడల్లా నాకు పదే పదే ఆనందాశ్చర్యాలను కలిగిస్తూనే వుంది రాజా.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 78

యోగీశ్వరుడు శ్రీకృష్ణుడు, ధనుర్ధారి అర్జునుడూ (ఆత్మజ్ఞానం–ఆచరణ) ఉన్న చోటల్లా సిరి, విజయం, అభ్యుదయం, సుస్థిర రాజనీతి, ధర్మం (ప్రవర్ధిల్లుతూ) ఉంటాయి. ఇది నా అభిప్రాయం.

ఇది శ్రీమహాభారతం – భీష్మపర్వంలోని శ్రీమద్భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం, శ్రీకృష్ణార్జున సంవాదంలోని మోక్ష సన్న్యాస యోగమనే పదునెనిమిదవ అధ్యాయం సమాప్తం. ఓం శాంతిః శాంతిః శాంతిః

* * *

ఈ గ్రంథ రచనకై నాకుపకరించిన గ్రంథాలు

	తెలుగు అనువాదకులు
1. శ్రీ మద్భగవద్గీత శాఙ్కర భాష్యమ్	సర్వశ్రీ (శంకరాచార్యులు) డా॥పుల్లెల శ్రీరామచంద్రుఁ
2. శ్రీమద్భగవత్ గీతా రహస్యము	(బాలగంగాధరతిలక్) శ్రీ నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి
3. జ్ఞానేశ్వరీ – భగవద్గీత	(జ్ఞానేశ్వర్) తెనిగింపు : మిరియాల విమలాశర్మ
4. భగవద్గీత యథాతథం	ఎ.సి. భక్తి వేదాంత స్వామి
5. శ్రీమద్భగవద్గీత	నిర్వికల్పానందస్వామి
6. శ్రీమద్భగవద్గీతా సందేశం	స్వామిరంగనాథానంద
7. గీతాదర్శనము	(స్వామిశ్రీకాంతానంద) అమిరపునటరాజన్
8. రాజాజీ భగవద్గీత	(రాజాజీ) కిళత్తూరు శ్రీనివాసాచార్యులు
9. ఉషశ్రీభగవద్గీత	ఉషశ్రీ
10. శ్రీమద్భగవద్గీత	కందుకూరు మల్లికార్జున
11. శ్రీమద్భగవద్గీత	గుడిపాటి వెంకటచలమ్
12. శ్రీమద్భగవద్గీత	శిష్టాసుబ్బారావు
13. యోధుడు – సారధి	వి.యం.మోహనరాజ్
14. త్రైతసిద్ధాంత భగవద్గీత	ఆచార్యప్రబోధానంద యోగీశ్వరులు
15. గీతామాధుర్యము	స్వామి శ్రీరామ సుఖదాస్–వేంకటరామశర్మ

16. ఆదిశంకరాచార్యులు ఎంపికచేసిన ఉపనిషత్తుల తెలుగు అనువాదగ్రంథాలు
17. శ్రీరామకృష్ణ పరమహంస రచనలు
18. స్వామీ వివేకానంద రచనలు

19. భారతీయ తత్వశాస్త్రం	డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
20. విశ్వదర్శనం, విశ్వరూపం	నండూరి రామ్మోహనరావు
21. ధమ్మపదం, ఇండియన్ ఫిలాసఫీ	సొదుం రామ్మోహన్
22. భారతీయ దర్శనం	రాహుల్ సాంకృత్యాయన్
23.తత్వవేత్తలు	గోపీచంద్
24. విజ్ఞాన వీచికలు, మతం ఎందుకు	ఆచార్య ఎక్కిరాల భంద్వాజ
25. ఏదినిజం	ఆచార్య ఎక్కిరాల భరద్వాజ
26. మహావిశ్వం–మనభూమి	ఎస్. వెంకట్రావు
27. నిర్జీవం–జీవపరిణామం	ఎస్. వెంకట్రావు
28. వానరుడు–నరావతరణ	ఎస్. వెంకట్రావు
29. శ్రీరామకృష్ణ బోధామృతం	
30. భగవద్గీత సవిమర్శక పరిశీలన	ప్రొ॥ వీరభద్రప్ప (వల్లంపాటి వెంకటసుబ్బయ్య)
31. భగవద్గీత మనకేం చెబుతోంది?	డా॥ కె. అరవిందరావు
32. నీతిసుధానిధి	కొమరగిరి కృష్ణమోహనరావు
33. కుటుంబం–వ్యక్తిగతాస్తి–రాజ్యాంగయంత్రాల పుట్టుక	మార్క్స్ – ఎంగెల్స్
34.మోర్గాన్ ఆదిమసమాజం–(వ్యాసాలు)	వి.యం. మోహనరాజ్
35. యువశక్తి	పురుషోత్తమచంద–అచింత్యానంద
36. నిరంతర సత్యాన్వేషి	శ్రీ విరించి
37. గాంధీజీ జీవితం – జాతీయోద్యమం	
38. గాంధీ ఆత్మకథ	

"శ్రీరామకృష్ణపరమహంస" – ఐక్య ఉపాధ్యాయ – ఉపాధ్యాయ – ఆంధ్రప్రభ – ఆంధ్రజ్యోతి – ఆంధ్రభూమి – ఈనాడు – సాక్షి – సూర్య – వార్త మొదలగు పలు మాస దిన పత్రికలలోని శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక వ్యాసాలు.